

Charles Dickens

A TALE OF TWO CITIES

చార్లెస్ డికెన్స్ నవల

రెండు మహానగరాలు

అనువాదం

తెన్నేటి సూరి

రెండు మహానగరాలు

A TALE OF TWO CITIES

మూలం:

చార్లెస్ డికెన్స్

అనువాదం:

తెన్నేటి సూరి

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞాన భవన్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 01.

A TALE OF TWO CITIES *by* : ***Charles Dickens***

Telugu Translation by : ***Tenneti Suri***

ప్రచురణ నెం. : 2350/1152 -*R*
ప్రతులు : 1000
ప్రథమ ముద్రణ : మార్చి, 1986
ద్వితీయ ముద్రణ : నవంబర్, 2011 *(తెన్నేటి సూరి శతజయంతి ప్రచురణ 1911-2011)*

© తెన్నేటి చలపతిరావు

టైటిల్ డిజైన్ : అరుణ్ ప్రసాద్

వెల : ₹ 125

ప్రతులకు : **విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**
4-1-435, విజ్ఞాన భవన్, అబిడ్స్, హైదరాబాద్ - 001.
ఫోన్: 24744580/24735905
E-mail : visalaandhraph@yahoo.com
www.visalaandra.com

విశాలాంధ్ర బుక్ హౌస్
అబిడ్స్ & సుల్తాన్‌బజార్ - హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, అనంతపురం, కరీంనగర్, తిరుపతి,
గుంటూరు, హన్మకొండ, కాకినాడ, ఒంగోలు, శ్రీకాకుళం.

హెచ్చరిక : ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగా గానీ, కొంత గానీ కాపీరైట్ హోల్డరు & ప్రచురణ కర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం. - ప్రచురణకర్తలు.

ముద్రణ : శ్రీకళాంజలి గ్రాఫిక్స్, హైదరాబాద్ - 29.

శతజయంతి ఉపాయనం

ప్రముఖ అభ్యుదయ రచయిత తెన్నేటిసూరి గారి శతజయంతి సంవత్సరం ఇది *(1911-1958)*. వీరి రచనల్లో చంఘింజ్‌ఖాన్ తప్ప మరేవీ ప్రస్తుతం పాఠకులకు అందుబాటులో లేవు. *1985*లో ప్రసిద్ధ అభ్యుదయ రచయితా, ఉద్యమశీలీ మైత్రేయ - సూరిగారి రచనలు కొన్నిటిని సంకలితం చేసి ప్రచురించారు. అవీ నేటి పాఠకులకలభ్యాలే! శతజయంతిని పురస్కరించుకొని సూరిగారి రచనలను ఈ తరానికి అందించాలని మా ప్రయత్నం.

సూరిగారు కథలు - నాటికలు - కవితలు - కొన్ని వ్యాసాలూ రాశారు. సాహిత్యాభిమానులెవరి దగ్గరన్నా వీరి రచనలుకానీ - వీటి వివరాలు కానీ ఉంటే మాకు అందించి ఈ ప్రయత్నంలో సహకరించమని ప్రార్థన.

ఈ **'రెండు మహానగరాలు'** చాలాకాలం తర్వాత పునర్ముద్రిస్తున్నాం. వీరి మిగిలిన రచనలనూ వీలైనంత త్వరగా అందించగలం. మీ సహకారం ఆశిస్తూ.

ఏటుకూరి ప్రసాద్
సంపాదకులు
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

2011 నవంబరు,
హైదరాబాద్

సూరిగారి అనువాద నైపుణ్యం

రిటోరిక్ శైలిలో, తనదైన ప్రత్యేక పంథాలో సూరి అనువదించిన "రెండు మహా నగరాలు" అనువాద సాహిత్యంలోనే కాదు, తెలుగు నవలా చరిత్రతోనే ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంతరించుకుంది.

ఒకవిదేశీ నవల తెలుగులోకి అనువాదం అయి, ఇంత ప్రాచుర్యాన్ని పొందింది మరొకటి లేదనడం 'ఒట్టి గొప్ప' కాదు!

ఒక పెద్ద సారా జాడీ వీధిలోపడి భళ్ళున పగిలిన దృశ్యాన్ని అనువాదకుడిగాకాక, ఒక గొప్ప నవలా రచయితగా శ్రీ సూరి వర్ణించిన తీరును చూడండి-

"ద్రాక్ష సారా ఆ కంకరాళ్ళ చుట్టూ జలజలా ప్రవహించి మడుగులు కడుతోంది.

ఒక్కొక్క మడుగు చుట్టూ, ఒక్కొక్క గుంపు చేరారు. ఒకళ్ళ నొకళ్లు మోచేతుల్తో పడదోసుకొంటున్నారు.

కొంతమంది మగాళ్ళు మోకాళ్ళ తండా వేసి దోసిళ్ళతో ఎత్తి తాగుతున్నారు. తమ భుజాల మీదకు వంగి వెనక తట్టు నిల్చున్న యువతీ రత్నాల నోళ్ళకు అందించుతున్నారు.

మరి కొంత మంది జాడీ పెంకుల్లోకీ కుండ పెంకుల్లోకి సారా పట్టుకుని కుక్కల్లా కతుకుతున్నారు.

నెత్తిమీది రుమాలు గుడ్డలు తీసి సారాతో తడిపి పసి పిల్లల నోళ్ళలో పిండుతున్నారు.

ఇంకా కొంతమంది రోడ్డుమీద సెలయేళ్ళు గడుతున్న సారా ప్రవాహాలకు మట్టి అడ్డంపోసి, ఆనకట్టలు కడుతున్నారు. మరికొంతమంది సారాతో తడిసిన మట్టిని చప్పరించుతున్నారు - కాస్త రుచైనా తగులుతుందని.

సారాతోపాటు మట్టికూడా చాలా వరకూ అదృశ్యమైపోయింది-"

ఇలాసాగుతుందా సారా ఉత్సవ వర్ణన!

ఇది చదివిన ఎవరికైనా, 'చంఘిజ్‌ఖాన్' రాసిన సూరి తప్ప మరొకరు ఈ వర్ణన చేయరనీ, చేయలేరనీ ఇట్టే అర్థమైపోతుంది.

"చింకి గుడ్డలతోనూ, జీబు తలలతోనూ నేలమాళిగల నుంచి ఎలుకల్లా పరుగెత్తుకొచ్చిన నిర్భాగ్యులంతా (సారా ఇంకిపోయాక) ఎక్కడి వాళ్ళక్కడ మళ్ళీ కలుగుల్లోకి వెళ్ళి పోయారు-" అంటాడు. అనువాదకుడుగా కాదు ఒక స్వచ్ఛంద రచయితగా సూరి.

"సంగీతంలో సాపాసాలు తెలియని అరసికుడెవడేనా నేను పాడిన బిలహరి రాగాన్ని వెక్కిరించాడనుకో - వాడి మాట లెక్కేమిటి?" అని ఇంగ్లీషు న్యాయవాది స్ట్రయివర్ నోట పలికించాడంటే, చాలా సాహసంకావాలి.

లండన్ టెల్‌సన్స్ బ్యాంక్‌ను వర్ణిస్తూ, అది గాలీ, వెల్తురూ, లేని చీకటి కొంపలో పడి వుందని చెబుతూ, అది 'ఇక్ష్వాకుల కాలంనాటి' దంటాడు.

అనువాదం చేసేప్పుడు కూడా తెలుగుతనాన్ని ప్రదర్శించిన సూరికి పాఠకుణ్ణి 'పట్టుకోవడం' ఎట్లాగో తెలుసు. నవల పేలాలంటే ఏం చెయ్యాలో ముప్ఫయ్యేళ్ళ క్రితం సూరి చేసిన ప్రయోగాలను చదివితే తెలుస్తుంది.

'రెండు మహా నగరాలు' నవలను ఇంగ్లీషులో చదివినప్పటికన్నా, సూరి అనువాదాన్ని చూసినప్పుడు, పాఠకుడు పొందే తాదాత్మ్యకత గొప్పదే!

భవిష్యత్తులో జరిగే ఒక సంఘటనని ముందుగా వూహించలేము, కాని, ఆ సంఘటన జరిగాక, "అది పరిణామక్రమంలో తప్పనిసరిగా ఏర్పడే ఒక దశ" అని సిద్ధాంతం చేయగలుగుతాం.

ఆ సంఘటన అలానే పరిణమించవలసిందేనంటాం.

అలానే పరిణమించేది నిజమైనప్పుడు ఆ పరిణామాన్ని ముందుగానే ఎందుకు నిర్ణయించలేం?

నేరం చేసిన వాడికి శిక్ష పడిన తర్వాత పరిణామక్రమంలో అలా జరిగి తీరవలసిందే అనగలం. కాని ఆ నేరం జరగంగానే దాని పరిణామం ఎప్పటికి ఎలా వుంటుంది అనే ప్రశ్నకు ముందుగానే హామీ ఇవ్వలేం!!

చారిత్రక నవలకూ, సామాజిక నవలకూ తేడా ఈ ప్రశ్నలోనే ఉంది.

సామాజిక పరిస్థితులలో పాఠకుడికి పూర్వ పరిచయం ఉన్నా, లేక పోయినా భూత భవిష్యత్ వర్తమానాల్ని కళ్ళముందు ఆవిష్కరించే నైపుణ్యం కూడా - సామాజిక నవలని, చారిత్రక నవలని వేర్వేరుగా నిర్వచించలేదు.

ఆయా దేశ కాల పరిస్థితులు అలా ఎందుకున్నాయో, అవి ఎలా పరిణమించాయో ఆ పరిణామక్రమానికి దోహదపడిన సూత్రం ఏమిటో, ఆ సూత్రాన్ని ముందుగానే ఆ పరిస్థితుల తాలూకు పాత్రలు ఎలా ఊహించగలిగాయో లేక ఊహించ లేక పోయాయో, వివరించడానికి సామాజిక నవలకన్నా, చారిత్రక నవల ఎక్కువ బాధ్యత తీసుకొంటుంది.

ఆ విధంగా రెండు మహానగరాలు గొప్ప చారిత్రకనవల!

సామాజిక నవలలోని దేశ కాల పరిస్థితులు ఎప్పుడూ ఒక ప్రాంతానికో, ఒక దేశానికో, ఒక జాతికో పరిమితంగా వుండవు.

పాత్రలపేర్లు ఒకజాతినీ, ఒక దేశాన్నీ సూచించినా, పాత్రల స్వభావం మాత్రం ఎప్పుడూ విశ్వవ్యాప్తమైనదిగా ఉంటుంది.

రావణాసురుడూ, శకునీ - సర్వకళా కీచకుడూ ఎప్పుడూ అన్ని సమాజాల్లోనూ, అన్ని వేళల్లోనూ వుంటూనే వుంటారు.

ఆయా పాత్రల మనస్తత్వాన్ని మన అనుభవాలకు జోడించుకోవడం ద్వారా మనం ఆ రచనలో, చారిత్రక నవలకు భిన్నమైన రీతిలో తాదాత్మ్యం చెందుతాం.

పాత్రల మానసిక ప్రవర్తనలూ, భౌతిక విధానాలూ, జీవనధర్మాలూ, సిద్ధాంతాలూ, రాద్ధాంతాలూ, ఆగడాలు, అగచాట్లూ, పాట్లు వలన సంఘటనలు ప్రత్యేకంగా వుండవచ్చు. కాని, వాటి పూర్వాపరాలు మాత్రం సామాజిక రచనలలో ఎప్పుడూ యూనివర్సల్‌గానే వుంటాయి.

చారిత్రక నవల పాఠకుణ్ణి ఆ ప్రాంతానికి ఆ సంఘటనకి పరిమితం చేసి ఆలోచింప చేస్తుంది.

కాని, సామాజికనవల పాఠకుడి ఆలోచనల్ని విశ్వజనీనం చేస్తుంది.

ఈ దృష్ట్యా చూసినపుడు 'రెండు మహానగరాలు' రచన సంపూర్ణమైన సామాజిక నవలా లక్షణాలను కలిగి వున్నదనే విషయం నిర్వివాదం అవుతుంది.

చారిత్రకనవలను చదువుతున్నప్పుడు అది తన పూర్వ చరిత్రేననీ ఆనాటి ఈ చరిత్ర వలన తన వర్తమాన సమాజం, పరిణామక్రమంలో ఈ విధంగా రూపు దిద్దుకుందనీ మనం గుర్తిస్తాం.

కాని, సామాజికనవలను చదివేప్పుడు మాత్రం అది, తన వర్తమానచరిత్ర అనీ ఇప్పుడు నడుస్తున్న సత్యం ఇదేనని, మనం ప్రస్తుతం అనుభవిస్తున్న వాస్తవాలు ఇవేననీ స్పష్టంగా గుర్తించగలుగుతాం.

'రెండు మహా నగరాలు' నవలను అనువదించేప్పుడు శ్రీ తెన్నేటి సూరి, తన అనువాదానికి, ఈ విధమైన సామాజికనవలా లక్షణాల్ని మాత్రమే అన్వయింప చేయాలని కృషి చేశారు.

సూరి, తన అనువాదాన్ని, లండన్ పారిస్ నగరాల మధ్య జరిగిన ఇతివృత్తమే అయినప్పటికీ, దాన్నొక చరిత్ర చెప్పే అధ్యయనగ్రంథంలా కాక, కళాత్మకమైన వాస్తవ జీవనచిత్రంగా మలచడంలో అపూర్వమైన ప్రయత్నం చేశారు.

రెండు మహా నగరాలను చదువుతున్నప్పుడు, పాఠకుడికి తాను చదువుతోంది అనువాదాన్ననే విషయమే స్ఫురించదు. ఇది అపూర్వమే!!

"ఇవ్రేమూండ్" అనే ఆదర్శ భావాలు కలిగిన యువకుడు, తన తండ్రీ, పినతండ్రీ కలిసి బీదప్రజానీకం మీద చేసిన ఆగడాలను కళ్ళారా చూసి, తన ఆస్తి పాస్తులన్నింటినీ బీదా బిక్కీకి రాసి పారేయాలనుకుంటాడు.

నాకీ ఆస్తి అవసరం లేదని, ఇల్లు విడిచి లండన్లో 'డార్నే' అనే మారుపేరుతో ప్రవాస జీవితం గడుపుతుంటాడు.

కాని, డార్నే పాత్రకు ఈ నవలలో కేవలం 'ఆదర్శాలు అంటువ్యాధి'గా సోకినాయిగాని,- ఆ ఆదర్శాలను అమలుపరిచే వ్యక్తిత్వం వున్నట్టు కన్పించదు.

ఏ బీద ప్రజానీకం కోసం అతను సర్వస్వాన్నీ త్యాగం చేసి, కట్టుబట్టలతో ఇంగ్లండ్ వెళ్ళి పోయాడో ఆ బీద జనంలోనే అతనికి గుర్తింపు లేదు.

'గాబెల్లీ' అనే ఉద్యోగిని తన ఆస్తికి సంంక్షకుడిగా నియమించి, ఆ ఆస్తిని బీద ప్రజలకు సమానంగా అందేలా చూడమని చెప్పి, దేశాన్ని విడిచి వెళ్ళి పోయాడు డార్నే!

గాబెల్లీ బీదల దగ్గర శిస్తు వసూలు చేయడం "కౌలు" సుంకం తీసుకోవడం మానివేశాడు.

కాని, ఆ బీదల్లో ఒక్కడు కూడా డార్నుకు మరణశిక్ష విధించినపుడు అతను దేశభక్తుడే గాని, దేశభ్రష్టుడు కాడని సాక్ష్యం చెప్పలేదు.

పైగా, అతనికి శిక్షపడిందని తెలియంగానే సంబరంగా చప్పట్లు కొడతారు. రక్తదాహంతో ముందుకు దూకుతారు.

చరిత్రలో జరిగిన ఒక సంఘటన - ఫ్రెంచి మహా విప్లవం - ఆధారంగా రూపొందించిన ఊహాత్మక పాత్రలే అయినప్పటికీ, రెండు మహానగరాలలో 'డాక్టర్ మానెట్', 'సిడ్నీ కార్టర్' ఈ ఇద్దరికీ తప్ప మరే వ్యక్తికి వ్యక్తిత్వం కనిపించదని, ఈ కారణాలవల్లనే, ఈ నవలను కొందరు విమర్శించకపోలేదు.

"పెద్ద మనిషి అయినవాడు ఇంత తెలివి తక్కువగా ఎవడు ప్రవర్తించుతాడండీ. ఉన్న ఆస్తి జనానికి వప్పగింత చేసేశాడే అనుకోండీ - చేసిన వాడు ఆ వూపు తీసుకొని ఆ జనాభాకు యావత్తూ నాయకుడై బైరాయించాలి గాని దేశాల మీద పోవడమేమిటండీ? వాజమ్మా? మరీనా?" అంటాడు డార్నేని ఉద్దేశించి అవకాశవాది అయిన లాయరు స్ట్రయివరు!

ఆ మాటలు గుంట నక్కలాంటి స్ట్రయివర్ అన్నాడు కాబట్టి అతని పెట్టుబడిదారీ మనస్తత్వాన్ని సూచిస్తూ వుండవచ్చు. కాని, డార్నే అంతకు మించిన సమర్థుడుగా ఎక్కడా కనిపించని మాటా వాస్తవమే!!

ఆమాట కొస్తే డార్నే కాదు - నవలలో ఏ ఒక్క పాత్రకీ నాయకత్వ లక్షణాలు లేవు. ప్రజలకి పగ సాధించుకోవడం తప్ప మంచీ చెడూ విచక్షణా లేదు. విప్లవకారులే జూరీలో కూర్చుని మరణ శిక్షలు వేయడం,ఉన్నవీ లేనివీ దొంగ సాక్ష్యాలు సృష్టించి సరదాగా తలలు నరికించడం తప్ప పరిపాలనా సామర్థ్యం ఏ ఒక్కరికీ లేదనేది నిజమే!!

ఫ్రెంచి విప్లవానికి పగ, కసీ తప్ప సిద్ధాంత బలం లేక పోవడాన మానవత్వం లేని రక్తదాహం మాత్రమే విప్లవం తర్వాత దశలో మనకు కనిపిస్తోంది.

పరిణామక్రమంలో ఇది కూడా ఒక తప్పనిసరి దశే కావచ్చు. వ్యక్తిత్వం లేని పాత్రల్ని రూపొందించితే గాని, మానవతా రాహిత్యం పరాకాష్ఠకు చేరుకున్నదని ఫ్రెంచి విప్లవాన్ని దుయ్యబట్టడం సాధ్యం కాదనే అభిప్రాయంతో, కరకురాతి జమీందారుల్ని, పగతో గుండెను అంతకుమించిన పాషాణంగా చేసుకున్న జనసందోహాన్ని, మధ్యలో వాజమ్మల్నీ సృష్టించక తప్పని పరిస్థితి ఏర్పడినట్లనిపిస్తుంది.

అందుకే, విప్లవ యుగ సంధిలో నడుస్తున్న పాత్ర ఆంతరంగిక మథనాన్ని విశ్లేషించినప్పుడు డాక్టరు మానెట్, 'డెఫార్జ్' 'డార్నె' పాత్రలు తమ అంతరాత్మలతో ఎంత పోరాటంచేయవలసి వచ్చిందో, ఆయా విధాలుగా ప్రవర్తించడానికి, ఆయా పాత్రలకు ఎలా తప్పని సరి అయ్యిందో, నిరూపించడానికి అనువాదకుడుగా సూరి చూపించవలసివచ్చిన చొరవ, ప్రతి పేజీలోనూ మనకి స్పష్టంగా కనిపిస్తుంది.

ఒక ఇంగ్లీషు నవలని మక్కీకి మక్కి తెలుగు చేయడానికి కాక, చరిత్ర సారాన్ని పాఠకుడు తన అనుభూతి రీత్యా అవగాహన చేసుకోవడానికి అవకాశం కల్పించేలాగే సూరి చేసిన ప్రయత్నం గొప్పది.

మానవ హృదయానుభూతుల్ని చారిత్రక ధర్మాల మధ్య అంతః సంఘర్షణగా చిత్రించడం ద్వారా ప్రసిద్ధిపొందిన 'చార్లెన్ డికెన్స్' నవల "A TALE OF TWO CITIES"ని తెలుగు పాఠకులకు అర్థం అయ్యేలా చేసిన సూరి చిరస్మరణీయుడు.

- డా॥ జి.వి. పూర్ణచంద్

(సుశ్రుత క్లినిక్, రావిచెట్టు సెంటరు,

(విద్యాధరపురం, విజయవాడ - *12.*)

(మైత్రేయ సంకలితం చేసిన సూరిగారి రచనల సంపుటి నుండి)

కృతజ్ఞతలు

ఈ రచనను ఆంధ్రసచిత్ర వారపత్రికలో
సీరియల్‌గా ప్రకటించి ఆంధ్రప్రజలకు తొలి పరిచయం కలుగజేసిన
ఆంధ్రపత్రిక సంపాదకులు
కీ॥శే॥ **శ్రీ శివలెంక శంభుప్రసాద్** పంతులు గారికి,
ఇప్పుడు పునర్ముద్రణకు అనుమతించిన వారి కుమారులు
శ్రీ శివలెంక రాధాక్రిష్ణ గారికి
కృతజ్ఞతలు

తెన్నేటి ఉమామహేశ్వరి
మార్చి, 1986
తెన్నేటి చలపతిరావు

రెండు మహానగరాలు

అది ఒక వైభవోజ్వల మహాయుగం - వల్లకాటి అధ్వాన్న శకం; వెల్లివిరిసిన విజ్ఞానం - బ్రహ్మజెముడులా అజ్ఞానం; భక్తి విశ్వాసాల పరమపరిధవం, - పరమ పాషండాల ప్రల్లదకల్లోలం; ఉజ్వల చైతన్యాల ఉత్ఫుల్లమహోదయం - అంధాంధతమసాల అవ్యక్త నిశీథం; ఆశాకుసుమాలు పుష్పించిన ఆ మధుర వసంతం- నైరాశ్యపు చలిగుబుళ్లు ఈచుకున్న శశిరాస్యం; సర్వసంపత్సమృద్ధి; సర్వతోముఖ క్షామం; స్వర్గానికి రాచబాట పుచ్చుకున్న జనం - నడుస్తున్నారు నరకానికి సూటిగా; అరుస్తున్నయ్ అధికార కంఠాలు, అంతా అమోఘంగా వుందని - సూక్ష్మంగా చెప్పాలంటే, నేటి పరిస్థితికి నకలుగా వుంది నాటి పరిస్థితి.

గవిడిగవదల ఓ రాజూ, గాజుకళ్ళ ఓ రాణీ ఇంగ్లండులోనూ, గవిడిగవదల ఓ రాజూ కలువ కన్నుల ఓ రాణి ఫ్రాన్సులోనూ రాజ్యం చేస్తున్నారు. ఉభయ దేశాలలో కూడా, ప్రభుత్వ ఆహార నిల్వల అజమాయిషీలో వున్న దొడ్డ ప్రభువులంతా, సమస్త వ్యవహారాలూ శాశ్వతంగా పరిష్కారమై స్థిరపడి పోయాయనే నిశ్చింతతో కులాసాగా కాలక్షేపం చేస్తున్నారు.

ఏసు ప్రభువు ఈ గడ్డమీద అవతరించి అప్పటికి 1775 సంవత్సరాలు. ఆ సుదినాలలో భూతప్రేత దేవగణాలు ఆంగ్లప్రజలను అనుగ్రహించినవారై, అనేక దేవరహస్యాలను వెల్లడించి దివ్యజ్ఞానసంపన్నులను చేస్తున్నారు - ఇప్పటిమోస్తరుగానే. కొద్దిరోజుల క్రితమే సౌత్ కాట్ సతి 25వ జన్మదినోత్సవం జరిగింది. ఆ సందర్భంలో, ఆవిడగారిలో యేదో దివ్యతేజం ప్రకాశించుతున్నట్టు, రాజుగారి అంగరక్షకదళంలోని ఒక సైనికుడు గమనించాడు - స్వతః దివ్యదృష్టి గలవాడు గనక. ఆ దివ్యసందర్శనాన్ని పురస్కరించుకుని, లండన్ వెస్టుమినిస్టర్లు కాలగర్భంలో అంతరించిపోవడం దైవనిర్ణయమైనట్టు జోస్యం చెప్పాడు. దివ్య సందేశపరంపరను దైనిక కార్యక్రమంగా తలుపులుతట్టి ఉద్ఘాటించి విడిచిన కాక్‌లేన్ భూతం అదృశ్యమై అప్పటికింకా పన్నెండు సంవత్సరాలు కూడా కాలేదు.

గత సంవత్సరం కూడా కొన్ని సన్నరకం భూతాలు (స్వకపోల కల్పన విషయంలో దివ్యత్వం కొరవడినవే అయినా) అనేక సందేశాలను కాకిఘోషగా అరిచేసినై. దివ్యసందేశాల విషయం ఇలా వుండగా అమెరికాలోని బ్రిటిష్ పౌరమహామండలి నుంచి ఆంగ్లరాజుకూ ఆంగ్లప్రజలకు లోకవ్యవహారానికి సంబంధించిన మరికొన్ని సందేశాలు అందినై. చిత్ర మేవిం

టంటే కాక్‌లేన్* సంతతి కు(గ్రభూతాల దివ్యసందేశాలకంటే, ఈ లోకవ్యవహార సందేశాలే నరజాతికి అత్యంత ప్రధానమైనవిగా పరిణమించినై.

కవచకార్ముకాల గలగలలతో నడుస్తున్న తన సోదర దేశానికి సిద్ధించిన అవగికి, దివ్యజ్ఞానచైతన్యం ఫ్రాన్సుకు సిద్ధించలేదు. కాని, తోచినమటుకు కాయితం కరెన్సీ అచ్చువేసుకుని, విలాస భోగాలకు ఖర్చుబెట్టుకుంటూ పర్వతాగ్రం నుంచి బహు సునాయాసంగా క్రిందికి దొర్లుకొస్తోంది – పట్టుపరుపులమీది నుంచి దొర్లినట్టు. అంతేగాదు– క్రైస్తవమత గురువుల ఆశీరాదేశాలతో మానవత్వసిద్ధికి తార్కాణాలైన అనేక మహత్కార్యాలను సంఘటించి వినోదించుతోంది. శిక్షలు విధించి యువకుల కాళ్లూ చేతులూ తెగనరికించటం, శ్రావణాలతో పీకించి నాలికలు చీలికలు చేయించటం, మురికి ఫాదరీల ముఠా యేదో ఒకటి అలా త్రోవను పోతుంటే, బురదనీళ్లలో బోర్లబొక్కులుగా పడి జోహారు చెయ్యలేదనే నేరానికి, బ్రతికున్న మనిషిని బ్రతికున్నపళంగా పచ్చిజీవాలతో కాల్చి చంపించటం – ఇత్యాదయః, అనేక సత్కార్యాలలో మునిగి తేలుతోంది. ఆ హత్యలన్నిటికీ ప్రతిచిహ్నాలుగా ఫ్రాన్సు నార్వే మానవారణ్యాలలో, అవోరకం కొత్తచెట్లు మొలకలెత్తి వేరు తన్ని పెరుక్కొస్తున్నయ్. 'కిరాతవిధి' వాటి కన్నింటికీ అప్పటికప్పుడే గుర్తులు బెట్టుకొస్తున్నాడు – అవి పెరిగి పెద్దవైతే వాటి బల్లలతో యీటెలూ బల్లాలూ అమర్చిన ఒక ప్రళయ రథాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో – మానవచరిత్రలో ఒక మహా భీభత్సాన్ని సృష్టించాలనే సంకల్పంతో. అదే సమయంలో పారిస్ పరిసరాలలో, మురుగుబాడవలూ మొండిబంజర్లూ దున్నే మోటరైతుల గొడ్లదొడ్లలో వందలాది నాటుబళ్లు వరుసలుగా విడిసివున్నయ్. ఇరుసుల దాకా రేవడి చుట్టుకున్న వాటి చక్రాలను పందులు మోరలతో వాసన చూస్తున్నయ్. 'మృత్యుకర్షకుడు' వాటిని చూచి తల వంకించాడు – విప్లవ శవవాహనాలకు వెతుక్కోనక్కరలేదని. 'కిరాతుడూ' 'కర్షకుడూ' ఇలా నిర్విరామంగా సన్నద్ధులౌతున్నాకూడా – బయటికి మాత్రం ఏ విధమైన అలజడీలేదు. పంజాలు ముడుచుకున్న వారి పదధ్వనులను ఏ ఒక్కరూ పసిగట్టలేక పోయారు. పసిగట్టలేకపోవడం కాదు – వాళ్లిద్దరూ మేలుకున్నారని భావించటం నిరీశ్వరవాదమూ, దేశద్రోహమూ గనుక యేఒక్కరూ అలాంటి మహాపాపానికి పూనుకోలేదు.

ఇంగ్లండులో: శాంతి భద్రతలన్నీ సర్వనాశనమై, అరాచకం విచ్చలవిడిగా వీరవిహారం చేస్తోంది. ప్రొద్దు గర్భానపడటం భయం; సాయుధ ముఠాల నడివీధి దోపిడీలూ, బందిపోట్లూ, రాజధాని నగరంలోనే దినదినం నిరాఘాటంగా సాగుతున్నయ్. ఇంట్లో వున్న కొయ్యసామాన్లు దేఖీలూ, ఏ గిడ్డంగులలోనో భద్రపరుచుకోకుండా, ఇళ్లు తాళాలు వేసి బయటిఊళ్లకు వెళ్లటం సురక్షితం కాదని అధికారులు గృహస్థులను బహిరంగంగా హెచ్చరించారు. పగటివేళ వర్తకశిఖామణిగా బజారులో చెలామణి అయ్యే మర్యాదస్తుడే, రాత్రివేళ కొంపలు లూటీలు చేసే గజదొంగ; తోటి వర్తకుడెవడేనా గుర్తుబట్టి నిలవేస్తే, అమాంతం పరాక్రమించీ, పిస్టలుతో పరిగపిట్టలా వాణ్ణి నేలరాల్చేసి, రివ్వున గుర్రంమీద ఉడాయించేస్తాడు. ఏడుగురో ఎనమండుగురో రోడ్డు వెంటపోతున్న 'మెయిల్ కోచ్'కి అడ్డం తగులుతారు. 'మెయిల్ గార్డు' తన దగ్గిర తూటాలున్నంతవరకూ, వాళ్లల్లో యే ముగ్గుర్నో నలుగుర్నో కాల్చి చంపుతాడు. గార్డుదగ్గిర మందుగుండు నిండుకున్నదని తెలియగానే మిగతావాళ్లు అమాంతం వాడిమీదపడి ఖూనీ చేస్తారు. ఆపైని మెయిల్‌కోచ్‌లో వున్న సర్వాన్నీ ప్రశాంతంగా దోచుకుంటారు. లండన్ సర్వాధికారి లార్డ్ మేయర్ను పట్టపగలు 'టరన్‌హామ్‌పార్క్'లో నిలవేసి, సర్వపరివార సమక్షంలో, ఒకేఒక పిస్టల్‌వాలా నిలువుదోపు చేస్తుంటే అదేమన్న దిక్కులేదు, తక్కిన సామాన్యప్రజమాట లెక్కేవిటి? రాచనగరు అతిథిమందిరాల్లో రాణువులతో సహా పరివేష్టించి వున్న దొడ్డప్రభుల రత్నహారాలను తుంటె దొంగలు దూసుకుపోతున్నారు. దొంగసొత్తు సోదాకోసం, రారాపు సిపాయిలు బయలుదేరితే, సెయింట్ గైల్సు లుగాడీజనం, తిరగబడి తుపాకులు పేల్చారు. అందిన జనాన్ని అందినట్టు సిపాయిలు కూల్చారు. ఇన్ని జరుగుతున్నా వీటి నెవ్వడూ విపరీత విషయాలుగా పరిగణించటంలేదు. ఈ గందరగోళాల మధ్య ఉరిదీసే ఉద్యోగుల అవస్థ ఊపిరిసలపకుండా వుంది. తెల్లవారిలేస్తే చిల్లరమల్లర నేరస్థుల్ని ఒక దండా దండా ఉరికంబానికి వ్రేలాడదియ్యాలి; మంగళవారంనాడు పట్టుకున్న మరోకన్న గాణ్ణి శనివారం నాటికి ఉరిదీసెయ్యాలి; చేతిలో మిగిలివున్న డజనుమంది నరపశువుల్నీ న్యూగేట్ రుద్రభూమిలో, పచ్చిజీవాలతో నిలువునా కాల్చాలి; వెస్టుమినిస్టరు హాలుముందు కరపత్రాల గుట్టకు నిప్పుబెట్టాలి; ఈ పూటకి పరమకిరాతుడైన ఒక హంతకుణ్ణి ఖూనీచెయ్యాలి, రేపు కాపుకుర్రాడిచేతిలో కానీ కాజేసిన, దరిద్రపుగొట్టు వెధవను మరొకణ్ణి హత్యచెయ్యాలి.

ఇలాంటివీ, ఇలాంటివి ఇంకా వేలూ లక్షలూ సంఘటనలు, 1775లోనూ అనంతరమూ కూడా విధీ విరామం లేకుండా సాగిపోయినై. ఈ పరిస్థితుల మధ్య 'కిరాతుడూ' 'కర్షకుడూ' అంతు తెలియని అజ్ఞాతంలో సన్నద్ధులౌతూన్న వాతావరణంలో, గవిఁడిగవదల యిద్దరూ, కలువ, గాజుకన్నుల యిద్దరూ దైవ దత్తమైన తమ అధికారాన్ని నిష్ఠురంగా చెలాయించుతూ ఆటోపోజ్వలులై సంచరించుతున్నారు. ఈ గొప్పవారూ, కొలదిగల లక్షోపలక్షల యితర ముక్కిడి జీవులూ – ఈ గాథలోని వ్యక్తులు సహా తతిమ్మా ప్రాణులూ, ఎవరికి వారు తమతమ పాదాల ముందు పరచుకొనివున్న బాటలవెంట ఎవరి మార్గాన వారు యీ విధంగా సాగిపోతున్నారు.

2

1775వ సంవత్సరం, నవంబరు నెల చివరిరోజుల్లో, ఒక శుక్రవారం రాత్రి, చాలా ప్రొద్దుపోయినవేళ, ఈ గాథతో సంబంధంవున్న మొట్టమొదటి వ్యక్తి, డోవర్‌రోడ్డు వెంట తలవంచుకుని నడిచిపోతున్నాడు. డోవర్ మెయిల్‌కోచ్ 'షూటర్సుహిల్' కొండగుట్టమీదికి ఒడిదుడుకుగా ఎక్కుతోంది. కోచికి ప్రక్కగా, తక్కిన ప్రయాణీకులతో పాటు, బురదనుబడి, సతమతమౌతూ, మన బాటసారి కూడా కొండమీదికి ఎక్కుతున్నాడు. ఆ గొడ్డుచలిలో ప్రయాణీకులు, అలా క్రిందికి దిగి నడవటం వ్యాయామం చెయ్యాలనే సర్దాతో గాదు. బాడిరోడ్డు, కొండమీదికి ఎగనెక్కటం, బరువుబండి – గుర్రాలు అప్పటికే

---

* కాక్‌లేన్‌భూతం అంటే అభూతకల్పన అని అర్థం. 1762లో స్మిత్‌ఫీల్డ్‌లో కాక్‌లేన్ అనే సందులో ఒక ఇంట రెండేళ్ళకు ముందు చనిపోయిన ఒక స్త్రీ ఇంటినిపట్టి ఇంటిలోని వారిని భయపెట్టి పీడించినట్లు ప్రవాద ప్రబలింది. చనిపోయిన స్త్రీ హత్యగావింపబడినట్లు ఆమె భర్తపై నేరంమోపే ఉద్దేశంతో ఆ ఇంటిలో నివసించే పార్సన్స్ కుటుంబం కుట్రపన్ని ఈ ప్రవాద పుట్టించారట.

మూడునాలుగుసార్లు మొరాయించి నిలబడి పోయినై. ఒక పర్యాయం, అసలు సాంతం తిరుగుబాటుచేసి, కోచ్‌ని తిరిగి బ్లాక్‌హీత్‌కు వెనక్కు యీడ్చుకుపోయే ఉద్దేశంతో, అమాంతం రోడ్డుకు అడ్డంగా యీడ్చేసినై కూడా. ఈ తిరుగుబాటు ప్రమాదాన్ని వెంటనే గమనించి, కోచ్‌వాలా, కొరడాకు పనిచెప్పి వాటి ప్రయత్నం కొనసాగకుండా చేశాడుగాని, అవి విజయంపొందినట్టయితే, జంతువులకు కూడా కొన్నిటికి యోజన శక్తివుందనే వాదాన్ని మనం అంగీకరించవలసివచ్చేది. ఆ కొరడా చరుపులతో గుర్రాలు ఓటమిని అంగీకరించి లొంగిపోయి, యథాపూర్వంగా తమ బాధ్యతను తాము నిర్వహించటానికి పూనుకున్నయ్.

తలలు వ్రేలాడబడిపోతున్నయ్, తోకలు గజగజవొణుకుతున్నయ్. ఆ రొంపిని బడి కోచ్‌ని యీడవలేక వాటిప్రాణాలు కడబట్టి పోతున్నయ్. ఎక్కడి కీళ్లక్కడ సడలిపోతున్నట్టు ఉండుండి ముందుకు కుదబడిపోతున్నయ్. అలాంటి ప్రమాదం జరిగినప్పుడల్లా కోచ్‌వాలా కొంచెం తమాయించి 'ఓహోహో!' అంటూ కళ్లాలు వెనక్కులాగి, ఆపి, వాటిని కాస్తలేచి తేరుకోనిస్తున్నాడు. అలా ఆపినప్పుడల్లా మొమ్మొనలో నడుస్తున్న నాయకాశ్వం, తలా, జూలూ కచ్చెగా విదిలించి 'ఈబండి కొండ మీదికి జేరటం అసంభవం' అనే అభిప్రాయం విస్పష్టంగా ప్రకటించుతోంది. ఆ గుర్రం మెడపూసలు గలగల లాడినప్పుడల్లా మన బాటసారి మనసులో యేదో మధనపడుతున్న వాడులా కంగారుగా తలెత్తి చూస్తున్నాడు.

పొగమంచు దట్టంగా పట్టి పెద్ద పెనుభూతంలా కొండమీదికి వ్యాపించుతోంది. కన్నూకన్నూ పొడుచుకున్నా కనుపించటంలేదు. కోచ్‌లైట్లు ఎందుకూ కొరగాకుండా వున్నయ్. గుర్రాలముందు రోడ్డు నాలుగుబారల దూరమైనా కనుపించటం లేదు. ఆయాసం పట్టలేక, గుర్రాలు, మంచులోకి ఆవిర్లు విడుస్తుంటే, ఆ పొగ మంచునంతా సృష్టించుతున్నది గుర్రాలేనేమోననే భ్రమ కలుగుతోంది. మన బాటసారితోపాటు, మరొక యిద్దరు ప్రయాణీకులు కోచ్‌ని అంటిపెట్టుకునడుస్తూ, కొండమీది కెక్కుతున్నారు. ముగ్గురు కూడా, చలిగాలి సోకకుండా ఆపాదమస్తకం దుస్తులు వేసుకున్నారు. మోకాళ్ళవరకూ 'జాక్ బూట్లు' తొడుకున్నారు. చెవులమీదకూడా మఫ్లర్లు కప్పుకున్నారు. ఒకరినొకరు చూస్తున్నారన్నమాటేగాని ఎవరేపోలిక మనిషో రెండోవాడికి అంతుచిక్కకుండా వుంది. మనుషుల శరీరాల పోలికలేగాదు, మనసులు అంతకంటే అంతుచిక్కటంలేదు. ఆ రోజుల్లో ప్రయాణీకులు త్వరగా ఒకరితో ఒకరు పరిచయాలకు దిగటానికి జంకేవాళ్ళు. అవునుమరి– రోడ్డుమీద తారసిల్లే మనుషుల్లో యే మనిషేనా దోపిడిగాడు కావచ్చు; లేదా, ఏ దోపిడి ముఠాతోనైనా షరీకై వున్న వాడైనా కావచ్చు. షరీక్‌దార్ల కేమిటి? ఏ దారి మకాంలో చూసినా వాళ్లే. ఏ సారాదుకాణంలో చూసినా వాళ్ళే. హోటలు యజమానిదగ్గర నుంచి గుర్రాలశాల నౌకరుదాకా ఎవడేనా అలాంటివాడై వుండొచ్చు; ఎవణ్ణని నమ్మటం? ఆ సమయంలో, మెయిల్ గార్డు కోచ్ వెనక తన కోసం అమర్చివున్న చెక్కబల్ల మీద నిల్చుని, సరీగా ఇవే మాటలు అనుకుంటున్నాడు. అతని చేతిప్రక్కను అమర్చివున్న కొయ్యపెట్టెమీద, ఒక పెద్ద నాటుతుపాకీ, మందుదట్టించి సిద్ధంగా వుంది. తూటాలునింపిన ఏడెనిమిది పిస్టళ్లూ గుట్టబడివున్నయ్. ఆ పెట్టెమీదికి ఆనుకుని ఎలాంటి ప్రమాదం వచ్చినా ఎదుర్కోవటానికి సిద్ధంగావున్నాడు.

మెయిల్ గార్డు ప్రయాణీకుల్ని అనుమానిస్తున్నాడు; ప్రయాణీకులు ఒకరినొకరు అనుమానిస్తున్నారు. గార్డును కూడా అనుమానంగానే చూస్తున్నారు. అందరూ అందర్నీ అనుమానిస్తున్నారు. కోచ్‌వాలాకు గుర్రాల విషయంలో తప్ప ఇంకెవ్వరి విషయంలోనూ, ఎలాంటి విశ్వాసమూ లేదు. ఆ గుర్రాలు ప్రయాణం చెయ్యటానికి పనికిరాని స్థితికి వచ్చేశాయనే విషయాన్ని బైబిలుముట్టి ప్రమాణంచేసి చెప్పగల పరమవిశ్వాసంలో వున్నాడు.

'హెయ్! చల్! – ఏదీ ఇంకొక్క ఊపు – కొండమీదికి జేరిపోతాం – చల్!' గుర్రాన్ని కొరడాతో అదిలించాడు. 'ఇవాళ నా తాడు తెంచారులే!'–

'జో!' –

'ఆఁ!' – గార్డు సమాధానమిచ్చాడు.

'టైమెంతైందీ?'

'పదకొండూ పదినిమిషాలు'

'అయ్యో బాబో! పదకొండు కూడా దాటిందీ –చల్!–' గుర్రం వెన్నుమీద కొరడాచివళ్లు చెడేల్‌మని మోగినై. కోచ్ ముందుకు సాగింది. జాక్‌బూట్ల ప్రయాణీకులు ముగ్గురూ, బురద చిందగొట్టుకుంటూ, కోచ్‌తోపాటు దబదబా నడుస్తున్నారు. ముగ్గురూ కూడా కోచ్‌ని అంటిపెట్టుకుని నడుస్తున్నారు. అది ఆగితే ఆగుతున్నారు; కదిలితే కదులుతున్నారు. కర్మంజాలక వాళ్ళల్లో ఏ ఒక్కడేనా రెండోవాడితో: 'అలా కాస్త ముందుపోయి నడుద్దాం పదండి' అని గనక పొరపాటున అంటే ఆ మొదటివాడు, రెండోవాణ్ణి, దోపిడిగాడేనని రూఢిచేసి అమాంతం పిస్టలుతో పేల్చేసే మనస్థితిలో వున్నారు.

ఆ చివరి ఊపులో కోచ్ కొండ మీదికి జేరింది. గుర్రాలు తాపీగా నిలబడి ఊపిరి విడుచుకుంటున్నయ్. కోచ్ మళ్ళీ కొండమీది నుంచి క్రిందికి దిగటానికి చక్రాలు తిరగకుండా అంటగట్టాలి. చక్రాలు కట్టడానికీ, కోచ్ తలుపులు తెరిచి ప్రయాణీకుల్ని లోపలికి యెక్కించటానికీ గార్డు క్రిందికి దిగాడు.

'జో!–' అని కంగారుగా కేక బెట్టాడు కోచ్‌వాలా.

'ఏవిఁటి టామ్!–'

దూరాన వినిపిస్తున్న గుర్రం డెక్కలచప్పుడు, ఇద్దరూ చెవులు దోరబెట్టి పసిగట్టారు.

'గుర్రంగాలపు మీద వచ్చేస్తోంది' –

'గాలపుగాదు పేరాంమీదే వచ్చేస్తోంది' అంటూనే గార్డు చివాల్న కోచ్‌మీదికి యెగిరి తన స్థానంలో సిద్ధంగా నిల్చున్నాడు.

'ఆంగ్లరాజుపేరిట అంతా సిద్ధంకండి!' – అని ప్రయాణీకుల్ని హెచ్చరించాడు. ఈ హెచ్చరిక చేస్తూనే తుపాకి చేతులోకి అందుకున్నాడు.

మన గాథకు సంబంధించిన ప్రయాణీకుడు కోచ్‌లోకి ఎక్కటానికి మెట్టుమీద అడుగువేసినవాడు అలాగే ద్వారానికి అడ్డంగా మెట్టుమీద నిలబడిపోయాడు. తక్కిన యిద్దరు ఇంకా రోడ్డుమీదనే నిల్చున్నారు. ముగ్గురూ కలిసి కోచ్‌వాలా ముఖం వంకా, గార్డు ముఖంవంకా చూస్తూ బిక్కు బిక్కు మంటున్నారు. మొమ్మొన గుర్రంకూడా, ఏదో ప్రమాదం జరిగేలానే వున్నదన్నట్టు, చెవులు రిక్కించి వెనక్కుదిరిగి చూచింది.

కోచ్ నిలబడివుంది; గుర్రాలు కాళ్ళుకూడా కదపటంలేదు. అర్ధరాత్రి సమయం- ఎక్కడా చీమైనా చిటుక్కుమనడం లేదు. - ఒక భయంకర నిశ్శబ్ద వాతావరణాన్ని భేదించుతూ దూరాన గుర్రపుడెక్కలచప్పుడు వినిపించుతోంది.

అలసివున్న కోచ్‌గుర్రాలు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీయటంతో బండి, వెనక్కూ ముందుకూ, కొంచెంగా ఊగిసలాడుతూ ఏదో ఆందోళన పడుతున్నట్టు కనుపించుతోంది. ప్రయాణీకుల గుండెలుకూడా, దడదడా కొట్టుకుంటున్నయ్.

కొండమీదికి పరుగెత్తుకొస్తున్న గుర్రం డెక్కలచప్పుడు అంతకంతకు సమీపాన వినిపిస్తోంది.

'ఓహోయ్!'- గార్డు పోలికేకగా, శక్తికొద్దీ గర్జించాడు; ఆగక్కడ! కాల్చిపారేస్తాను!'

డెక్కలచప్పుడు హఠాత్తుగా ఆగిపోయింది: 'ఆ వచ్చేది డోవరు మెయిలేనా?' అన్న మానవకంఠం, దూరాన్నుంచి కళవళంగా వినిపించింది.

'ఏదైతే నీకెందుకు? - అసలు నీ సంగతేదో తేల్చు' - గార్డు మొండి సమాధానం చెప్పాడు.

'డోవరు మెయిలేనా?'-

'అయితే ఏవింటి?' -

'ఒక ప్రయాణీకుణ్ణి కలుసుకోవాలి' -

'ప్రయాణికుడా?'

'జర్వీస్ లారీ కోచ్‌లో వున్నారా' -

ఆ మనిషి తనే అయినట్టు మన బాటసారి వెంటనే తెలియజేశాడు. గార్డూ, కోచ్‌వాలా, మిగతా యిద్దరు ప్రయాణీకులూ అతనివంక అనుమానంగా చూశారు.

'సరే అక్కడే నిలబడు!- ముందు కదుగేస్తే మాత్రం - కబర్దార్' అని దూరానవున్న మనిషిని హెచ్చరించాడు, గార్డు. మన ప్రయాణీకునివంక చూసి; 'ఎవడో కనుక్కోండి' అన్నాడు.

'ఎవరిదీ? - జర్రీ!

'అవును సర్ - నేనే'

'ఏవింటి సంగతీ?-'

'కంపెనీవాళ్లు మీకో మాట చెప్పమన్నారు సర్!'

'ఈ మనిషిని నేను ఎరుగుదును గార్డ్!' అంటూ రోడ్డు మీదికి దిగాడు లారీ. తక్కిన ప్రయాణీకులిద్దరూ, అతనికి సహాయం చేస్తున్న వాళ్లలానే నటించి, అతన్ని మెల్లిగా రోడ్డు మీదికి తోసేసి గబుక్కున తలుపులు మూసుకుని లోపల కూర్చున్నారు. కిటికీ తలుపులు కూడా దించేశారు.

'అతన్ని దగ్గరికి రానివ్వు; మరేం భయం లేదు.' అన్నాడు లారీ.

'భయం లేదని నేననుకుంటాననుకోండి - జాతికంతకీ అలాంటి నమ్మకం కలిగించటమెలా?' అన్నాడు గార్డు.

'ఏయ్!' అని కేక బెట్టాడు దూరానున్న మనిషిని.

'ఓయ్!' అని జర్రీ సమాధానం మిచ్చాడు.

'ఒక్కొక్క అడుగే నెమ్మదిగా ముందుకురా - నా సంగతి తెలుసుగా - జీను పక్కని పిస్టలు గిస్టలుందేమో - చెయ్యి అటు కళ్ళే పోనిచ్చావా - నా సంగతి తెలుసుగా!'-

గుర్రం, మనిషీ మంచు తెరలోనుంచి నెమ్మదిగా బయటికి వచ్చారు. జర్రీ నెమ్మదిగా గుర్రాన్ని నడిపించుకుంటూ మెయిల్ కోచ్‌కి పక్కగా వచ్చి జర్విస్‌లారీ ముందు ఆగాడు. గార్డు వంక వారగా చూస్తూ, చేతిలో వున్న వుత్తరం లారీ చేతిలో పెట్టాడు. రౌతు గుర్రమూ కూడా, గుర్రం పాదాలనుంచి, మనిషి టోపీ వరకూ బురదతో మునిగున్నారు.

వ్యాపారస్తుని ధీమాతో: 'గార్డ్' అని పిలిచాడు, లారీ.

ఒక చేత్తో తుపాకీ రెండో చేత్తో పిస్టలూ పట్టుకుని, కొత్తగా వచ్చిన మనిషివంక కాట్లకుక్కలా చూస్తున్న గార్డు: 'సర్!' అని కటువుగా సమాధానం చెప్పాడు.

'ఇందులో ప్రమాదం వచ్చేదేమీ లేదు. నేను టెల్‌సన్సు బ్యాంకు తాలూకు ఉద్యోగిని; బహుశా లండన్‌లోవున్న టెల్‌సన్సు బ్యాంకు సంగతి నువ్వు వినేవుంటావ్. నేను వ్యాపార విషయాలు చూసుకోవటానికి పారిస్ వెడుతున్నాను - ఇందులో మోసమేమీ లేదు. ఈ చీటి కాస్త చదువుకోనీ'-

'సరే త్వరగా చదవండి సర్!' అన్నాడు గార్డు - ఇంకా అపనమ్మకంగానే.

అతను ఆ చీటి తీసుకుని కోచ్‌లైట్ ముందుకు వెళ్ళి విప్పి చూచాడు. ముందు తనలోతను నెమ్మదిగా చదువుకున్నాడు; తరువాత బిగ్గిరగా చదివాడు.

'డోవర్‌లో ఆగవలెను; అవిడ వచ్చి కలుసుకుంటుంది.'

జర్రీవంక తిరిగి; 'పునర్జన్మ' అన్నానని చెప్పు.

'అరె! అదేం సమాధానమండీ! బలే చిత్రంగా ఉందే' అని తెల్లబోయాడు జర్రీ.

ఆ మాట చెప్పు - నాకీ వర్తమానం అందినట్టు వాళ్ళకి తెలుస్తుంది; చీటీ అక్కర్లేదు; వెళ్ళిరా' -

ఈ రెండు ముక్కలూ చెప్పి వెంటనే కోచ్ తలుపు తీసి చివాల్న లోపలికి ఎక్కి కూర్చున్నాడు. లోపలున్న ప్రయాణీకులిద్దరూ తమ చేతిగడియారాలూ, పర్సులూ అదివరకే కాలికి తొడుక్కున్న జాక్ బూట్లలో దోపేశారు; ఇప్పుడు అతను లోపలికి రావటంచూసి నిద్రపోతున్నట్టు నటిస్తున్నారు - ఇంకేమీ చెయ్యటానికీ తోచక.

కోచ్ మళ్ళా నెమ్మదిగా బయలుదేరి కొండమీది నుంచి క్రిందికి దిగుతోంది. మరింత దట్టంగా మంచు అలుముకుంటోంది. గార్డు తన తుపాకులూ గట్రా తిరిగి యథాప్రకారం సర్దేసుకుంటున్నాడు.

'టామ్' - అని కోచ్‌వాలా నెమ్మదిగా టాపుమీది నుంచి గార్డును పిల్చాడు.

'ఏవిటి?'

ఆ సమాధానం విన్నావా?'

'విన్నాను.'

'నీకేమన్నా అర్థమైందా?'

'రవ్వంతైనా అర్థం కాలేదు.'

'భలేపని - నాకూ అర్థం కాలేదు' -

చీకటిలో దిగబడిపోయిన జర్రీ నెమ్మదిగా గుర్రందిగి దానికి కొంచెం విశ్రాంతి నిచ్చాడు. మొహంమీద కొట్టుకున్న బురద అరచేత్తో తుడిచేసుకున్నాడు. నెత్తిమీదవున్న టోపీతీసి దులిపితే అరగేలన్ వరకూ నీళ్లు కారాయి. గుర్రం నోట్లోనుంచి కళ్లెంతీసి బురద కొట్టుకునున్న దండ చేతిమీద వేసుకుని, మెయిల్ కోచ్ చక్రాల ధ్వని వినిపించకుండా పోయేవరకూ అక్కడే నిల్చున్నాడు. అనంతరం నెమ్మదిగా కొండమీదనుంచి క్రిందికి దిగటానికి బయలుదేరాడు:

'రా! ముసలావిడా! ఆ గాలప్‌తో మెత్తబడిపోయావ్!- మైదానంమీదికి వెళ్లేదాకా నీ ముంగాళ్ళను నమ్మటానికి వీల్లేదు' అన్నాడు తన ఆడ గుర్రంవంక ఆప్యాయంగా చూస్తూ.

"పునర్జన్మ" - బలేమాట! - ఇల్లాంటి వ్యవహారాలన్నీ నీ వంటి వాడికి పనికిరావు జర్రీ! - ఇలాంటి పునర్జన్మలూ, బ్రతుకులోకి అడుగుబెట్టటాలూ, తప్పదాగటాలు మొదలెట్టావంటే - నీ జీవితం మరింత దొంకదోవన బడుతుంది!'

3

మానవతత్వాన్ని అర్థం చేసుకోగలగటం దుర్ఘటం. ఒకడి మనసులో యేముందో రెండోవాడికి అర్థంకాదు. రాత్రివేళ నడివీధినిబడి పోతూవుంటాం. చుట్టూ, అనేక యిళ్లూ వాకిళ్ళూ చీకటిపొదల్లా గుంపులు గుంపులుగా కంటబడతై. కాని ఈ యిళ్ళల్లో యే యింట్లో యేవిఁ జరుగుతుందో మనకేం తెలుసు? ఏ గదిలో ఏ రహస్యం దాగివున్నదో ఎవరికి తెలుస్తుంది? ఆ యిళ్లల్లోవుండే వందలూ వేలూ మానవహృదయాల్లో యేయే పరమ రహస్యాలు నిక్షిప్తంగా అణగివున్నాయో ఎలా అవగతం చేసుకోగలం? జీవితంలో ప్రాణపదంగావుండే ప్రియురాలికి కూడా తెలియకుండా ఏ వ్యక్తి యేభావాన్ని హృదయాంతరంలో మహా నిక్షేపంలా భద్రపరుచుకుని దాచుకున్నాడో ఎలా ఊహించగలం? మానవుల మాటేగాదు - సృష్టిసర్వస్వం ఒక గభీరమైన పరమరహస్యం. అవగతంగాని అనేక మహాభీభత్సాలు!- మృత్యువు! ఏవిఁటి వీటికన్నిటికీ అర్థం? సృష్టి రహస్యాన్ని భేదించటానికి ప్రయత్నించినకొద్దీ అయోమయమైపోతూ వుంటుంది. ఈ మహాగ్రంథాన్ని విప్పి ఒకటి రెండు పుటలు అలా తిరగవేసేసరికే గ్రంథం అమాంతం ముడుచుకుపోయి అంధకారం అలుముకుంటుంది. ఏవో కాగడాలు గట్రావేసుకుని అంధకారం ఆవరించివున్న ఈ మహార్ణవగర్భంలోకి తొంగిచూస్తాం - జలధిగర్భంలో ఏవో మణులూ- రత్నరాసులూ వున్నట్టు అనుమానం తగులుతుంది. అలా చూస్తూచూస్తూ వుండగానే ఏదో మంచుతెర జలధిగర్భం మీద విచ్చుకుని ఘనీభవించి - కన్ను కప్పేస్తుంది. వెలుగుతూన్న కాగడాలు వెలుగుతూ వుండగానే వొద్దున పరమాప్తుడైన మిత్రుడు పడి చస్తాడు. ఆత్మలో ఆత్మగా ఉండే ప్రియురాలు హఠాత్తుగా ప్రాణాలు విడుస్తుంది. వారి హృదయాలలో వుండే రహస్యాలు వారితోనే అంతరించిపోతై; వారి వ్యక్తిత్వం వారితోనే అణగిపోతుంది. అలానే మన హృదయాలలో వుండే భావాలు మనలోనే అణగి మనతోపాటే భూస్థాపితమౌతై. గోరీలక్రింద శాశ్వతనిద్రలో మునిగివున్న శవాల హృదయాలు మనకు ఎంత అయోమయంగా వుంటాయో సజీవులై బజారులో తిరిగే వ్యక్తుల హృదయాలు కూడా అంతే అర్థమౌతై.

వ్యక్తిత్వవిషయంలో మహారాజైనా ఒకటే, సమస్త రాజ్యభారాన్నీ వహించే మహామంత్రైనా ఒకటే, లండన్‌లో కల్లా గొప్ప ధనికుడైన వ్యాపారస్థుడైనా ఒకటే, చివరికి గుర్రం మీద స్వారీచేస్తున్న వార్తాహరుడు జర్రీ అయినా ఒకటే. ఏవ్యక్తికావ్యక్తి గభీరమైన ఒక పరమరహస్యం. మెయిల్‌కోచ్‌లో ప్రయాణంచేస్తున్న ఆ ముగ్గురి సంగతీ కూడా అంతే. ఒకడికొకడు దురవగాహమైన ఒక అయోమయం.

ఆ వార్త తీసుకుని జర్రీ గుర్రంమీద కులాసాగా తిరిగి వచ్చేస్తున్నాడు. మధ్యమధ్య రోడ్డుమీద తగిలిన సారాదుకాణాల దగ్గిర దిగి, మితిమీరని పద్ధతిలో ఔన్సో అరౌన్సో మప్పితంగా పుచ్చుకుంటున్నాడు. నెత్తిమీది మడతటోపీ కళ్లమీదిదాకా ముందుకు సరిజేసుకుని జాగ్రత్తగా ప్రయాణం చేస్తున్నాడు. కంఠానికీ గడ్డానికీకూడా కలిపి చుట్టాడు, పెద్దబారాటిమఫ్లరు. దాని కొసలు మోకాళ్ళమీదికి వ్రేలాడుతున్నయ్. సారా తాగవలసివచ్చినప్పుడల్లా, ఎడమచేత్తో గడ్డంమీది మఫ్లరు కొంచెంగా క్రిందికి ఒత్తిగిలించి, కుడిచేత్తో సారా రెండు గుక్కలూ నోట్లోపోసుకుని, మళ్ళీ ఆ పని పూర్తిఅయిపోయిన వెంటనే, మఫ్లర్ యథాప్రకారం సరిచేసుకుంటున్నాడు.

'లాభంలేదు జర్రీ! లాభంలేదు' - అదే వరసని ఆలోచిస్తున్నాడు - 'అలాంటి వ్యవహారాలు నీకు పనికిరావు; నలుగుర్లో మర్యాదగా బ్రతకవలసినవాడివి - "పునర్జన్మ"- బలే మాట! తప్పదాగినవాడు కాకపోతే యేఁవిటాపిచ్చి కూత?' -

ఈ వార్త అతనికెంతో చిరా కెత్తించింది. ఏఁవీ రవ్వంతేనా అర్థంకాక అనేకసార్లు, నెత్తిమీదినుంచి టోపీతీసి బుర్ర గోక్కున్నాడు. అతని మాడుపట్టు నున్నటి బట్టతల; మిగతా తలచుట్టూ సీసాపెంకులు గుచ్చిన ప్రహారీగోడలాగు గసికెల్లాంటి బిరుసువెంట్రుకలు ఝాతపొదలా పెరిగివున్నయ్ - నుదురుమీది దాకా. (ఒకరి తలమీదినుంచి ఒకరు గెంతిపోయే) కప్పగంతులాటకు గనక అతను సవాలుచేస్తే ఎంతలావు మొనగాడికైనా గుండెలుండవ్, అతని నెత్తిమీదనుంచి ఉరకటానికి.

జర్రీ, యీ వార్తను తీసుకువెళ్ళి టెల్‌సన్సు బ్యాంకు గేట్లోవుండే కాపలామనిషికి చెప్పాలి. కాపలామనిషి ఆ వార్తను, బ్యాంకు పైఅధికార్లకు అందజేస్తాడు. ఆ రాత్రివేళ అలా గుర్రంమీద వెడుతుంటే, ఆ చెట్లనీడలూ గుట్టల నీడలు అతనిలో అనేక రకరకాల భావాలను రేకెత్తించుతున్నాయ్. ఆ వార్తవల్ల కలిగిన ఊహల మాదిరి ఊహలే కలుగుతున్నయ్. గుర్రం మనస్సులో కూడా అనేక ఊహాచిత్రాలు! దానికి కష్టసుఖాలకు సంబంధించినవి దానికి!

మెయిల్‌కోచ్, అతలాకుతలమౌతూ రోడ్డువెంట పోతోంది. లోపలున్న ముగ్గురు ప్రయాణీకులు మాగన్నుగా కునుకు తీస్తున్నారు. ఆ మగత నిద్రలో ఎవరి జీవితానికి సంబంధించినట్టు వాళ్లు ఏవేవో కలలు గంటున్నారు.

మన బ్యాంకు ఉద్యోగి, పక్కనున్న పెద్దమనిషిమీద తూలిపడకుండా వుండటానికి, దండచెయ్యి కిటికీకి వ్రేలాడుతున్న తోలుపట్టాలో దోపి కళ్లు అరమూసుకుని కోడినిద్ర

పోతున్నాడు. ఆ కలతనిద్రలో, అతనికి, కట్టెదుట కూర్చునున్న లావాటి ప్రయాణీకుడు, టెల్సన్సు బ్యాంకులా కనుపించుతున్నాడు. బ్యాంకు వ్యాపారం ఉజ్వలంగా సాగిపోతోంది. గుర్రాలమెళ్లలో వున్న మువ్వల చప్పుడు రూపాయల మోతలా వినిపిస్తోంది. టెల్సన్సు బ్యాంకు వ్యాపారం అతఃపూర్వం యెప్పుడూలేనంత పెద్దపెట్టున అమోఘంగా సాగిపోతోంది. చెక్కులమీద చెక్కులు డ్రాఫ్టులమీద డ్రాఫ్టులు హడావిడిగా మారిపోతున్నయ్. టెల్సన్ బ్యాంకు అడుగుభాగంలో వుండే ఇనప్పెట్టెల గదులూ - వాటిలోవుండే - నగలూ నాణాలూ-ధనరాసులూ - పెద్ద పెద్ద తాళంచెవుల గుత్తులూ - ఆ గదుల్లో మినుకుమినుకుమంటూ వెలుగుతున్న కొవ్వొత్తులూ - బ్యాంకియావత్తూ అతని కళ్లముందు తాండవమాడుతోంది. అతనితోపాటు బ్యాంకి కూడా తెల్లవార్లూ మెయిల్‌కోచ్ మీద ప్రయాణంచేస్తూనే వుంది. అతని బుర్రలో అదొక్కటేగాదు. మరొక ధోరణికూడా పనిచేస్తోంది. భూగర్భంలో పూడ్చిపెట్టబడిన ఒక వ్యక్తిని బయటికి త్రవ్వుకు తెచ్చే ప్రయత్నంలో అతను ఇలా ప్రయాణమై వెడుతున్నాడు.

అతని మనోవీధిని కనుపించుతున్న వందలూ వేలూ, ముఖాల్లో భూస్థాపితుడైవున్న ఆ వ్యక్తి ముఖం ఏది? అదిమాత్రం గుర్తు తెలియడంలేదు - అన్ని ముఖాలూ ఒకేమాదిరిగా వున్నయ్; అన్నీ 45 సంవత్సరాల వయస్సు గల ఒకేరకం ముఖాలు! వున్న తేడా అల్లా, చివికి చీకాకై భీభత్సాకారంలోవున్న ఆ ముఖాల మీద కనుపించుతున్న భావాలలోనే; ఆత్మాభిమానం - జుగుప్స - ధిక్కారం - మొండితనం - నిరాశ - దుఃఖం - ఒకదాని తరువాత ఒకటి వరుసగా కనిపించుతున్నయ్. వివిధ భావాలతో ఇన్ని ముఖాలు కనుపించుతున్నా మొత్తానికి ఈ ముఖాలన్నీ ఒక్క మనిషివే. ప్రతి తలా కూడా వయసు ముదరకముందే తెల్లబడి పోయినబాపతే. కునుకుతీస్తున్న బ్యాంకుఉద్యోగి ఆ ముఖాన్ని పదేపదే ప్రశ్నించుతున్నాడు:

'భూస్థాపన జరిగి ఎన్నాళ్ళయింది?' -
'పద్దెనిమిదేళ్లు' -
'త్రవ్వి బయటికి తీస్తారనే ఆశలన్నీ వదులుకున్నావ్?'
'ఏనాడో నిరాశ చేసుకున్నాను.'
'నీకు పునర్జన్మ లభించిందని తెలుసా?'
'అని అంటున్నారు'
'నీకు బ్రతకాలని వుందా?
'చెప్పలేను'
'అవిణ్ణి నీకు చూపించమంటావా? - నువ్వొచ్చి అవిణ్ణి చూస్తావా?'

ఆముఖం, ఈ చివరిప్రశ్నకు "అవును," "కాదు," అంటూ, పరస్పర విరుద్ధమైన అనేక సమాధానాలు చెబుతోంది. ఒకొక్కసారి గొణుగుడు స్వరంతో: 'కొంచెం ఆగు వెంటనే చూస్తే చచ్చిపోతానేమో' - అంటోంది. మళ్ళా 'పోనీ నన్నే అక్కడికి తీసుకువెళ్లు' అంటోంది-మళ్ళీ ఏదో అయోమయమైపోయి వెర్రి మొహంబెట్టి - 'ఆ అమ్మా యెవరో నే నెరగను - నాకు అర్థంకావటంలేదు,' అంటోంది.

ఇలా, ఊహాసంభాషణ అంతమై తునిగిపోయినప్పుడల్లా - బ్యాంకు ఉద్యోగి తిరిగి తాను ఆ వ్యక్తిని భూగర్భంలోనుంచి బయటికి త్రవ్వుతున్నట్టు మరొక రకంగా కలగంటున్నాడు. పార చేత బుచ్చుకు కొంతసేపూ - తాళం చెవి చేత బట్టుకుని కొంతసేపూ- చేతులతో కుళ్లగించటం కొంతసేపూ - ఇలా, దురదృష్టవంతుడైన ఆ వ్యక్తిని బయటికితీయటానికి నానాతంటాలూ పడుతున్నాడు. ముచ్చెమటలు పడుతున్నయ్. అమ్మయ్యా! బయటికి లాగేశాం తలా మొహం యావత్తూ మట్టితో నిండివుంది! అయ్యయ్యో మళ్ళీ గోతిలోపడి పూడుకు పోతాడేమో! ఈ భావం తోచగానే అతను త్రుళ్ళిపడి నిద్రలేచాడు. ఆ నిద్రమత్తులోనించి వాస్తవిక జగత్తులోకి రావాలనే ఆపేక్షతో మంచూ, వర్షపు చినుకులూ బుగ్గమీదపడి చలిబాధ తెలిసేలాగు, కోచ్ కిటికీతలుపు వారగా తెరుస్తాడు.

అతను కళ్లు తెరుచుకునే కూర్చున్నాడు. కోచ్ దీపాల కాంతులు రోడ్డుమీద వలయాలుగా కనుపించుతూనే వున్నయ్. కాని రోడ్డుమీద చీకటిక్రీనీడలన్నీ అతని మనస్సులోవున్న నీడలలో లీనమై - కళ్లు తెరచుకుని వున్నా మళ్లీ అవే దృశ్యాలు కట్టెదుట కనుపించుతున్నయ్ - బ్యాంకు, వ్యాపారం, ధనపుకొట్లు, తనకు వచ్చిన వర్తమానం, సర్వం మళ్లీ యథాతథంగా కనుపించుతున్నయ్. వాటి అన్నిటికీ మధ్య ఆ భీభత్స ముఖం ద్యోతమానమౌతోంది. ఆ ముఖాన్ని మళ్లీ అదేవిధంగా ప్రశ్నించుతున్నాడు :

'భూస్థాపన జరిగి ఎన్నాళ్లయింది' -
'పద్దెనిమిదేళ్లు'
'నీకు బ్రతకాలని వుందా?'
'చెప్పలేను'

మళ్లీ అదేరకంగా త్రొవ్వాటం సాగించుకుపోతున్నాడు. ఇంతోలోనే ప్రక్కనున్న ప్రయాణీకుడు: 'కిటికీ మూసెయ్యరాదుటయ్యా!' అని చివాట్లేసేసరికి త్రుల్లిపడి లేచి, కిటికీతోలుపటకాలోనుంచి నెమ్మదిగా చెయ్యి జారలాక్కున్నాడు. అలాగే, కునికిపాట్లుపడుతూ కూర్చుని ఆ యిద్దరు ప్రయాణీకులవంకా చూస్తున్నాడు. ఒకటి రెండు క్షణాలలో మళ్లీ మెదడు తలక్రిందులై బ్యాంకూ, సమాధిగొయ్యీ ప్రత్యక్షమైనయ్:

'భూస్థాపన జరిగి ఎన్నాళ్లయింది?'
'పద్దెనిమిదేళ్లు'
'తవ్వితీస్తారనే ఆశలు వదులుకున్నావా?'
'ఏనాడో' -

ఆ మాటలు ఇంకా అతని చెవుల్లో వినిపించుతూనే వున్నయ్. ఇంతలోనే సూర్యకాంతులు కిటికీలోనుంచి కోచ్‌లోకి చొచ్చుకువచ్చి చీకటినీడలన్నీ అదృశ్యమైపోయినై. ప్రయాణబడలికతో యాలగిలబడివున్న ప్రయాణీకుడు మేలుకున్నాడు.

కిటికీ సాంతం తెరిచేశాడు. చాళ్లదున్నిన ఒక చేను కనుపించింది. చేనుకుమధ్యగా ఒక నాగలి కోటేరేసి వుంది. చేను చుట్టూవున్న కొండతంగేటిచెట్లు ఎర్రగా విరియబూసి మిడిసిపడుతున్నయ్; భూమి తడితడిగావున్నా ఆకాశం నిర్మలంగా వుంది. సూర్యుడు ఉజ్వలంగా గగనానికి ఎగబ్రాకుతున్నాడు.

'అయ్యో పాపం! పద్దెనిమిదేళ్లు!' అనుకున్నాడు అతను, జాలిగా - ఆకాశంలోకి పొటమరించుకొస్తున్న సూర్యబింబం వంక చూస్తూ.

'నిండుప్రాణాలతో పద్దెనిమిదేళ్ల జీవసమాధి!' -

4

నానా అవస్థలూపడి, ఎలాగైతేనేం, మెయిల్‌కోచ్ డోవర్ జేరుకుంది. కోచ్ "రాయల్ జార్జిహోటల్" ముందు ఆగేసరికి మధ్యాహ్నం దాటింది. మామూలుప్రకారం, హోటల్ నౌకరీల మేస్త్రీ స్వయంగా వచ్చి కోచ్‌తలుపు తెరిచాడు. ఆ తెరవటం ఏదోమహోత్సవం నెరపుతున్న వాడులా నిర్వహించాడు. అవును మరి, ఆ రోజుల్లో, శీతాకాలంలో లండన్ నుంచి డోవరుకు ప్రయాణం చెయ్యటమంటే సామాన్యవిషయమా? వాస్కోడిగామా భారతదేశానికి చేరుకున్నంత అభినందనీయమైన ఘనకార్యం.

అప్పటికి, కోచ్‌లో మిగిలివున్న ప్రయాణీకుడు మనబ్యాంకు ఉద్యోగి ఒక్కడే. మిగతా యిద్దరూ తమతమ ఊళ్ళదగ్గిర మధ్యే మార్గంలోనే దిగిపోయారు. కోచ్‌లోపలి భాగమంతా మంచుకు దమ్ముకునుంది. తడిచెత్త ముంజుకంపు కొడుతోంది. తలుపు తెరిచేసరికి కుక్కల కొట్టాంలా వుంది. జర్విస్‌లారీ ఒళ్లంతా చుట్టుకున్న గడ్డిపోచల బందాలలోనుంచి తెంపుకు ఎలాగోలా బయటపడ్డాడు. మీద కప్పుకున్న ఆ గొంగడీ, ఆ బురదకాళ్లూ, ఆ మురికి గుడ్డలూ - అతని వాలకమంతా, సరీగా ఓ పెద్దజాతి కుక్కలానే వున్నాడు.

'రేపు కేలేకి ఒక పాకెట్ పంపించాలి మేస్త్రీ!' అన్నాడు, లారీ.

'అట్టాగే సర్ - గాలీగట్రాసరీగావుంటే - అట్టాగే పంపుదాం - పడకగది కావాలాసర్?'-

'రాత్రిదాకా పడుకోనక్కర్లేదు - కానీ, విశ్రాంతి తీసుకోటానికి గది కావాలి - అన్నిటికంటే ముందు మంగలి కావాలి.'

మేస్త్రీ తక్కిన నౌకర్లందర్నీ కేకేసి - తలోపనీ పురమాయించాడు:

'అయ్యగారి సామాను పెద్దభవంతిలో వున్న పడకగదిలో పెట్టండి - వేణ్ణీళ్లు చూడండి- అరే ఎవడ్రా! - మంగల్ని కేకెయ్!' -

మెయిల్‌కోచ్ ప్రయాణీకు లెవరొచ్చినా పెద్దభవంతి పడకగదిలోనే మకాంచేస్తారు. సాధారణంగా మెయిల్‌కోచ్ ప్రయాణీకులు ఆపాదమస్తకం కప్పుకునే వస్తారు. అంచేత గదిలోకి వెళ్లేటప్పుడు ఒకేరకం మనుషులుగా వెళ్లినా లోపల దుస్తులు మార్చుకోవటంతో రకరకాల మనుషులుగానూ బయటికి వస్తారు. అలాగే మన బ్యాంకు పెద్దమనిషి కూడా బయటికి వచ్చాడు. దాదాపు అరవై సంవత్సరాల ప్రాయంలోవున్న పెద్దమనిషి; పాతనలిగిపోయిన గోధుమవర్ణం సూటు. పెద్ద పెద్ద మూతలున్న కోటు జేబులు, నలుచదరంగా కుట్టిన ముంజేతులు.

తనగదిలోనుంచి బయలుదేరి, దూరానున్న భోజనశాలకు వచ్చేలోగా, ఆయనకు, ఒకరిద్దరు మగ నౌకర్లూ, కొంతమంది ఆడనౌకర్లూ, యజమానురాలు, త్రోవలో అక్కడక్కడ తారసిలి, విచిత్రమైన జంతువును చూసినట్టు చూసి పక్కలకు వైదొలగుతున్నారు.

భోజనశాలలో, ఆ మధ్యాహ్నం ఆయన ఒక్కడు మినహా మరొక రెవ్వరూ లేరు. ఆయన బల్లా, కుర్చీ నిప్పులగుణ్ణానికి దగ్గిరగా లాగివున్నయ్. ఆయన వెళ్లి, ఆ కుర్చీలో, ఫోటో తీయించుకోవటానికి కూర్చున్నట్టు, చేతులు రెండూ, కుర్చీపట్టెలమీద ఆనించి చలనరహితంగా కూర్చున్నాడు. నిప్పులగుణ్ణంలో మండుతున్న జ్వాలల కాంతులు ఆయనముఖంమీదికి ప్రసరించుతున్నయ్.

దైవప్రార్థన చేస్తున్నవాడిలా అచంచలుడై కూర్చున్నాడు. ఆయన వేయిస్టు కోటుజేబులో వున్న గడియారం ప్రార్థనగీతం పాడుతున్నట్లు, లయలో వినిపిస్తోంది. ఆయన పిక్కలు బాగా పైర్లు తిరిగి గుండ్రంగా వున్నయ్. వాటిని సిల్కు మేజోళ్లు బిర్రుగా అంటిపెట్టుకుని కదనొక్కుకున్నయ్. నెత్తిమీద నిగనిగలాడుతున్న ఒక 'విగ్గు' చెవులమీది దాకా అమర్చివుంది. (ఆరోజుల్లో మర్యాదస్తులైన వాళ్ళంతా విగ్గులు ధరించేవాళ్ళు.) కోటు లోపల తొడుక్కున్న చొక్కా, మేజోళ్ళ మోస్తరుగా మిసమిసలాడకపోయినా సముద్రపు కెరటాలమీది నురుగు దుబ్బులులాగా తెల్లగా మెరుస్తున్నది. టెల్ సన్సుబ్యాంకు బాణీకి సరిపోయేలాగు తనకున్న ఆవేశాల నన్నిటినీ మార్చుకుని అణచేసుకోవటంతో, ఆయన ముఖంమీద యేవిధమైన భావరేఖలూ కనుపించకపోయినా, ఆ ప్రయత్నంలో ఆయనపడ్డ బాధంతా, కన్నీటిపొర జాలులో మిలమిలలాడుతున్న కనుగుడ్లలో స్పష్టంగా కనుపించుతూనేవుంది. ముఖవర్చస్సూ అదీ, మంచి ఆరోగ్యంగల వ్యక్తిలానే వున్నాడు. నుదురుమీద మాత్రం కొన్ని ఆందోళన రేఖలు సన్నటి ముడతలుగా ముడుచుకుంటున్నయ్. టెల్‌సన్సుబ్యాంకు తాలూకు ఆంతరంగిక ఉద్యోగి బృందంలో బ్రహ్మచారులుగా వున్న వాళ్ళు కొందరికి స్వంతబాధ్యత లేమీ అటే లేకపోయినా, పరాయివాళ్ల బాధ్యతలుపట్టుకు వేధించుతూ వుంటై.

ఆ కుర్చీలో అలాగే కూర్చుని, లారీ, కొంచెం గుడ్డి కునుకు తీస్తున్నాడు. నౌకరు భోజనం తెచ్చి బల్లమీదపెట్టిన అలికిడి తగిలి, కళ్లు విప్పి చూచాడు. కుర్చీ బల్లముందుకు లాక్కుంటూ నౌకరుతో :

'వేరే, ఒక ఆడమనిషికి, ప్రత్యేకం గది యేర్పాట్లు కావాలి; ఆవిడ ఇప్పుడో, ఇంకాసేపటికో వస్తారు. జర్విస్ లారీ, అని గాని, టెల్‌సన్సుబ్యాంకు ఉద్యోగి అనిగాని అడుగుతుంది; నాతో వచ్చి చెప్పండి.'

'అట్టనే సామీ! - టెల్‌సన్సు బ్యాంకీ అంటే - ఆ లండన్ బ్యాంకీయేనా సామీ!'

'అవును'

'అవును సామీ - ఆరంతా లండన్ నుంచి పారిస్‌కీ - పారిస్ నుంచి లండనుకూ తిరుగుతా, ఇక్కడ శానాసార్లు మకాం శాత్తావుంటారు.'

'అవును మాకు పారిస్‌లో చాలా పనులుంటూ వుంటై. అసలు మాది చాలావరకు ఫ్రెంచి బ్యాంకే.'

'మిమ్మల్ని గాని, ఎప్పుడూ సూసినట్టు లేదు.'

'నే నెప్పుడూ ఈమధ్య రాలేదు - మేము - నేను - ఎప్పుడో పదిహేనేళ్ల క్రింద ఒకసారి యిక్కడ మకాంచేశాను - ఫ్రాన్సునుంచి వస్తూ.'

'అయితే కావొచ్చుసామీ! అప్పటికింకా, నేనీ ఉద్యోగంలో చేరలేదు - అప్పటికి ఈ హోటలు మరోకావందు కిందవుండేది. 'టెల్ సన్సు బ్యాంకీ గొప్ప బ్యాంకీ అయివుండాల! ఏబై అరవై యేళ్ల నుంచీ ఆ పేరు యింటానే వుంటాం.'

'ఏభైఖర్మేవింటి? నూటయాభైయేళ్ల నుంచీ పేర్లో వుంది' -

'అవును అట్టనే సర్!' -

కళ్లూ మూతీ తుడుచుకుని ఆయన భోజనం చెయ్యటానికి ఉపక్రమించాడు. నౌకరు కుడిచేతిమీద వున్న మురికితువ్వాలు యెడంచేతిమీద వేసుకుని, విశ్రాంతిగా గోడకి యాలిగిలబడి నిల్చుని ఆయనవంక తదేకధ్యాన్యంగా చూస్తున్నాడు.

భోజనం ముగిసిన అనంతరం, లారీ, కొంచెంసేపు తిరిగి రావటానికి అలా సముద్రపు ఒడ్డుకు వెళ్లాడు. డోవర్ పట్నానికీ సముద్రతీరానికి మధ్య సీమసున్నపు కొండలున్నయ్. సీమసున్నపు కొండల వెనక డోవర్ పట్నం, తల కొండగుట్టల్లో దాచేసుకుని ముడుచుకుపడుకొన్న సముద్రపు నిప్పుకోడిలా వుంటుంది. సముద్రపు ఒడ్డంతా ఎడారిలా నిర్మానుష్యంగా వుంటుంది. ఇసుకా, రాళ్లూ ఎక్కడబడితే అక్కడ గుట్టలుబడి చెల్లాచెదురుగా వుంటై. సముద్రం కల్లోలంగాలేచి, సీమసున్నపు కొండలమీదా, నగరం మీదా గర్జిస్తూ వుంటుంది.

ప్రొద్దుతిరిగిన కొద్దీ, వాతావరణమంతా మళ్లా మసకమసక వేసి పోతోంది.' అతః పూర్వం దూరాన కనుపించుతున్న ఫ్రెంచి సముద్రతీరం అదృశ్యమైపోయింది. సముద్రగర్భం మీద పొగమంచు వ్యాపించిపోతోంది. లారీ మనస్సులో వున్న భావాలన్నీ కూడా మళ్లా యేదో మసకమసకగా అస్పష్టమౌతున్నయ్. మళ్లీ భోజనంబల్లముందు కూర్చుని మంటల్లోకి చూస్తూ, మనసులో తొవ్వాటం ప్రారంభించాడు. ముందున్న సారా సీసాలో నుంచి కాస్త కాస్తే ఖాళీచేస్తున్నాడు. ఇంతలోనే ఆవరణలోకి యేదో బండివచ్చినట్టు చక్రాలచప్పుడు వినిపించింది.'

చివాల్న గ్లాసు క్రింద బెట్టేసి: 'ఆవిడే అయివుంటుంది' అనుకుంటున్నాడు.

ఇంతలోనే, నౌకరు లోపలికివచ్చి:, లండన్ నుంచి మిస్ మానెట్ వచ్చారు. మిమ్మల్ని కలుసుకోవాలంటున్నారు!

మిస్ మానెట్ త్రోవలోనే యేదో ఫలహారం తీసుకుంది. వెంటనే ఆ ప్రమేయమేమీ అక్కర్లేదు. టెల్ సన్సు ఉద్యోగిని తక్షణం కలుసుకొని మాట్లాడాలనే తహతహలో వుంది.

లారీ బల్లమీదపెట్టివున్న గ్లాసు పైకెత్తి ఆ గుక్కెడూ కూడా నోట్లో పోసుకుని విగ్గు సరిచేసుకున్నాడు. మిస్ మానెట్‌ను కలుసుకోవటానికి, నౌకరు వెంట బయలుదేరాడు.

మిస్ మానెట్ ఒక పెద్దచీకటి గదిలో కూర్చునుంది. లోపలున్న కొయ్య సామానంతా నూనెజిడ్డు కారుతున్నయ్. గది మధ్యలోవున్న బల్లమీద రెండు కొవ్వొత్తులు మినుకు మినుకుమంటూ వెలుగుతున్నయ్. ఆ గదిలో ఎక్కడేం వుందో తెలీడం లేదు.

ఆ గదినబడి తడుముకుంటూ లారీ లోపలికి వెళ్లాడు. నేల మీదపరచి వున్న ఇక్ష్వాకుల నాటి తివాసీ పీచులు రేగి కాలికి చుట్టుకుంటోంది. మిస్ మినెట్, ఇంకా ఆ పక్కనున్న మరో గదిలో ఎక్కడో వున్నదనుకున్నాడు, లారీ. కాని తీరా మైనపువత్తులు వెలుగుతున్న మధ్యనున్న బల్లదగ్గరికి వెళ్లేసరికి, అక్కడొక స్త్రీ నిల్చునుంది. పదహారు పదిహేడేళ్ళ ప్రాయంలోవున్న పడుచు; యింకా ప్రయాణపు దుస్తులుకూడా మార్చుకోలేదు; అందమైన మనిషి; కొంచెం పొట్టికురచ; నిగనిగ లాడుతున్న బంగారు తలకట్టు. నీలపురాళ్ళలా మిలమిలలాడుతున్న కనుగుడ్లు. యౌవ్వనంతో మిసమిస లాడుతున్న నుదురుమీద సంభ్రమ భయాందోళనలు జిలిబిలిగా తాండవమాడుతున్నయ్. ఆ ముఖం వంకచూసేసరికి హఠాత్తుగా అతని మనస్సులో ఏదో ఒక స్ఫురణ కల్గింది. చాలా సంవత్సరాల క్రితం, తుపానురేగుతున్న అదే సముద్రంమీద ఫ్రాన్సునుంచి ఇంగ్లండుకు ఓడలో వస్తూ, అదే పోలికలున్న ఒక పసిబిడ్డను తాను ఒళ్ళోబెట్టుకు లాలించినట్టు ఒక స్ఫురణ కలిగింది. మరుక్షణంలోనే ఆ భావం మళ్లా అంతరించిపోయింది. ఆ స్త్రీ వెనకాలవున్న నిలువుటద్దం చట్రం మీద చెక్కివున్న నీగ్రోలబొమ్మలు అతని దృష్టిని మరల్చినై. గౌరవ పురస్సరంగా తలవంచి ఆ స్త్రీని ఆశ్వాసించాడు.

'అలా కుర్చీలో దయచెయ్యండి!' అన్నదా యువతి. ఆవిడ మాటలో, ఉండీలేనట్టుగా కొంచెం యాస కనుపించుతోంది.

పూర్వకాలపు మర్యాదల పద్ధతిని ఆవిడ చెయ్యి ముద్దుబెట్టుకుని తిరిగి మరోపర్యాయం తలవంచి అభివందనంచేసి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

'నాకు బ్యాంకు నుంచి ఒక ఉత్తరం అందింది. ఆ ఉత్తరంలో, మా నాన్నగారి తాలూకు, కొద్దిపాటి ఆస్తికి సంబంధించిన యేవో కొన్ని విషయాలు బయటకువచ్చినట్టు వ్రాశారు - ఆయన, నా పసితనంలోనే ఎప్పుడో చనిపోయారు నాకు తెలియనే తెలియదు.'

లారీ అద్దంచట్రం చుట్టూవున్న నీగ్రోబొమ్మలవంక బాధగా చూస్తున్నాడు.

'ఆ వ్యవహారం విషయంలో నేను పారిస్ వెళ్లవలసి వుంటుందని వ్రాశారు. అదే పనిమీద బ్యాంకి ఉద్యోగి నొకర్ని పారిస్ పంపుతున్నామనీ, ఆయన్ను కలుసుకోవలసిందనీ తెలియజేశారు.'

'అవును. ఆ వెడుతున్నది నేనే'

'చిత్తం - నేను బ్యాంకికి వెంటనే సమాధానం వ్రాశాను. నేను ఫ్రాన్సుకు బయలుదేరుతున్నాననీ, తల్లీదండ్రీ దగ్గర బంధువులెవరూ లేనిదాన్ని కావటంచేత, బ్యాంకినుంచి వెడుతున్న ఉద్యోగి వెంట తీసుకువెడితే కృతజ్ఞురాలననీ తెలియజేశాను'-

'సంతోషం - మీరు నాతోపాటు ప్రయాణం చెయ్యటం ముదావహం.'

'కృతజ్ఞురాల్ని - తమరు నాకు, ఈ వ్యవహారానికి సంబంధించిన సమస్త వివరాలూ తెలియజేయగలరనీ, అవి సంభ్రమాశ్చర్యాలు కలుగజేసే సంగతులు కాబట్టి, వాటిని వినటానికి మనోబలం చేకూర్చుకుని సిద్ధంకావలసిందనీ హెచ్చరించారు - నేను మనస్తిమితం చేకూర్చుకున్నాను. ఆ వివరాలు వినాలని ఆతురతగా వుంది. దయవుంచి సెలవియ్యండి'-

'సహజం! - నేనూ...' - ప్రారంభించబోతో మళ్లా ఎందుకో హఠాత్తుగా ఆగి, విగ్గు సరిచేసుకున్నాడు.

'విషయం ఎలా ప్రారంభించాలో బోధపడటంలేదు' -

అతను ప్రారంభించలేదు. సందిగ్ధావస్థగా ఆవిడ కళ్ళవంక చూచాడు. ఆవిడ అతని ముఖంవంక, ఏదో చెప్పబోతున్నాడని ఆతురతతో చూస్తోంది. అతనిముఖంలో ఆవిడకు యేదో ఒక విషాదచ్ఛాయ పొడకట్టింది.

'ఏమండీ! - మీఁనాకు సొంతం అపరిచితులేనా?'

'కాదామరి?' - అన్నాడు, రెండు చేతులూ బారచాచి, చిరునవ్వు నవ్వుతూ'.

ఆవిడ కనుబొమలు రెండూ దగ్గిరికి ముడుచుకున్నయ్. సాలోచనగా కుర్చీలో కూర్చుంది- అదివరకు నిల్చుని మాట్లాడుతున్న మనిషి. ఆవిడ ఆలోచించుతూ మౌనముద్రలో వున్నంతసేపూ, అతను ఆవిడ వంక చూస్తూ అలానే మెదలకుండా వూరుకున్నాడు. తిరిగి స్ఫురణకు వచ్చి కన్నులెత్తి అతని వంక చూడగానే, ఇలా ప్రారంభించాడు:

'మిస్ మానెట్!' -

'సర్!-'

'నేను వ్యాపారస్థుణ్ణి - వ్యాపార నిర్వహణ బాధ్యతను నిర్వహించుతున్నాను - అలాంటి యంత్రం మాట్లాడుతున్నట్లే, నేను చెప్పేది విను - నిజానికి అంతకంటే నా ప్రత్యేకత ఏమీలేదు - మాతో వ్యాపార లావాదేవీలున్న ఒక ఖాతాదారుకు సంబంధించిన కథను యిప్పుడు నీకు చెప్పబోతున్నాను.

'కథా!' -

ఆవిడ ఆశ్చర్యాన్ని అర్థం చేసుకోని వాడులా నటించి 'మా కంపెనీతో లావాదేవీలున్న వాళ్లనందర్నీ - ఖాతాదార్లంటం మామూలు', అంటూ కథ ప్రారంభించాడు.

5

లారీ, ఆ ఖాతాదారు కథను ఇలా ఉపక్రమించాడు:

'ఆయన ఫ్రెంచి పెద్దమనిషి; పారిస్‌లో మంచి పేరు ప్రతిష్టలు సంపాదించుకున్న పెద్ద డాక్టరు -'

'బోవే వంశమేనా అండీ?'-

'అవును బోవే వంశమే; మీ నాన్నగారు, మాన్సియర్ మానెట్ మోస్తరుగా, ఆయనదీ బోవే వంశమే. మీ నాన్నగారు మోస్తరుగానే ఆయనకూడా మంచి గౌరవమర్యాదలుగల మనిషి - ఆయన నాకు బాగా పరిచయస్థుడే - అంటే కేవలం వ్యాపార లావాదేవీల పరిచయమేననుకో. అయితే ఆయనతాలూకు స్వంత వ్యవహారాలతో సంబంధం వుండటంచేత, మాకిద్దరికి చాలా ఆంతర్యం వుండేది. అప్పట్లో నేను, మా ఫ్రాన్సు హెడ్ ఆఫీసులో పనిచేస్తున్నాను'-

'అప్పట్లో అంటే?' -

'ఇది ఇరవై సంవత్సరాలనాటి సంగతి. ఆయన, ఒక ఆంగ్ల స్త్రీని వివాహం చేసుకున్నారు. ఫ్రెంచివాళ్లల్లో, కాస్తో కూస్తో వున్న ప్రతి ఒక్కరూ, తమ ఆస్తిపాస్తులను బ్యాంకి అజమాయిషీ క్రింద అట్టి పెట్టుకుంటారు. అలాగే ఆయన వ్యవహారాలనన్నిటినీ కూడా మా బ్యాంకే చూస్తూ వుండేది. బ్యాంకు ఉద్యోగిగా ఇతర ఖాతాదార్ల వ్యవహారాలతోపాటు ఆయన వ్యవహారాలను కూడా నేనే చూస్తూవుండేవాణ్ణి. ఇవన్నీ కేవలం వ్యాపారసంబంధాలు; వాటిలో స్నేహవాత్సల్యాలుగాని యితర ఆత్మీయతలుగాని యేవీఁ లేవు. దైనందినవ్యాపారనిర్వహణలో ఒక ఖాతాదారు పనిపూర్తి అయినతరువాత అది విడిచి రెండో ఖాతాదారు పనిలోకి యెలా మారుతామో అదే పద్ధతిలో నా ఉద్యోగ జీవితం అక్కడినుంచి యీదేశానికి మారింది. ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, దీంట్లో వ్యక్తిగతంగా నా వాత్సల్యానురాగాల ప్రసక్తి యేమీ లేదు. నేను కేవలం ఒక యంత్రాన్ని- సరే ఇక అనంతరగాథ' -

'ఇది నా తండ్రి చరిత్ర - నా కేవిఁ తోస్తోందంటె' - అతని ముఖంలోకి సాలోచనగా చూస్తోంది: 'నా తండ్రి చనిపోయిన అనంతరం రెండేళ్లలోనే నాతల్లి కూడా చనిపోయింది. తల్లీ తండ్రీలేక దిక్కులేని బిడ్డగావున్న నన్ను, ఇంగ్లండుకు తీసుకువచ్చింది మీరే ననుకుంటాను- తప్పకుండా మీరే అయివుంటారని నా నమ్మకం.'

ఆసరాకోసం, అనురాగంకోసం వెంపరలాడుతూ తీగలా సాగి అతని ముంజేతిని అందుకోవటానికి ప్రయత్నిస్తున్న ఆ అభాగ్యురాలి చేతిని ఆప్యాయంగా అందుకుని హృదయానికి హత్తుకున్నాడు. కళవళంగా లేచి దగ్గిరికివచ్చిన ఆ స్త్రీని మళ్ళా నెమ్మదిగా కుర్చీదగ్గరికి నడిపించుకుపోయి కూర్చోబెట్టాడు. ఎడంచేత్తో కుర్చీ పట్టుకుని, ఆ స్త్రీముఖంలోకి చూస్తూ, దగ్గిరగా నిలబడ్డాడు. ఆవిడకూడా తలపైకెత్తి అతనివంక చూస్తోంది.

'అవునమ్మా! నిన్ను తీసుకువచ్చింది నేనే! - అయినా తిరిగి నిన్ను చూడ్డానికి నేను ఎప్పుడూ రాలేదు - నాకు హృదయంలేదంటానికి యీ ఒక్కవిషయం ఆలోచిస్తే నీకు తెలుస్తుంది. ఇతర ప్రాణులతో నాకుండే సంబంధ బాంధవ్యాలన్నీ వ్యాపార లావాదేవీలు మినహా మరోటికాదు. అందాకా యెందుకు - ఇన్ని రోజులనుంచీ నువ్వు బ్యాంకు సంరక్షణలోనే వున్నావు. అయినా నేను యితర ఖాతాదార్ల వ్యవహారాలతో సతమతమౌతున్నానేగాని నీ సంగతి రవ్వంతేనా ఆలోచించానా? నాకు వాత్సల్యానురాగాలనేవి లేవి. అలాంటివాటికి నాలో అవకాశంలేదు. అసలు అలాంటి ఆలోచనలకు నాకు టైమేదీ? నిరంతరం, బ్రహ్మాండమైన ఒక ఆర్థిక యంత్రాన్ని తిప్పటంతో నా జీవితం గడచిపోతోంది. -

తన దైనందిన కార్యకలాపాలకు సంబంధించిన ఈ విచిత్రాభివర్తన ముగించి, నెత్తిమీది విగ్గు సరిచేసుకున్నాడు. మళ్లా అదే పోజులో నిల్చుని అసలు కథ తిరిగి మొదలుబెట్టాడు.

'నీవన్నట్టు, ఇంతవరకూ ఇది నీ తండ్రి చరిత్ర. కానిముందు కథ కొంత వ్యత్యాసంగా వుంటుంది. ఒకవేళ మీ తండ్రి, తను చచ్చిపోయినప్పుడు చచ్చిపోలేదనుకో- కలవరపడకు!! అరే! ఎందుకంత కంగారూ?

ఆ స్త్రీ నిజంగా, చాలా కలవరపడ్డది. ఆ కంగారులో అతని మణికట్టు గట్టిగా పట్టుకుంది.

తన ఎడమ చేత్తో ఆ యువతి ముని వ్రేళ్ళను నిమురుతూ అనునయంగా మాట్లాడుతున్నాడు: 'మనసు కాస్త స్థిమితపరచుకో - ఆందోళనదేనికి? ఇదంతా కేవలం వ్యాపారవ్యవహారం. మొదటే చెప్పానుగాదూ-'

ఆవిడ కంగారు చూసి క్షణం తమాయించి, ఇటూ అటూ రెండుసార్లు పచారుచేసి మళ్లా మొదలెట్టాడు.

'నేను చెప్పినట్టు, మాన్సియర్ మానెట్ చచ్చిపోలేదనుకో; హఠాత్తుగా ఎవరికీ తెలియకుండా అదృశ్యమైపోయాడనుకో; ఆయన్ను యెవరో యెక్కడికో యెత్తుకుపోయారనుకో; ఇదమిద్ధమని తెలియకపోయినా, ఏదో భయంకరమైన ఒక అజ్ఞాతానికి తీసుకుపోయారనుకో; ఫ్రాన్సులో మంచి పలుకుబడిగల దేశ భక్తుడనిపించుకుంటున్న ఒకడు తన పలుకుబడి వినియోగించి, ఏ మనిషిని బడితే ఆ మనిషిని తన స్వంత కారాగారంలో ఎంతకాలంబడితే అంతకాలం బంధించి వుంచటానికి, ప్రభుత్వం దగ్గర నుంచి 'బ్లాంక్ వారంట్ల' మీద ముద్రలు వేయించి తెప్పించి ఆయన్ను యెక్కడికో ఎత్తుకుపోయి ఖైదుచేశాడనుకో; భర్త యేమైందీ తెలియక మానెట్ గారి భార్య కోర్టుల చుట్టూ, మత గురువులచుట్టూ, రాజూరాణీల చుట్టూ కాళ్లు అరిగిపోయేలా తిరిగి ఏమీ లాభంలేక నిరాశ చేసుకున్నదనుకో - అలా జరిగివుంటే. నీ తండ్రి చరిత్రా, దురదృష్టవంతుడైన ఈ బోవే డాక్టర్ చరిత్రా ఒకటై వుండాలి.'

'మీ చేతులు బుచ్చుకు బ్రతిమాలుతున్నాను - ఇంకా కొంచెం వివరంగా చెప్పండి.'

'చెబుతాను - చెప్పబోతున్నాను - ఇందులో భరించరానిదేమీలేదు కూడా.'

'ఏదైనా భరించగలను - ఫరవాలేదు చెప్పండి.'

'మా తల్లిగాదూ - మంచి ధైర్యమైనమాట చెప్పావు - ధైర్యస్థురాలివి. దీంట్లో ఏముంది - కేవలం వ్యాపార విషయం - వ్యాపారవిషయంగానే ఆలోచించు - వ్యాపార వ్యవహారంగానే నిర్వహించాలి; ఇక, ఆ డాక్టరుభార్య, ఎంతో ధైర్యసాహసాలుగల ఇల్లాలే అయినా, ఆ బిడ్డ గర్భంలో వున్నంత కాలం, భర్తకోసం ఎంతో పరితపించి వేదనపడ్డదనుకో-

'ఆ బిడ్డ ఆడపిల్లేనాసర్?' -

'ఆడపిల్లే! - అంతా వ్యాపార వ్యవహారం - అనవసరంగా దిగులుపడకు. ఆ యిల్లాలు, తన మనోవేదనంతా బిడ్డకు సంక్రమింప చెయ్యగూడదనే ఉద్దేశంతో, సొంతం చనిపోయాడనే అభిప్రాయాన్ని కలుగజేసి బిడ్డను సాక్కురావటానికి ప్రయత్నించిందనుకో, ఉండుండు! అలా నా కాళ్లమీద పడకు! నిజానికి దీన్లో నీవు నా కాళ్లమీదపడవలసిన అవసరమేముంది!'

'ఓ పరమకారుణికుడా! - నీ ఋణం నే నెలా తీర్చుకోగలను?' -

'ఇది వ్యాపార వ్యవహారం - నువ్వు నన్ను అయోమయం చేస్తున్నావ్! - నాకు మతిపోతే ఈ వ్యవహారాలన్నీ నిర్వహించేదెలా? - మనకు నిర్మలమైన మనస్సులుంటేగాని పనిసాగదు. ఆగు - నీ మనస్సు సరీగా వుందో లేదో పరీక్ష చెయ్యాలి - తొమ్మిదితొమ్ముదులెంత? 20 గినీలకు ఎన్ని షిల్లింగులు?'

ఆవిడ యీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. అతని మణికట్లను పట్టుకున్న చేతుల వణుకు మాత్రం కొంచెం తగ్గింది. దాంతో జర్విస్ లారీకి కాస్త ధైర్యంచిక్కి:'

'మంచి తల్లివి - ధైర్యస్థురాలివి - బాగుంది' - అంతా వ్యవహారం, దీంట్లో ఏముంది? - లాభదాయకమైన వ్యాపారం. ఆవిధంగా యేర్పాటు చేసింది మీ అమ్మ అనేకరోజులు, భర్తకోసం వెతికివెతికి నిరాశచేసుకుని ఆ మనోవ్యాధితోనే చనిపోయింది. నీవు అప్పటికి రెండేళ్ల పసిగుడ్డువు; ఏవిధమైన చింతా లేకుండా నువ్వు సుఖంగా పెరిగి పెద్దదానివి కావాలనుకుంది. నీ తండ్రి యే అజ్ఞాతంలోనో జీవచ్ఛవంగా మరణయాతనను అనుభవించుతూ వుండవచ్చుననే ఊహలను నీకు అందజేసి - నీ ముఖం ఆ దుఃఖ రేఖలతో కావురు వేసిపోయేట్టు చేయటం ఆవిడకి యిష్టంలేకపోయింది.

ఈ మాటలు చెబుతూ జాలిగా ఆ స్త్రీ బంగారు జుట్టువంక మెచ్చుకోలుగా చూస్తున్నాడు. అలా జరిగివుండకపోయినట్లయితే, ఈపాటికి ఈ అందాలజుట్టులో తెల్లవెంట్రుకలు పొటమరించేవే అనుకున్నాడు.

'మీ తల్లితండ్రులకు పెద్దఆస్తీ యేమీ లేదు; కాస్తో కూస్తో వున్నది యేవింటో మీ అమ్మకూ నీకు సంక్రమించేవుంది. ఇప్పుడు - డబ్బుకు సంబంధించిగాని, ఆస్తిపాస్తులను సంబంధించిగాని కొత్తగా బయటికొచ్చిన విషయాలేమీ లేవు - కాని' -

అతని మణికట్టుమీద, ఆ స్త్రీ వ్రేళ్లు బిగుసుకున్నయ్ - అతను ఆగిపోయాడు. ఆ స్త్రీ నుదురుమీద భయాందోళనలు చీకట్లుగా క్రమ్ముకున్నయ్.

'కాని ఆయన - ఆయన ఆచూకీ తెలిసింది. సజీవుడై వున్నాడు. చాలా మారిపోయాడు-శిథిలుడు; త్వరలో మంచి స్థితికి రాగలడనే ఆశించుదాం, ప్రాణాలతో వున్నాడుగదా! నీ తండ్రి యిప్పుడు, పారిస్‌లో ఆయన తాలూకు ఒక పాతనౌకరు యింట్లో వున్నాడు. అక్కడికి జేర్చారు; మనం యిప్పుడు అక్కడికి పోతున్నాం; ఆయన్ను నేను గుర్తించి ఆ మనిషేనని రూఢిచేయవలసి వుంది; నీవు నీ ప్రేమానురాగాలు చూపించి తగిన సేవచేసి, ఆయన్ను సజీవుణ్ణిగాజేసి పునర్జన్మనీయవలసి వుంది.'

ఆ స్త్రీ సర్వావయవాల్లోనూ ఒక చలిగుబులు వ్యాపించిపోయింది. భయావేశాలు ముప్పిరిగొన్న రుద్ధకంఠంతో, కళ వళంగా:

'ఆయన భూతాన్ని చూడబోతున్నాను - ఆయన కంకాళ రూపాన్ని చూడబోతున్నాను?-ఆయన్ని కాదు!' -

'ఎందుకు తల్లీ విచారిస్తావ్? - మంచీ చెడూ అంతా చెప్పేశాను. అనేక అన్యాయాలకు గురియై నరకయాతనలనుభవించి కూడా యింకా సజీవుడైవున్న నీ తండ్రిని నీవు ఆదరించబోతున్నావ్. మార్గమధ్యలో వున్నాం. సముద్రం పక్కనుంచి ఆ పక్కకు జేరామంటే చాలు; వెంటనే ఆయన్ను చూడగలుగుతావు.'

'ఆయన విషయమే తెలియని అజ్ఞానంలో ఇంతకాలం ఇలా సుఖంగా బ్రతుకుతున్నాను.'

'ఇంకొక్క సంగతి చెప్పవలసివుంది. ఆయన, ప్రస్తుతం, మరో మారుపేరుతో వున్నారు. ఆయన అసలు పేరు యేనాడో మరుగునపడిపోయింది. దాన్ని గురించి భోగట్టాచెయ్యటం, ఎవరెవరి కుట్రలవల్ల యేయే ఖైదుల్లో బాధలు పడ్డాడో విచారించటం, ఇదంతా ఇప్పుడు అనవసరం అన్నమాట అలా వుండగా, చాలా ప్రమాదకరం. ఈ విషయం, యే సందర్భంలోనూ, ఎక్కడా బయటికి పొక్కనీయగూడదు. ఇప్పుడు జరుగవలసిందల్లా - ఏ విధమైన అలజడీ లేకుండా, ఆయన్ను యేదో విధంగా, ఫ్రాన్సునుంచి నెమ్మదిగా యివతలికి తీసుకువచ్చెయ్యడం. ఇంగ్లీషువాణ్ణీ, టెల్‌సన్సు బ్యాంకు ఉద్యోగిని కావటంచేత వ్యక్తిగతంగా

నాకేమీ ప్రమాదం తటస్థించే అవకాశంలేకపోయినా, ఈమాట యెక్కడేనా ఎత్తానంటే, నా పీకమీదికి కూడా వస్తుంది. ఈ వ్యవహారానికి సంబంధించిన ఇంత చిత్తుకాయితం ముక్క కూడా నేను వెంట తీసుకురావటం లేదు. నా అభిజ్ఞాపత్రాలూ, అధికారపత్రాలూ అన్నీ "పునర్జన్మ" అనే ఒక్క సాంకేతికపదంలో ఇమిడి వున్నయ్. దాని అర్థం ఏదైనా కావచ్చు - అమ్మాయ్!' -

అతను చెప్పినమాటల్లో ఏ వొక్కటీ ఆవిడ చెవులబళ్ళేదు. కుర్చీలో కూర్చున్నది కుర్చీలోనే స్థాణువులా గడ్డ కట్టుకుపోయింది. మన స్పృహలో లేదు. తెరచినకళ్లు తెరిచినట్టుగానే వున్నయ్; చూస్తున్న చూపులు, చూస్తున్నట్టుగా అలానే నిలబడిపోయినై- చిత్రపటంలోని రేఖలు మాదిరిగా. అతని మణికట్టును పట్టుకునివున్న వ్రేళ్లు అలానే బిర్రబిగుసుకుపోవటంచేత, విదిలించుకోవటానికి ప్రయత్నించితే విరిగిపోతాయేమోనని భయంవేసి, అలాగే నిల్చుని కంగారుగా అరిచేశాడు.

ఆ కేకలువిని, ఒక స్త్రీ లోపలికి పరుగెత్తుకొచ్చి లారీవంక తినేసేటట్టు ఉరిమిచూచింది. ఎర్రటి ఉక్కుదేహం; రాగిజుట్టు; తొడుక్కున్న దుస్తులు శరీరంచుట్టూ రబ్బరుతొడుగులా కదనొక్కుకునుంది. లోపలికి వచ్చీ రావటమే లారీ ఛాతీమీద చెయ్యివేసి ఒక తోపుతోసింది. ఆ దెబ్బతో గాలిలోకి యెగిరి వెనకనున్న గోడకుపోయి కొట్టుకున్నాడు. 'అయ్యో బాబోయ్! యిది ఆడది కాదల్లేవుంది' అనుకున్నాడు లారీ, గోడపక్కని కుదబడి నడుం సవరించుకుంటూ.

ఆ స్త్రీ, చుట్టూ మూగిన నౌకర్లవంక చూసి అరుస్తోంది:

'ఏంవిట్రా వెధవల్లాలా! అట్టా తెల్ల మొహాలు వేసి నావంక చూస్తున్నారేం? నా మొహానేవన్నా నక్షత్రాలు మొలిచినయ్యా? ముందు పరుగెత్తరేం? స్మెల్లింగ్ సాల్ట్ తీసుకురండి- ఒరేయ్ ముందు చన్నీళ్లుతే - సారాసీసా ఎక్కడరా?' -

ఆ స్త్రీ స్పృహతప్పివున్న ఆ యువతిని తీసుకుపోయి సోఫామీద పడుకోబెట్టి - 'నా కనకమే! నా కాసులే!' అంటూ లాలించుతోంది.

'ఇదిగో! ఇటు చూడు!' - లారీవంక చూసి గర్జించింది. 'నీకు మతుందా లేదా! ఆ చెప్పే దేవింటో శాంతంగా చెప్పగూడదూ - పిల్లని హడలగొట్టి ప్రాణాలమీదికి తేకపోతే?- ఇదేనా నీ బ్యాంకీ తెలివి? -

ఆ ప్రశ్నకి లారీ యేవిం సమాధానం చెబుతాడు? నోరు మూసుకు నిల్చున్నాడు. తన అవివేకానికి తనే లోలోపల ఎంతో బాధపడుతున్నాడు. ఇంతలోనే ఆ స్త్రీ, యాలగిలబడిపోయిన ఆ యువతిశిరస్సును ఆప్యాయంగా భుజంమీదికి తీసుకుని లాలించుతూ క్రమక్రమంగా స్పృహలోకి తీసుకువస్తోంది.

'ఇక ఫరవాలేదనుకుంటాను' అన్నాడు, లారీ, గజగజలాడుతూనే.

'చాల్లే నిరవాకం - బలేవాడివి -'

'మీరు కూడా యీవిడతో ఫ్రాన్సుకు వస్తే బాగుంటుంది'

'ఎట్టాగూ వస్తాను ఒకరు చెప్పే దేవింటి - ఏవింటి నీ ఆలోచన - ఎక్కడికీ కదలకుండా ఈ లంకలోనే పడుండాలని దేవుడు నా నొసట వ్రాశాడంటావా యేవిటి?'

మరో గడ్డుప్రశ్న - వ్రాశాడో లేదో ఆ విషయం లారీకి మాత్రం ఏవిం తెలుసు? నోరు నొక్కుకుని దూరంగా పోయి నిల్చున్నాడు.

6

ఒక పెద్ద సారాజాడి వీధిలోపడి భళ్ళున పగిలింది. జాడీని బండిమీదనుంచి క్రిందికి దించుతుండగా, దొర్లి రోడ్డుమీద పడ్డది. సారాదుకాణం గుమ్మంలోనే ఈ సంఘటన జరిగింది.

చుట్టూవున్న జనమంతా, పనిపాటలకు సోమరితనానికీ స్వస్తిజెప్పి, ద్రాక్షాసారా ఏ గుక్కెడయినా దక్కుతుందనే ఆశతో ఈగల్లా ముసిరారు. ఆ ప్రదేశంలో, రోడ్డు, కంకరరాళ్లు కోనుల్లా బయటికి పొడుచుకొచ్చి, దారినిపోయేవాళ్లందరికాళ్లూ విరగ్గొట్టాలనే వుద్దేశంతో వేసినట్టుగావుంది. ద్రాక్షసారా ఆ కంకర్రాళ్ళచుట్టూ జలజలా ప్రవహించి మడుగులు గడుతోంది. ఒకొక్క మడుగుచుట్టూ ఒకొక్క గుంపు జేరారు. ఒకొళ్ళనొకళ్లు మోచేతుల్తో పడదోసుకుంటున్నారు. కొంతమంది మగాళ్ళు, మోకాళ్ల తండావేసి సారా దోసిళ్ళతోయెత్తి తాగుతున్నారు. తమ భుజాలమీదకు వంగి వెనకతట్టున నిల్చునున్న యువతీ రత్నాల నోళ్లకు అందించుతున్నారు. మరికొంతమంది జాడీ పెంకుల్లోకీ, కుండ పెంకుల్లోకీ, సారా పట్టుకుని కుక్కల్లా కతుకుతున్నారు. కొంతమంది తల్లులు, నెత్తిమీది రుమాలుగుడ్డలుతీసి సారాలో తడిపి పసిపిల్లల నోళ్లల్లో పిండుతున్నారు. ఇంకా కొంతమంది రోడ్డు మీద సెలయేళ్లు గడుతున్న సారా ప్రవాహాలకు మట్టి అడ్డంపోసి ఆనకట్టలు కడుతున్నారు. ఇంకా కొంతమంది జాడీ పెంకులు నాకుతున్నారు. మరికొంతమంది సారాతో తడిసిన తడిమట్టిని చప్పరించుతున్నారు - కాస్త రుచైనా తగులుతుందని; రోడ్డుమీద సారా అంతా ఆఖరైపోయింది. సారాతోపాటు మట్టికూడా చాలావరకు అదృశ్యమైపోయింది- పాకీవాడు ఊడ్చుకుపోయినట్టు.

ఈ సారాఉత్సవం సాగినంతసేపూ - రోడ్డంతా కోలాహలంగా వుంది. ఆడా మగా, పిల్లాజల్లా ఉల్లాసంగా కేకలు బెడుతూ సరససల్లాపాలలో మునిగి తేలారు. పరస్పరాభినందనాలూ, పరస్పరాలింగనాలూ, ముద్దులూ, ముచ్చట్లూ, కొట్టి కోలాహలంగా వుంది.మందిమీద ఆనందోత్సవం - ఒకళ్ల చేతులొకళ్లు పుచ్చుకుని బృందనృత్యాలు చేస్తున్నారు. ఈ ఉత్సవ కోలాహలం ఎంత హఠాత్తుగా ఆరంభమైందో, మళ్లా అంత హఠాత్తుగానూ ఆగిపోయింది. ఎక్కడివాళ్ళక్కడ వెళ్ళిపోయారు. అంపాన్ని కొయ్యచెక్కలో ఆపళంగానే వదిలేసివచ్చిన మనిషి, తిరిగి వెళ్లి అంపంకోత ప్రారంభించాడు. తిండీ తిప్పలూ లేక నరాలు పీక్కుపోయి తీపులు పెడుతుంటే, ముంతలో నిప్పులుబోసి తనవళ్లూ, బిడ్డవళ్ళూ కాచుకుంటూ కూర్చున్న పేదరాలు, కుండ గుమ్మంలో పారేసి సారాఆశతో పరుగెత్తుకొచ్చింది. తిరిగివెళ్లి చూచుకుంటే కుండలో బొగ్గులు చాలా వరకు చల్లబడిపోయినై. చింకి గుడ్డలతోనూ, జీబుతలలతోనూ నేలమాళిగల నుంచి ఎలుకల్లా పరుగెత్తుకొచ్చిన నిర్భాగ్యులంతా, ఎక్కడి వాళ్ళక్కడ మళ్ళా కలుగుల్లోకి వెళ్లిపోయారు. తిరిగి ఆ ప్రదేశమంతా విషాద మేఘాలు ఆవరించి జిమ్ముమనిపోయింది. వెలుగురేఖలకంటే, అంధకారచ్ఛాయలే ఆ ప్రదేశానికి సహజంగా కనుపించుతున్నయ్.

ఎఱ్రటి ద్రాక్షాసవం - ఆ సారాతో తడిసి, పారిస్‌లోని సెయింట్ ఆంటోనీ వీధి మరకలైపోయింది. అనేకమంది చేతులూ, ముఖాలూ, పాదాలూ, కొయ్యచెప్పులూ, అన్నీ ఎఱ్రబడిపోయినై. అంపంకోతగాడి చేతిలోవున్న రంపపు పిడి ఎఱ్రబడిపోయింది. తలకు చుట్టుకున్న రుమాలు ముందుకుపడి, బిడ్డకు పాలిస్తున్న తల్లి నుదురు ఎఱ్రబడిపోయింది. ఆశగా జాడీ పెంకులు నాకిన కొందరి మూతులు, పెద్దపులి నోళ్లల్లా జేవురించిపోయినై. ఒక విదూషకుడు ఒక గోడమీదికి ఎగబ్రాగుతున్నాడు. అతని తల, మురికి సంచీలా వున్న టోపీలో వుండటానికి నిరాకరించి బయటికి విప్లవించుతోంది. అతని వ్రేళ్ళకు అంటివున్న సారాజిడ్డుతో గోడనిండా మరకలైనై - రక్తం!

ఆ రకం, సారా కూడా నడివీధి కంకరరాళ్లలో ప్రవాహాలు గట్టవలసిన తరుణం ఆసన్నమౌతోంది. ఆ మరకలతో అనేకమంది చేతులూ ముఖాలూ మలినం కావలసిన రోజులు చేరువౌతున్నయ్.

ఇక యిప్పుడు - సెయింట్ ఆంటోనీ ముఖాన విషాద మేఘాలు ఆవరించివున్నయ్. చలి, మురికి, రుగ్మత, అజ్ఞానం, ఆకలి - ఈ నీచదేవతలు ఆయనచుట్టూ పరివేష్ఠించి వున్నారు. మిల్లురాళ్ళలో అరిగిపోతున్న జనం, ప్రతి వీధిమెుగనీ నిల్చుని చలికి గజగజలాడుతున్నారు. ప్రతి ద్వారంలోనుంచీ బయటికి వస్తున్నారు. ప్రతి ద్వారంలోనుంచీ లోపలికి వెడుతున్నారు; విరిగిపోయిన కిటికీచువ్వల మధ్యనుంచి తొంగిచూస్తున్నారు. గాలికి కదలిన ప్రతి చింకిగొంగడిలోనూ గిజగిజలాడుతున్నారు. వాళ్ళని అరగదీస్తున్న మిల్లు ముసలాళ్ళను పడుచువాళ్ళను చేసేది గాదు; పడుచువాళ్ళను ముసలివాళ్లుగా తయారుచేసేది. పిల్లల ముఖాలన్నీ పితాళ్లముఖాలు; కంఠాలన్నీ రుద్దకంఠాలు. ప్రతి ముఖంలోనూ, ప్రతి ముఖంమీది ముడతలోనూ ఒకే లిపి: “ఆకలి.” ఆకలి, ఆకలి, ఆకలి - సర్వత్రా ఆకలిమయం. బారకాసులన్నీ ఆకలి; కొంపలూ, గోపికెలూ, గుడిసెలు, వెలిసెలు ఆకలికడుపుల కిటకిట. దణ్ణాలమీద ఆరేసివున్న చింకిగుడ్డలనిండా ఆకలి చాలికలు; తక్కూ దుత్రా - గడ్డీ - పీలికలూ కాయితం ముక్కలూ అతుకేసివున్న చింకిబొంతలనిండా ఆకలిముద్రలు; పొగరాని పొగగూళ్ళలోనుంచి ఆకలి తొంగిచూస్తోంది; రొట్టెల దుకాణం బీరువాలమీద అదే ప్రకటన- “ఆకలి”. మురిగి వాసన గొడుతున్న ప్రతి చిన్న రొట్టెమీదా అదే ముద్ర; ప్రతిపులుసు దబరాలోనూ ఆకలి. తైలం లేకుండానే వేగుతున్న ప్రతిబంగాళా దుంపముక్కలోనూ, అణువణువణువూ, ఆకలి పిడుగై పెఠిల్లుమని పేలుతోంది.

అవకాశమున్న చోటల్లా ఆకలి వ్యాపించుతోంది. సందులు, గొందులు, ఇళ్లు వాకిళ్లు, మురికిగుడ్డలు, ముంజుటోపీలూ, సర్వత్రా; ఆ చింకి బొంతల మురికిజనం విడుస్తున్న నిశ్వాసాలతో వాయుగర్భం ఊద రెత్తుతోంది. తిరుగబడి కళ్లు పీకాలనే మృగ స్వభావం, కొలిమి గుండాల కావురులా వాతావరణమంతా అలుముకుంటోంది. ఆరిపోయిన కొలిమిగుంటల్లా, దిగులుగా దించుకుపోయినా ఆ కళ్లల్లో అగ్నికణాలు అంకురించుతున్నయ్. బాధను ఓర్చుకోవటానికి పంటితో నొక్కిన పెదవిమీద, కాటువెయ్యాలనే కచ్చ, కోరలా మెరుస్తోంది. సహించటమా, దెబ్బతియ్యటమా అన్న సందిగ్ధాలోచనలో వున్న నుదురులమీది ముడతలు, ఉరికంబాల త్రాళ్లలా పీటముళ్ళు పడుతున్నయ్. మాడు చెక్కలూ మంచి నీళ్ళూ ముందు బెట్టుకున్న నిర్భాగ్యులు ఎఱ్రటి ద్రాక్షాసవం త్రాగాలని దాహంగా ఆలోచిస్తున్నారు. ఒకరి చెవిలో ఒకరు ఈ ఆలోచనలను ఎలుగుగొడ్లులా గుసగుసగా చెప్పుకుంటున్నారు:

ఈ గుజగుజలన్నీ లోలోపలే; పైకిమాత్రం ఏ అలజడి లేదు; కాని, సానలమీది కత్తులు, సరసరా పదునెక్కుతున్నయ్. కమ్మరివాడి సమ్మెట, గదలా బరువెక్కుతోంది; తుపాకుల కార్ఖానాలో హననశక్తి అంకురించుతోంది; రోడ్లప్రక్కనున్న పేవుమెంట్లన్నీ ఛిన్నాభిన్నమై నడవటానికి వీలులేకుండా కుక్క గోతులైనై. మరిక్కాలవ కట్టలు తెగి ముందున్న రోడ్డుమీదికి ఎగబడుతోంది. పట్టుమని పదిచినుకులు పడితే, ఇదేవిటదేవిటని యిళ్లల్లోనే జొరబడుతోంది. రోడ్డుకు అడ్డంగా కట్టివున్న తీగ మధ్య వ్రేలాడుతున్న, వీధిదీపం, మినుమినుకుమంటూ వెలుగుతూ అటూ యిటూ ఊగిసలాడుతోంది. సముద్రంమీద ప్రయాణం చేస్తున్నట్టనిపిస్తోంది, రోడ్డుమీదపోతున్న జనానికి. అవును నిజంగా సముద్రమధ్యంలోనే వున్నారు - ఓడా, నావికులూ కూడా తుపాను ప్రమాదంలో చిక్కుబడిపోయారు.

అవును అలాంటి సమయం రాబోతోంది. వీధి దీపానికి బదులు, మానవప్రాణాలను వ్రేలాడదీసే సమయం ఆసన్నమౌతోంది. ఫ్రాన్సుగడ్డమీద తుపాను రేగబోతోంది. కాని ఆకాశాన ఎగురుతూ అందాలపాటలు పాడుతున్న, రాయంచగములు వొళ్లు తెలియని తమందంలో ఉల్లాసంగా కేరిసలు కొడుతున్నయ్.

ఆకుపచ్చని లాగూ, పసుపుపచ్చని వెయిస్టుకోటూ, తొడుక్కుని ఆ సారాదుకాణం యజమాని దుకాణం గుమ్మంలో నిల్చున్నాడు - రోడ్డుమీద సాగుతున్న సారా మహోత్సవాన్ని తిలకించుతూ అంతా అయిపోయిన తరువాత భుజాలు ఎగరేసి: ‘ఆ వ్యవహారంతో నాకేమీ సంబంధం లేదు. జాడీ పగలగొట్టుకుంది మీరే - మరోజాడీ తెస్తే తేండి లేకపోతే లేదు - నేను మాత్రం అచ్చుకోను’ అని, బండిమీదినుంచి జాడీలు దింపుతున్న వాళ్ళను హెచ్చరించాడు. ఇంతలోనే గోడమీద ఎఱ్రగీతలు గీస్తున్న ఒక విదూషకుడు అతని కంటబడ్డాడు. ‘అరె బాబా! ఏవిట్రా అదీ - అక్కడేం చేస్తున్నావ్?’ -

విదూషకుడు ధీమాగా నిల్చుని గోడమీది అక్షరాలు చూపించాడు.

‘ఏవిట్రా? - పిచ్చాసుపత్రికి పంపించాల్సిన బాపతాఏవిటి? అంటూ పరుగెత్తుకెళ్లాడు దుకాణదారు: ఇంత బురద తీసుకుని అక్షరాలమీద పులిమాడు: ‘నడివీధి గోడలమీదరా ఇలాంటి మాటలు రాసేదీ? - నీకు మతుందా లేదా?’

ఇలా మందలించుతూనే, (ఆదమరుపునో యేమో) విదూషకుడి గుండెలమీద చెయ్యి వేశాడు. విదూషకుడు అమాంతం విదిలించికొట్టి ఒక్క గెంతుగెంతి కాలినున్న చెప్పు చేతిలోకి తీసుకుని సన్నద్ధుడై నిల్చున్నాడు.

‘ఏడిశావుగాని తెలివితక్కువ దద్దమ్మా - కాలికి తొడుక్కో’ అంటూ తిరిగి సలహాయిచ్చాడు విదూషకుడికి. మరకైనచెయ్యి, విదూషకుడి గుడ్డలికే తుడిచి రోడ్డుమీది కెక్కి తిరిగి దుకాణం దగ్గిరకొచ్చాడు.

దుకాణదారు ఎద్దుమెడ మనిషి; వయస్సు ముప్ఫయి సంవత్సరాలు; మంచి ఉష్ణతత్వంమనిషై వుండాలి - ఎంచేతనంటే - అంత గొడ్డుచలిగావున్నా, కోటు తొడుక్కోలేదు.

ఊరికే భుజానికి తగిలించుకు తిరుగుతున్నాడు. చొక్కా చేతులు కూడా, మోచేతులవరకూ మడిచివున్నయ్. నెత్తిమీద కూడా, ఉంగరాలు చుట్టుకున్న జీబువెంట్రుకలు మినహా, మరో యితర ఆచ్ఛాదనేమీ లేదు. పెద్దపెద్దకళ్లు; బాగా దమ్ముబట్టి గాలిపీలుస్తాడు. సర్దామనిషేగాని మొండిరకం. ఏమైనాసరే పట్టినపట్టు విడిచే తత్వంకాదు. ఇరువైపులా అగాధాలుండి మధ్య ఇరుగ్గా వున్న బాటమీద అతనికి ఎదురు తారసిల్లటం మంచిదిగాదు– ఏది ఏమైనా ప్రక్కకు తప్పుకోడు.

అతనిభార్య, మాడమ్ డిఫార్జ్, దుకాణంలో అమ్మకంబల్ల దగ్గిర కూర్చునుంది. ఇంచుమించు అతని వయస్సులోనే, లావాటి గుండ్రని మనిషి; ఎప్పుడూ ఎటూ చూడనట్టు కనుపించుతుంది గాని, ప్రతి విషయాన్నీ అతిజాగ్రత్తగా పరిశీలించుతూ వుంటుంది. వ్రేళ్లనిండా చిక్కిరొక్కిరిగా రాళ్ల ఉంగరాలు; నిమ్మకు నీరెత్తినట్టు నిబ్బరమైన ముఖం. అసలు మనిషిలోనే అలాటి స్థాయీభావం వుంది. మంచి లెక్కమనిషి; డబ్బు లెక్క జూడటంలో తనకు నష్టంవచ్చేలాగు తభావతు ఎప్పుడూ రానియ్యని నిర్దుష్ట శీలంగల వ్యక్తి. చలికి ఓర్చుకోలేదు – అంచేత పెద్ద ఫర్‌కోటు తొడుక్కుంది. చెవులకున్న రాళ్ళదుద్దులు మాత్రం కనుపించేలా వదిలి, నెత్తిచుట్టూ, ఎర్రటి శాలువా చుట్టుకుంది. చేతిలోవున్న కుట్టుసామాను, ముందున్న బల్లమీదబెట్టి, ఇత్తడి ముల్లుతో పళ్లుకుట్టుకుంటోంది. ఎడంచెయ్యి కుడిమోచేతికి పోటీ అని, విరామభంగిమంలో కూర్చునుంది. భర్త లోపలి కొచ్చాడు. అతిన్ని ఏవీం పలకరించలేదు. కాని ఒక చిన్ని పొడిదగ్గు దగ్గింది. అతను తల పైకెత్తి చూచాడు. నల్లగా తీర్చిదిద్దినట్లున్న ఆ స్త్రీ కనుబొమలు జలగలు సాగినట్లు కనుకొలకుల్లోకి సాగి, మళ్లీ వెనక్కి వెళ్లిపోయినై. 'ఈ కూర్చున్న వాళ్ళల్లో నువ్వు బయటికి వెళ్లిన తరువాత లోపలికి వచ్చిన కొత్తవాళ్లెవరేనా వున్నారేమో చూడు' అని, ఆ కనుబొమల విన్యాసానికి అర్థం.

భార్య ఆదేశానుసారం అతను ఆ హాలంతా ఒక పర్యాయం అటునించి ఇటు కలియజూచాడు. మూలగావున్న ఒక బల్ల దగ్గిర, తల నెరసిన ఒక పెద్దమనిషీ, పడుచు వయసులోవున్న ఒక యువతీ కనుపించారు. మిగతావాళ్లంతా పాతవాళ్లే; వాళ్లలో ఇద్దరు చీట్లపేక వేస్తున్నారు; యిద్దరు పాచికలాడుతున్నారు. మరో ముగ్గురు అమ్మకం బల్లదగ్గిర నుంచుని గ్లాసుల్లోవున్న సారా, కాస్త్రా కాస్తే నెమ్మదిగా గుటకలు వేస్తున్నారు. దుకాణదారు అమ్మకం బల్లప్రక్కకు రాగానే, మూలనున్న ఆ వృద్ధుడు, ప్రక్కనున్న యువతితో నెమ్మదిగా "అతనే ఆ మనిషి" అన్నాడు. ఆ మాటలు మాన్సియర్ డిఫార్జ్ చెవులబడ్డయ్. 'ఎవడబ్బా ఈ కిరాతుడూ! ఎప్పుడూ చూళ్లేదే' అనుకున్నాడు, డిఫార్జ్ లోలోపల.

కాని డిఫార్జ్ ఆ క్రొత్తవాళ్లిద్దర్నీ చూడనట్టు నటించాడు. కౌంటర్ దగ్గిరున్న మూర్తిత్రయంతో బాతాఖానీ మొదలెట్టాడు.

'ఏవిఁటి కబుర్లు భయ్యా!' అని మాన్సియర్ డిఫార్జ్‌ని పలకరించాడు. వాళ్లల్లో ఒక ప్రబుద్ధుడు: 'ఒలికిపోయిన సారా యావత్తూ నాకేశారా?'

'చుక్క లేకుండా' –

ఈ సంభాషణ విని, మాడమ్ డిఫార్జ్ హెచ్చరికగా మళ్లీ ఒక చిన్నిదగ్గు దగ్గింది – కనుబొమలు ఎత్తేస్తూ.

రెండోవాడు అందుకున్నాడు : 'ఈ బైతు లెప్పుడేనా సారామొహం చూసిన జంతువులైతేగా – చావు చాకిరీ, మాడు రొట్టెలూ – వీళ్ల బ్రతుక్కు సారా ఎక్కడేడిసింది– ఏవంటావు భయ్యా?' –

'అవున్లే తమ్ముడూ' – డిఫార్జ్.

పళ్లు కుట్టుకుంటున్న పడతీరత్నం మళ్ళీ ఒక దగ్గు దగ్గింది.

మూడోవాడు అందుకున్నాడు – 'ఎప్పుడూ ఎరగని యీ పశువులకు ద్రాక్షాసవం నాలిక్కి తగిలితే యేవిటి మరి! – ఏవంటావు భయ్యా?' –

ఇక లాభంలేదని గమనించి, మాడమ్ డిఫార్జ్ చేతిలోవున్న పళ్లుకుట్టుముల్లు బల్లమీదపెట్టి, కుర్చీలో ఇటునుంచి అటు అలజడిగా మెసిలింది.

'అవును, సరే, – ఇక ఆపండి' అన్నాడు డిఫార్జ్ : 'ఈవిడ నా భార్య' అంటూ తన భార్యను ఆ మూర్తిత్రయానికి పరిచయం చేశాడు.

ఆ ముగ్గురూ ఒక్కసారి నెత్తిమీద టోపీలుతీసి ఆ మహిళా రత్నానికి జోహారులు పచరించారు. ఆవిడ వాళ్ళ ఆనతులు అందుకుని బల్లమీదవున్న కుట్టుసామాను చేతిలోకి తీసుకుంది; నిర్లక్ష్యంగా కూర్చుని తనపని తను చూసుకుంటోంది.

డిఫార్జ్ మూర్తిత్రయంవంక తిరిగి : 'బ్రహ్మచారులు విశ్రాంతి తీసుకునే హాలు, రెండో అంతస్తుమీద వుంది – ఇలా ఎడంచేతివేపుగా వెడితే మేడమెట్లు కనుపించుతై – శుభం – వెళ్లిరండి' అన్నాడు.

సారాబిల్లులు చెల్లించి, ఆ ముగ్గురూ బయటికి వెళ్లిపోయారు. దుకాణదారు తన భార్య కుడుతున్న లతవంక చూస్తూ అక్కడే నిల్చున్నాడు. ఇంతలో మూలనున్న ఆ వృద్ధుడు నెమ్మదిగా అతని దగ్గిరికి లేచొచ్చి :

'చిన్నమాట! –' అన్నాడు.

'చిత్తం' అంటూ, డిఫార్జ్, నాలుగైదు అడుగులు ఆ ముసలాయనతోపాటు యివతలికి గుమ్మంవేపుకు నడిచాడు.

సంభాషణంతా ఒక్క క్షణంలో ముగిసిపోయింది. ఆ ముసలాయన అతని చెవిలో ఏదో ఒకమాట ఊదాడు. దాంతో డిఫార్జ్ సర్వం గ్రహించేశాడు. తన వెంట రమ్మని సంజ్ఞచేసి బయటికి బయలుదేరాడు. ఆ ముసలాయన మూలనున్న ఆ యువతిని కూడా లేచిరమ్మని సంజ్ఞ చేశాడు. ఇద్దరూ కలిసి, డిఫార్జ్‌ని అనుసరించి బయటికి నడిచారు. మాడమ్ డిఫార్జ్ నిర్లక్ష్యంగా వాళ్ల వంకైనా చూడకుండా తనపని తాను చూసుకుంటోంది.

జర్విస్‌లారీ, మిస్ మానెట్ ఇద్దరూ సారాదుకాణంలో నుంచి దోడ్లోకి వచ్చి, మేడమెట్లదరవాజా దగ్గిర డిఫార్జ్‌ని కలుసుకున్నారు. చుట్టూవున్న గదుల్లో వందలూ వేలూ జనం నివసించుతున్నారు. కావలసినంత మురికివాసన. చవుడుగారుతున్న యిటుకల మెట్ల ముందు మోకాటితండావేసి, డిఫార్జ్, తన పాతయజమాని కుమార్తెకు జోహారు చేశాడు. ఆవిడ ముంజేయి పెదవులకు హత్తుకున్నాడు. ఈ మర్యాద యావత్తూ కేవలం లాంఛన ప్రాయంగా నిర్వహించాడు. మరుక్షణంలో, యథాపూర్వకంగా, అర్థంకాని ప్రమాదకరమైన కోపిష్ఠిమనిషిగా మళ్లీ మారిపోయాడు.

'చాలా ఎత్తు - ఎక్కటం మాటలుగాదు - నెమ్మదిగా రండి' - అంటూ నిలవడకుండా మేడ మెట్లమీదికి దారితీశాడు.

'ఒంటిరిగా వున్నారా?' లారీ గుసగుసగా అడిగాడు.

'ఒంటరిగా ఉండక! - అయ్యొ బాబోయ్! - ఆయనతో ఎవరుంటారు?' అతను అదే గొంతుతో సమాధానం చెప్పాడు.

'అయితే ఎప్పుడూ ఒంటరిగానే వుంటున్నారన్నమాట.' -

'ఆఁ'

'ఆయన కోర్కెమీదనే అలా వుంచారా?'

'ఆయన అవసరంకొద్దీ; వాళ్ళు నన్నుపిలిచి ఆయన్ను నాకు చూపించి, సాధకబాధకాలన్నీ నెత్తిన వేసుకోదలిస్తే, నువ్వు తీసుకువెళ్లొచ్చునన్నారు. సరీగా ఆ వేళ ఆయన్ను యే స్థితిలో చూచానో, ఇక్కడికి తీసుకువచ్చిన తరువాతకూడా అదేస్థితిలో అట్టే పెట్టాం.'

'ఆయన యిప్పుడు కొంచెం దారికి వచ్చివుంటారనుకుంటాను.'

'అయ్యొ బాబోయ్! - ఆయనలో మార్పా?' -

ఆ సమాధానంతో లారీ దిగ్గున దించుకుపోయాడు. ముగ్గురూ మెట్లెక్కుతున్నారు. మెట్లకు రెండువేపులా అనేక తలుపులూ కిటికీలూ వున్నయ్. గదులు వూడ్చిన పెంటపోగులన్నీ దరవాజాలలో నుంచీ కిటికీలలోనుంచీ మెట్లమీదే పారబోసివున్నయ్. ఆ పెంట పోగులన్నీ మురిగి, వాటిల్లోంచి బయలుదేరిన 'సువాసన' వాతావరణమంతా వ్యాపించి ఊపిరి తిరగకుండా వుంది. ఆ విషవాయు గర్భంలోనుంచి ఒకొక్కమెట్టే పైకెక్కుతున్నారు. తన మనస్సంతా వ్యాకులమైపోవటం మాట అలావుంచి, తన వెంట వున్న ఆ యువతిస్థితి మరింత ఆందోళనజనకంగా వుండటం గమనించి, లారీ పోతూపోతూ రెండుచోట్ల ఆగాడు. ఆ ఆగడం మెట్లమీది నుంచి అవతలికి పోవటానికి త్రోవలున్నచోట ఆగాడు. బయటి నుంచి రవ్వంత మంచిగాలి యేమైనా లోపలికి సోకి ఊపిరి తిరుగుతుందేమోనని ఆశపడ్డాడు. కాని ఆ దరవాజాలలో నుంచి మరింత మురికివాసన మెట్లమీదికి కొట్టడం మినహా ప్రయోజనం లేకపోయింది. తుప్పుపట్టిపోయిన కిటికీ చువ్వలలోనుంచి చూస్తుంటే, నాటర్ డేమ్‌టవర్ ఈమధ్య ఆరోగ్యకరమైన జీవితమంటూ, ఆశయాలంటూ చూపుమేరదూరంలో ఏమీ కనుపించటం లేదు.

ఏదో విధంగా నానా అవస్థపడి మేడమెట్ల చివరికి జేరుకుని మూడో పర్యాయం ఆగారు. అక్కడినుంచి పై మిద్దెమీదికి ఎక్కటానికి మరింత యిరుకుగావున్న మరో చిన్నిమెట్ల వరస ఎక్కవలసి వచ్చింది. మిద్దెమీది గదిముందుకు జేరగానే, డిఫార్జ్ కోటుజేబులు తడుముకుని ఒక తాళంచెవి బయటికి తీశాడు.

'ఏవిటి తలుపు తాళం కూడా వేసివుంచారా?' అన్నాడు లారీ, ఆశ్చర్యంగా.

'అవును' - డిఫార్జ్ ముక్తసరిగా సమాధానం చెప్పాడు.

'ఆయన్ను అలా తాళంవేసి వుంచటం అవసరమా?'

'అవసరమే అనుకుంటాను.'

'ఎందుకూ?'

'ఎందుకేవిటి? - ఆయన యిన్ని సంవత్సరాలుగా తాళం బెట్టివున్న గదిలో వుండటానికి అలవాటుపడ్డాడు - ఇప్పుడు తాళంగీళం లేకుండా తలుపులు బార్లగా తీసేస్తే- ఆయనకి కంగారెత్తిపోవచ్చు - పిచ్చెత్తవచ్చు - జుట్టు పీకేసుకోవచ్చు - చచ్చిపోవచ్చు - ఏ ప్రమాదమన్నా జరగొచ్చు' -

'నిజంగానా?'

'నిజంగానా అని నెమ్మదిగా అంటారేం? - జగత్తులో లక్షసంగతులు జరుగుతూండగా ఇదిమాత్రం ఎందుకు జరగ్గూడదు!'

ఈ సంభాషణ యావత్తూ మానెట్ కన్యకు వినబడకుండా చాలా రహస్యంగానే జరిగింది. కాని యీ వాతావరణంలో నుంచి నడుస్తుంటేనే ఆవిడకు మతిపోయింది. విభ్రమ భయాందోళనలతో ఆవిడమనస్సు కళవళించిపోతోంది. ఈ విషయాన్ని గమనించి లారీ ఆవిడకు కొంచెం ధైర్యం కలిగేలాగు ఇలా అన్నాడు :

'భయంలేదు తల్లీ! - మరేం ఫరవాలేదు - ఏముందీ, వ్యవహారం, ధైర్యంగా చక్కబెట్టుకోవాలి - క్షణంలో ఆందోళనంతా తీరిపోతుంది - నువ్వు ధైర్యంగల తల్లివి; ఆయన్ను లాలించి, సంతోషపెట్టి దారికి తెచ్చుకోగలవ్' -

తాళం తియ్యటానికి పూర్వం డిఫార్జ్ ప్రక్కనున్న పరంజా కన్నంలోనుంచి లోపలికి తొంగిచూచాడు. మళ్లా తలుపుదగ్గిర కొచ్చి తలుపుమీద రెండుసార్లు నెమ్మదిగా కొట్టాడు- తాళం చెవితో యిటూ అటూ నాలుగుసార్లు తలుపుమీద గట్టిగా గీశాడు - ఇదంతా, కేవలం కొంచెం అలికిడి చెయ్యాలనే ఉద్దేశంతో, తాళంచెవి లోపలికి దోపి బలవంతాన తిప్పాడు.

తలుపులు నెమ్మదిగా తెరుచుకున్నయ్. లోపలికి తొంగి చూసి యేదో అన్నాడు. లోపలనుంచి హీనస్వరంగా ఏదో సమాధానం వినిపించింది.

డిఫార్జ్ గడపలో నుంచుని, ఆ యిద్దర్నీ కూడా లోపలికి రమ్మని సంజ్ఞచేశాడు.

ఆ అమ్మాయి, బిక్క మొహంవేసి దించుకుపోవటం లారీ గమనించాడు. జాలిగా నడుంచుట్టూ చెయ్యివేసి ఆసరా యిచ్చి ముందుకు నడిపించుకుపోతున్నాడు.

'వ్యవ... వ్యవహారం తల్లీ!...' మాటలు తడబడ్డయ్ - కనుకొలకులవెంట నీటిబిందులు దిగజారినై, కేవలం వ్యవహారమే అయితే కన్నీటిబిందువు లేవిఁటో! - 'రా అమ్మా!రా! లోపలికిపద!'

'అమ్మో నాకు భయమేస్తోంది' - గజగజా వణుకుతోంది.

'ఎందుకూ?'

'మా నాన్నంటే భయంగా వుంది' - ఆవిడ మాట్లాడిన కంగారుచూసి లారీ ధైర్యం చెయ్యవలసివచ్చింది. అమాంతం పైకెత్తి భుజానవేసుకుని గిలగిలలాడుతుండగానే గదిలోకి నడిచాడు. గదిలోకి రాగానే క్రింద దించాడు. ఆ యువతి ఆయన్ని బల్లిలా కావలించుకు నిల్చుని, గజగజా వణుకుతోంది.

ముగ్గురూ లోపలికి వచ్చినతరువాత డిఫార్జ్ మళ్లా తలుపు మూసేసి, లోపల నుంచి తిరిగి తాళం వేసేశాడు. ఈ తాళంవెయ్యటంలో ఎంతశబ్దం చెయ్యటానికి వీలుంటుందో అంత శబ్దం చేశాడు. అనంతరం గదికి అడ్డంగా నడిచి లోపలున్న కిటికీ దగ్గరకి వెళ్లాడు. అక్కడ నిల్చుని వెనక్కు తిరిగి చూశాడు. నిజానికి, ఆ గది, కట్టెలూ బొగ్గులూ దాచుకోవటానికి కట్టిన చీకటికొట్టుగాని మనుషులుండటానికి కట్టింది గాదు. లోపలున్న కిటికీ కూడా చాలా చిన్నది. చలిగాలి లోపలికి రాకుండా వుండటానికి కిటికీ తలుపులు రెంటిలోనూ ఒకటి మూసేసి వుంది కూడా. లోపలికి వస్తూన్న వెలుగు చాలా స్వల్పకావటంచేత, లోపలికి వెళ్ళంగానే ఆ చీకటికొట్లో ఏమీ కనుపించదు. ఆ చీకటికొట్లో కూర్చుని ఏదైనా నాజూకైన పని చెయ్యాలంటే, ఎన్ని సంవత్సరాలుగానో అలవాటుంటేగాని సాధ్యంగాదు. అయినప్పటికీ ఆ చీకటికొట్లో అల్లాంటి నాజూకుపని కొంత సాగుతోంది. డిఫార్జ్ నిల్చున్నచోటుకు ముందుభాగంలో, సాంతం తల ముగ్గుబుట్టయిపోయిన ఒకవ్యక్తి, చిన్ని బెంచీమీద కూర్చుని తదేక ధ్యానంగా చెప్పులు కుడుతున్నాడు.

7

వంచిన తలయెత్తకుండా తదేకధ్యానంగా కూర్చుని చెప్పులు కుడుతున్న ఆ వ్యక్తిని, మాన్సియర్ ఢిఫార్జ్ నెమ్మదిగా పలకరించాడు :

'గుడ్ డే!'

ముగ్గుబుట్టలా నెరిసి పీచులురేగివున్న ఆ తల నెమ్మదిగా పైకి లేచింది; క్షణంసేపు నిర్ఘాంతపడి చూసి, 'గుడ్ డే!' అని గొణిగాడు, ఆ వ్యక్తి; ఏదో నూతిలోనుంచి మాట్లాడుతున్నట్లు అయోమయంగా, అస్పష్టంగావుంది, ఆ గొంతు.

'పాపం! - ఇంకా కష్టపడి పనిచేస్తూనే వున్నారు?' -

చాలాసేపటివరకు సమాధానం చెప్పలేదు. ఒక క్షణానికి నెమ్మదిగా మరో పర్యాయం తల పైకెత్తి :

'ఆఁ! - చేస్తున్నాను' -

ఆ సమాధానం చెప్పి డిఫార్జ్ వంక కాసేపు నిర్జీవంగా చూసి, మళ్లా తల దించేసుకున్నాడు.

ఆ హీనస్వరం వింటే, జాలీ, భయమూకూడా కలుగుతుంది; ఏళ్లతరబడి ఖైదులో వొంటరిగావుండి అనేక కష్టనిష్ఠురాలు అనుభవించివున్న కారణంచేత చిక్కి శల్యావశిష్టుడై వున్న మాట నిజమే అయినా, ఆ హీనస్వరం, కేవలం బలహీనత కారణంగా యేర్పడ్డదికాదు; సంవత్సరాల తరబడి పలకరించే దిక్కులేక మాట్లాడే అలవాటు తప్పిపోయింది; మానవ కంఠానికి సహజంగా వుండే జీవం, పలుకూ నశించి, ఏనాడో మాట్లాడిన శబ్దాల ప్రతిధ్వనిలా వుంది. పూర్వం ఒకప్పుడు ఉజ్వలమైన రంగులలో వుండి, కాలగతిని వివర్ణమై అస్పష్ట రేఖలుగా కనిపించుతున్న రంగుల చిత్రంగా వుంది. ఎడారిలో త్రోవతప్పిన బాటసారి, మరణావస్థలో కంఠగత ప్రాణంగా, కడసారి భార్యాబిడ్డలు తలపుకువచ్చి గుటకలుమ్రింగుతున్న అస్పష్ట శబ్దాల కళవళం.

'ఇంకా కొంచెం వెలుగు భరించగలరనుకుంటాను - కిటికీ ఇంకొంచెం తెరుస్తాను'-

'తెరిస్తే భరించవలసే వస్తుంది' అన్నాడా వ్యక్తి, దీనంగా.

అర్థార్థంగా తెరిచివున్న కిటికీ రెక్క డిఫార్జ్ మరికొంచెం తెరిచాడు. మరికొంత కాంతి లోపలపడ్డది. చెప్పులు కుడుతున్న ఆ వ్యక్తి యిప్పుడు ఇందాకటికంటే మరింత స్పష్టంగా కనిపించుతున్నాడు. చెప్పులు కుట్టే చిన్ని చిన్ని సామాన్లూ తోలు ముక్కలూ, ఆయన పాదాల దగ్గిర చిందరవందరగా పడున్నయ్.

తెల్లబడి, గిజిగాడి గూడులావున్న చిన్నిగడ్డం గొగ్గులు గొగ్గులుగా కత్తిరించివుంది. ఈచుకుపోయిన ముఖం, కొలిమిగుంటల్లా ఈ లోతుకు దించుకుపోయిన కనుగుంటల్లో కనుగుడ్లు నిప్పుకణికల్లా మెరుస్తున్నయ్. చికాగ్గా పీచులురేగి జీబూతంలా వున్న తలా, నల్లగా కావురేసిపోయిన కనుబొమ్మలూ కమ్మేస్తున్నయ్ గాని, లేకపోతే, బొమికెలు తేలి ముడుచుకుపోయిన ఆ ముఖంలో ఆ కళ్లు విశాలమైనవిగా కనుపించాలిసిందే. చినిగి వెలిసిపోయిన పసుపుపచ్చ చొక్కా కాలరులో నుంచి మెడ బొమికెలు బయటికి పొడుచుకొచ్చినై.

కిటికీ తెరిచేసరికి ఆ వెలుగు భరించలేక అరచెయ్యి కళ్లకు అడ్డం పెట్టుకున్నాడు. ఉల్లిపొరలా వున్న చర్మంలో నుంచి వెలుగు రేఖలు చొచ్చుకుపోయి అరచేతిలోవున్న బొమికెలు కూడా స్పష్టంగా కనుపించుతున్నయ్. ఏదైనా ధ్వని వినిపించితే ఆ ధ్వని యేవేపునుంచి వచ్చిందో, కాసేపు యిటూ అటూ పారజూచుకుంటేగాని గ్రహించలేడు. ధ్వనినీ ప్రదేశాలన్నీ సమన్వయం చేసుకునే శక్తి ఆయనలో సన్నగిలిపోయింది. ఆయన మాట్లాడనే మాట్లాడడు. అథవా మాట్లాడినా, మాట్లాడుతూన్న సంగతి మధ్యలో మరిచిపోయి మెదలకుండా ఊరుకుంటాడు.

'ఆ చెప్పులు యీ వేళ పూర్తి చేస్తారా?' అని ప్రశ్నించాడు డిఫార్జ్, దగ్గిరికి రమ్మని లారీకి కన్ను గిలుపుతూ.

'ఆఁ! - ఏవిటీ?' -

'ఆ చెప్పులు ఈవేళ పూర్తిచెయ్యాలనుకుంటున్నారా?'

'అనుకుంటున్నానేమో - చెప్పలేను - అనుకుంటున్నానల్లేవుంది - తెలీదు.'

ఆ అమ్మాయిని గుమ్మందగ్గిరే వదిలేసి, లారీ నెమ్మదిగా ముందుకొచ్చి, డిఫార్జ్ ప్రక్కనే నిల్చున్నాడు. కొంతసేపటికి చెప్పులుకుడుతున్న ఆ వ్యక్తితల పైకెత్తి చూశాడు. మరోవ్యక్తి ప్రక్కని నిల్చున్నట్లు కనుపించినా, ఆయన ఆశ్చర్యపళ్లేదు. చూసినట్లు చూసి మళ్ళీ తల దించేసుకుని తన పనిలో తాను నిమగ్నుడైనాడు.

'ఒక పెద్దమనిషి మిమ్మల్ని చూట్టానికి వచ్చారు' - అన్నాడు, డిఫార్జ్.

'ఆఁ! - ఏవిటీ?'

'ఒక పెద్దమనిషీ - మిమ్మల్ని చూట్టానికి వచ్చారు - ఇరుగో ఈయనే.'

చెప్పులు కుడుతున్న ఆ వ్యక్తి ఇందాకటి మోస్తరుగానే తల పైకెత్తి పరకాయించి చూచాడు. కాని పనిచేస్తున్న చెయ్యి యింకా చెప్పుమీదేవుంది.

'ఏదీ ఆ చెప్పు యిలా యివ్వండి - ఈయనకి చెప్పుల నాణ్యం బాగా తెలుసు - మీరు కుడుతున్న చెప్పు యిలా యివ్వండి! - తీసుకుచూడండి సర్' -

లారీ, సగంవరకు తయారైవున్న ఆ చెప్పు అందుకుని చూస్తున్నాడు.

"అది యేరకం చెప్పో అయ్యగారికి చెప్పండి - తయారీదారు పేరుకూడా అడుగుతున్నారు చెప్పండి' -

చాలా సేపటికిగాని ఆయన జవాబు చెప్పలేదు.

'ఆఁ! - ఏవిఁటీ అడిగారూ? - మరిచిపోయాను - ఏవిటీ అన్నారు.'

'అది ఏ రకం చెప్పో చెప్పమంటున్నారు అయ్యగారు.'

'ఆడవాళ్లు తొడుక్కునే చెప్పు; షికారు వెళ్ళేటప్పుడు ఆడవాళ్ళు తొడుక్కునే చెప్పు. కొత్త నమూనా - దీనికి పాత నమూనా యేమీ లేదు.'

'తయారీదారుపేరు అడుగుతున్నారు', అన్నాడు డిఫార్జ్;

ఆయనకు ఆ మాట వినిపించినట్టులేదు; చేతిలో పనేమీలేక కుడిచేతి మెటికలు ఎడంచేత్తోనూ, ఎడంచేతి మెటికలు కుడిచేత్తోనూ విరుచుకుంటూ మధ్యమధ్య గడ్డం గోక్కుంటున్నాడు. మన లోకంలోవున్న మనిషిలాలేడు. మూర్ఛాగతుడై వున్నవాణ్ణి పలకరించటం ఎంత కష్టమో ఆయన్ని పలకరించటం అంత కష్టం. కొంతసేపు పెగుల్చుకు ఏదో కలలోనుంచి మాట్లాడుతున్నట్టు:

'మీరు... నా పేరు అడిగారా?' -

'అవును - చెప్పండి' -

చాలాసేపు తీవ్రంగా ఆలోచించి 'నూట అయిదు, నార్త్ టవర్' అన్నాడు.

'అంతేనా - ఇకేమీ లేదూ' -

'నూట అయిదు, నార్త్ టవర్' - అంటూ బాధగా గొణిగేసి తిరిగి తనపనిలో తాను మునిగిపోయాడు.

'చెప్పులు కుట్టడం మీ వృత్తికాదనుకుంటాను' అన్నాడు, లారీ, ఆయన జేబుతలవంక తదేకధ్యానంగా చూస్తూ.

ఆయన సమాధానం చెప్పలేదు - 'ఆ ప్రశ్నకు సమాధానం నువ్వుచెప్పు' అన్నట్టు డిఫార్జ్ ముఖం వంక దీనంగా చూచాడు; కాని డిఫార్జ్ అలాంటి సహాయమేమీ చెయ్యక మెదలకుండా నిల్చునుండుటంచేత, తిరిగి లారీవంకచూసి:

'కాదు - ఇక్కడికొచ్చిన తరువాత నేర్చుకున్నాను - నా అంతటికి నేనే నేర్చుకున్నాను - నేర్చుకోటానికి అనుమతి తీసుకున్నాను - అతికష్టంమీద చాలా రోజులకి అనుమతించారు. అప్పటినుంచీ కుడుతూనే వున్నాను.' ఈ నాలుగుమాటలూ చెబుతూనే, లారీచేతిలోవున్న చెప్పుకోసం చెయ్యిచాచి అందుకో బోయాడు. లారీ ఆయన వంక తీవ్రంగా చూస్తూ:

'మాన్సియర్ మానెట్ - మీరు నన్ను గుర్తు బట్టలేరా?' అన్నాడు. చేతిలో ఉన్న చెప్పు జారి క్రిందపడిపోయింది. లారీ ముఖం వంక మ్రాన్పడి చూస్తున్నాడు.

'మాన్సియర్ మానెట్!' లారీ డిఫార్జ్ బుజంమీద చెయ్యి వేసి చూపించుతూ: 'ఈమనిషి వంక పరీక్షగా చూడండి! నే నెవరో జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నించండి; బ్యాంకులో ఉద్యోగం చేస్తూవుండేవాణ్ణి - బ్యాంకీ, వ్యాపారం జ్ఞప్తికి రావటంలేదూ - పూర్వం ఇతను మీదగ్గిర నౌకరుగావుండే వాడు - ఇతని వంక చూడండి! - ఇవన్నీ మీకు జ్ఞాపకం రావటం లేదూ?'

అనేక సంవత్సరాలుగా అజ్ఞాతంలో వుండి జీవిత సర్వస్వాన్నీ విస్మరించిన ఆ ఖైదీ తన పూర్వచరిత్రను తలపుకు తెచ్చుకోవటానికి నానా తంటాలూ పడుతున్నాడు. ఏనాడో, అదృశ్యపథాన అంతరించిపోయిన యోజనరేఖ, ఆయన నుదురుమీద క్రమ్మివున్న చీకటి తెరను భేదించుకుని మిలమిలగా పొటమరించటానికి ప్రయత్నించింది. కాని మళ్లా మరుక్షణంలో ఆ వెలుగురేఖను చీకటి మ్రింగేసింది.

గుమ్మంలో నిల్చునున్న ఆ యువతి గోడప్రక్కగా బల్లిలా పాకి దగ్గిరికివచ్చి నిల్చునుంది. చెప్పులుకుట్టే వ్యక్తి నుదురుమీద ఆ ఉజ్వలరేఖ మిలమిల లాడగానే, అంధకారం ఆవరించి వున్న ఆ యువతి నుదురుమీద కూడా వెలుగురేఖ పొటమరించింది. జీవితంలోకి మేల్కొనటానికి తన్నుకులాడుతున్న ఆ శిరస్సును తన హృదయానికి హత్తుకుని సేదదీర్చి పునర్జన్మ నివ్వాలనే ఆవేశంతో చేతులు రెండూ ఆవిడకు తెలియకుండానే ముందుకు చాచుకుంటున్నయ్. గజగజలాడుతున్న జాలిపేగులతోపాటు చేతులుకూడా వణికిపోతున్నయ్.

ఆయన నుదురు కావురువేసినట్టు అయోమయమైపోయింది. వాళ్లిద్దరివంకా చూస్తున్న చూపులు కూడా మందగించి దించుకుపోయినై, నిస్పృహగా నేలవంక చూచాడు- ఒక పెద్దనిట్టూర్పు విడిచి, చేతిలో వున్న చెప్పులో ఆరె దిగబొడిచి తిరిగి కుట్టడం ప్రారంభించాడు.

డిఫార్జ్ లారీచెవిలో నోరుబెట్టి రహస్యంగా అడిగాడు: 'ఆయన్ను గుర్తించగలిగారా?'-

'ఆ-క్షణమాత్రంగా ఆయన ముఖంమీద నిలిచి అదృశ్యమైపోయిన పూర్వపు పోలికను గుర్తించాను - మొదట నిజంగా నిరాశచేసుకున్నవాణ్ణే - హష్! - మనం కొంచెం దూరంగా వెనక్కు వెడదాం పద, హష్!' -

ఆవిఁడ, అడుగులు తడబడుతూ నెమ్మదిగా ఆ వ్యక్తి కూర్చున్న బెంచీ దగ్గిరికి వచ్చింది. తలవంచుకు ముందుకు వంగి కూర్చుని పనిచేసుకుంటున్న ఆయన భుజాన్ని మునివ్రేళ్ళతో తాకింది. ఆయన ఆ హస్తస్పర్శను గ్రహించలేదు.

నోరుమెదిపి ఒక్కమాట మాట్లాడలేదు. దేహంలేని ఆత్మలా ఆయన వెనక మౌనంగా నిల్చుని వుంది. ఆయన మౌనంగా కూర్చుని చెప్పులు కుట్టుకుంటున్నాడు.

ఇంతలో ఆయనకు తోలుముక్క కొయ్యటానికి కత్తికావలసి వచ్చింది. అది ఆ అమ్మాయి నిల్చున్న వైపునకాక, రెండో వేపున పడివుంది. అటు ప్రక్కగా జరిగి తీసుకుని తిరిగి మళ్ళీ చెప్పుమీదికి వంగబోతున్నాడు. ఆ జరగటంలో ఆ అమ్మాయి తొడుక్కున్న గౌను అంచులు ఆయన కళ్ళబడ్డయ్. తల పైకెత్తి చూశాడు. ఆ ముఖంవంక రెండుకళ్ళూ అప్పగించి చూస్తున్నాడు. కత్తివిసిరేస్తాడేమోనని హడలిపోయి లారీ డిఫార్జ్‌లు యిద్దరూ ముందుకు అడుగు వెయ్యబోయ్యారు. ముందుకు రావద్దని చేతితో వారించింది.

అలా తేరిపారజూస్తున్నాడు - అదో భీభత్సంగా, పెదవులు తడబడుతూ ఏదో గొణగబోయాడు. మాట పెగల్లేదు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా సరీగా ఆడటంలేదు. కొంచెంసేపు అలా సదమదమై ఏదోవిధంగా మాట పెగుల్చుకుని :

'ఏవిఁటిదీ!-

చెక్కిళ్ళమీదుగా జొటజొటా కన్నీరొలికిపోతున్నది. ఆయనపట్ల కలిగిన ఆప్యాయతనంతా సూచించుతూ, తన చేతులు తాను ముద్దుబెట్టుకుని, శిథిలమైపోయిన ఆయన శిరస్సునే హత్తుకుంటున్నట్లు హృదయానికి హత్తుకున్నది.

'నువ్వా... జైలరు కూతురివి కాదా?-'

'కాదు' - కన్నీరు విడిచింది.

'హాఁ - ఎవరు?-'

తనకు సరీగా మాట పెగుల్తుందనే ధైర్యం ఇంకా చిక్కలేదు; నెమ్మదిగా ఆయన ప్రక్కనే బెంచీమీద కూర్చుంది. వెనక్కు తప్పుకోవటానికి ప్రయత్నం చేశాడు. కాని, ఆయన దండ చేతిమీద చెయ్యివేసి వారించింది. ఆ స్పర్శతో ఆయన నరనరాలలోనూ ఏదో విద్యుత్తు ప్రవహించినట్లయింది. ఆ చైతన్యం ఆయన ముఖంమీద కూడా స్ఫురించుతోంది; చేతిలో వున్న కత్తి నెమ్మదిగా క్రిందబెట్టి, విభ్రాంతుడై ఆ యువతి ముఖంలోకి తేరిచూస్తూ కూర్చున్నాడు.

ఆ అలజడిలో బంగారు వర్ణంలోవున్న ఆవిడ గిరజాలజుట్టు భుజంమీదుగా ముందుకు పడ్డది. నెమ్మది నెమ్మదిగా చెయ్యి చాచి ఆ జుట్టు తన అరచేతిలోకి తీసుకుని పరిశీలించుతున్నాడు. మళ్లా మరుక్షణంలో ప్రక్కకు తిరిగేసి, పెద్దనిట్టూర్పు విడిచేసి చెప్పుకుట్టటానికి మొదలుబెట్టాడు.

అతని దండ చెయ్యి వదిలేసి, ఇంకా సన్నిహితంగా భుజంమీద చెయ్యివేసి కళ్ళల్లోకి చూసింది. ఆ చెయ్యి నిజంగా తన భుజంమీద వుందా లేదా అనే అనుమానం తీర్చుకోవటానికి ప్రయత్నించుతున్నవాడిలా, రెండుమూడుసార్లు ఆ చెయ్యివంక చూసి, చివరికి తన చేతిలోవున్న పని నెమ్మదిగా క్రిందబెట్టేశాడు. మెడ తడిమి చూసుకుని ఒక నల్లటిదారం బయటికి తీశాడు. ఆ దారానికి చిన్ని గుడ్డమూట తాయత్తులా కట్టివుంది. ఆ మూటను మోకాలిమీద పెట్టుకుని అతి జాగ్రత్తగా ఊడదీశాడు. దాల్లోనుంచి చిన్ని తలవెంట్రుకలు; వాటిని యేనాడో తన చిటికెన వ్రేలుమీద చుట్టి అలా భద్రపరిచాడు.

ఆ యువతి తలవెంట్రుకలను చేతిలోకి తీసుకొన్నాడు. తాను బయటికి తీసిన వెంట్రుకలను దగ్గిరసా బెట్టి రెంటినీ పరిశీలించుతున్నాడు:

'అవే వెంట్రుకలు!... ఎలా సాధ్యం?.... ఎలా సాధ్యం' -

ఆయన నుదురులో తీవ్రమైన యోజనశక్తి ప్రభవించింది. ఆయువతి ముఖంలో కూడా అదేరకం చైతన్యం స్ఫురించటంకూడా ఆయన గమనించాడు. ఆవిడ ముఖాన్ని పట్టుకుని వెలుగువైపుకు తిప్పి పరిశీలనగా చూస్తున్నాడు.

'ఆ వేళవాళ్లు నన్ను తీసుకుపోవటానికి వచ్చినప్పుడు నాభుజంమీద తలబెట్టి యేడ్చింది. నన్ను వాళ్లు 'నార్త్‌టవరు'కు తీసుకువచ్చిన తరువాత, యీ వెంట్రుకలు, వాళ్ళకి నాభుజంమీద కనుపించాయి. అవ్వినాకివ్వమన్నాను. అవి నా ఆత్మను ఖైదులో నుంచి విముక్తి చేయగలిగితే చెయ్యవచ్చుగాని, శరీరాన్ని చెయ్యలేవుగదా - దయవుంచి యివ్వమన్నాను - సరీగా ఆవేళ అవే నేనన్నమాటలు - నాకు బాగా జ్ఞాపకం' ఆ ప్రసంగాన్ని లోలోపల మననం చేసుకుంటూ నెమ్మది నెమ్మదిగా అంచెల మీద ముగించాడు.

'ఇదంతా ఎలా సంభవం? - నీవేనా?'

అతను హఠాత్తుగా ఆ స్త్రీముఖం వంక అలా విభ్రాంతుడై చూడడం గమనించి, భయపడి ఆ యిద్దరూ మళ్ళా ముందుకు రాబోయారు. కాని అతి శాంతంగా కూర్చుని; 'అయ్యా; దయవుంచి దగ్గిరికిరాకండి - మాట్టాడకండి' అన్నది.

'ఆఁ ఏవిటీ?' - బిగ్గరగా అరిచాడు : 'ఎవరి దా గొంతు!'

కేక బెడుతూనే, ఆ అమ్మాయి చేతులు వదిలేసి, వెర్రెత్తి పోయినవాడులా జుట్టు చికాగ్గా పీకేసుకున్నాడు. ఒక్కక్షణంలో మళ్లీ ఆ చికాకంతా అణగిపోయింది; గబగబా ఆ తల వెంట్రుకల చుట్టను మూటగా చుట్టబెట్టేసి దాచేసుకోవటానికి ప్రయత్నించుతున్నాడు: కాని యింకా ఆ స్త్రీ ముఖంలోకి చూస్తూనే వున్నాడు: దుఃఖం ముంచుకొస్తున్నట్లు రుద్ధకంఠంతో గొణుగుతున్నాడు.

'ఉహూహూ! - నువ్వు కాదు - కాదు - నువ్వు చాలా చిన్నపిల్లవుగా వున్నావ్ - చాలా మిసమిసగా వున్నావ్ - కాదు నువ్వుకాదు. ఖైదీ అంటే ఎలావుంటాడో చూశావా- అది చూసినచేతులు యివి కాదు - అది ఎరిగినముఖం యిదిగాదు - అది విన్న కంఠధ్వని యిదిగాదు - అదంతా వేరు - ఎప్పుడో సంగతి... నార్త్‌టవర్ పూర్వం సంగతి - అదీ... నేనూ... అదంతా పూర్వం సంగతి - ఎబ్బే కాదు కాదు. అది వేరే సంగతి; దేవదూతలా వున్నావ్ నీపేరేమిటి?'

ఆయన కంఠధ్వని మార్దవస్థాయికిరావటం గమనించి కుమార్తె తండ్రి పాదాలముందు మోకరిల్లి ఆయన రెండు అరచేతులూ తీసుకుని హృదయానికి హత్తుకుంది.

'నాపేరేమిటో - నాతల్లి యెవరో - నాతండ్రియెవరో తరువాత చెబుతాను - ఇప్పుడు చెప్పటానికి వీల్లేదు; ఇక్కడ చెప్పటానికి వీల్లేదు. ఇప్పుడు మిమ్మల్ని ఒక్కటే అర్థించుతున్నాను - నన్ను మీ చేతులతో స్పృశించండి; నన్ను దీవించండి - నన్ను నా- నన్ను ముద్దు బెట్టుకోండి!'

ఆవిడ బంగారపుజుట్టు ఆయన తెల్లజుట్టుమీద అలుముకుని ఆయన శిరస్సుమీద స్వాతంత్ర్యం ఉదయించుతున్నట్టు కనుపించుతోంది.

'వింటున్నారా? - వింటున్నారో యేమో - ఒకనాడు మీచెవులకు మధుర సంగీతాలుగా వినిపించక కంఠధ్వనిపోలికలు నాకంఠ ధ్వనిలో మీకు వినుపించుతున్నాయో యేమో - వినిపించితే - ఆ తియ్యటి కంఠాన్ని తలపుకుతెచ్చుకుని, కళవళించి కన్నీరు విడువండి. నా తలవెంట్రుకల స్పర్శతో స్వాతంత్ర్య సౌఖ్యాలనుభవించుతూన్న యౌవనదశలో మీ గుండెలమీద నిశ్చింతగా నిద్రపోయిన ప్రేమమయి శీర్షం స్ఫురణకువస్తే, కంట తడిబెట్టి కన్ను లొత్తుకోండి. మన యింటికి పోదాం రమ్మన్న మాటలో మధురమయజీవితాన్ని అనుభవించిన ఆనాటి మీగృహాన్ని జ్ఞాపకానికి తెస్తే విలపించి, విలపించి వేడికన్నీరు విడువండి'-

ఆయన శిరస్సును హృదయానికి అలుముకుని పసిబిడ్డను ఉయ్యాలలో ఊపినట్టు ఇటూఅటూ ఊపి లాలించుతోంది.

'మీవేదనా దినాలు అంతమైపోయినై; ఇంగ్లండుకు వెళ్లిపోదాం; మిమ్మల్ని తీసుకుపోదామని వచ్చాను. మాతృభూమి ఫ్రాన్సు మిమ్మల్ని కిరాతకంగా చూసింది. ఈమాటలు వింటుంటే హడలిపోయిన మీ నిష్ఠురజీవితం తలపుకువచ్చి తల్లడిలుతున్నారా? ఏడుపుముంచుకొస్తే ఏడ్చేసెయ్యండి. నే నెవ్వరో చెబుతాను - జీవించివున్న నా తండ్రి యెవరో చెబుతాను. చనిపోయిన నాతల్లి సంగతి చెబుతాను. నే నిప్పుడు మోకరించి వున్నది పూజ్యుడైన నాతండ్రిపాదాల ముందు; తల్లిప్రేమ తండ్రి దుర్భరజీవిత గాథను - నాకు తెలియకుండా తెర మరుగుచేసింది. అమాయకపు అజ్ఞానంలో, కన్నతండ్రి అనుభవించుతున్న కఠోర జీవితాన్ని అవగతం చేసుకు కంటతడి బెట్టలేకపోయిన దౌర్భాగ్యురాలిని - క్షమించు తండ్రీ! - మన్నించు. ఇంతటి క్రూరురాలిని కన్నందుకు విలపించు. ప్రేమమయి నా తల్లిని తలుచుకుని దుఃఖించు - అమ్మయ్యా! ఫరవాలేదు - ఆయన కన్నీరు నా చెక్కిళ్ళమీద దిగజారుతోంది. ఆయన యేడుస్తున్నారు - ముంపులు గడుతున్న శోక తరంగాలు నా హృదయంమీద ప్రతిధ్వనించుతున్నయ్ - ఇక ఫరవాలేదు- భగవంతుడా! నీకు కృతజ్ఞురాలిని.'

ఆయన పసిపిల్లడులా కుమార్తెవళ్ళో కూలబడిపోయాడు. సంవత్సరాల తరబడి అన్యాయదౌర్జన్యాల కిరాతం నలిబిలిగా నలిపి శల్యావశిష్టుణ్ని చేసిన బొమికెలపోగు; కరుణామయమైన ఆ దృశ్యాన్ని చూడలేక, దూరంగా నిల్చున్న ఆ యిద్దరు పెద్దమనుషులూ అరచేతుల్తో ముఖాలు కమ్మేసుకున్నారు.

ఆ గది యావత్తూ ప్రశాంత నిశ్శబ్దత ఆవరించింది. తుపాను అనంతరం ప్రశాంతి యేర్పడినట్టు ఆయనలో చెలరేగిన ఆవేశ తరంగాలు ఉపశమించినై; స్తబ్దంగా కళ్లుమూసుకుని కుమార్తె ఒళ్ళో పడుకున్నాడు. ఆ యిద్దరు పెద్ద మనుషులు ముందుకు వచ్చి కుమార్తెనూ, తండ్రినీ లేవదీయటానికి ప్రయత్నించారు. ఆయన ఒళ్ళోనించి నెమ్మదిగా జారి నేలమీద ఏదోమైకంలో వున్న వాడులా సొమ్మసిల్లి పడుకున్నాడు. ఆ దీనుణ్ని డొక్కలోకి పొదుపుకుని కుమార్తెకూడా ప్రక్కనే అలుముకు పడుకుంది. తండ్రి చెయ్యి దండ చేతిమీదికి తీసుకుంది. ఆయన మీదికి వంగి తన ముంగురులతో ముఖం కమ్మేసి వెలుగుబాధ లేకుండా కాపాడుతోంది.

లారీ ముక్కుచీదుకుంటూ, తండ్రి కుమార్తెల దగ్గరగావచ్చి కూర్చున్నాడు. తల నెమ్మదిగా పైకెత్తి అతని వంకచూసిన 'అలజడి కలగకుండా, ఈ పళంగా వెంటనే యిక్కడినుంచి తీసుకుపోవటానికి యేర్పాట్లు చెయ్యగలిగితే బాగుంటుంది' -

'కాని, ఆలోచించు! - ఆయన ప్రయాణాయాసాన్ని భరించగల స్థితిలో వున్నాడా?'

'ఈ బీభత్సనగరంలో వుంచటంవల్ల కలిగే వ్యథను భరించటంకంటే, ప్రయాణాయాసం యేమంత ఉపద్రవకరం కాదనుకుంటాను.'

'అవునవును' అన్నాడు, డిఫార్జి. ఆయన యీ ఫ్రాన్సులో వున్నప్పటికంటే యెక్కడున్నా యింతకంటే బాగానే వుంటాడు. గుర్రపుబగ్గీ సిద్ధంచేయించమంటే వెంటనే యేర్పాటు చేయిస్తాను.'

'అది వ్యవహారం - వ్యవహార విషయం చూడాలిసొస్తే అది నాకు వదిలెయ్యండి; నేను చూసుకుంటాను' అన్నాడు లారీ, రెప్పపాటులో తనమామూలు ధోరణి నందుకుని.

'అయితే, దయవుంచి, ఆయనకు నిద్రాభంగం కలగకుండా మీరిద్దరూ ఇక్కడనుంచి బయటికి వెళ్లిపోండి! ఆయన యెంతో ప్రశాంతంగా పడుకున్నారు. నాకేమైనా ప్రమాదం జరుగుతుందేమోనని మీరు భయపడక్కర్లేదు, ఆయన నన్నేమీ చెయ్యరు. మీకా భయమక్కర్లేదు. తలుపు బయటతాళం వేసివెడితే వెళ్ళండి ఎవ్వరూ లోపలకువచ్చి ఆయన ప్రశాంతికి భంగం కలిగించకుండా, మీరుమళ్లా తిరిగివచ్చేవరకూ ఆయన్ను నేను జాగ్రత్తగా కాపాడుతూ వుంటాను.'

అలా చెయ్యటం వాళ్ళిద్దరికీ మొదట్లో యిష్టంలేదు. ఇద్దరిలో ఒకరు అక్కడ ఉండిపోతే బాగుంటుందనుకున్నారు. కాని వెంటనే ప్రయాణానికి అన్నియేర్పాట్లూ చెయ్యవలసి వుంది. ఒక్కగుర్రపుబగ్గీ సమకూర్చటేమేగాదు. ప్రయాణానికి కావలసిన యేర్పాట్లన్నీ పూర్తిచేశారు. ప్రయాణానికి కావలసిన ప్యాసుపోర్టులు వగైరా సంపాయించాలి. అప్పటికి ప్రొద్దు ఇంకెంతో లేదు కూడా. అందుచేత యిద్దరూ వెనకా ముందూ ఆలోచించకుండా చెరోపనిమీద బయలుదేరారు.

క్రమంగా చీకటిబడిపోయింది. కుమార్తె తండ్రిప్రక్కనే నిశ్శబ్దంగా కూర్చుని, ఆయన వంక చూస్తోంది. చీకటి మరింత గదియావత్తూ ఆవరించేసింది. కొంతసేపటికి దీపపు కిరణాలు తలుపు సందుల్లోనుంచి లోపలికి చొచ్చుకువచ్చినై.

మాన్సియర్ డిఫార్జ్, లారీ, యిద్దరూ కలిసి ప్రయాణానికి కావలసిన యేర్పాట్లన్నీ పూర్తిచేశారు. ప్రయాణానికి కావలసిన దుస్తులు వగైరాలేకాక, రొట్టె, కాఫీ, మాంసం, సారా యివన్నీ లోపలికి తీసుకొచ్చారు. లారీ, చేతులో వున్నలాంతరు సామానూ, బెంచీమీద పెట్టాడు. ఇద్దరూ చెరోవేపునా సాయం పట్టి ఆయన్ను నేలమీదనుంచి లేవదీసి నిల్చోబెట్టారు.

ఆ సమయంలో ఆయన మనసులో యేవిః జరుగుతుందో యే విధమైన మానవ విజ్ఞానమూ అవగతం చేసుకోలేదు. వాళ్లు చెప్పిన మాటలన్నీ ఆయనకు తెలిసినాయో లేదో, తనకు స్వేచ్ఛ లభించిందన్న విషయం ఆయనకు అర్థమైందో లేదో మానవమాత్రుడు ఊహించలేదు. ఆయన్ను పలకరించాలని చూశారు. కాని ఆయన వున్న అయోమయస్థితి గమనించి, అలాంటి ప్రయత్నం మంచిదిగాదని విరమించుకున్నారు. ఆయనలో మధ్యమధ్య యేదో చికాకు కనుపించుతోంది; కాని కుమార్తెమాట సవ్వడి విన్నప్పుడల్లా యేదో సంతోషాన్ని అనుభవించుతున్న వాడిలా ప్రశాంతంగా కనుపించుతున్నాడు.

ఇతరుల ఉత్తరువులకు లోబడి నడుచుకోవటం అలవాటైనవాడు మోస్తరుగానే, వాళ్లు భోజనం చెయ్యమంటే భోజనం చేశాడు; దుస్తులు వేసుకోమంటే దుస్తులు వేసుకున్నాడు. కుమార్తెవచ్చి చెయ్యిపుచ్చుకుంటే, ఆవిడవెంట మారుమాట లేకుండా బయలుదేరాడు.

మెట్లు దిగుతున్నారు; డిఫార్జి లాంతరు పుచ్చుకుని ముందు దారితీస్తున్నాడు. లారీ అందరికంటే వెనక నడుస్తున్నాడు. మెట్లు సగంవరకూ దిగిన తరువాత మాన్సియర్ మానెట్ తలపైకెత్తి పైకప్పు వంకా, గోడలవంకా కలియజూచాడు.

'ఈ ప్రదేశం నీకు జ్ఞాపకముందా నాన్నా! ఇక్కడికి రావటం నీకు తెలుసా?'

'ఆఁ! - ఏవిటీ?' -

'ఇక్కడికి రావటం నీకు తెలుసా.' -

'ఊహూ! - లేదు - ఎప్పుడో - చాలా రోజులైనట్టుంది.'

ఖైదులోనుంచి యీ యింటికి ఆయన్ను తీసుకువచ్చిన సంగతి ఆయనకు తెలియదనే సంగతి వాళ్ళకు అర్థమైపోయింది. 'నూట అయిదు నార్త్ టవర్' అని ఆయన గొణుక్కోవటం కూడా వాళ్లు విన్నారు. ఆయన అలా గోడలవంకా గోపికెలవంకా పరకాయించి చూడటం 'నార్త్ టవర్' ఖైదుగోడలు కనుపించకనే. మెట్లు దిగి వాకిట్లోకి అడుగుబెట్టగానే అక్కడ ఖైదు కొట్లముందున్న మోస్తరుగానే, అగడ్తమీదవున్న వంతెన కనుపించుతుందనుకున్నాడు. అలాటిదేవిఁకనుపించలేదు. గుర్రపుబగ్గీ వీధి వాకిట్లో నిల్చునుంది. అదేవిఁటో అర్థంకాక కుమార్తె చెయ్యి వదిలేసి సవరించుకుంటున్నాడు.

ద్వారంముందు మనుషు లెవ్వరూలేరు. కిటికీలోనుంచి కూడా యెవ్వరూ తొంగిచూట్టంలేదు. ఎన్నడూలేని విచిత్రమైన నిశ్శబ్దం. ఆ ప్రాంతంలో కనుపించుతున్నదల్లా ఒకే ఒక వ్యక్తి - మాడమ్ డిఫార్జ్. గుమ్మానికి యాలిగిలబడి నిల్చుని లతలు కుడుతోంది; అక్కడ ఉన్నదన్నమాటేగాని, అక్కడేవిఁ జరుగుతోందో యేవీఁ చూడ్డంలేదు.

ఖైదీ, ముందు, కోచ్‌లోకి యెక్కి కూర్చున్నాడు. కుమార్తె ఆయన ప్రక్కనేపోయి కూర్చుంది. లారీ లోపలికి ఎక్కటానికి మెట్టుమీద అడుగుబెట్టాడు; తను కుడుతున్న చెప్పులూ, చెప్పులు కుట్టేసామానూ తేలేదేమని ఆయన బెంగగా గొణిగేసరికి లారీ వెనక్కు తగ్గాడు. అంతవరకూ ఏవీఁ చూడనట్టు గుమ్మంలోనిల్చున్న మాడమ్ డిఫార్జ్ 'నేను వెళ్ళి తీసుకొస్తాలే!' అంటూ భర్తను కేకబెట్టి లోపలికి పరుగెత్తింది. క్షణంలో తిరిగివచ్చి ఆసామానూ చెప్పులూ కోచ్‌లోకి గిరవాటేసి, మళ్ళా యథాతథంగా గుమ్మంలోకిపోయి, కుట్టుకుంటూ నిల్చుంది.

డిఫార్జ్ కోచ్‌వాలాతోపాటు ముందు పీటీనయెక్కి కూర్చుని పోనివ్వమన్నాడు. కోచ్‌వాలా కొరడా విదిలించాడు. మినుకుమినుకుమంటూ పైన ఊగుతున్న వీధి దీపాల క్రిందనుంచి కోచ్ టకటకా వెళ్లిపోతోంది.

ఆ వీధిదీపాలు మంచిమంచి వీధుల్లో ఉజ్వలంగా వెలుగుతున్నయ్. నాసిరకం వీధుల్లో నాసిరకంగా మినుకుమినుకుమంటున్నయ్. దీపకాంతులతో కళ్లు మిరిమిట్లు గొలుపుతున్న దుకాణాలూ, కాఫీహోటళ్ళూ నాటకశాలలూ గడిచి, కోచ్ నగరద్వారం వేపు వెళ్ళిపోతోంది. గేటుదగ్గరున్న 'గార్డ్‌హౌస్' సిపాయిలు లాంతర్లు పుచ్చుకుని కోచ్ దగ్గరి కొచ్చారు. పాసుపోర్టులు చూపించండి!' అంటూ ఒక పోలీసుఅధికారి ముందుకొచ్చాడు. డిఫార్జ్ కోచ్ మీదినుంచి దిగి క్రింది కొచ్చాడు. 'నా దగ్గిరున్నయ్ చూపిస్తా నిట్టారండి' అంటూ ఆ పెద్దమనిషిని కొంచెం అవతలికి తీసుకెళ్ళి 'కాయితాలివిగో, ఈయన్నీ, యీ కాయితాలూనాకు వప్పగింత చేసింది...' చివరిమాట బిగ్గిరిగా వినిపించకుండా గొంతు తగ్గించి చెవిలో చెప్పాడు. పోలీసులాంతర్లు కొంతసేపు గజగజలాడుతున్నయ్. కొంతసేపటికి లాంతరు పుచ్చుకున్న ఒక యూనిఫారం చెయ్యి కోచ్‌లోకి తొంగి చూసింది. ఆ చెయ్యితాలూకు కళ్లు మామూలు మోస్తరుగాకాక అదోవిధంగా కోచ్‌లోవున్న ముగ్గుబుట్ట తలవంక చూసినై.

'ఆల్‌రైట్!' - పో!' అంటూ కేకబెట్టింది. ఆ చేతి తాలుకు పోలీసుగొంతు. డిఫార్జ్ ఆ యూనిఫారంకు సలాం కొట్టాడు. అంతకంతకు ఒకటికంటే ఒకటి కాంతిహీనంగా కనుపించుతూన్న దీపాల క్రిందనుంచి గడిచి కోచ్ నక్షత్రాల క్రిందికి వచ్చేస్తోంది.

అనంతదీపాల నీలిచాందినీ పైన కనుపించుతోంది. ఆ నక్షత్రాలలో కొన్ని, ఈ బ్రహ్మాండంలో అణురూపంలోవున్న ఈ భూగోళానికి శతసహస్రార్బుద యోజనాల దూరంలో వున్నాయనీ, వాటి కిరణాలు ఈ కర్మజగత్తువరకూ ప్రసరించుతున్నాయో లేదో కూడా మనకు తెలియదని ప్రాజ్ఞులంటారు. చీకటి క్రీనీడలు విశాలంగా, అతి దీర్ఘంగానూ పడుతున్నయ్, భూగర్భంనుంచి త్రవ్వి యెత్తిబడిన ఆ వ్యక్తి ప్రక్కనే కూర్చుని. ఆయనలో నశించిపోయిన శక్తులేవిటో, తిరిగి ప్రజ్వలింప జేయటానికి వీలున్న శక్తులేవిటో, యోజించుతున్న లారీ చెవులో ఆ చీకటి క్రీనీడలు గుసగుసగా చెబుతున్నయ్ - అదే పాతభోగట్టా:

'పునర్జన్మ కావాలని వాఛించుతున్నవా?' -

మళ్లీ అదేపాత సమాధానం :

'తెలీదు' -

8

ఇక్ష్వాకులనాటి పాతకొంప; 1780 నాటికి కూడా టెల్‌సన్సు బ్యాంక్ ఇంకా ఆ పాతకొంపలోనే వుంది. చీకటి కొట్లూ, చవిటిగోడలు; తగని యిరుకు. మనుషులుండటానికి యోగ్యమైన ప్రదేశంకాదు. అయితే మాత్రమేం? - అతి పురాతనమైన ప్రాచీనభవనం. అంచేత బ్యాంకు యజమానులు ఆ కట్టడాన్ని పూజనీయమైన పవిత్రస్థలంగా పరిగణించుతూ వుండేవారు; అలాంటి పాతకొంప గావటమే, దాని గొప్పతనం; అలా చీకటిగానూ ముంజుకంపు కొడుతూనూ వుండటమే దాని ప్రాచీనోజ్వల చరిత్రకు పరమ తార్కాణం; అలాయిరకాటంగా వుండటమే సాంప్రదాయసిద్ధి. ఇలాంటి యోగ్యతలుగల భవంతిలో తమ వ్యాపారసంస్థ వున్నందుకు, యజమానులు తమలో తాము గర్వపడుతూ వుండటమే గాకుండా, తమతో పోటీచేస్తున్న యితర సంస్థలకు అలాంటి యోగ్యతలుగల భవంతి లేనందుకు వాటి గౌరవమర్యాదలను కించపరుస్తూ ప్రచారాలు చేస్తూవుండేవారు; 'టెల్‌సన్సు బ్యాంకుకు వెలుగూ, గాలీ, రంగులూగింగులూ యివన్నీ అక్కర్లేదు. అలాంటివన్నీ ఆ నోక్సు కంపెనీ, స్నూక్సు బ్రదర్సులాంటి వాటికి కావాలిగాని, టెల్‌సన్సు కెందుకు?'

ఈ బ్యాంకు యజమానుల్లో యే ఒకరి అబ్బాయైనా, కర్మం జాలక, టెల్‌సన్సు బ్యాంకు పునర్నిర్మాణం చేస్తే బాగుంటుందని సూచించినట్టయితే, ఆ తండ్రి వెంటనే కొడుకుమీద మండిపడి, తన అనంతరం కొడుక్కు తన ఆస్తి సంక్రమించగూడదని 'విల్లు'రాసి పారేసి వారసత్వం కోసేసేవాడు. ఈ విషయంలో బ్యాంకు కాలదోషంబట్టి కుళ్ళి వాసనగొడుతూ అత్యంత అభ్యంతరకరంగా వున్న శాసనాలలోనూ సాంఘికాచారాలలోనూ మార్పులు రావాలని సూచించుతున్న బిడ్డలను దేశం వోచెంప అవతలికి తరిమి నాశనంచేసి పారేస్తుంటే, టెల్‌సన్సు బ్యాంకు యజమానులు మాత్రం అందుకు భిన్నంగా ఎలా నడుచుకుంటారు? అందుచేత టెల్‌సన్సు బ్యాంకు అసౌఖ్యానికి పరాకాష్ఠగా వుంది.

కుతికెలో కీచురాళ్లశబ్దం పుట్టి, కిరకిరలాడుతూ, వార్ధక్యావస్థలో, ఎప్పటికప్పుడు కీళ్లు కుదబడిపోవటానికి సిద్ధంగా వున్న, అడ్డతలుపు తోసుకుని లోపలికి అడుగుబెట్టగానే టేల్‌సన్సు బ్యాంకు ముందు హాలు కనిపిస్తుంది. అంధకార బంధురమైన ఒక పెద్ద అహోబలబిలం. ఆ హాల్లో రెండు 'కౌంటర్లు వున్నయ్. ఆ కౌంటర్ల వెనక వృద్ధాతివృద్ధులైన ఉద్యోగ పితామహులు పని చేస్తూవుంటారు.

చెక్కులు చేత్తో బుచ్చుకుని చేవ్రాళ్లు తనిఖీ చేస్తుంటే, ఆ వృద్ధుల చేతుల్లో అవి ప్రభంజనంలో వున్నట్టు రెపరెపలాడి వణికిపోతూవుంటై. అసలే చీకటికొట్టు; ఉన్న కిటికీలు రెండూ కావురేసి బూజులు వ్రేలాడుతూవుంటై. వాటిల్లోనుంచి వెలుతురేమీ లోపలికి రావడానికి ఆస్కారం లేదు సరిగదా. ప్రక్కనున్న 'ఫ్లీట్‌స్ట్రీట్' దుమ్ము యావత్తూ వాటిల్లోనుంచి షవర్‌బాత్‌లా లోపలికి కొడుతూవుంటుంది. దీనికితోడు 'టెంపుల్ బార్' గోపురపు క్రీనీడ ఆ కిటికీలమీద పడి ఏ విధమైన వెలుగురేకలూ లోపలికి చొచ్చుకురాకుండా అటకాయించి పారేస్తుంది. కర్మంచాలక, ఇంకా యేదేనా ప్రత్యేకం పని వుండి, బ్యాంకు లోపలిభాగానికి వెళ్ళవలసిన దురదృష్టం తటస్థించితే, అటు వెనక్కు దొడ్డిగుమ్మంవైపుకు తిరిగి వెళ్లాలి. అక్కడ మనకు మల్లేనే దురదృష్టం పట్టిన మందభాగ్యుల వెనక, వ్యర్థంగా గడిచిపోతున్న మన జీవితక్షణాలకు దురపిల్లుతూ క్యూలో నిల్చోవాలి. తీరా, లోపలికి వెడితే, ఆ సంజచీకటిలో ఎక్కడేముందో తెలియక కాళ్లు విరగ్గొట్టుకోవాలి; మన డబ్బు, చెదలు బట్టిన పాతడ్రాయర్లలోకి వెడుతూవుంటుంది. మనం ప్రక్కను నిల్చునుండగా డ్రాయరు, ఇలా, చివాల్ని ముందుకులాగితే, దాని తాలూకూ దూగర రంపపు పొట్టులా ఎగిరొచ్చి మన ముక్కుల్లోనూ, గొంతులోనూ దూరి ఉక్కిరిబిక్కిరౌతుంది.

ఆ డ్రాయర్లలోనుంచి కరెన్సీనోట్లు తీసి మన చేతికిస్తే అవి ముంజుకంపు కొడుతూవుంటై. ఆ కాయితమ్ముక్కలు ఆత్మహత్య చేసుకొని తిరిగి తమ పూర్వరూపాన్ని పొందటానికి ప్రయత్నించుతున్నాయా అనిపిస్తుంది. మీరు బ్యాంకులో వుంచమని వప్పజెప్పిన వెండిపళ్లాన్ని అల్లాంటి మురికిగుంటలోకో, దేంట్లోకో ఒక దాంట్లోకి గిరవాట్టు వేస్తారు. ఆ పరిసరాల సంపర్కంతో రెండోనాటికి మెరుగుకాస్తాపోయి మాడు బొచ్చె క్రింద తయారై కూర్చుంటుంది. వంట గదులూ అంట్ల గదులూ మార్చి అవసరానికి యేర్పాటుచేసిన రికార్డుకొట్లలో ప్రజలతాలూకు, దస్తావేజులూ, పత్రాలూ, గుట్టలుబడి కొట్టుకులాడుతూ, తమలోవున్న జవసత్వాలను టెల్‌సన్సు బ్యాంకి మురికి గాలిలోకి విడుస్తూ వుంటై.

ఇక కుటుంబాల తాలూకు ప్రైవేటు కాయితాల చిన్ని చిన్ని పెట్టెలన్నీ మిద్దె మీదగదిలో పడుంటై. అక్కడికివెళ్లి యే చిన్ననాటి ప్రియురాలో వ్రాసిన ప్రేమలేఖను తిరిగి తీసుకుని చదువుకుంటూ నిల్చున్నామంటే, ప్రక్కనున్న టెంపుల్‌బార్ గోపురం మీద రాక్షసులు, కిటికీలోనుంచి ఆకాయితంవంక ఉరిమురిమి నిర్దాక్షిణ్యమైన రాతిచూపులు చూస్తారు.

ఆ రోజుల్లో, ఏవ్యాపారానికి గాని, వృత్తికిగాని కార్యసాధనా సూత్రం ఒక్కటే - ప్రత్యర్థిని ఖూనీ చెయ్యటం. ఆ విషయంలో టెల్‌సన్సు బ్యాంకు తక్కువ తిన్నదేమీలేదు. సర్వమైన అతివ్యాధులకు ప్రకృతి కల్పించిన పరమౌషధం మృత్యువు; ఆ మహౌషధాన్ని శాసనాధికారంమటుకు వాడటంలో తప్పేవిటి? అందుకే, ఫోర్జరీ చేసినవాడికి మరణశిక్ష విధించేవాళ్లు; అపస్వరం పలికినవాణ్ణి హననం చేసేవాళ్లు; పరాయివాడి ఉత్తరాన్ని విప్పి చదివితే ప్రాణాలు తీసేవాళ్ళు; కానీ దొంగిలించితే గండ్రగొడ్డలితో తలనరికి అవతల పారేసేవాళ్లు; టెల్‌సన్సుబ్యాంకు గేట్లో గుర్రాన్ని ఆపినవాణ్ణి ఖూనీచేసి పారేసేవాళ్లు; పూటా షిల్లింగులు ముద్రించిన రాజద్రోహిని ఉరికంబాన వ్రేలాడదీసేవాళ్లు. శిక్షాస్మృతికి ఏ రవ్వంత అందుబాట్లో వున్నా లాగి పరలోకానికి పంపించేవాళ్లు. అలాచేస్తే నేరాలు తగ్గుతాయని కాదు - నిజానికి అందుకు భిన్నమైన ఫలితాలే వస్తయ్. కాని ఒక ప్రయోజనం వుంది: నేరస్తుణ్ణి గనక అంతం చేసి పారేస్తే, వాడు ఆ నేరం చేయటానికిగల కారణాలేమిటో విచారించవలసిన బెడద ప్రపంచానికి తీరిపోతుంది. అలాగే, తక్కిన పోటీ సంస్థలతోపాటు టెల్ సన్సు కూడా అనేక ప్రాణాలు తీసింది. వాళ్ళందరి తలకాయలూ గోతుల్లో పూడ్చిపెట్టకుండా, ప్రక్కనున్న టెంపుల్‌బార్ గోపురంమీద పేర్చితే టెల్సన్సుబ్యాంకు లోపలికి వచ్చే ఆ కాస్త వెలుగూ కూడా సాంతం మూసుకుపోయేది వాటి నీడపడి.

ఆ బ్యాంకులో పనిచేసేవాళ్లు చాలామంది వృద్ధులే, అథవా యేయువకునికైనా ఒకడికి ఉద్యోగమిస్తే, వాడుకూడా సాంతం ముసలివాడయిపోయే దాకా యే మూలగదిలోనో ఓ మూలగదిలో దాచివుంచేవాళ్ళు. ఆ వ్యక్తిలో టెల్‌సన్సు బ్యాంకు వాసన పుట్టుకొచ్చేదాకా ఊరగాయ మాగబెట్టినట్టు యే మురికిగదిలోనో మాగబెట్టేవాళ్లు. అనంతరం గాని ముందు హాల్లోకి తీసుకొచ్చి ప్రజలకు చూపించేవాళ్లు గాదు.

ఇది ఇలా వుండగా బ్యాంకు గేట్లో, మూటలు మొయ్యటం దగ్గిరనుంచి, వార్తలు జేరవేయటం దాకా అనేకరకాల బాధ్యతలు నిర్వహించుతూ, ఒకవ్యక్తి కూర్చునుండేవాడు- టెల్‌సన్సు బ్యాంకుకు సజీవమైన సైన్‌బోర్డు, ఎప్పుడోయేదో అదనపు పని తగిలి ఎక్కడికో పంపితే తప్ప, ఎప్పుడు చూచినా ఆ గేటు ముందే కూర్చునుండేవాడు. అతను ఎక్కడికేనా వెళ్ళిన తరుణాల్లో కూడా, అదే నకలు పోలికలున్న అతని కొడుకు - జీబుతలతో, పన్నెండేళ్ల కుర్రాడు అతని స్థానంలో కూర్చునుండేవాడు. టెల్‌సన్సు బ్యాంకు, గొప్పకోసం ఆ వ్యక్తిని పోషించుతోందని దోవనుబోయేవాళ్లు అనుకునేవాళ్లు: టెల్‌సన్సు బ్యాంకు ఎప్పుడూ ఎవడో ఒక మనిషిని ఆ స్థానంలో పోషించుతూనే వుంది. ఇప్పుడు ఇతన్ని పోషించుతోంది. ఇతనిపేరు క్రంచర్ జర్రీ.

1780 సంవత్సరం మార్చినెలలో, మంచి గాలీ గట్రా వీస్తున్న కులాసా అయిన ప్రాతఃకాల సమయం. క్రంచర్ యింకా పక్కమీదపడి దొర్లుతూ వున్నారు. చుట్టూ గదిమాత్రం చక్కగా శుభ్రపరిచి వుంది. చిల్లరసామాను గుట్టలుగా పేర్చివున్న జాజికాయ చెక్కలబల్లమీద ముందుభాగంలో తెల్లని గుడ్డపరిచి కప్పులా సాసర్లూ సిద్ధంచేసి వున్నయ్.

క్రంచర్ మంచంమీద నవాబు సాహెబ్‌లా పడుకున్నాడు. పైనున్న మంచం పందిరి రంగురంగుల గుడ్డలతో అతుకులేసి వుంది. మొదట గాఢంగా గుర్రుగొట్టి నిద్రపోతున్నాడు. అనంతరం యిటూ అటూ మెదలటం ప్రారంభించాడు. తరువాత పక్కలోబడి ఉధృతంగా తరంగాలు చుట్టుకోడం దాకా వచ్చాడు. పక్కమీద నుంచి లేస్తుంటే, నెత్తిమీద గసికెలు

దిగేసినట్టున్న బిరుసు వెంట్రుకలు కప్పుకున్న దుప్పటిని రిబ్బన్లు రిబ్బన్లుగా పగల జీరటానికి ప్రయత్నించుతున్నట్టు కనుపించుతోంది. అలా మోచేతులమీద లేస్తూనే ఎలుగ్గొడ్డులా అరిచాడు:

'తస్సాదియా! అనుకుంటానే వుండా!' -

గదిలో మూలగా, మోకరిలి ప్రార్థనలో మునిగివున్న యిల్లాలు ఆ అరుపులు తననేనని తెలుసుకుని, కలవరంగా లేచి కాళ్లు తొక్కుకుంటోంది. నిబ్బరమైన కష్టజీవిలా కనుపించుతోంది. 'ఏంటే - మళ్లా మొదలెట్టావన్నమాట' అంటూ గద్దించాడు, చెప్పుకోసం చుట్టూ వెతుకుతూ.

ఇలా ప్రాతస్సమయసమాశ్వాస మాచరించినవాడై చెప్పుగిరవాటేశాడు. ఆ చెప్పునిండా మూడుతట్టల బురదుంది.

'ఏవిటే చేస్తున్నావ్ బాడ్ఖావ్' అన్నాడు మళ్ళా.

'ఏవీ చెయ్యటంలేదు - ప్రార్థన చేసుకుంటున్నాను'

'నేను నాశనమైపోవాలనేనా?' -

'అయ్యో! అదేంమాట - మీరు కలకాలం చల్లగా వుండాలని ప్రార్థన చేస్తున్నాను.'

'నువ్వా - నా కోసమా - అట్టాంటిదానివైతే చెప్పుదెబ్బలెందుకు తింటావ్! వొరేయ్! అబ్బాయ్ మీ అమ్మగారు సూశావంటరా, పరమ పత్తిత్తురా - నా కోసం దేవుడికి మొరబెడతా వుందంట - నా కోసం గాదు - నేను చచ్చి, నా బిడ్డ నోటికాడకూడు మట్టిలో గలిసిపోవాలని యేడుత్తావుండది' -

తన నోటికాడ కూడు మట్టిలో కలిసిపోవాలని ప్రార్థనలు చేయటం చాలా కిరాతమైన పని అన్నట్టు, కుర్రాడు తల్లివంక కొరకొరా చూశాడు.

మళ్ళీ అందుకున్నాడ క్రంచర్ : 'అసలు నీ ప్రార్థనలేంది - నీ లెక్కేంది - అసలు గుడ్డిగవ్వ జెయ్యని నీ ప్రార్థన లెక్కేందీ అని' -

'అవునండి - మనస్సులో పుట్టే ప్రార్థనకు విలువేవింటి' -

'అంతే గెందా - అసువంటి యెదవ ప్రార్థనలు మానెయ్. దేవుణ్ణి యేడుకున్నావంటే మొగాడు సల్లగా వుండాలనీ, కొడుకు సల్లగా వుండాలనీ యేడుకోవాలిగాని - ఇదేం పాపకర్మ మొచ్చిందిరాదేవుడా! - నువ్వు నా కెప్పుడూ నట్టజాతకం బట్టాలనియేడుకుంటా వుంటావు గనకనే, గతవారం సేతిలోకి రావాల్సిన సొమ్ము సెడి సెనగచేనై ఊరుకుండది. 'గుడ్డలు తొడుక్కుంటూ ఈ వరుసని అరిచేస్తున్నాడు: నీ మూలంగా గాదంట శనేశ్రమా సేతిలో కొచ్చిన సొమ్ము సిటికెలో జారిపోయింది' - కొడుకువంక తిరిగి : 'ఒరే అబ్బీ! గుడ్డలేసుకో - నేను గదిలో కెళ్లి బూడ్సులు తుడుసుకుంటా వుంటానుగానీ, మీ అమ్మని కనిపెడతావుండు- యేడుకోటం గీడుకోటం అంటా మళ్లా మొదలెడతదేవో - మోకాలు కింద మోపిందంటే నన్ను కేకెయ్ తస్సాదియ్యా!' - మళ్లా భార్యవంక తిరిగాడు: 'ఇదిగో! తస్సాదియ్యా! - ఇసవంటి యెర్రెంకటాయ్ యేసాలన్నీ మనముందు తీసెయ్యి. అసలే నేను బొవింకెలపోగై సత్తావుండాను. రేయింబగళ్ళూ కంటిమీన కునుకు లేకుండా సత్తావుండా; సేతిలో యెర్రని యేగానీ లేక యేడుత్తావుండాను. నీ యేడుకోళ్లమూలంగానే యిదంతా ఇట్టా యేడుత్తావుండది. మళ్ళా ఆ యెదవపనిగేనా మొదలెట్టావు గెనకనా సావనూకుతాను - ఏం? తెలిసిందా - బెల్లంగొట్టిన రాయల్లే మాట్టాడవేంది!' -

ఈ విధమైన భాషలో రకరకాల ప్రయోగాలనూ ఘుర్ఘురించుతూ క్రంచర్ బూట్లు తుడవటానికి ఉపక్రమించాడు - తన కొలువుకు బయలుదేరటానికి నాంది ప్రస్తావనగా. తండ్రి ఆదేశానుసారం కుమారుడు తల్లిమీద పహరాకాస్తున్నాడు. గుడ్డా గుడుసూ తొడుక్కుంటూ మధ్య మధ్య - 'ఇదిగో - మోకాటి తండా యేశావంటే! - ఓరయ్యోయ్!'- అంటూ కేకలు బెడుతూ తల్లిని హడలగొడుతున్నాడు.

భోజనం దగ్గిర వొచ్చి కూర్చున్నాడన్న మాటేగానీ, క్రంచర్‌కు యింకా తిక్క తిరగలేదు. భోజనంముందు ఆ యిల్లాలు మళ్ళా ఒకసారి భగవంతుడికి నమస్కారం చెయ్యబోయింది.

'ఇదుగో! తస్సాదియ్యా!' - అంటూ మండిపడ్డాడు.

'నేనేం జేశాను - భగవంతుణ్ణి ఆశీర్వదించమంటున్నాను'

'అనొద్దు' - అంటూ నోట్లో బెట్టుకోబోతున్న రొట్టెముక్క వంక తీవ్రంగా చూస్తున్నాడు. భార్య తనకు వ్యతిరేకంగా భగవత్ప్రార్థన చెయ్యటంవల్ల ఆ రొట్టెముక్క అదృశ్యమై పోతుందేమోనన్న భయంతో చూస్తున్నట్టు.

'నాకు యిల్లూ వాకిలీ లేకుండా నాశనం గావాలనీ, తింటానికి తిండి లేకుండాపోవాలనీ, నువ్వు మరేం దేవుణ్ణి యేడుకోవాల్చిన పనేమీ లేదు. నోరుమూసుకు కూకో.'

ఆ దురాగ్రహంతో, రాత్రితెల్లవార్లూ మేలుకున్న వాడిలా క్రంచర్ కళ్లు చింతనిప్పుల్లా ఎర్రబడిపోయినై. అతను తిండి తినటం గాదు. కోపం మేస్తున్నాడు. భోజనం చేసినంతసేపూ బోనులో జంతువులా భోరుకొలుపుతూనే వున్నాడు. అతను శాంతించి, మామూలు మనిషిగా మారేటప్పటికి దాదాపు తొమ్మిది కావొచ్చింది; నిమాజామా వేసుకుని ఉద్యోగానికి బయలుదేరాడు.

క్రంచర్ జర్రీ తాను మర్యాదస్తుణ్ణనీ ఉద్యోగిననీ డబ్బీలు చరుస్తాడే గాని అలాంటి దేవీ లేదు. అతని ఉద్యోగమంతా టెల్సన్సు బ్యాంకు గేటులో పడుండే కుంటిబల్లమీదే. అది బల్ల కూడా గాదు. వెన్నానుకునే చట్రం విరిగిపోయిన పాతకుర్చీ. ఆ బల్లమీద కూర్చుని త్రోవను పోయే యే బండిలోనుంచో యింత చెత్త దూసుకొచ్చి కాళ్ల క్రింద వేసుకుంటాడు, పాదాలకు తేమ అంటకుండా. అక్కడ అతను ప్రొద్దస్తమానం కూర్చునే వుంటాడు. ఆ ప్రాంతంలో తిరిగే అందరికీ అతను గుర్తే.

ఆ వేళ, అదేప్రకారం గేటుముందు కూర్చునున్నాడు. కొడుకు తండ్రి పక్కనే యిటూ అటూ పచార్లూ చేస్తూ, దోవనుపోయే చేలోకునైన చిన్నపిల్లల్ని దబాయించుతున్నాడు. తండ్రీ కొడుకులిద్దరూ ఒకళ్ళప్రక్క నొకళ్లు త్రోవనుబోయే వాళ్ళవంక చూస్తూ నిలబడితే అచ్చుకోతుల్లా వున్నారు. మధ్య మధ్య తండ్రి ఏమీ తోచక బల్లమీద కూర్చుని గడ్డిపరకలు కొరుకుతున్నాడు.

ఇంతలోనే తలుపులోనుంచి ఒక నౌకరు తల బయటబెట్టి: 'ఏయ్! పిలుస్తావుండారు' అన్నాడు.

'ఒరేయ్! అయ్యోయ్! పిలుత్తా వుండారంట!' అన్నాడు, కుర్రాడు.

తండ్రిని లోపలికి పంపించి కుర్రాడు తండ్రి కూర్చునే బల్లమీద కూర్చుని, తండ్రి మోస్తరుగానే గడ్డిపరగలు కొరకటం మొదలుబెట్టాడు.

'అయ్యచేతులు ఎప్పుడూ మసిబూసుకునేవుంటై. ఆ యినపతుప్పంతా యేడదో' అనుకుంటున్నాడు కుమారుడు.

9

టెల్‌సన్ను బ్యాంకు శతవృద్ధుల్లో ఒకాయన జర్రీవంక చూసి! 'ఓల్డు బెయిలీకోర్టు తెలుసుగా' అన్నాడు.

'తెలుసు సర్! - ఓల్డు బెయిలీ తెలీక పోడవేందీ?' అన్నాడు జర్రీ.

'అవును అదే - లారీగారు తెలుసుగా?'

'ఒర్నీ - లారీగారు తెలీకపోడ వేంటండీ? - అల్లరిసిల్లరోణ్ణిగాను గెనక కోర్టు సంగతి తెల్చుకోవాల్సిన గెతి నాకేంటి గానీండీ - లారీగార్ని మాత్రం కోర్టుకంటే బాగా ఎరుగుదును'

'భేష్! బాగుంది - కోర్టుకెళ్లి, సాక్షుల్ని లోపలికి పంపించే దరవాజాదగ్గిర ఈ చీటీ చూపించు; నిన్ను లోపలికి పంపిస్తారు' -

'ఆరిదేవుఁడా - నేను కోర్టు కెందుకుండీ?'

'వెళ్లాలి' -

జర్రీ కనుబొమలు రెండూ దగ్గిరికి ముడుచుకున్నయ్. సందేహంగా ఆ వృద్ధుడి ముఖంలోకి చూస్తూ :

'నేనుకోర్టు కెల్లాల్సిన అవసరమేందీ అని?'

'చెబుతున్నాగా - నువ్వు గనక చీటీ కోర్టు గేటులోవున్న దర్వానుకు చూపిస్తే, అతను లోపలికి తీసుకుపోయి, లారీగారికి అందజేస్తాడు. నువ్వు లోపలికివెళ్లి యేమూలో ఓ మూల నిల్చునుండు. లారీగారు తలెత్తి చూసినప్పుడు, ఆయనకు కనుపించేలాగు తల ఊపి సౌజ్ఞచెయ్యి; నువ్వు అక్కడున్నట్టు ఆయనకు తెలుస్తుంది. అంతకంటే నువ్వింకేమీ చెయ్యక్కర్లేదు. ఆయన నిన్ను పిల్చేదాకా అక్కడే నిల్చో.'

'ఓస్! ఇంతేగెందా? - ఏవిఁటో ననుకుండానూ!'

'ఎబ్బే మరేంలేదు - ఆయన యెవర్నేనా నౌకర్ను పంపించమన్నారు, నువ్వక్కడున్నట్టు ఆయనకు తెలిస్తే చాలు! -

ఆ వృద్ధపితామహుడు చీటీ వ్రాస్తున్నంతసేపూ, ఆయన వంక చూస్తూ మాట్లాడకుండా అలాగే నిల్చున్నాడు, జర్రీ. ఆయన వ్రాత ముగించి అద్దుడు కాయితం దశకు వచ్చేసరికి:

'ఇయ్యాళ ఫోర్జరీ నేరాలు ఇచారిస్తా వుండారా సర్?' అని అడిగాడు.

'రాజద్రోహాలు'

'ఉరిశిక్ష కేసులన్నమాట; ధర్మవోఁ అధర్మవోఁ అదేందో గానీండీ - మడుసుల్ని ఉరిదియ్యటంమాత్రం అడివి మడుసులు జెయ్యాల్చిన గోరం సర్!' -

'అరె! అలా అనగూడదు' - ఆముసలి ఉద్యోగి కళ్ళజోడు నుదురుమీదకు తోసి జర్రీవంక ఆశ్చర్యంగా చూస్తూ: 'న్యాయశాసనమంటే యేవిఁటిమరి?'-

'నాయవోఁ అద్దాన్నవోఁ గానీండి మడుసుల్ని చీకటి కొట్లలో పారనూకి ఊపిరాడకుండా జెయ్యటం, మెళ్లకు ఉర్లుబోసి పాణాలు దీసెయ్యడం ఇసవంటివన్నీ శానా పాడుపన్లు సర్!'-

'అలా అనగూడదు - న్యాయశాసనాలను గురించి మర్యాదగా మాట్లాడటం నేర్చుకో- ఇదుగో నీకో మంచిసలహా యిస్తా విను - శాసనాల మంచి చెడుగుల సంగతి మనం ఎప్పుడూ యెత్తుకోగూడదు. అవన్నీ పైవాళ్లు చూసుకోవలసిన సంగతులు- మనకెందుకొచ్చిన గొడవ? మన పొట్టతిప్పలు మనం చూసుకోవాలి గాని, ఈ న్యాయాన్యాయాల గొడవలు మన కెందుకు?'

'పొట్ట తిప్పలేంది సర్! శెవఁటోడ్చి సంపాదించుకుంటుండా గాని, యెవుణ్ణేనా అక్రమంజేసి బతుకుతా వుండానా?'

'బ్రతుకు తెరువుకు మంచి చెడు లేవేవిఁటి? - అక్రమాలూ వుంటై, సక్రమాలూ వుంటై - ఇదుగో! చీటీ తీసుకొని - వెళ్లిరా.'

జర్రీ ఉత్తరం మడిచి జేబులో పెట్టుకున్నాడు. గేటుదగ్గిర కూర్చున్న కుమారుడితో తను కోర్టు కెడుతున్నానని చెప్పి వెళ్లిపోయాడు.

ఆ రోజుల్లో, టైబరన్‌లో ఉర్లుదీస్తున్నారు. అందుచేత "న్యూగేట్" ఖైదు అప్పటికింకా అంత దుష్కీర్తి కెక్కలేదు. కాని ఆ జైళ్ళలో వ్యభిచారం వగైరా, కిరాతాలన్నీ విచ్చలవిడిగా సాగిపోతూ వుండేవి. ఖైదీలవెంట లోపలికొచ్చిన అంటువ్యాధులతో జైళ్లు మురుగెత్తిపోతూ వుండేవి. ఒకొక్కప్పుడు ఆ మహావ్యాధులు బోనులోనుంచి యెకాయెకి ప్రధాన న్యాయమూర్తి మీదికే యెగిరి ఆయన్ను న్యాయపీఠంమీదనుంచి పడలాగి హతమార్చేసేవి. ఒకసారి ఇలానే జరిగింది. ఒక ముద్దాయిని విచారిస్తూవుండగా జడ్జీ ఆ ముద్దాయికి మరణశిక్ష విధించి హతమార్చేలోగా, తనకు తానే హతమారిపోయాడు. ఇదిగాక ఓల్డు బెయిలీకి మరో ప్రఖ్యాతి కూడా వుంది. అదో మృత్యుసత్రం; ఊర్ధ్వలోకానికి ప్రయాణం చెయ్యవలసివున్న అనేకమంది హతభాగ్యులు ఆ గేట్లో నుంచి నిరంతరం బయటికి వస్తూవుండేవాళ్ళు. వాళ్ళు ఆ గేటులోనుంచి బయలుదేరి, ఒక రెండున్నర మైళ్ళ దుర్భర ప్రయాణం చేస్తే ఊర్ధ్వలోకానికి యెగిరిపోయే కేంద్రానికి (ఉరిదీసే స్థలం - టైబరన్) చేరేవాళ్ళు. ఓల్డు బెయిలీ కీర్తి మిన్ను ముట్టడానికి ఇంకా అనేక కారణాలున్నయ్. మానవత్వసిద్ధికి తార్కాణాలుగా, విజ్ఞానవేత్తలయిన మహామహులు ప్రతిష్టించిన కొన్ని మహావ్యవస్థలు అక్కడ నిరంతరాయంగా పనిచేస్తూ వుండేవి.- కొరతలు, దెబ్బలశిక్షల ముక్కోణాలూ, ఇత్యాదయః. వీటిని జూసి ప్రజలు సౌజన్యతను అలవరుచుకునేవాళ్లు.

అలాంటి వన్నీ ఆ పుణ్యక్షేత్రంలో వున్నయ్. వాటినన్నిటినీ ఉత్తమమైన వ్యవస్థలుగానే మనం పరిగణించాలి. ఉత్తమమైనవి కాకపోతే ఎందుకుంటై.

ఈ భీభత్స వ్యవస్థల మధ్యనుంచి జనాన్ని మోచేతుల్తో నెట్టుకుని దోవ జేసుకుంటూ జర్రీ సాక్షుల దరవాజా దగ్గిరికి జేరుకున్నాడు. తలుపుకు ప్రత్యేకంగా యేర్పాటు చేసివున్న కన్నంలోనుంచి చీటీ లోపలప్రక్క కూర్చునున్న దర్వానుకు అందించాడు. పిచ్చాసుపత్రి చూడ్డానికి వెళ్లిన వాళ్ళదగ్గిర డబ్బులు వసూలు చేసినట్టే, ఆ రోజుల్లో ఓల్డుబెయిలీ కోర్టు చూడ్డానికి వెళ్లిన వాళ్ళదగ్గిర కూడా టికెట్టు డబ్బులు వసూలు చేసేవాళ్లు - అయితే పిచ్చాసుపత్రి దగ్గిర కంటే, ఎక్కువ రేటు వసూలు చేసేవాళ్లు. అందుచేత కోర్టుచుట్టూ వున్న తలుపులన్నీ భద్రంగా మూసి వుండేవి.

దరవాజా ముందు నిల్చుని కునికిపాట్లు పడగాపడగా ఓ ఝాముకు, తలుపులు, అమిత అయిష్టంగా, అలా కాస్త ఓరు వాకిలిగా తెరుచుకున్నయ్. ఆ సందులో నుంచి జ్రర్రీ లోపలికి వెళ్లి, ఒకమూలగా నిల్చున్నాడు. ఆ మూల అతనితో పాటు చాలామంది జనం నిల్చునున్నారు. ప్రక్కనున్న మనిషిని మోచేత్తో పొడిచి స్ఫురితుణ్ణిచేసి: 'ఏవి జరుగుతోంది?' అని అడిగాడు.

'ఇంకా విచారణేది ప్రారంభం కాలేదు' -

'ఇప్పుడు ఇచారించాల్సిన కేసేంది?'

'రాజద్రోహం'

'ఉరిశిక్ష కేసేనన్న మాట'

'ఆ! ఉరిశిక్షకేసే - ముందు ముద్దాయిని బోనులోకిలాగి సగానికి ప్రాణాలు తీస్తారు - తరువాత విచారణలో లోపల గుండెల్లో వుండే కండరాలనన్నిటినీ బయటికి లాగి ముప్పాతిక చంపుతారు - అనంతరం సాంతం తల గొట్టేస్తారు.

'నేరం రుజూ అయినట్టు జడ్జి నమ్మితే గెందా?'

'నమ్మితీరతారు తమ్ముడూ - నీకా అనుమానం అక్కర్లేదు.'

దరవాజా దగ్గిర కాపలావున్న మనిషి తానిచ్చిన చీటీ పుచ్చుకు లారీ కూర్చున్న చోటికి వెడుతూ వుండటం జ్రర్రీ గమనించాడు. ప్రక్కనున్న మనిషితో ప్రసంగం మానేసి తాను కూడా అటువైపు చూస్తున్నాడు. లారీ, విగ్గులు బెట్టుకున్న పెద్ద మనుషుల వరసలో కూర్చునున్నాడు. ఆయన ప్రక్కనే ముద్దాయి తరపు వకీలు నిల్చునున్నారు. ఆయనముందు ఒక బండెడు కాయితాలు బల్లమీద దొంతర్లు దొంతర్లుగా పేర్చివున్నయ్. ముద్దాయి వకీలుకు ఎదురుగా ఎదటి వరసలో మరో విగ్గుమనిషి కూర్చునున్నాడు. ఆయన ఈ కోర్టుహాల్లో జరిగే వ్యవహారాలతో ఏ విధమైన సంబంధమూ లేనివాడులాగు ఎత్తిన తల దించకుండా పైకప్పు వంక చూస్తున్నాడు. చీటీ చూసుకోగానే, లారీ లేచి నిల్చుని జ్రర్రీ యెక్కడున్నదీ తెలుసుకోవటానికి నాలుగువైపులా పరకాయించి చూస్తున్నాడు. అది గమనించి జ్రర్రీ జనంలోనుంచి కాస్త ముందుకొచ్చి ఒక చిన్న పొడిదగ్గు దగ్గాడు - రెండు మూడుమార్లు గడ్డం సవరించుకున్నాడు - చెయ్యి ఊపి సంజ్ఞ చేశాడు. ఇలా నానా తంటాలూ పడి తానక్కడున్నాననే విషయాన్ని లారీకి తెలియజేశాడు. లారీ జ్రర్రీవంక జూసి, సరేనన్నట్టు తలపంకించి మళ్లా కూర్చున్నాడు.

ఇందాకటినుంచీ, జ్రర్రీతో బాతాఖానీ వేస్తున్న మనిషి మళ్ళీ ఉపక్రమించాడు:

'ఆయనకి ఈ కేసుతో సంబంధం యేవింటీ' -

'తెలీదు బాబా!'

'నీకూ?' -

'అంతకంటే తెలీదు'-

జడ్జీగారు లోపలికొచ్చి తక్తామీది కెక్కారు. ఆయన రావటంతోనే కోర్టులోవున్న వాళ్లంతా పెద్ద సంచలనంగా లేచి నిల్చున్నారు. ఆయన కూర్చోగానే మళ్ళీ యెక్కడి వాళ్లక్కడ సర్దుకు కూర్చున్నారు.

మరుక్షణంలో కోర్టులోవున్న యావన్మంది దృష్టులూ బోనులోకి ఎక్కిన ముద్దాయివైపు ప్రసరించినై.

పైకప్పు వంకచూస్తున్న ఆవిగ్గు పెద్దమనిషి ఒక్కడు మినహా, అంతా అటే చూస్తున్నారు. జనంవిడుస్తున్న నిశ్వాసాలన్నీ గాలిలో కలిసి అగ్ని జ్వాలల్లా అతని వేపే వ్యాపించుతున్నయ్. స్తంభాలు వగైరా అడ్డున్న వ్యక్తులు ప్రక్కకు వంగి తొంగి చూస్తున్నారు. వెనక బెంచీలమీద కూర్చునున్న వాళ్ళు ముందున్న వాళ్ల తలలు అడ్డొచ్చి, లేచి నిల్చుంటున్నారు. నేలమీద కూర్చున్న వాళ్లలో వెనకున్న వాళ్ళు ముందున్న వాళ్ళ భుజాలు బలవంతాన వంచిమరీ చూస్తున్నారు. ఈ జనసమూహంలో జ్రర్రీతల, గసికెలు దిగేసిన న్యూగేట్ ప్రహారీగోడలా విచిత్రంగా కనుపించుతోంది. తాను వస్తూ వస్తూ త్రోవలో త్రాగివచ్చిన బీరు సుగంధాన్ని ముద్దాయి మీదికి వదులుతూ అతనివంక రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

బోనులోవున్న ముద్దాయి ఇరవై సంవత్సరాల వయసులో వున్న యువకుడు. బలిష్టమైన శరీరం; అందమైన విగ్రహం; ఎండకు గోధుమ వర్ణంగా తిరిగిన నునుపైన చెక్కిళ్లు; కొట్టొచ్చినట్టున్న మిలమిలలాడే నల్లటికళ్లు. మామూలు సాదాదుస్తులు నల్లటివి తొడుక్కునున్నాడు. బాగా పెరిగి వుంగరాలు తిరిగిన క్రాఫింగ్ జుట్టు రిబ్బనుతో వెనక్కు బిగించివుంది. ఆ రిబ్బను, జుట్టు ముఖం మీదికి పడకుండా వుండటానికి కట్టిన బాపతుగాని, అలంకారానికి కట్టిందిగాదు. ముఖంచూస్తే మనిషి సంగతి తెలుస్తుందంటారు. అతని ఆత్మవిశ్వాసం, సూర్యుని ప్రతిభకంటే బలీయమైనదిగా, గోధుమ వర్ణానికి తిరిగిన అతని చెక్కిళ్ళమీద ద్యోతమానమౌతోంది. మిన్ను విరిగి పైనబడ్డా చలించని ఆత్మవిశ్వాసం, గాంభీర్యం - అదీ అతని మూర్తి. తలవంచి జడ్జీకి నమస్కరించి మౌనంగా బోనులో నిల్చునున్నాడు.

ఆ జనం అతనివంక అలా చూడడంలో గల ఔత్సుక్యమేవిఁటి? మానవత్వపు ఔధార్యమా? అలాంటి ఘోరమైన శిక్షకు పాత్రుడు కాబోతున్నాడన్న సంగతి లేకపోతే అతనివంక యెవరేనా చూసేవారా? ఘోరమైన యాతనా మరణాన్ని పొందబోతున్న వ్యక్తికావటంచేతనే, అందరికీ అతన్ని చూడాలనే ఔత్సుక్యం. కసాయితనంగా అతన్ని నరకబోతున్నారనేదే సర్దా. ఆత్మవంచకులైన వాళ్లు ఈ ఔత్సుక్యానికి యేదైనా పెద్ద పేరు పెడితే పెడతారుగాక - పరాయిప్రాణి హింసబడుతుంటే చూసి ఆనందించే రాక్షస స్వభావం మినహా అది మరోటిగాదు.

'సైలెన్స్!' బెంచిప్యూన్ కేకబెట్టాడు.

'చార్లెస్ డార్నే అనే ఈ ముద్దాయి, మహా ఘనత వహించినట్టిన్నీ, దొడ్డవారయినట్టిన్నీ, ఇంకా యేదో అయినట్టిన్నీ, మన రాజుగారి పట్ల ద్రోహబుద్ధితో వర్తించుతూ, మన రాజుగారికి శత్రువయినట్టిన్నీ, మనరాజుగారితో యుద్ధకార్యం నడపుతూన్నటువంటిన్నీ, ఫ్రెంచి రాజైన లూయీకి పరోక్షము గానూ, బహిరంగముగానూ, యితరత్రానూ, సాయపడుతున్నాడనీ, పైన పేర్కొనబడిన మహాఘనత వహించిన వగైరా దొడ్డ ప్రభువులైన మన రాజుగారి యొక్కయూ, పైన పేర్కొనబడిన సదరహీ ఫ్రెంచి రాజు లూయీగారి యొక్కయూ, దేశముల మధ్య తిరుగుతూ, దుర్బుద్ధితోనూ, నమ్మక ద్రోహము గానూ, రాజద్రోహము గానూ, ఇంకా

యితరత్రా పేర్కొనదగిన అన్ని విధాలైన దుశ్చింతలతోనూ, ఘనత వహించిన వగైరా మనరాజుగారి సైనిక దళాలు కెనడా, ఉత్తర అమెరికాలను పంపబడుతున్నాయనే రహస్యాన్ని సదరహీ ఫ్రెంచిరాజుకు తెలియపరచినట్టున్నూ, రాజద్రోహ నేరము మోపబడి యున్నది. సదరహీ ముద్దాయి తాను నిర్దోషి అయినట్టు నిన్నటి దినం కోర్టువారి యెదుట వాదించి వున్నాడు'

అక్కడికి అర్థం చేసుకునేసరికి జర్రీకి తలప్రాణం తోకకు వచ్చింది. ఆ న్యాయస్థాన పారిభాషికపదాల ప్రభంజనంతో అతని తలమీద గసిక వెంట్రుకలు మరింత చికాగ్గా లేచినిల్చునయ్. నానా తంటాలూ బడి, పదేపదే పైన పేర్కొనబడిన బోనులో నిల్చునున్న ఆ ముద్దాయి పేరు చార్లెస్ డార్నే అనీ, జూరీలచేత ప్రమాణం చేయిస్తున్నారనీ, ప్రభుత్వం తరఫున అటార్నే జనరలు మాట్టాడబోతున్నారనీ జర్రీ తెలుసుకున్నాడు.

అక్కడున్న యావన్మందిచేతా, మానసికంగా ఉరిదీయబడుతూ, చిత్రవధ చేయబడుతూ, ముక్కలు ముక్కలుగా రంపపు కోతలు కోయబడుతున్న ఆ ముద్దాయి, ఆ పరిస్థితులకు చిన్నబుచ్చుకోకుండా, ఆవేశవివశుడుగాకుండా ప్రశాంతంగా నిల్చుని విచారణలో నడుస్తున్న వాదప్రతివాదాలను అత్యంత శ్రద్ధగా అర్థంచేసుకున్నాడు. తన చేతులు రెండూ బోను ముందుభాగంలో అమర్చివున్న కటకటాలమీద వేసి కదలకుండా నిల్చున్నాడు.

ముద్దాయికి నెత్తిపైగా ఒక పెద్ద అద్దం అమర్చివుంది. అనేక మంది దుష్టుల రూపాలూ, హతభాగ్యుల రూపాలూ ఆ అద్దంలో ప్రతిబింబించినై. వాళ్లంతా ఆ అద్దంలోనుంచే గాక ఈలోకంలోనుంచే తుడిచివేయబడ్డారు.

ఆ అద్దం కాంతి ముఖంమీదపడి, ముద్దాయి, ముఖం ఎడంవైపుకు తిప్పేసుకున్నాడు. అటు తిరిగేసరికి జడ్జి బెంచికి ఆ మూలగా కూర్చునున్న యిద్దరు వ్యక్తులు అతని కంటబడ్డారు. వాళ్ళని చూడ్డంతోనే అతని ముఖ కవళికలు అలా హఠాత్తుగా మారటంతో అతనివంక చూస్తున్న వాళ్లంతా ఏవిటా అని ఒక్కసారి అటు తిరిగి ఆ వ్యక్తులవంక చూచారు.

సుమారు ఇరవై సంవత్సరాల వయసులో వున్న ఒక పడుచూ, ఆ అమ్మాయి తండ్రిలా కనుపించుతున్న ముగ్గుబుట్టలా తల నెరిసివున్న ఒక పురుషుడూ వాళ్ల కళ్లబడ్డారు. ఆయన ముఖం అదో తరహాగా వుంది. తనలో తను ఏదో ఆలోచించుకుంటున్న వాడిలాగు అయోమయంగా వున్నాడు. అలా మధనపడుతూ కూర్చున్నప్పుడు ఆయన ముసలివాడుగా కనుపిస్తున్నాడు. మళ్లీ క్షణంలో స్ఫురితుడై కూతురుతో మాట్టాడేటప్పుడు చాలా పడుచువాడులా కనుపించుతున్నాడు.

కూతురు, తండ్రిదండ చేతికి తన చెయ్యి మెలికెవేసి, దగ్గిరసా అంటిపెట్టుకు కూర్చునుంది. ఆ వాతావరణమంతా చూస్తే ఆవిడకు గాబరాగావుంది. ముద్దాయివంక చూస్తే, ఆవిడ పేగులు జాలిగా కళవళించుతున్నయ్. అతనున్న ప్రమాదాన్ని అర్థం చేసుకోవటంవల్ల ఆవిడ మనస్సంతా కంగారుగావుంది. జాలిపేగులవల్ల ఉత్పన్నమవుతూన్న ఆ భయావేశం యావత్తూ ఆవిడ నుదురుమీద కొట్టొచ్చినట్టు కనుపించుతోంది. ఆ జాలిపేగుల తల్లివంక చూస్తే అదివరకు ముద్దాయిపట్ల యేవిధమైన దయాదాక్షిణ్యాలూ లేకుండా కూర్చున్న

వాళ్ళందరికీకూడా, హృదయం చలించిపోతోంది. 'వాళ్లెవరూ?' ప్రతిఒక్కడూ పక్కవాణి అడుగుతున్నాడు.

జర్రి చేతివ్రేళ్లు నోట్లో బెట్టుకుని, వాటికున్న తుప్పంతా చీకుతూ, అక్కడ జరుగుతున్నతతంగమంతా చూస్తున్నాడు. ఆ యిద్దరి సంగతీ వచ్చేసరికి వాళ్లెవళ్లో తెలుసుకోవాలనే ఉద్దేశంతో మెడ నిక్కబెట్టి చూస్తున్నాడు. వాళ్లయిద్దరి భోగట్టా ఒకరినుంచి ఒకరికి అంచలమీద వ్యాపించుకొస్తోంది. అలా అలా వ్యాపించి జర్రీదాకా వచ్చింది.

'సాక్షులు' –

'ఏతరఫు?' –

'ప్రాసిక్యూషన్ తరఫు'

ముద్దాయి ప్రాణాలను గుప్పెట్లో బెట్టుకు కూర్చునున్న జడ్జీగారు ఈ యిద్దరి వైపునుంచీ చూపుమరలించుకుని, కుర్చీలో యాలగిలబడి ముద్దాయివంక తీవ్రంగా చూస్తున్నారు. అటార్నేజనరల్ ముద్దాయిని ఉరికంబానికి వ్రేలాడదీయించటానికి కావలసినతాడూ దగరా పేనుకుంటూ సన్నద్ధుడై లేచి నిల్చుంటున్నాడు.

10

అటార్నే జనరల్ ప్రాసిక్యూషన్ ఉద్ఘాటన ప్రారంభించాడు :

'ముద్దాయి, వయస్సులో చిన్నవాడే అయినా రాజద్రోహ నేరాలలో ఆరితేరిన వృద్ధుడు. ముద్దాయి దుశ్చర్యలను ఋజూ చెయ్యటానికి కోర్టువారి ముందు దాఖలు చేసుకుంటున్న ఈ రికార్డు యావత్తూ, ఈ వేళదీ నిన్నటిదీ గాదు, నిరుటి సంవత్సరాందీ ముందటేడుదీ కూడాగాదు. ఇప్పటికి అనేక సంవత్సరాల నుంచీ ముద్దాయి ఇంగ్లాండు ఫ్రాన్సు దేశాల మధ్య తిరుగుతూ ఈ రహస్య వ్యవహారాలను నడుపుతున్నాడు. తను అలా తిరుగుతూ వుండటానికి సరియైన కారణాలను వేటినీ ముద్దాయి కోర్టువారి యెదుట చెప్పుకోలేదు. ముద్దాయి యింకా ఆరితేరిన గడుగ్గాయి అయినట్టయితే యీ నేరం అసలు బయటికి వచ్చేదేగాదు. కాని, అదృష్టవశాత్తూ, భగవంతుడు ఒక పెద్దమనిషి హృదయంలో ప్రవేశించి, ఈ వ్యవహారమంతా ఆయనచేత బయట బెట్టించాడు; ఆయన చాలా ఘరానామనిషి, మంచి నడవడిగల మర్యాదస్థుడు; నిజాయితీగల పెద్దమనిషి కావటంచేత, ముద్దాయి నడుపుతున్న కుట్రలను గమనించి, విభ్రాంతుడై, ఆ దేశద్రోహచర్యలను భరించలేక, ఏలినవారి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగారికీ, మహాఘనత వహించిన ప్రివీకౌన్సిలువారికీ నివేదించుకుని వున్నాడు. నిజాయితీ పెద్దమనిషి అయిన యీ ఘరానాసాక్షిని కోర్టువారి సముఖాన హాజరుపర్చటానికి సిద్ధంగా వున్నాం.

'ఈ సాక్షి, చిరకాలంగా, ముద్దాయికి మిత్రుడు అయినప్పటికీ, పరమదేశభక్తి తత్పరుడు కావటంచేత, ముద్దాయి జరుపుతున్న ఈ దేశద్రోహచర్యలను సహించలేక బయటబెట్టాడు. ఇక్కడ ఇంగ్లండులో అలాంటి సాంప్రదాయం లేదుగాని, గ్రీసు, రోమ్ దేశాలలోమోస్తరుగా దేశభక్తులకు శిలావిగ్రహాలు ప్రతిష్ఠించే సాంప్రదాయం వున్నట్టయితే, యీ దేశభక్తుడికి

కూడా అలాంటి శిలాప్రతిమ ఒకటి వేయవలసివుంటుంది. మహాకవులు వక్కాణించినట్లు: "సుగుణ సంపద అనేది అంటువ్యాధి లాంటిది!" ఆ మహాకవుల వాక్యాలు కోర్టువారికీ జూరీలకూ నాలుకతుదిని ఆడుతూనే వుంటాయని నాకు తెలుసు. (ఆ మహా కవుల వాక్యాలేమిటో ఎరగని అజ్ఞానంలో జూరీ పెద్ద మనుషులు తెల్లముఖాలేసి బుర్రలు గోక్కుంటున్నారు.) అలాంటి సుగుణ సంపత్తిలో దేశభక్తి అనేది మరింత తీవ్రమైన అంటువ్యాధి. అది పైన పేర్కొన్న సదరు ఘరానాసాక్షి నుంచి రెండవసాక్షి అయిన ముద్దాయి తాలూకు డ్రాయర్లు, జేబులూ తడవాలనీ, ఆయన తాలూకూ కాయితాలు కాజెయ్యాలనీ సద్బుద్ధిని కలిగించింది. ఇలా చేసినందుకు సదరు సాక్షిని చాలా నీచుడుగా చూసినవారు కూడా వున్నారు. కాని, అటార్నే జనరల్‌నైన నేను మాత్రం అతన్ని నా అన్నదమ్ములకంటేను, అక్క చెల్లెళ్లకంటేనూ కూడా యెక్కువైనవాడుగా పరిగణించుతున్నాను. మళ్ళీ మాట్లాడితే మానాన్న అమ్మకంటేనూగూడా గౌరవనీయుడంటాను. కోర్టు వారు కూడా అలాగే పరిగణించగలరని నమ్ముతున్నాను. ఈయిద్దరు సాక్షులనూ విచారించి, వారివల్ల లభించిన ఈ రికార్డులను పరిశీలించినట్టయితే, నేరస్థుడు తనదగ్గిర, మహాఘనత వహించిన రాజుగారి సైనికదళాల జాబితాలు ఉంచుకున్నాడనే విషయం ఋజూ అవుతుంది. నౌకాదళాలకూ, భూసైన్యానికి సంబంధించిన అనేక పరమరహస్యాలు అతనిదగ్గర వుంచుకున్నాడనే విషయం బాహాటంగా ఋజూ అవుతుంది. తద్వారా అతను అలాంటి రహస్యాలనన్నిటినీ, చాలా రోజులనుంచీ, అలవాటుగా శత్రుదేశానికి అందజేస్తున్నాడని నిర్ధారణ అవుతుంది.

'ఈ జాపితాలు ముద్దాయి స్వదస్తూరిలోవున్నట్టు నిరూపించటానికి తగిన ఆధారాలేమీ లేవు. కాని, అవి అతని స్వదస్తూరిలో లేకపోవటమే, కేసుకు బలం. ఎంచేతనంటే, ఇలాటి స్వల్పమైన విషయాలలో కూడా జాగ్రత్తలు తీసుకోవటంవల్ల ముద్దాయి బాగా ఆరితేరిన పుండాకోరని కచ్చితంగా ఋజూ అవుతున్నది. ఇల్లాంటి నిరూపణలన్నీ వున్న కారణంగా, రాజభక్తులు, బాధ్యతగలవారూ అయిన జూరీ, తమకిష్టమున్నా లేకపోయినా, ముద్దాయి నేరస్థుడని నిరూపించి, అతన్ని తుదముట్టించవలసి వుంటుంది. అలా ముద్దాయి తలను గనక కత్తిరించివేయకపోయినట్లయితే, మీరు గాని, మీ భార్యలు గాని, మీ బిడ్డలు గాని, మీ వారసులు గాని, మీ బాధ్యస్థులు గాని యెవ్వరూ గుండెలమీద చెయ్యేసుకు నిద్రపోయే ఆస్కారం తప్పుతుంది. అంచేత కోర్టువారు న్యాయం విచారించి, ముద్దాయిని తలగొట్టించివేయగలరని ఆశించుతున్నాను' అంటూ ముగింపుచేశాడు.

అటార్నే జనరల్ తన ఉద్ఘాటనను ముగింపుచేసి కూర్చోగానే, కోర్టుహాలు యావత్తూ కందిరీగల మోతలా ఒక్కసారి ఝుమ్ముమని రొదసాగింది. ఆ రొద మళ్ళీ కాస్త సర్దుమణిగేటప్పటికే, పరమపవిత్రుడైన ఆ ఒకటవ సాక్షి సాక్షులబోనులో నిల్చునున్నాడు.

అటార్నే జనరల్ ధోరణిని అందిపుచ్చుకుని సొలిసిటర్ జనరల్ సాక్షిని కొన్ని ప్రశ్నలడిగి ఈవిధంగా అతనిచేత పలికించాడు:

'నాపేరు జాన్‌బర్సాద్; నాగురించీ, నాసాక్ష్యాన్ని గురించీ అటార్నే జనరల్ తమవాదంలో చెప్పిందంతా అతికచ్చితమైన పరమసత్యం'.

పరమ పవిత్రమైన తన హృదయంలోవున్న ఈ భారాన్ని అలా దించేసుకుని సాక్షి హాయిగా అవతలికి వెళ్ళిపోయేవాడే గాని, ముద్దాయితరపు వకీలు సాక్షిని కొన్ని ప్రశ్నలడుగవలసి వున్నదని లేచి నిల్చోవటంతో తప్పనిసరి కర్మక్రింద అక్కడే నిల్చోవలసివచ్చింది!

'నువ్వు స్వయంగా యెప్పుడేనా గూఢచారిగా పని చేశావా?'

'ఎబ్బే! ఛీ! నేనే వెరుగుదును'

'నీ జీవనోపాధియేవిటి?'

'ఆస్తివుంది' -

'ఎక్కడుంది?'

'ఎక్కడుందో సరీగా జ్ఞాపకం లేదు'

'ఆస్తి యేరూపంలో వుంది?'

'నా ఆస్తి యేరూపంలో వుంటే యెవరికేం?'-

'ఎవరివల్లనేనా సంక్రమిచిందా?'

'అవును'

'ఎవరివల్ల?'

'ఒక బంధువు?'

'ఎవరా బంధువు?'

'చాలా దూరపుబంధువు'

'ఎప్పుడేనా జైలు కెళ్ళావా?'

'ఎప్పుడూ వెళ్ళలేదు'-

'ఋణం ఎగబెట్టి జైలుకెళ్ళలేదూ?'

'లేదు'

'నిజం చెప్పు'

'వెళ్లాను'-

'ఎన్నిసార్లు'

'రెండు మూడుసార్లు'-

'రెండు మూడుసార్లేనా? - అయిదారుసార్లు కాదూ?'-

'అయితే కావచ్చు'

'నీ వృత్తేవిటి?'

'పెద్దమనిషి-'

'ఎప్పుడేనా తన్నులు తిన్నావా?'

'తినుండొచ్చు'

'తరుచుగా తింటూవుంటావా?'

'లేదు'

'మేడమెట్లమీదినుంచి కిందబడేటట్టు ఎవరేనా తన్నారా?'

'తన్నటం తన్నారుగాని, పడటంమాత్రం నేనే పడ్డాను.'

'జూదంలో దగా చేసినందుకేనా తన్నులు తిన్నది'

'నన్ను తన్నిన అబద్ధాలకోరు, తాగుండి అలా పేలాడుగాని, ఆ మాట నిజంగాదు-

'జూదంలో దగాచేసి బ్రతకటమేనా నీ జీవనోపాధి?'-

'కాదు'

'పోనీ జూదమేనా ప్రధానవృత్తి?-

'నా ఒక్కడిమాటే ఏవిటి? పెద్దమనుషులైనవాళ్లు ఎందరు అలా జీవించటంలేదు'-

'ముద్దాయిదగ్గిర అప్పులు పుచ్చుకునేవాడివా?'

'అవును'

'తీసుకున్న అప్పుతిరిగి యిచ్చిందెప్పుడేనా వుందా?'

'లేదు.'

'ఇదేనా నీకు ముద్దాయితో పరిచయం? ఇంతకంటే యేమైనా వుందా?'

'ఆయనవెంట కాఫీహోటళ్లకి వాటికీ వెళ్ళేవాణ్ణి. సిగరెట్లు కూడా కొనిపెట్టేవాడు.'

'నిజంగా యీ జాపితాలు ముద్దాయిదగ్గిరుండగా నువ్వు చూశావా'

'ఆ చూశాను'

'వీటిని సృష్టించింది నువ్వుకాదా?'

'కాదు'

'ఈసాక్ష్యం చెప్పినందుకు నీకేమన్నా ముట్టుతుందా?'

'లేదు'-

'గవర్నమెంటు జీతబత్యాలు పుచ్చుకుంటున్న రహస్యోద్యోగివా?'

'కాదు'

'ప్రమాణంచేసి చెప్పగలవా'

'ప్రమాణాలకేమిటి తొంభై ప్రమాణాలు చేస్తాను.'

'ఈ సాక్ష్యం చెప్పటంలో దేశభక్తితత్పరత తప్ప నీకు మరో ఉద్దేశమేమీ లేదా?'

'ససేమీ లేదు'

అనంతరం స్వామిభక్తి పరాయణుడైన రెండవసాక్షి బోనులోకి యెక్కి ప్రమాణస్వీకరణాదికంతో ఇలా సాక్ష్యాని కుపక్రమించాడు:

'నేను ముద్దాయికి చాలా నమ్మకమైన నౌకరును. ఆయన దగ్గిర నౌకరీకి కుదిరి నాలుగు సంవత్సరాలైంది. ఆయన మొదటిపర్యాయం, కెలేరేవులో టపా పడవలో కనుపించారు. నౌకరీ యిప్పించమని అడిగాను. నౌకరీ యిప్పించారు. నౌకరీలో చేరిన కొద్దిరోజులకే యజమానిచర్యలు నాకు చాలా అనుమానాస్పదంగా కనుపించాయి. అప్పటినుంచీ ఆయన్ను ఒకకంట కనిపెడుతూనే వున్నాను. టపాపడవలో ప్రయాణం చేస్తున్నప్పుడల్లా యీ జాపితాలు ఆయన జేబుల్లో వుండటం చాలాసార్లు చూశాను. ఈ జాపితాలు నేనే డ్రాయర్లో పెట్టాననేమాట అబద్ధం. ఈలాంటి జాపితాలనే కెలే రేవులోనూ, బొలాన్ రేవులోనూ కూడా ముద్దాయి ఎవరో ఫ్రెంచివాళ్లకు చూపించుతూవుండటం నేను గమనించాను. నాకు నాదేశంమీద చచ్చేటంత భక్తి; అంచేత భరించలేక యీ విషయాన్ని అధికారులకు తెలియజేశాను. నేను వెండిగిన్నె దొంగిలించినట్టు ఎప్పుడూ అనుమానింపబడలేదు. అది ఆవాలుపోసుకునేగిన్నె. - తీరాచూస్తే అది గిల్టుగిన్నె. మొదటిసాక్షితో ఏడెనిమిది సంవత్సరాలనుంచీ పరిచయముంది. ఈ పరిచయం యేర్పడటానికి ప్రత్యేక కారణాలేమీ లేవు. ఈ సాక్ష్యం చెప్పటంలో దేశభక్తి మినహా మరో ఉద్దేశమేమీ లేదు. నేను నిజాయితీగల బ్రిటిష్ పౌరుణ్ణి; నావంటి నిజాయితీ మనుషులు ఈదేశంలో ఇంకా చాలామంది వుంటారనే నా ఉద్దేశం.'

మళ్ళీ కోర్టుహాల్లో కందిరీగలమోత చెలరేగింది. అటార్నీ జనరల్ జర్విస్ లారీని బోనెక్కించాడు:

'జర్విన్ లారీ, మీరు టెల్‌సన్సు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారా?'

'అవును'

'1775 సంవత్సరం నవంబరునెల ఆఖరువారంలో శుక్రవారంనాడు రాత్రి మీరు లండన్‌నుంచి డోవరుకు మెయిలు కోచ్‌లో ప్రయాణం చేశారా?'

'చేశాను'

'ఆ కోచ్‌లో మీతోపాటు యెవరన్నా ప్రయాణీకులున్నారా'

'ఇద్దరున్నారు'

'వాళ్లిద్దరూ, రాత్రివేళ మార్గమధ్యంలో దిగిపోయారా లేదా?'

'దిగిపోయారు'

'లారీగారూ! ముద్దాయివంక చూడండి! ఈ యిద్దరు ప్రయాణికుల్లో ఈ ముద్దాయి ఒకడేమో చూడండి'

'చెప్పలేను'

'ఇతనిలో, అయిద్దరి ప్రయాణికుల్లో ఏ ఒకరి పోలికలన్నా వున్నట్టు తోస్తోందా?'

'అదికూడా యేవీ చెప్పలేను - చెప్పటానికి వీల్లేదు. ఆ రాత్రికన్నూ కన్నూ పొడుచుకున్నా కనుపించని కటికచీకటి. చలికి ఆపాదమస్తకం ముసుకులు బెట్టుకుని వున్నాం. ఒకరితో ఒకరు మాటాడుకోనైనా లేదు.'

'లారీగారూ ముద్దాయివంక మరో పర్యాయం చూడండి. అలా చుట్టబెట్టుకునే ఉన్నాడనుకోండి. ఆస్థితిలో ఇతని ఒడ్డూ పొడుగునుబట్టి, ఆ మనిషికాదని ఖండితంగా చెప్పటానికి ఏమైనా వీలుందా'

'లేదు.'

'ఆ యిద్దరిలో ఇతను లేడని మీరు ఖండితంగా చెప్పగలరా?'

'చెప్పలేను'

'కనీసం, ఆయిద్దరిలో యితను ఒకడై వుండటానికి అభ్యంతరమేమీ లేదనేవిషయాన్ని అంగీకరిస్తారా?'

'అంగీకరిస్తాను - అయితే ఒకమాటమాత్రం చెప్పాలి. ఆవేళ మేము ముగ్గురంకూడా మధ్యదోవలో యెక్కడ దొంగలుకొట్టి చంపుతారోనని ప్రాణాలు గుప్పిట్లో బెట్టుకుని గజగజలాడాం. ముద్దాయినిచూస్తే అలాంటి జారుగుండెమనిషిలా కనుపించటం లేదు.'

'భయాన్ని నటించేవాళ్ళు ఉంటారని మీకు తెలుసా?'

'తెలుసు.'

'లారీగారూ! ముద్దాయి ముఖంవంక మళ్లీ ఒక పర్యాయం చూడండి! ఇతణ్ణి ముఖాముఖి మీరు లోగడ యెప్పుడైనా చూశారా?'

'చూశాను.'

'ఎప్పుడు?'

'నేను ఫ్రాన్సు నుంచి తిరిగి వస్తూవుండగా, కెలేరేవులో, ముద్దాయి నేను ప్రయాణం చేస్తున్న పడవలోకి యెక్కాడు. నాతోపాటే ప్రయాణం చేశాడు!'

'ముద్దాయి పడవలోకి యెక్కేసరికి యేవేళ అయివుంటుంది'

'నడిరేయి దాటివుంటుంది.'

'అర్ధరాత్రివేళ పడవెక్కాడన్నమాట! - ఆ వేళగాని వేళప్పుడు పడవలోకి యెక్కింది అతను ఒక్కడే గాదూ?'

'అతను ఒక్కడే యెక్కడం తటస్థించింది.'

'తటస్థించటం సంగతి అలా వుంచండి - అర్ధరాత్రి సమయంలో పడవెక్కింది అతనొక్కడే.'

'అవును.'

'ఆ సమయంలో మీరు ఒంటరిగా ప్రయాణం చేస్తున్నారా, మీతోపాటు మరెవరన్నా వున్నారా?'

'నాతోపాటు యిద్దరున్నారు. ఒక స్త్రీ, ఒక పురుషుడూ; వారిద్దరూ ఇప్పుడు ఇక్కడ కోర్టులోనే వున్నారు.'

'సరే వున్నారు - సరేగాని లారీగారూ ప్రయాణ సమయంలో ముద్దాయి మీతో యేమేనా మాట్లాడాడా?'

'లేదు - తుపానుగాలి పట్టుకుని - భయం భయంగా అంతా పడవలో బిక్కు బిక్కుమంటున్నాం. ఈ వొడ్డునుంచి ఆ వొడ్డుదాకా, ప్రయాణం చేసినంతసేపూ, నేను కళ్ళుమూసుకుని సోఫామీదపడుకున్నానేగాని మాట్లాడలేదు.'

'మిస్ మానెట్!!'-

కోర్టులోవున్న యావన్మంది కళ్ళూ ఆయువతివైపు ప్రసరించినై. ఆ అమ్మాయి తను కూర్చున్నచోటనే లేచి నిల్చుంది. కూతురుతోపాటు తండ్రికూడా లేచి నిల్చున్నాడు - కూతురు దండచెయ్యి పట్టుకునేవున్నాడు.

11

మిస్ మానెట్! అలా ఖైదీవంక చూడండి!' అన్నాడు, అటార్నే జనరల్.

యౌవ్వన సౌందర్యాలు మిసమిసలాడుతూన్న ఆ జాలికళ్ళ మనోహర స్త్రీ మూర్తి, తనకు ప్రతికక్షిగా నిలబడటంతో, బోనులోవున్న ముద్దాయికి యేదో చెప్పరాని ఉత్కంఠ కలిగింది. ఆ గిజాటులో బోను కటకటాలమీద అతని అరచేతులు ఆందోళనగా కదులుతున్నయ్. అక్కడ కూర్చున్న జనం తన ఆవేశాన్ని గమనించుతున్నారనే స్పృహ కూడా అతనికి లేదు. ఉబికి వస్తున్న ఆవేశాన్ని అణచుకోలేకపోతున్నాడు. పెదవులు చలించిపోతున్నయ్. హృదయం స్పందించిపోతోంది. కోర్టు హాల్లో కందిరీగలమోత మరింత జోరైంది.

'మిస్ మానెట్! - ఖైదీని లోగడ యెప్పుడేనా చూచినట్టున్నదా?'-

'చూచాను సర్!'-

'ఎక్కడ?'

'ఇందాక లారీగారు చెప్పిన పడవలోనే నండి - అప్పుడే నేనూ చూచాను'-

'లారీగారు పడవలో తనతోపాటు ప్రయాణం చేశారన్న స్త్రీ మీరేనా?'-

'దురదృష్టవశాత్తూ నేనే.'

ఆ మాటలలోవున్న జాలి జడ్జీగారి కఠోర కంఠంధ్వనిలో మునిగిపోయింది: 'దురదృష్టం, గిరదృష్టం ఇలాంటి వ్యాఖ్యానాలు అనవసరం. అడిగినదానికి సమాధానం చెప్పు' - అని గాండ్రించాడు.

'మిస్ మానెట్, ఆ ప్రయాణసందర్భంలో ఖైదీ మీతో మాట్లాడిన మాటలేమైనా జ్ఞప్తికి తెచ్చుకోగలరా?'-

'ఆఁ జ్ఞాపకమున్నయ్'-

'సరే, చెప్పండి.'

'వారు పడవలోకి వచ్చినప్పుడు...'

'వారూ? - అంటే యెవరు ఖైదీ సంగతేనా?' అన్నాడు జడ్జీ'

'అవును'-

'అయితే - ఖైదీ అనే చెప్పు - వారూ గీరూ అనకు'-

'ఖైదీ పడవలోకి వచ్చి, మానాన్నగారు చాలా అనారోగ్యస్థితిలో అలసిపోయి వుండటం గమనించారు. మానాన్న చాలా క్షీణించిపోయి వుండటంచేత, ఆయన్ని గాలిలో, పడవ పైభాగానే పక్కవేసి పడుకోబెట్టాను. ఆయన ప్రక్కనే కూర్చుని సేవచేస్తున్నాను. ఆవేళ పడవలో మేము నలుగురంతప్ప ఇతర ప్రయాణీకులెవరూ లేరు. ఆయన మా నాన్నగారి స్థితి చూసి చాలా జాలిపడ్డారు. పడవ రేవులోనుంచి బయలుదేరగానే, ఎక్కువగాలి, చలీ వేస్తుందని అన్నారు. ఎక్కువ చలిగాలి తగలకుండా తగినయేర్పాటు చెయ్యాలన్నారు'-

'ఆయన పడవలోకి ఒక్కడే వచ్చాడా?'

'ఒక్కరే రాలేదు'

'ఆయనతో ఎంతమందున్నారు?'

'ఇద్దరు ఫ్రెంచి పెద్దమనుషులున్నారు'

'వాళ్లుముగ్గురూ ఏదైనా మాట్టాడుకున్నారా?'

'పడవ బయలుదేరబోయే ఆఖరిక్షణాలదాకా యేదో మాట్టాడుకుంటూనే వున్నారు. పడవ బయలుదేరే సమయానికి ఆ యిద్దరూ దిగి వెళ్ళిపోయారు'-

'ఒకళ్ళ కొకళ్ళు ఏవైనా కాయితాలు - ఈ జాపితాలలాంటివి - ఇచ్చి పుచ్చుకోవటం చూచారా?'

'ఏవో కాయితాలు ఇచ్చి పుచ్చుకోవటం చూచాను'-

'ఈమోస్తరు కాయితాలేనా'-

'అయితే కావచ్చు - కాని అలాంటివేనని చెప్పలేను - వాళ్లు నాకు చాలా దూరంలో నిల్చుని చాలా నెమ్మదిగా మాట్లాడుకున్నారు. అక్కడున్న దీపంకూడా, కావురేసి మినుకు మినుకుమంటోంది. ఏవో కాయితాలు కనుపించాయేగాని అవి ఏరకంగా వున్నాయో పోల్చలేను - వారు మాట్టాడకున్నది కూడా నాకేమీ వినిపించలేదు.'

'సరే - ఖైదీ మీతో మాట్లాడిన సంగతేవిఁటో చెప్పండి.'

'ఆయన నేను వున్న స్థితిగతులుచూసి చాలా జాలిపడ్డారు - ఆప్యాయత చూపించారు- ఆయన చాలా దయగల వారు - బెరుకులేకుండ మనసిచ్చి మాట్లాడి ఆదరించారు. మా నాన్నగారికి ఎంతో సాయపడ్డారు' - ఆవిడ కళ్లవెంట జొటజొటా కన్నీరొలికిపోయింది. ఏడుపు ముంచుకొస్తున్న రుద్ధ కంఠంతో : 'ఆయనకు ఈవేళ అపకారంచేసి, కృతఘ్నత చూపుతానల్లేవుంది.'

కందిరీగల మోత -

'మిస్ మానెట్ - ఈ సాక్ష్యం నువ్వు చెప్పి తీరవలసి వుంది - నీవిధి; ఆ విషయం ఖైదీ అర్థం చేసుకోలేకపోతే తప్పిదం అతనిదికాని నీది కాదు - నీ కిష్టమున్నా లేకపోయినా ఈ సాక్ష్యంచెప్పి తీరాలి - సరే తరువాతేం జరిగిందో చెప్పండి.' -

'తాను నిష్ఠురమైన ఒక రహస్య వ్యవహారాన్ని సాధించటానికి యిలా తిరుగుతున్నానని నాతో అన్నారు. ఆ రహస్యం బయటబడితే చాలా చిక్కులు వస్తాయనీ, అందుచేత మారుపేరుతో వున్నాననీ అన్నారు. ఈ వ్యవహారంమీదే తాను ఫ్రాన్సుకు వెళ్లాలనీ ఇలా చాలాసార్లు ఇంగ్లండు ఫ్రాన్సుల మధ్య తిరగవలసి రావచ్చుననీ చెప్పారు.'

'మిస్ మానెట్! ముద్దాయి మీతో అమెరికా సంగతేమన్నా చెప్పాడా. ఆ సంగతి వివరంగా చెప్పండి.'

'తగాదా ఎందుకు వచ్చిందో నాకు అర్థం అయ్యేలాగు చెప్పటానికి ప్రయత్నించారు. అమెరికా తగాదా వ్యవహారంలో తప్పంతా ఇంగ్లండుదే నన్నారు. మూడవజార్జిరాజు కంటే, జార్జి వాషింగ్‌టన్ కీర్తివంతుడై చరిత్ర కెక్కవచ్చునని ఛలోక్తిగా అన్నారు. అది ఏదో నవ్వుతూ ఛలోక్తికి అన్న మాటగాని అందులో పెద్దవిశేష మేమీలేదు.'

ఒక పెద్దనటుడు రంగంమీద అభినయించుతున్నప్పుడు ఆయన ముఖంలో పొడసూపుతున్న కవళికలనన్నిటినీ వాళ్ళకు తెలియకుండానే ప్రేక్షకులు అనుకరించుతూ వుంటారు.

ఈ సాక్ష్యం చెప్తుతున్నంతసేపూ, ఆవిడ ముఖంమీద భయాందోళనలు స్పష్టంగా కనుపించుతున్నయ్. జడ్జీ వ్రాసుకుంటున్నప్పుడు, తను మాట్టాడటం మానేసి ఉభయపక్షాల న్యాయవాదుల ముఖాలవంకా చూస్తోంది. తన సాక్ష్యాన్ని వాళ్లు యెలా స్వీకరించుతున్నారో అర్థంచేసుకోవటానికి ప్రయత్నించుతోంది. సాక్షి ముఖకవళికలన్నీ కోర్టులోవున్న యావన్మంది ప్రేక్షకుల నుదురుమీద ప్రసరించుతూ, అవన్నీ సాక్షి కట్టెదుట వుంచిన బిళ్లోరి అద్దాల్లా కనుపిస్తున్నయ్. వ్రాసుకుంటూ వ్రాసుకుంటూవున్న జడ్జి, జార్జి వాషింగ్‌టన్‌కు సంబంధించిన ఆ అప్రాచ్యపు వాక్యాలు చెవులబడి కుదుపు తిని చివాల్న తలపైకెత్తి చూచాడు.

డాక్టర్ మానెట్‌ను కూడా విచారించవలసిన అవసరం వుందని అటార్నీ జనరల్ విజ్ఞప్తి చేయడంలో ఆయన్నుకూడా బోనెక్కించారు.

'డాక్టర్ మానెట్! ఖైదీని మీరెప్పుడేనా లోగడ చూశారా?'

'ఓసారి చూచాను. మూడేళ్ళో, మూడేళ్లన్నరో అవుతుంది - ఒకసారి మాయింటి కొచ్చాడు.'

'మీ కుమార్తే, మీరూ, ఫ్రాన్సు నుంచి ఇంగ్లండుకు వచ్చేటప్పుడు - ఇతనుకూడా మీతో ప్రయాణంచేసినట్టు గుర్తున్నదా?'

'లేదు' -

'గుర్తులేకపోవటానికి ప్రత్యేక కారణం యేదేనా వున్నదా?'

'ఉన్నది'-

'మీదేశంలో వుండగా, మీమీద యేనేరమూ మోపకుండానే, విచారణ వగైరా లేమీ లేకుండా, మిమ్మల్ని చిరకాలం ఖైదులో వుంచారట, నిజమేనా?'

'ఆ!-వుంచారు - చాలా సంవత్సరాలు'

'మనం మాట్టాడుకుంటున్న పడవప్రయాణం తరుణానికి మీరు క్రొత్తగా విడుదలైవుంటారు.'

'అని చెబుతారు'

'అసలు ఆ సంఘటన మీకు జ్ఞాపకమే లేదా?'

'లేదు - నేను జైల్లో చెప్పులు కుట్టడం ప్రారంభించిన దగ్గిరనుంచీ, తిరిగి ఇంగ్లండులో నా కుమార్తెతో జీవించటం ప్రారంభించేవరకూ, ఈ మధ్యకాలంలో ఈ లోకంలో యేవిఁ జరిగిందో నాకు తెలీదు. ఇక్కడికి తీసుకొచ్చిన తరువాత అమ్మాయి నన్ను నెమ్మదిగా మార్గానపెట్టి లోకుల్లో పడేసింది. అమ్మాయి నా దగ్గిరికి యెప్పుడు వచ్చిందో, యెలా వచ్చిందో, యెలా త్రోవకు తీసుకురాగలిగిందో ఇదంతా నాకేమీ తెలీదు.'

ఆ ప్రశ్నలడిగి అటార్నే జనరల్ కూర్చోవడంతో తండ్రీకూతురూ కూడా కూర్చున్నారు.

అనంతరం విచారణలో ఒక ప్రధానమైన అంశం బయలుదేరింది. అయిదు సంవత్సరాలనాడు, నవంబరునెల శుక్రవారం రాత్రి ముద్దాయి మరో కుట్రదారుతోపాటు డోవరుమెయిలు కోచ్‌లో ప్రయాణం చేసినట్టూ, రాత్రివేళ మార్గమధ్యంలో దిగి, అక్కడనుంచి

పదిమైళ్ళ దూరంలోవున్న సైన్యాలను ఉంచిన ఓడరేవుకు చేరినట్టూ, ఆ సైనికకేంద్రంలో తనకు కావలసిన భోగట్టానంతా పోగుచేసుకున్నట్టు, సైనిక కేంద్రంలోవున్న కాఫీ హోటల్లో కూర్చుని రెండో కుట్రదారుకోసం చాలాసేపు నిరీక్షించినట్టూ ఋజూ కావలసివచ్చింది. ముద్దాయిని ఆనాడు ఆ హోటల్లో చూసినట్టు ఒకసాక్షి చెబుతున్నాడు. ముద్దాయి తరఫు వకీలు, నానా తంటాలుపడి క్రాసుపరీక్ష చేస్తున్నా రవ్వంతేనా ప్రయోజనం లేకుండావుంది ఆవేళ హోటల్లో ఏమీచెయ్యటానికి తోచక ముద్దాయి తరఫు వకీలు బుర్ర గోక్కుంటున్నాడు. ఇంతలో, అంతవరదాకా పైకప్పువంక యోగం పట్టినట్టు చూస్తూ కూర్చున్న విగ్గు పెద్దమనిషి చివాల్న బల్లమీదికి వంగి, చిన్నికాయితంముక్కమీద యేదో వ్రాసి, చుట్టజుట్టి ముద్దాయివకీలు మీదికి గిరాట్టు వేశాడు. ఆ కాయితం విప్పి చూసుకుని ముద్దాయి వకీలు, ముద్దాయిముఖంవంకా, యీ విగ్గుపెద్దమనిషివంకా అదో విచిత్రంగా ఆశ్చర్యచకితుడై చూశాడు. బోనులోవున్న సాక్షివంక తిరిగి:

'ఆవేళ నువ్వు చూచినవ్యక్తి ముద్దాయితప్ప మరోరు కారని ఖండితంగా చెప్పగలవా?'

'ఖండితంగా చెప్పగలను.'

'సరీగా ముద్దాయిలాగే వుండే మరోవ్యక్తి నెవర్నేనా యెప్పుడేనా చూచావా?'

'చూళ్ళేదు - ఆయనే యాయనని పొరపడేటంత ఒకే పోలికలున్న మనిషిని యెప్పుడూ చూళ్ళేదు.'

'సరే, ఆ కుర్చీలో కూర్చున్న ఆ పెద్దమనిషివంక చూడు' అన్నాడు తనకు కాయితం అందించిన ఆ మనిషి వంక చూపుత: 'ఇప్పుడు చెప్పు ఆ పెద్దమనిషీ ముద్దాయీ ఒకే మాదిరిగా వున్నారా లేదా? - ఏఁవంటావు'-

ఆవిగ్గు పెద్దమనిషిలో వున్న బేఫర్వాతనం ఒక్కటీ మినహాయిస్తే, అయన ముమ్మూర్తులా సరీగా ముద్దాయిలానే వున్నారు. అదిచూసి, సాక్షి ఒక్కడేకాదు - కోర్టులోవున్న యావన్మందీ విభ్రాంతులయ్యారు. ఆ పెద్దమనిషిని విగ్గు తీసివేయవలసిందిగా ఆజ్ఞాపించమని, ముద్దాయి వకీలు జడ్జీగారికి విజ్ఞప్తిచేశాడు. కోర్టువారు సమ్మతించి విగ్గు తీయవలసిందిగా ఆజ్ఞాపించారు. విగ్గు తీసేసరికి ఆయనా ముద్దాయీ సరీగా అచ్చున తీసినట్టు ఒకేరూపంలో కనుపించుతున్నారు.

జడ్జీగారు ముద్దాయి వకీలు వంక చూసి; 'అయితే, ఇక మనం ఈ రాజద్రోహ నేరానికి కార్టన్‌గారిని విచారించవలసి వుంటుందా యేఁవిటి? అని ప్రశ్నించారు (విగ్గు పెద్దమనిషి పేరు కార్టన్)

'అనవసరం' అన్నాడు ముద్దాయి వకీలు స్ట్రయినం. కాని సాక్షిని నేనొక్కటీ అడగదలచాను - తాను ఆవేళ కూడా యిలాంటి విభ్రాంతి యేదైనా పడివుండటానికి సావకాశం వున్నదా లేదా? - తాను చూచింది తప్పకుండా ముద్దాయినేనని చెప్పటం తొందరపాటు ప్రసంగమా కాదా? అంతకంటే యింకేమీ అక్కర్లేదు. ఇందువల్ల ఈసాక్ష్యం యెందుకూ కొరగాదని తేలిపోతోంది. ఈ సాక్ష్యంవల్ల ఈ విచారణకు యెవ్విధమైన ప్రయోజనమూలేదు. ఈ సాక్ష్యంద్వారా ముద్దాయిమీద ఆరోపించబడిన అభియోగాంశాలన్నీ రద్దయిపోతున్నయ్.

ఈ విచారణకాండనంతా వింటూ, క్రంచర్, వ్రేళ్లనున్న తుప్పంతా పరిశుభ్రంగా నాకేశాడు. ఈ వ్యవహారాన్నంతా ఒక రూపానికి చక్కదిద్ది కోర్టువారికి నివేదించటం ప్రారంభించటంతో, తానుకూడా చెవులు దోరబెట్టుకుని అతిజాగ్రత్తగా వింటున్నాడు. స్ట్రయివర్ ఇలా వాదించుతున్నాడు;

'ప్రాసిక్యూషన్‌వారు పరమదేశభక్తుడని బోనెక్కించిన సాక్షి బర్‌సాద్, వట్టి అబద్ధాలకోరనీ, కూలిడబ్బులకు దొంగ సాక్ష్యాలుచెప్పే అవినీతిపరుడనీ, జూడాస్ అనంతరం, ఇలాంటి లుచ్ఛా భూమిమీద పుట్టలేదనీ క్రాసుపరీక్షలో సుస్పష్టంగా తేలిపోయింది. దేశభక్తిపరాయణుడని చెప్పబడుతున్న రెండవసాక్షి క్లయ్ ఈ మొదటిసాక్షికి స్నేహితుడూ - తగిన స్నేహితుడూకూడా. ముద్దాయి తనకుగల అత్యవసరమైన కుటుంబ బాధ్యతలు నిర్వర్తించుకోవటానికి గాను, పదేపదే ఫ్రాన్సుకు వెళ్ళుతూ వుండటం గమనించి ఈ ఫోర్జరీకోరులు, ఆయనమీద తేలికగా ఈ అభాండాలు మోపవచ్చని ఆలోచించారు. తనకున్న బాధ్యతలు అత్యంత రహస్యమైనవనీ ప్రమాదకరమైనవనీ ముద్దాయి, ఆ యువతితో అన్నమాట వాస్తవమే. అవి నిజంగా అలా యితరులతో చెప్పుకోవటానికి వీలులేని కుటుంబరహస్యాలు కావచ్చు. అంతమాత్రంచేత అవి రాజకీయకుట్రకు సంబంధించిన రహస్యాలని వాదించటానికి, ఏవిధమైన అవకాశమూ లేదు. జార్జివాషింగ్‌టన్‌కు సంబంధించిన ఆ వాక్యంకూడా, నవ్వులాటకన్న పరిహాసవాక్యమే తప్ప- దానికో ఉద్దేశాన్ని ఆపాదించటం కేవలం పొరపాటు. ప్రాసిక్యూషన్ వాదాన్నిబట్టి చూస్తే, ప్రభుత్వం, కుంచితమైన జాతి విద్వేషాన్ని ఆధారంగా తీసుకుని, పలుకుబడిని సంపాదించుకోటానికి ప్రాకులాడుతున్నట్టు కనుపించుతోంది. ఇది కేవలం ప్రభుత్వంయొక్క బలహీనతను వెల్లడించుకోవటం మినహా మరో ప్రయోజనం మేమీలేదు. ప్రాసిక్యూషన్ పోగుజేసిన ఈ తప్పుడుసాక్ష్యాలనుబట్టి చూస్తే, రాజకీయ నేరాల విచారణలలో ఈ బాపతు సాక్ష్యాలు ఎలాంటి అవకతవకలకు దారి తీస్తున్నాయో కోర్టువారు తేలికగా అర్థం చేసుకోవచ్చు'-

ఆ చివరిమాటనేసరికి జడ్జి ఉగ్రుడై చూచాడు : 'అలాంటి మాటలు కోర్టులో మాట్టాడగూడదు' అన్నారు - ఆ మాటలు అబద్ధమైనట్టు.

ఉభయపక్షాల వాదాలూ ముగిసినై. ఇక జూరీల నిర్ణయం తేలవలసివుంది.

తమలో తాము సంప్రదించుకోవటానికి జూరీలు పక్కకు వెళ్లారు. మళ్ళాకోర్టుహాలు యావత్తూ కందిరీగలమోత ప్రారంభమైంది.

కోర్టులో ఇంత గందరగోళం జరుగుతున్నా, ఆ విగ్గుమనిషి కార్టన్‌మాత్రం, అదేమోస్తరుగా ఆకాశంవంక చూస్తూ, నిర్లక్ష్యంగా కాళ్లు పంబదన్ని కూర్చున్నాడు. ముద్దాయితరఫు వకీలు స్ట్రయివర్ బల్లమీదవున్న కాయితాలన్నీ బొత్తిబెట్టుకుంటూ, చుట్టూవున్న వారితో గుసగుసలాడుతున్నాడు. మధ్య మధ్య జూరీ పెద్దమనుషుల ముఖాలవంక ఆందోళనగా చూస్తున్నాడు. జడ్జీగారికి కూడా వాదప్రతివాదాలు విని, యెదేవిఁటైందీ అర్థంకాక బుర్ర వేడెక్కి జ్వరమొచ్చినట్టయి, తోచక కుర్చీలోనుంచి లేచారు. తక్తుమీద ఇటూ అటూ పచారిచేస్తున్నారు. ఇంతమందీ ఇంత ఆందోళనగావున్నా, విగ్గు పెద్దమనిషి మాత్రం అతి

బేఫర్వాగా కుర్చీమీద యాలిగిలబడి ఆకాశంవంక చూస్తూ కూర్చున్నాడు. చేతులు రెండు జేబుల్లోకి దోపివున్నయ్. వెలిసిపోయి, చిరిగి చింపెలైవున్న ఆ లాయర్ గౌనూ, మురికిఓడుతూ నెత్తిమీద నుంచి జారి జారిపోతున్న ఆ విగ్గూ, ఆ అవతారం చూస్తే కోర్టులో వున్న వాళ్లకు అతనంటే మొదట్లో యేర్పడ్డ గౌరవభావం క్రమంగా సన్నగిలిపోతోంది. క్రంచర్ కూడా అదే ధోరణిలో వున్నాడు. పక్కవాడితో :

'ఆ అవతారం గెనా సూస్తే సంపాదనా చట్టుబండలూ వున్న లాయర్లాలేడు - అసలు, సంపాయించుకునే ధోరణి మడిసిగా లేడు'

కార్టన్ అలా ఆకాశం వంకచూస్తూ ఏమీ చూడనట్టు నటిస్తున్నాడేగాని, అతనికి చుట్టూ యేవిఁ జరుగుతున్నదీ సర్వం అర్థమౌతూనేవుంది; ఎందుకంటే, మిస్ మానెట్ తండ్రి భుజం మీద తల వేలవేయటం అందరికంటే ముందు అతనే గమనించాడు. అక్కడున్న పోలీసు ఉద్యోగిని పిల్చి : 'ఆవిడ మూర్ఛపడిపోతోంది కనుపించటం లేదా - తండ్రికి సాయంవెళ్ళి ఆవిణ్ణి బయటకు తీసుకుపోయే యేర్పాటు చూడండి!' అన్నాడు.

ఆవిణ్ణి బయటికి తీసుకువెడుతున్నారు. కోర్టులో వున్న వాళ్ళంతా, ఆవిడమీదా, తండ్రిమీదా కూడా చాలా జాలిబడ్డారు. ఆ వృద్ధుడు తను జైల్లో అనుభవించిన కష్టపు దినాలు జ్ఞాపకంవచ్చినప్పుడు ఎంతో వ్యాకులపడటం వాళ్ళంతా చూచారు. వకీలు ఆయన్ను ప్రశ్నించుతున్నప్పుడు ఆయనముఖం మీద విషాదరేఖలు అలుముకున్నయ్. ఆయన కుమార్తెతో బయటికి వెళ్ళగానే జూరీలలో ఒకాయన జడ్జీగారిని సమీపించి, తమలో తమకు అభిప్రాయభేదం వచ్చిందనీ గదిలోకి వెళ్లి సంప్రదించుకు వస్తామనీ చెప్పాడు.

జార్జి వాషింగ్టన్ విషయం ఆలోచిస్తున్న జడ్జీగారికి, అభిప్రాయభేదం వచ్చిందన్నమాట చెవులబడి ఆశ్చర్యపడ్డాడు. సరే, లోపలికి వెళ్లి సంప్రదించుకు రమ్మన్నాడు. తను కూడా విశ్రాంతి తీసుకోవటానికి తక్కుదిగి వెళ్ళిపోయాడు. విచారణ సాయంత్రం దాకా పట్టింది. దీపాలు కూడా కూడా వెలిగిస్తున్నారు. జూరీ చాలా తర్జన భర్జనలో పడ్డారనీ చాలాసేపటికిగాని బయటికిరారనీ, కింవదంతి బయలుదేరింది. కోర్టులో వున్న జనమంతా యేదైనా కాస్త మేతవేసి రావటానికి బయటికి వెళ్లారు. ముద్దాయి కూడా కోర్టు వెనకవున్న దొడ్లోకివెళ్లి నేలమీదే చతికిలబడ్డాడు.

తండ్రీ కూతుళ్లు బయటికి వెడుతూన్నప్పుడు వాళ్లతోపాటు బయటికి పరుగెత్తిన లారీగారు, తిరిగి లోపలికివచ్చి క్రంచర్‌ను దగ్గిరికి పిలిచారు.

'ఇదుగో జర్రీ, బయటికి వెళ్లి కాస్త కాఫీ గీఫీ త్రాగివస్తావేమో వెళ్లిరా - త్వరగా మాత్రం రా - జూరీ లోపలికి రాగానే యేదో ఒకటి తేలిపోతుంది. వాళ్లు లోపలికి వచ్చేసరికి నువ్విక్కడుండాలి - ఆలస్యం చెయ్యకు - విషయం తేలగానే ఆ వార్తను బ్యాంకుకు తీసుకువెళ్లాలి' - అంటూ ఒక షిల్లింగు పారేశాడు.

జర్రీ తలపూపి చిరునవ్వు నవ్వుకుంటూ బయటికి వెళ్లిపోయాడు. ఈలోగా కార్టన్ లారీగారి దగ్గిరికొచ్చి, భుజంమీద చెయ్యివేసి పలకరించాడు. 'ఆవిడ ఎలా వుంది'-

'చాలా దించుకుపోయివుంది. తండ్రి దగ్గిరుండి అనునయించుతున్నాడు - కోర్టులోనుంచి గాలిలోకి తీసుకువెళ్లిన తరువాత కాస్తఫరవాలేదు - కోలుకుంటోంది?'-

'అయితే ఆవిడ క్షేమంగా వున్నట్టు ముద్దాయికి చెప్పి వస్తాను. ఓ పెద్ద బ్యాంకీలో ఉద్యోగంచేసే మీవంటి పెద్దమనిషిపోయి ముద్దాయిరకం మనిషితో బహిరంగంగా మాట్లాడటం, మీకు అగౌరవంగా వుంటుందేమో?'

అంతవరదాకా తాను మనసులో పడుతున్న మధనయావత్తూ, కార్టన్ అవగతం చేసుకున్నాడేమోనని లారీకి అనుమానమేసింది. ఆ ఉత్కంఠతో మొహం కందగడ్డలా ఎర్రబడ్డది. కార్టన్ కోర్టువెనక దొడ్లోకి నడిచాడు.

'డార్నే గారూ!'-

ముద్దాయి లేచి దగ్గిరికి వచ్చాడు.

'మీరు ఆ సాక్షి మిస్ మానెట్ ఎలా వున్నదో తెలుసుకోవాలని ఆందోళన పడుతున్నారనుకుంటాను. ఆవిడ క్షేమంగా వుంది; నెమ్మదిగా కోలుకుంటోంది.

'నా కారణంగా ఆవిడ అలాంటి మనస్తాపం పడ్డారు - ఇందుకు చాలా విచారిస్తున్నాను. ఇలా అన్నానని ఆవిడకు తెలియజేయగలరా?'-

'ఆ చెప్తాను - నీవు చెప్పమనికోరితే తప్పకుండా చెబుతాను.'

'కోరుతున్నాను - ఇందుకు, ముందుగానే మీకు నా కృతజ్ఞతకూడా తెలియజేస్తున్నాను'-

'నీ విషయం ఏమవుతుందనుకుంటున్నావ్.'-

'ఇంకా ఏమౌతుందని అనుకుంటాను.'-

'జూరీలలో మధన బయలుదేరటం చూస్తే, నీకు కొంత మేలు జరగవచ్చునని అనిపిస్తోంది.'

గంటా, గంటంబావు గడిచింది. మధుమాంసాల మత్తులో, హోటలుదగ్గిర బెంచీమీద కూర్చున్న జర్రీకి మత్తువచ్చి కాస్త వెనక్కు యాలిగిలబడి కునుకుదీస్తున్నాడు. ఇంతలోనే జనం మెట్లమీద దబదబా పరిగెత్తుతున్నట్టు పెద్ద అలజడి అయింది. జర్రీ తుళ్లిపడి లేచి, వాళ్ళతోపాటు తానుకూడా కంగారుగా లోపలికి పరుగెత్తాడు.

'జర్రీ! జర్రీ!' అంటూ లారీ కోర్టులోపలనుంచి ద్వారంలోకి ఆదరా బాదరా పరుగెత్తుకుంటూ వచ్చాడు.

'ఇక్కడే వున్నాసర్!' - ఎంత యుద్ధం చేసినా లోపలికి తోసుకువచ్చే ఆస్కారం కనుపించక, జర్రీ వరండాలోనుంచే సమాధానం చెప్పాడు.

లారీ, ఒక చిన్ని చీటి జనం నెత్తిమీదుగా జర్రీ చేతికి అందించాడు.

'అందుకున్నావా?'

'ఆఁ'-

'పరుగెత్తు!'

'కేసు కొట్టేశారు' - అని చీటీమీది అక్షరాలు.

జర్రీ వెళ్ళిపోతున్నాడు: 'ఈ తడవగనా యెనకటికిమల్లేనే 'పునర్జన్మ' అని చెప్పుంటే ఇప్పుడు సరిగా అర్థముండేది అనుకుంటున్నాడు.

12

ఆ పగలల్లా కోర్టులో కూర్చుని ఉక్కకు మరిగిపోయివున్న జనం తండాలు తండాలుగా అంతా బయటికి వెళ్లిపోయారు. గుడ్డిదీపాల వెలుగులో కనుపించీ కనుపించకుండా వుంది. డాక్టర్ మానెట్, లూసీ మానెట్, లారీ, స్ట్రైయివర్, వీళ్లుమాత్రం క్రొత్తగా విడుదలైన ముద్దాయి చార్లెస్‌డార్నే చుట్టూ మూగి పరామర్శ చేస్తున్నారు.

డార్నే, లూసీ మానెట్ చేతిని ఆప్యాయంగా ముద్దుబెట్టుకుని కృతజ్ఞత తెలియజేశాడు. అనంతరం తన వకీలు స్ట్రయివర్ వంక తిరిగి వందనాలర్పించాడు. స్ట్రయివర్ వయస్సు ఇంచుమించు 30 సంవత్సరాలు; కాని 50 సంవత్సరాల ముసలివాడులా కనుపించుతాడు; కొంచెం లావుసరి మనిషి; ఎర్రగా బొద్దుగా వుంటాడు. గడసరి, పదిమంది ఎక్కడున్నా మోచేతుల్తో నెట్టుకుని ముందుపీటీకి చేరుకోగల తత్వం.

ఇంకా గౌనూ, విగ్గూ అలానేవున్నయ్; మోచేత్తో లారీగార్ని ఒక్కనెట్టు వెనక్కునెట్టి, తన క్లయింటు ముందుకొచ్చేశాడు: 'డార్‌నే గారూ! ఏదో విధంగా మిమ్మల్ని గౌరవంగా యివతల పడెయ్యగలిగాను; చాలా సంతోషంగా వుంది; వట్టి అన్యాయమైన కేసు, శుద్ధ అన్యాయం; ఎలా బయట పడెయ్యగల్దునా అని చాలా ఆందోళనపడ్డాను.'

డార్నే ఆయన చెయ్యి బట్టుకున్నాడు: 'జీవితాంతం వరకూ మీకు కృతజ్ఞుణి.'

'ఏదో నా చేతనైంది చేశాను - నేనే యేవిటి లెండి - మరొకరైతే మాత్రం ఆమాత్రం చెయ్యలేకపోయేవారుట గానీ' -

'మరొకరైతే యేమయ్యేదోలెండి' అని యెవరో ఒకరు అనాలని ఆయన అభిలాష. లారీగారు ఆమాట అనేశాడు; కేవలం లాంఛనప్రాయంగా అన్నమాట గాదు. ఇందాక తన్ను వెనక్కు నెట్టినందుకు, ఈ అవకాశంలో స్ట్రయివర్ గార్ని వెనక్కు నెట్టెయ్యాలనే ఆవేశంతో.

'అలా అంటారా?' అన్నాడు స్ట్రయివర్: 'ఏమో, అయితే కానేవచ్చు - మీరు యివ్వాళల్లా కోర్టులోనే వున్నట్టున్నారు - మీకు తెలియందేవుందిలెండి; మీరు సమస్తం తెలిసిన వ్యవహారస్తులుకూడా నాయె'-

'అవును - వ్యాపారస్థుణ్ని; కాలయాపన చెయ్యటం నాకు నచ్చదు. అంతా యింటికి వెళ్లిపోదాం - లూసీ చాలా బడలిపోయినట్టుంది. ఏవండీ మానెట్ గారూ! ఏవంటారు?"

'అవును పోదాం' అన్నాడు స్ట్రయివర్: 'ఈరాత్రి యింకా చూసుకోవలసిన పనులు చాలా వున్నయ్'

అంతవరదాకా, దించుకుపోయిన ముఖంతో డార్నేవంక తెల్లపోయి చూస్తున్న డాక్టర్ మానెట్ నెమ్మదిగా కదిలాడు.

'నాన్నా అంటూ లూసీ ఆయన చెయ్యి పట్టుకుంది. మానెట్ స్ఫురితుడై కూతురు ముఖంలోకి చూచాడు. ఆయన ముఖంమీద సంతోషం పొటమరించింది.

'నాన్నా! ఇంటికి బయలుదేరిదామా?' పెద్ద నిట్టూర్పు విడిచి, 'హ' అన్నాడు.

డార్నేను అక్కడ విడిచిపెట్టి ఎక్కడవాళ్లక్కడ తలోత్రోవనూ వెళ్లిపోతున్నారు. దీపాలన్నీ ఆరిపేస్తున్నారు. ఎక్కడి ఇనపతలుపులు అక్కడ మూసుకుపోతున్నయ్.

మిగతా వాళ్ళనందర్నీ సాగనంపి స్ట్రయివర్ గౌను దాచుకురావటానికి ప్రక్కనున్న గదిలోకి వెళ్లారు. అంతవరదాకా యీ బృందంతో కలిసి మాట్టాడకుండా, చీకటిగావున్న ఒకమూలగోడకు చారబడి నిల్చునున్న ఒక వ్యక్తి నెమ్మదిగా కదిలి లారీ, డార్నేలు నిల్చునున్న ప్రదేశానికి వచ్చాడు.

'లారీగారూ! - గౌరవనీయులైన మీవంటి వ్యాపారస్తులు, ఇక డార్నేతో మాట్టాడటానికి అభ్యంతరమేమీ లేదనుకుంటాను' అన్నాడు.

నాటి సంఘటనలో, కార్టన్ వహించిన పాత్ర యేవిటో, యెవ్వరూ గుర్తించారు కారు; అసలు ఎవ్వరికీ తెలీదు.

డార్నే అందుకుని: 'ఎంతటి సహృదయమున్నా - ఉద్యోగ సద్యోగాలు చేసేవారు అందుకు అనుగుణంగా నడుచుకోవలసి వుంటుంది' అంటూ సర్దేసెయ్యబోయాడు.

లారీగారి ముఖం యెర్రబడ్డది : 'అవునండీ ఏదైనా ఒక సంస్థలో పనిచేస్తున్నామంటే, ఇష్టమొచ్చినట్టు వ్యవహరించటానికి ఎలా వీలౌతుంది? ఎప్పుడూకూడా, మన సంగతులకంటే ఆ సంస్థ సంగతులు ముందు ఆలోచించాలి'

'అవునవును అదే అంటున్నాను' అన్నాడు కార్టన్, అదే బేఫర్వాగొంతుతో : 'ఎబ్బే! ఏమనుకోబోకండి - ఏదో మాట వరసకన్నాను - నిజంగా మీ వ్యాపారస్తుల్లో మీమాత్రం హృదయంవున్న వాళ్ళు అరుదు.'

లారీ కార్టన్ మాటలు లెక్కచెయ్యలేదు : 'అయినా ఆ సంగతులన్నీ మీకెందుకులెండి- నిజానికి, మీకంటే పెద్దవాణ్ణి, ఏదో అంటున్నాను - మరేమనుకోబోకండి; అసలు ఈ వ్యవహారంలో మీకేవిటి జోక్యం'.

'వ్యవహారమా? - ఎబ్బే అలాంటి దేమీ లేదండీ - నేను వ్యవహారాలూ గివహారాలూ వున్నవాణ్నిగాను'

'చాలా విచారకరం - మనిషైనవాడికి యేదో వ్యావృత్తి వుండితీరాలి'

'నేనూ అదే అనుకుంటున్నాను.'

'వ్యవహారం యేదో వొకటి పెట్టుకుంటే - తప్పకుండా సాధించగలరు - మీకేవిటి!?'

'అరి భగవానుడా! వద్దులెండి సర్ - నా కెందుకొచ్చిన గొడవ' అన్నాడు కార్టన్.

ఆ ధోరణి విని లారీ ఉడికిపోయాడు: 'వ్యాపారం సంగతి మీకేం తెలుసు; వ్యాపార సాపారాలు లేనివాడికి ఇంకా గౌరవమేమిటి? ఏదైనా వ్యాపారం చేసేవాడికి ఇతరులతో ఎలా మాట్లాడాలో తెలుస్తుంది. డార్నే గారికి తెలిసినట్టు ఇతరులకుండే కష్టసుఖాలేవిటో అర్థమౌతుంది - సరే ఇక శలవు; డార్నేగారూ వెళ్ళొస్తాను.'

లారీగారికి కార్టన్‌మీద కోపం రావటమే గాదు - తనమీద తనకే చిరాకెత్తిపోయింది. గిజాటుగా బయటికి వెళ్ళిపోయాడు. కార్టన్ ఆయన ప్రవర్తనచూచి నవ్వాడు. పోర్టువైన్ వాసన కొడుతూ, హుషారులో వున్నాడు. డార్నేవంక తిరిగి;

'మనమిద్దరం యిలా కలుసుకోవటం చాలా చిత్రమైన సంఘటన; సరిగా నీకుమల్లేనే వున్న ఒక వ్యక్తి, నీ కట్టెదుట నిలచి వుండటం నీకు బలే తమాషాగా వుందనుకుంటాను.'

'నేను ఈ లోకంలో పడ్డానో లేదో ఇంకా అనుమానంగానే వుంది.'

'అవును మరి - మరో ప్రపంచానికి ప్రయాణం కట్టడానికి మూటా ముల్లే యావత్తూ సర్దుకుని సిద్ధమైనవాడివైతివి! - చాలా బలహీనంగా వున్నట్టు మాట్టాడుతున్నావే'-

'బలహీనంగానే వున్నానల్లే వుంది'-

'ఆరి దుర్మార్గుడా! భోజన మెందుకు చెయ్యవ్! - ఆ లక్కబుర్రలు నిన్ను ఆ ప్రపంచానికి పంపుదామా, ఈ ప్రపంచంలో వుంచుదామా అని మధనపడుతున్నప్పుడు నేను సమయంలో సమయం కందా కొట్టేశాను. ప్రక్కనేదేనా హోటలుకు పోదాంపద భోజనం చేద్దువుగాని'

సమాధానంకోసం నిరీక్షించకుండానే డార్నే చేతికి చెయ్యి మెలికవేసి పడ లాక్కుపోతున్నాడు. సరాసరి ఫ్లీట్ స్ట్రీట్‌లో ఒక హోటలుకు తీసుకొచ్చాడు. హోటలుగదిలో కూర్చుని డార్నే భోజనం చేస్తున్నాడు. అతనికి ఒక్కొక్క రవ్వే ప్రాణం చేరుకుంటోంది. అతనికి ఎదురుగా కుర్చీలో యాలిగిలబడి, కార్టన్ పోర్టువైన్ ఎక్కిస్తున్నాడు. అదేనాటు ధోరణిలో మొదలెట్టాడు:

'ఈ భూప్రపంచంలో పడ్డట్టేనా, ఇంకా అనుమానంగా వుందా?-'

'కాలమానాలు యింకా అయోమయంగావున్నా - కాస్త ఫరవాలేదు - లోకంలో పడ్డానన్న భావం యేర్పడుతోంది'

'అదో పెద్ద మహద్భాగ్యంగా ఆనందిస్తున్నా వల్లే వుంది?' - కంటకంగా ఆమాట అనేసి మళ్లా గ్లాసు నింపుతున్నాడు.

'నాకుమాత్రం, ఈ వెధవప్రపంచం సంగతి ఎలా మరిచిపోదామా అని వుంటుంది. ఈసారా ఒక్కటి మినహా ఈ ప్రపంచంలో యేడిచిన మంచేవిఁటి?- రూపంలో నీవూ నేనూ ఒకే మోస్తరు వాళ్లంగాని ఈ విషయంలోమాత్రం మనకిద్దరికీ చాలా తేడావుంది.'

ప్రొద్దుటినుంచీ ఆందోళన పడుతూ, ఇంకా ఒకతీరానికిరాని మనస్సు, కట్టెదుట ముమ్మూర్తులా తనకు మల్లేనే వున్న వ్యక్తి; అతని మాటలకు యేవిఁ సమాధానం చెప్పటానికీ తోచక, అయోమయంగా : 'తేడాయే వీఁలేదు' అన్నాడు.

'భోజనం పూర్తిచేశావుగా - ఒక గ్లాసెడు పానీయం చేత్తో బుచ్చుకుని, ఆవిడ ఆరోగ్యంకోసం దేవుణ్ని ప్రార్థించి గొంతులో పోసుకో'

'ఎవరిమాట మీరనేది-'

'ఎవరిమాటేవిఁటి బ్రదర్? - ఆవిడమాటే' -

'మిస్ మానెట్ ?-'

'మరే - తెలియనట్టు నటించుతావేం?-'

మిస్ మానెట్ ఆరోగ్యార్థం, డార్నే పానీయం స్వీకరిస్తున్నాడు. అతనివంక చూస్తూ, కార్టన్, చేతిలో వున్న గ్లాసును భుజంమీదగా వెనక్కు గిరవాటేశాడు. అది గోడకుపోయి కొట్టుకుని నూరు ముక్కలైంది. మరోగ్లాసు తెమ్మని వెయిటర్‌ను కేక బెట్టాడు. ఆ గ్లాసుమళ్లా నింపుతూ:

'మంచి అందమైన మనిషి'-

డార్నే చిత్రిత ప్రతిమాలాకూర్చుని - 'ఆ' అన్నాడు.

'అలాంటి అందమైన స్త్రీ, తనకోసం జాలిపడి కన్నీరు విడుస్తుందంటే - ఆ వ్యక్తికి జీవన్మరణ విచారణ జరిగితేమాత్రం లెక్కేవిఁటి?-'

డార్నే మౌనంగా వూరుకున్నాడు.

'నీ సందేశాన్ని అందజేశాను. ఆవిడ చాలా ఆనందించింది. ఆనందాన్ని బయటికి వెల్లడించిందని కాదు. ఆవిడ ఆనందించినట్టు నేను గ్రహించాను'

ఆ మాట వినేసరికి, డార్నేకు ఆ సాయంత్రం జరిగిన సంగతి జ్ఞాపకమొచ్చింది: ఆ మొరటుమనిషి తనకు తానుగా పూనుకుని తన సందేశాన్ని ఆవిడకు అందజేశాడు. అందుకు డార్నే తిరిగి తన కృతజ్ఞతా వందనాలు తెలియజేశాడు.

నీ వందనాలు వగైరా మన కేవీఁ అక్కర్లేదు - నిజానికి అలాంటి యోగ్యత లేవీ మనకి లేవు - నేను చేసింది మరేమీ ఘనకార్యమూ కాదు - ఘనకార్యమే అయినా ఎందుకుచేశానో నాకే తెలీదు' అన్నాడుకార్టన్.

'డార్నే! - ఒకమాట అడిగేది?-

'అడగండి'-

'నీమీద నాకేమైనా అభిమానం వుందనుకుంటున్నావా?'

'ఆసంగతి నేను ఇంతవరకూ ఆలోచించనేలేదు.'

'ఆలోచించి చెప్పు'-

'చేతల్నిబట్టి చూస్తే అభిమానం వున్నదనే అనుకోవాలి సొస్తోంది - మాటల్నుబట్టి చూస్తే అలాంటిదేమీ వున్నట్టు తోచటంలేదు.

'రవ్వంతేనా లేదు - నువ్వు మంచి ఆలోచనాజ్ఞానం వున్న వాడివని మటుకు నా అభిప్రాయం.'

'అభిమానంవున్నా లేకపోయినా బిల్లు చెల్లించుకుని - ఇద్దరం యే విధమైన తటపటాయింపూ లేకుండా యిద్దరం చెరోదోవనూ వెళ్లిపోవటానికి మీకు అభ్యంతర మేమీలేదు గదా!'

'ఎలాంటి అభ్యంతరమూ లేదు'-

డార్నే వెయిటర్ను పిలిచాడు.

'ఏవిఁటి బిల్లంతా నువ్వే చెల్లించుతానంటావా?' అన్నాడు కార్టన్. డార్నే ఔనన్నట్టు తల ఊపాడు.

'ఓరే వెయిటర్, అలాగైతే మరో పెగ్‌వైన్ ఇలా తగలబోసి, పదిగంటలకొచ్చి నిద్రలేపు' అన్నాడు.

డార్నే బిల్లు చెల్లించేశాడు. కార్టన్‌కు అభివందనంచేసి బయలుదేరాడు. కార్టన్ ప్రత్యభివాదం చెయ్యలేదు. కొట్టొచ్చినట్టు లేచి నిల్చుని ముందుకు వచ్చాడు: 'ఇదుగో! మరోమాట.'

'నేను తప్ప తాగుతాననేనా నువ్వనుకోటం?'

‘మీరు ఎక్కువగా తాగుతున్నారనే నేను అనుకుంటున్నాను’–

‘అనుకోవట మేవిఁటి? తెలీటం లేదూ?’

‘తెలుస్తూంది గనకనే అంటున్నాను’–

‘తెలుసు గనక అందుకు కారణమేవిఁటో కూడా నువ్వు తెలుసుకోవలసి వుంది- నేను అరవ చాకిరీచేసి ఆశాభంగం పొందిన జంతువును – ఈ లోకంలో ఒకడంటే నాకుగాని, నేనంటే ఒకడికిగాని లెక్కలేదు.’

‘చాలా విచారకరమైన సంగతి: మీ తెలివితేటల్ని మరింత ప్రయోజనకరంగా ఉపయోగించవలసింది’

‘కావచ్చు – కాకనూపోవచ్చు – నువ్విప్పుడేదో కాస్త స్థిమితంగా వున్నానని భుజాలెగరవెయ్యకు – ఏనాటికి యేస్థితి సంభవిస్తుందో ఎలా చెబుతాం – నమస్తే’

డార్నే వెళ్ళిపోయాడు. ఈ విచిత్రవ్యక్తి వెలుగుతున్న కొవ్వొత్తి చేత్తో బుచ్చుకుని, గోడమీద వ్రేలాడుతున్న అద్దం ముందుకుపోయి నిల్చుని అద్దంలో తన ప్రతిబింబం చూసుకుని తనలో తను ఆలోచించుకుంటున్నాడు:

‘పోలికలున్న మాత్రంచేత అతనంటే అంత అభిమానం ఎందుకు కలగాలి! ఇతరులను అభిమానించే తత్వం నాలో ఎన్నడూలేదే అతనితో మాట్లాడుతూ కూర్చోటం దేనికీ? అతనితో పోల్చుకుని నేను ఎంత పతనమైపోయానో తెలుసుకోటానికి ప్రయత్నించానా. అతను నేనుగానూ నేను అతనుగానూ మారితే ఆ నీలికళ్ళు నావంక చూసి జాలిపడేవి, అతన్ని చూసి జాలిబడ్డట్టే – ఆహాఁ అదీ అసలు విషయం! – అతనంటే అభిమానంగాదు – ఈర్ష్య.’

మనస్సును స్థాయికి తెచ్చుకోవటానికి ఆ గ్లాసెడు ద్రాక్షసారా రెండు చుక్కల్లో తాగేశాడు. రెండు ముంజేతులూ బల్లమీద అని, బోర్లగా పడుకున్నాడు. విరబోసుకున్న అతని జీబుజుట్టు బల్లమీద ఇటూ అటూ గాలికి కదులుతోంది. వెలుగుతూన్న క్రొవ్వు వత్తినుంచి కరిగినమైనం ధారగా జారి బల్లమీద తుంపర్లు తుంపర్లుగా చిందుతోంది.

13

అవి త్రాగుడుకు పేరుబడ్డ రోజులు; ప్రతి ఒక్కడూ అత్యద్భుతంగా తప్పతాగేసేవాడు. గౌరవ మర్యాదలకు యే విధమైన భంగమూ రాకుండా ఆ రోజుల్లో ఒక్కనాటి రాత్రి ఒక పెద్దమనిషి తాగిపారేసే మొత్తాన్ని ఈనాటి పెద్దమనుషుల తాగుడుతో పోల్చి చెబితే, అదో పెద్ద ఉత్ప్రేక్షంగా కనుపించుతుంది. తక్కిన వృత్తులో వున్న వారికి న్యాయవాదవృత్తి నవలంబించుతున్న సోదరులు తీసిపోయిందేమీలేదు. ఈ న్యాయవాదుల్లో, స్ట్రయివర్ ప్రాక్టీసు విషయంలో ఎలా అగ్రశ్రేణిలో వుండేవాడో, తాగుడు విషయంలో కూడా అలాగే అగ్రశ్రేణిలో వుండేవాడు.

స్ట్రయివర్ ‘ఓల్డు బెయిలీకోర్టు’లో ముఖ్యంగా సెషన్సు కేసుల్లో పేరుమోసిన లాయరు. పేరు ప్రఖ్యాతులొచ్చినకొద్దీ చిన్న కేసులు పట్టడం చిన్న చిన్న కోర్టులకు వెళ్ళటం మానేశాడు.

ప్రధాన న్యాయమూర్తి కోర్టులకు దాదాపు రోజూ హాజరయ్యేవాడు. ఆకుల సందునుంచి పొటమరించి సూర్యునివంక చూచే ప్రొద్దుతిరుగుడు పువ్వులాగు, విగ్గుల్లోనుంచి పొటమరించి, స్ట్రయివర్ ఉజ్జ్వలముఖం ప్రధాన న్యాయమూర్తివంక చూస్తూవుండేది. అతనొక్కడే కాదు. చుట్టూవున్న లాయర్లంతా అదేరకంగా వుండేవాళ్ళు. అరుణోజ్వల ముఖాల నందనోద్యానం.

ఒకప్పుడు బారులో ప్లీడర్లంతా అనుకునేవాళ్ళు: ‘స్ట్రయివర్ గడుగ్గాయి పిండమే గాని, లా పాయింట్లు విషయాల్లో మట్టి మెదడు’ అని. కాని యీలోపం క్రమేపీ భర్తీ చేసుకున్నాడు. రాత్రి తెల్లవార్లూ సిడ్నీ కార్టన్‌తో పానగోష్ఠి జరిపేవాడు. తెల్లవారి లేచేసరికి కావలసిన లాపాయింట్లన్నీ కరతలామలకాలై వుండేవి.

ఇక సిడ్నీ కార్టన్ సంగతేవిఁటంటే పరమ సోమరిపోతు; అంత అప్రయోజకుడు లోకంలో లేడు. ఇతగాడు స్ట్రయివరుకు పరమమిత్రుడు. సంవత్సరాంతంలోపల వాళ్ళిద్దరూ కలిసి త్రాగి పారేసిన సారాసముద్రంలో రాజుగారి ఓడను వదిల్తే తెప్పున తేలుతుంది. కార్టన్ దగ్గిర లేకుండా స్ట్రయివర్ ఏ కేసూ చేపట్టేవాడు కాదు; చేతులు కోటు జేబుల్లో దోపుకుని దూలంవంక చూస్తూ అతను కోర్టులో వుండితీరాలి. కోర్టులోనే గాదు, కోర్టులో నుంచి బయటికొచ్చిన తరువాతకూడా యిద్దరూ పానశాలల వెంట జములుగా తిరుగుతూ వుండేవాళ్ళు. ఏ తెల్లవారిఝాముకో కార్టన్ తుపాను దెబ్బతిన్న పిల్లిలా పడుతూ తూలుతూ తన మకాముకు చేరుకునేవాడు. చివరకి అంతా పసిగట్టారు: కార్టన్ సింహం కాలేకపోయినా గుంటనక్క రకం పుండాకోరు మనిషని. స్ట్రయివర్, కార్టన్ల కథ ‘సింహం – నక్క’ కథగా నడుస్తోంది.

‘పదిగంటలయింది సర్! – పదయింది!’ కార్టన్ చెవి దగ్గర నోరుబెట్టి వెయిటర్ అరుస్తున్నాడు.

‘ఏవిట్రా మోత!’

‘పదయిందండీ?’

‘అయితే ఏవిఁట్రా – పదేవిఁటి నీ పిండాకూడు’–

‘లేపమన్నారు గాదండీ!’

‘ఓ – సరే–లేస్తున్నాను’

వచ్చీరాని స్పృహలో, శరీరం మళ్ళీ యెట్టాగయినా మరి కొంతసేపు నిద్రావస్థలో వుండిపోవటానికి ప్రయత్నించుతోంది. కాని లాభం లేకపోయింది. వెయిటర్ జోరీగలాగ పట్టుకుని లేవగొట్టేశాడు. లేచి నిల్చుని బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని టోపీ నెత్తికి తగిలించుకుని బయలుదేరాడు. నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ స్ట్రయివర్ ఇంటికి జేరుకున్నాడు. స్ట్రయివర్ గుమాస్తాకు ఈ రాత్రించర సమావేశాల్లో పాల్గొనే అలవాటు లేదు. అతను అప్పటికే వెళ్ళిపోయాడు. స్ట్రయివర్ స్వయంగా వచ్చి తలుపు తీశాడు. వదులాటి గౌను తొడుక్కున్నాడు. పాదాలకు స్లిపర్లు వేసుకున్నాడు.

ఆ తరగతి యిచ్చాజీవులందరికిమల్లేనే కళ్ళచుట్టూ నల్లటి మచ్చలు; కళ్ళు కావురెయ్యటంలో వింతేవుంది. జఫ్రీ నాటినుంచి ఈనాటివరకూ ఏ తాగుబోతు చిత్రం తీస్తే ఆ సౌందర్యరేఖలు మనకు కనుపించవు?

‘క్యారే మేధానిధీ! ఆలస్యమయిందేం?’–

‘మామూలు వేళకే వచ్చానే! ఓ పావుగంట ఆలస్యమైనట్లుంది.’

ఇద్దరూ కలిసి అహోబలబిలంలావున్న ఒక గదిలోకి నడిచారు. గది చుట్టూ పుస్తకాల దొంతర్లు పేర్చివున్నయ్. మధ్యను అమర్చివున్న చలి కుంపటిలోనుంచి జాజ్వల్యమానంగా మంటలు రేగుతున్నయ్. స్టౌమీది కెటిల్‌లో నుంచి ఆవిరి బయటికివస్తోంది. కాయితంకట్టల దొంతర మధ్యగా ఒక బల్ల – ఆ బల్లమీద పానీయసరంజామా ధగధగలాడుతూ అమర్చి వుంది – వైనుసీసాలు, బ్రాందీ, రమ్ము, పంచదార, నిమ్మకాయలు.

'సిడ్నీ – ఈవేళ అప్పుడే నీవు పుచ్చేసుకున్నట్టున్నావే?'

'ఈవేళ మనక్లయింటుతోకలిసి భోజనం చేశాను – కాదు కాదు అతను భోజనం చేస్తుంటే నేను చూస్తూ కూర్చున్నాను. ఈవేళ ఒక సీసాకాదు, రెండు సీసాలదాకా పట్టించాను.

'ఆరి నీ తస్సాదియ్యా! ఎల్లా తోచిందోగాని ఈవేళ భలే పాయంటెత్తావోయ్! – అసలు నీకూ అతనికీ పోలికలున్నాయని ఎలా తట్టిందీ?' అన్నాడు స్ట్రయివర్ – గ్లాసులో ద్రాక్షసారా పోస్తూ.

'మంచి అందమైన పడుచువాడుగా కనుపించాడు – ఏ మాత్రం అదృష్టమున్నా నేనుకూడా అలానే వుండేవాడి ననుకున్నాను.'

'నువ్వూ, నీ అదృష్టం సరేగాని – పని సంగతి చూడు – చాలా ప్రొద్దుపోయి నట్టుంది.'

నక్కకు కొంచెం కోపమొచ్చింది. అయిష్టంగానే లేచి, కోటుగీటూ విప్పి బల్లమీద పారేశాడు. ప్రక్కగదిలోకి వెళ్ళి ఒకబేసిన్‌తో చన్నీళ్ళూ, తుండుగుడ్డా తెచ్చుకున్నాడు. తుండుగుడ్డ చన్నీళ్లలో తడిపి పిండి నెత్తిమీద వేసుకునివచ్చి బల్లదగ్గిర కూర్చున్నాడు: 'ఏవిటా కాయితాలు ఇలా పారెయ్యండి.'

'ఇవ్వాళ యెంతో పనిలేదులే భయ్యా – రెండే రెండు కేసులున్నయ్'

'సరే ఇలా పారెయ్యండి.'

'అయిగో కాయితాలు ఆ బల్లమీదే వున్నయ్ చూడు!'–

పని నక్కకు వప్పగింతచేసి సింహంపోయి కులాసాగా సోఫాలో యాలిగిలబడి కూర్చుని గ్లాసుతరువాత గ్లాసు పట్టించుతోంది. నక్క కాయితాల కట్టలతో సతమతమౌతోంది. నక్కకూర్చున్న బల్లమీద కూడా సీసాలు గ్లాసులూ అమర్చివున్నయ్. గ్లాసుమీద గ్లాసు యిద్దరూ ఆరారగా గొంతు తడుపుకుంటున్నారు. సింహం, మెదడుకు యెక్కువగా పని తగలని తేలికపాఠు కాయితాలేవో తిరగవేస్తోంది. నక్కమాత్రం బొమలు ముడివేసుకుని తీవ్రంగా ఆలోచిస్తోంది. ఆ ఆలోచనతో బుర్ర వేడెక్కి మళ్లా మళ్లా గుడ్డలు తడిపి నెత్తిమీద వేసుకుంటున్నది.

అలా నానా తంటాలుపడి, నక్క, కావలసిన పాయంట్లన్నీ తయారుచేసి, వాటిని నివేదించటానికి సింహం దగ్గిర కొచ్చింది. సింహం వాటినన్నిటిని ఒకటొకటే చక్కగా అర్థం చేసుకుని తృప్తోస్మి అనుకుని హాయిగా సోఫామీద పడుకుని హఠయోగం పట్టింది.

నక్క మళ్లాపోయి రెండో కేసుకాయితాలు తిరగేసి అదేవిధంగా మళ్లా సింహానికి వ్యవహారమంతా అర్థం చేసింది.

'అమ్మయ్యా!' ఈవేళకు ఈ బెడదతీరిపోయింది?–అన్నాడు స్ట్రయివర్: 'మళ్లా ఒక పెగ్ బిగించు భయ్యా!'–

నక్క నెత్తిమీద తడి తువ్వాళ్లు తీసి అవతల పారేసి, ఆవలించి వళ్లు విరుచుకుంది. మళ్లాపోయి మరోగ్లాసు బిగించుతోంది.

'ఈవేళ ప్రాసిక్యూషన్ సాక్షుల క్లాసుపరీక్షలో మటుకు బలే ప్రశ్నలందించావులే– ప్రశ్న ప్రశ్నా తుపాకి గుండులా పనిచేసింది. బలే రంజింపచేశావు!'

'ఒకనాడు మాత్రం – నేను రంజింపజేసి యాడవందెప్పుడు?' అన్నాడు సిడ్నీ.

'ఎందుకు భయ్యా! అంతకోపంగా వున్నావ్ – మరో గ్లాసుపుచ్చుకో; ఆ రుస రుస అణుగుతుంది'

రుసరుసలాడుతూనే మరోగ్లాసు తగిలించాడు.

'ఆ ష్రూస్ బేరీ స్కూల్లో చదువుతుండే రోజుల్లో ఎలా వుండేవాడివో ఇప్పుడూ అంతే – క్షణానికి ఆటూ, క్షణానికి పోటు – అంతలో కోపం, అంతలో నైరాశ్యం – అదే సిడ్నీ కార్టన్ – అదే కుర్రతనం – రవ్వంతేనా మార్పులేదు.'

'అవును అదే సిడ్నీ – మార్పేమేడిసింది, అదృష్టంలోమటుకు! అప్పుడూ ఇంతే; ఎదటిపిల్లల హోమువర్కులన్నీ చేసిపెట్టి నాసంగతి నేను చూసుకునేవాణ్ణి కాదు'–

'ఎందుకనంటావ్'

'ఎందుకేఁవిటి కర్మ – జాతకస్వభావం'

'అబ్బాయ్! నే నొకటి చెబుతావిను – నీలో వున్న లోపమేవిఁటంటే, జీవితాన్ని కుంటినడక నడిపిస్తావ్!' ఏ విషయంలోనూ పట్టుమని శ్రద్ధలేదు – నా విషయం చూడు,'

'చంపావ్! – ధర్మోపదేశం మొదలెడుతున్నావా యేవిఁటి?' అంటూ నవ్వేశాడు సిడ్నీ.

'నేనీస్థితికి ఎలా వచ్చాను – ఏ పని మొదలెట్టినా యెంత జాగ్రత్తగా పనిచేస్తాను.'

'నువ్వు ఈ స్థితికి యెలావొచ్చావో నాకు తెలీదనా – నాకేదో కూలి పారేసి చాకిరీచేయించి యీ స్థితికి వచ్చావ్. అందులో నువ్వుబడాయి చెప్పుకోవలసిందేమీ లేదు. నీకేమీ కావాలో అదిచేస్తావు; నాకేం గావాలో నేను చూసుకోను అంతే తేడా; నువ్వెప్పుడూ ముందుపీటేనుంటావ్ – నే నెప్పుడూ వెనకాలే యేడుస్తూ వుంటాను.'

'అగ్రశ్రేణిలోకి చొచ్చుకుపోవలసివుంది గనుక ప్రయత్నించాను – పుట్టటమే గొప్పవాణ్ణిగా పుట్టానంటావా?'

'నువ్వు పుట్టినప్పుడు నేనక్కడ లేనుగాని – మొత్తానికి గొప్పవాడుగా పుట్టావనే నేననుకోటం' – ఆ మాటని, సిడ్నీ, మళ్లా నవ్వేశాడు; స్ట్రయివర్ కూడా నవ్వాడు.

కార్టన్ మళ్లా మొదలుబెట్టాడు : 'ష్రూస్‌బరీలో వుండగానూ అంతే, పారీస్‌లో 'లా' చదువుతున్నప్పుడూ అంతే – నీ వర్గంలో నువ్వుండే వాడివి; నా వర్గంలో నేనుండేవాణ్ణి. నువ్వెప్పుడూ ఎక్కడో నలుగురికీ కనుపించే యేదో ఒక చోట వుండేవాడివి, నేనెప్పుడూ, ఎక్కడా వుండేవాణ్ణి గాదు!

'తప్పెవరిదంటావ్?'

'తప్పు నీదికాదనటం మాత్రమెలా? నువ్వెప్పుడూ ప్రక్కనున్నవాణ్ణి మోచేతుల్తో నక్కునెట్టి ముందుకెళ్లిపోతూ వుంటావ్ - ఇంకా నాకుముందుకొచ్చే సావకాశం యెక్కడ ారికేడిచింది? తెల్లవారిపోయింది. గత విషాద జీవితాన్ని నెమరుకు తెచ్చుకుని చీకటి ంచుకోవటమెందుకుగాని ఏదైనా సర్దాగా వుండేమాట చెప్పు - ఇంటికి జేరతాను.'

'పోనీ నిన్న సాక్ష్యం చెప్పిన ఆ అందగత్తె సంగతి చెప్పమంటావ్ - సర్దాగా వుంటుందేమో? -'

నిజంగా అతనికి సర్దా వెయ్యలేదు. ముఖంమీద మరింతగా విషాదచ్ఛాయలు అలుముకున్నయ్:

'అందకత్తె యెవరు?'

'లూసీ మానెట్'

'ఆవిడేనా అందగత్తె'

'ఏం? కాదా?'

'మ్చ్!'-

'అరే! అలా అంటావేం - కోర్టులోవున్న యావన్మందీ దంగైపోతే'

'ఆ కోర్టుజనం మెచ్చుకోటానికేవిఁటిలె - అదో బంగారు జుట్టు తగిలించిన రబ్బరు బొమ్మ'

'నిజం చెబుతాను విను సిడ్నీ - నీకా బొమ్మమీద మోజు కలిగిందని అనుకున్నాను- ఆవిడ మూర్ఛపోవటం మా అందరికంటే ముందు నువ్వే చూశావు'

'అరే! కళ్లెదట మనిషో, బొమ్మో, ఒరిగిపోతుంటే ఆ సంగతి గ్రహించటానికి టెలెస్కోపు కావాలా ఏవిఁటి - నువ్వు లక్ష చెప్పు అది సౌందర్యమంటే మాత్రం నేనుచస్తే అంగీకరించను.- ఇక ఇక్కడికి త్రాగుడు సమాప్తి - వెళ్లి కాసేపు పడుకుంటాను.'

స్ట్రయివర్ అతనితోపాటు లేచి గుమ్మందాకా పంపించాడు. సిడ్నీ ఇంట్లోనుంచి బయటికి వచ్చేటప్పటికి చలిచలిగా వుంది. వాతావరణమంతా నిరుత్సాహ జనకంగానూ, విచార సూచకంగానూ వుంది. నదిమీద ఆకాశం ఇంకా మసక మసకగా దిగులేస్తోంది. ఆ దృశ్యమంతా నిర్జీతమైన యెడారిలా కనుపించుతోంది.

వ్యర్థమైన మానవశక్తులు హృదయంలోనూ చుట్టూ నిర్జీతమైన యెడారి; మౌనంగా సిడ్నీ మేడ మెట్లెక్కుతున్నాడు. ఈ అతని మదిని పొడసూపుతున్న ఆ నిర్జీవదృశ్యంలో ఎక్కడో దూరాన మహదాశయోజ్జ్వలమైన ఒక నందనోద్యానం రేఖగా గోచరిస్తోంది - ఆత్మత్యాగ సౌందర్యసీమ!!

14

డాక్టర్ మానెట్ 'సోహోస్క్వేర్'కు చేరువలో, ప్రశాంతమైన ఒక వీధి మొగిని, ప్రశాంతమైన ఒక భవంతిలో వుంటున్నాడు. ఆ వేళ ఆదివారం. మధ్యాహ్నం దాటింది హాయిగా ఎండకాస్తోంది. జర్విస్‌లారీ, క్లర్ కెన్‌వెల్ ప్రాంతంలో వున్న తన ఆవాసంనుంచి బయలుదేరి, డాక్టర్ మానెట్ యింటికి వస్తున్నాడు. డాక్టర్ గారికీ, లారీకి బాగా స్నేహం యేర్పడ్డది. డాక్టర్ గారి యింటికి లారీ తరుచు వస్తూవుండేవాడు.

సాధారణంగా, ఆదివారంనాడల్లా లారీ, డాక్టర్ మానెట్‌తోనూ, లూసీ మానెట్‌తోనూ కలిసి షికారు వెళ్ళుతూ వుండేవాడు. కసరూగట్రా పట్టి బయట తిరగటానికి వీల్లేకపోతే డాక్టర్‌గారి యింట్లోనే వుండిపోయి యే గ్రంథకాలక్షేపంతోనో, బాతాఖానీతోనో కులాసాగా కాలం గడిపేసుకునేవాడు. ఆయనకు జీవితంలో కొన్ని ధర్మసందేహాలుండేవి; ఈ ఆదివారాల అవకాశాన్ని ఉపయోగించుకుని, డాక్టర్ గారి గృహ నిర్వహణపద్ధతులను అవగతం చేసుకుంటూ తద్వారా సందేహ నివృత్తి చేసుకుంటూ వుండేవాడు.

డాక్టర్ గారుంటున్న ప్రదేశంవంటి విచిత్రమైన ప్రాంతం, లండన్‌లో మరొకటిలేదు. డాక్టర్‌వున్న భవంతి, సందుకు అడ్డంగా వుంటుంది. ఇక ఆపైని అవతలికి వెళ్ళటానికి మార్గం లేదు. మేడమీది కిటికీలనుంచి తొంగిచూస్తే నిమ్మకు నీరెత్తినట్టున్న ప్రశాంతమైన వీధిదృశ్యం కనుపిస్తుంది. ఆరోజుల్లో ఆక్సుఫర్డు రోడ్డుకు ఉత్తరదిశగా యిళ్లుండేవి కావు; ఆ ప్రాంతమంతా అడవిచెట్లతోనూ, ముళ్ళతీగెలతోనూ నిండివుండేది. చూట్టానికి పల్లెటూరి ప్రాంతంలా వుండేది. ఆనందయుతమైన చల్లటి ప్రదేశం; లండన్ వీధుల గల్లంతుల్లోనుంచి ఈ ప్రదేశానికి వస్తే - సముద్రగర్భం నుంచి రేవుకు జేరుకున్నట్టుగా వుంటుంది.

అదో పెద్దభవంతి; ఎక్కడా చడీ చప్పుడూ వినిపించదు. ఆ భవంతిలో డాక్టర్ మానెట్ రెండు అంతస్థులు ఆక్రమించారు. ఆ భవంతిచుట్టూ, గదిగదికీ ఒకొక్క 'సైన్‌బోర్డు' తగిలించివుంది. అనేక వృత్తులూ, వ్యాపారాలూ జరుగుతున్న కేంద్రంగా కనుపించుతుంది. కాని ఆయా వృత్తులకు, సంబంధించి, యే సంచలనం కనుపించదు. ఆ ఆవరణలో ముందున్న భవనానికీ వెనకవేపు నున్న మరో చిన్న భవనానికీ మధ్య విశాలమైన పెరటిదొడ్డి వుంది. ఆ పెరటిలో మధ్యగా పచ్చని ఆకులతో ఒకే ఒక చెట్టుంది. పెరటిలోవున్న ఆ చిన్ని యింటికి కూడా కొన్ని 'బోర్డులు' తగిలించివున్నయ్.

'హార్మోనియములు తయారు చేయబడును', 'వెండి కార్ఖానా', 'బంగారు కార్ఖానా' ఇత్యాదయః. వట్టిబోర్డులు మినహా ఆ కార్ఖానాల్లో ప్రాణిసంచలన మేమీ కనుపించదు. బంగారు కార్ఖానా గోడమీదమటుకు బంగారువర్ణంలో ఒక చెయ్యిమాత్రం చిత్రించివుంది. ఆ బంగారు చేతితాలూకు అదృశ్యభూతం ముందు తన్నుతాను సుత్తితో నలగగొట్టేసుకుని, అనంతరం అక్కడి కొచ్చినవాళ్ళనందర్నీ నలగగొట్టేసిందేమో! లేకపోతే ఇన్ని వృత్తులు సాగుతున్నట్టు 'సైనుబోర్డులు' కనుపిస్తున్నా మనుష్యులెవ్వరూ కనుపించకపోవటానికి కారణమేమిటి?'

ఆ భవంతిలోనే డాక్టర్ మానెట్ వైద్యవృత్తిని సాగిస్తున్నాడు. ఆయన్ను అతఃపూర్వం యెరిగినవాళ్లు యెవరో కొద్దిమంది రోగులుమాత్రం వస్తూండేవారు. తన ఖర్చులకు కావలసినమటుకు ఏదో సంపాదిస్తూ వుండేవాడు.

ఈ సంగతులన్నీ జర్విస్ లారీకి తెలుసు. ఆయన మానెట్ గారి యింటిముందు కొచ్చి తలుపుకొట్టాడు.

'డాక్టర్ గారు ఇంట్లో వున్నారా?'–

'తిరిగొచ్చే వేళయింది.'

'లూసీమానెట్ వున్నారా?'

'ఆవిడా యిప్పుడే వస్తారు.'–

'మిస్ ప్రాస్?'–

మిస్‌ప్రాస్ యింట్లోనే వుంది. కాని, మిస్‌ప్రాస్ ఈ పెద్దమనిషిని యింట్లోకి రానివ్వమంటుందో వద్దంటుందో తెలీక ఆ దాసీమనిషి సందేహిస్తోంది.

లారీ చొరవచేశాడు; 'ఆవిడ యింటోనే వున్నట్టుంది – సరే నేను మేడమీదకి వెడతాను'–

నిజానికి డాక్టర్ కూతురుకు తన మాతృదేశం సంగతి యెక్కువగా తెలీదు. కాని ఫ్రెంచిపడుచులందరికి మల్లేనే, పెద్ద సిరిసంపదలు లేకపోయినా ఉన్నదాంట్లోనే, ఇల్లూ వాకిలీ ముచ్చటగా అలంకరించే చక్కటి అభిరుచిని అలవరుచుకుంది. ఇంట్లో వున్న సామాను వగైరా పెద్ద ఖరీదుగల వేమీగాదు; కాని ఆటే డబ్బు ఖర్చులేని చిన్ని చిన్ని అలంకారాలతో ఇల్లంతా ఎంతో శోభగా వుంది. ఎక్కడ యే పెద్దసామానుండాలో, యెక్కడ యేచిన్న సామాను అమర్చాలో తీర్చిదిద్దినట్టు ఏర్పాటు చేసివుంది. లారీ వాటన్నిటివంకా చూస్తూ నిల్చున్నాడు. అక్కడున్న చిన్ని చిన్ని కుర్చీలూ, బల్లలూ, అతనివంకచూసి: 'మేమిక్కడ ఎంత షోగ్గా, కూర్చున్నామో చూశావా?' అంటున్నట్టుతోస్తోంది.

ఆ అంతస్తులో మొత్తం మూడు గదులున్నయ్. మూడు గదుల్లోకి పరాహత్‌గా గాలివచ్చేలాగు తలుపులూ, దరవాజాలూ తెరిచి వున్నయ్. ఆ గదుల చక్కదనాన్ని అభినందించుతూ లారీ ఒక గదిలోనుంచి రెండో గదిలోకి నెమ్మదిగా నడుస్తున్నాడు.

మొదటిగది అన్నింటికంటే బాగుంది. దాన్లో లూసీతాలూకు, పిట్టలూ, పువ్వులూ, పుస్తకాలూ, కలర్ బాక్సులూ, ఈ వగైరా సరంజామా అంతా వుంది. రెండోది డాక్టరుగారు రోగులను పరీక్షించే గది. మూడోది డాక్టర్ పడకగది. మూడోగది కిటికీలో నుంచి చూస్తే దొడ్లోవున్న పచ్చనిచెట్టు కనిపిస్తూ వుంటుంది. ఆ గదిలో ఒక మూల డాక్టర్ మానెట్ చెప్పులుకుట్టుకునే పనిముట్లన్నీ ఒక బెంచీమీద పడేసివున్నయ్.

'ఆయన బాధపడిన రోజులనాటి ఈ స్మృతి చిహ్నాలనన్నిటినీ, డాక్టర్‌గారు ఇంకా ఇలా చుట్టూ పేర్చుకు కూర్చోటం విచిత్రంగా వుంది' అన్నాడు లారీ.

'ఇందులో పెద్ద చిత్రమేవిటి?' అన్నది, మిస్ ప్రాస్; మిస్ ప్రాస్ అంటే ఆవేళ డోవర్లో, రాయల్‌జార్జి హోటల్లో లారీగారి మీద లంఘించిన ఆడసింహం.

'నేననుకున్న దేవిటంటే...' అంటూ నసిగేడు లారీ.

'అనుకున్నావులే మహలావు!–'

లారీ తెల్లబోయాడు.

'కులాసాయేనా?'

యోగ క్షేమం విచారిస్తున్న ధోరణి చెవులబడి లారీకి ప్రాణాలు తెప్పరిల్లినయ్. "అమ్మయ్యా మరేం కోపంగా అన్నమాటగాదు" అనుకున్నాడు.

'ఆఁ కులాసాగానే వున్నా మీరు కులాసాగా ఉన్నారా?'

'ఆఁ అదేకులాసా – నా మొహం కులాసా?'

'ఏవిటి సంగతీ'–

'సంగతేవిటి, గింగతి – చిట్టితల్లి సంగతి నాకెంతో చిరాగ్గా వుంది?'

'ఏవిటి చిరాకూ'

'ఏవిటేవిటి గీవిటి – చిట్టితల్లిని చూట్టానికి అడ్డమైన వెధవలూ డజన్ల తరబడి వస్తుంటే చిరాకా మరీనా?'

'డజన్లేవిటి డజన్లు – వందలూ వేలూ–'

అందరి ఆడవాళ్ళలో మోస్తరుగానే, మిస్ ప్రాస్‌లో కూడా అదో స్వభావం; తాను ఆ విషయాన్ని మరింత పెంచి ఉత్ప్రేక్షించి పారేస్తుంది.

'అయ్యోబాబోయ్!' అన్నాడు లారీ, ప్రాస్‌కు కోపం వచ్చె, మరో మాటేమీ మాట్టాడే దమ్ములేక.

'ఇంత చిన్న బిడ్డగా వున్నప్పటినుంచీ చిట్టితల్లిని కదా పట్టుకున్నాను. చిట్టితల్లిని విడిచిపెట్టి క్షణమైనా వుండేదాన్నిగాదు – కష్టంగా వుండదు మరీ'

కష్టంగా యెందుకుండాలో లారీకి అర్థంకాలేదు. అర్థంకాలేదంటే యేవి (కొంప మునుగుతుందోనని 'అవున'న్నట్టు తల ఊపాడు.)

'చిట్టితల్లి పాదాలంటుకోటానికి కూడా తగని వెంకటాయి వెధవలు ఊహూ ఇంటిచుట్టూ తిరుగుతూ వుంటారు – నువ్వు ఆ వ్యవహారం ప్రారంభించినప్పుడు...'

లారీ కుదుపుతిన్నాడు:

'ఆఁ యేవిటి! నేనూ ప్రారంభించానా...'

'ప్రారంభించలా? – డాక్టర్ గారికి పునర్జన్మ నివ్వటానికి ఆ వ్యవహారంలోకి దిగలా'

'ఓహో అదా సంగతి–'

'ఆ వ్యవహారం నువ్వు పూర్తి చెయ్యటం, నిజంగా నాకు కష్టంగానే వుండేది. డాక్టర్ గారంటే నాకు కోపం గాదు. చిట్టి తల్లికి తగినతండ్రి కాకపోయినా, మంచివాడే; కాని ఆయన కోసం పదిమందీ యింటికిరావటం, నా చిట్టితల్లి నాతో కూర్చుని కాసేపు మాట్టాడటానికే అవకాశం లేకపోవటం – ఎంత కష్టంగా వుందనుకుంటున్నావ్?'

మిస్ ప్రాస్ మనస్సులోవున్నఈర్ష్య లారీకి అర్థమైంది. కాని ఆ ఈర్ష్యకు అట్టడుగున లూసీమానెట్ పట్ల వున్న అనంతమైన వాత్సల్యాన్ని కూడా అవగతం చేసుకున్నాడు.

'నువ్వు లక్ష చెప్పు, వెయ్యి చెప్పు చిట్టితల్లికి తగినవాడల్లా ఈ తమ్ముడు సాల్మన్ ఒక్కడుతప్ప మరొకడెవ్వడూ లేడు – వాడుకూడా ఒకలుచ్చా పనిచేసిన వాడేలే' అన్నది ప్రాస్.'

దాంతో లారీ, మిస్ ప్రాస్ వ్యక్తిగత జీవితాన్ని కొంత భోగట్టా చెయ్యవలసి వచ్చింది. ప్రాస్‌కు సాల్మన్ అనే తమ్ముడొకడున్నాడు. వాడు వ్యాపారం చేస్తానని ప్రాస్ దగ్గిరున్న చిన్నం చితకా యావత్తూ కాజేసి జూదంలో తగలెట్టేశాడు. ప్రాస్‌ను దారిద్ర్యంలో వదిలేసి, తనకు

కానట్టు తప్పుకున్నాడు. స్వల్పమైన ఈ తప్పిదంవున్నా సాల్మన్ సత్సీల సంప్రదాయాలు 'కలవాడేనని ప్రాస్‌వాదం. ఆ ఆడదాని మనస్థితిని అర్థం చేసుకుని లారీ విస్తుపోయాడు. ప్రసంగం మార్చి:

'ఇదిగో ఇటు చూడు! ఇక్కడ నువ్వూ నేనూ తప్ప మరొకరెవరూ లేరు - ఇద్దరం కూడా వ్యవహారజ్ఞానం వున్న తెలివిగల వాళ్ళం. నిన్నొకమాట అడుగుతాను చెప్పు - డాక్టర్ తాను చెప్పాలుకుడుతూ జైల్లోవున్న నాటి రోజులసంగతి అప్పుడప్పుడు కూతురుముందు ఎత్తుతూ వుంటాడా'-

'చస్తే ఎత్తడు-'

'మరి, యీపనిముట్లన్నీ ఇక్కడ ఇలా ఎందుకున్నయ్'

'కూతురుతో చెప్పడన్నాను గాని - తను మనసులో ఆలోచిస్తూ వుండడన్నానా?'-

'ఆయన ఆ విషయం ఆలోచిస్తూనే వుంటాడంటావా'-

'నువ్వు ఊహించిందీ...'

'ఛీఛీ! నేనెప్పుడూ ఏదీ ఊహించను'-

'పొరపాటు నన్నాలే - పోనీ ఊహించలేదు - అనుకుంటున్నావ్ - డాక్టర్ గారికి, ఆయన్ను జైల్లో పారేసిన వ్యక్తి పేరుగాని, జైల్లోపెట్టి బాధించటానికి గల కారణాలుగాని తెలుసునంటావా?'

'ఆ సంగతి నాకేమీ తెలీదుగాని - చిట్టితల్లి ఏవంటుందంటే -'

'ఏవంటుందీ?-'

'ఏవంటుందేవిటి - ఆయనకి అవన్నీ తెలుసునంటుంది'

'ఇదుగో యీ ప్రశ్నలన్నీ అడుగుతున్నానని మరేమీ అనుకోబోకు - నేను మట్టిబుర్రని'-

'అట్టాగా మట్టిబుర్రవేనా?'-

'ఎబ్బెబ్బే! కాదులే - అసలు ఈ సంగతి ఎందుకడుగుతున్నానంటే, డాక్టర్ గారి సంగతి మనందరికీ తెలుసు; ఆయన పాపిష్ఠి పనులేవీ చేసే స్వభావంగలవాడు గాడు - మాకిద్దరికీ చేసివుండడు. పాపం అలాంటి అమాయకుణ్ణి యెందుకోమరి జైల్లో పెట్టారు - పోనీ కూతురుకన్నా ఎంతో స్నేహంవున్నా నాతో ఆయన యీ సంగతి యెప్పుడూ చెప్పలేదు - మరేంలేదు విషయం తెలుసుకుందామని చెప్పకుండా వుంటాడా అని అడుగుతున్నాను - మరేంలేదు విషయం తెలుసుకుందామని అడుగుతున్నాను'-

ఆ లాలన వాక్యాలతో ప్రాస్ కొంచెం మెత్తబడ్డది:

'ఏం చెబుతాడయ్యా! - ఆ సంగతి యెత్తితే ఆయనకు భయమేస్తుందల్లే వుంది.'

'ఏవిఁటీ? భయమా?'

'భయం గాదుటయ్యా - ఎలా మతిపోయిందో తెలియదాయిరి, ఎలా మతివొచ్చిందో తెలియదాయిరి. ఆ మాట తలుచుకుంటే మళ్ళీ యెప్పుడు మతిపోతుందోనని భయంగా వుండదూ.'

'అదే నేననేది - ఆయన ఈ విషయాన్ని యెప్పుడూ మనస్సులో వుంచుకుని బాధపడుతూ వుండటం మంచిది కాదేమో - అందుకే నిన్ను యీ విషయమై ప్రశ్నించవలసి వచ్చింది.'

'కర్మ అందుకేం జేస్తాం' అన్నది మిస్ ప్రాస్. 'మనం గాని ఆ విషయమేదైనా నాకాస్త కదిలించామంటే ఆయన మరింత దిగులుగా దించుకుపోతాడు. మంచో చెడో, ఆ సంగతి యెత్తకుండా వుంటమే నయం. ఒకోనాడు, ఆయన, అర్థరాత్రివేళ పక్కమీదనుంచి లేచి గదిలో ఇటూ అటూ వెర్రిగా తిరుగుతూ వుంటాడు. ఆయనకు జైల్లోవుండే రోజులు జ్ఞాపకం వచ్చి వుంటాయని చిట్టితల్లి అంటూవుంటుంది. అల్లాంటప్పుడు చిట్టితల్లి లేచివెళ్లి, ఆయన్ను వెంటబెట్టుకుని యిటూఅటూ తిప్పి కాస్త స్థిమితపడ్డ తరువాత మళ్ళీ తీసుకొచ్చి పడుకోబెడుతుంది. ఆయన మాత్రం, తన మనస్సు యెందుకలా ఆందోళనగా వున్నదీ రవ్వంతేనా చెప్పడు. ఆ సంగతి ఆయన్ను కదిలించటం మంచిదిగాదని చిట్టితల్లి అంటుంది. ఆ సంగతియేవీ యెత్తకుండా, వెంటబెట్టుకుని యిటూ అటూ తిప్పి బుజ్జగిస్తుంది. ఆయన మళ్ళీ ప్రజల్లో పడతాడు.'

ఇంతలోనే మెట్లమీద అడుగులచప్పుడు వినిపించింది; 'అరుగో వస్తున్నారు' అంటూ, మిస్ ప్రాస్ చివాల్న లేచింది - 'ఇక చూసుకో వందలూ వేలూ వచ్చిపడతారు.'

లారీ కిటికీలోనుంచి తొంగిచూచాడు. లూసీ మానెట్ తండ్రిని వెంటబెట్టుకుని మేడమెట్లెక్కుతోంది.

లూసీ లోపలికి రాగానే మిస్ ప్రాస్ చేతినిండా పని కల్పించుకుని హడావిడి చేస్తోంది. లూసీ నెత్తిమీదవున్న 'బానెట్' తీసి దుమ్మూ దుత్రా దులిపేసి అతిజాగ్రత్తగా బల్లమీద వుంచింది. పైన కప్పుకున్న కాబా తీసి జాగ్రత్తగా మడిచి అక్కడబెట్టింది. దువ్వెన్న తీసుకొచ్చి ఆ బంగారుజుట్టును అతి అప్యాయంగా దువ్వి సరిజేస్తోంది. చిట్టితల్లి కూడా చూడ ముచ్చటగావుంది. మిస్ ప్రాస్‌ను అతి ఆప్యాయంగా కౌగిలించుకుని తనకోసం అంతశ్రద్ధ తీసుకోవటమెందుకని మారాం చేస్తోంది. డాక్టర్ కూడా సర్దాగా వున్నాడు. ఆ యిద్దరివంకా చూస్తూ 'అతి గారాబం చేస్తూ లూసీని చెడగొడుతున్నావ్' అని ప్రాస్‌ను మందలించుతున్నాడు. ప్రాస్‌ను మందలించుతున్నాడన్నమాటేగాని, పితృవాత్సల్యం తొణికిసలాడుతున్న ఆయన కళ్ళవంక చూస్తే, లూసీ అంతకంటే పదిరెట్లు చెడిపోయేట్టుగా వుంది. ఆ ముగ్గురివంకా చూస్తూ లారీ కూడా సంతోషంగానే వున్నాడు. ఘోటక బ్రహ్మచారిగావున్న అతనికి, ఆ వార్ధక్య దశలో ఒక కుటుంబంతో కాలక్షేపంచేసే అవకాశం కలగటం అదృష్టం కాదూ? పైపెచ్చు ప్రాస్ జోస్యం చెప్పినట్టు వందలూ వేలూ వచ్చిపడే ప్రమాదంకూడా యేమీ కనుపించటం లేదు.

భోజనంవేళ కూడా సమీపించింది - అప్పటికీ కూడా వందలూ వేలూ ఎవ్వళ్ళూ రాలేదు. భోజనం యేర్పాట్లలో మిస్ ప్రాస్ చెడుగుడు కూసేస్తోంది. భోజన పదార్థాలన్నీ అటు ఫ్రెంచి సాంప్రదాయానికీ ఇటు ఆంగ్ల సాంప్రదాయానికీ మధ్యే మార్గంలో వున్నయ్. సోహోప్రాంతమంతా గాలించి, మిస్‌ప్రాస్ కొంతమంది ఫ్రెంచివాళ్లను పట్టుకొని, వాళ్ళకి అణా, బేడా పారేసీ, ఫ్రెంచిపాకశాస్త్ర విజ్ఞానాన్ని అస్తవ్యస్తంగా ఆర్జించుకుంది. ఆ విజ్ఞానంతో అంత వంకాయిగాని, బీరకాయిగాని, కోడిపిల్లగాని చేతికి దొరికితే దాంతో ఒక విచిత్రమైన వంటకాన్ని తయారుచేసి పారేసేది. వంటయింట్లో పనిచేసే తక్కిన దాసీలూ వాళ్లూ, మిస్ ప్రాస్‌కు బహుశా యేదో ఇంద్రజాలవిద్య తెలుసునని భ్రమపడేవాళ్ళు.

ఒక్క ఆదివారంనాడు మాత్రం మిస్‌ప్రాస్ డాక్టర్ గారి సహపంక్తిని భోజనంచేసేది. మిగతారోజుల్లో మాత్రం అలా అంగీకరించేదిగాదు. తనగదిలోతాను ఒంటరిగా కూర్చుని భోజనం చేసేది. ఆ గదిలోకి వెళ్ళటానికి, ఒక్క చిట్టితల్లికి మినహా మరొకళ్ళెవళ్లకి హక్కులేదు.

ఆవేళ బాగా ఉక్కగావుంది. భోజనం ముగిసిన తరువాత, పెరటిదొడ్లో చెట్టు క్రిందకూర్చుని ద్రాక్షాసవం సేవించితే హాయిగా వుంటుందని, కాస్త గాలివేస్తుందనీ లూసీ సూచించింది.

ఆయింట్లో యే వ్యవహారం జరిగినా లూసీకోసం, లూసీ అభిలాష ననుసరించీ జరుగుతుంది. అంతా చెట్టుక్రిందికి వెళ్ళి కూర్చోవటానికి అంగీకరించారు. లూసీ, లారీగారి సారాగిన్నె తానే స్వయంగా నింపి ఆదరించుతోంది. కులాసాగా గాలివేస్తోంది. పైనున్న చెట్టు ఆకులు గుసగుసగా కదులుతున్నయ్.

ఇప్పటికీ యింకా వందలూ వేలుయెవరూ రాలేదు. డార్నే మాత్రమే వచ్చాడు - ఒక్కడే.

డాక్టర్ మానెట్ అతన్ని యెంతో ఆప్యాయంగా ఆహ్వానించాడు. లూసీకూడా ఎంతో ఆదరణ చూపింది. ప్రాస్‌కు మాత్రం వళ్ళు మండిపోయింది. చీమలూ జెర్రులూ పాకుతున్నట్టు చిరాగ్గా లోపలికి వెళ్ళిపోయింది.

డాక్టర్ మానెట్ ఆ సమయంలో యెంతో ఆనందంగా వున్నాడు. ఆ సర్దాలో ఎంతో పడుచువాడుగా కూడా కనుపించుతున్నాడు. తండ్రీ కూతురూ ఒకరిప్రక్క ఒకరు కూర్చున్నారు. ఇద్దరి ముఖాలూ ఒకేపోలికలో వున్నయ్. కూతురు, అచ్చు తండ్రి నోట్లోనుంచి ఊడిపడ్డట్టుగా వుంది.

డాక్టర్ అనేక విషయాలమీద వసబోసిన పిట్టలా ఊపిరిసలపకుండా మాట్టాడేస్తున్నాడు. లండన్‌లోని ప్రాచీన భవంతుల మీద ఉపన్యాసం సాగుతోంది. 'ఇదుగో చూడండీ!' అంటూ డార్నే అడ్డుతగిలాడు, 'మీరు టవర్ చూశారుగా?'-

'చూడకేం నేనూ లూసీ యిద్దరం వెళ్ళి చూసొచ్చాం'

'నేనూ చూచాను లెండి - నేను అక్కడ కొంతకాలం వున్నాగా -' అతనిముఖం కొంచెం కోపంగా యెర్రబడ్డది; 'అక్కడుండగా ఒక సంగతి విన్నాను'-

'ఏవిటాసంగతీ' - లూసీ ప్రశ్నించింది.

'ఆ భవనంలో కొన్ని మరమ్మతులూ మార్పులూ చేయవలసి వచ్చి పనివాళ్ళు దాన్లోవున్న ఒక పాడుబెట్టిన చీకటికొట్లోకి వెళ్ళారు. ఆ కొట్లో గోడలన్నీ అనేకరకాల వ్రాతలతో నిండివున్నయ్ - ఆ కోట్లో పూర్వం వున్న ఖైదీలు వాటి నన్నింటినీ చిత్రించారు. అనేకరకాల శాసనాలు - తారీఖులు, పేర్లూ, కోరికలు, ప్రార్థనలు ఇత్యాదయః. అలాగే కొంతకాలం ఆ కొట్లోవుండి, అనంతరం ఉరితీయబడిన ఒక ఖైదీ, తన్ను ఉరికంబానికి తీసుకుబోయేముందు, గోడమూలగా వున్న ఒక రాతిమీద, మూడు అక్షరాలు చెక్కాడు యేదో చేతికందిన పనిముట్టుతో. అక్షరాల పోలికలు సరీగా గుర్తుబట్టటానికి తగినంత స్పష్టంగా లేవు. మొదట చూస్తే, కొంతమంది వాటిని, "డి.ఐ.సి." అని చదివారు. కాని తీరా బాగా పరిశీలనగా చూస్తే చివరి అక్షరం "జి" గాని, 'సి' కాదనుకున్నారు. అంతేగాక అవి మూడు మూడు పొడిఅక్షరాలు కావనీ 'డిగ్' (త్రవ్వు) అనే మాటైవుంటుందనీ అనుకున్నారు. తీరా ఆ మూల పెల్లగించి చూస్తే, తగలబడిపోయిన ఒక తోలుసంచీ బూడిద, కాలిపోయిన కాయితంముక్క మసీ కనుపించాయి. ఆ అజ్ఞాతఖైదీ యేవి రాశాడో యెవ్వరికీ తెలీదు. మొత్తానికి యేదో వ్రాసి, జైలరుకు కనుపించకుండా అలా పాతేసివుంటాడు.'

'నాన్నా!' అంటూ కంగారుగా లేచి లూసీ తండ్రి చెయ్యి బట్టుకుంది: ఆయన ముఖం అయోమయంగావుంది. నుదురుమీద చెయ్యివేసుకుని ఆయనకూడా లేచి నిల్చున్నాడు. ఆయన స్థితిగతులు గమనించి చుట్టూ వున్న వాళ్ళంతా కాళ్లు త్రొక్కుకుంటున్నారు.

'మరేం లేదమ్మా - వానచినుకులు పడుతున్నయ్ అందుకుని లేచాను - లోపలికి వెడదాం.'

నిజంగా చినుకులు పడుతున్నమాట కూడా నిజమే; చేతి మీదపడ్డ చినుకులు కూడా చూపించాడు. కాని, డార్నే చెబుతున్న సంగతిని గురించి ఆయన ఒక్క ముక్కయినా మాట్టాడలేదు. అంతా కలిసి ఆయన్ను లోపలికి తీసుకువెళ్లారు; లోపలికి వెళ్ళిన కొద్దిసేపటికే, ఆయనకి తిరిగి కులాసాచిక్కి ప్రజల్లో పడ్డాడు.

ఇంతలోకే టీకి వేళయింది - మిస్ ప్రాస్ టీ తయారు చేస్తోంది - వందలూ వేలూ రాకపోయినా - మళ్లా చిరాకు ముఖం పెట్టింది. ఇప్పుడు అదనంగా వచ్చిందల్లా కార్టన్ ఒక్కడే.

ఆరాత్రి బాగా ఉక్కపోస్తోంది. కిటికీలూ తలుపులూ తెరిచేవున్నా ఇంకా ఉక్కగానే వుంది. టీ త్రాగిన తరువాత తలో కిటికీ దగ్గిరికీ వెళ్ళి బయటికిచూస్తూ నిల్చున్నారు. లూసీ మాత్రం తండ్రిదగ్గిర కూర్చుంది. డార్నే ఆవిడప్రక్కనే కూర్చున్నాడు. కార్టన్ కిటికీకి చారబడి నిల్చున్నాడు. కిటికీలకు వ్రేలాడుతున్న తెరలు గాలికి ఉవ్వెత్తుగాలేచి చుట్టలు చుట్టుకుంటున్నయ్.

'వానచినుకులు ఇంకా పడుతూనే వున్నయ్' అన్నాడు డాక్టర్. 'వర్షం బాగా జోరయ్యేటట్టేవుంది.'

'అవును జోరయ్యేటట్టేవుంది' అన్నాడు కార్టన్.

వీధిలో జనం దబదబా నడుస్తున్న పదధ్వనులు వినిపించుతున్నయ్. గాలీవానా రాకముందే త్వరగా ఇళ్ళకు జేరుకోవాలనే ఆదుర్దాతో జనం త్వరత్వరగా వెళ్ళిపోతున్నారు. ఆ పదధ్వనులు మేడంతా ప్రతిధ్వనించుతున్నయ్.

'చుట్టూ వందలాది ప్రజల సంచలనం - అయినా యిది యేకాంత ప్రదేశంగానే వుంది' అన్నాడు డార్నే.

'డార్నే! నేను సాయంత్రంపూట ఇలానే కూర్చుని ఈ ప్రతిధ్వనులు వింటూవుంటాను నా కెందుకో భయమేస్తుంది'-

'ఆ జనసమ్మర్దం మన జీవితాల్లోకి కూడా చొచ్చుకువచ్చే రోజురావచ్చు' అన్నాడు కార్టన్, యేదో ప్రపంచంలో నుంచి మాట్టాడుతున్నట్టు.

పదధ్వనులు ప్రతిరావాలు యింకా జోరవుతున్నయ్. మరింత త్వరితగతిని నడిచిపోతున్నారు.

'ఇంతమంది ప్రజలూ మన అందరి జీవితాల్లోకి ప్రవేశించుతారా లేక కొంతమంది కొందరి జీవితాల్లోకీ మరి కొంతమంది మిగతావాళ్ళ జీవితంలోకీ ప్రవేశించుతారా అనేదే అనుమానం' అన్నాడు డార్నే.

'దూరాన ప్రజాసమూహం కనుపించుతోంది' అన్నాడు కార్టన్: 'మెరుపు మెరిసి చీకట్లను చీల్చినప్పుడల్లా వాళ్ళు నాకు కనుపించుతున్నారు. త్వరత్వరగా మనవేపు నడిచివస్తున్నారు'- ఈ మాటలు ముగించాడో లేదో ఫెళపెళా ఉరుములూ మెరుపులూ ప్రారంభమైనయ్.

పెద్దపెట్టునతుపాను రేగింది. ఆ హోరులో ఒకరిమాట ఒకరికి వినిపించకుండా పోయింది.

15

ఫ్రెంచి చక్రవర్తి దర్బారు దిగ్గంతుల్లోని ఒకానొక దొడ్డ ప్రభువు పారిస్‌లోని తన విలాస మందిరంలో మకాంచేసివున్నారు. పవిత్రాతిపవిత్రములైన ఆ మందిరపు లోపలి గదులలో ఆయన వేంచేసివుంటే, వారిని సేవించవచ్చిన భక్త బృందమంతా చుట్టూ బయటిగదుల్లో పడిగాపులు పడున్నారు. దొడ్డప్రభువు చాకొలెట్ పానీయం స్వీకరించ బోతున్నారు. ఆయన సునాయాసంగా, ఎన్నెన్ని పదార్థాలనైనా ఇట్టే మ్రింగివేయగలరు. ఆయన ఫ్రాన్సుదేశాన్ని యావత్తూ త్వరితగతిని మ్రింగిపారేస్తున్నాడని, కొదరు కుళ్లుమోతువాళ్ళు అనటం కూడా కద్దు కాని, ప్రాతఃకాలంలో ఆయన చాకొలెట్ త్రాగాలంటే, వంటవాడుకాక, బలసంపన్నులైన నలుగురు మనుషులు సాయంచేస్తేనేగాని, ఆ పానీయం ఆయన గొంతులోకి దిగజారదు.

అవును, నలుగురూ వుండితీరవలసిందే. ఆ నలుగురూ కూడా పటాటోపంగా అలంకరించుకుని వుండాలి. ఆ నలుగురిలోనూ పెద్ద ఉజ్జీఅయిన ముఠామేస్త్రీ : ఒకటికి రెండు, బంగారు జేబు గడియారాలు అలంకరించుకోవాలి. అది ప్రభువుగారు స్థాపించిన సాంప్రదాయం కావటంచేత, ప్రభువుగారి పద్ధతిలో తనూ గడియారద్వయం అలంకరించుకుంటేగాని హోదాకు సరిపోయినట్టుగా వుండదు. ఆ లాంఛనాలతో అలంకరించుకుని వుంటేగాని, సుఖావహమైన ఆ పానీయాన్ని ప్రభువుగారి పెదవులకు అందించే అర్హత యేర్పడదు. ఒక సేవకుడు పానపాత్రను ప్రభువర్యుల సన్నిధికి చేకొనివచ్చాడు. వేరొక సేవకుడు బంగారు శలాకతో చక్కగా నురుగుకట్టేవరకూ చిలికి అక్కడ వుంచాడు. మూడో సేవకుడు చేరుమాల అందించాడు. ఆపైన జములు గడియారాల సేవకాగ్రణి పానపాత్రను ప్రభువుల పెదవులకు అందించాడు. ఆ నలుగురూ అలా వుండితీరవలసిందే. ఆ నలుగురిలో యేఒక్కణ్ణి తగ్గించినా ప్రభువుగారి వంశమర్యాదకే భంగం వాటిల్లిపోతుంది. నిజంగా యిద్దరి సహాయంతోనే చాకొలెట్ సేవించవలసిన దుస్థితే సంభవిస్తే ఆ అగౌరవాన్ని భరించలేక ప్రభువు స్వయంగా చచ్చేపోతారు.

ప్రభువు రాత్రివూట విందుగుడిచేవేళ నటనటీ గాయకవిలాసములూ, వాద్యసంఘోషణములూ మిన్ను ముట్టుతూవుంటై. ప్రభువు కళాప్రియుదు; ఫ్రాన్సుయొక్క అవసరానవసరాల ఘోష అయన్ను ఈషణ్మాత్రమైనా కదలించలేకపోయినా, కళాలాలిత్యాలంటే కరగి నీరౌతారు. అలాంటి మహామహుణ్ణి కన్న ఫ్రాన్సుదేశం, నిజంగా, ధన్య - ఫ్రాన్సుమాటేవిఁటి అలాంటి ప్రబుద్ధుణ్ణి కన్న యేదేశం మాత్రం! - దేశాన్ని మొత్తంగా తాకట్టుబెడితే పెట్టాడుగాక, రంగేలా స్టూవర్టుప్రభువురోజుల్లో ఇంగ్లండు కీర్తిమాత్రం మిన్నుముట్టలేదూ!

పబ్లీకు వ్యవహారాల విషయంలో ప్రభువుగారికి ఒక మహత్తరమైన అభిప్రాయం వుంది - ఏది ఎలా నడుస్తుంటే దాన్ని అలా నడవనియ్యాలి; ఇక వ్యక్తిగతంగా తనకు సంబంధించిన విషయాల్లోకూడా అంతకంటే ఉత్తమోత్తమమైన మరో అభిప్రాయం వుంది; ప్రతివ్యవహారం తనకు వీలుగా వుండేటట్టూ, తన అధికారసంపదలు వృద్ధిపొందేటట్టూ నడవాలి. అన్నిటినీ తలదన్నిన అత్యంత పరమోత్తమాభిప్రాయం, మూడవది: ఈ ప్రపంచం యావత్తూ తన ఆనందవిలాసాల కొరకు సృష్టింపబడి వున్నదనుకోవటం. 'ఈప్రపంచమూ అందలి యావత్తునిధి నిక్షేపములూ నావి' - ఇది ప్రభువుల శాసనం.

అయినా, ఇటీవలగా, ప్రభువుగారి ప్రయివేటు, పబ్లీకు వ్యవహారాల్లో కొన్ని చిన్ని చిన్ని లుగాడీ చిరాకులు కనుపించుతూనే వున్నయ్. అంచేత, ఈ రెండు రకాల వ్యవహారాలలోనూ కూడా శ్రీవారు ఒక మహాభూస్వామితో పొత్తుకలుపుకున్నారు. పబ్లీకు ఆర్థిక వ్యవహారాలు తమకు ఎలాగూ అంకెకు వచ్చేవికాదు గనక వాటిని యెలాగూ మరొకరికి వప్పగింత చెయ్యవలసేవుంది. ఇక రెండోది, ప్రయివేటు ఆర్థిక వ్యవహారాల విషయం; తమ వంశం తరాల తరబడి విలాస విభ్రమాలలో మునిగితేలుతూ, ఉన్నదీ మన్నదీ కరారావుడి అయిపోతున్న కారణం గానూ, ఆ మహాభూస్వామి బాగాడబ్బున్న సంపన్నుడు కావటంచేతనూ, ఆ వ్యవహారమంతా ఆ భూస్వామికే వప్పగింత చేసి పారేస్తే పోతుందనుకున్నారు. అందుకుగాను, కాన్వెంటులో వున్న తన చెల్లెల్ని, ముసుగు నెత్తిమీద కెక్కకపూర్వమే తొందరపడి యివతలికి లాక్కొచ్చి, వంశగౌరవాలు వగైరా ఛాందసాలు పాటించకుండా ఆమహాభూస్వామికిచ్చి కన్యాదానం చేశారు. ఇప్పుడు ఆ భూస్వామివర్యుడు పచ్చలబెత్తంచేత్తో పుచ్చుకుని, బయటిగదిలో పడిగాపులుపడున్న భక్తకోటి ప్రాణాచారాలు స్వీకరించుతూ ఉల్లాసంగా వున్నారు. తతిమ్మా మానవజాతియావత్తూ ఆయన పాదధూళి శిరోధార్యంగా, అలా ఆనతులుపచరించుతున్నా - ప్రభువుగారి రక్తబంధువులు మాత్రం- తన భార్యదేఖీలూ, సమగ్ర నిరసనతో పురుగుక్రింద చూస్తూ వుంటారు.

భూస్వామి ఇంత బాగా కలవాడు. ఆయన శాలలో రెండున్నర డజన్లవరకూ గుర్రాలున్నయ్. ఆయన దేవిడీలో రెండు డజన్ల మగసేవకులు అచ్చోసిన ఆంబోతుల్లా తిరుగుతూవుంటారు. ఆయన భార్యకు ప్రత్యేకంగా, ఆరుగురు ఆడసిబ్బందీ వున్నారు - అంగరక్షకసిబ్బందీ అనండి శరీరసిబ్బందీ అనండి. మరొకటి యేవిఁటంటే: ఈ భూస్వామికశిఖామణి, దోపిడీపంథాలో, చేజిక్కినంతవరకు అంజించుకోగల సమర్థుడు. అందుచేత, ఈ వివాహబాంధవ్యం వల్ల సాంఘిక నైతికాది విషయాల్లో ఆయన గౌరవమర్యాదలు యెలావున్నా - ఈ బయటి గదుల భక్తకోటికి మాత్రం ప్రత్యక్ష దైవమై వెలసి కూర్చున్నాడు.

నిజంగా ఆ మందిరంలోని గదులన్నీ చాలా అందంగా వున్నమాట వాస్తవమే. శిల్పచిత్ర కళాసౌభాగ్యాలతో వెల్లివిరిసిపోతున్నాయన్నమాట కూడా నిజమే. కాని అక్కడి వ్యవహారమంతా సజావుగా నున్నదనటానికి వీల్లేదు. ఆమందిరంచుట్టూ వున్న వీధులనిండా చింపిపేలికలు, కంకాళ దేహాలూ వ్రేలాడుతుంటే మధ్యనున్న ఈ మందిరంలో మాత్రం సౌందర్యం బైఠాయించి కూర్చోటానికి ఆస్కార మెక్కడుంది? ఇక ఆ బయటిగదుల నిండా పడిగాపులు గాస్తున్న వారెవరయ్యా అంటే, యుద్ధమంటే యేవిటో యెరగని సైనికాధికారులు, ఓడఅంటే యేవిటో యెరగని నౌకాధిపతులు; పరిపాలనా వ్యవహారాల ఓనమాలు కూడా తెలియని సివిల్ ఉద్యోగులూ, కనిష్ఠతరగతి లౌకికవ్యవహారాల లుకలుకలు మినహా యితర పారలౌకిక విజ్ఞానంతో సంబంధంలేని, కామదాసులూ, కటికసన్నాసులూ, వాగుడు డబ్బాలూ అయిన మతాధికారులు ఇత్యాదయః; ఆయా అధికారాల్లో వుండటానికి వాళ్లల్లో యే ఒక్కడికీ యెలాంటి యోగ్యతలూ లేవు; యోగ్యతలు లేకుండా అధికారాలెలా వచ్చాయయ్యా అంటే: వడ్డించేవాడు మనవాడైతే కడబంతిని కూర్చోమన్నారు. ఈ జనాభాయావత్తూ దూరంగానో దగ్గిరగానో మన ప్రభువుగారి బంధువర్గానికి చెందినవాళ్లు. అందుచేత ఏవి కావలిస్తే వాటినల్లా పిండుకోవటానికి ఆస్కారమున్న కామధేనువుల్లాంటి ఈ ఉద్యోగాలన్నిటినీ వీళ్లదొడ్లల్లో కట్టేశారు. ప్రభువుగారి రాజబంధువులమాట అలా వుంచండి: ప్రభువుతోగాని, ప్రభుత్వంతోగాని, మళ్లా మాట్లాడితే ఈ ప్రపంచంలో మరోరకం మనుషులు ఆ మందిరంనిండా వందలాదిగా వున్నారు. ఈ రకం మనుషులకు జీవితంలో ఋజుమార్గమంటూ యే ఒక్కటీ వుండదు. ఊహాకల్పితములైన వ్యాధులకు అపరూప మహౌషధములను నిర్ణయించుతూ రాజవంశానికి చెందిన తమ రోగులమీద చిరునవ్వులు ప్రసరించుతూ, జనానాగదుల్లో విచ్చలవిడిగా తిరిగే డాక్టర్లు, దేశానికి పట్టిన సమస్త యీతి బాధలకూ చిట్కాలు చెబుతూ, వాటిని నిర్మూలించటానికి ఎన్నడూ పట్టుమని వ్రేలైనా కదపకుండా, అందినవాడి చెవిలోనల్లా; అడ్డమైన అభూతకల్పనలూ పోస్తూ కుట్రలలో మునిగితేలుతూ వుండే రాజకీయవేత్తలు; మాటలతో పేకమెట్లు నిర్మించే తాత్వికవేత్తలు రసవాద తర్జనభర్జనలలో రాటుతేలిన రసాయనిక శాస్త్రవేత్తలు; ఈ రకంవారంతా కోకొల్లలు.

ఆరోజుల్లో - ఆరోజుల్లో యేవిఁటి, అప్పటినుంచీ - గొప్ప సంస్కృతిలో పెరిగిన పెద్దమనిషి అని చెప్పటానికి నిదర్శన మేవిఁటంటే, ఆ వ్యక్తికి మానవులకు సంబంధించిన యేవిషయంతోనూ ఎలాంటి జోక్యమూ వుండకూడదు. మగవాళ్ల ఒకళ్లమాటేగాదు - అక్కడున్న మహిళామణులుకూడా అంతే. ప్రభువుగారి విందులకు హాజరయ్యే అతిథులలో సగానికిసగం గూఢచార మహాశయులుంటారు. నిజానికి వాళ్లంతా కలిసి పరిశోధన జరిపినా గూడా ఆ విందులోవున్న మహిళారత్నాలలో, సంతానవతియైన స్త్రీ యెవరో ఛస్తే కనుక్కోలేరు. నిజానికి, పిల్లాపీచును పెంచుతున్న చిహ్నాలేవైనా కనుపించితేగదా గుర్తుబట్టటానికి. శిశువును కనటంవరకేగాని పెంచేబాధ్యత ఆ మహిళారత్నాల కేవిఁటి? కని యింటివద్ద పారేసివస్తే, కూడులేని యే బీదవాడి పెళ్లామో ఆ శిశువుతో సతమత మౌతూవుంటుంది. అలాంటి సమాజంలో శిశువులను కలిగివుండటం అనాగరికత: బిడ్డాపీచునంతా యింటివద్ద దాదులమొహాన గిరవాట్టేసి వచ్చి, అందగత్తెలైన అరవయ్యేసేళ్ల అమ్మమ్మలు కూడా, కసుగందని కన్నెపడుచుల్లా ముస్తాబై కూర్చుని విందులుగుడుస్తూ వుంటారు.

అవాస్తవికత కుష్ఠువ్యాధిలాంటిది. ఆ దొడ్డప్రభువు చుట్టూ వుండే పరివారంలో ప్రతి ఒక్కడికీ అదే జబ్బు. ఆ వ్యాధి కారణంగా ప్రతి ఒక్కడూ వికలాంగుడుగా కనుపించుతాడు. బయటి గేటుకు చేరువలోవున్న ఒక గదిలో మాత్రం ఒక అరడజనుమంది అదోరకం మనుషులున్నారు. వాళ్ళకి, యిప్పటికి అయిదారు సంవత్సరాలనుంచీ, దేశంలో ప్రతి వ్యవహారం డొంకదోవను నడుస్తున్నట్టు అనుమానంగా వుంటోంది. ఆ వ్యవహారాలను దోవకు తేవాలనే ఉద్దేశంతో వాళ్ళల్లో ముగ్గురు 'కన్వల్షనిస్టుల' (ఆందోళపరుల) ముఠాలోజేరి పనిచేస్తున్నారు. వాళ్లు ముగ్గురూ అక్కడ కూర్చుని 'నురుగులు గక్కుదామా, జుట్టు పీకేసుకుందామా, గర్జించేద్దామా' అని ఆలోచిస్తున్నారు. అల్లాంటి అపస్మారగుణాలు కనబరిస్తే, ఆ దొడ్డప్రభువుకు కొంచెం హెచ్చరికగా వుంటుందని ఆ అమాయకుల అవివేకం. ఈ గణాచారులు ముగ్గురూకాక, అక్కడున్న మిగతా ముగ్గురూ అదో ప్రత్యేకవ్యవస్థకు చెందినవాళ్లు. సత్యాన్వేషుల ముఠా! సత్యాన్వేషణపైన ఒక గంభీరోపన్యాసం దంచిపారేస్తే జగత్తుయొక్క సమ్యక్ కేంద్రంలో పుట్టాడు; ఇంతవరకూ సత్యంయొక్క పరిధిని దాటి వెళ్లలేదు. పరిధిని అతిక్రమించి బయటికి యెగిరిపోకుండా మానవుణ్ణి అటకాయించాలి. అటకాయించటమే గాదు మెడబట్టి మళ్ళా కేంద్రంలోకి గెంటాలి. ఇలా గెంటటానికి సాధనాలు నిరసన వ్రతాలూ, భూతప్రేతాది అశరీరాదులదర్శనం!

ఈసిద్ధాంతాలను పురస్కరించుకుని వీళ్ళుముగ్గురూ, అశరీరులనుగురించి అఖండంగా వాదప్రతివాదాలు నడిపారు; ఆ ఆధ్యాత్మిక మీమాంసవల్ల ఏదో అఖండమైన మేలే జరిగివుంటుంది. కాని ఆ జరిగిన మేలేవిఁటో దాని తొండం కాకపోతే మానె, తోకైనా మన కెక్కడా కనుపించదు.

అయితే ఆ విందుసందర్భాలలో మెచ్చదగిన విషయం ఒకటివుంది. ప్రతిఒక్కరూ చూడసొంపైన వేషభూషలు ధరించి వుంటారు. క్రీస్తుచెప్పిన 'జడ్జిమెంటుదినం' గనక భూషణాంబరధారణ దినమైతే వాళ్లందరూ అందుకు సర్వదా సంసిద్ధులై వున్నారనే అనుకోవచ్చు. ముఖాలకు పులుముకున్న ఆ మెరుగుపూతలూ, ఆ పౌడర్లూ, కొమ్ములు కొమ్ములుగా పైకి దువ్వి నిలబెట్టిన ఆ తలకట్లు, ఆ వీర ఖడ్గాల తళతళలు, ఆ అత్తరు పరిమళాలూ, ఆ విలాస విభ్రమాలు అలా యెంతకాలం సాగితేమాత్రం, విసుగేవిఁటి? గొప్పవంశాల పెద్దమనుషుల మెళ్ళల్లో వ్రేలాడే బంగారుగొలుసులు, వాళ్లు అటు ఇటూ మసలినప్పుడల్లా చిరుగంటల్లా మోగుతై. ఆ చిరుగంటల మోతలేమి, సిల్కువస్త్రాల గరగరలేమి ఇంకా ఇతర విలాసభాషలేమి గాలిలో వ్యాపించుతూ సెయింట్ ఆంటోనీనీ, ఆయన ఆకలిఘోషనూ కూడా అంతూపంతూ లేకుండా అవతలికి కొట్టేస్తున్నయ్.

'డ్రెస్'లో చాలా మహత్యంవుంది. ఎవణ్ణి ఎక్కడ వుంచాలో వాణ్ణి అక్కడ వుంచుతుంది. ఈ ప్రపంచం ఒక పగటి వేషాలవినోదం; అంతఃపురాలలో వేసేవేషాలు వేరు, రాజ దర్బారులో వేసే వేషాలు వేరు, జడ్జీలవేషాలవేరు, ఉరిదీసేవాడి వేషంవేరు.

ప్రభువుగారు చాకొలెట్ త్రాగటం ముగించి, ఆ నలుగురు సేవకులకూ విరామం ఇచ్చారు. అనంతరం బయటి గదులలో వేచివున్న భక్తకోటికి దర్శనమిచ్చి తరింపజేసే పరిపూర్ణకటాక్షంతో పవిత్రాతిపవిత్రమైన ఆ గర్భగుడితలుపులు తెరువవలసిందిగా ఆజ్ఞాపించినవారై, సేవకవితతి అడుగులకు మడుగులొత్తి బరాబరులు పచరించుతూ వుండగా బయటికి విచ్చేశారు. ఆ దివ్యదర్శనంతో, అంజలి ఘటించేవారే కాదు, ఆనతులు పచరించేవారే గాదు, ప్రాణాచారాలు పడేవారే కాదు, ఓహోహో! యేమిఁభక్తి, యేమిఁ ప్రపత్తి, యేమి దాసభావం – ఎంత మహోత్కృష్టమైన బానిసత్వం! – బహుశా ఈ ప్రత్యక్ష దైవాన్ని ఉపాసించి తరించుతున్నారు గనకనే ఆ భక్తకోటి స్వర్గంలో యెక్కడో వున్న ఆ పాతదేవుణ్ణి మరిచిపోయి వుంటారు.

ఇక శ్రీవారు, ఒక చిరునవ్వుతో ఇక్కడో భక్తుణ్ణి తరింపజేయటం, ఒక్క మధుర వాక్కుతో అక్కడో పుణ్యపురుషుణ్ణి ఆనందభరితుణ్ణి చెయ్యటం, కెంగేలిస్పర్శతో మరోపతితుణ్ణి పావనం చెయ్యటం, ఇలా సమస్తమైనవారినీ ఆనందింపజేస్తూ చిట్టచివరి గదిలోవున్న 'సత్యపరిధి'వరకూ వెళ్ళారు. అక్కడనుంచి మళ్ళా వెనక్కుతిరిగి కక్ష్యాంతరములు గడిచి నిజనివాసమైన గర్భగుడిలో ప్రవేశించి నౌకర్లచేత తలుపులు మూయించి అదృశ్యమైపోయారు.

ఈ ప్రదర్శనం ముగియగానే, ఆ మందిరంలోని వాతావరణమంతా కోలాహలమై చిన్ని తుపాను రేగినట్టయింది. బంగారుగొలుసుల జిలుగురావాలు మెట్లమీదినుంచి క్రిందికి దిగిపోతున్నయ్. క్షణంలో ఆ మందిరంలో వున్న యావన్మందీ బయటికి వెళ్లిపోయారు. చివరకు మిగిలిందల్లా ఒకే ఒక వ్యక్తి; చేతిలో పొడుండబ్బి, చంకలో టోపీ, ఆ వ్యక్తి నిలువుటద్దాల మధ్యగా నిలబడి బయటికి వెడుతూ, సింహద్వారం దాకా వెళ్లి, ఒక్కసారి యిలా వెనక్కు సింహావలోకనం చేసి గర్భగుడివంకచూసి పళ్ళు పటపటా కొరికి : 'నిన్నురా! సైతానుకు బలిబెడతా!' ననుకున్నాడు. వ్రేళ్ళనున్న పొడుంపట్టు కాళ్ళకంటుకున్న దుమ్ము దులిపేసుకున్నట్టు కచ్చగా దులిపేసుకుని, మళ్లా శాంతపడి నెమ్మదిగా మెట్లు దిగి క్రిందికి వెళ్లిపోయాడు.

ఆయనకు దాదాపు అరవై సంవత్సరాలవరకూ వయస్సుంటుంది. ముఖానికి యేదో తొడుగువేసుకున్నట్టు, ఆ ముఖంమీద యెప్పుడూ చూచినా ఒకేరకమైన భావరేఖ. ముక్కుకూడా పొంకంగానే అమరివుంది. కాని రెండు ముక్కుకోళ్ల దగ్గిరా కుంచెం మెలివున్నట్టు వుంటుంది. ఆయనలో యే ఆవేశం ఉదయించినా అది, ఆ ముక్కుకోళ్లు విచ్చుకోవటంలోనూ ముడుచుకోవటంలోనూ ద్యోతమానం అవుతుంది. కుట్ర, కౄరత్వమూ యావత్తు స్వభావాలూ ఆ ముక్కుకోళ్లమీద పొటమరించి, యావత్తు స్వరూపానికి ఆ భావావేశరేఖలను ప్రసరించుతై. అలాంటి భావావేశం యేదైనా పొటమరించినప్పుడు, జాగ్రత్తగా పరిశీలించితే వాటి ఛాయలు పెదవుల వంపులోనూ కనుబొమల కదలికలోనూ కూడా కనుపించుతై.

ఆయన మెట్లు దిగి క్రిందికి వెళ్లి వాకిట్లో తనకోసం నిలిపివున్న గుర్రపుబగ్గీలో పోయి కూర్చున్నాడు. కోచ్‌వాలాను 'పోనీ'మని ఆజ్ఞాపించాడు. ఆ విందులో ఆయనతో యెవ్వరూ ఎక్కువ మాట్టాడలేదు. తాను ఒకమూల యెక్కడో ఒదిగి నిల్చున్నాడు. ఆయన అభిమానం దెబ్బతిని ముఖాన గొంటుబెట్టుకున్నాడు. ఆ పరిస్థితిలో ఆయన గుర్రబ్బండి బయలుదేరేముందే, వీధిలోవున్న జనం కాస్త అటూఇటూ తప్పుకుంటే బాగుండేది. ఏదో శత్రువును తురుముకుపోతున్నట్టు కోచ్‌వాలా గుర్రాల్ని యిష్టమొచ్చినట్టు తోలేస్తున్నాడు. వాటి అఘాయిత్యం చూస్తూ కూడా యజమాని ముఖంలో యే మార్పూరాలేదు. అవి మూగరోజులూ చెవిటి నగరం అన్నమాట కూడా నిజమే : అయినా నిరసన వాక్యాలు వినిపించుతూనే వున్నయ్. పిల్లా జల్లా వున్న అల్లాంటి యిరుకు సందుల్లో, పిల్లా జల్లని నలగ దొక్కించుతూ అంత అఘాయిత్యంగా గుర్రాల్ని తోలటం కిరాతమని మానవ కంఠాలు అరుస్తూనే వున్నయ్. అరుస్తేమాత్రం లాభమేవిఁటి? ఆ నాటుజనం తమ కష్టాలలోనుంచి బయటపడేమార్గ మేవిఁటో తామే చూసుకోవాలిగాని వాళ్ళఘోషవినేదెవరు?

బండిచక్రాలు చక్రబాణాల్లా గిర్రు గిర్రున తిరిగి పోతున్నయ్. బండి రివ్వు రివ్వున మలుపులు తిరిగిపోతోంది. ఆడవాళ్లు హా హా కారాలుచేస్తూ బండిక్రింద పడబోతున్న బిడ్డల్ని అమాంతం ముందుకురికి అవతలికి లాక్కుపోతున్నారు. బండి ఇలా వాయువేగంగా పోతూ పోతూ ఒకచోట చివాల్న మలుపు తిరిగింది. బండి చక్రం ఉవ్వెత్తుగా పైకి లేచి దభీమని కుదబడ్డది. 'అమ్మో!' అన్న ఆర్తనాదం వెయ్యికంఠాలనుంచి ఒక్కసారి వినిపించింది. గుర్రాలు ముందుకు కుదబడ్డయ్.

అలాంటి యిబ్బంది జరక్కపోయినట్లయితే బహుశా బండి ఆగేదేగాదు. చచ్చినవాళ్ళని రోడ్డుమీదపారేసి యెన్ని బళ్ళు ముందుకు వెళ్లిపోవు? కాని గుర్రాలు ముందుకు కుదబడటంతో, కోచ్‌వాలా కంగారుపడి క్రిందికి ఉరికేశాడు. ఇరవైముప్పయి మంది వచ్చి గుర్రాల కళ్లాలు పుచ్చుకున్నారు.

కోచ్‌లోనుంచి, ఆ జమీందారు, నిమ్మకు నీరెత్తినట్టు అతిశాంతంగా బయటికి తొంగిచూచాడు : 'ఏయ్! ఏవిఁటది – ఏవిఁజరిగిందీ?'

గుడ్డటోపీ పెట్టుకున్న ఒక బారాటి మనిషి బండిచక్రాల క్రిందినుంచి నుజ్జు నుజ్జయిపోయిన ఒక నెత్తురు ముద్దను బయటికి లాగి దాన్ని బుజానవేసుకుని ప్రక్కనున్న పేపుమెంటుమీదకు తీసుకెళ్లిపడేశాడు. ఆ నెత్తురు ముద్దమీద బోర్ల బొక్కలుగాపడి, నెత్తీనోరూ బాదుకుంటూ, ఆకాశం అర్చుకుపోయేట్టు గొల్లుగొల్లున యేడ్చేస్తున్నాడు.

చింపిరిగుడ్డల్లో వున్న, నోట్లో నాలుకలేని, ఒక అమాయకుడు బండిదగ్గిర కొచ్చాడు: 'ప్రభువులు రచ్చించండి పసిబిడ్డ బండికింద పడ్డది' అన్నాడు.

'ఆ రొదచేస్తున్న వెధవెవడు – దాని తండ్రా యేవిఁటి?'

'చిత్తం రచ్చించండి బాబూ! ఆడిబిడ్డేనండి'

ఏడుస్తూ ఏడుస్తూ ఆ అభాగ్యుడు చివాల్నలేచి బండివేపు పరుగెత్తుకు వస్తున్నాడు. జమీందారు బొడ్లోవున్న కత్తిపిడిమీదికి చెయ్యిపోనిచ్చాడు.

అవ్యక్తి దెబ్బతిన్న అడివి మృగంలా భీభత్సంగా అరిచాడు : 'చంపారు! – చచ్చింది!'

చుట్టూవున్న మనుషులు అతన్ని చుట్టేసి కదలకుండా పట్టుకుని దేబెముఖాలేసి జమీందారు వంకచూస్తున్నారు.

జమీందారుకు వాళ్ళముఖాలలో ఒక కచ్చగాని కోపంగాని వున్నట్టు కనుపించలేదు. వాళ్లందర్నీ కలుగుల్లోనుంచి బయటికివచ్చిన యెలుకల క్రింద జమకట్టి విసుగ్గా పర్సు బయటికితీశాడు.

'వెధవలు - వెధవలు! యెప్పుడూ ఎవడో ఒకడు ఇలా బండికింద చస్తూనే వుంటారు. అయినా అంత వొళ్లు మదమేమిటి, పిల్లల్ని జాగ్రత్తచేసుకోలేరూ? నాగుర్రాలకాళ్ళకి యేవిఁ దెబ్బలు తగిలాయో ఏమి యేడిశాయో! - అరేయ్! ఇది ఆ వెధవ ముఖాన పారెయ్!'-

పర్సులోనుంచి ఒకబంగారు నాణెంతీసి కోచ్‌వాలా నిల్చున్నవైపు విసిరాడు. అందరూ అటు తిరిగి క్రిందబడ్డ ఆనాణెంవంక చూస్తున్నారు. ఆ అభాగ్యుడు మళ్ళీ అరిచాడు; 'చంపేశారు!'

మరొక క్రొత్తవ్యక్తి ముందుకువచ్చి అతన్ని ఆపివేశాడు. ఆవచ్చిన కొత్తమనిషి భుజంమీద తలవాల్చి ఆ అభాగ్యుడు పసిబిడ్డలా వెక్కి వెక్కి యేడ్చాడు. క్రొత్తమనిషి ఓదారుస్తున్నాడు.

'అంతా నాకు తెలుసరా తండ్రీ - తెలుసు ఓర్చుకో యేమి చేస్తాం - ఆ సన్నాసి అలా హఠాత్తుగా ప్రాణాలు విడవడమే మంచిది. ఇంకోగంటో అరగంటో బ్రతికితే ఎంతబాధపడేదో!'

ఆ వ్యక్తి వంకచూసి జమీందారు చిరునవ్వు నవ్వాడు -

'అబ్బాయ్! యెవరమ్మా నువ్వూ! మంచి వేదాంతివి లాగున్నావే - నీ పేరేవిఁటి?'

'నా పేరాఅండి - డిఫార్జ్'

'వృత్తేవిఁటి?-'

'సారావ్యాపారం-'

'వేదాంతీ, సారావ్యాపారం, బాగుంది - ఇది తీసుకో, ఎద్దైనా ఖర్చుబెట్టుకో!' మరోబంగారునాణెంతీసి గిరవాటేశాడు - అరేయి! గుర్రాలకేవీఁ దెబ్బతగల్లేదు గాదురా!- బండిపోనీ,

దోవలోవున్న సామాన్య వస్తువును దేన్నో పాడుచేసి, దాని ఖరీదిచ్చి అవతలికిపోతున్న పెద్దమనిషి ధీమాలో జమీందారు ప్రశాంతంగా బండిలో కూర్చున్నాడు. బండి కదలబోతోంది. ఇంతలోనే ఒక బంగారునాణెం రివ్వున యెగిరొచ్చి 'టాంగు'నబండిలో పడ్డది. జమీందారు ఉగ్రుడై మండిపోయాడు. అరేయ్! బండి ఆపు- 'ఎవడురా! ఆ బద్మాష్ గిరవాట్టేసిందీ!'

కోచ్‌లోనుంచి బయటికి చూచాడు. ఇందాక డిఫార్జ్ నిల్చునున్న వేపు చూచాడు. అతనక్కడలేడు. ఆ ప్రదేశంలో ఆ బిడ్డ తండ్రి బోర్లబొక్కలుగా పడుకుని దుమ్ములో పొర్లాడుతూ వెర్రివాడిలా యేడుస్తున్నాడు. లావాంటి ఆడమనిషి లతలు కుట్టుకుంటూ దగ్గిరలో నిల్చునుంది.

'కుక్క వెధవల్లాలా!' అన్నాడు జమీందారు. ముక్కుకోళ్ళు మెలికెలు తిరుగుతున్నయ్. 'మిమ్ముల్నందర్నీ గుర్రాలడెక్కల క్రిందేసి మొత్తంగా తొక్కించి నాశనంజేస్తా - ఆటే కంకారంటే. ఆ గిరాటేసిన వెధవెవడో ఇట్టా ముందుకొస్తే ముందువాణ్ణి నలిబిలిగా తొక్కించకపోతే నాపేరు జమీందారు గాదు - తడాఖా.'

ఒక్కడూ నోరు మెదపలేదు. వాళ్లపరిస్థితి యేవిఁటో వాళ్లకి తెలుసు. నిజంగా ఆయన తలుచుకుంటే అంత పనీ చేసి తీరగలడు. శాసనాధికారం అవధులలోనూ అవధుల నతిక్రమించీ కూడా ఆయన శక్తిసామర్థ్యాలేమిటో వాళ్ళకి తెలియనివి కావు. ఎక్కడివాళ్లక్కడ తలలు వంచేసి, కిం నాస్తిగా ఊరుకున్నారు. లేసు అల్లుతున్న ఆ యిల్లాలుమాత్రం కోరగా తలపై కెత్తి జమీందారు ముఖంలోకి చూచింది. జమీందారు దర్జాకు ఆ అబల ఒక లెక్కాపత్రమా? అసలా మనిషివంక చూడకుండానే ఆ యెలుకలమందనంతా ఒక్కసారి కోపంగా కలియజూచి 'తోలరా!' అని కోచ్‌వాడికి హుకుంచేశారు.

ఆయన కోచ్ ముందుపోతోంది : దాని వెనుక తక్కిన శకటాలన్నీ ఒకదానివెంట ఒకటి పెళ్లి బళ్లలా పేరాములు తీస్తున్నయ్ : మంత్రి, అభివృద్ధిశాఖ డైరెక్టరు, మహాభూస్వామి, డాక్టరు, లాయరూ, మతగురువూ, నటీనటులూ, వాద్యగాళ్లు ఈ పగటి వేషాలన్నీ పరంపరగా సాగిపోతోన్నయ్. ఎలుకలన్నీ బొరియల్లో నుంచి బయటికొచ్చి గంటలతరబడి ఈ ఉత్సవాన్ని చూస్తూ తెల్లబోయి నిల్చున్నయ్. పోలీసు టోపీలు హడావిడి చేస్తూ ఈ యెలికెల్ని రొడ్డుమీదికి రాకుండా అదుపు చేస్తున్నయ్. ఆ రక్తపుముద్దను నెత్తికెత్తుకుని ఆ అభాగ్యుడు ఎక్కడికో వెళ్ళిపోయాడు. అంతవరదాకా ఆరక్తపుముద్ద చుట్టూమూగిన ఆడవాళ్లు ఆ సంగతి మరిచిపోయి ఉత్సవం చూస్తున్నారు. లేసు కుట్టుతున్న ఆ యిల్లాలు మాత్రం అలానే కుడుతూ నిల్చుంది. ప్రక్కనున్న జలయంత్రంలోనించి నీరు ప్రవహించుతూనే వుంది; సెలయేరు ప్రవహించుతూనే వుంది; పగలు రాత్రిలోకి ప్రవహించింది. కాలవాహినులు ఏ మానవుడికోసమూ ఆగదు; ఎలికలు చీకటి కలుగుల్లో ఒకదాన్ని ఒకటి కావిలించుకుని నిద్రపోతున్నయ్. జమీందారు భవనంలో దీపాలు వెలిగించారు. విందువినోదాల కోలాహలం తిరిగి ప్రారంభమైంది. యథాతథంగా కాలచక్రం తిరిగిపోతోంది.

16

అడపాదడపా పంటచేలు; మధ్యమధ్య, మాసికలు మాసికలుగా, నాసిరకం గడ్డిధాన్యాలు : చెదురుచెదురుగా అక్కడక్కడ యిలకరుచుకుపోయిన వంగపాదులూ గత్రా; ఆ పొలాలూ, ఆ పొలాలమీద పనిచేస్తున్న ఆడా మగా మనుషులూ అంతా అదో ఊసురోమంటూ నిర్జీవంగా కనిపించుతారు. అతి నిరాశగానూ, అతి అయిష్టంగానూ తప్పనిసరి కర్మక్రింద బ్రతుకుతున్న వాళ్లులా వున్నారు.

జమీందారు కోచ్‌బండి ఆ చేలమధ్యగాబడి, కొండగుట్ట మీద కెక్కుతోంది. బండిలో కూర్చున్న జమీందారుముఖం కళ కళలాడుతోంది. ఆ సొగసు సహజంగా ఆయనలోనుంచి ప్రభవించిందిగాదు. అస్తమయ సూర్యకాంతులు ఆయన ముఖంమీద పడుతున్నయ్.

బండి కొండ గుట్టమీదికి చేరగానే, సంజకాంతులు సరాసరి బండిలోకి చొచ్చుకువచ్చి జమీందారు వళ్ళంతా ధగధగ లాడుతోంది. జమీందారు తన అరిచేతులు చూసుకుని : 'ఈ కాంతి యెంతసేపుంటుంది? వెంటనే నశించిపోతుంది' అనుకున్నాడు.

నిజంగా సూర్యుడు అప్పటికే అర్థార్థం గర్భంలో మరుగుపడ్డాడు. జమీందారు బండికొండమీద నుంచి క్రిందికి దిగుతోంది. సూర్యబింబం కూడా బండితోపాటు క్రిందికి దిగిపోతోంది. బండి కొండమొదట్లోకి దిగేసరికే సూర్యబింబం, సాంతం అదృశ్యమై మసకచీకట్లు అలుముకుంటున్నయ్.

కొండ దిగగానే శిథిలావస్థలోవున్న ఒక చిన్న పల్లెటూరు. గ్రామంచుట్టూ తుప్పలూ, దుబ్బా, కొండలూ, గుట్టలూ, దారీడొంకాలేని బంజర్లూ బీళ్ళూ. ఆ గ్రామంలో ఒకచర్చి, ఒక పిండిమిల్లు; ప్రక్కనున్న చిన్నికొండగుట్టమీద ఒక జైలూ కావలసిన అన్ని హంగులూ వున్నయ్.

ఆ గ్రామంలో కూడా ఒక వీధి వుంది - ఆ వీధిలో ఒక బ్రాందీషాపూ, ఒక తోళ్ళకార్ఖానా, ఒక సత్రం, గుర్రాలశాలా అన్నీ వున్నయ్ - ఆ బీదగ్రామానికి తగిన బీదపద్ధతిలోనే. గ్రామంలోవున్న యావన్మందీ దరిద్రులే. గుమ్మాల్లో కూర్చుని కొందరు స్త్రీలు చచ్చువుల్లిపాయలూ గట్రా తరుగుతూ వంట ప్రయత్నంలో వున్నారు. ఏది దొరికితే అది తిని బ్రతకవలసింది. గనక ఆకూ అలమూ గడ్డీ గాదం వీధిమధ్యవున్న కుళాయి దగ్గిర కడిగి శుభ్రంచేసుకుంటున్నారు. వాళ్ళు అల్లాంటి బీదస్థితిలో వుండటానికి కారణమేవిఁటీ అంటే, అది ఎంతోదూరం పరిశోధనచేసి తెలుసుకోవలసిన గడ్డుసమస్యేమీ గాదు; ప్రభుత్వానికి కట్టవలసిన పన్నులూ, స్థానికంగా కట్టవలసిన పన్నులూ, కేంద్రానికి కట్టవలసిన పన్నులు యివన్నీ తడిసి ముప్పందుమై - గ్రామాలకు గ్రామాలే కర్పూరంలా హరించిపోయి ఆ స్థితికి వచ్చేసినై.

ఆ గ్రామంలో పిల్లాజెల్లా అంతగా కనుపించరు. కుక్కలు కూడా లేవు! ఇక ఆ గ్రామంలో మిగిలిన ఆడా, మగా అందరి ముఖాలమీదా ఒకటే లిపి : ప్రాణం నిలుపుకోవటానికి సరిపోయేమాత్రం, కనిష్ఠ ప్రమాణంలో తిండి సరిపెట్టుకుని గ్రామంలో బ్రతకాలి - లేదా పన్ను లెగబెట్టి కొండగుట్టమీది జైల్లో ఖైదీలుగా నశించిపోవాలి; మరో గత్యంతరం లేదు.

జమీందారు బండివచ్చి సరాసరి ఆవీధి మొగిలోవున్న పోస్టాఫీసు గేటుముందు ఆగింది. ప్రక్కనున్న కుళాయిదగ్గిర గడ్డీగాదం ఉసుముకుంటున్న జనమంతా ఎక్కడిపనులు అక్కడ వదిలేసి బండిచుట్టూ మూగి జమీందారువంక చూస్తున్నారు. ఆయనకూడా వాళ్ళముఖాల వంకే చూస్తున్నాడు. దారిద్ర్యంతో క్రుంగిపోయిన మహాదైన్యం ఆ ముఖాల్లో విస్పష్టరేఖలుగా కనుపించుతున్నా, ఆయనకు మాత్రం అర్థంకావటంలేదు. తను ముందు పిల్లి కూనల్లా బిక్కముఖాలు వేసి, నిల్చునున్న ఆ జనం వంకరీవిగా చూస్తున్నాడు. తాను, నిన్నటిదినం, చక్రవర్తి దర్బారు తాలూకు బడా ప్రభువు సముఖంలో యెలా దేబెముఖం బెట్టి నిల్చున్నాడో, ఇప్పుడు వీళ్ళంతా ఆయనముందు అలానే నిల్చునున్నారు. ఇంతలోనే, జుట్టంతా తెల్లబడిపోయిన రోడ్డుబాగుజేసే కూలి వాడొకడొచ్చి, బండిచుట్టూ మూగివున్న జనంలో కలిశాడు.

ఆ రోడ్డుకూలీని చూడగానే జమీందారు తన నౌకర్ని కేకపెట్టి : 'ఒరేయ్! ఆవెధవను ఇలా లాక్కురా' అన్నాడు.

వాణ్ణి ముందుకు లాక్కొచ్చి నిల్చోబెట్టారు. సంగతేవిఁటో విందామని చుట్టూవున్న జనం మరింత ముందుకు తోసుకొచ్చి నిల్చున్నారు.

'ఒరేయ్! నువ్వు నాకు రోడ్డుమీద కనుపించావుగాదురా?' అన్నాడు జమీందారు.

'ఔను దొరా'-

'కొండమీదకూడా కనుపించావు గాదూ?'

'చిత్తం దొరా'-

'ఏవిఁట్రా బండివంక అంత పరీక్షగా చూశావ్?'

'మడిసి దొరా?' - అంటూ, వంగి బండిక్రిందికి తొంగి చూస్తున్నాడు. అక్కడున్న వాళ్ళంతా గూడా, యేం వుందా అని బండిక్రిందికి తొంగిచూస్తున్నారు.

'మనిషేవిఁట్రా పందీ? - ఏఁవిటలా బండిక్రిందికి చూస్తున్నావ్?'-

'మడిసి సాఁవీ - ఆడ బండిక్రింద కాడిగొలుసుబట్టుకు యేలాడుతావుండాడు.'

'ఎవడు వాడూ?'-

'మడిసేనుండీ'-

'ఛీ ఛీ! - ఈ అజ్ఞానం వెధవల్ని ఏం జెయ్యాలి - వాడి పేరేవిఁటో చెప్పేడవరా బడ్డా!'

'ఆడి పేరేందో యెట్టా తెలుత్తది సామీ - ఆడి మొహఁవేనా ఎప్పుడూ చూడందే- ఈ పరగణాలో ఆణ్ణి యెప్పుడూ నేను చూడలేదనుకోండి దొరా!'-

'గొలుసు బట్టుకు వేళ్ళాడటం యేవిఁట్రా - ఉరిబోసుకు చావటానికి గాదుగదా?'

'అదేనుండి సావీఁ ఇసిత్తరం - గొలుసుమీన ఆడితల ఈమైన యేలాడబడి వుండది' బండిప్రక్కనే ఆనుకుని, తల వ్రేలవేసి అభినయించి చూపించాడు.

'ఎలా వున్నాడురా'-

'ఒళ్ళంతా దుమ్ముగొట్టుకుని మిల్లులో పనిజేసేవోడికన్నా కనాకష్టంగా వుండాడండీ- తెస్సాదియ్యా పెద్ద భూతమల్లే, తెల్లగా బారుగా వుండాడండీ' -

ఆ వర్ణన వినేసరికి అక్కడవున్న వాళ్ళందరికీ హడలుబుట్టుకొచ్చింది. జమీందారు మెదడులోకూడా మరో భూతమేదైనా పుట్టుకొస్తోందేమోనని, ఆయనముఖంవంక పరీక్షగా చూస్తున్నారు.

'బలేపని చేశావురా నాయనమ్మా! - వాడెవడో దొంగ వెధవ నా బండిని వెంటాడుతుంటే కళ్ళతో చూసికూడా, మెదలకుండా వూరుకున్నావన్నమాట - ఎందుకురా దాకలా అంత లావునోరుంది యేడవనా? - గాబెల్లీగారూ! ఆ వెధవని మెడబట్టి అవతలికి గెంటండి'-

గాబెల్లీ ఆవూరి పోస్టుమాస్టరు. పోస్టుమాస్టరు ఉద్యోగంతోపాటు అనేక యితర చిల్లర అధికారాలుకూడా వహించుతూ వుంటాడు. ఇందాకటినుంచీ జమిందారుపక్కనే నిల్చుని ఈ విచారణలో సాయపడుతున్నాడు. అధికార దర్పంతో గాబెల్లీ, వాణ్ణి చొక్కా ముంజెయ్యిబట్టుకొని యివతలికి లాగి, పోరా వెధవా! పో! అని ఒక్కతోపు తోశాడు.

'గాబెల్లీ గారూ ఆ దొంగవెధవ గనక యీరాత్రి తలదాచుకోవటానికి గ్రామంలో ప్రవేశించితే, పట్టుకు కాళ్ళూ చేతులూ కట్టెయ్యండి; వాడి సంగతేవిఁటో నిజం తేలేదాకా వదలకండి' అన్నాడు జమిందారు.

'చిత్తం వాడి సంగతేవిఁటో కనుక్కోందేపోనిస్తామా?- తమ సెలవైన తరువాత.'

'ఓరేయ్! ఆ దొంగవెధవ యెటు పారిపోయాడురా?- ఏడీ యీ తట్టుపర్లవెధవేడీ?'

తట్టుపర్లవెధవ, బండిక్రిందదూరి, తనతోపాటు బండిక్రింద దూరిన వాళ్ళకు ఆ గొలుసు చూపిస్తున్నాడు. మరో అయిదారుగురు మనుషులు బండిక్రిందకి జొరబడి ఆ తట్టుపర్ల వెధవను యివతలికి పడలాక్కొచ్చి మళ్ళా జమీందారుముందు నిల్చోబెట్టారు.

'ఓరేయ్! బడ్డా! - ఆ దొంగవెధవ ఎప్పుడు పారిపోయాడురా - బండి కొండగుట్టమీద ఆగినప్పుడేనా?'

'పారిపోవటంగాదు సామీ! కొండ కొమ్ముమీదనుంచి జారి తల్లకిందుగా పాతాళానికి పడిపోయిండు సామీ!' -

'ఆ సంగతేవిఁటో కనుక్కోండి గాబెల్లీగారూ! - ఓరేయ్! గుర్రాల్ని పోనీ!' -

బండిక్రింద ఆరుగురూ, గొర్రెలమందలా యింకా బండి క్రిందనే కూర్చున్నారు. హఠాత్తుగా చక్రాలు కదిలినై. ప్రాణాలతో యివతలబడటం బ్రహ్మప్రళయమైంది. బండి రివ్వున సాగి ఊరిబయటికొచ్చేసింది. అక్కడనుంచీ మరో కొండగుట్ట నెక్కవలసివచ్చి, కొంచెం మందగమనానపడ్డది. గుర్రాలు బండిని కొండమీదికి లాగలేక సదమదమౌతున్నయ్. వసంతఋతువు కావడటంచేత చుట్టుపట్లనున్న చెట్లనుంచి తియ్యటి వాసనలు వ్యాపించుతున్నయ్. గుర్రాల మొహాలచుట్టూ ఉండీగలు ముసురుతున్నయ్. కోచ్‌వాలా బండిదిగి గుర్రాలప్రక్కనే నడుస్తూ వాటిని హుషారిచ్చి పైకెక్కించుతున్నాడు.

కొండ మీదికి కొంతదూరం సాగినతరువాత అక్కడ చిన్నిశ్మశానం తగిలింది. అక్కడ ఒకశిలువా, దానిమీద కొయ్యలో చెక్కిన యేసుక్రీస్తు బొమ్మా వుంది. అది పనిచేతగాని నాటుశిల్పి యెవడో చెక్కినబొమ్మ; యేసుక్రీస్తుని యెరగనివాడు కావటంచేత బక్కచిక్కిన తన రూపంలోనే ఆ బొమ్మను చెక్కాడు.

పరమ దురదృష్టానికి చిహ్నమైన ఆ బొమ్మముందు, అంతకంటే దురదృష్టవంతురాలైన ఒక స్త్రీ మోకరిలివుంది. బండి చక్రాల చప్పుడువిని తలపైకెత్తి చూచింది. లేచి గబగబా బండి దగ్గిరికి పరుగెత్తికొచ్చింది.

'ఎవురో ననుకుండాను తవురేనా దొరా?- మనివి'-

'మనివీ - గినివీ - ఎప్పుడూ ఏదోఒక మనివి - చెప్పి యేడూ' -

'కరుణించండి సావీఁ! - నా పెనివిఁటి - అడివిదగ్గిరుండే కాపలావాడు లేడండీ.'-

'ఏవిటి? - ఆ వెధవ, పన్నులేవో ఎగబెట్టాలని చూస్తున్నాడన్నమాట.' -

'పన్నులన్నీ కట్టేశాడు సామీ - చచ్చిపోయిండు.'-

'అవును చచ్చిపోతాడు - దానికేవిఁటి? - వాణ్ణి బ్రతికించి నీకు వప్పజెప్పమనా నువ్వనేది? -'

'లేదుబాబూ! - ఆణ్ణి ఆ పచ్చగడ్డి దిబ్బలేదుండీ - ఆణ్ణే పాతేసిన్రు -'

'అయితే-'

'అసువంటి దిబ్బలు యీడయెన్నో వుండై-'

'వుంటే-'

మనిషికి వయస్సెంతో లేకపోయినా బాగా ముసలిదిగా కనుపించుతోంది. లోపలనుంచి పొర్లుకొస్తున్న దుఃఖాన్ని బలవంతాన మ్రింగుకుంటోంది. బొమికెలు తేలిపోయిన చేతివ్రేళ్ళు దీనంగా నలుపుకుంటూ మొరబెడుతోంది-'

'దొరా! నా మనవిఁ కుశంత ఆలకించండి - నా పెనివిఁటి తిండిలేక చచ్చిపోయాడు- ఆడే యేవిఁటిలెండి - అన్నంలేక చస్తుండవోళ్ళు ఇంకా శానామంది వుండారు - చావాలిసినోళ్ళు కూడా ఇంకా శానామంది వుండారు -'

'అయితే యేవంటావ్? వాళ్ళందర్నీ నన్ను మేపమంటావా?'

'ఆళ్ళకి తిండెవరు బెట్టాలో దేవుడికి తెలియాలిగానీండి!- అదిగాదు దొరా నేను అడుగుతావుండది; నా పెనివిఁటి పేరు మీద ఆణ్ణి పాతేసినచోట కుశంత రాయో కొయ్యముక్కో పాతించండి - ఏడ పాతేసిన్రో తెలీడానికి; అంతే; లేకుంటే, తిండిలేక నేను కూడా చస్తే ఆణ్ణి పాతేసినచోట యెవరికీ గుర్తుండదు. రోజురోజుకీ తిండిలేక గుంపులుగుంపులుగా సత్తావుంటే యెవుణ్ణి యేడ పాతేసిన్రో యెట్టా తెలుత్తది.'

ఆ పిచ్చధోరణి విని బండివాడు ఆ స్త్రీని వెనక్కు పడదోశాడు. కొరడాతోకొట్టి గుర్రాల్ని ముందుకు తోలాడు. ఆ వెర్రిది ఆ శ్మశానభూమిలోనే, ఆత్మలేని గుడ్డబొమ్మలా తిరుగాడుతోంది.

వసంతరాత్రి; మధుర మధురంగా పూలవాసనలు వ్యాపించుతున్నయ్. ఆ వాసనలు ఒక్క జమీందారుచుట్టూనే వ్యాపించటంలేదు; వర్షం మోస్తరుగా వీరూ వారూ అనే పక్షపాతం లేకుండా అందరి చుట్టూ వ్యాపించుతున్నయ్. పోస్టాఫీసుముందు కూర్చుని యింకా ఆ భూతాన్ని గురించి పలవలు చిలవలుగా అభివర్ణించుతున్న రోడ్డు కూలీచుట్టూ, అతని కబుర్లు వింటూన్న నాటుజనం చుట్టూకూడా వ్యాపిస్తూనేవున్నయ్. ఆ దయ్యం కథ వినగా వినగా భయమెత్తి ఒకరొకరే జారుకుంటున్నారు. గుడిసెల్లో దీపాలు కొంచెంసేపు మినుకు మినుకుమంటూ వెలిగి ఆపయిని ఆరిపోయినై. దీపాలు ఆరటం, ఆకాశాన నక్షత్రాలు పొడవటం చూస్తే ఆ దీపాలే జనాన్ని విడిచి ఆకాశానికి యెగిరిపోయాయేమోననిపిస్తోంది.

ఒక బ్రహ్మాండమైన భవంతి ఆకాశంలోకి లేచివుంది. దానినీడలోకి వచ్చి జమీందారుబండి ఆగింది. ఆ భవంతి సింహ ద్వారం తెరుచుకుని లోపలనుంచి దీపాలు కనుపించుతున్నయ్. సింహద్వారం తెరుచుకుని బయటికివచ్చిన నౌకరుతో జమీందారు.

'ఇంగ్లండునుంచి చార్లెస్ దొరగా రొచ్చాడా'- అన్నాడు.

'ఇంకా రాలేదండి.'

17

మొత్తం చెక్కుడురాళ్ళతో నిర్మించిన, రెండు శతాబ్దాలనాటి అతి పురాతనమైన రాతికోట. భవనం యావత్తూ మొత్తంగా పాషాణమయం: రాతిస్తంభాలూ, రాతిదూలాలూ, రాతివరండాలు, రాతిపూలతొట్లు, రాతిపువ్వులు, రాతి మనుషులు, రాతిముఖాలూ, రాతిసింహాలు.

జమీందారు రాతిమెట్లమీదినుంచి మేడమీది కెక్కుతున్నాడు. కంచుకాగడా బుచ్చుకుని ఒకనౌకరు ముందు నడుస్తున్నాడు. ఆయన బండిదిగటం, దీపాలూ గట్రా తీసుకుని నౌకర్లు బెలబెలా కోటలోనుంచి బయటికిరావటం, నౌకర్లూ ఆయనా కలిసి సంరంభంగా మేడమెట్లెక్కుతూ వుండటం, ఈ రభసంతా చెవులబడి కోట బురుజుమీద నిద్రబోతున్న గుడ్లగూబకు నిద్రాభంగమై కోపంగా కేకలు బెట్టేస్తోంది. గుడ్లగూబ అరుపు మినహా అంతపెద్ద భవంతిలోనూ మరోశబ్దమేమీ వినిపించటంలేదు. కాకపోతే జలయంత్రంలోనుంచి రాతితొట్లోకి పడుతున్న నీళ్ళ చప్పుడుమాత్రం వినిపించుతోంది.

రాతిమెట్లెక్కి మేడమీదికి చేరగానే అక్కడ ముఖద్వారంలో మరో కంచుకాగడా వెలుగుతోంది. జమీందారు మందిరంలోకి ప్రవేశించగానే ముఖద్వారం, మళ్ళా మూసుకుపోయింది.

లోపలికి వెళ్ళగానే, మొట్టమొదటిది పెద్దహాలు. అదో పెద్ద ఆయుధాగారం. ఈటెలూ, బాకులూ, బరిసెలూ, బల్లాలూ, కత్తులూ, కటార్లూ కత్తుల బోనులావుంది. మరో ప్రక్కగా పేముబెత్తాలూ, కొరడాలు వ్రేలాడుతున్నయ్. జమిందారుగారికి ఆగ్రహం వచ్చినప్పుడల్లా ఆ కొరడాల చలవవల్ల ఎంతమంది పేద రైతులు మృత్యుదేవత ఒడిలోకిపోయి పడ్డారో అంతులేదు.

చీకటి చిందులాడుతున్న ఆ పెద్ద పెద్ద కక్ష్యలూ గవాక్షాలూ గడిచి జమీందారు సరాసరి భవనానికి వెనకభాగంలో వున్న ఒక ఆర్చీలోనుంచి అవతలికి వెళ్లారు. అక్కడ జమీందారుగారు విశ్రాంతి తీసుకునే మూడు గదులున్నయ్. ఆ గదులు మూడు ఆ నాటి జమిందారులు నివసించటానికి తగిన సరంజామాతో అలంకరించివున్నయ్. 14వ లూయీ చక్రవర్తినాటి నాగరికతను ప్రతిబింబించుతున్న బల్లలూ, మేజాలూ, ఫ్రాన్సు ప్రాచీన చరిత్రకు సంబంధించిన అనేక చిత్రపటాలూ, గదలు మూడూ, తగిన హుందాలో డాబు సరిగా వున్నయ్.

కట్టకడపట వున్న మూడోగదిలో యిద్దరు మనుషులకు భోజనం యేర్పాటు చేసివుంది. ఆ భోజనపు యేర్పాట్లు చూసి జమిందారు : 'చిన్నదొర రాలేదుగా' అన్నారు.

రాలేదని నౌకర్లు సమాధానం చెప్పారు. జమిందారుతోపాటు కుమార రాజాకూడా వస్తాడని నౌకర్లు అనుకున్నారు.

'ఈరాత్రి యిక ఎలాగూ రాడనుకుంటాను. అయినా ఇంకా కాసేపు ఆ భోజనం అలాగే వుంచండి. నేను కొంచెం విశ్రాంతి తీసుకుని ఒక పావుగంటలో భోజనానికి లేస్తాను'-

ఒక పావుగంటకల్లా వచ్చి, ఆయన భోజనంబల్లదగ్గిర కూర్చున్నారు. సమస్తమైన భోజన పదార్థాలతోను బల్ల నిండివుంది. ఆయన స్థిమితంగా కూర్చుని తాపీగా భోజనం చేస్తున్నారు.

ఇంతలోనే బయట రవరవా బండి చక్రాలచప్పుడు వినిపించింది. బండి సరాసరి భవనం ముందుకు వచ్చి ఆగినట్టు తోచింది. 'ఆ వచ్చిందెవ్వరో చూడండి' - కుమారరాజా వచ్చారు. పారిస్‌నుంచి పెద్దదొర బయలుదేరి వచ్చిన సంగతి తెలిసి ఆయన కూడా వెనువెంటనే బయలుదేరాడు. త్రోవలో పినతండ్రిని కలుసుకోగల్గు ననుకున్నాడు గాని సాధ్యం కాలేదు.

భోజనం సిద్ధంగా వున్నదని చిన్న దొరకు చెప్పుమనీ, లోపలికి తీసుకురమ్మని జమిందారుగారు సెలవిచ్చారు. అయిదారు నిమిషాలకు చిన్నదొర లోపలికి వచ్చాడు. చిన్నదొర, ఇంగ్లండులో, చార్లెస్ డార్నే అనే మారుపేరుతో తిరుగుతున్నారు. పెద్దదొర, చిన్నదొరకు జమీందారీ ఠీవిలోనే ఆహ్వానమిచ్చారుగాని ఆప్యాయంగా స్వజనాన్ని పలకరించినట్టు పలకరించలేదు.

చిన్నదొర భోజనంబల్లదగ్గిర కూర్చోబోతూ : 'మీరు పారిస్ నుంచి నిన్ననే బయలుదేరినట్టున్నారు' అన్నాడు.

'అవును నిన్ననే బయలుదేరాను - నీవో?'

'నేను సరాసరే వచ్చేశాను'

'లండను నుంచేనా-'

'అవును'-

'ప్రయాణం చాలా రోజులు పట్టినట్టుంది' అన్నాడు, అదో యాసగా, చిరునవ్వు నవ్వుతూ.

'నిజానికి ప్రయాణం యెన్నో రోజులు పట్టలేదు. ఎక్కడా ఆగకుండా యెకాయెకే వచ్చేశాను'

'ప్రయాణం చాలారోజులు పట్టిందని గాదు నేను అంటూన్నది. ప్రయాణ లగ్నం కుదరటానికే చాలారోజులు పట్టిందని అంటున్నాను.'

'కొన్ని అసందర్భాలవల్ల నిలిచిపోవలసి వచ్చింది.'

'అలాంటి అసందర్భాలేవో వచ్చివుంటాయనే అనుకున్నాను.'

నౌకరు అక్కడ వున్నంతసేపూ, అంతకుమించి యిద్దరూ యేమీ మాట్లాడుకోలేదు. కాఫీ అందించి నౌకరు బయటికి వెళ్ళిపోగానే చిన్నదొర పినతండ్రివంక చూసి యిలా ప్రారంభించాడు :

'నేను చావుతప్పి యేదోవిధంగా మళ్లా మీదగ్గిరికి తిరిగి రాగలిగాను. ఇంగ్లండులో నేను అనుకోకుండా పెద్ద ప్రమాదంలో చిక్కుకున్నాను. నిజంగా మృత్యు ముఖంనుంచి బయటపడ్డాను.

'మృత్యువుదాకా యెందుకులే-'

'అవునులెండి, నేను మృత్యుముఖంలో చిక్కుకున్నానని తెలిస్తేమాత్రం - మీరు నన్ను యివతల పడెయ్యటానికి ప్రయత్నించేవారుట గానీ'-

పెద్దదొర చలించలేదు. ఆయన ముక్కుకోళ్ళు మాత్రం కోపంగా మెలికలు తిరిగినై. ఒక చిరునవ్వు నవ్వాడు.

'మీరు చిరునవ్వు నవ్వుతున్నారుగాని - నిజంగా అలాగే - చేసేవారు. నాచుట్టూ అలుముకున్న అనుమానాలకు, మరికొన్నిటిని కలిపి మరింత ప్రమాదంలోకి యీడ్చేవారు.'

'ఛా! ఛా! అలా ఎందుకు చేస్తాను'- అన్నాడు పినతండ్రి అదో వెటకారంగా.

'ఎందుకు చేస్తారేవిఁటి - తమ వ్యవహారం నాకు కొత్తాయేవిఁటి? - అల్లాంటి విషయాల్లో తమరు మానవత్వాల బాదరబందీ పెట్టుకోరని నాకు స్పష్టంగా తెలుసు.

పెద్దదొర ముక్కు కోళ్ళు మెలికలు తిరిగినై. 'ఆ సంగతినీకు ఎప్పుడో చెప్పాను - జ్ఞాపకం లేదేమో'

'జ్ఞాపకం లేకపోవటమేవిఁటి?'-

'మరి యింకేం' అన్నాడు పినతండ్రి, అతి తాపీగా.

'నిజానికి యిక్కడ ఫ్రాన్సులో నేను యే జైల్లోనో మ్రగ్గకుండా బయట తిరుగుతున్నానంటే, అది మీ దురదృష్టమూ, నా అదృష్టమూ కారణంగాని మరొకటిగాదు-'

'నీ అభిప్రాయ మేవిఁటో నాకు బోధపడలేదు. కొంచెం వివరంగా వ్యాఖ్యానించితే సంతోషించుతాను.'

'ఏవిఁటంటే - చక్రవర్తి దర్బారులో మీ పలుకుబడి దుమ్మయిపోకుండా మునుపటిమాదిరిగానే చెలామణి అవుతూ వున్నట్టయితే - ఏదో వారంటు పుట్టించి, చావూ బ్రతుకు తేలకుండా యేకోటలోనో ఖైదు చేయించివుండేవారు.'

'అవును సంభవమే - వంశ గౌరవాన్ని కాపాడటానికి నిన్ను అలాంటి యిబ్బంది పెట్టవలసి వచ్చినా నేను సందేహించేవాణ్ణి కానేమో.'

'నాకు తెలుసు - ఇంతకీ మొన్నటి విందులో, ఆ బడా ప్రభువు మీ ముఖమైనా చూడకపోవటం నా అదృష్టం'-

'ఏదో నువ్వు అదృష్టమనుకుంటున్నావుగాని నాకుమాత్రం నమ్మకంలేదు. ఏకాంతవాసం ఎంతమంచిది - ఎలాంటి సుగుణ సంపద యేర్పడటానికి సావకాశం వుంది? - అయినా యిప్పుడా విషయం ఆలోచించి లాభమేవిఁటి? - నీవన్నట్టు, ప్రస్తుతం నేను కొంత అసమర్థ స్థితిలోనే వున్నాను. ఈ రోజుల్లో, నీవంటి వాళ్ళను కాస్తమార్గంలో పెట్టటానికి కావలసిన ఇలాంటి చిన్ని చిన్ని అధికారాలూ, వంశగౌరవాలు నిలబెట్టుకోవటానికి అవసరమైన ఇలాంటి చిన్ని చిన్ని సావకాశాలూ, పని గట్టుకుని ప్రాధేయపడుతున్న వాళ్ళకుగాని లభించటంలేదు. ఆ ప్రాధేయపడేవాళ్లు చాలామంది కావటంచేత అస్మదాదుల కందరికీ సులభంగా లభించటం దుర్లభమౌతోంది. పూర్వం అలా వుండేది గాదు. ఫ్రాన్సు నానాటికీ చాలా దౌర్భాగ్యకరంగా మారిపోతోంది. నిన్న మొన్నటి వరకూ, చుట్టూ వున్న ఈ నాటు ప్రజల మాన ప్రాణాలన్నీ మనవాళ్ళ గుప్పెట్లో వుండేవి. మాట వరసకి ఈ గదిలోనుంచి, అలాంటి కుక్క వెధవల్ని యెంతమందిని ఉరికంబాలకు పంపించ లేదూ? అంతదాకా దేనికి? తన కూతురు విషయంలో యేదో నిక్కుబోయినందుకు, ఆ వెధవను నా పడకగదిలోనే చిత్రవధ చేయించానా లేదా? - ఇలాంటి అధికారాలన్నీ మన చేతుల్లోనుంచి జారిపోయినై. ఇప్పుడు ఇదేదో ఒక కొత్త వేదాంతం బయలుదేరుతోంది. నిజంగా మన అధికారాలను మనం నిలుపుకోవాలంటే కొన్ని యిబ్బంది సబ్బందులు పడవలసే వస్తుంది - ఇంతకీ నేనొకటి చెబుతా విను - ఎంతైనా చెడు రోజులు.'

ఈ ఉపన్యాసం దంచి, ఒక చిన్న పొడుంపట్టు ఎక్కించి తల విదిలించాడు. నాశనమైపోయిన అధికారాన్ని పునరుజ్జీవింపజేయటమెలాగా అని తీవ్రమైన మధనలో పడ్డాడు.

'మన పూర్వులూ మనం, కూడా, అలా అధికారాన్ని యిష్టం వచ్చినట్టు, చెలాయించాం గనుకనే మన పేరంటే, ఫ్రాన్సులో ఇవ్వాళ యింత కంటకంగా వుంది.'

'గొప్పవాణ్ణి కంటగించుకుంటున్నారంటే - ఆ గొప్పవాడి గొప్పతనాన్ని గుర్తించి జోహరు చేస్తున్నారన్నమాట'

'వట్టిభ్రమ' అన్నాడు చిన్నదొర : 'ఈ మొత్తం దేశంలో, నావంక, ఆప్యాయంగా గాని, గౌరవంతోగాని చూస్తున్న ముఖం ఒక్కటికూడా కనుపించటంలేదు. వాళ్ళల్లో బానిసతత్వం, భయమూ తప్ప నాకు మరొకటేమీ కనుపించటం లేదు-'

'మంచిమాట - అలాగైతే మన వంశగౌరవం ఈ షణ్మాత్రమైనా మొక్కపోలేదన్నమాట-' తాపీగా మరోపొడుం పట్టుబిగించాడు.

చిన్నదొరమాత్రం, బల్లమీద మోచేతులాని ముందుకు వంగాడు. గిజాటుగా అరచేతులతో ముఖం కమ్మేసుకున్నాడు. పెద్దదొర అతని మనస్థితిని జాగ్రత్తగా అవగతం చేసుకోవటానికి ప్రయత్నించుతున్నాడు.

'దమననీతి సనాతనమైన సాంప్రదాయం - ఈ కుక్క వెధవల్లో బానిసతత్వం భయం నశించిపోకుండా వుంటే మన కొరడాలకు ఎదురుండదు. చచ్చిన కుక్కల్లా పడివుంటారు ఈ రాతికోట ఇలా అచలంగా నిలచివున్నంత కాలం, మన అధికారం శాశ్వతంగా నిలిచివుంటుంది. అంత వరదాకా ఈ వంశ గౌరవాన్ని నీవు నిలబెట్టకపోయినా నేను నిలబెట్టి తీరతాను - నువ్వు చాలా అలసిపోయినట్టున్నావ్; ఈ సంభాషణను యింతతో విరమించితే బాగుంటుంది'-

'మరోక్షణం అవకాశం యిప్పించండి-'

'క్షణం గాదు - కావాలంటే గంట మాట్లాడవచ్చును.'

'మనం చాలా అక్రమాలు చేశాం - వాటి ఫలితాలన్నీ అనుభవించ బోతున్నాం' అన్నాడు చిన్నదొర.

'అవును మనం - గౌరవనీయమైన వంశానికి చెందిన మనం, మా నాన్న గారి హయాంలోకూడా అనేక కిరాతకాలు చేశాం. మన ఆనందానికి అడ్డుగా తోచిన ప్రతిమానవుణ్ణీ నాశనంచేసి పారేశాం. నాన్నగారి హయామనటమే యెందుకు? ఆయన సోదరులు మీరుమాత్రం చేస్తున్నదేవిఁటి - ఈ విషయంలో మీ సోదరులనిద్దర్నీ విడదీసి మాట్లాడవలసిన పనేముంది?-'

'మృత్యువు మమ్మల్నిద్దర్నీ విడదీసింది'-అన్నాడు పెద్దదొర.

'అవును ఆయన్ను యెత్తుకుపోయి, నన్ను ఈ కిరాతవ్యవస్థకు అధికారంలేని వారసుణ్ణిగా చేసి విడిచింది. దీని చెడు ఫలితాలకన్నిటికి బాధ్యుణ్ణి చేసింది; నా తల్లి, మరణశయ్యమీద వుండి కన్నీరుకార్చి ఆదేశించింది: ప్రజలపట్ల కనికరం చూపమన్నది. న్యాయం కలుగజేయమన్నది. ఆ తల్లి తుదికోర్కె తీర్చటానికి, చేతగాని వాణ్ణయి సహాయంకోసం, అధికారంకోసం అర్థించుతూ నానా మనస్థాపాలూ పడుతూ, దిక్కులేని పక్షినై తిరుగుతున్నాను.'

'అలాంటివి, నావల్ల పొందాలని నీవు అర్థించుతూ వున్నట్టయితే, నీవు జన్మాంతంవరకూ అర్థించినా ప్రయోజనం ఉండదు-' తన చూపుడువ్రేలు చిన్నదొర

గుండెలమీద బాకులా ఆనించి: 'ఇదిగో! ఒక్క సంగతి చెబుతా ఇలా విను! - ఈ వ్యవస్థలో పుట్టి ఈ వ్యవస్థలో పెరిగాను. దీన్ని రక్షించటానికి నా ప్రాణాలు ఒడ్డి పోరాడతాను.'

మరో చిన్ని పొడుంపట్టులాగి వ్రేళ్లు దులుపుకుంటూ : 'యుక్తాయుక్త పరిజ్ఞానంతో బ్రతకటం యెందుకేనా మంచిది. దైవదత్తంగా నీకు సంప్రాప్తించినదాంతో సుఖపడొచ్చు. అయినా ఇదంతా యిప్పుడు లాభంలేదు. నువ్వు సొంతం దారి తప్పావు' - బల్లమీద చిన్నిగంట మోగించాడు.

'త్రోవ తప్పింది నేను కాదు - ఈ దేశం - ఈ ఫ్రాన్సుతో గాని, యీ ఆస్తితో గాని నాకేమీ పనిలేదు - ఈక్షణంలో విసర్జించుతున్నాను' అన్నాడు. చిన్నదొర చార్లెస్.

'చార్లెస్! అదేవిటి - వెర్రిమాట - అవేవో నీ సొంతసొమ్మయినట్టు విసర్జించానంటున్నావేమిటి? - ఫ్రాన్సు నీదైతే కావచ్చునేమోగాని ఈ ఆస్తిమాత్రం నీది గాదు.'

'నేను కావాలని యేడవటం లేదు - రేపు ఉదయం ఇది మీనుంచి నాకు సంక్రమించినా నేను విసర్జించేదే -'

'బహుశా! అలాంటిది సంభవించదనే నా విశ్వాసం'

'-ఇప్పుడు కాకపోతే మరో యిరవై సంవత్సరాల తరువాతే ననుకోండి - ఇప్పుడు కూడా నే నీ కిరాతంతో ఎలాంటి సంబంధం పెట్టుకోను - ఇది వట్టి అరణ్యం - మానవ సంక్షోభం - ఈ శిథిలాలవల్ల ప్రయోజనం యేవిఁటి?'-

'ఆహా! ఏవిఁటీ -' అంటూ పెద్దదొర సర్వాలంకారశోభితమైవున్న ఆ గది నాల్గువంకలా ఒక్కసారి కలియజూచి చిరు నవ్వు నవ్వాడు.'

'కంటితో చూడటానికి యిదంతా సొంపుగానే వుండొచ్చు; కాని కొంచెం లోతుకుదిగి దీని స్థితిగతులు అర్థం చేసుకుంటే సర్వం బోధపడుతుంది. దుబారాఖర్చులు, చేతగాని నిర్వహణ, పీడన, ఋణాలు, తనఖాలూ, దౌర్జన్యం, ఆకలి, క్షోభ ఈ కిరాతాలన్నిటితో కుళ్ళి కుసమారి కూలబడిపోవటానికి సిద్ధంగా వుంది. ఈ గోపురం.'

'ఓహో! అలాగా' - అన్నాడు పెద్దదొర.

'ఇది దైవకృపవల్ల యేనాటికైనా నా చేతుల్లోకి వచ్చే సావకాశం వుంటే దీన్ని సమర్థులైన మరొకళ్ళ చేతుల్లో బెడతాను. ఈ భూమిని విడవలేక దాన్ని అంటిపెట్టుకుని బ్రతుకటానికి ప్రయత్నించుతూన్న ఈ అభాగ్యప్రజల కష్టాలను తొలగించగల మహాపురుషులెవరికైనా వప్పగింత చేస్తాను. అయినా అలాంటి మహదవకాశం రాదనుకుంటాను. ఈ దేశం అలా బాగుపడటానికి యిక వీల్లేదు. సర్వం నాశనమైపోవటం విధి నిర్ణయమైనట్టు కనుపించుతోంది.'

'ఈ నూతన సిద్ధాంతాన్ని కిరీటంలా ధరించి నీ వొక్కడివీ మాత్రం పూజనీయుడవై బ్రతుకదలచావన్నమాట!'

'నా బ్రతుకుతెరువుకు యేవిఁటి? - ఈనాడు గాకపోతే మరోనాడు మానమర్యాదలు గల నా దేశీయులందరూ ఎలా బ్రతుకవలసివుందో అలా బ్రతుకుతాను - ఏదో కష్టం చేసుకుని'

'ఇంగ్లండులోనేనా?'

అవును - నేను ఈ దేశంలో లేకుండావుంటే - నావల్ల మీ వంశగౌరవం చెడుతుందేమోననే భయమేమీ వుండదు. ఇతర దేశాల్లో బ్రతుకుతున్నప్పుడు కూడా నేను మీ వంశంవాణ్ణని చెప్పుకోను.

పెద్దదొర గంటకొట్టగానే ప్రక్కనున్న పడకగదిలో దీపాలు వెలిగినై. ఆ వెలుగు యివతలి గదిలోకి కూడా పడ్డది. ఆ గదిలోనుంచి నౌకరు బయటికి వెళ్ళేదాకా తమాయించి పెద్దదొర ఇలా అన్నారు.

'అక్కడ హాయిగా కాలక్షేపం చెయ్యటానికి సావకాశంగా వుండటంచేత ఇంగ్లండుమీద నీకు చాలా మోజుగా వున్నదన్నమాట' - చిన్న చిరునవ్వు నవ్వాడు.

'అక్కడేనా నేను కులాసాగా కాలక్షేపం చేయగలిగానంటే, ఇంకా పూర్తిగా మీదయ తప్పకపోవటంచేతనే అనే విషయం నాకు తెలుసు - ఏదోవిధంగా ఆదేశంలో కాందిశీకుడుగా తలదాచుకుంటున్నాను'-

'కాందిశీకుడు - ఈ కాందిశీక సన్యాసులకందరికీ ఆశ్రయమిస్తున్నామని - ఆ ఇంగ్లీషునస్మరంతులు డప్పులు చరుస్తున్నారు. - వాడెవడో డాక్టరు నీకు మల్లేనే అక్కడ కాందిశీకుడై యేడుస్తున్నాట్ట వాణ్ణి యెరుగుదువా?'-

'ఎరుగుదును'-

'వాడికో కూతురుందా?'

'అవును'-

సరే - డాక్టరూ కూతురూ - ఈ కొత్తవేదాంతం యెలా బయలుదేరిందో అర్థమౌతోంది - వెళ్ళి పడుకో! చాలా అలసిపోయావ్!'-

లోపలికి వెడుతూ జమిందారు ఠీవిలో తలపంకించి ఒక చిరునవ్వు నవ్వాడు:

నౌకరును కేకబెట్టి, చిన్నదొర పడుకోటానికి యేర్పాటు చెయ్యమని చెప్పి, మరో నౌకరును వెంటబెట్టుకుని తన పడక గదిలోకి తను వెళ్లిపోయాడు.

పడకగదిలోకి వెళ్ళి దుస్తులు మార్చుకున్నాడు. వదులాటి అంగరకా తొడుక్కుని గదిలో అటూయిటూ పచారు చేస్తున్నాడు. మెత్తని స్లిప్పర్లు తొడుక్కుని వుండటంచేత పాదాలు నేలమీద చప్పుడు కావటంలేదు. నాగరికతను అలవరుచుకున్న పెద్ద పులిలా పంజాలు ముడుచుకుని గదిలో గోరాడుతున్నాడు.

గదిలో ఈ వేపునుంచి ఆ వేపువరకూ పచారు చేస్తున్నాడు. మార్గమధ్యంలో జరిగిన సంఘటనలన్నీ - ఒకటొకటే తిరిగి మెదడులో కదులుతున్నయ్ - పసిబిడ్డ బండిచక్రాల క్రిందపడి నెత్తురు ముద్ద క్రింద పిడచగట్టిపోవటం - ఆజానుబాహుడొకడు ఆ నెత్తురుముద్దను బుజానవేసుకుని : "చంపేశారు!" అంటూ అరవటం - ఇదంతా మళ్ళీ ఒకసారి స్ఫురణకువచ్చి అణగిపోయింది.

బుర్రలోవున్న భావాలన్నీ సమసిపోయిన తరువాత హాయిగా వెళ్లి పందిరిమంచం మీద పవ్వళించి చుట్టూ దోమతెరలు దించేసుకున్నారు.

తెల్లవారింది గ్రామంలోవున్న జనమంతా ఎవళ్ళపనుల మీద వాళ్లు వెళ్ళిపోతున్నారు. కొంతమంది కుళాయిదగ్గిరజేరి గుడ్డ లుతుక్కుంటున్నారు. కొంతమంది పొలాలమీదికి

వెడుతున్నారు; కొంతమంది గొడ్డూ గోదా పనులు చూసుకుంటున్నారు. చర్చిలోనూ, శ్మశానంలోవున్న యేసుక్రీస్తు కొయ్యబొమ్మముందు మోకరిల్లి ఒకరిద్దరు అనాధలు ప్రార్థనలు చేస్తున్నారు. బక్కసిలిపోయిన ఒక ఆవు గోరీ దిబ్బలమీద పట్టిన పసిరికను ఆప్యాయంగా మేస్తోంది.

నీలిటోపీతో సహా మన రోడ్డుకూలీ ప్రొద్దుపొడుపుతోనే పనిలోకి వెళ్ళాడు. కొండగుట్టమీద కంకర గొడుతున్నాడు. అతను తెచ్చుకున్న చద్దిమూట ఒకరాళ్లగుట్టమీద పెట్టి వుంది. ఆ చద్దిమూట అంతా కలిసి కాకులకు విదిలించటానికి ఉంచిన కబళమంత కూడా లేదు.

కంకర కొడుతూ కొడుతూ చివాల్న తల పైకెత్తి గ్రామం వంక చూచాడు. చూచీ చూడటమే ఏదో శివంపూనినవాడులాగు, నెత్తిమీద నీలిటోపీ చేత్తో బుచ్చుకుని, కొండమీది నుంచి క్రిందికి పరిగెత్తు కొచ్చేస్తున్నాడు - కాలుజారితే తల వక్కలౌతుందనే స్పృహకూడా లేకుండా.

ఊళ్ళోవున్న జనమంతా నడివీధిలో కుళాయిదగ్గిర మూగి వున్నారు. ఏదో ఆందోళనగా గుసగుస లాడుకుంటున్నారు. సంభ్రమ భయాశ్చర్యాలతో వాతావరణమంతా గందరగోళంగా వుంది. దేవిడీకి సంబంధించిన నౌకర్లూ, గుర్రాలశాల దగ్గిరున్న సిపాయిలూ, ఇతర గ్రామాధికారులూ యావన్మందీ ఆయుధాలు ధరించివున్నారు.

నీలిటోపీ రోడ్డుకూలీ జనాన్ని తొలగదోసుకుంటూ మందిలోకి వచ్చాడు. ఆ గందరగోళమంతా యేవిఁటో అతనికి అర్థంకాలేదు. మాన్సియర్ గాబెల్లీ చివాల్న గుర్రంమీదికి ఎగిరి కూర్చున్నాడు. గుర్రాలు దివాణంవేపు గాలప్ తీస్తున్నాయ్.

దివాణంలోని తన పడకగదిలో, జమీందారు, పందిరి మంచంమీద చచ్చిపడున్నాడు. ముఖం రాతిబొమ్మలా బిగుసుకుపోయింది. డొక్కలో దిగబడివున్న బాకుపిడికి ఒకచిన్న చీటీకట్టి వుంది.

'వాణ్ణి వెంటనే ఖూనీ చెయ్యాలి - ఇది జాక్వెస్ ఉత్తరువు'-

18

ఒక సంవత్సరం గడిచింది; చార్లెస్ డార్నే ఇంగ్లండులో స్థిరనివాసం యేర్పరచుకొని ఉపాధ్యాయవృత్తి వల్ల జీవిస్తున్నాడు. ఫ్రెంచిభాష చదువుకోదలచినవాళ్ళకు ట్యూషన్లు చెబుతూవుండేవాడు. ఫ్రెంచిసారస్వతంలో అతనికివున్న ప్రవేశానికి ఆ రోజులు గనక ట్యూషన్లూ గట్రా చెప్పుకోవలసి వచ్చిందిగాని ఈ రోజుల్లో అయితే యే ప్రొఫెసరో అయి కూర్చునేవాడు. ట్యూషన్లు యితరులకు చెప్పుకుంటూ వుండటమే గాక, ఉత్సాహంగల కొంతమంది యువకులతో కలిసి, ఫ్రెంచి వాఙ్మయంయొక్క అవధులు చూడటానికి తీవ్రంగా చదువుకుంటూ వుండేవాడు. ఫ్రెంచిరచనలన్నింటినీ చక్కగా ఇంగ్లీషులోకి తర్జుమా చేయగల సమర్థత అబ్బింది. ఆ రోజుల్లో అలాంటి ప్రతిభగల ఉపాధ్యాయులు దొరకటమంటే దుర్లభంగా వుండేది. రాజులూ, జమిందార్లూ దివాలాలు తీసి ఉపాధ్యాయవృత్తికి పూనుకున్న రోజులు

అప్పటికింకా రాలేదు. టెల్సన్సు బ్యాంకి ఖాతాలలోనుంచి జారిపోయిన రాజవంశీయులెవరూ అప్పటికింకా వంటవాళ్లుగానూ, వండ్రంగులుగానూ తయారుకాలేదు. మంచి ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుడు కావటంచేత డార్నేకు మంచి గిరాకీ తగిలింది. అదీగాక, తన దేశంలో చెలరేగుతున్న దుస్థితి అంతా అతను దినదినం అవగతం చేసుకుంటూనే వున్నాడు. అందుచేత ఎలాగైనా యిక్కడ ఇంగ్లండులో నిలవదొక్కుకోవాలని చాలా శ్రద్ధగా పనిపాటలు చేసుకుంటున్నాడు.

లండనులో అతను, బంగారు బాటలవెంట నడవాలనిగాని, పూలసజ్జెలమీద పడుకోవాలనిగాని ఆశించలేదు. అలాంటి లేనిపోని దురూహలు పెట్టుకున్నట్టయితే అతను యేవిధంగానూ పైకి రాగలిగేవాడు గాడు. అతను అపేక్షించిందల్లా పనిచేసుకునేందుకు అవకాశం; ఆ అవకాశం అతనికి లభించింది. దాన్ని ఎంత చక్కగా ఉపయోగించుకోవాలో అంత చక్కగా ఉపయోగించుకొని పైకి రాగలుగుతున్నాడు.

సృష్ట్యాదినుంచీ యిప్పటివరకూ మగవాడైన ప్రతివాడిలోనూ ఒక స్వభావం వుంది- స్త్రీని ప్రేమించటం; డార్నే కూడా ప్రేమిస్తున్నాడు.

అతను లూసీ మానెట్‌ను ప్రేమిస్తున్నాడు. తాను ప్రమాదస్థితిలో చిక్కుబడి కోర్టు విచారణ జరుగుతుండగా అతనికి లూసీపట్ల అనురాగం కలిగింది. ఆ స్త్రీ అతనిపట్ల చూపిన జాలి, ఆ జాలి మాటల తియ్యదనం అతణ్ణి ఆకర్షించాయి. జీవనమరణ సంధ్యలో నిల్చుని అతను లూసీముఖవంక చూచాడు. అలాంటి కోమలమైన ముఖం, అందమైన ముఖం, అతను అంతకుపూర్వం ఎన్నడూ చూళ్లేదు. తన హృదయంలోవున్న ఆపేక్షను అతను లూసీతో యెన్నడూ ముచ్చటించలేదు. ఫ్రాన్సులో వున్న తమ దివాణం, దివాణంలో ఆనాడు జరిగిన హత్య, అవన్నీ అతని మనస్సులో మసకమసకలేసి కలలోని దృశ్యాలుగా కనుపించుతున్నయ్. ఆ సంఘటన జరిగి అప్పటికి సంవత్సరం జరిగిపోయింది. ఇంతకాలంగా యిద్దరూ కలిసిమెలిసి తిరుగుతున్నా, తన హృదయంలో వున్న అభిప్రాయమేవిటో అతను లూసీకి రవ్వంతేనా తెలియనియ్యలేదు. అలా దాచివుంచటానికి తగిన కారణం లేకపోలేదు.

వసంతఋతువు : సాయంత్రసమయం; ఆ తరుణంలో, లూసీ, మిస్ ప్రాస్‌తో కలిసి షికారు వెళ్ళివుంటుందని అతనికి తెలుసు. ఆ అవకాశం చూసుకుని అతను డాక్టర్ మానెట్‌తో మాట్లాడటానికి సోహోస్క్వేరుకు బయలుదేరాడు.

అతను వచ్చేసరికి, డాక్టర్ మానెట్ కిటికీకి ప్రక్కగా పడకకుర్చీ వేసుకుని చదువుకుంటూ వున్నాడు. ఆయనలో వున్న జీవశక్తులన్నీ తిరిగి పుంజుకుని ఉత్సాహావేశాలు గల సంపూర్ణమానవుడుగా తయారైనాడు. తనకు సంబంధించిన ప్రతివిషయాన్నీ చక్కగా ఆలోచించుకుని తగిన నిర్ణయానికి రాగల మనోబలం అతనిలో యేర్పడ్డది. డార్నే లోపలికి రావటంచూసి, ఆయన, చేతిలోవున్న పుస్తకం ప్రక్కన బెట్టేసి, డార్నేతో కరచాలనం చేశాడు.

'నిన్ను చూసి ఎన్నో రోజులైంది డార్నే, ఇవ్వాళో రేపో వచ్చి తీరతావని అనుకుంటూనే వున్నాం. నిన్న సిడ్నీ కార్టనూ, స్ట్రయివరూ ఇక్కడికివచ్చి కాసేపు కూర్చుని వెళ్లారు. నువ్వింకా రాలేదేమా అని వాళ్లుకూడా అనుకున్నారు.'

'కృతజ్ఞుణ్ణి - అమ్మాయి'-

'అమ్మాయి క్షేమంగావుంది; నువ్వురావటం మాకందరికీ కూడా ఎంతో సర్దాగావుంది- అమ్మాయియేదో పనిమీద బయటికి వెళ్లింది. ఇప్పుడే వచ్చేస్తుంది. కూర్చో'-

'డాక్టరుగారూ! - అమ్మాయి ఈ సమయంలో ఇంట్లో వుండదని నాకు తెలుసు- అందుకనే, ఈ అవకాశం, చూసుకుని మీతో ఒక విషయం మాట్లాడాలని వచ్చాను.'

డాక్టర్ మానెట్ ఒక క్షణం మౌనంగా ఆలోచించాడు.

'సరే - ఆకుర్చీ ఇలా దగ్గిరికి ఈడ్చుకో - ఏవిటి సంగతీ?-

కుర్చీ దగ్గిరకు ఈడ్చుకున్నాడుగాని, ప్రసంగం యెలా ప్రారంభించాలో మాత్రం తోచలేదు. ఒక క్షణానికి అలా అలా గొంతు పెగుల్చుకుని ఇలా ఉపక్రమించాడు:

'డాక్టరుగారూ! - నాకు మీ కుటుంబంతో పరిచయం యేర్పడి యిప్పటికి దాదాపు ఒకటిన్నర సంవత్సరాలు కావస్తోంది. మీకందరికీ యింత సన్నిహితుణ్ణి కాగలిగినందుకు ఎంతో సంతోషించుతున్నాను. నేను యిప్పుడు మాటాడబోతున్న విషయం మీకు ఎలా'-

డాక్టర్ ఆగమన్నట్టు చెయ్యిచాచాడు:

'లూసీ విషయమా నువ్వు మాట్టాడబోతున్నది?'-

'అవును లూసీ విషయమే'-

'లూసీ విషయం ప్రసంగం యేది వచ్చినా నాకు ఎందుకో కష్టంగా వుంటుంది. నువ్వు యిప్పుడు మాట్టాడుతున్న ధోరణిలో లూసీని గురించి ప్రసంగించటం మరింత కష్టంగా వుంటుంది'-

'లూసీపట్ల నాకెంతో అభిమానంవుంది - లూసీకి నాజీవిత సర్వస్వాన్నీ అర్పించాలనుకుంటున్నాను. లూసీని నేను ఎంతగా ప్రేమిస్తున్నానో మాటల్లో చెప్పలేను'-

మరొకక్షణం మౌనం :

'నాకు తెలుసు - లూసీ అంటే నీకు ఎంతో ప్రేమవుందని నాకు తెలుసు'- అని, డాక్టర్ మళ్లా మౌనంగా వూరుకున్నాడు. ఆ విషయమైన ప్రసంగం వినటానికి డాక్టర్ మానెట్ సుముఖంగాలేనట్టు అనుమానపడి, డార్నే వెనకాముందూ సందేహించుతున్నాడు:

'చెప్పమన్నారా?...'

మళ్లా క్షణం మౌనం··

'ఆఁ ఆఁ! - సరే - చెప్పు'-

'నేను చెప్పబోయేదేవిటో మీరు ఊహించగలిగే వుంటారు. కాని, నామనస్సులోవున్న ఆందోళనంతా మీకు అర్థం కావటం కష్టం. డాక్టర్ గారూ! నేను లూసీని ప్రేమిస్తున్నాను; ఎంతో ఇదిగా ప్రేమిస్తున్నాను, నా జీవితానికంటే ఎక్కువగా ప్రేమిస్తున్నాను - నా మనస్సులో వున్న ఆవేశాన్నంతా మాటల్లో విప్పి చెప్పలేకపోతున్నాను. డాక్టర్ గారూ! ఒకప్పుడు మీరు ప్రేమించారు!- ప్రేమ అంటే యేమిటో మీకు తెలుసు; ఆ అనుభవాన్ని స్ఫురణకు తెచ్చుకుని నామనస్సును అర్థం చేసుకోండి'-

డాక్టర్ ముఖం ప్రక్కకు తిప్పుకుని తలవంచుకు కూర్చునున్నాడు. అయన చూపులు ముందున్న నేలలోకి గుచ్చుకుపోతున్నయ్. ఆ చివరిమాటలు చెవులబడేటప్పటికి సహించలేకపోయాడు; బాధగా చేతులు ముందుకు చాచి, ఆందోళనగా:

'ఆఁ! ఆఁ! - ఆగు నాయనా ఆగు! - ఆమాట లెత్తబోకు - ఆ సంగతి జ్ఞాపకం చెయ్యకు - నిన్ను బ్రతిమాలుకుంటాను - ఆ సంగతెత్తకు'-

ఏదో గుండెలు కోసుకుపోతున్నట్టు, బాధగా గోలబెట్టాడు. ఆయన పడుతున్న బాధ గమనించి, డార్నేకు ఇక నోటవెంట మాట రాలేదు.

'క్షమించు నాయనా!' అన్నాడు డాక్టర్, 'నువ్వు లూసీని గాఢంగా ప్రేమిస్తున్నావని నాకు తెలుసు' - ఆ విషయంలో నా కెలాంటి సందేహమూ లేదు'-

ప్రక్కముఖమై వున్నవాడు డార్నే వేపుకు తిరిగాడు. కాని తల పైకెత్తి అతని ముఖంలోకి చూడ్డంలేదు. తల వంచుకుని అలా నేలవంకే చూస్తూ ఆలోచిస్తున్నాడు. దూదిపింజల్లా తెల్లబడిపోయిన తలవెంట్రుకలు ముఖంమీదికిపడి ముఖం కమ్ముకుపోయింది.

'ఈ సంగతి లూసీతో మాట్లాడావా?'-

'లేదు;'

'పోనీ ఉత్తరమేమైనా వ్రాశావా?'-

'వ్రాయలేదు'-

'నువ్వు యింతవరకూ అమ్మాయితో ఈ ప్రసంగం యెత్తకుండా ఎందుకు ఊరుకున్నావో నేను అర్థం చేసుకోగలుగుతున్నాను - నువ్వు నాయందు వుంచిన ఈ పెద్దరికానికి కృతజ్ఞుణ్ణి' - అంటూ ఆప్యాయంగా చేయి అందించాడు.

'డాక్టర్ గారూ! - నాకు తెలుసు!-మీకు మీ అమ్మాయికీ మధ్య యెలాంటి తీవ్రమైన అనురాగబంధం వున్నదో నాకు తెలుసు. మీరు అనుభవించిన కష్టాలూ, మిమ్మల్ని తిరిగి మనుషుల్లోకి తెచ్చుకోవటానికి లూసీ మీపట్ల చూపిన ఆప్యాయతా, యిదంతా కారణంగా, మీ ఇద్దరి మధ్యనూ, యేతండ్రీ బిడ్డల మధ్యా వుండటానికి వీలులేనంతటి అవినాభావం యేర్పడటానికి కారణమైంది. పసితనంలో, లూసీకి తల్లిదండ్రుల వాత్సల్యంలో పెరిగే సావకాశం లేకపోయింది. ఇప్పుడు మీరుతిరిగి లభించటంతో, యౌవనదశకు వచ్చినదై వుండి కూడా ఆ పసికందు హృదయంతోనే, మీ చుట్టూ పెనవేసుకుంటోంది. తను, స్వయంగా, తల్లిలా అనురాగం చూపి, మిమ్మల్ని బ్రతుకుబాటలోకి తెచ్చుకుంది. లూసీచేతులు రెండూ మీకంఠాన్ని పెనవేసుకునేటప్పుడు, ఆ నరాలలో శిశుహృదయం, స్త్రీతత్వం, మాతృత్వం ముప్పిరిగొని ప్రవహిస్తూ వుంటుందని నాకు తెలుసు. లూసీ మిమ్మల్ని ప్రేమించుతోందంటే, మీలో, తన తల్లిని కూడా తెలుసుకుని ప్రేమించుతోంది. భగ్న హృదయంతో మరణించిన తన తల్లిని మీలో చూచుకుని జాలిబడుతోంది; మీరు పడ్డ కష్టాలన్నీ తలపుకుతెచ్చుకుని, జాలిపడి, శిశువులా మిమ్మల్ని ఆలింగనంలోకి పొదువుకుని మాతృత్వసుఖాన్ని అనుభవించుతోంది. ఇదంతా నాకు స్పష్టంగా తెలుసు; మీ కుటుంబంతో పరిచయం యేర్పడ్డ మరుక్షణంనుంచీ ఇదంతా నేనూ తేటతెల్లంగా అవగతం చేసుకోగలుగుతున్నాను.'

డార్నే మాటలన్నీ వింటూ, డాక్టర్ మానెట్ తలవంచుకుని మౌనంగా కూర్చున్నాడు. ఆయన ఉచ్ఛ్వాసనిశ్వాసాలు మాత్రం కొంచెం ఆదుర్దాను సూచించుతున్నయ్. కాని తన మనసులో రేగుతున్న ఆందోళన నంతా పైకి కనుపించకుండా అణచివేసుకోవటానికి చాలా ప్రయత్నించుతున్నాడు.

'డాక్టర్ గారూ! ఇదంతా నాకు తెలుసు - మీ యిద్దరి మధ్యనూ వున్న ఈ అవినాభావాన్ని అవగతం చేసుకున్నాను గనుకనే ఈ విషయాన్ని యెత్తటానికి యిన్నాళ్ళు ఇంత పస్తాయించాను. లూసీపట్ల నాకున్న ప్రేమకు వెల్లడించటంవల్ల మీ జీవితంలోకి తీవ్రమైన ఆవేదనను విసిరినవాడ నౌతానని భయపడ్డాను - ఇప్పుడు కూడా అలానే భయపడుతున్నాను. కాని - డాక్టరుగారూ! - నేను లూసీని ప్రేమించుతున్నాను - దైవసాక్షిగా ప్రేమిస్తున్నాను.'

'నాకు తెలుసు' అన్నాడు డాక్టరు, దుఃఖం ముంచివేస్తున్న రుద్ధకంఠంతో : 'ఈ సంగతి నేను చాలా రోజులక్రిందటే గ్రహించాను - నాకు తెలుసు.'

డాక్టర్ కంఠనాళాల కదలికలో, డార్నేకు, ఆయన మనస్సులో పడుతున్న సంక్షోభమంతా అర్థమయింది:

'కాని డాక్టరుగారూ! ఒక మనవి వినండి - నేను అదృష్టవంతుణ్ణయి, లూసీ నాకు భార్యగా దక్కే సుదినమే వస్తే, లూసీని మిమ్మల్నుంచి దూరంచేస్తాననే అభిప్రాయం మటుకు యెప్పుడూ పెట్టుకోకండి. అలాంటిది యెన్నడూ తలపోయటానికి వీల్లేని అసంభవకార్యమనీ, కిరాతకృత్యమని తెలుసు - అలాంటి దుష్కృత్యాన్ని నా జీవితంలో ఎప్పటికీ తలపెట్టను - మీచెయ్యిముట్టి ప్రమాణం చేస్తున్నాను.'

డాక్టరుచెయ్యి పట్టుకుని ఇలా మాట్టాడుతున్నాడు:

'నేనూ, మీకుమల్లేనే ఫ్రాన్సునుంచి తరిమివేయబడిన కాందిశీకుణ్ణి, మాతృదేశంలో జరుగుతున్న కిరాతకాలూ, అవినీతి, దురాగతాలూ చూసి భరించలేక మీకు మల్లేనే ఇక్కడికి ఏకాకినైవచ్చి తలదాచుకుంటున్న దురదృష్టవంతుణ్ణి; భవిష్యత్తులో సత్కాలం రాకపోతుందా అనే ఆశతో, యిక్కడ చేతనైన కష్టం చేసుకుని మీకుమల్లేనే సుఖంగా బ్రతకాలని చూస్తున్నాను. ఇల్లూ వాకిలీ లేని ఏకాకిని, మీ కష్టసుఖాల్లో భాగస్వామిని కావాలని వాంఛించుతున్నాను. మీ యిల్లు నాయిల్లుగా మీ కష్టసుఖాలు నా కష్టసుఖాలుగా, మీ కుటుంబంలో ఒక వ్యక్తిగా బ్రతకాలని అపేక్షించుతున్నాను. లూసీని మీనుంచి విడదీయటానికి ప్రయత్నించను. చేతనైతే మీ వాత్సల్యానురాగాలను మరింత బలపరచటానికి సాయపడతాను.'

డాక్టర్ తల పైకెత్తి డార్నే ముఖంలోకి చూచాడు. ఆయన పడుతున్న ఆందోళనంతా పైకెత్తిన ఆ నుదురులో స్పష్టంగా కనుపించుతోంది.

'ఎంతో హృదయంవున్న మానవుడులా, నాకష్టసుఖాలన్నీ అర్థంచేసుకుని చాలా ఉదారంగా మాట్లాడుతున్నావు నాయనా! ఎంతో కృతజ్ఞుణ్ణి; నా మనస్సులోవున్న అభిప్రాయమేమిటో దాపరికం లేకుండా చెబుతాను. లూసీ నిన్ను ప్రేమించుతున్నదని విశ్వసించటానికి తగిన ఆధారమేదైనా నీకు కనిపించిందా?' -

'లేదు - యిప్పటికి అలాంటిదేమీ లేదు.'

'నాకు ముందుగా తెలియపర్చి - ఆ విషయాన్ని తేల్చుకుందామనేనా ఇప్పుడు యీ సంగతి నాతో ప్రస్తావించటంలో నీకుగల ఉద్దేశం?'-

'అది కూడా కాదు - ఆ విషయం యిప్పుడప్పుడే తేలకపోయినా నాకేమీ బెంగలేదు. ఎప్పుడో ఒకప్పుడు అదే తేలుతుంది - తేలితే రేపే తేలవచ్చుకూడా.'

'ఈ సంగతి తేల్చుకోవటానికి నా సహాయమేమైనా అపేక్షించుతున్నావా?'

'అల్లాంటిదేమీ అక్కర్లేదు - అల్లాంటి దేదైనా మీరు యివ్వదలిస్తే ఆవిధమైన సూచనను స్వీకరించటానికి నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు.'

'అలాగైతే నావల్ల కావలసిన సహాయమేమిటి? నానుంచి వాగ్దానమేదైనా కావలసివుందా'-

'వుంది - అదే మిమ్మల్ని యాచించుతున్నాను.'

'ఏమిటది?'-

'మీ సంగతి తేలంది, ఈ విషయంలో ఎలాంటి ఆశలు పెట్టుకోవటానికే ఆస్కారమేమీ వుండదని నాకు తెలుసు. లూసీకి మనసులో నామీద ఒకవేళ మమకారం వున్నా - వున్నదని చెప్పటం లేదు - తండ్రిమీద లూసీకివున్న అనురాగం ముందు అది యేవిధంగానూ లాభం వుండదని నాకు తెలుసు'-

'అంటే ఈ విషయం చాలావరకు నా బాధ్యతమీద ఆధారపడి వున్నదంటావా?'

'అవును - లూసీని కాంక్షించుతున్న వారిలో యెవరిపక్షాన మీరు ఒక్క సుముఖమైనమాట చెప్తూతారో అతను కృతకృత్యుడౌతాడు. ఆ మాటకోసం లూసీ తన జీవితసర్వస్వాన్నీ ఆ విధంగా త్యాగంచేసి తీరుతుంది. కాని, అలాంటి మాట నా పక్షాన పలకమని మిమ్మల్ని కోరటంలేదు.'

'అలాంటిది నీవు నన్ను కోరవని నాకు తెలుసు - ప్రేమ చాలా విచిత్రమైంది. ప్రేమహృదయం ఈవిధంగా వుంటుందని అర్థం చేసుకోలేము - యే పరిణామాలకు దారితీస్తుందో ఊహించలేము - నిజానికి ఈ విషయంలో లూసీ సంగతి నేను ఆవంతేనా అర్థం చేసుకోలేకుండా వున్నాను. దాని మనస్సులో యేముందో భగవంతుడికే తెలియాలి.'

'ఈ సంగతి అడగవచ్చునో లేదో - లూసీని కాంక్షించుతున్నవారు...'

'ఇంకా యెవరేనావున్నారా అనేనా అడుగుతున్నావ్ - ఏమో ఎలా తెలుస్తుంది? ఇక్కడికి తరుచు వచ్చేవారిలో కార్టన్ ఒకడు - స్ట్రయివర్ ఒకడు - ఆ యిద్దరిలో ఏ ఒక్కరికేనా మనసులో, అలాంటి ఆపేక్షవున్నదేమో'

'ఉంటే యిద్దరికీ కూడా వుండొచ్చు'-

'అదిసరే - నువ్వు నావల్ల యేదో వాగ్దానం కావాలన్నావ్ - ఆ సంగతేమిటో తేల్చావు కాదు.

'మిమ్మల్ని నేను కోరేదల్లా ఒక్కటే - లూసీ యెప్పటికైనా తమ సముఖానికివచ్చి, ఇప్పుడు నేను చెప్పుకున్నట్టే, తన అభిప్రాయాన్ని వెల్లడించినప్పుడు, నామనస్సులో వున్న అభిప్రాయమేమిటో మీకు చెప్పాను గనక, ఆ మాటలు లూసీతో అనండి; నా మాటలలో మీకు సంపూర్ణమైన విశ్వాసం వున్నదని హామీ యివ్వండి; నాయందు సుముఖభావం వుంచండి; నాకు వ్యతిరేకంగా లూసీ మనసు మార్చటానికి ప్రయత్నించకండి - అంతకంటే మీరు నాకేమీ సహాయంచెయ్యమని కోరటం లేదు - ఇదే నేను మీనుంచి కోరుతున్న వాగ్దానం. ఏపద్ధతులకు లోబడి నేను ఈ వాగ్దానం మీ నుంచి తీసుకుంటున్నానో వాటికి కట్టుబడి వుండటానికి నేను సర్వదా సంసిద్ధుణ్ణయివున్నాను.'

'ఎలాంటి షరతులూ కోరకుండానే, వాగ్దానం చేస్తున్నాను. నీ సహృదయంమీద నాకు నమ్మకం వుంది. నాకూ నా బిడ్డకూ మధ్యవున్న అనురాగాన్ని పెంపుచేయటానికి ప్రయత్నించే ఉదారత నీలో వున్నదని నాకు నమ్మకమే; తన సుఖశాంతులకు నీ హృదయ బాంధవ్యం అవసరమని లూసీ నాతో అంటే - తప్పకుండా - లూసీని, నీ చేతిలో వుంచుతాను.'

డార్నే కృతజ్ఞతాపురస్సరంగా డాక్టర్ చెయ్యి పుచ్చుకున్నాడు.

'డార్నే! ఒక్కమాట చెబుతున్నాను విను - లూసీ యే పురుషుణ్ణైనా ప్రేమించితే - ఆ మనిషిమీద నాకుగాని ఇతరులకుగాని యెలాంటి అభిప్రాయాలున్నా అవన్నీ నేను పాటించను. లూసీ సౌఖ్యంకొరకు నేను ఏ త్యాగమైనా చేస్తాను - లూసీ నా సర్వస్వం - లూసీ సౌఖ్యం నా సౌఖ్యం, లూసీకోసం యే కష్టాలైనా భరించుతాను - ఏ అవజ్ఞతలైనా నెత్తి కెత్తుకుంటాను - ఏదేనా - సరిసరి ఇదంతా వెర్రిధోరణిగా మాట్టాడుతున్నాను.'

మాట్లాడుతూ మాట్టాడుతూ, చాలా చిత్రంగా ముడుచుకుపోయి మౌనం వహించాడు- డార్నే చేతిలోనుంచి తన చెయ్యి నెమ్మదిగా జారలాక్కున్నాడు. ఒక్కక్షణం అలా స్థబ్ధంగా ఊరుకుని మళ్లా స్మృహలోకి వచ్చి, చిన్ని చిరునవ్వు నవ్వుతూ డార్నే ముఖంలోకి చూచాడు.

'ఆఁ! అన్నట్టు యేవిటీ ఇందాక చెబుతున్నావూ?'

'నాయందు మీరు అలాంటి విశ్వాసం వుంచారుగనక నేను నా విషయంలో ఏవిధమైన దాపరికం లేకుండా సర్వం చెప్పి వుంచవలసివుంది. ప్రస్తుతం నేను యిక్కడ ఇంగ్లండులో మారుపేరుతో వుంటున్నాను. నే నెవరో, ఇక్కడ ఇంగ్లండులో యెందుకు వుండవలసివచ్చిందో చెబుతాను'-

'ఆగు చెప్పక్లర్లేదు!' - డాక్టర్ వారించాడు.

'మీ, నామధ్య ఏవిధమైన రహస్యాలూ వుండకుండావుంటే, మీకు నామీద సంపూర్ణమైన విశ్వాసం యేర్పడటానికి వీలౌతుందని ఆశించుతున్నాను.'-

'వద్దు - ఇప్పుడు వద్దు - నేను అడిగినప్పుడు చెప్పుదువు గాని - లూసీకీ నీకు మధ్య ప్రేమానురాగాలు పెరిగి వివాహం చేయవలసిన శుభదినం వచ్చిననాడు, ఆ ఉదయం చెబుదువుగాని అందాకా వద్దు - ఇది నీకు అంగీకారమేనా?'

'సరే!'-

డాక్టర్ డార్నే చేతిని ఆప్యాయంగా అందుకుని ఆశ్వాసించాడు: 'అమ్మాయివచ్చే వేళయింది - మనం యిద్దరం మాట్లాడుకున్నామని అమ్మాయికి తెలియడం మంచిదిగాదు- శుభం' వెళ్ళిరా?'

డార్నే, డాక్టర్ గారి యింట్లోనుంచి బయటికివచ్చేసరికే బాగా ప్రొద్దుగూకింది. తరువాత, మరోగంటకు గాని లూసీ యింటికి చేరుకోలేదు. ఇంట్లోకి అడుగుబెట్టీపెట్టడమే డాక్టరు చదువుకునే గదిలోకి పరుగెత్తింది. ఆయన కుర్చీలో లేదు.

'నాన్నా! నాన్నా!' అంటూ పిలిచింది.

సమాధానం రాలేదుగాని, డాక్టర్ పడకగదిలోనుంచి సుత్తి శబ్దం వినుపించుతోంది. పడకగది గుమ్మంలోకిపోయి లోపలికి తొంగిచూచింది: 'అయ్యో బాబోయ్! - ఇప్పుడేవిం

చెయ్యాలి?' అంటూ క్షణం కంగారుపడ్డది. మళ్లా మరుక్షణంలో ధైర్యం తెచ్చుకుని గది గుమ్మంలోకి వెళ్లి : 'నాన్నా!' అంటూ ఆప్యాయంగా పిలిచింది. లూసీ పిలిచిన మరుక్షణంలోనే సుత్తిధ్వని ఆగిపోయింది. డాక్టర్ నెమ్మదిగా బయటికి వచ్చేశాడు. ఇద్దరూ కలిసి ఇటూ అటూ మేడమీద కాసేపు పచారు చేశారు.

రాత్రి బాగా పొద్దుపోయింది. లూసీ తన పక్కమీదనుంచి దిగి తండ్రి పడకగదిలోకి వచ్చింది. ఆయన గుండెలమీద చెయ్యివేసుకుని నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ఆయనతాలూకు చెప్పులుకుట్టే సామాన్లు మూలనున్న బల్లమీద మామూలు మోస్తరుగానే చెల్లాచెదరుగా పడివున్నయ్.

19

సిడ్నీ! - మరొక పెగ్ ఇలా అందించు - ఈవేళ నీతో ఒక అతిముఖ్యవిషయం మాట్టాడవలసివుంది' అన్నాడు స్ట్రయివర్.

సిడ్నీ ఆ రాత్రి తెల్లవార్లూ, ఊపిరిసలవకుండా కాయితాల కట్టల్లో సదమదమౌతున్నాడు. ఆ క్రిందటి రాత్రికూడా అలాగే పనిచేశాడు. ఆ క్రితం రాత్రికూడా అలాగే పనిచేశాడు. అలా చాలా రాత్రులనుంచీ, వరసని నిద్రలేకుండా పనిచేస్తున్నాడు. కోర్టు సెలవులు నెత్తిమీది కొచ్చినై. ఈ లోగా వున్నపని యావత్తూ సీదా చేసెయ్యాలి. మళ్లా నవంబరులో తిరిగి కోర్టు తెరిచేవరకూ ఆ వంక చూడకుండా, వున్న బెడద యావత్తూ తీరిపోయింది.

ఈ బీభత్సకాండనంతా నిర్వహించటానికి సిడ్నీ ఒకదాని తరువాత ఒకటి ఎన్నో గ్లాసులు ఖాళీ చేశాడు. తీయకుండా తడి తువ్వాలు మాడుపట్టున అదిమిపట్టుకు కాలక్షేపం చేశాడు. ఆ వరసని ఆ రాత్రి అయిదారు గంటలు నిర్విరామంగా పని చెయ్యటంతో అతని శరీరస్థితి మొత్తంగా తుక్కుతుక్కయింది.

'ఇదిగో ఇటు చూడు భయ్యా! నీకో విచిత్రమైన సంగతి చెప్పపోతున్నాను - ఈ విషయం వింటే నీకు బలే ఆశ్చర్యమేస్తుందిలే! ఇంతవరదాకా నేను చాలా తెలివిగలవాణ్ణని అనుకుంటున్నావా లేదా? - అనుకుంటున్నావ్; ఈ మాట వింటే ఆ అభిప్రాయం పూర్తిగా మార్చుకుని వట్టి అజ్ఞానం వెధవనని తెలుసుకుంటావ్ - పెళ్లిచేసుకోవాలని సంకల్పం'-

'నువ్వా - పెళ్లి చేసుకుంటావా?'-

'అవును - డబ్బుకోసం కూడా కాదు - ఇప్పుడు చెప్పు నే నెలాంటివాణ్ణో.'

'అప్పుడే నా అభిప్రాయం చెప్పెయ్యదల్చలేదు - ఇంతకీ యెవరేవిఁటి ఆ కన్యారత్నం.'

'ఆలోచించు'-

'నాకు తెలిసినమనిషేనా!'

'ఆలోచించు'-

'అబ్బాయ్ యిప్పటికే తెల్లారిఝాము అయిదుగంటలు కావొచ్చింది - మెదడులోవున్న నరాలన్నీ ఊదరెత్తి ఎండు తాటాకుల్లా రెపరెపలాడిపోతున్నయ్ - ఇప్పుడు మళ్లా ఆలోచనలో పడాలంటే, ఈ వేళకు కందా యిక్కడే కొట్టాలిసొస్తుంది' అన్నాడు సిడ్నీ.

'అయితే నేనే చెబుతా నాగు' అంటూ స్ట్రయివర్ సిడ్నీకి చేరువలోవున్న కుర్చీలోకి వచ్చి కూర్చున్నాడు; 'సిడ్నీ! నువ్వు హృదయం గిదయం లేని దున్నపోతువు - ఈ సంగతి యెలా చెపితే నీకు బోధపడుతుందో నాకు అర్థం కావటంలేదు'-

'అయితే నీది మానవత్వం తొణికిసలాడిపోతున్న కవి హృదయం అంటావ్?'

స్ట్రయివర్ పకపకా నవ్వాడు : 'శృంగారఘట్టాల్లో ఆరితేరిన ఘటాన్ని కాదనుకో, అయినా నీకంటే కొంచెం రసార్ద్రమైన మనస్సుకలవాణ్ణి'-

'నీమీదైనా నీకు అలాంటి విశ్వాసముంటే - నిజంగా అదృష్టవంతుడివనే చెప్పాలి'-

'రసార్ద్రత అంటే యేవిఁటంటే..'

'శృంగారకాండలో దిగబోతున్నా నన్నావుగనక - అదో శృంగారనాయకుని లక్షణమనుకో' అని సిడ్నీ అందించాడు.

'సరే! పోనీ అలాగే అనుకుందాం - దాని అర్థమేవిటంటే : ఆడవాళ్లలో మెలిగేటప్పుడు నువ్వు శుద్ధ దున్నపోతులా సంచరించుతావు. నేను అలాకాదు. ఆడవాళ్లలో మెలిగేటప్పుడు కొంచెం వాళ్ల మనస్సుకు నచ్చేలా సంచరించాలనే జాగ్రత్తవుంది నాలో; కాస్త హావభావవిలాసాలు నటించి వాళ్ల హృదయాలను ఆకర్షించటానికి ప్రయత్నించే చాకచక్యంవుంది నాలో'

'సరే! అనంతర కథావిధానం ఉపక్రమించు?-

'అసలు నాకథ ఉపక్రమించే ముందు, నీ సంగతి చెప్పెయ్యాలి; నాకుమల్లేనే, నీవుకూడా డాక్టర్ మానెట్ ఇంటికి అనేక పర్యాయములు వచ్చావు. నిజానికి నాకంటే నువ్వే ఎక్కువగా వాళ్లింటికి తిరుగుతూవుంటావ్; వాళ్లింటికి వెళ్లినప్పుడల్లా నువ్వు అలా మాడుమొహం బెట్టుకు కూర్చోటంచూసి, యెంతో సిగ్గుపడిచచ్చే వాణ్ణనుకో; అసలు, సర్దాగా మాట్లాడటం చేతేగాదాయిరి. అస్తమానం యేదో కోపంగా వున్నట్టు మొహం ముడుచుకు మౌనంగా కూర్చుంటావ్; నీ గురించి, నామానానికి నేను, యెంతో సిగ్గుపడి చచ్చేవాణ్ణంటే నమ్ము'-

'అయితే మంచిపనే జరిగింది. ప్లీడరీవృత్తిలోవున్న నీ వంటివాడు యే వొక్క విషయంలోనైనా సిగ్గుపడటం అంటూ వుంటే నిజంగా చాలా ఆరోగ్యకరమైన విషయం ఇందుకు నువ్వు నాకు కృతజ్ఞత తెలుపవలసి వుంది'-

'అలా నువ్వు ఉటంకించి తప్పించుకోవటానికి వీల్లేదు - ఈ విషయం నీకు చెప్పితీరవలసిన బాధ్యత నామీద వుంది. నీ మొహం మీద అనేస్తాను. అలాంటి సమాజంలో మెలగటానికి తగిన బుద్ధికుశలత రవ్వంతేనా లేని వట్టి శుంఠవు; అకటావికటం మనిషివి'

సిడ్నీ మళ్లా ఒక పెగ్ బిగించి నిర్లక్ష్యంగా పకపకలాడాడు.

'ఇదిగో ఇటు చూడు సిడ్నీ! నలుగురిలోనూ మంచివాడనిపించుకోవలసిన అవసరం నాకంటే నీకు ఎక్కువుంది. నిజానికి అలాంటి అవసరం నాకేమీ లేదు. నాకేవింటి నేను స్వతంత్రంగా బ్రతకగలను. అయినా యిదంతా ఎందుకు చేస్తున్నానంటావ్?'-

'నువ్వు మంచివాడివనిపించుకోవటానికి ప్రయత్నించటం నేనెప్పుడూ చూస్తేనే' అన్నాడు సిడ్నీ.

'ఎందుకు ప్రయత్నించటం లేదు - తప్పకుండా ప్రయత్నించుతున్నాను - అలా ప్రయత్నించటం లౌక్యం - ప్రాపంచిక ధర్మం - అలా నడుస్తున్నాను గనకనే - జీవితంలో ముందుకు సాగిపోగలుగుతున్నాను -'

'సాగుతున్నావు బాగానే వుందిలే - నీ వివాహగాథాకథనం మాత్రం ముందుకు సాగటంలేదు - ఆ సంగతేవిఁటో చప్పున తేల్చుదూ - చంపుకుతినక - నా సంగతికేమొచ్చె - నేను మరమ్మతయ్యే దశ దాటిపోయిన రకమని నీకు తెలీదు గనకనా?'

'అలాంటి చెయ్యిమీరిన శుంఠవై కూర్చోటానికి నీకు హక్కులేదు.'

'హక్కు లేదులే-ఇంతకీ ఆ కన్యారత్నం ఎవరు?'-

'ఆ పిల్ల పేరు వింటే నువ్వేమి గతుకుతిని దించుకుపోతావో అని ఆలోచిస్తున్నాను. నీతో వచ్చిన గొడవేవిఁటంటే నువ్వు మనసులో ఒకటి బెట్టుకుని, బయటికి నాలుకకు తోచిందేదో అడ్డదిడ్డంగా మాట్లాడేస్తూ వుంటావ్. ఆ మాటల్ని బట్టుకుని నీ మనస్సులో ఏముందో తెలుసుకోటానికి వీల్లేదు; నిజంగా నువ్వన్నది మనస్ఫూర్తిగా అన్నమాటే అయినట్టయితే ఇందులో చిక్కేమీ లేదు. ఇంతకీ ఈ ఉపోద్ఘాతమంతా ఎందుకు చెబుతున్నానంటే - ఆ అమ్మాయిని గురించి నువ్వు ఓసారి చాలా చులకనగా మాట్లాడావు'-

'నేను చులకనగా మాట్లాడానా?'-

'మాట్లాడావు - మళ్ళీ మాట్లాడితే ఈ గదిలోనే మాట్లాడావు.'

'సిడ్నీ తనముందున్న సారా గ్లాసులోకి తొంగిచూచాడు. నెమ్మదిగా ఎత్తి గొంతులో పోసుకున్నాడు. సాలోచనగా స్ట్రయివర్ ముఖంలోకి చూస్తున్నాడు:'

ఆవిణ్ణి పట్టుకుని, బంగారుజుట్టు అతికించిన గుడ్డ బొమ్మన్నావ్. అనలేదూ?- మిస్ మానెట్ ఆ అమ్మాయి. నువ్వు అలా అన్నందుకు నిజంగా నాకు కోపం రావలసిందే- ఎందుకు రాలేదంటే నువ్వు అర్థంపర్థం లేకుండా వాగుతావని నాకు తెలుసు. చిత్రరచన విషయంలో ఓనమాలు కూడా తెలియని అవివేకి యెవడేనా నేను వేసిన చిత్రాన్ని విమర్శించాడంటే, దాన్ని లెక్క చెయ్యవలసిన పనేవిఁటి? సంగీతంలో, సాపాసాలు తెలియని అరసికు డెవడేనా నేను పాడిన బిలహరిరాగాన్ని వెక్కిరించాడనుకో, వాడి మాట లెక్కేవిఁటి?-

సిడ్నీ గుక్క తిరక్కుండా పెగ్ మీద పెగ్ ఎక్కిం చేస్తున్నాడు. అయోమయంగా స్ట్రయివర్ ముఖంలోకి చూస్తున్నాడు.

'అబ్బాయ్‌ం! విషయమంతా చెప్పేశాను. ఇదీ సంగతి. నేను డబ్బుకోసం ఆశపడదలచలేదు. ఆపిల్ల చాలా అందమైన మనిషి అదీ నా సర్దా; నాకు అలాంటి సర్దాలు అనుభవించదగిన యోగ్యతలున్నాయి. నేను జీవితంలో యేదో మార్గం అందుకుని స్థిరపడిపోయి, యింకా ముందుకు పోయే అవకాశంవున్నవాణ్ణి. కాస్తో కూస్తో యింత వున్నవాణ్ణి. ఆ అమ్మాయికూడా యింత సిరి సంపదలు అనుభవించటానికి తగిన యోగ్యతలున్న మనిషి. నావంటి వాడికి ఆ అమ్మాయిమీద మోజుకలగటం నిజంగా ఆ పిల్ల అదృష్టం - ఏం? ఇదంతా నీకు ఆశ్చర్యంగా వుందా?'-

'ఇందులో ఆశ్చర్యపడవలసిందేవిఁటి?'

'అయితే యీ వ్యవహారాన్నంతా నువ్వు ఆమోదించినట్లేనా?'

'ఆమోదించనని యెందు కనుకోవాలి?'-

'అయితే ఫరవాలేదు - నువ్వు యీ విషయాన్ని యింత చులాగ్గా తీసుకో గల్గువనుకోలేదు - చాలా యిదౌతావనుకున్నాను. మనకిద్దరికీ యేదైనా తట పటాయింపు కూడా వస్తే రావచ్చుననుకున్నాను. అయినా నేను యే విషయంలోనైనా ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత మాటల్తో వదిలెట్టేవాణ్ణి కాదనుకో! అవును, సిడ్నీ! ఈ ఘోటక బ్రహ్మచర్యంతో ప్రాణం విసుగెత్తిపోయింది. ఏదైనా కొంత మార్పు అవసరంగా తోస్తోంది. మిస్ మానెట్ చాకచక్యంగల పిల్ల; అందుచేత ఈ నిర్ణయానికి వచ్చేశాను. ఇక నీ విషయంలో ఒకమాట చెప్పవలసి వుంది. నువ్వు చాలా పెడమార్గంలో నడుస్తున్నావ్. నిజంగా చాలా తప్పుదుపంథాలో పోతున్నావ్. నీకు డబ్బువిలువ బొత్తిగా తెలీదు. నీ బ్రతుకంతా చాలా అస్తవ్యస్తంగా వుంది. ఇవాళో రేపో యేదో కుదుపుతిని మూలబడతావ్. దారిద్ర్యం చుట్టుకుని మంచంలో పడ్డావంటే ముఖంచూసేవాళ్ళుండరు. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి. నీకు ఆడసహాయం కావలసివస్తుంది. ముందుగా ఆలోచించు.'

సిడ్నీ సంరక్షక బాధ్యతంతా తన నెత్తినే వున్నవాడి ధీమాతో అదో పెద్దరికపు పోజుబెట్టి మళ్లీ ఉపక్రమించాడు.

'ప్రతి విషయాన్నీ వాస్తవిక దృక్పథంతో ఎదుర్కోవాలి. నాపద్ధతిని నేను వాస్తవిక దృష్టితో ఈ సమస్యను ఎదుర్కొంటున్నాను. నీ పద్ధతిలో నువ్వూ అలాగే ఈ సమస్యను పరిష్కరించుకోవాలి. నామాట విని పెళ్లి చేసుకో. నీ కష్టసుఖాలు ఆదుకోగల మనిషి నెవర్నైనా చూసుకో. ఆడవాళ్ళ విషయంలో నీ యిష్టానిష్టాలు వగైరా చెత్తవిషయాలన్నీ ఆలోచించకు. ఏదో ఒక కొమ్మపట్టుకో. కాస్త మర్యాదగల ఆడదాన్ని చూడు. కాస్తోకూస్తో చేతిలో పైసా వున్నదైతే నయం. ఏ హోటలు యజమానురాల్నో చూడు. పెళ్ళి చేసుకో!- కష్టకాలానికి ఆసరా అవుతుంది. అదీ నీకు కావలసింది; ఆలోచించు'-

'సరే! చెప్పారుగా సలహా! - ఆలోచిస్తాను'-

20

స్ట్రయివర్ డాక్టర్ కూతురుకు అదృష్టం పట్టించటానికి కృత నిశ్చయుడై సెలవులకు తాను ఊరికి వెళ్లిపోయేముందే ఆ శుభవార్తను ఆ అమ్మాయికి తెలియజేసి వెడదామనుకున్నాడు. సెలవులకుముందే, ప్రాథమిక వ్యవహారాలన్నిటినీ తేల్చివేస్తే, అనంతరం ఏ క్రిస్టమస్ పండగల్లోనో పాణిగ్రహణశుభోత్సవం యేర్పాటు చెయ్యవచ్చుననుకున్నాడు.

తన విషయంలో తనకు యెలాంటి సందేహమూ లేదు. అవతలపక్షం నుంచి అంగీకారం రాదనే సందేహమే లేదు. అందుచేత సెలవలివ్వగానే ఆ కార్యక్రమానికి ఉపక్రమించాడు.

మొదటిది మిస్‌మానెట్‌ను తనతోపాటు, "వాక్సుహాల్ గార్డెన్సుకు" వాహ్యాళికి రావలసిందని కోరాడు; అది పారలేదు. పోనీ రానిలాకు రమ్మన్నాడు. అదీ పారలేదు. చిరాకెత్తింది. డాక్టర్‌యింటికి వెళ్లి ముఖాముఖి ఢంకాబద్దలుకొట్టి సంగతి చెప్పెయ్యాలనుకున్నాడు. సోహోకు వెడుతుండగా మధ్యేమార్గంలో టెల్‌సన్సుబ్యాంకు తగిలింది. బ్యాంకుసైనుబోర్డు చూసేసరికి దాన్లో పనిచేస్తూవుండే లారీ, డాక్టర్ మానెట్ కుటుంబానికి మిత్రుడనే సంగతి ఆయనకు జ్ఞాపకం వచ్చింది. ముందుగా యీ వార్తను ఆయనకు తెలియజెయ్యాలనుకున్నాడు. తలుపు తోసుకుని లోపలికి వెళ్లాడు. స్ట్రయివర్ లోపలికి వెళ్లేసరికి లారీ, రూళ్ళపుస్తకాలు ముందు వేసుకుని సదమదమవుతున్నాడు.

'ఏవండోయ్! - కులాసా?' అన్నాడు స్ట్రయివర్.

'చిత్తం; తమకు క్షేమమేనా అండి?' అంటూ చెయ్యి అందించాడు.

మామూలు పరామర్శలు పూర్తి అయినతరవాత: 'ఏదో పనిమీద దయచేసినట్టున్నారు?' అన్నాడు లారీ, వ్యాపార ధోరణిలో.

'బ్యాంకు వ్యవహారంకాదులెండి - మీతో ఒక ముక్క ప్రయివేటుగా మాట్లాడాలి- స్వవిషయం.'

'ఓహో! అలాగే అండీ?' అంటూ ముందుకు వంగి చెవి దోరబెట్టాడు. స్ట్రయివర్ కొంచెం బల్లమీదికి వంగి, మందర స్వరంలో అన్నాడు : 'నేను యిప్పుడు డాక్టర్ గారి యింటికి వెడుతున్నాను. వాళ్ళమ్మాయిని పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాను. ఈ విషయం స్వయంగా ముఖాముఖి చెప్పెయ్యాలని వెడుతున్నాను.'

'ఆc! - ఏవిcటీ!' అంటూ, లారీ స్ట్రయివర్ ముఖంలోకి అదోలా విభ్రాంతుడై చూచాడు.

స్ట్రయివర్ కుదుపు తిన్నాడు : 'ఏవిcటి అంత దీర్ఘం తీశారు? ఏవిcటి మీ ఉద్దేశం?'-

'నా ఉద్దేశమా అండీ - మంచి సదుద్దేశం - నిజంగా మీరు అభినందించగల ఉద్దేశం. కాని - నిజానికి, స్ట్రయివర్ గారూ!- మీకు తెలుసు - ఈ విషయంలో, నిజానికి చాలా వుంది?'-

'మీరు మాట్టాడుతున్న దేవిcటో నాకు ఒక్కముక్క అర్థం కావటంలేదు.'

లారీ సమాధానం చెప్పలేదు. తాపీగా నెత్తిమీద విగ్గు సరిచేసుకుని చేతిలోవున్న కలంపుల్ల చివరను కొరుకుతూ కూర్చున్నాడు.

'ఏవిcటి? యింతకీ నాకు తగిన యోగ్యత లేదంటారా?'-

'ఆc! - హే! - అవును - మీరు యోగ్యులే - యోగ్యతల మాటకొస్తే - ఆc!- తప్పకుండా యోగ్యులు!'

'కలవాణ్ణి కాదంటారా?'-

'అయ్యయ్యయ్యో! - ఎవరంటారు అలాంటి మాట?'

'మరి ఇక మీకున్న అనుమానమేవిcటి? ఇంతకీ మీ అభిప్రాయ మేవిcటి?'

'సరే! - సరేననుకోండి - ఇప్పుడు మీరు అక్కడికి వెడుతున్నారా?'

'ఏకా ఎకి'-

'నే ననేదేవిcటంటే - మీరేదో వెడుతున్నారుగాని - మీరే నేనయినట్టయితే, నేను వెళ్ళేవాణ్ణి గాదు సుమండీ'

'ఏం? ఎందుకు వెళ్లకూడదు - కారణం ఏవిcటి?'

'ఎంచేతనంటే - మనం యేపనిమీదనేనా బయలుదేరుతున్నామంటే దాన్లో మనకు విజయం కలుగుతుందని యే రవ్వంతేనా ఆశ అనేది వుండాలి.'

'అంటే?'-

'అంటే ఆ అమ్మాయితో ఈ వ్యవహారం ఫొక్తుపడుతుందనే ఆశ ఇంతో అంత వుండాలి - ఇంతకీ - చూశారూ - ఈ వ్యవహారమంతా ఆ పిల్ల యిష్టానిష్టాలమీద ఆధారపడివున్న విషయం గాదుటండీ'-

'ఏవిఁటి ఇంతకీ నీ అభిప్రాయం? - అది మెదడులేని వట్టిదద్దమ్మంటావా యేవిఁటి?'

లారీ ముఖం కందగడ్డలా ఎర్రబడిపోయింది.

'అది కాదనుకోండి!- కాని నేను మీకు చెప్పదలచిందేవిఁటంటే - ఆ అమ్మాయిని గురించి అవకతవకల వాగుడేదీ నేను వినదలచలేదూ అని - ఈ బల్లదగ్గిర నుంచుని, నాలిక దగ్గిర బెట్టుకోవటం చేతగాకుండా లూసీని గురించి ఎవ్వడు వాగినా వాడికి నా తడాఖా చూపించటానికి ఎన్నడూ వెనకాడనూ అని - వింటున్నారా?- అదీ నేను మీకు చెప్పదలచింది.'

ట్రయివరకు కాళ్ళూ చేతులూ శీతలించినై. గబుక్కున తగ్గి బిక్కమొహంవేసి: 'ఇదంతా నాకు చాలా విచిత్రంగావుంది లారీగారూ? - నేను బార్లోకల్లా పెద్ద వకీలును- ఇలాంటివాణ్ణి - నేను ఈ సంబంధానికి దిగివస్తే, మీరు నన్ను డాక్టర్ యింటికి వెళ్ళొద్దని యెందుకు సలహా యిస్తున్నారో, నాకు బోధపడటం లేదు.

'ట్రయివర్ గారూ యీ విషయంలో మీరు నా సలహాను అపేక్షించుతున్నారా?'

'అవును'-

'శుభం - అలాగైతే సలహాయిస్తున్నాను - మీరు వెళ్ళొద్దు' -

'ఇదంతా చాలా విచిత్రంగా వుంది'

'ఇక చెబుతా వినండి! నేను కాస్తో కూస్తో జీవితానుభవం వున్న ముసలివాడిని. ఆ ఇంత పసికందుగా వుండగా ఆ అమ్మాయిని ఈ చేతులతో ఇక్కడికి తీసుకొచ్చాను. ఆ తండ్రికీ బిడ్డకీ కూడా నాకంటే ఆప్తులైనవారు మరొక రెవరూ లేరు. ఆ యిద్దరిమీదా నాకు ఎంతో వాత్సల్యమున్నదని కూడా మీకు తెలుసు. యిప్పుడు చెప్పండి నే నిచ్చిన సలహా మంచిదికాదనటానికి వీలుందా?'

'మీ సలహామంచిదే కావచ్చు - క్షమించండి'-

'మరేం ఫరవాలేదు - నేను ఎందుకు చెబుతున్నానంటే - ఇలాంటి విషయాల్లో ముందు కొంత యేదో ఆశ కనుపించంది, ఉభయపక్షాలూ ముఖాముఖి తారసిల్లటం మంచిదికాదు. తీరా మీరు అడిగితే వారు కాదంటారనుకోండి. అప్పుడు మీ మనసుకు కష్టంగా వుంటుంది. అలాంటి ముక్క మీముఖాన చెప్పవలసివస్తే డాక్టర్ గారికీ కష్టంగానే వుండవచ్చు. ఆ కుటుంబంలో మనిషినిగా వుంటున్న వాణ్ణిగనక, మీకు అంగీకారమైతే, నేను స్వయంగా వెళ్లి ఈ విషయం వాళ్ళని కదలేస్తాను. వాళ్ల అభిప్రాయం ఎలా వుందో వచ్చి మీకు తెలియజేస్తాను - ఏవంటారు?'-

'సెలవులకు పోకుండా - ఈ నగరంలో యింకా ఎన్నాళ్లుండమంటారు?'

'ఎబ్బెబ్బే! ఎంతో వ్యవధి అవసరంలేదు రెండుమూడు గంటల వ్యవధిలో తేల్చేసి స్వయంగా మీ గృహానికివచ్చి, తాడూ బొంగరం తేల్చి చెప్పేస్తాను.'

'సరే! వప్పుకున్నాను - రాత్రికి ఏ సంగతీ చెప్పించండి వెళ్లొస్తాను - సెలవు.' ట్రయివర్ వెళ్లిపోయాడు. ఆ రాత్రి పది గంటలయ్యేసరికి, లారీ ట్రయివర్ ఇంటికి వచ్చాడు. మామూలు పరామర్శలు పూర్తిఅయిన తరువాత లారీ నెమ్మదిగా ఉపక్రమించాడు:

'నేను డాక్టర్ గారి యింటికి వెళ్ళొచ్చాను'-

'వెళ్ళొచ్చారూ?- పండా కాయా?-

'నేను యిచ్చిన సలహా మంచిదేనని ఇప్పుడు నాకు బాగా నమ్మకం కలిగింది?'

'నేను చాలా విచారిస్తున్నాను - ఇందులో నాకు వచ్చిన నష్టమేమీ లేదనుకోండి- ఇలాంటీ సదవకాశం జారవిడుచుకున్నందుకు ఆ కుటుంబం చిరకాలం పస్తాయించవలసి వస్తుందని నా విచారం - సరే ఈ విషయం ఇక మనం విచారించాల్సిన పనిలేదు' అన్నాడు ట్రయివర్ అదో దర్జాగా.

'మీ అభిప్రాయమేవిఁటో, నాకు బోధపడలేదు.'

'ఏవుందండీ! వాళ్ళేదో తెలివిగలవాళ్ళనుకున్నాను. ఆడవాళ్ళు ఇలాగే తెలివితక్కువ పనులు చేస్తూ వుంటారు. దారిద్ర్యం అనుభవించేటప్పుడు తరువాత పస్తాయిస్తారు. నేనేదో లేనిపోని ఉదారతలకు పోయాను. ఈ సంబంధంవల్ల నిజానికి నాకు కలిసివచ్చే దేవిఁటండి? ఇంకా నయం వెళ్లి అడిగి లేదనిపించుకున్నానుగాదు. నలుగురిలో తలెత్తుకు తిరిగే ఆస్కారం వుండేదికాదు. బతికించారు. ఈ ఆడపిల్లల తలతిక్కలు ఇలాగే వుంటై. మీ సలహాకు కృతజ్ఞుణ్ణి.

లారీ సెలవు తీసుకుని వీధిలోకి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. ట్రయివర్ సోఫామీద పడుకుని ఆకాశంవంక చూస్తూ గోళ్ళు కొరుక్కుంటున్నాడు.

21

సిడ్నీ కార్టన్ తనజీవితంలో యెప్పుడేనా యేతావునన్నా ప్రకాశించాడో లేదో మనకు తెలియకపోయినా, డాక్టర్ మానెట్ యింట్లోమాత్రం యేనాడూ ప్రకాశించలేదని మాత్రం స్పష్టంగా చెప్పొచ్చు. అక్కడికి తరుచు వెడుతూనే వుండేవాడు. కాని యెప్పుడు చూసినా అదేపద్ధతిని నిద్రమొహంవేసి, ఏదో విచారంగా వున్నట్టు మందకొడి మనిషిగా కునికిపాట్లు పడటం మినహా సర్దాగా వుండటం ఎన్నడూ లేదు. ఏదైనా విషయం మాట్టాడదలిచినప్పుడు బాగానే మాట్టాడేవాడు. కాని అతను ఉత్సాహం తీసుకుని సర్దాగా మాట్లాడ్డమనేదే అరుదు. కాని, ఆ యిల్లన్నా ఆ వీధి అన్నా, ఆ బాటలోవున్న మూగరాళ్లన్నా అతని కేదో ఒక ఆకర్షణ వున్నట్టే కనుపిస్తుంది. రాత్రిళ్లు పిచ్చివాడులా ఆ వీధిలో ఇటూ అటూ ఎందుకో తిరుగాడుతూ వుండేవాడు. మధుపానంతో మైమరిచిపోవటానికి వీలు లేనప్పుడల్లా, రాత్రిళ్లు ఆ వీధుల్లో పిచ్చివాడులా తిరుగుతూ కాలక్షేపం చేస్తూవుండేవాడు.

ఒకనాడు, ఇలానే, పనీపాటా యేమీ లేకుండా వీధులవెంట తిరుగుతూండగా సిడ్నీకి నస్సులో యేదో ఒక అభిప్రాయం హఠాత్తుగా తోచింది. సరాసరి డాక్టర్ మానెట్ యింటికి చ్చేశాడు.

అతను మేడమీదికి వచ్చేసరికి, లూసీ, తన గదిలో ఒంటరిగా కూర్చుని యేదో నిచేసుకుంటోంది.

సిడ్నీతో కాలక్షేపమంటే యేమనిషికీ అంత సర్దాగా వుండదు. లూసీకీ అంతే; కొంత గజాటుపడుతూనే, అతనికి ఆహ్వానమిచ్చింది. కాని, మామూలు కుశలప్రశ్నలు సడుపుతూ కరి ముఖంవంక ఒకరు చూచుకోవటంలోనే, అతని మొహంలో లూసీకి యేదో ఒక మార్పు కనుపించింది.

'కార్టన్‌గారూ! అలా వున్నారేం, వంట్లో కులాసాగా లేదా?'-

'లేదు - అయినా నేను జీవితాన్ని నడుపుకొస్తున్న పద్ధతిలో, ఆరోగ్యం సరిగా వుండటానికి ఆస్కారం యెక్కడుంది? నావంటి దుర్నడతలు నడిచేవాడు ఇంతకంటే బాగా ఎలా వుంటాడు?'-

'క్షమించండి! - తెలివితక్కువగా ఒకమాట అడుగుతాను - ఇంతకంటే కొంచెం మంచి మార్గంలో నడవలేకపోవటం విచారకరమేమో?'-

'సిగ్గుబాట్ల పని కాదని యెవరంటారు?'

'మరి, యెందుకు మార్చుకోగూడదూ?'-

ఆ మాట అంటూ నెమ్మదిగా తలపైకెత్తి అతని ముఖంవంక చూచింది. అతని కనుకొలకులవెంట కన్నీరు దిగజారుతూ వుండటం చూచి గాబరాపడ్డది. అతని కంఠంలోకూడా దుంఖః కళవళించుతోంది.

'లాభంలేదు - నేను బాగుపడేదశ దాటిపోయింది. నేను బాగుపడగలగటం అసంభవం; ఇంకా ఇంతకంటే నానాటికి దిగజారి అధోగతికావటం మినహా మరో గత్యంతరం లేదు.' అన్నాడు.

అరచేతుల్లో ముఖం కమ్మేసుకుని, మోచేతులు బల్లమీద ఆనుకుని మౌనంగా కూర్చున్నాడు. ఆ గంభీర నిశ్శబ్ద విరామంలో బల్ల గజగజా ఒణికిపోతోంది.

అతను అంతయిదిగా వుండటం లూసీ యెప్పుడూ చూళ్లేదు. అతన్ని చూస్తుంటే లూసీకి పేగులు తరుక్కుపోతున్నయ్. అలా కళ్లుమూసుకుని వుండే అతను లూసీ మనస్థితిని అర్థం చేసుకున్నాడు.

'క్షమించు లూసీ - నేనేదో చెప్పదలిచి, ముందుగానే కుదబడిపోతున్నానల్లే వుంది- నేను ఒకటి చెప్పబోతున్నాను; వింటావా?'

'తప్పకుండా వింటా సిడ్నీ - అందువల్ల నీకు ఏమాత్రం శాంతి లేశం కలుగుతుందన్నా, ఎంతో ఆనందించుతాను కూడా.'

'ఎంతో జాలిపేగులుగల స్త్రీవి; భగవంతుడు నిన్ను ఆశీర్వదించుతాడు.'

అతను నెమ్మదిగా ముఖంమీదినుంచి చేతులు విప్పుకుని నిబ్బరంగా మాట్లాడుతున్నాడు.

'నేను చెబుతున్న యీ విషయాలు విని గాబరాపడకు - నేను యౌవ్వనదశలోనే మరణించిన వ్యక్తిగా వున్నాను. నా జీవితమంతా ముగిసిపోయినట్టే.'

'అలా అనకు సిడ్నీ; నీకు ముందు ముందు తప్పకుండా మంచిరోజులు వస్తయ్. తప్పకుండా యింతకంటే యెంతో గౌరవంగా బ్రతకనున్నావ్.'

'నిన్ను నా జీవితంలో యెన్నటికీ మరిచిపోలేను'-

లూసీ కంగారుగా వణికిపోతోంది.

'ఒకవేళ నాప్రేమను నువ్వుకూడా ఆదరించావే అనుకో - అందువల్ల వచ్చే ప్రయోజనమేమీలేదు - ఆ సంగతి నాకు స్పష్టంగా తెలుసు; నేను తప్పదాగి, జీవితాన్నంతా చెరుపుకున్న వ్యర్థుణ్ణి - ఇతరుల ప్రయోజనాలకు తప్ప, నాకుగా నేను ఎందుకూ పనికిరాకుండా జీవితాన్నంతా వ్యర్థం చేసుకున్న దౌర్భాగ్యుణ్ణి; మొత్తంగా నాశనమైపోయాను. ఈ స్థితిలో నీవు నాకు చేయి ఆసరాయిచ్చి నిలబెట్టాలని చూస్తే, నిన్ను కూడా నాతోపాటు నరకకూపంలోకి దిగలాగి పారేస్తాను, దారిద్ర్యంలోకి క్రుంగదీస్తాను. అవమాన పరంపరల అఖాతంలోకి యీడ్చుకుపోతాను. ఈ సంగతి నాకు బాగా తెలుసు; నీకు నాపట్ల యెలాంటి మమకారమూ లేదని నాకు తెలుసు; అలాంటిది వుండాలని కూడా నేను వాంఛించటం లేదు. పైగా అలాంటిది లేనందుకు లోలోపల యెంతో సంతోషించుతున్నాను.'

'అలాంటిది ఏమీ లేకుండా మరోవిధంగా నీకు నేనేమీ సాయపడలేనా సిడ్నీ - నిన్ను మానవలోకంలోకి తిరిగి చేదుకోలేనా? - క్షమించు - నిన్ను మంచిమార్గంలోకి తిప్పుకోలేనా? నీకు నాపట్ల వున్న ఈ విశ్వాసానికి, యేవిధంగానూ ప్రతి విశ్వాసం చూపుకునే సావకాశం నాకు లేదా? - యీ విషయాన్ని నువ్వు మరొకరితో చెప్పవని నాకు తెలుసు - మనలో మన ఆంతర్యం మాటగా అడుగుతున్నాను - నీకు మేలు కలిగేవిధంగా, నేను చేయగలదేమీ లేదా?'-

'లేదు - లేదు లూసీ అలాంటి అవకాశమేమీలేదు, ఇప్పుడు నేను చెబుతున్న ఈ నాలుగుముక్కలూ నువ్వు వినగలిగితే అక్కడికి నీవు నాకు చేయగలిగిన ఉపకృతి యావత్తూ చేసినట్టే; ఒక్క విషయం నీకు తెలిసివుంటే నాకు చాలు. నేను మామూలుగా కలలుగనేవాణ్ణి కాదు. నా జీవితానికల్లా కలగంటున్నది నీఒక్కమూర్తినే. నాలో మానవత్వం నశించి పతితుణ్ణయిపోయినమాట నిజమే; అయినా నీఉజ్వలమూర్తిని అభినందించగల మానవత్వలేశం నాలో మిగిలింది. నీ తండ్రి ప్రక్కను నీవు సంచరించుతున్న వైఖరి నన్ను ఆకర్షించింది. నీవు నిర్మించిన ఈ ప్రశాంతగృహ వాతావరణం, నాలో యేనాడో నశించిపోయిన తీపి తలపుల నీడలనెన్నిటినో నిద్రలేపి మేల్కొలిపింది. ఆ తీపి తలపులు నన్ను ఈ అఖాతంలోనుంచి పైకి రమ్మని గుసగుసగా పిలుస్తున్నట్టు తోచింది. నాలో పైకి పెగుల్చుకు రావాలనే, చిన్ని చిన్ని ఆవేశాలు రేఖలుగా అంకురించినై. అవన్నీ చాలా బలహీనమైన చైతన్యరేఖలు. అదంతా వట్టి కలమోస్తరు. కల అంతంకాగానే, మళ్లా మనిషి మామూలు పూర్వంమనిషిగానే వుండిపోతాడు. కాని నాలో అలాంటి కలలను సృష్టించినదానివి నువ్వే!- ఇది నువ్వు తెలుసుకోగలిగితే అంత వరకు నాకు చాలు!'

'ఆ కలలో కొంత గాకపోతే కొంతైనా నిల్వరించుకోలేవా? మళ్లా అదే కలగను సిడ్నీ- మళ్ళీ ప్రయత్నించు.'

'లేదు లూసీ - ఆ కలగంటున్నంతసేపూ కూడా నా స్థితి నాకు అర్థమౌతూనేవుంది. ఆ స్థితికి నేను అనర్హుణ్ణని నా మనసు నాకు చెబుతూనే వుంది. అయినా నాలో వున్న బలహీనత యేమిటంటే : ఇంతా తెలిసివుండి కూడా నీతో ఈ విషయాన్ని చెప్పకుండా వుండలేకపోయాను. సొంతం చల్లారి బూడిదగుట్టలా వున్న నాలో ఈ అగ్నిని ప్రజ్వరిలచేసింది నీవేనని చెప్పకుండా వుండలేకపోయాను. కాని ఇవన్నీ వట్టి వ్యర్థమైన తాటాకుమంటలు : నా తత్వం వాటికి కూడా సంక్రమించింది. ఈ జ్వాలలు నాఅంతటికి నాకుగాని యితరులకు గాని ఉపకరించేవి కాదు. అలా వ్యర్థంగా మండిమండి ఆరి నశించిపోవటం మినహా వీటికి మరో ప్రయోజనమేమీ వుండదు.'

'నన్ను చూడకపూర్వం కొంత గాకపోతే కొంతైనా శాంతిగా వుండేవాడివేమో - నిన్ను మరింత దుఃఖంలోకి పడలాగాను సిడ్నీ - ఎంతేనా దురదృష్టవంతురాల్ని.'

'అలా అనవద్దు లూసీ - నేను బాగుపడటానికి ఏమాత్రం సావకాశమున్నా నీవు నాకు తప్పకుండా పునర్జన్మ నివ్వటానికి ప్రయత్నించి తీరేదానివి. నీ ఉదారత నాకు తెలుసు. నేను మరింత దిగజారిపోతే అందుకు నీవెప్పుడూ బాధ్యురాలివికాదు.'

'సిడ్నీ ఒక్కమాట అడుగుతాను చెప్పు - నేను నీలో ఏదో ఒక చైతన్యరేఖను ప్రభవింప చేశానని అన్నావ్ - అలానే నాలో వున్న యేశక్తినైనా ఉపయోగించి నీకు ఉపకారం చెయ్యలేనా?'

'నా హృదయాన్ని విప్పి నీయెదట చెప్పుకునే అవకాశం యిచ్చావు - ఇది చాలు- పతితుణ్ణయిపోయిన నాపట్ల నీ మనస్సులో జాలి వున్నదనే ఒక్క సంతృప్తి నాకు చాలు.'

'నామాట విను సిడ్నీ అలా దించుకుపోకు - నీలో అనేకమైన ఉత్తమ గుణాలున్నయ్- ప్రయత్నించితే తప్పకుండా పైకి లేవగలవు - నామాట నమ్ము'-

'నా సంగతి నాకు తెలుసు లూసీ - పాపం నీ మనస్సును క్షోభ పెడుతున్నానల్లే వుంది. త్వరగా ముగించేస్తాను. నా మనస్సులో వున్న ఈ రహస్యాన్ని నీ అమాయక హృదయంలోవుంచి వెడుతున్నాను - నీవు నన్ను కనికరించుతున్నావంటే ఏదో ఒక సంతృప్తి నాకు కలుగుతోంది. అందుకోసం నీ ముందు నా హృదయం విప్పి చెప్పుకున్నాను. ఈ రహస్యాన్ని యెప్పటికీ యెవ్వరికీ చెప్పనని వాగ్దానం చెయ్యి'-

'అందువల్ల నీకు ఆత్మశాంతి కలుగుతుందంటే - ఎన్నటికీ యెవ్వరికీ చెప్పను'

'నీ హృదయంలో హృదయమైన పరమ సన్నిహితుడికి కూడా చెప్పకూడదు.'

'సిడ్నీ ఎందుకంత అపనమ్మకం - ఈ రహస్యం నీది గాని నాదికాదు - నీ రహస్యాన్ని గౌరవిస్తాను - వాగ్దానం చేస్తున్నాను.'

'భగవంతుడు నిన్ను ఆశీర్వదిస్తాడు - వెళ్లొస్తాను.'

లూసీ అరచేయి పెదవులకు హత్తుకుని, లేచి, ద్వారంవేపు నడుస్తున్నాడు.

'ఈ ప్రసక్తి మళ్లా యెప్పుడేనా ఎత్తుతానేమో అనుకోకులూసీ! ఎన్నడూ ఈ ప్రసక్తి మళ్లా రాదు. నే నిప్పుడు వెంటనే మరణించితే ఈ రహస్యం ఇక్కడితో ఎలా అంతరించిపోతుందో, అలాగే అంతరించిపోయిందనుకో - నీతో ఈ కాసేపూ ముచ్చటించటంవల్ల కలిగే ప్రయోజన మేమిటంటే - నాకు మృత్యువు ఆసన్నమైనప్పుడు. నా పతితహృదయంమీద నీ మనస్సులో జాలివున్నదనే మనశ్శాంతితో ప్రాణాలు విడుస్తాను.'

ద్వారంలోనుంచి నిష్క్రమించబోతున్న ఆ దీనమూర్తిని చూసి, లూసీ పేగులు బాధగా కోసుకుపోయినై. అరచేతిలో ముఖం కమ్మేసుకుని వలవలా యేడిచింది. అతను వెనక్కు తిరిగిచూచాడు:

'కలవరపడకు లూసీ! అలాంటి కరుణకు పాత్రుణ్ణి కాదగిన యోగ్యతలేవీ నాలో లేవు. ఒకటి రెండు గంటల్లో నీచాతినీచంగా సంచరించుతూ, నీచాతి నీచులైన లోఫర్లతో కలిసి తప్పదాగి తూలుతూ నేను బజార్లవెంట తిరుగుతుంటే, అలాంటి జాలికీ, కరుణకు పాత్రుణ్ణి కాదని తెలుసుకుని విస్తుపోవలసి వస్తుంది. నాకోసం అలా బెంబేలుపడకు. కాని నా మనస్సులో నీ మూర్తి యెప్పుడూ మెసులుతూనే వుంటుంది. ఈ సంగతి ఒక్కటీ జ్ఞాపకం బెట్టుకోమని మాత్రం కోరుతున్నాను.'

'తప్పకుండా జ్ఞాపకం బెట్టుకుంటాను సిడ్నీ'-

'మరొక తుదిమాట చెప్పిపోతాను - ఈనాటితో నీ సముఖానికి రావటం మానివేస్తున్నాను. ఇది ఇప్పుడు చెప్పటం అప్రస్తుతమైనా నా మనస్సు చెప్పమంటోంది చెబుతున్నాను. నీ కోసం, నీ హృదయానికి ప్రియతముడైన వ్యక్తికోసం నేను ఏ త్యాగమైనా చెయ్యగలను. నా జీవితంలో అలాంటి అదృష్టలేశమేదైనా వుండి, నాకు అలాంటి త్యాగం చెయ్యగల సావకాశం లభిస్తే మీ కోసం అమిత ఆనందంతో నేను మృత్యువును ఆలింగనం చేసుకుంటాను. నీవు ఆనందంతో ముగినితేలుతున్నప్పుడు అప్పుడప్పుడు కాస్త నన్ను జ్ఞప్తిలో వుంచుకో - నీకు ప్రేమ పాత్రుడైన వ్యక్తిని రక్షించటానికి తన ప్రాణాన్ని త్యాగం చెయ్యగల వ్యక్తి ఒకడున్నాడని అనుకో - సెలవు' - అతనిపాదాలు ద్వారంలోనుంచి బయటనున్న అంధకారంలోకి నడిచిపోయినై.

22

టెల్‌సన్సు బ్యాంకీ గేటుముందు ముక్కాలిపీటమీద బైఠాయించి కూర్చున్న క్రంచర్‌కు దినదినం అనేక దృశ్యాలు కంటబడుతూ వుంటై. ఫ్లీట్‌స్ట్రీట్ వెంట, తూర్పునుంచి పడమరకూ, పడమర నుంచి తూర్పుకూ ఎడతెగని ప్రవాహాలుగా ప్రజలూ, బళ్ళూ బట్రా సాగిపోతూవుంటై. ఒకనాడు, యిలాగే, క్రంచర్, గడ్డిపరకలు కొరుక్కుంటూ ముక్కాలిపీటమీద కూర్చునున్నాడు, రోడ్డుమీద పోయే ప్రవాహాలవంక చూస్తూ; అతని కొడుకు జర్రీ, జీబుతలా - వాడూ, పక్కనే నిల్చునున్నాడు. అలా చూస్తూ వుండగా దూరాన్నుంచి యేదో ఉత్సవం వస్తూన్నట్టు క్రంచర్ పరికించాడు. శవపేటికను ఊరేగిస్తూ భూస్థాపనకు చర్చికి తీసుకుపోతున్నారని తెలుసుకున్నాడు. ఆ శవోత్సవం జరగటం ప్రజాసమూహానికి యిష్టంలేక అడ్డుతగుల్తున్నారు. అందుచేత, అత్యంత కోలాహలంగా వుంది.

'ఒరేయ్ జర్రీ!' అన్నాడు క్రంచర్ కొడుకువంక చూసి, 'ఏదో శవం వత్తావుందల్లే వుందిరా?'

'ఓరి బల్లే!' జర్రీ ఎగిరి గంతువేశాడు.

అలా ఎందుకు అరిచాడో జర్రీకే తెలీదు. ఆ గావుకేక విని క్రంచర్‌కు వళ్లు మండింది. గూబ కురికి ఒక్కటి పుచ్చుకున్నాడు.

'ఏంటిరా బాడఖావ్ - ఏందా కేకా?'

'నేనేం జేశానయ్యా!'

'జన్మలో మళ్లీ ఎన్నటికీ అట్టా కేక బెట్టమాక!'

కుర్రాడు తండ్రిమాట శిరసావహించాడు. ఇంతలోనే ఆ ఉత్సవందగ్గిరి కొచ్చింది. శవపేటిక వున్న బండిచుట్టూ చేరి జనం, కేకలూ, బొబ్బలూ పెట్టేస్తున్నారు. ఆ శవానికి సంబంధించిన ఒకే ఒక దుఃఖార్తుడు శవపేటికప్రక్కను బండిలో కూర్చునున్నాడు. సంతాపసూచకంగా అతను నెత్తికీ దండ చేతులకు కట్టుకున్న నల్లగుడ్డ పీలికల్ని జనం మీదబడి పీకేస్తున్నారు. దోవనుబోయే జనమంతా ఆ కోలాహలంలో జేరి మరింత రభస పెరగటంతో అతని పని మరింత ఉక్కిరిబిక్కిరైపోయింది. 'గూఢచారులంట! యెదవనాయాళ్ళు!' ఈ వరసని సాగించి మోటతిట్లన్నీ తిడుతూ జనం బండిమీదికి యెగబడ్డారు.

అసలు మామూలుగానే, శవోత్సవాలంటే క్రంచర్‌కు సరదా; అలాంటివి రోడ్డువెంట వస్తున్నాయంటే ఉత్సాహంగా లేచి నిల్చుంటాడు. ఈవేళ మరీ యింత కోలాహలంగా యిలాటి శవోత్సవం రావటంతో అతనికి మరింత ఉల్లాసంగా వుంది. గబగబా తాను కూడా రోడ్డెక్కి ఒక మనిషిని అడ్డంతగిలి.!

'ఏటోయ్ తమ్ముడూ! ఏటిదంతా?' అన్నాడు.

'ఏటో తెలీదు - గూఢచారులు! హాఁ! - థూ! - గూఢచారులంట!'-

మరోడికి అడ్డంతగిలాడు : 'ఏటన్నా! ఎవుడూ!' వొళ్ళు తెలియని ఆవేశంలోవున్న ఆ రెండోమనిషి కూడా అదే సమాధానం చెప్పాడు: 'గూఢచారులు!-'

ఈ వ్యవహారం మరింత ఆకళింపుగా తెలిసిన మూడోమనిషి చెప్పాడు. అది రోజర్ క్లయ్ అనే గూఢచారి శవమని -

'ఆడు గూఢచారేనా?'-

'ఓల్డుబెయిలీ గూఢచారి! యదవలు! ఓల్డుబెయిలీ గూఢచారియదవలు!'

'అవునన్నోయ్! ఆణ్ణి యెరుగుదును' అన్నాడు క్రంచర్, చార్లెస్ డార్నే విచారణనాటి సంఘటన నెమరుకు తెచ్చుకుని 'చచ్చాడేం?'-

'చావక బతికేడుస్తారా? - కుక్కచావు చచ్చాడు! యదవలు!'

ఇంతలోనే జనానికి ఆవేశం మరింత యెక్కువైంది. బండి నిలవేసి కాకిమూకలా ఎగబడిపోయారు. బండిలో కూర్చున్న దుఃఖాక్రాంతుడు చచ్చినవాడి దుఃఖం మరిచిపోయి ప్రాణాలు దక్కించుకుని యెల్లాగో ఓలాగు బండిమీదనుంచి క్రిందికి దూకి జనంలో నుంచి యివతలపడ్డాడు! చొక్కా జట్రా వాలికలై పోయినై. బ్రతుకు జీవుడా అని, రోడ్డువెంటబడి వెనక్కు తిరిగిచూడకుండా అదే పరుగెడుతున్నాడు.

ఈ హంగామా అంతా చూసి, కంగారై, వీధిలోవున్న దుకాణాలన్నీ యెక్కడివక్కడ చకచకా మూసేసి, వ్యాపారస్తులు తలోత్రోవనూ సర్దుకుంటున్నారు. అవును, రోజులు అలాంటివి! జనానికి వెర్రియెత్తనేకూడదు గాని, వెర్రియెత్తటమంటూ వచ్చింతరువాత అది ఎక్కడ ఆగుతుందో ఎవ్వడూ చెప్పలేడు. జనంపడి బండిమీదనుంచి శవపేటికను రోడ్డుమీదికి దించిపారేసే ప్రయత్నంలో వున్నారు. ఇంతలో వాళ్ళల్లో ఒక ప్రబుద్ధుడికి ఒక మహత్తరమైన అభిప్రాయం తట్టింది. జనకంటకుడైన ఆ వెధవ చావనే చచ్చాడుగనుక, ఆనందంగా తామే ఉత్సవం సాగించి ఆ శవాన్ని భూస్థాపన చేసి వస్తే బాగుంటుందని సూచించాడు. వాస్తవిక దృక్పథంతో వచ్చేసలహాలకు విలువనేది యేనాడు వుంటుంది గనక, యీ సూచననూ యావన్మందీ వెంటనే ఆమోదించారు. సరే, ఆ బండిమీదికి వీలైనంతమంది స్వచ్ఛందసేవకులు యెక్కి కూర్చున్నారు, ఒకళ్ళ నొకళ్లు తోసుకుంటూ. ఆ స్వచ్ఛంద సేవకులతోపాటు క్రంచర్‌కూడా బండిమీదికి చక్రాలమీదుగా యెగబాకి, బండి వెనక పీటీలో నక్కి కూర్చున్నాడు. టెల్‌సన్సు బ్యాంకు అధికారులెవ్వరికీ కంటబడకుండా వుండటానికి తల మోకాళ్లమీదికి వంచేసుకున్నాడు. ఈవిధంగా తిరిగి సంస్కరించబడిన ఈ ఉత్సవం తిరిగి వీధివెంట సాగిపోతూంది.రోడ్డున ఎదురైన మనిషల్లా ఉత్సవంలో చేరిపోతున్నాడు. సరే, యెలాగైతేనేం శవపేటిక, దూరంగా పొలాల్లోవున్న సెయింట్ పాన్ క్రాస్ చర్చికి జేరింది.శవ లాంఛనాలన్నీ జరిపి చర్చిదొడ్లో భూస్థాపన చేసేశారు.

భూస్థాపనతో శవకాండ తీరిపోయింది. ఇప్పుడు బరితెగిన ఆ జనానికి మరొక ఉల్లాసకార్యక్రమమేదైనా కావలసివచ్చింది. ఉన్నట్టుండి వారిలో మరో ప్రబుద్ధుడు, దారినవస్తూన్న ఓ అమాయకుణ్ణి యెవణ్ణో చూపించి : 'అడుగో! వాడుకూడా గూఢచారే! ఓల్డుబెయిలీ గూఢచారే!' నంటూ అరిచాడు. అక్కడనుంచీ రోడ్డున వస్తూన్న వాణ్ణల్లా గూఢచారిక్రింద నేరారోపణచేసి వేట కార్యక్రమం కొంతసేపు సాగిపోయింది. అనంతరం ఆ కోలాహలం, కిటికీలు బద్దలుకొట్టడం, కొంపల్లో జొరబడటం లూటీలు చెయ్యటందాకా పరిణామదశ నందుకుంది. ఈ ప్రకారం ఒక నాలుగైదు గంటలు సాగిపోయిన అనంతరం, పోలీసులు వస్తున్నట్టు ఒక పుకారు బయలుదేరింది. ఆ పుకారు బయలుదేరగానే ఆ జనసమూహం యెక్కడిదక్కడ కర్పూరంలా హరించిపోయింది. రోడ్డుమీద ఒక్క పురుగుకూడా లేకుండా ప్రక్క సందుల్లోకి మాయమైపోయారు. అనంతరం పోలీసులు వచ్చారో లేదో కూడా తెలీదు.

క్రంచర్ తిరిగి టెల్‌సన్సు బ్యాంకుకు వచ్చేశాడు. ముక్కాలిపీటమీద నుంచి దిగి కుమారుడు తండ్రి ఉద్యోగం తండ్రికి వప్పగింత చేశాడు. బ్యాంకి కట్టివేసే వేళయింది. బ్యాంకు గుమాస్తాలంతా ఒకరొకరే బయటికి వెళ్లిపోయారు. రాత్రివేళ కాపలావుండే మనిషివచ్చి క్రంచర్‌స్థానంలో బైఠాయించారు. క్రంచర్ కొడుకుని వెంటబెట్టుకు యింటికి బయలుదేరాడు.

ఇంటికి వచ్చీ రావటమే పెళ్లాంమీద రంకెలు ప్రారంభించాడు :

'ఇదుగో! చూసుకో తడాఖా! - నేనేదో చెమటోడిచి బతికే పెద్దమడిసిని. ఇయ్యాలరాత్రి నేను పెట్టుకున్న పనిగనక నెరవేరకపోయిందో చూసుకో నిన్నేం జేస్తానో. అదిగనక చెడ్డదంటే నీ ప్రార్థనల మూలంగానే చెడ్డదని తేలిపోతది. నీమక్కెతిరగేశానన్నమాటే!'-

తన స్థితినితానే దురపిల్లుతూ, ఆ యిల్లాలు, అయోమయంగా తల ఊపింది. 'అదుగో నా మొహమెదటే మొదలెడతావుండావ్! యెదవ ప్రార్థనలు!'-

'ఎబ్బేలేదే! నేనేమీ ప్రార్థించటంలేదే'-

'ఆఁ! అట్టా కబర్దార్‌గా వుండు! నువ్వు ఏంజేసినా సరే వూరుకుంటాగాని ప్రార్థనలంటే మాత్రం వొళ్ళు హూనంఅవుద్ది'

'సరే!'-

'సరే! గిరే! ఇయ్యన్నీ నాకు పనికిరావ్! - బతకాలనుంటే చచ్చినట్టు పడుండు.' తను మాట్టాడుతున్న మాటల అర్థమేమిటో తనకే తెలియకుండా ఈమాదిరిగా రంకెలేస్తూ భోజనం దగ్గిర కూర్చున్నాడు. ఆ రకం మనుషుల ధోరణికి అదో అర్థంపర్థం అంటూ వుండదు. జీవితంలోవుండే చిరాకంతా ఆ విధంగా బయటికి వస్తూవుంటుంది.

'ఈ రాత్రి బయలుదేరుతున్నావా?' అన్నది భార్య ప్రక్కను పిల్లిగా కూర్చుని.

'అవును'

'నేనుకూడా నీయెంటవొచ్చేదా అయ్యా?' అన్నాడు కొడుకు.

'వల్లగాదు - నేను చేపలవేట కెడతావుండాను - ఇంకా కావలిస్తే మీ అమ్మ నడుగు - చేపలు బట్టటానికి కెడతావుండాను తెలుసా? - నువ్వు రావటానికి యీల్లేదు.'

'చేపలు ఇంటికి తెస్తావా? అయ్యా?'-

'ఏడిశావులే - నీ యెదవ ప్రశ్న లక్కడితో ఆపెయ్- అసలు నువ్వు నిద్దరోయేదాకా నేను బయల్దేరనే బయల్దేరను.'

ఆరాత్రి ప్రొద్దుబోయేదాకా క్రంచర్, భార్య తనకు వ్యతిరేకంగా ప్రార్థనలు చెయ్యకుండా వుండటానికి పహరా కాస్తూనే వున్నాడు. ఒకవేళ మనసులో యేమన్నా ప్రార్థించుతుందేమోననే భయంతో ఏదో సంభాషణలోకి దించి చివాట్లు బెడుతున్నాడు. తాను కాస్త ఇటూ అటూ పనిచూసుకోవలసి వచ్చినప్పుడు ఆ చార్జీ కొడుక్కు వప్పగింత చేస్తున్నాడు. దెయ్యాలలో ససేమీ నమ్మకం లేనివాడు దెయ్యాల కథ విని హడలిపోయిన తంతులా వుంది అతని ప్రవర్తన.

'ఇదుగో! ఇటు చూడు! రేపు నీ ఆటకోటి యాసాలేమీ పనికారావు. ఏదో ఇంత మాంసంగీసం తెస్తాననుకో. నువ్వు అంటనుముట్టనంటే అదేం పనికిరాదు. పెద్దమడిసి యవహారంగా యింతో అంతో సారా తెచ్చానంటే నువ్వు తాగితీరాలిసిందే. నీ మతం గతం నీ రోమ్ గీమ్ ఇయ్యన్నీ నాకు పనికిరావు. రోమేంటి రోమ్! నేనే నీరోమ్! మళ్ళీ మాట్టాడితే నేనే నీ మతగురువు - నేనే నీ దేవుడు.'

మళ్ళీ సణగటం ప్రారంభించాడు : 'ఓసి నీ దుంపతెగా! అటు సూడవే బిడ్డ యెంత నాదారిపోయాడో - ఇంత మాంసమోముట్టో ఆడిమొహాన పారెయ్యవుగెందా? నీమతం తగలెయ్యా! ఆడుయెట్టా బతుకుతాడే - యేవి తల్లివే! కన్నావు మళ్ళీ - బిడ్డను పెంచుకోటం చేతగానితల్లి యేం తల్లి యెదవతల్లి.'

దాంతో జర్రీకి తల్లి తనపట్ల చూపుతున్న ఉదాసీనతకు కోపం ముంచుకొచ్చింది. తల్లివంక కోపంగా చూచాడు.

అనంతరం క్రంచర్ వెళ్లి పడుకోమని కొడుకును హుకుం చేశాడు. పెళ్ళాన్ని కూడా అదే హుకుం చేశాడు. రాత్రి ఒంటి గంటవరకూ తాను మాత్రం చుట్టమీద చుట్ట కాలుస్తూ అలాగే కూర్చున్నాడు. ఒంటిగంటకల్లా లేచి జేబులోంచి చిన్ని తాళం చెవితీసి అలమారా తెరిచాడు. దాల్లోనుంచి ఒక సంచీ, పటకారూ, ఒక తాడూ, గొలుసు ఇంకా యీ రకమైన చేపలు బట్టటానికి పనికివచ్చే యితర సామానూ బయటికి తీసుకున్నాడు. ఇవ్వన్నీ జాగ్రత్తగా సర్దుకుని బయలుదేరాడు. వెడుతూ వెడుతూ, నిద్రపోతున్న భార్యవంక కడసారి ఒక్క ఉరుమురిమి చూసి తలుపు దగ్గిరేసి బయలుదేరాడు.

జర్రీ, తండ్రి బయలుదేరేదాకా దొంగ నిద్రపోయి, అతను గడప కదలగానే నెమ్మదిగా లేచి, పిల్లిలా వెనకాతలే చీకట్లో బయలుదేరాడు.

తండ్రి కథేవింటో తెలుసుకోవాలని జర్రీకి ఆందోళన బయలుదేరింది. ఆ చీకట్లో, తండ్రి ముందూ, కొడుకు ఫర్లాంగు దూరం వెనకా నడిచిపోతున్నారు. క్రంచర్ ఉత్తరదిశగా మళ్లీ కొంచెం దూరం వెళ్ళాడో లేదో మరొక మనిషి యెవరో వచ్చి అతనితో కలిశాడు.

మరో అర్థగంట నడిచేసరికల్లా దీపాలూ గట్రా లేని ఊరిబయటి రోడ్డుమీదికి వచ్చేశారు. అక్కడికి వచ్చేసరికి మరో మూడోవ్యక్తి వచ్చి వాళ్ళని కలుసుకున్నాడు. ఒకరికి యిద్దరూ ఇద్దరికి ముగ్గురూ అయ్యారు. ఆ ముగ్గురూ ముందూ, జర్రీ చాటుచాటుగా వెనకా నడిచిపోతున్నారు.

అలా పోయిపోయి రోడ్డుకు అడ్డంగావచ్చిన ఒక కాలువ గట్టుదగ్గిరికి చేరుకున్నారు. ఆ గట్టు దిగి పక్కనున్న చిన్ని ఇటుక గోడను సమీపించారు. దానికి ఒకచోట ఇనపచువ్వలతో అమర్చిన ఒక గేటు వుంది.

కుర్రాడు గట్టుకివతల నక్కి మెడపైకెత్తి నిక్కిచూస్తున్నాడు. గేటు చువ్వలమీదుగా ఎగబాగుతూ తండ్రి కనుపించాడు. అతను క్షణంలో గేటుదిగి లోపలికి వెళ్ళిపోయాడు. మళ్లా చేపలు బట్టటానికి బయలుదేరిన ఆ రెండో పెద్దమనిషీ, మూడో పెద్దమనిషీ కూడా గేటుదాటి లోపల ప్రవేశించారు.

వాళ్లు ముగ్గురూ లోపలికి వెళ్లిపోగానే, కుర్రాడు కూడా గేటుదగ్గిరికి వెళ్లి కిటికీ చువ్వలలోనుంచి లోపలికి తొంగిచూచాడు. లోపలికి వెళ్లిన ఆ ముగ్గురూ, పచ్చగడ్డిలోనుంచీ, గోరీల దిబ్బలమధ్యనుంచీ బడి, జెర్రిపోతుల్లా పాకిపోతున్నారు. అలా కొంతదూరం పాకిపోయి, ఒక దిబ్బదగ్గిరకొచ్చి ముగ్గురూ నిటారుగా లేచి నిల్చున్నారు. ఇక అక్కడ చేపలుబట్టే కార్యక్రమానికి ఉపక్రమించారు.

మొట్టమొదట పార దీసుకుని కొంతసేపు తవ్వారు. అనంతరం క్రంచర్ జేబులోనుంచి పటకారులాటిది ఏదో బయటికిదీసి దాంతో సదమదంగా పనిచేస్తున్నాడు. వాళ్లు ఉపయోగించుతున్న పనిముట్లేవింటో కుర్రాడికి సరీగా కనుపించటంలేదుగాని అలా చాలా సేపటివరకూ తంటాలు పడుతూనే వున్నారు. ఈలోగా చర్చిగడియారం గంటలు కొట్టడంతో కుర్రాడు కంగారై కొంచెం దూరంగా పారిపోయాడు. కాని ఆ వ్యవహారం ఏవింటో పూర్తిగా తెలుసుకోవాలనే ఉత్సాహంతో వుండటంచేత మళ్లా ధైర్యం చిక్కబట్టుకుని వెనక్కు

తిరిగివచ్చాడు. ఇంకా వాళ్ళేదో పనిచేస్తూనే వున్నారు. ఈసారి కిరకిరగా ఏదో శబ్దంకూడా కొద్దిగా వినపడుతోంది. ఆ గోతిలోనుంచి బయటికి వస్తూన్న చేప ఏవిటో కుర్రాడికి అర్ధమైపోయింది. తన తండ్రి స్వయంగా పటకారు తీసుకుని దాన్ని పగలగొడుతూవుండటం అతనికి మరింత బేజారుపుట్టింది. కాళ్ళకు బుద్ధి చెప్పాడు. మైలూ, మైలున్నర పోయేవరకూ, వెనక్కు తిరిగి చూడకుండా పరుగెత్తాడు. అక్కడైనా ఆయాసమొచ్చి ఆగాడుగాని లేకపోతే ఆగేవాడే గాదు. ఆ శవపేటిక తనవెంట పరుగెత్తు కొస్తున్నట్టు అతనికి భ్రాంతి కలుగుతోంది. ఆ శవపేటిక నిట్టనిలువుగా నిల్చుని తనమీదికి పరుగెత్తుకువస్తున్నట్టూ, తన దండచేతిని పట్టుకోవటానికి ప్రయత్నించుతున్నట్టూ గాబరాగా వుంది. చీకటిగా వున్నచోట మరింత భయమేసిపోతోంది. అందుచేత చెట్ల క్రీనీడలూ అవీ లేని రోడ్డుమీదికి పరుగెత్తుకొచ్చాడు. అది తోకలేని గాలిపటంలా గాలిలోకి యెగిరి తనమీదికి దూకబోతున్నదని అలజడి పడుతున్నాడు. అలా నురుగులు గ్రక్కి పరుగెత్తుకుంటూ ఇంటికి చేరుకునేసరికి అతని ప్రాణం ఇంచుమించు కడబట్టిపోయింది. లోపలికి వెళ్లినాక కూడా యింకా ఆ భయం వదల్లేదు. కిక్కురుమనకుండా పోయి పక్కమీద పడుకున్నాడు. నిద్రపోతున్నప్పుడుకూడా ఏదో గుండెల మీదకూర్చున్నట్టుగానే వుంది. తెల్లవారి కుర్రాడు నిద్రలేచేసరికి ముందు గదిలో, తండ్రి తల్లిని తల గోడకి వేసి కొడుతూవుండటం చూశాడు.

'అంతపనీ చేస్తానని చెప్పేనా లేదా - చావు!' దబాదబా గోడకేసి తల పగల గొట్టేస్తున్నాడు. చస్తినో అని ఆ యిల్లాలు లబోదిబో ఏడుస్తోంది.

'ఇదేటే ఆడదానికి ఉండాల్సిన బుద్దీ - మొగాడికి యెదురు తిరగటమా - మొగాడికొచ్చే లాభాలు కాస్తా నాశనమైపోవటానికి ప్రార్ధనలు చేస్తావా బాడఖావ్!'

'నువ్వు అల్లాంటి పాడుపనిలోకి దిగాల్సిందేగాదు మరి' అన్నది కళ్లనీళ్లు గారుస్తూ.

'మొగాడి యవహారాల జోలి ఆడదానికి నీకు అనవసరం,' అటూ మళ్లా ఒకతావు తన్నిపోయి నేలమీద బోర్ల బొక్కులుగా పడుకుని కాళ్లు పంబదన్నాడు. తండ్రి పడుకోటం చూసి కొడుకు కూడా మళ్లీ పడుకుని నిద్రపోయాడు.

ఆవేళ భోజనందగ్గిర చేపలూ జట్రా అల్లాంటివేమీ లేవు. ఇతర పదార్థాలు కూడా ఏవీలేవు. క్రంచర్ వొళ్లూ మనసూకూడా చికాగ్గా వుంది. భార్యగనక దైవప్రార్థనలు వగైరాకు పూనుకుంటే శిరచ్ఛేదం చెయ్యటానికి ఒక ఇనుపశిబ్బి దగ్గిర బెట్టుకుకూర్చుని ఆరెండు రొట్టెలూ ఆదరాబాదరా గొంతులో వేసుకుని మింగాడు. నిమాజామా వేసుకు, కుమారుణ్ణి వెంటబెట్టుకుని మళ్లా యథాప్రకారం గౌరవనీయమైన తన ఉద్యోగానికి బయలుదేరాడు.

త్రోవను పోతూ, చేతికి అందని దూరంలో నిల్చుని కొడుకు తండ్రిని నెమ్మదిగా ప్రశ్నించాడు.

'పూడ్చిపెట్టిన శవాల్ని తవ్వుతారే - ఆళ్లు యెవుళ్ళయ్యా?-'

క్రంచర్ దిగ్భ్రాంతుడై నిల్చునిపోయాడు! 'నా కేవింటి తెలుసు'

'అదంతా నీకు తెలుసుననుకుండాలే'-

'హు-సరే! - అదా? - ఆళ్లో యాపారస్తుల్లే'-

'ఆళ్లు అమ్మేసరుకు లేంటి?'-

'అయ్యోవో సైన్సుకు సంబంధించిన సరుకుల్లే'-

'మదుసుల శవాలా?'-

'మరే! - అసువంటివే యేవో అయివుంటయ్'-

'పెద్దయిన తరువాత నేగూడా అలాంటి యాపారత్తుణ్ణవుతా' అన్నాడు జర్రీ.

23

డిఫార్జ్ పానశాలలో, ఆ రోజు మామూలుకంటే పెందరాళే మధుసేవ ప్రారంభమైంది. అప్పటి కింకా ఉదయం 6 గంటలేనా కాలేదు. క్రొత్తగా వచ్చినవాళ్లు కటకటాల్లోంచి తొంగి చూస్తుంటే అప్పటికే మధుసేవలో నిమగ్నులైవున్న పెద్ద మనుషుల బుర్రలు లోపలనుంచి కనుపించుతున్నయ్. అల్లాంటి సమయాల్లో, అంటే వత్తిడి సమయాల్లో, మంది పెరిగినకొద్దీ మజ్జిగపల్చనైనాయన్నట్టు, పల్చని పానీయాన్నే అమ్ముతూ వుంటారు. ఆ పానీయం పుచ్చుకోవటంవల్ల శరీరంలో వెచ్చపుట్టకపోయినా, ఆ నాటుమనుషుల హృదయ కుహరాల్లో లోలోపల ఏవేవో జ్వాలలు రేగుతూనే వున్నయ్.

ఇలా, ఇంత పెందరాళే పానీయస్వీకరణ ప్రారంభం కావటానికి యిది మూడోరోజు. మధుసేవకంటే మధనలు ముందుగా ప్రారంభమౌతున్నయ్; గుసగుసలాడేవాళ్లు గుసగుసలాడుకుంటూ వుంటే, యీ బల్లదగ్గిరనుంచి ఆ బల్లదగ్గిరికీ ఆ బల్ల దగ్గిరనుంచి యీ బల్లదగ్గిరికీ తిరిగేవాళ్లు తిరుగుతున్నారు. వాళ్ళందరికి దగ్గిరా డబ్బులుంటే నిజంగా పీపాలతరబడి సారా కావలసివచ్చేది. కాని వాళ్లల్లో చాలామంది సారాకు బదులు కబుర్లు తాగుతున్నారు.

అంతమంది జనం వస్తూపోతూవున్నా పానశాలయజమాని మాత్రం అక్కడెక్కడా పత్తాలేడు; అతను కనుపించలేదని అనుకున్న వాళ్ళు కూడా లేరు. అతన్ని గురించి భోగట్టా చేసిన వాళ్ళే లేరు. గల్లా పెట్టెదగ్గిర డిఫార్జ్‌భార్య ఒక్కతే కూర్చునుండటం కూడా యెవ్వరికి ఆశ్చర్యంగా వున్నట్టు లేదు.

ఆ రోజుల్లో గూఢచారులు, రాజభవనం దగ్గరనుంచి క్రిమినల్ జైళ్లవరకూ సమస్త ప్రదేశాలనూ పరిశీలించుతూవుండేవారు. అలాంటివాళ్లెవళ్ళేనా యీ పానశాలలోకి తొంగిచూస్తే, పనీపాటాలేని మనుషులెవళ్ళో యేవీంతోచక కూర్చున్నట్టు కనుపించుతుందిగాని మరో ఆందోళనేమీ వున్నట్టు బోధపడటం కష్టం. చీట్లపేక ఆడుతూన్నవాళ్లు ఆడటం మానేసి యేమీ పని తోచనివాళ్ళలాగు పేకముక్కల్తో మేడలు కడుతున్నారు; సారా తాగుతున్న వాళ్ళు త్రాగటం మానేసి బల్లలమీద చిందిపడ్డ సారా బొట్లతో బొమ్మలు గీస్తున్నారు. మాడమ్ డిఫార్జి కూడా పన్ను కుట్టుపుల్లతో జుబ్బా చేతులమీద అలాగే బొమ్మలు గీస్తూ, ఏదో ఆలోచిస్తూ వుంది.

మధ్యాహ్నం దాటింది; సెయింట్ ఆంటోనీ వీధిన బడి దుమ్ము గొట్టుకున్న దుస్తులతో యిద్దరు మనుషులు చకచకా నడిచివస్తున్నారు. వాళ్లిద్దరిలో ఒకడు సారాదుకాణం యజమాని మాన్సియర్ డిఫార్జ్; రెండవవాడు, రోడ్లు బాగుచేసే నీలిటోపీ కూలీ. ఒళ్ళంతా దుమ్ముతోనూ, ఆర్చుకుపోతున్న దాహంతోనూ ఆ యిద్దరూ పానశాలలో ప్రవేశించారు. వాళ్లిద్దరూ సెయింట్

ఆంటోనీ వీధినబడి వస్తూవుంటే, ఆ వీధిలోవున్న ప్రజల ముఖాల్లో యేవో ఉద్వేగరేఖలు జిగేల్ జిగేల్ మంటూ ప్రభవించుతూన్నయ్. త్రోవపొడుగునా ఎదురైన మనిషల్లా వాళ్లిద్దరి ముఖాలలోకీ చూస్తున్నారు. అయినా వాళ్లల్లో యే వొకడూ వాళ్ళ వెంటబడి పానశాలదగ్గిరకి రాలేదు. వాళ్ళని పలకరించలేదు. లోపలికి వచ్చిన తరువాతకూడా అక్కడున్న వాళ్ళు వాళ్ళ వంక చూచారే కాని పన్నెత్తి పలకరించలేదు. వాళ్ళందర్నీ ఒక్కసారి కలయజూచి:

'నమస్తే భాయియోఁ!' అన్నాడు డిఫార్జ్; అది, ఏదో ఊకదంపు లోకాభిరామాయణం ప్రారంభించమని అక్కడున్న కామ్రేడ్సుకు హెచ్చరిక కావచ్చు.

'వాతావరణం ఏమంత బాగుళ్ళేదు' - అన్నాడు, మళ్లా, ఆ మాట అనేసరికి అక్కడున్న వాళ్ళంతా ఒకళ్ళ ముఖాల్లోకి ఒకళ్ళు చూసుకుని తలలు వంచుకు మౌనంగా కూర్చున్నారు. అందులో ఒక వ్యక్తిమాత్రం చివాల్నలేచి బయటికి వెళ్లిపోయాడు.

డిఫార్జ్, నీలిటోపీ రోడ్డుకూలీని భార్యకు చూపించి 'ఈ మనిషి చూశావా? మంచివాడు; రోడ్లు మరమ్మత్తు చేస్తూ చేస్తూ వుంటాడు; నేనూ యితనూ కలిసి చాలా దూరంనుంచి ప్రయాణం చేసి వస్తున్నాం. పారిస్‌నుంచి బయలుదేరి ఒక రోజున్నర ప్రయాణం చేశాను. అక్కడ ఒక గ్రామం చేరువలో, రోడ్డుమీద హఠాత్తుగా నాకు తగిలాడు. ఈయనపేరు జాక్విస్; చాలా అలిసిపోయి వున్నాడు. దాహం కూడా వేస్తూందల్లే వుంది పాపం - మంచి ద్రాక్షాసారా ఒక గ్లాసెడు యివ్వు.'

కూర్చున్న జనంలోనుంచి మరోమనిషి లేచి బయటికి వెళ్ళిపోయాడు. మాడమ్ డిఫార్జ్ సారాసీసా రోడ్డుకూలీచేతికి అందించింది. అతను చేతిలోవున్న నీలిటోపీతో అక్కడున్నవాళ్ళందరికీ సలాంకొట్టి, బల్లదగ్గిర కూర్చుని తాగటానికి ఉపక్రమించాడు. వెయిస్టుకోటు జేబులోనుంచి చిన్ని గుడ్డమూట బయటికి తీశాడు. దాన్లో ఎన్నాళ్ల నాటిదో పులిసిపోయిన రొట్టెముక్క వుంది. అది కాస్తకాస్తే మధ్యమధ్య చప్పరించుతూ సారా ఒకొక్కగుక్కే నెమ్మదిగా పుచ్చుకుంటున్నాడు. మరో మూడో మనిషి లేచి బయటికి వెళ్ళిపోయాడు.

డిఫార్జ్ తను కూడా ఒక బల్లదగ్గిర కూర్చుని కొంచెం పానీయం పుచ్చుకుని సేదదీర్చుకున్నాడు. తన మిత్రుడు ఫలహారం ముగించేవరకూ కనిపెట్టుకు కూర్చున్నాడు. అంతసేపూ అక్కడ గోళ్లు గిల్లుకుంటూ కూర్చున్నాడన్న మాటేగాని, మిగతా వాళ్లె వాళ్ళవంకా కన్నెత్తయినా చూళ్లేదు. వాళ్ళూ అతనివంక చూడ్డంలేదు. మాడమ్ డిఫార్జ్ కూడా అతనివంక చూడ్డంలేదు. కుట్టుసామాను ముందేసుకుని తన పని తను చూసుకుంటోంది.

'అయిందా తమ్ముడూ!' అన్నాడు డిఫార్జ్ - రోడ్డుకూలీ నీలిటోపీకి చేతులు తుడుచుకుంటూ వుండటం చూసి.

'అయింది'-

'సరే! వెడదాంరా? - నువ్వు మకాంచెయ్యటానికి గది చూపిస్తా హాయిగావుంటుందిలే'-

ఇద్దరూ లేచి, పానశాల పెరటిదొడ్లోకి నడిచారు; దొడ్లో నుంచి మెట్లెక్కి మేడమీదికి పోయారు మేడమీద పై అంతస్తు గదిదగ్గిరికి చేరారు - పూర్వం ఆ గదిలోనే నే కొన్నాళ్ళు చెప్పులు కుట్టుకుంటూ, ముగ్గుబుట్టతల ముసలిమొహం డాక్టరు వుండేవాడు.

ఆయన అక్కడ లేడుగాని, వెనక ఆయన ఆ గదిలో వుండగా, ఆయన్ను కిటికీలోనుంచి తొంగిచూసిన ఆ భాయీలు ముగ్గురూ దాన్లో కూర్చునున్నారు.

ఇద్దరూ గదిలోకి ప్రవేశించగానే డిఫార్జ్ తలుపు దగ్గిరేసి, గొంతు మంద్రస్వరంలోకి తగ్గించి : 'జాక్విస్ నెం.1 జాక్విస్ నెం.2, జాక్విస్ నెం.3! - జాక్విస్ నెం.4 అయిన నేను కలుసుకోవటానికి వెళ్ళిన సాక్షి యితనే - జాక్విస్ నెం.5 అయిన ఈ పెద్దమనిషి జరిగిన సంగతంతా సవిస్తరంగా చెబుతాడు వినండి!' - అన్నాడు. నీలిటోపీరోడ్డు కూలీ, ముంజేతితో నుదురుమీద క్రమ్మినచెమట తుడిచేసుకుని 'ఏడనుంచీ మొదలెట్టేది?' అంటూ బుర్ర గోక్కుంటున్నాడు.

'ఎక్కణ్ణుంచియేవిఁటి? - మొట్టమొదట్నుంచీ మొదలెట్టు' అన్నాడు డిఫార్జ్.

రోడ్డు కూలీ చెప్పుకొస్తున్నాడు : 'ఆమడిసిని మొట్టమొదట చూడ్డం అదే - ఈ యాసంగికి ఒక యేడాది దాటివుంటది. జమీందారు బండికింద గొలుసుచ్చుకుని యీమయిన యేలాడబడి వుంటాడు. కప్పెడు కప్పెచీకటిబడతా వుండది. పని ఆపేసి యింటికి బయలుదేరాలనుకుంటా వుండాను. ఇంతలోనే బండీ, బండి కిందమడిసి యేలాడతా వుండటం చూశాను. బండి కొండగుట్టమీద నుంచి కిందకి దిగుతావుండది- ఊరేపుకు - ఆ మడిసి అట్టనే ఏలాడుతూ వుండాడు'-

ఈ కథను, అతను తన గ్రామంలోవున్న మనిషి మనిషికీ, సంవత్సరంపొడుగునా యెన్నో వందలసార్లు చెప్పివున్న కారణంగా బాగా రాటుతేలి సాభినయంగా మాంచి యమకంగా చెబుతున్నాడు.

జాక్విస్ నెం.1 అడ్డుతగిలాడు: 'ఆ మడిసిని నువ్వు అంతకి పూర్వం ఎన్నడేనా చూశావా?'-

'ఎబ్బే లేందే!'-

జాక్విస్ నెం.3 అందుకున్నాడు.

'మరి తరువాత యెట్టా గుర్తుబట్టావ్?'-

'ఓ! అంత బారాటి మడిసిని నా జన్మలో ఎప్పుడూ చూళ్లేదనుకో - అదీ గుర్తు!- ఆ సాయంత్రంవేళ జమీందారు నన్ను బిల్చి "ఆ డెట్టా వుండాడురా" అంటే, నే జెప్పింది అదే గెందా, గెడవాసంమాదిరి అంత బారుగా వుండాడని చెబితినే'

'నువ్వు గెనా, మరి గుజ్జోడుమాదిరి పొట్టి కురచగా వుండాడని చెప్పాల్సింది' అన్నాడు జాక్విస్ నెం.2.

'నాకేం దెలుసు - ఆ పని యింకా జరగలేదామరి - అయినా ఆ మడిసి ముందుగా నాకా సంగతి చెప్పిండు గనకనా? - అయినా, అప్పటికేనా నాయంతటికి నేను పోయి చెప్పేనా - జమీందారు నీటి కుళాయికేడ నాయంక జూసి, "ఆ యదవనిట్టా యీడ్సుకురండ"ని అరిసిండు, లేకుంటే చస్తే జెప్పివుండేవోణ్ణి గాదు - నిజం జెబుతావుండాను'-

'జెనాను నిజమే' అంటూ గొణిగాడు డిఫార్జి - 'సరే తరువాతేమైందో చెప్పు.'

'ఆ తరువాత ఏమైందీ యెవ్వరికీ తెలవలేదు - యెతకటం మొదలెట్టిన్రు, యెతికిన్రు తొమ్మిదినెల్లో, పదినెల్లో, పదకొండునెల్లో - ఎన్నో నెల్లు ఎతికిన్రు!'-

'ఎన్ని నెల్లయితేనేంలే - బాగానే దాచారు - కాని దురదృష్టం పట్టుబడిపోయాడు- సర్రే, కానీ!' - అన్నాడు డిఫార్జ్.

'ఓనాడు మళ్లా యిట్టనే కొండగుట్టమీద పనిచేస్తావుండాను. పొద్దుగూకే యేళ. పారా పలుగూ మూపు నెత్తుకుని యింటికి బయల్దేరబోతావుండా - ఇట్టా తలెత్తి సూద్దునుగందా- ఓ అయిదారుగురు పోలీసోళ్లు కొండమీద గనుపిచ్చిర్రు. ఆళ్ళ మద్దెన ఆ బారాటి మనిషి కనుపిచ్చిండు. ఈమయిన చేతులు యెనక్కి యిరిచి కట్టేసుండయ్.

'అట్టనే దూరంగా నిల్చోని సూత్తావుండాను. ఆళ్లు అయిదారుగురు బడి ఆ మడిసిని లాక్కెడతావుండారు; కనుచీకటి బడతావుండదేమో, అచ్చు, యెములోళ్ళమాదిరిగా వుండారు. పాపం ఆ మడిసికి కాలుకుంటి - నడవలేక నడవలేక నడుత్తా వుండాడు. తొందరగా నడిపించటానికి ఆ పోలీసోళ్ళు ఆరుగురూ బడి తుపాకి సన్నీలతో ఎన్నుమీన యిట్టా యిట్టా కుమ్మిర్రు. కుంటికాలు యీడ్చుకుంటూ కొండమీదనుంచి కిందికి పరుగెత్తుతా జర్రున కాలుజారి బోర్ల బొక్కులుగా పడిపోయిండు. ఆళ్లు పకపకా నవ్వుతా యెల్లి మెడబట్టుకు లేవదీసి నిల్చోబెట్టిర్రు : మొహమంతా రక్తం వరదలు గారతావుంది. తుడుచుకోడానికి చూస్తే చేతులు యిరిచికట్టేసుండె; అది జూసి మరీ నవ్విర్రు; ఆమయిన ఊళ్ళోకి దీసుకుపోయిర్రు; ఆ మడిసిని జూట్టానికి వూళ్లో జనమంతా చుట్టేసిర్రు; ఊళ్ళోనుంచి జైలు గుట్టమీదికి తీసుకెళ్ళి జైలు తలుపులు తెరిసి దాల్లోబెట్టి మూసేసిర్రు.

'తెల్లారిపొద్దునే, పలుగూ పారా భుజానెట్టుకుని పనిలోకి యెడతా, అట్టా జైలుమీదగా బయలుదేరాను. ఆమడిసి జైలు కటకటాల యెనకాతల కనిపిచ్చిండు. మొహం నెత్తురూ దుమ్మూ మరకలు గట్టుకుపోయింది. చేతులింకా యిరిచి కట్టేసేవుండయ్. పలకరించుదా మనుకున్నాగాని బయమేసి వూరుకుండాను - ఆ మడిసీ నన్ను పలకరించలేదు - చచ్చిపోయినోడులా బిత్తరపోయి నాయంక జూసిండు.'-

డిఫార్జ్, అక్కడున్న ముగ్గురూ ఒకరి ముఖంవంక వకరు చూసుకున్నారు. వాళ్ళ ముగ్గురి ముఖాలూ ఉద్రేకంతో కందగడ్డల్లా యెర్రబడిపోయినై. పగసాధించాలనే క్రౌర్యం వాళ్ల నుదుర్లలో మెలికలు తిరుగుతోంది.

డిఫార్జ్ చివాల్న ఆవేశంగా లేచి నిల్చుని : 'సరే! తరవాత సంగతి చెప్పు!' అన్నాడు.

'ఆమయిన ఆ జైల్లో కొన్నాళ్ళపాటు వుండాడు. ఊళ్ళోవాళ్ళు, చాటునా మాటునా యెల్లి సూత్తానేవుండేవోళ్లుగాని పబ్లీకుగా మాత్రం యెళ్ళేవోళ్ళుగాదు. బయంగెందా! - జైలుకేసి సూత్తానేవుండేవోళ్లు, కుళ్ళాయిదగ్గిర గుసగుసలాడుకుంటూనే వుండేవోళ్లు. ఆ మడిసికి ఉరిశిక్ష యెయ్యాల్సివున్నా, ఉరిదియ్యరని చెప్పుకునేవోళ్లు. ఆడిబిడ్డ సచ్చి పిచ్చెత్తిపోయి అట్టా జేసిండుగనక రచ్చించాల్సిందని యీడ పారిస్‌లో అధికార్లకూ రాజుకూ మాజర్లుబెట్టిర్రని చెప్పుకుంటూ వుండేవోళ్ళు - పెట్టిర్రో లేదోగాని - అయ్యన్నీ నా కెట్టా దెలుత్తయ్!'

నెం.1 జాక్విస్ అందుకున్నాడు : 'అయితే ఇను - రాజుకీ, రాణికీ ఓ మాజరు పెట్టిన మాట నిజమే, ఆ మాజరు రాజు సొంతంగా అందుకోడం, ఇక్కడున్నోళ్ళలో నువ్వొక్కడివి దప్ప, తక్కినోళ్ళంతా అక్కడుండి కళ్ళతో జూసినోళ్లే - పేణాలమీద ఆశ కూడా వొదులుకుని రాజుగారి బండీకి యెదురెల్లి మాజరు అందించింది యెవుళ్ళోగాదు- ఈ డిఫార్జ్ అన్నే - రాజుగారి సిపాయిలూ గుర్రపాళ్లూ, యెంట వుండోళ్ళూ యీయన్ని చుట్టేసి సావా సితకా బాదిర్రు - తెలిసిందా, -

'తెలిసింది' - అన్నాడు నీలిటోపీ.

'అయితే ఇక నీ కథ గానీ'-

'ఆ తరువాత నీటికుళాయి దగ్గిర, మళ్ళా యేం జెప్పుకోడం మొదలెట్టిర్రంటే - ఉరిదీయటం ఖాయమేననీ - గ్రామస్థుల కందరికీ జమీందారు తండ్రంటివోడు గనక - తండ్రిని జంపిన నేరస్తుణ్ణి బిడ్డలయెదట చావనూకటానికి గావానికి తీసుకొచ్చిర్రు అని చెప్పుకుంటావుండారు. ఒక ముసలాయన జెప్పిందేమిటంటే బాకుబట్టిన కుడిచేతిని బతికుండగా కాల్చి తగలెడతారన్నాడు. ముంచేతుల్లోనూ గుండెల్లోనూ తొడల్లోనూ పిక్కలమీదా బర్మాలతో బొక్కలుగోసి, ఆ కన్నాల్లో మసులుతావున్న నూనె, కరిగిన సీసం, మరిగిన గుగ్గిలం గెంధకం, యియ్యన్నీ పోస్తారనీ సివరికి నాలుగు గుర్రాలకు నాలుగేపులా కాళ్ళూ చేతులూ గట్టి, యేకీలు కాకీలు ఊడబీకించుతారని చెప్పిండు. ఆ ముసలాయిన యింకా జెప్పిందేవిటంటే, ఈడ పారిస్‌లో రాజుగారిని చంపటానికి యెవుడో కుట్ర బన్నాడనీ ఆ మడిసిని ఈ రకంగానే చిత్రవధ జేసిర్రనీ చెప్పిండు. ఆ ముసలాయన మరి నిజవేజెప్పిండో, అబద్ధమే జెప్పిండో మరి, నా కెట్టా తెలుత్తది - నేను సదువుకున్నోణ్ణిగాదు గెందా?'-

'సరే అయితే ఆ సంగతి నే జెబుతా ఇను' అంటూ ఎత్తుకున్నాడు. జాక్విస్ నెం.2 'ఆ చిత్రవధ జరిగినమడిసి పేరు దేమియన్సు, అదంతా పట్టపగలు నడివీధిలో జరిగింది. ఆ పారిస్ పట్నం నడివీధిలో జరిగింది; లక్షల జనం కళ్ళముందు జరిగింది; గొప్పింటి ఆడోళ్లు యెంతోమంది చుట్టూతా మూగి సాంతం కడంతా సూత్తానేవుండారు. ఎంతో సర్దాగా కూడా సూశారు - చివరంటా. మద్దేనపేళ నుంచీ చిత్రవధ మొదలైతే చీకటిబడేతలికి ఆడికి ఒక కాలూ ఒక చెయ్యీ ఊడిపోయినై - అదంతా అట్టా జరిగిందిలే- ఇదంతా నీకు తెలీకపోవడమేందీ? - నీ కెన్నేళ్లు?'

'ముప్ఫయ్ అయిదు'

'నువ్వు పదేళ్ళ కుర్రాడివై వుండగా యిది జరిగింది - నువ్వు చూసుండాల్సిందేనే'

'సరే! చేస్తారులే వెధవలు!- తరువాత కథ కానీ' అంటూ డిఫార్జ్ తొందరపెట్టాడు.

'ఇట్టా వుండగా ఒక ఆదివారంనాటి రాత్రి, ఊళ్ళో వున్న జనమంతా నిద్రబోతావుండగా పోలీసులు ఊళ్ళో కొచ్చిర్రు; నీటి కుళాయిదగ్గిర, కూలోళ్ళని బెట్టి తెల్లవార్లూ ఏదో తవ్వించిర్రు. తెల్లారిలేచి చూసేతలికి ఆడ నలభైఅడుగుల యెత్తున ఉరికంబం పాతివుండది. ఆ మద్దానపేళ యీ పోలీసులంతా రాండోళ్ళు వాయించుకుంటా జైల్లోకి యెళ్ళి ఆ మడిసిని దీసుకొచ్చి ఉరిదీసిర్రు. మడిసిశవం ఆమయిన యేలాడతావుంటే ఊళ్ళో జనమంతా పిల్లా జల్లా అడిలి సచ్చిర్రనుకోండి అదీ జరిగిన సంగతి; అక్కడ నుంచి ఆ రాత్రే బయలుదేరిర్రు, ఈయన నాకు దోవలో ఎదురౌతాడని చెప్పిర్రు- ఇద్దరం కలుసుకుని యీడకి వచ్చినాం - ఇదీ సంగతి'-

కథ యావత్తూ ఆసాంతం విని జాక్విస్ నెం.1 నీలిటోపీ వంక జూసి : 'భేష్ మంచోడివి - దాపరికం లేకుండా సంగతంతా జెప్పేశావ్! సరేగాని, రవ్వంతసేపు బయటికెళ్ళి ఆడకూచో, మళ్ళీ పిలుత్తాం.'

ఢిపార్జ్ అతన్ని వెంటబెట్టుకుని గదిలోనుంచి బయటికి దీసుకొచ్చి మెట్లదగ్గిర కూర్చోబెట్టి, మళ్లా గదిలోకి తిరిగొచ్చాడు.

ముగ్గురూ ఒకళ్ళముఖంలోకి ఒకళ్లు ఉరిమి చూసుకున్నారు :

'ఆఁ! మరేంది జరగాలిసింది!'

'ఇంకా యేందేంది - జాపితాలో యెక్కించాలిసిందే - ఆ జమీందారు కుటుంబంలో పురుగన్నా మిగలరాదు - దివాణం గివాణం నేలమట్టమైపోవాల'.-

అంతా నిర్ణయమైపోయింది.

'అయితే యీ మడిసి నేవిఁ జెయ్యాల! ఇక్కడుంచడవాఁ? - యింటికి పంపించెయ్యడవాఁ?'

'ఆడు మరీ మట్టిబుర్రలాగున్నాడు ఈడుంటే యేవిఁమునుగుతదో! పంపిజెయ్యడమే మెరుగు'-

'ఆ మనిషిసంగతి నేను చూస్తాలెండి' అన్నాడు డిఫార్జి - 'వాడు రాజునీ రాణినీ, దివాణం చూడాలని ఉబలాటపడుతున్నాడు. వచ్చే ఆదివారం చూపించిపంపుదాం'-

'ఏవిఁటీ ఆ బంగారుపిచ్చికల్ని చూడాలనా -?'

'మంచిదేలే - పిల్లికి దాహం పుట్టించాలంటే పాలు చూపించటం మంచిది'-

అంతకుమించి సంభాషణేమీ జరగలేదు; వాళ్ళు ముగ్గురూ గదిలో నుంచి బయటికి వచ్చేసరికే రోడ్డుకూలీ మెట్లదగ్గిర కునికిపాట్లు పడుతున్నాడు. పోయి, గదిలోవున్న గడ్డిపరుపులమీద పడుకుని విశ్రాంతి తీసుకోమన్నారు.

ఆదివారంనాడు, రాజునూ, రాణీనీ చూపించటానికి డిఫార్జ్ నీలిటోపీకూలీని వెంటబెట్టుకుని వర్సెలిస్‌కు బయలుదేరాడు; మేడమ్ డిఫార్జ్ కూడా వాళ్ళతో బయలుదేరింది, కుట్టుసామానుతో సహా; పోయినపొడుగునా బండిలోకూడా కుడుతూనే వుంది. బండిలోకాదు, రాజదంపతులను చూట్టానికి మూగిన జనసమూహంమధ్యను నిల్చుని కూడా కుడుతూనే వుంది.

మహోత్సవం : గవిఁడిగవదల రాజూ, గాజుకళ్ళ రాణీ బంగారు బండిలో యెక్కి బయటికొచ్చారు. వాళ్ళవెంట గొప్ప గొప్ప ప్రభువులూ వాళ్ల ఆడవాళ్ళూ నవరత్నరాగ సంపదలతో తులదూగుతూ, అనుసరించి వస్తున్నారు. - ఆనందకోలాహలంగా యెకయెకలూ పకపకలూ ఆడుతూ, ఆ దృశ్యాన్ని చూసి రోడ్డు కూలీకి విభ్రాంతి కలిగిపోయింది; వొళ్ళు తెలియని ఆవేశంతో : 'మహారాజుకూ జై! రాణీకి జై! అందరికీ జై!' అంటూ పిచ్చి కేకలు బెట్టేశాడు. ఆ అభినందనపారవశ్యంలో రాజులమీదికో రాణిమీదికో ఎగిరి గొంతు నులిమేస్తే నులిమేయవచ్చునని భయపడి, డిఫార్జ్ అతన్ని చొక్కాకాలరు పట్టుకుని వెనక్కు లాగి పట్టి అదుపు చేశాడు. ఉత్సవం ముగిసిపోయిన తరువాత డిఫార్జ్ అతన్ని భుజంమీద తట్టి : 'భేష్ మంచి కుర్రాడివి' అన్నాడు.

అప్పటికి కొంచెం స్పృహలోకొచ్చి నీలిటోపీకి అనుమానమేసింది : తాను అలా అభినందించి ఎగరటం పొరపాటేమోనని. కాని డిఫార్జ్ ఆ సందేహాన్ని నివృత్తి చేశాడు.

'నీవంటివాళ్ళు కొంతమంది, అలా కేకలేసేవాళ్ళూ వుండాలి - ఆ కేకలు చెవులబడుతూంటే వాళ్లు మైకంలో వుంటారు. ఈ కథ యిలాగే సాగిపోతుందనే వెర్రిలో వుంటారు. దాంతో మరింత అదరగణ్డం బలుస్తుంది - అదే వాళ్ల అంతం.'

'హాఁ! - నిజవేఁ' - అన్నాడు నీలిటోపీ, డిఫార్జ్ ధోరణికి ఆశ్చర్యపడుతూ.

'ఇదిగో ఇటు చూడు' అన్నది మాడమ్ డిఫార్జ్ : 'ధగధగ లాడుతూవుండి, మోతచేసే యే వస్తువును చూసినా నీకు కళ్ళవెంట నీళ్లొస్తాయి - అవునా కాదా?'

'నిజమేనమ్మా - నిజవేఁ' అన్నాడు నీలిటోపీ.

'నీ ముందు ఒక పెద్ద బొమ్మలగుట్ట పడేశారనుకో, దాల్లో యేదేనా నీ యిష్టంవచ్చిన బొమ్మను తీసి విరగ్గొటేసి దానికున్న అలంకారాలన్నీ నిన్ను తీసుకోమన్నారనుకో, యే బొమ్మను దీస్తావ్? మంచి షోగ్గా అలంకరించివున్న బొమ్మను తీస్తావా లేదా?'

'అవును - అట్టనే'-

'ఎగిరిపోలేని పక్షులమంద నీయెదట వున్నదనుకో, వాటిలో యే పక్షినో ఒకదాన్ని పట్టుకుని దాని యీకలు పీకేసి, అవి నువ్వు తీసుకోవచ్చునంటారనుకో, అప్పుడు ఎలాంటి పక్షిని యేరతావు? మంచి అందమైన యీకలున్న పక్షిని పట్టుకుంటావు - అంతేనా?'-

'నిజం'-

'ఇవ్వాళ నువ్వు, రంగురంగుల బొమ్మల్నీ పక్షుల్నీ ఎన్నిటినో చూశావు - ఇక నువ్వు ఇంటికి వెళ్లిపో!'

24

డిఫార్జ్ దంపతులు సెయింట్ ఆంటోనీ వీధికి తిరికి వచ్చేస్తున్నారు. నీలిటోపీ రోడ్డుకూలీ, ఆ చీకట్లో రోడ్డు వెంటబడి గ్రామానికి తిరిగి వెడుతున్నాడు.

నక్షత్రాల గ్రుడ్డివెన్నెల; డిఫార్జ్ దంపతులు ప్రయాణం చేస్తున్న రహదారిబండి పారిస్ గేటుదగ్గిరికి చేరుకుంది. మామూలు ప్రకారం, గేటు కాపలాపోలీసులు బండిని ఆపుచేసి, లాంతర్లు పుచ్చుకుని బండి యావత్తూ సోదాచేశారు. ఆ సోదా జరుగుతున్న తరుణంలో డిఫార్జ్ బండిలోనుంచి క్రిందికి దిగాడు. అక్కడి పోలీసుల్లో ఒకరిద్దరు డిఫార్జ్‌కి బాగా తెలిసినవాళ్ళు; వాళ్లలో ఒక పోలీసువచ్చి డిఫార్జ్‌ని అప్యాయంగా కావిలించుకున్నాడు.

సెయింట్ ఆంటోనీ వీధి మొగన బండిదిగి భార్యాభర్తలిరువురూ ఆ చీకటిసందునబడి పానశాలవేపు నడిచివస్తున్నారు. మాడమ్ డిఫార్జ్ భర్తను నెమ్మదిగా అడిగింది :

'అయితే! - ఆ పోలీసు జాక్విస్ యేవిఁటి నీ చెవిలో చెబుతున్నాడు?'

'ఏదో తనకి తెలిసిన విషయం చెప్పాడు; మన పానశాలమీద మరో క్రొత్త సి.ఐ.డి.ని వేశారుట. ఇంకా మరికొంత మందినికూడా వేస్తే వేసుండవచ్చునన్నాడు. తనకు మాత్రం ఆ ఒక్కడి సంగతీ తెలుసుట.'

'ఓహో! అలాగా? - అలాగైతే వాణ్ణి జాపితాలోకి ఎక్కించివుంచాలిసిందే - వాడి పేరేవిఁటి?'-

'ఎవడో ఇంగ్లీషువాడుట'-

'మంచిదే - పేరూ?'-

'జాన్ బర్ సాద్'

'ఎలా వుంటాడో అదేమన్నా చెప్పాడా?'-

'దాదాపు 40 సంవత్సరాల వయస్సుంటుంది. ఆరడుగుల ఎత్తు; నల్లటిజుట్టు; కొంచెం గోధుమవర్ణం చామనచాయ మనిషి; కాటుకకళ్ళు; కోలమొహం; గద్దముక్కు - చివర కొంచెం యెడమబుగ్గవైపుకు వంగివుంటుంది. కొంచెం కోపదారిగా కనుపించుతాడు.'

'ఓ! వర్ణన బాగానేవుంది - సరే వాణ్ణి రేపు గుర్తుపట్టి వేస్తాను చూడు!'

ఇద్దరూ పానశాలదగ్గిరికొచ్చేసరికి అర్ధరాత్రి కావచ్చింది; రాత్రి సమయం కావటంచేత పానశాల మూసేసివుంది. తలుపు తీయించి లోపలికి మళ్లీ వెళ్ళటమే మాడమ్ డిఫార్జ్ సరాసరి గల్లా పెట్టెదగ్గిరికి వెళ్లి కూర్చుని, డబ్బు లెక్కచూసుకుంది. ఖాతా పుస్తకంతీసి పద్దు పద్దూ తనిఖీ చేసింది. ఆ రోజంతా అమ్మకాలు నిర్వహించిన సర్వర్ను పిలిచి అడగవలసిన ప్రశ్నలన్నీ అడిగి యావత్తు వ్యవహారం ఆకళింపుచేసుకుని వాణ్ణి వెళ్లి పడుకోమని ఆజ్ఞ యిచ్చింది. వాడు వెళ్లిన అనంతరం, పెట్టెలోవున్న డబ్బంతా జేబురుమాల్లో గుమ్మరించి దొంతర్లు దొంతర్లుగా పేర్చి మూట కడుతోంది. భార్య వ్యాపార వ్యవహారాలు చూసుకుంటున్నంత సేపూ, డిఫార్జ్ పైప్ నోటో బెట్టుకు పొగ బీలుస్తూ హాల్లో యిటూ అటూ కులాసాగా పచార్లు చేస్తున్నాడు. ఆ లెక్కలూ డొక్కలూ ఏవీఁపట్టించుకోలేదు. అతని జీవితమంతా అలాగే కులాసాగా వెళ్లిపోతోంది. అలాంటి బాధ్యతలన్నీ భార్యమీద వేసి తాను జీవితంలో ఇటూ అటూ కులాసాగా కాలక్షేపం చేస్తూ వుంటాడు.

డబ్బు మూట గట్టుకుంటూ, మాడమ్ డిఫార్జ్ భర్తవంక చూచి;

'ఈ వేళ చాలా అలసిపోయినట్టున్నావ్?'-

'కొంచెం హైరానుపడ్డట్టే వున్నాను.'

'ఏదో నిరుత్సాహంగా కూడా కనుపించుతున్నావ్ - ఏవిఁ మగవాళ్ళు!'

'లేదుగాని...'

'లేదేవిఁటి - ఈ వేళ యెలాగైనా నిరుత్సాహంగానే వున్నావులే'-

'అవునుమరి - యెంతకాలంనుంచీ పనిచేస్తున్నాం.'

'అవునుమరి పగసాధించుకోవాలంటే మాటలా? ఎంత కాలమైనా పడుతుంది'-

'క్షణంలో హతమారిపోవటానికి ఒక్కమెరుపు దెబ్బచాలదూ'

'మెరుపు సృష్టికావటానికి యెన్ని కార్యకలాపాలు జరగాలి, ఎంత టైము కావాలి?'-

ఆ మాట కూడా కొంత నిజమేనన్నట్టు డిఫార్జ్ భార్య ముఖంవంక చూచాడు.

'ఒక భూకంపం బుట్టిందంటే నగరాలకు నగరాలు కన్నుమూసి తెరిచేటంతలో కూలబడిపోతై. కాని భూకంపం యేర్పడటానికి యెంతకాలం పడుతుంది?'

'చాలా కాలమే పడుతుంది.'-

'భూకంపం సంభవించిందంటే అది సర్వస్వాన్నీ ఒక్కసారి ఛిన్నాభిన్నం చేసిపారేస్తుంది. ఈలోగా ఆయత్తమవుతూ వుంది. బయటికేమో ఇంకా చిటపటలు రేగకపోయినా ఆయత్తమౌతోంది. ఆ సంతృప్తితో బ్రతకాలి.'

ఈ మాటలు చెబుతూ, కనుబొమలు రెండూ ముడివేసుకుని, కట్టెదుట యెవరో శత్రువు కనుపించుతున్నట్టు గాలిలోకి చూస్తోంది. తిరిగి ఇలా ఉపక్రమించింది :

'చెబుతా విను - పురోగమనం ప్రారంభమై చాలాకాలమైనా, నిస్పృహ చెందాల్సిన పనేవీఁ లేదు. పురోగమనం అంటూ ప్రారంభమైందికదా? అది చాలు; ఒకసారి ప్రారంభమవటం అంటూవుంటే అది వెనక్కు మరలిపోవటంగాని, మధ్యలో ఆగిపోవటంగాని వుండదు. అంతా త్వరితగతిని సన్నద్ధమవుతూనే వుంది. నీ చుట్టూ కనుపించుతున్న మనుషుల ముఖాలన్నీ పరిశీలించు; ఆ క్రోధరేఖలను అర్థంచేసుకో; వాళ్ళ పలుకులోని తీవ్రతను అవగతం చేసుకో; ఇవన్నీ ఇట్టే చల్లారిపోవటానికి వీలుందా?'-

'లేదుగాని - ఆ శుభదినం మన జీవితకాలంలో వస్తుందా రాదా అని నా సందేహం'-

'ఏవీఁ?'-

'తుది విజయం మనం చూడమేమో'-

'తుదివిజయం చూస్తామూ, చూడమూ అన్నది ప్రశ్నకాదు. విజయానికి తోడ్పడటమే మన ఆశయం - మన జీవితంలోనే సాధించితీరగలమని నా నమ్మకం. అలా కాకపోయినా మరేం బెంగలేదు - ఆ కార్యరంగంనుంచి అడుగు వెనక్కువేసేది లేదు.'

తనను పిరికిపందక్రింద జమకట్టి మాట్లాడుతోందని డిఫార్జ్‌కి పొడుచుకొచ్చింది:

'ఆఁ! - ఏవిఁటీ - నేనుమాత్రం? -' అన్నాడు.

'అవును - అదే నేను చెబుతున్నది. కాని నీలో బలహీనత వుంది. నీకు ఎప్పుడూ, ఏ శత్రువో, ఏ అవకాశమో ఎదట కనుపించుతూవుండాలి; లేకపోతే చచ్చుబడిపోతావు. అలాంటిది లేకుండా నిభాయించుకురావాలి; అవసరం వచ్చేవరకూ మనలో వున్న పెద్దపులిని గొలుసులేసి కట్టేసి అట్టిపెట్టుకోవాలి గాని చంపేసుకోగూడదు. అవసరం వచ్చినప్పుడు గొలుసులు ఊడదీసి బరిమీదికి వదలాలి'. ఈమాట చెబుతూ బల్లమీద వున్న డబ్బుమూట చంకలోకి తీసుకుని, చాలా ప్రొద్దుపోయింది వెళ్లి పడుకుందాం అని లేచి నిల్చుంది.

ఆ మర్నాటి మధ్యాహ్నం ఆ యువతి యథాప్రకారం పానశాలలో అమ్మకం బల్లదగ్గిర కూర్చుని, లతలు కుట్టుకుంటోంది. ఆ బల్లమీద ఒక గులాబిపువ్వు పడేసివుంది; తోచనప్పుడల్లా ఉండుండి ఆ పువ్వువంక చూస్తోంది. ఆవేళ పానశాలలో యెంతోమంది. లేరు. తీవ్రంగా యెండకాస్తోంది. మాడమ్ డిఫార్జ్ చుట్టూ బల్లలమీద ఏదో బంకపులిమిన కొన్ని గాజుగ్లాసులు పెట్టివున్నయ్. వాటిమీదకు వచ్చి వాలుతున్న ఈగలు చచ్చి గ్లాసుల్లో పడుతున్నయ్. మళ్ళీ వచ్చి వాలబోతున్న యీగలు వీటి కళేబరాలను చూస్తూ కూడా లెక్కచేయటంలేదు. వాటికి పుట్టిన జబ్బేవిఁటో అవగతం చేసుకోవటంలేదు. ఆ చచ్చినవి అవేవో చాలా స్వల్ప ప్రాణులైనట్టు, తామేమీ పెద్ద ఏనుగులైనట్టూ మదంగా వచ్చి ఆ గ్లాసులమీద వాలి అవి కూడా చచ్చిగ్లాసుల్లో పడుతున్నయ్. బహుశా అవికూడా రాజదర్బారులో వున్నవాళ్ళమనుకుంటున్నాయో యేమో!.

ఇంతలోనే యెవరో ఒక వ్యక్తి లోపలికి వచ్చాడు. అతని నీడ, తల వంచుకు లతలు కుట్టుకుంటున్న మాడమ్ డిఫార్జ్‌మీద పడ్డది. అదేదో కొత్తనీడలా ఆవిడకు తోచింది. చేతిలోవున్న కుట్టుసామాను బల్లమీద బెట్టి, బల్లమీదవున్న గులాబిపువ్వు తీసి తలలో బెట్టుకుని అనంతరం తల పైకెత్తి అతనివంక చూచింది.

చిత్రమైన సంఘటన; ఆ స్త్రీ గులాబిపువ్వు తీసి తలలో ఎప్పుడు గుచ్చుకున్నదో, వెంటనే అక్కడ నున్న యావన్మందీ మాట్లాడుకోవటం మానేశారు. ఒకరొకరే లేచి బయటికి వెళ్ళిపోతున్నారు.

'నమస్తే!' అన్నాడు కొత్తమనిషి.

'నమస్తే!' అంటూ ప్రత్యభివాదం చేసి మాడమ్ కుట్టు సామాను చేతిలోకి తీసుకుంది; లోలోపల నెమరుకు తెచ్చుకుంటోంది - వయసు షుమారు నలభై, ఎత్తు ఆరడుగులు, నల్లటి జుట్టు, కాటుకకళ్లు, చామనచాయ, కోలమొహం, గద్దముక్కు ముక్కుచివర ఎడమబుగ్గమీదికి వంపు.

'గుక్కెడు చల్లటి మంచితీర్థం - ఒక గ్లాసెడు ఒకటో రకం వైను యిప్పించండి!'-

మాడెమ్‌డిఫార్జ్, చాలా గౌరవపురస్సరంగా, ఆ వ్యక్తి అడిగిన పానీయాన్ని అందించింది.

'ఆహాహా! ఎంతబాగున్నదండీ!' అంటూ మెచ్చుకున్నాడు, ఆ కొత్తమనిషి.

ఆ వైను సంగతి మనిషికంటే ఆవిడకే యెక్కువ బాగా తెలుసు; ఇంతవరకు, ఆ పానీయాన్ని మెచ్చుకున్న ప్రప్రథమ వ్యక్తి అతడే. అయినా మేడమ్ డిఫార్జ్ కాదనలేదు. చిరునవ్వు నవ్వుతూ కుట్టుసామాన్లు మళ్లా అందుకుంది. ఆ మనిషి ఆ కుడుతున్న వ్రేళ్ళవంక ఒకటి రెండు క్షణాలు పరిశీలనగాచూచి, అనంతరం ఆ అవకాశం తీసుకుని, నలుముఖాలా కలయజూస్తూ ఆ ప్రదేశాన్నంతా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించుతున్నాడు.

'మీకు కుట్టుపని బాగా చేతొనల్లేవుంది' అన్నాడు.

'బాగా అలవాటే'

'ఆ లతకూడా పసందుగా వుంది'-

'నిజంగా పసందుగావున్నదంటారా?' అతని వంకచూసి చిరునవ్వు నవ్వింది.

'చాలా పసందుగా వుంది... ఏవిఁటి కుడుతున్నారు'-

'ఏదో తోచక'

'అంతేనా?'-

'అంతే - ఇలాగే యేవో కుడుతుంటే మొత్తంఅంతా కలిపి యేదన్నా తయారుచెయ్యొచ్చు.'

మాడమ్ డిఫార్జ్ సిగలో ఆ గులాబిపువ్వు వుండటం ఒక ప్రత్యేకతగా కనుపించుతోంది; కారణమేమిటంటే, సెయింట్ ఆంటోనీప్రాంతంలో నివసించే స్త్రీలలో సాధారణంగా, గులాబి పువ్వు తలలో పెట్టుకునే స్త్రీ యెవ్వరూ కనుపించరు. ఒక యిద్దరు మనుషులు హడావిడిగా లోపలికివచ్చి, సారాగ్లాసులకు ఆర్డరివ్వబోయారు. తీరా లోపలికి వచ్చి ఆ గులాబిపువ్వువంక జూచి వెనక్కుతగ్గి యెవరికోసమో వెతకొచ్చిన వాళ్లలాగ యిటూ అటూ తొంగిచూసి బయటికి వెళ్లిపోయారు. అంతేగాదు, ఆ కొత్తమనిషి లోపలికిరాకపూర్వం ఆ పానశాలలో కూర్చుని బాతాఖానీ వేస్తున్న వాళ్ళలో యే ఒక్కడూ మిగలకుండా బయటికి వెళ్లిపోయారు. ఆ వచ్చిన గూఢచారి కళ్లు తెరుచుకునేవున్నాడు. కాని అతనికి యిదంతా రవ్వంతేనా అర్థం కాలేదు. ఏదో మామూలుధోరణిలో వెళ్లిపోయినట్టే వెళ్లిపోయారు.

'ఏవండీ మీకు వివాహమైందా?' అని ప్రశ్నించాడు.

'అయింది'

'పిల్లలా?'

'లేరు'-

'వ్యాపారం యేవంత బాగున్నట్టు లేదే'

'ఏం బాగుంటుంది - ఇక్కడవుండే వాళ్లంతా పొట్టకూటికి గతిలేని మూక'

'అవును పాపం నిర్భాగ్యులు - మీరన్నట్టు - పీడిత ప్రజ'

'నే నన్నట్టా! - ఏవిఁటీ?'-

'ఎబ్బే ఏవీఁలేదులెండి - మీరనటం కాదు - నేనే అంటున్నాను - మీరు మాత్రం అలా అనుకోవటంలేదూ?'-

'అనుకోవటాలూ, అలోచించటాలూ వీటన్నిటికి మాకు తీరికెక్కడుంది. నాకూ మా ఆయనకూ ఈ దుకాణం యీదుకురావటమే చావుతెంపులవుతూ వుంటుంది. మేవు ఆలోచించేదల్లా ఒక్కటే - "బ్రతకట మెట్లాగా" అని. మా బ్రతుకు సంగతోటి మేము ఆలోచించుకుంటే చాలు - ఇతరుల సంగతులదాకా పోనక్కర్లేదు.'

గూఢచారి తెల్లముఖం వెయ్యలేదు. బాతాఖానీ కొట్టాలనే ధోరణిలో వున్నవాడులా లేచి మాడమ్ డిఫార్జ్ బల్లదగ్గిరికొచ్చాడు. మోచేతులు బల్లమీద ఆనించి, మధ్యమధ్య గుక్కెడు గుక్కెడు వైను త్రాగుతూ కబుర్లాడుతున్నాడు :

'గాస్పర్డును ఉరిదీయటం, ఎలాగైనా చాలా కిరాతకృత్యం సుమండీ - దారుణం-హుఁ! పాపం యెంత మంచివాడు.'

మాడమ్ డిఫార్జ్ తొణక్కుండా సమాధానం చెప్పింది : 'ఇదిగో? నేనొకటి చెబుతాను వినండి - ఇలాంటి విషయాల్లో కత్తులూ కటార్లూ ఉపయోగించేవాళ్ళు యేనాటికైనా నాశనంగాక తప్పదు. చేసుకున్నవారికి చేసుకున్నంతా అనుభవించక తప్పుతుందా?'

తనో పెద్ద విప్లవవాది అయినట్టూ, గాస్పర్డును గురించి అలా మాట్టాడటం అతనికి కంటకంగా వున్నట్టూ పోజు బెట్టాడు. గొంతు తగ్గించి ఎంతో ఆంతర్యంవున్న నమ్మకస్తుడిలాగా ముఖంలో ముఖంబెట్టి మాట్టాడుతున్నాడు :

'మీకు తెలియదుగానీండి! ఆ ప్రాంతంలోవున్న జనానికంతకీ గాస్పర్డ్‌పట్ల యెంత అనురాగముంది? వాళ్ళంతా ఎంత మండుతున్నారంటారు?- మనలో మనమాట'

'మండుతున్నారంటారా?'

'లేదంటారా?'-

'-అరుగో! మా ఆయన వచ్చారు!'

డిఫార్జ్ లోపలికి అడుగుబెట్టడంతోనే, గూఢచారి 'నమస్తే! జాక్విస్‌గారూ!' అంటూ, అభివాదం చేశాడు.

జాక్విస్ కొంచెం కంగారై కాళ్లు తొక్కుతున్నాడు; కాని మళ్లీ వెంటనే నిభాయించుకుని: 'మీరు! పొరబడుతున్నారు - ఎవరో మరోమనిషని పొరపాటు బడుతున్నట్టున్నారు నా పేరు జాక్విస్‌గాదు - ఎర్నెస్టు డిఫార్జ్'-

'ఏదైతే యేవిఁలెండి - నమస్తే!' -

'నమస్తే'

'నేనూ మాడమ్ డిఫార్జ్ యేదో మాట్టాడుకుంటున్నాం లెండి - నేను చెబుతున్న దేవిటంటే - గాస్పర్డ్‌ను అలా చిత్రవధ చెయ్యటం సెయింట్ ఆంటోనీ ప్రాంతంలోవున్న యిక్కడివాళ్ల కందరికీ చాలా కంటకంగా వుందంటున్నాను - ఔనంటారా కాదంటారా?'

'అలా అని నాతో ఏ వొక్కడూ అనలేదు' అన్నాడు డిఫార్జ్ : 'అలా అనుకుంటున్నారని నాకు తెలీనే తెలీదే?' అంటూ డిఫార్జ్ అమ్మకంబల్లవెనక్కు నడిచి, భార్య కూర్చున్న కుర్చీ వెనకచట్రం పుచ్చుకు అతనివంక జూస్తూ నిల్చున్నాడు.

ఆ గూఢచారి ఆరితేరిన ఘటం. తొణకూ బెణుకూ లేకుండా, నిల్చుని గ్లాసులోవున్న వైను ఆఖరుచేసి, ఒక గుక్కెడు చల్లటి మంచినీళ్లు గొంతులో పోసుకుని, మరోగ్లాసు వైనుకు ఆర్డరిచ్చాడు. మాడమ్ డిఫార్జ్ అంతకంటే తాపీగా వైనుగ్లాసు అతనికి అందించి, మళ్లీ కుట్టుసామాను అందుకుంది. ఏదో జాతీయగీతం ఒకటి కూనిరాగంగా ఆలాపన చేస్తూ, తలెత్తి చూడకుండా కుడుతోంది.

'ఈ ప్రాంతం సంగతి నాకంటే మీకు బాగా తెలుసునల్లే వుంది' అన్నాడు డిఫార్జ్- ఆ క్రొత్తమనిషి ముఖంలోకి చూస్తూ.

'ఎబ్బే యేవీఁ తెలీదండీ - తెలుసుకోవాలనుకుంటున్నాను. పాపం! యిక్కడి బీదవాళ్లందర్నీ చూస్తుంటే నా కెంతో యిదిగా వుంది.'

'ఓహో! అలాగా'-

'డిఫార్జ్ గారూ! మీతో పరిచయం గలగటం నా కెంతో ఆనందంగా వుంది - మీ పేరు విన్నాలెండి'-

'ఓహో అలాగా!'-

'డాక్టర్ మానెట్‌ను విడుదల చేసినప్పుడు ఆయన్ను మీదగ్గిరికే గాదూ తీసి తెచ్చుకున్నారూ - ఆ సంగతులన్నీ నాకు చెప్పారులెండి'

మాడమ్ డిఫార్జ్ మోచేత్తో పొడిచింది, సమాధానం చెప్పమన్నట్టు; డిపార్జ్ 'అవునవును' అన్నాడు.

'ఆయన మీదగ్గిరుండగా, ఇంగ్లండునుంచి ఆయన కూతురూ, టెల్‌సన్సు బ్యాంకు గుమస్తా - ఆయన పేరేవిఁటీ - ఆఁ! ఆఁ! - లారీగారూ మీయింటి కొచ్చారుగదూ?'

'అవును - మా యింటికే'-

'డాక్టర్ గార్నీ, కూతుర్నీ యెరుగుదునులెండి'

'ఆహా - అలాగా'-

'వాళ్ళదగ్గిరనుంచి యీమధ్య మీకు ఉత్తరపత్తరాలేవీ రావటం లేదా?'

'లేదు'-

మాడమ్ డిఫార్జ్ అందుకుంది : 'వాళ్లు ఇంగ్లండు వెళ్లిన కొత్తలో ఒకటి రెండు ఉత్తరాలేవో వ్రాశారు; తరువాత మళ్లీ మా అజ వాళ్లకూ లేదు, వాళ్ల అజ మాకూ లేదు. వాళ్ల బ్రతుకేదో వాళ్లు బ్రతుకుతున్నారు; మాబ్రతుకేదో మేవుఁ బ్రతుకుతున్నాం'

'అంతేలెండి' - అన్నాడు గూఢచారి - 'ఆ అమ్మాయి పెళ్లి జేసుకోబోతోంది'-

'ఇంకా చేసుకోబోవట మేవిఁటి? - ఇంతకాలంగా పెళ్లే చేసుకోలేదా - మీ ఇంగ్లీషువాళ్లు యెలాగైనా మందకొడిమనుషులు'-

'అయిందీ! నేను ఇంగ్లీషువాణ్ణని పసిగట్టేశారూ?'

మాడమ్ డిఫార్జ్ చిరునవ్వు నవ్వింది : 'ఏవిఁటి యిందులో చిత్రం : మాట మనిషిని పట్టిస్తుంది; మాటవింటే మనిషి సంగతి తెలీదూ!'

తను అంత తేలికగా అంతు దొరకటం ఆ గూఢచారికి బాధగానే వుంది; కాని బిక్కముఖం వేయలేదు. నవ్వేశాడు.

'డాక్టర్ గారి అమ్మాయి పెళ్లి చేసుకోబోతోంది - ఒక ఫ్రెంచి జమీందార్ను. గాస్పర్డ్ చిత్రవధకు కారకుడైన ఆ జమీందారు మీకు తెలుసుగదూ - ఆయన సంతతివాణ్ణే- అంటే ఇప్పుడు జమీందారు ఆ కుర్రాడేనన్నమాట. ఆయన యిప్పుడు ఇక్కడ లేదు లెండి - ఇంగ్లండులోనే వున్నాడు. చార్లెస్ డార్నే అనే మారుపేరుతో వున్నాడు.'

ఆ వార్త విని కూడా మాడమ్ డిఫార్జ్ యెప్పటిమాదిరి నిబ్బరంగానే కూర్చుని కుట్టుకుంటోంది. మాన్సియల్ డిఫార్జ్ మాత్రం చలించిపోయాడు; అది కమ్ముకోవటానికి నిప్పుపుల్ల గీసి పైపు ముట్టించుకుంటున్నాడు; నిప్పుపుల్ల పట్టుకున్న అతనివ్రేళ్లు రెండూ కంపించుతూనే వున్నయ్. ఆ చలనాన్ని గనక పసిగట్ట లేకపోతే ఆ గూఢచారి గూఢచారే కాదన్నమాట.

ఆ ఒక్క స్వల్పవిజయాన్నీ ఆజించుకుని, అంతకంటే మరో అవకాశం యేదీ అప్పట్లో లభించే సావకాశం కనుపించక, బర్సాద్, తాను చెల్లించవలసిన బిల్లు చెల్లించుకుని బయటికి వెళ్లిపోయాడు. పోతూ పోతూ వెనక్కి తిరిగి, త్వరలో తిరిగి దర్శనం చేసుకుంటానని చెప్పిపోయాడు. అతను మళ్ళీ తిరిగి లోపలికి వస్తాడేమోననే భయంతో ఆ భార్యాభర్తలిరువురూ అతను బయటికి వెళ్లిపోయినా అయిదారు నిమిషాలవరకూ అలాగే కిక్కురు మనకుండా ఊరుకున్నారు.

అనంతరం, డిఫార్జ్ గొంతు తగ్గించి, భార్యమెడమీదికి వంగి : 'వీడు మిస్‌మానెట్‌ను గురించి చెప్పిందంతా నిజమేనంటావా?' అన్నాడు.

'వాడు చెప్పాడు గనక అబద్ధమే కావచ్చు - నిజమయినా అవొచ్చు!'

'అది గనక నిజమైతే...'

'ఆఁ! - నిజమైతే? -'

'- ఆమాట నిజమైతే అమ్మాయి మొగుడు యిక్కడికి రాకుండా అక్కడే వుండిపోతే అదృష్టవంతుడు.'

'ఎవడిగతి యెలావుందో అలా జరుగుతుంది. ఎవడు ఎక్కడ నశించాలో, విధి వాణ్ణి అక్కడికి యీడ్చుకుపోతుంది.' అన్నది మాడమ్ డిఫార్జ్.

'ఎలాగైనా యిది చాలా విపరీతమైన సంఘటనగా కనిపిస్తోంది. డాక్టర్ మానెట్‌ను మనం యెంతో కడుపులో బెట్టుకుని ఆదరించాం; ఆయన కూతురుమీదకూడా మనకెంతో వాత్సల్యం వుంది. ఆ అమ్మాయి పెనిమిటిపేరు ఇప్పుడు బయటికి వెళ్లిన ఆ వెధవలాంటి వాళ్ళ పేర్లతోపాటు బ్రతుకగూడనివాళ్ళ జాబితాలో మనమే స్వయంగా యెక్కించవలసి రావటం విపరీతమైన సంఘటనకాదూ?'

'ఆ సమయంవస్తే, ఇంకా ఇంతకంటే విపరీతమైన సంఘటనలు ఎన్నేనా జరుగవలసి రావచ్చు' అంటూ నెత్తిమీదవున్న గులాబి పువ్వు తీసి బల్లమీద వుంచేసింది.

ఆ పువ్వుతీసి అలా బల్లమీద వుంచటమే తడవు; బయటి నుంచి ఒకరొకరే అంతా లోపలికి వచ్చేస్తున్నారు. ఒక అయిదారు క్షణాల్లో పానశాల యథాప్రకారం కిటకిటలాడిపోయింది.

సాయంత్రంపూట, సాధారణంగా సెయింట్‌ఆంటోనీ వీధిలో వుండే ఆడామగా యావన్మందీ, కొంచెం ఊపిరి పీల్చుకోవటానికి యిళ్లల్లోనుంచి బయటికి వచ్చి కూర్చుంటారు; కొంతమంది వీధిగడపలమీద చతికిలబడి బాతాఖానీ వేస్తారు. మరికొంత మంది ఆ వీధి మొగలోనూ యీ వీధిమొగలోనూ బృందాలు బృందాలుగా జేరి లోకాభిరామాయణం చెప్పుకుంటూ వుంటారు. మాడమ్ డిఫార్జ్, లతలు కుట్టుకుంటూ ఆ గుంపు దగ్గిరనుంచి మరో గుంపు దగ్గిరికీ, మరో గుంపుదగ్గిర నుంచి మరో గుంపు దగ్గిరికీ తిరుగుతూ వుంటుంది - ఏదో మతప్రచారం చేస్తూ.

ఆ ప్రాంతంలోవున్న ఆడవాళ్లంతా, యెప్పుడూ యేదో వొకటి కుడుతూనే వుంటారు. వాళ్ల దవడలూ పేగులూ కదులుతూ వుండటానికి యెక్కువ ఆస్కారం లేదుగనక, వాటికి మారుగా ఊచలు తేలిపోయిన వ్రేళ్లు అలా కదులుతూవుంటే కొంత ఉపశమనగా వుంటుంది. వ్రేళ్లచలనం ఆగిపోతే కడుపులో వున్న పేగులు చలించి మరింత భీభత్సంగా ఆకలి పుట్టుకొస్తూవుంటుంది. ఆ బాధకు తట్టుకోలేక యెప్పుడూ యేదో ఒకటి కుట్టుకుంటూ కూర్చుంటారు.

వ్రేళ్ల కదలికతోపాటు చూపులుకూడా చలించుతూవుంటై. చూపులతోపాటు భావాలు కూడా పరుగులుబెడుతూవుంటై, మాడమ్ డిపార్జ్ వాళ్ల చేరువకు వచ్చినప్పుడు ఈ మూడు కూడా మరింత ఉజ్వలంగా చలించిపోతూవుంటై.

భార్య అలా ఒక బృందం దగ్గిరనుంచి ఒక బృందం దగ్గిరికి సాగిపోతూవుంటుంటే, మాన్సియర్ డిఫార్జ్, తన గుమ్మంలో నిల్చుని ఠీవిగా చుట్ట కాలుస్తూ లోలోపల అభినందించుతూ వుంటాడు :

'గొప్ప ఆడది! బలసంపన్నురాలు! బ్రహ్మాండమైన మనిషి! నిజంగా ఆలోచిస్తే భయంకర వీరనారి!'-

చీకటి అలుముకుంటోంది. గడపలమీద కూర్చునున్న స్త్రీలకు దూరాన్నుంచి చర్చిగంటలూ, రాజప్రాసాదాలనుంచి సైనికపటాలాల ధణధణారావాలూ వినిపించుతున్నయ్. వాళ్లచుట్టూ కూడా చీకట్లు అలుముకుంటున్నయ్. అంతకంటే దట్టమైన మహాంధకారం ఫ్రాన్సును మొత్తంగా అలుముకోబోతోంది. ఈనాడు చర్చి గోపురాలన్నిటిలోనూ జిలుగు జిలుగుగా మోగే చిరుగంటల నన్నిటినీ కరిగించి భీభత్స నినాదాలు చేసే ఫిరంగి గొట్టాలుగా ప్రోతబోసే దుర్దినం ఆసన్నమౌతోంది. ఆ స్త్రీలు అలానే, కుట్టుకుంటూ మెట్లమీద కూర్చుని నేల రాలిపోయేతలలను లెక్కబెట్టుకుంటూ కన్నీరు కార్చవలసిన దురంధతమసం నలుమూలల నుంచీ చుట్టేసుకొస్తోంది.

25

స్వర్ణోజ్వలములైన సాంధ్యారుణ కిరణాలు పడమటి కొండచాటున మరుగు పడిపోయినై. అప్పుడప్పుడే గగనపథానికి లేస్తున్న చంద్రుని చల్లని కిరణాలు ఆకుల సందునుంచి వాళ్లయిద్దరి ముఖాలమీదనూ పడుతున్నయ్. డాక్టర్ మానెట్ కుమార్తెతోసహా పెరటిదొడ్లోవున్న పచ్చని చెట్టుక్రింద కూర్చునున్నాడు. ఇద్దరిముఖాల్లోనూ ఆనందం జిలిబిలిగా చిందులాడుతోంది.

మర్నాటి ఉదయమే లూసీ వివాహం జరుగుతుంది. అంచేత ఆ సాయంత్రమంతా లూసీ తండ్రితో గడపటానికి నిశ్చయించుకుంది. వాళ్లిద్దరూ ఏకాంతంగా కూర్చుని కులాసాగా కబుర్లాడుకుంటున్నారు.

'నాన్నా! - నీకు సంతోషంగా వుందా?'

'చాలా సంతోషంగా వున్నానమ్మా?'-

'నాక్కూడా అలానేవుంది నాన్నా! చార్లెసుకు నామీద అలాంటి అనురాగం కలగటం నాకెంతో ఆనందంగా వుంది. కాని ఈ వివాహంవల్ల నేను నీకు దూరంకావలసిన పరిస్థితివస్తే నాకెంతో బాధగా వుండేది. ఇప్పుడుకూడా నాకెందుకో...'

మాట్లాడలేకపోయింది; లేచి వెళ్లి పసిబిడ్డలా తండ్రి భుజం మీద పడుకుని, ఆయన ముఖంలోకి తొంగిచూస్తే!

'చెప్పునాన్నా! - ఇప్పుడు చెప్పు - ఈ వివాహంవల్ల నీనుంచి నేను దూరమయ్యే పరిస్థితి యేమీ రాదని నీకు గట్టిగా నమ్మకం వుందా లేదా? అలాంటిది యేమీ రాదని నాకు తెలుసు; నీ మనసులోకూడా అలాంటి నమ్మకంవుందా లేదా అని తెలుసుకోవటానికి అడుగుతున్నాను.'

చిరునవ్వు నవ్వుతూ ఎంతో ఆనందంగా సమాధానం చెప్పాడు : 'ఉన్నది తల్లీ సంపూర్ణమైన విశ్వాసంవుంది -' కుమార్తెను ఆప్యాయంగా ముద్దుబెట్టుకున్నాడు. 'అంతేకాదు తల్లీ! నీ వివాహంవల్ల మునుపటికంటే నా రోజులు ఇంకా ఎంతో ఆనందంగా నడుస్తాయనే అభిప్రాయంకూడా కలుగుతోంది - నా జీవితంలో ఎన్నడూ యెరగనంత ఆనందాన్ని అనుభవించబోతున్నాననుకుంటున్నాను-'

'నిజంగా అలాంటి అభిప్రాయం నీకువుంటే...'

'నమ్ముతల్లీ! నిజం చెబుతున్నాను. నీకు తెలీదుగాని - ఇంతకంటే నా కింకేమీ గ్గావాలి. తల్లీ! నాకు సేవచేస్తున్నానని నువ్వు ఆనందపడుతున్నావుగాని, నాకోసం నీ జీవితమంతా వ్యర్థమైపోతోందంటే లోలోపల నీకోసం నేనెంత ఆందోళన పడ్డానో నీకేం తెలుసు?'

ఆ మాటలు ఆయన నోటినించి రాకుండా అడ్డటానికి లూసీ అరచేతితో తండ్రి నోరు మూసెయ్యటానికి ప్రయత్నించింది. ఆయన ఆ చేతిని ఆప్యాయంగా తన చేతిలోకి తీసుకుని

:

'అవునమ్మా! వ్యర్థమైపోవటంగాక మరేవిఁటి? - జీవితంలో సహజంగా అనుభవించవలసిన సుఖదుఃఖాలన్నిటికీ దూరమై నువ్వు నాకోసం, అసిధారావ్రతంగా ఇలా బ్రతుకుతూ వుండటమంటే యేవిఁటి? నీకు నామీద వుండే ప్రేమచేత అంతా సరీగానే వుందని అనుకునేదానివిగాని, నీ వలా వుంటుంటే నా మనసులో ఎంత దిగులుగా వుండేదో నీకేం తెలుసు? నువ్వే ఆలోచించు; నువ్వు జీవితంలో యే సుఖమూ అనుభవించటం లేదని తోస్తే నే నెలా సుఖంగా బ్రతకగలను? నేనేకాదు - ఏ తండ్రి మాత్రం?'

'నిజంగా చార్లెస్ నా కంటబడకుండా వుంటే - నీతో నేను హాయిగా బ్రతకగలిగే దాన్నే నాన్నా!'-

చార్లెస్ లేకపోతే తన జీవితానికి ఆనందంలేదనే విషయం అనుకోకుండా బయటపడిపోయింది. ఆ వెర్రిమాట విని తండ్రి చిరునవ్వు నవ్వాడు:

'తల్లీ! చార్లెస్ నీ కంటబడనూ పడ్డాడు - నీకు దక్కనూ దక్కాడు! చార్లెస్ కాకపోతే మరొకరయ్యేవారు. స్త్రీవయి పుట్టిన తరువాత జీవితంలో యెవర్నో ఒకర్ని ప్రేమించకుండా ఎలా వుంటావ్? - అలా ప్రేమించకుండా వుంటే, దానికంతకూ కారకుణ్ణి నేనే అయ్యేవాణ్ణి; అంతకంటే దురదృష్టం నా జీవితంలో మరొకటుండేదా?'

డాక్టర్ మానెట్ తాను అనుభవించిన కష్టాలను గురించి యెప్పుడూ పల్లెత్తేనా మాట్టాడేవాడు కాదు. ఆక్షణంలో ఆయన ఆవిషయం ప్రసంగించటానికి ఉపక్రమించటంతో లూసీకి పట్టరాని ఉత్కంఠ కలిగి మౌనంగా కూర్చుని వింటోంది.

'చూడు లూసీ - ఆ చంద్రబింబంవంక చూడు! - నేను జైల్లో వుండగా, జైలు కటకటాలలోనుంచి ఇలానే చూస్తూ వుండేవాణ్ణి; నాకు దక్కకుండాపోయిన నా జీవితంమీద ఆ చంద్రుడు ప్రకాశించుతున్నాడనిపించేది. ఆ వెలుగు చూడలేక పోయేవాణ్ణి. ఆ ఇనప కటకటాలకేసి తల పగులగొట్టుకునేవాణ్ని. అయోమయావస్థలో నిర్జీవాలైపోయిన కళ్లతో ఆ చంద్రుడివంక దిగాలుపడి చూస్తూ కూర్చునే వాణ్ణి; ఆ చంద్రబింబంలో నానుంచి దూరంచేయబడిన నా పసిబిడ్డ ముఖాన్ని ఊహించుకునేవాణ్ణి; ఆ బిడ్డ మగబిడ్డయితే పెద్దవాడయి నాపగ సాధించుతాడని ఆశపడేవాణ్ణి. నేను జైల్లోవున్న రోజుల్లో, కొన్నాళ్ళు, పగ సాధించాలనే కోరిక నాలో భరించరాని ఆవేశంగా జ్వాలలు రేపుతూవుండేది. ఒకవేళ ఆ బిడ్డకు నా అంతూపంతూ తెలియక నా అంతటికి నేనే తనను వీడి వెళ్ళిపోయానని అనుకుంటాడేమోనని బెంగపడేవాణ్ణి: మొగపిల్లడు కాకుండా ఆడపిల్లయితే పెరిగి పెద్దదై, బిడ్డలతల్లి అవుతుందని కలలుగనేవాణ్ణి. ఆ కూతురు నా సంగతేమీ తెలియకుండానే పెరిగినట్టూ - దానికి పెళ్లయినట్టూ - దాని భర్తకుకూడా నా సంగతేమీ తెలియనట్టూ మానవజాతిలో నా చరిత్ర విస్మృతమై పోయినట్టూ, అనుకునేవాణ్ణి.'

'నాన్నా! నీవు యెన్నడూ యెరగని ఆ బిడ్డమీద అలాంటి మమకారంతో వుండేవాడవని వింటుంటే - నాకు ఎంతో యిదిగా వుంది'-

'అవును తల్లీ! నువ్వు నన్ను ఈ విధంగా ఉద్ధరించి ప్రజల్లో పడేశావు గనకనే - ఈవేళ నాకీ కథంతా జ్ఞప్తిరావటానికి ఈ మాటలు నీతో చెప్పుకోటానికీ ఆస్కారం కలిగింది- ఆఁ! - ఏవిటీ? ఇప్పుడు నేను చెబుతున్న సంగతేవిఁటీ?'-

'ఆ బిడ్డ నీ సంగతే తెలుసుకోలేకపోయింది నాన్నా నీకోసం రవ్వంతేనా తాపత్రయ పడలేకపోయింది'-

'ఆఁ! - ఇంతకీ చెప్పొచ్చిందేవిఁటంటే - ఒకోనాడు అలా చంద్రుడిలోకి చూస్తుంటే ఒక చిత్రం జరిగేది. ఆ బిడ్డ చంద్రుడిలోనుంచి దిగి జైల్లోవున్న నా దగ్గిరికి వచ్చినట్టూ, నన్ను జైల్లో నుంచి తప్పించి బయటికి తీసుకుపోతున్నట్టూ మనసుకు తోచేది. ఆ రూపం కళ్ళకుకట్టినట్టు నాకట్టెదుట కనిపించేది. ఇప్పుడు నువ్వు నాయెదట యెలా కనుపించుతున్నావో సాక్షాత్తూ అలానే కనుపించేది! అయితే కావిలించుకుందామంటే అందేది కాదు. ఎప్పుడూ అల్లంతదూరంలో నిల్చుని వుండేది - అబ్బా! ఆ సంగతులన్నీ నీకు అర్థంకావులే లూసీ - ఇల్లాంటివన్నీ నీకు అర్థం కావాలంటే ఒంటరిగా జైల్లో నీవు కూడా చాలాకాలం వుంటేగాని కుదరదు'-

ఆయన యిదంతా ఎంతో ప్రశాంతంగానే చెబుతున్నా, ఆ విషాదగాథ వింటూంటే లూసీ రక్తనాళాలన్నీ చల్లబడి పోతున్నయ్.

'లూసీ! మరో సంగతేవిటంటే! ఆ బిడ్డ పెరిగి పెద్దదైంది. పెళ్లి చేసుకుంది. భర్తతో కాపురం చేస్తోంది. ఒకనాడు వచ్చి నన్ను తన యింటికి తీసుకువెళ్ళింది. తమాషా చూశావ్!- ఆ ఇంట్లో ఎక్కడ చూసినా నాసంగతే - గోడమీద నా ఫోటోవుంది. ప్రార్థనల సమయంలో నాకోసంకూడా ప్రార్థనలు చేస్తున్నారు. ఆబిడ్డ జీవితం ఎంతో ఆనందయుతంగానూ, ప్రయోజనకరంగానూ సాగిపోతోంది. కాని చూచావ్ - నా విషాద చరిత్ర ఆ ఆనంద జీవితాన్నంతా పొగలా అలుముకుపోయింది -'

'ఆ బిడ్డను నేనేనాన్నా! ఆ సద్గుణాల్లో నాకు సగమైనా లేవు -'

'ఇంకా చూశావూ! తన బిడ్డలనందర్నీ నాకు చూపించింది. నన్ను చూసి జాలిపడటం వాళ్లకు నేర్పింది. ఆ పిల్లలు ఏ జైలుముందు నుంచైనా వెడుతున్నారనుకో- ఆ జైలు కటకటాల వంకచూసి, తమలో తాము ఏదో గుసగుసలాడుకునేవాళ్లు; ఇంత చేసినా నన్ను ఆ జైల్లోనుంచి యేనాటికీ విముక్తి చేయలేకపోయేది. ఇలాంటివన్నీ చూపించి, యెప్పటికప్పుడు, నన్ను ఆ జైలు కటకటాల వెనక దిగవిడిచి వెడుతూవుండేది. ఆ వెడుతున్న బిడ్డను చూసుకుని నాలో యేదో వెర్రిఆనందం కలిగేది. కళ్లవెంట నీళ్లు రాలేవి. జైలు కటకటాల వెనకే మోకరిల్లి ఆ బిడ్డను రక్షించమని భగవంతుణ్ని ప్రార్థించేవాణ్ణి'.

'ఆ బిడ్డ నేనే నాన్నా! – నాన్నా! రేపు ఉదయం నన్ను మళ్లా, అంత మహాప్రేమతోనూ ఆశీర్వదించుతావా నాన్నా?'

'లూసీ! యివన్నీ నాకు యిప్పుడు ఎందుకు జ్ఞాపకం వస్తున్నాయనుకున్నావ్? నీవంటే నామనస్సులో ఎంత ప్రేమవున్నదో మాటల్లో చెప్పటానికి సాధ్యంకాదు. నాకు ఈవేళ యింత ఆనందాన్ని అనుభవించే అవకాశం కలుగజేసినందుకు భగవంతుడికి ఎన్నో నమస్కారాలు చెప్పుకుంటున్నాను–'

లేచి కుమార్తెను కావిలించుకున్నాడు. ఆబిడ్డను తనకు యిచ్చినందుకు భగవంతుడికి నమస్కారం చేశాడు. ఆబిడ్డను సర్వదా రక్షించుతూ వుండమని ప్రార్థించారు. ఇద్దరూ కలిసి నెమ్మదిగా ఇంట్లోకి వెళ్ళిపోయారు.

వివాహానికి లారీగార్ని ఒక్కర్ని మినహా మరొకరెవర్నీ పిలవలేదు. మిస్ ప్రాస్ మినహా మరొక తోడుపెళ్లి కూతురుకూడా యెవ్వరూ లేరు. పెళ్ళిఅయిన తరువాత కూడా, ఇల్లూగిల్లూ మార్చేదిలేదు. ఆయింట్లోనే వుంటారు. లేకపోతే పైఅంతస్థులో యింకా మరి రెండుగదులు అదనంగా అద్దెకు తీసుకున్నారు.

ఆ సాయంత్రం తండ్రీ కూతురూ, మిస్ ప్రాస్ ముగ్గురూ కలిసి భోజనం చేశారు. భోజనానంతరం, లూసీ తన గదిలోకి వెళ్లిపడుకుంది. డాక్టర్ కూడా తనగదిలోకి తాను విచ్చేసి నిశ్చింతగా గుండెలమీద చెయ్యివేసుకొని నిద్రపోయాడు.

తెల్లవారుఝామున దాదాపు మూడుగంటలు కావచ్చింది. లూసీకి తండ్రిమీద యెందుకో జాలివేసింది. మెట్లుదిగి తండ్రి గది దగ్గిరికి వచ్చి లోపలికి తొంగిచూచింది.

ఆయన నిశ్చింతగా పడుకుని నిద్రపోతున్నాడు. నెమ్మదిగా లోపలికి అడుగులు వేసింది. గాఢనిద్రలో మునిగివున్న ఆయన నుదురును ముద్దుబెట్టుకుంది. పిల్లికూనలా మళ్ళీ నెమ్మదిగా బయటికి వెళ్ళిపోయింది.

26

ఉజ్వలమైన వసంతోదయం; వివాహ శుభలగ్నం ఆసన్నమైంది. వివాహ మహోత్సవానికి అంతా చర్చికి బయలు దేరబోతున్నారు. డాక్టర్ మానెట్ ముందువాకిట్లో నిల్చుని చార్లెస్ డార్నేతో ఉల్లాసంగా మాట్లాడుతున్నాడు. పెళ్లికూతురు, లారీగారు, మిస్ ప్రాస్, ముగ్గురూ ఆనందంగా వున్నారు. తన తమ్ముడు సాలన్ పెళ్లికొడుకైతే ఇంకాబాగుండేదని మిస్ ప్రాస్ లోలోపల కొంచెం కించంగానే వున్నా, సర్వంసిద్ధమై పోయింది గనుక యిక అలాటిదేమి యోజించి లాభం లేదని మనసుకు నచ్చజెప్పుకుంది.

లారీ, పెళ్ళికూతురు చుట్టూ తిరుగుతూ, పెళ్ళికూతురు ధరించిన వస్త్రాలంకారాలను పరిశీలనగా చూసి అభినందించుతున్నాడు.

'లూసీ! ఇంత చిట్టి పసిబిడ్డను ఒళ్ళో వేసుకొచ్చాను– ఇలాంటి ఆనందదినం అనుభవించటానికే గావల్ను ; ఆనాడు యింతదూరం ఆలోచించనేలేదు సుమీ! మిత్రుడు చార్లెస్‌కు కానుకగా యివ్వడానికి ఈ ఆమూల్యమాణిక్యాన్ని మూటగట్టుకు తెచ్చుకుంటున్నానని ఆవేళ ఊహించలేకపోయాను.' అన్నాడులారీ.

'చార్లెస్‌కు యిద్దామని నువ్వెప్పుడైనా అనుకున్నావా యేమిటసలు? అని యీసడించింది మిస్ ప్రాస్.'

'అవున్లే! అల్లా కళ్లనీళ్లు బెట్టకు మరీ!'

'కళ్ళ నీళ్ళు బెడుతున్నది నువ్వా నేనా?'

'నేనా?'–

'అవును నీమాటే!– నేను చూళ్ళేదా యేవింటిలే–నువ్వు బహుమతి యిచ్చిన ఆ వెండిప్లేటూ ఆ చెంచాలూ వాటి అందం చూస్తే నాకు మాత్రం కళ్ళంబటి నీళ్లు రాలేదా. ఆ సంతోషంలో కళ్లంబటి నీళ్లు గారి అవి కనుపించకుండా కూడా పోయాయ్'–

'అవి యింద్రజాలంగా అదృశ్యమైపోవాలని నా అభిప్రాయం కాదనుకో– అయినా నువ్వు మెచ్చుకున్నావు గనక నాకు సంతోషంగానే వుంది. నాకు కళ్ల నీళ్లు వచ్చింది మాత్రం అందుకు కాదులే– నాకు కూడా యీ యేభయ్యేళ్లనుంచీ ఒక భార్య వుంటే ఎంత బాగుండేదనుకున్నాను.'

'ఏవీఁ బాగుండేది గాదు–మీవాళ్ళు నిన్ను ఉయ్యాల్లో పడుకోబెట్టిన్నాడే ఘోటక బ్రహ్మచారిగా బ్రతకమని ఆశీర్వదించారు'–

'అలా అయితే చాలా అక్రమమే చేశారు– అవునుగాని లూసీ! ఈ సంతోషసమయంలో నేనూ, మిస్ ప్రాస్ నీకు చెప్పదగినవి, నువ్వు వినదగినవీ రెండు ముక్కలున్నయ్. మీ నాన్నగార్ని గురించి నీవు బెంగబెట్టుకో నక్కర్లేదు. ఆ విషయం మాకు వదలివెయ్యవచ్చు; మేఁము అమిత జాగ్రత్తగా చూస్తూవుంటాం. అవసరమైతే టెల్‌సన్సు బ్యాంకు బాధ్యతలను కూడా కట్టిపెట్టేసి ఆ వ్యవహారం స్వయంగా చూసుకుంటాను. 'హనీ మూను'కు నీవూ నీ భర్తా వార్ విక్ షైర్‌లో వుండే ఈ పక్షం రోజులూ, ఆ బాధ్యత మా మీద వదిలెయ్. మరో పక్షంరోజులు గడపటానిక మీరు వేల్సుకు వెడితే అప్పుడు ఆయనవచ్చి మిమ్మల్ని కలుసుకుంటాడు. 'ఆరోగ్య ఉత్సాహాలతో కాపాడి నా తండ్రిని నా దగ్గిరికి పంపినందుకు మీకు వందనములు' అని నువ్వు ఆ వేళ మాకు ఉత్తరం వ్రాసి తీరతావు చూడు! ఎవరో లోపలికి వస్తున్నట్టున్నారు. ఈ లోగా ఘోటక బ్రహ్మచారిని ఒకసారి ముద్దు బెట్టుకొని ఆశీర్వదించనియ్యి'

డాక్టర్ మానెట్ చార్లెస్‌ను వెంట బెట్టుకుని గదిలోకి వచ్చాడు. ఆయన ముఖం తెల్లగా వివర్ణమై వుంది. అయినా పైకి మాత్రం చాలా గంభీరంగానే కనుపించుతున్నాడు.

డాక్టర్ మానెట్ కుమార్తె చెయ్యిబట్టుకుని మేడమెట్లు దింపి వీధిలో నిలబెట్టివున్న కోచ్‌లో యెక్కించాడు. మిగతా వాళ్లంతా మరో బండిలో యెక్కి బయలుదేరారు. చేరువలో వున్న చర్చిలో లూసీ డార్నేల వివాహం వైభవంగా జరిగింది.

వివాహానంతరం అంతా యింటికి తిరిగి వెళ్లి భోజనాలు చేశారు.

దంపతులు హనీమూన్‌కు బయలుదేరుతున్నారు. గడపలోకి రాగానే లూసీ తండ్రిని కావిలించకుని కళ్ళనీళ్లు బెట్టుకుంది. డాక్టరు మాసెట్ మాత్రం అమిత గంభీరంగా నిభాయించకున్నాడు: 'నాయనా! చార్లెస్! వచ్చి తీసుకువెళ్లు!' అంటూ అల్లుణ్ణి పిలిచి వప్పగింతచేశాడు.

కోచ్ వెళ్లిపోతోంది. లూసీ కోచ్ కిటికీలోనుంచి ముందుకు వంగి కడసారి తండ్రివంక చూసి చెయ్యి వూపింది.

దంపతులకు వీడ్కోలు ఇచ్చి లారీ, మిస్ ప్రాస్, డాక్టర్ మానెట్, ముగ్గురూ తిరిగి లోపలిహాల్లోకి వచ్చారు. లోపలికి వచ్చీ రావటమే డాక్టర్‌లో భయంకరమైన మార్పు వచ్చినట్టు లారీ గమనించాడు. డాక్టర్ మానెట్ మాటమాత్రమైనా పలక్కుండా పూర్వంమాదిరిగా, జుట్టులోకి వేళ్ళుపోనిచ్చి తల తడుముకుంటూ మౌనంగా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

లారీ, మిస్‌ప్రాస్ చెవిలో రహస్యంగా చెప్పాడు: 'ఇప్పుడు మనం ఆయన్ను పలకరించకుండా వుండటమే మంచిది. నేను కొంచెం ఆఫీసుదాకా వెళ్లిరావలసిన పనుంది. నేను తిరిగివచ్చి వెంటబెట్టుకుని షికారు తీసుకెళ్ళి అలా అలా తిప్పితీసుకు వస్తాను. మరేం ఫరవాలేదులే కంగారుపడకు.'

ఆఫీసుకు వెళ్ళటమంటే తేలికగా వెళ్లొచ్చుగాని, దాంట్లోనించి బయటపడమంటే ఒక పట్టానసాధ్యపడే విషయమా మరి? బ్యాంకులో రెండు మూడుగంటలసేపు ఉండవలసి వచ్చింది. అనంతరం చకచకా తిరిగివచ్చి, సరాసరి మేడమెట్లెక్కాడు. డాక్టర్ మానెట్ గదిగుమ్మం ముందు అడుగుబెట్టగానే 'టక్ టక్' సుత్తి దెబ్బలు వినుపించుతున్నయ్.

'అయ్యో బాబోయ్!' అని హడిలి' నిల్చునిపోయాడు. మిస్ ప్రాస్ గగ్గోలు బెట్టుకుంటూ దగ్గిరికొచ్చింది: 'కొంప మునిగి పోయింది!- అమ్మాయికి యేం చెబుదాం?- నన్ను గుర్తేపట్టడం లేదు; చెప్పులు కుట్టడం మొదలుబెట్టాడు!' అంటూ గుండే గుండే బాదుకుంటోంది.

నానా తంటాలూబడి, మిస్ ప్రాస్‌ను అలా అలా సమదాయించి, లారీ నెమ్మదిగా డాక్టర్ గదిలోకి అడుగు బెట్టాడు. డాక్టర్ మనలోకంలో లేడు. వంచిన తల యెత్తకుండా అయోమయంగా కూర్చుని చెప్పులు కుట్టేస్తున్నాడు.

'డాక్టర్ గారూ! ఇటుచూడండి! డాక్టర్ గారూ!'

డాక్టర్ ఏవిఁటన్నట్టు తలపైకెత్తి, ఒక క్షణంసేపు పరకాయించి చూశాడు. తిరిగి తల దించేసుకుని తన పనిలో తాను నిమగ్నుడైపోయాడు.

లారీ దగ్గిరికి వెళ్లాడు. ఆయన కుడుతున్న చెప్పు కాక, అక్కడ మరొక చెప్పు పడివుంది. లారీ ఆ చెప్పు చేతులోకి తీసుకుని: 'ఇది యేనమూనా చెప్పు?' అన్నాడు.

మానెట్ తల పైకెత్తి చూడకుండానే గొణిగాడు: 'ఆడవాళ్లు షికారువెళ్లే నమూనా-వాటిని చాలారోజుల క్రితమే పూర్తి చెయ్యవలసింది-పూర్తిచేసెయ్యాలి.'

'కాని డాక్టర్ గారూ! ఇటు చూడండి- నావంక చూడండి!- నన్ను గుర్తు బట్టలేరా?- మీవృత్తి చెప్పులు కుట్టు కోవడంగాదు-ఇటు చూడండి!-ఆలోచించండి!'

తల పగలగొట్టుకున్నా, ఆయన మాట్టాడే స్థితిలోలేడు. గోడతో మాటాడితే ఎంత ప్రయోజనకరమో, ఆ సమయంలో ఆయన్ను పలకరించటం అంత ప్రయోజనకరం!

లారీ మధనలో పడ్డాడు. మొదటిది, ఈ విషయాన్ని లూసీకి తెలియనియ్య కూడదనుకున్నాడు. మిస్ ప్రాస్‌తో ఆలోచించాడు: డాక్టర్‌గారికి వంట్లో బాగుండలేదనీ, ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్టూ, డాక్టర్ గారికోసం వచ్చే రోగుల కందరికి చెప్పి పంపివేశాడు- డాక్టర్ గారు ఎవరో రోగికి చికిత్స చేసే నిమిత్తం గ్రామాంతరం వెళ్ళినట్టు, గ్రామాంతరంనుంచి మిస్ ప్రాస్‌కు ఉత్తరం వ్రాసినట్టూ.

డాక్టర్ గారు త్వరలో తిరిగి తేరుకోగలడనే ఉద్దేశంతో లారీ యీ చర్యలు తీసుకున్నాడు. ఇంకా యేవిఁటంటే, తన జీవితంలో మొట్టమొదటిసారిగా ఉద్యోగానికి సెలవుబెట్టి, పగలూ రాత్రీ ఆయన్ను కనిపెట్టుకు కూర్చోటానికి నిశ్చయించుకున్నాడు. డాక్టరు గదిలోనే కిటికీకి చేరువుగా బల్లా కుర్చీ వేసుకుకూర్చుని, ఆయనవంక చూడనట్టు నటించుతూ, ఆయన్ను జాగ్రత్తగా గమనించుతున్నాడు.

ఆయన్ను పలకరించి లాభంలేదనే విషయాన్ని మొదటినాడే గమనించాడు. ఎంచేతనంటే: పలకరించినకొద్దీ ఆయన మరింత చికాకు పడుతున్నట్టు కనుపించుతున్నాడు. అందుచేత: అల్లాంటి అయోమయావస్థలో పడ్డందుకు అసమ్మతి సూచకంగా నిలబెట్టిన ఫోస్టర్ బొమ్మలా ఆయనకు ఎదురుగా మౌనంగా కూర్చున్నాడు. ఏదో చదువుకుంటూనో వ్రాసుకుంటూనో కిటికీదగ్గిర కుర్చీలో కాలక్షేపం చేస్తున్నాడు.

ఆ మొదటినాడు, డాక్టర్ మానెట్ తినటానికి యెదట బెట్టిందేదో తినేసి, పనిలో కూర్చుని వంచినతల ఎత్తకుండా చెప్పులు కుట్టేస్తున్నాడు. చీకటిబడి కళ్లు కనిపించక చేతిలోవున్న పనిముట్లు పక్కకి బెట్టివెయ్యంగానే లారీ కుర్చీలో నుంచి లేచొచ్చి:

'అలా! బయటికి వెడదామా' అన్నాడు.

'బయటికా?'- డాక్టర్ అయోమయంగా గొణుక్కున్నాడు. తల అరచేతుల్లోకి దించేసుకుని జుట్టు పీక్కుంటూన్నాడు.

ఆ రాత్రి తెలవార్లూ, లారీ కొంతసేపూ, మిస్ ప్రాస్ కొంతసేపూ వంతులమీద మేలుకునుండి ఆయన్ను కనిపెడుతున్నారు. డాక్టరు గదిలో ఇటూ అటూకొంచెంసేపు మందకొడిగా పచార్లుచేసిపోయి పక్క మీద పడుకుని నిద్రపోయాడు. మళ్లీ ఉదయమే లేచి చెప్పులు ముందేసుకు కూర్చున్నాడు.

రెండోనాడు కూడా సరీగా అలానే జరిగింది. ఆ సాయంత్రం క్రిందటిరోజు మోస్తరుగనే, లారీ 'షికారు వెడదామా' అని అడిగి డాక్టర్ నుంచి సమాధానం మేవీఁ రాకపోవటం గమనించి, తానొక్కడే వెడుతున్నట్టు నటించి జోకుగా బయటికి వెళ్ళిపోయాడు. మళ్ళీ ఒక గంటకల్లా తిరిగివచ్చి చూస్తే డాక్టర్ కిటికీదగ్గిర నిల్చుని, కిటికీలోనుంచి దొడ్లోవున్న చెట్టూ వంక దిగులుగా తొంగిచూస్తున్నాడు. లారీ లోపలికి వచ్చిన అలికిడితగలగానే నెమ్మదిగా పిల్లికూనలా కదిలి చెప్పులు కుట్టుకునే బెంచీదగ్గిరికి వెళ్లిపోయాడు.

రోజులు నెమ్మదిగా గడిచింది. నాలుగూ, అయిదూ, ఆరూ, ఏడు, ఎనిమిది, తొమ్మిది రోజులు గడిచిపోయినై.

లారీ, ఈ పరిస్థితినిమాత్రం లూసీకి తెలియనియ్యకుండా అతి భద్రంగా కాపాడగలిగాడు. తొమ్మిదోనాడు సాయంత్రం మాత్రం డాక్టర్ పనిచేయటంలో లారీ ఒక సంగతి గమనించాడు ఆ పనిని అతి తొందరతొందరగా ముగించాలనే ఆందోళన ఆయన వ్రేళ్ళలో కనుపించుతోంది.

27

ఆ తొమ్మిది రోజులూ, అలా, పగలూ రాత్రీ అనకుండా, కంట్లో వత్తులు వేసుకొని, అమితాందోళనగా, కనుపెట్టుకు కూర్చోవటంతో లారీ, బాగా బడలిపోయాడు. గాఢంగా నిద్రబట్టిపోయింది. పదోనాడు ఉదయం, కిటికీలోనుంచి సూర్యరశ్మి ముఖంమీద పడటంతో త్రుళ్లిపడి నిద్రలేచాడు.

లారీ కళ్లు నలుపుకుంటూ మత్తు వదిలించుకోవటానికి ప్రయత్నించుతున్నాడే గాని, యింకా నిద్రావస్థలోనే వున్నానా, మేలుకుని వున్నానా అనే సందిగ్ధావస్థలోనే వున్నాడు. కారణమేవిఁటంటే: డాక్టర్ గదిగుమ్మంలోకి వెళ్లి తొంగిచూసేసరికి అతనికి చాలా ఆశ్చర్యం కలిగింది. చెప్పులుకుట్టే సామాన్లు వగైరా యావత్తూ పెడగాసర్దేసి వున్నయ్. డాక్టర్ తను మామూలుగా, ఉదయంపూట వేసుకునే దుస్తులతో, కిటికీకి ప్రక్కగా వున్న కుర్చీలో నిమ్మకు నీరెత్తినట్టు హాయిగా కూర్చుని చదువుకుంటున్నాడు.

లారీకి, యిప్పుడు తాను మేలుకునేవున్నట్టు ఘట్టినమ్మకమే కలిగినా, ఇన్ని నాళ్ళుగా డాక్టరు చెప్పులు కుట్టుకుంటూ కూర్చున్నట్టు తనకు కనిపించిన ఆ దృశ్యమంతా తనకు నిద్రలో సంభవించిన పీడకలేమోననే అనుమానం కలిగింది. అవును మరి, నిన్నటి రాత్రి ప్రొద్దుపోయే వరకూ అంత అయోమయావస్థలో కనుపించిన డాక్టర్ తెల్లవారేసరికి ఆ చిహ్నాలు లవలేశమైనా లేకుండా తీరిగ్గా చదువుకుంటూ, కట్టెదుట కనుపించుతుంటే ఏమనుకోవాలి?

కాని ఆ సందేహం మరుక్షణంలోనే తీరిపోయింది. ఏమంటే: అలాంటి సంఘటన వాస్తవంగా జరిగివుండకపోయినట్లయితే, టెల్సన్సు బ్యాంకులో సదమదమవుతూ ఊపిరి సలపకుండా ఉక్కిరిబిక్కిరౌతూవుండే లారీ అనే తాను, డాక్టర్ యింటికి వచ్చి, కట్టుకున్న గుడ్డలన్నా విప్పకుండా సోఫాలో పడుకుని నిద్రపోవలసిన అవసరం ఎందుకు గలుగుతుంది? తూరుపు తెల్లవారుతుండగానే, డాక్టర్ గదిగుమ్మంలో నిల్చుని, ఇలాంటి మథనలో పడవలసిన అవసరం ఎందుకు కలుగుతుంది?

ఇంతలో మిస్ ప్రాస్ గుబగుబ లాడుతూ పరుగెత్తుకొచ్చి, చెవులో యేదో చెప్పటంతో, యింకా రవ్వంత సందేహ మేదైనా మిగిలివుంటే ఆ కాస్తా తీరిపోయింది. భోజనంవేళ అయేవరకూ ఆయన్ను యేవీఁకదిలించకుండా అలాగే వూరుకోవటానికి నిశ్చయించుకున్నారు. ఆనక, కావలిస్తే, డాక్టర్ పరిస్థితిని అర్థం చేసుకుని వ్యవహరించటానికి నిర్ణయం చేసుకున్నారు.

లారీ యిచ్చిన సలహాను శిరసావహించి మిస్ ప్రాస్ తు.చా తప్పకుండా నడుచుకుంది. ఇద్దరూ కలిసి ఆ పథకాన్ని దిగ్విజయంగా అమలు జరిపారు. లారీగారి స్నానాదికాలు ఒక పట్టాన తెమిలేవి గావు: ఆయన స్నానంచేసి బట్టలు మార్చుకోవటం పూర్తి అయేసరికి భోజనం వేళయింది. వచ్చి భోజనం బల్లదగ్గిర కూర్చున్నాడు. మిస్ ప్రాస్ వెళ్లి, మామూలుగా పిలిచినట్టే, డాక్టర్ గారిని భోజనానికి పిలిచింది.

డాక్టర్‌గారిని కలవర పర్చకుండా వుండటానికి తగిన జాగ్రత్తలన్నీ తీసుకుంటూ లారీ చాలా తెలివి తేటలుగా ప్రసంగం నడుపుకొస్తున్నాడు. ఆ అవధులలో ఆయన్ను యెంతవరకూ అర్థం చేసుకోవటానికి వీలుందో అంతవరకే అర్థం చేసుకోవటానికి

ప్రయత్నించుతున్నాడు. ఆటే అర్థం చేసుకోగా, డాక్టరు తన కుమార్తెపెళ్లి అయింది. నిన్ననేననే అభిప్రాయంలో వున్నట్టు, అతనికి తేలింది. ఎంచేతనంటే, ప్రసంగవశాత్తూ ఆనాటి తేదీ, నెలా గుర్తుకు తెచ్చేసరికి డాక్టర్ లెక్కజూసుకుని కొంచెం కలవరపడ్డట్టు గమనించాడు. అంచేత తిరిగి ఆ ప్రసంగం యెత్తకుండా లారీ ధోరణి మార్చాడు. భోజనాలు పూర్తిఅయినాయి; లారీ, డాక్టరూ ఏ కాంతంగా కూర్చుని కులాసాగా కబుర్లాడుతున్నారు. లారీ, లోలోపల యేదో ఆందోళన పడుతున్న వాడులా నెమ్మదిగా ఉపక్రమించాడు:

'డాక్టర్‌గారూ! మనకో స్నేహితున్నాడండీ! మనకు బాగా కావలసినవాడు లెండి! ఆయన కేసువిషయంలో కొంచెం మీ సలహా కావలసివచ్చింది. వైద్యవిషయాలల్లో మీరు అన్నీ తెలిసినవారుగనక మీకు ఎలా తోస్తుందో చెప్పలేనుగాని, నాకు మాత్రం చాలా విచిత్రమైన వ్యాధిలాకనుపించుతోంది!

డాక్టర్ మానెట్ తన అరచేతి వ్రేళ్ళ వంక చూసుకుంటూ, లారీ చెప్పిన కథంతా చాలా శ్రద్ధగా విన్నాడు.

'చూశారూ! డాక్టర్‌గారూ! పాపం, అతను మనకు చాలా ఆప్తుడు సుమండీ! మీరు కాస్త జాగ్రత్తగా ఆలోచించి నాకు తగిన సలహాచెప్పాలి– పాపం ఆయనకు ఒక కూతురు కూడా వుందండీ! పాపం, ఆ అమ్మాయి ఆయనంటే పంచప్రాణాలు విడుస్తుంది సుమండీ'–

'నాకు, చూడగా, యిదేదో, మనోవ్యథచేత కలిగిన మానసిక వ్యాధిగా కనుపించుతోంది; అన్నాడు డాక్టరు.

'అవునండీ! ఆబాపతే!–

'ఇంకా వ్యాధి స్వభావమంతా వివరంగా చెప్పండి ఆలోచిద్దాం'.

'మీరన్నట్టు ఆయన చాలారోజులు, రోజులేవిఁటి చాలా సంవత్సరాలపాటు యమయాతనలనుభవించాడు. ఆదశలో ఆయనకు సొంతం మతిపోయిందనే చెప్పవచ్చు. దైవకృపవల్ల ఆ అగచాట్లలోనుంచి బయటపడే సావకాశం కలిగింది. తిరిగి ప్రజల్లో పడ్డాడు; ఆయన తిరిగి ప్రజల్లోకి యెలా వచ్చాడో కూడా ఆయనకి తెలీదు– ఆమాట ఆయనే స్వయంగా చెప్పటం నేను విన్నాను. అంతాశుభ్రంగా బాగుపడి దారికి వచ్చిన వాడేనండి: చక్కగా తన వృత్తి తను చేసుకుంటున్నాడు; మామూలు ప్రకారం చదువుకోవటం, నలుగురితో కులాసాగా మాట్లాడ్డం, పెద్దమనిషని అనిపించుకోవటం, యిదంతావుంది. కాని, దురదృష్టవశాత్తూ, యీ మధ్యా–మళ్లా అంతా తిరగబెట్టిందండి– ఉన్నట్టుండి అయోమయమై పోయాడు'

'అలా ఎన్నాళ్లపాటున్నాడు?'

'తొమ్మిది పగళ్లూ తొమ్మిదిరాత్రులూ'–

'తిరగ బెట్టటమంటే యేవి జరిగిందంటారూ?– పూర్వం మతిబోయిన తరుణంలో చేస్తూవుండే పనులేవైనా చెయ్యటం మొదలు బెట్టాడా?'

'ఆఁ!– అదేనండీ!'–

'అయితే ఒక మాట – మతిపోయిన మొదటి దశలో అలాంటి పనులు చేస్తూవుండటం మీరు ఎరుగుదురా?' –

'అవునండి స్వయంగా చూశాను' –

'మళ్లా మొన్న తిరగబెట్టిన దశలో - ఆ కూర్చోవటం, ఆ మనిషి వాలకం అదీ, పూర్వం మతిపోయిన దశలో యెలా వుండేవాడో అచ్చు అలానే వున్నాడా?'

'అచ్చు!' -

'ఇదుగో చూడండి! ఆయనకి కుమార్తె వుందని చెప్పేరే - ఆ అమ్మాయితో కొంపదీసి, యీ సంగతంతా చెప్పారా?'-

'లేదులెండి; ఆ అమ్మాయికి తెలియకుండా రహస్యంగా వుంచాం. నాకూ, నాతో ఆంతర్యంవున్న మరొకరికీ తప్ప యీ సంగతి యెవ్వరికీ తెలీదు'-

డాక్టర్ అప్యాయంగా లారీ చెయ్యిబట్టుకున్నాడు: 'మంచి తెలివైన పనిచేశారు - ఎంతైనా మంచిపని చేశారు' - ఇద్దరూ క్షణం మౌనంగా యేమీ మాట్టాడకుండా కూర్చున్నారు. మళ్లీ లారీ మొదలుబెట్టాడు.

'ఇదుగో చూడండి డాక్టరుగారూ - చిన్నప్పటినుంచీ యేవో వ్యాపారసాపారాల్లో తిరిగినవాణ్ణిగాని ఇల్లాంటివన్నీ యెరిగినవాణ్ణిగాదు; అలాంటి చిక్కులేవైనా సంభవించితే యెలా సమర్థించాలో తెలియక తికమకపడుతున్నాను. అందుకే మీ సలహా తీసుకోవటం. అసలు అలా యెందుకు తిరగబెట్టిందంటారూ? అలా మళ్ళీ మళ్ళీ తిరగబెట్టే అవకాశం వుందంటారా? అలాంటప్పుడు యేవిఁ చేస్తే బాగుంటుంది? మనకు చాలా కావలసిన అప్పుడండీ, ఆయనకు యేవిధంగానైనా సాయపడగలుగుదునేమోనని ఆశపడుతున్నాను. యెదైనా మార్గముంటే ఆలోచించి చెప్పండి.'

రెండుమూడు నిమిషాలవరకూ మౌనంగా కూర్చుని డాక్టర్ చాలా తీవ్రంగా ఆలోచించాడు:

'లారీగారూ! - ఇటు చూశారూ! ఆ మయికం రాబోతోందని రోగికి ఆ సంగతి ముందుగా తెలుస్తుందనుకుంటాను. తెలియకుండా హఠాత్తుగా రావటం సంభవంకాదు.'

'అలా రాబోతోందని తెలిసినప్పుడు రోగికి భయమేస్తుందా?'-

'చాలా భయమేస్తుంది' - ఆ మాటలు ఉచ్చరించుతూ డాక్టర్ వొణికిపోయాడు-

'ఎంత భయంగా వుంటుందో, దాన్ని భరించటం యెంత కష్టమో మీరు ఊహించలేరు. దాన్ని తట్టుకోవటానికి యెంత ప్రయత్నించీకూడా ప్రయోజనముండదు- అది భయంకరమైన ఒక స్వప్నంలాంటిది. దాన్నిగురించి పైకి చెప్పటానికి యెంత పెగుల్చుకున్నా నాలుక ఆడదు.'

'అలా యెట్టాగొట్టా పెగుల్చుకుని ఆ సంగతి యితరులతో చెప్పగలిగాడనుకోండి, ఆ స్థితిలోనుంచి బయటబడగలుగుతాడా?'-

'పడొచ్చు - కాని అలా చెప్పగలగటమనేదే అసంభవం అనుకుంటాను. అలాంటి రోగుల్లో నూటికి యే వొకరోతప్ప, అలా చెప్పలేరు.'

'అసలు అలా తిరగబెట్టటానికిగల కారణం యేవిటంటారు?'-

'మానవుని మనోభావనలో ఒక చిత్రం వుంది. ఒక భావానికీ ఒక భావానికీ లంకె వుంటుంది. ఒక సంగతి జ్ఞాపకం వచ్చిందంటే, దానికి సంబందించిన అన్ని సంగతులు ఆపినా ఆగకుండా జ్ఞాపకానికివచ్చేస్తయ్, ఇంజనువెంట రైలుపెట్టెలు పరుగెత్తుకొచ్చినట్లు; పూర్వపు మనస్థితి యథాతథంగా మళ్లీ యేర్పడుతుంది. తీవ్రమైన బాధతోకూడిన ఆ అనుభూతులు తిరిగి మీద పడబోతున్నాయని రోగికి భయం పుట్టుకొస్తుంది. ఆ స్థితిలో చిక్కుబడకుండా వుండటానికి, మనస్సు అమిత కంగారుగా, నానా తంటాలూ పడుతుంది; ఆ భయంవల్ల మరింత బలహీనమై తేలికగా కుదబడిపోతుంది- మైకం క్రమ్మేస్తుంది.'

'అలా మైకం క్రమ్మినదశలో, యేవి జరుగుతుందో రోగికి జ్ఞాపకం వుంటుందా'

'రవ్వంతేనా వుండదు'-

'అయితే రోగి భవిష్యత్తు యేవిఁటంటారు'-

'మరేం ఫరవా లేదనుకుంటాను - దైవకృపవల్ల ఆ మైకం ఎక్కువ రోజులు ఉండిపోకుండా, కొద్ది అవధిలోనే బయటపడి పోగలిగాడు గనక ఫరవాలేదనుకుంటాను. అతను, ఎప్పుడు వచ్చి మీద పడిపోతుందోనని ఇన్నాళ్లూ ఎప్పటికప్పుడు యెంతో భయంతో వుండివుంటాడు. అది రావటమూ పోవటమూ రెండూ జరిగిపోయాయి గనుక ఆ భయం చాలావరకు తగ్గిపోయివుంటుంది. ఇక ముందు అలాటిది మళ్ళీ తటస్థించకపోవచ్చు'-

'శుభం-ఆనందంగా వుంది'

డాక్టర్ చిరునవ్వునవ్వాడు.

'మరో రెండు ముక్కలు అడగవలసివుంది-ఒకటి: ఆయన తన వృత్తికి సంబంధించిన క్రొత్త క్రొత్తవిషయాలు తెలుసుకోవటానికి, ఎప్పుడూ యేదో ఒకటి చదువుతూనే వుంటాడు; అలాంటి అమితవ్యాసంగం వల్ల చెడుయేమైనా వుందంటారా?'

'లేదు-కాకపోగా కొంత మంచిదనికూడదా చెప్పొచ్చు; తమాషాయేవిఁటంటే ఆయనకు యెప్పుడూ యేదో ఒక పనిచేస్తూవుండటం అలావాటై వుండవచ్చు; ఆరోగ్యకరమైన అలాంటి మంచి వ్యావృత్తి యేదైనా లేకపోతే, ఆయన అనారోగ్యకరమైన ఆలోచనలకు తిరిగే ప్రమాదంకూడా వుంది. ఈసంగతి గ్రహించే బహుశా ఆయన అలా చేస్తూవుంటాడనుకుంటాను'

'తెలియక అడుగుతున్నాననుకోకుండి-మనస్సుకు అంతవత్తిడిగా పని కల్పించటం మంచిదేనా అని?'-

చూశారూ! ఆయన్ను పెడమార్గానికి లాగటానికి లోపల బలమైన మానసిక స్థితి ఒకటి దాగివుంది. అటు మొగ్గకుండా చెయ్యటానికి యిటు అంతకంటే బలమైన వ్యావృత్తిని యేర్పాటు చెయ్యటం మంచిది.

'అయితే అలాంటి ప్రమాదం తిరిగి సంభవించదని అనుకోవచ్చునా?'

'అనుకోవచ్చుననే నాకు ఘట్టినమ్మకం-ఏదైనా భరించరాని క్రొత్తవేదన తటస్థించితే తప్ప అల్లాంటిది మళ్ళీరాకూడదు.'

'మరొకసంగతి అడుగుతాను చెప్పండి; ఉదాహరణకు, ఆ రోగి మొదట్లో ఆ వ్యాధి తటస్థించినప్పుడు కమ్మరి పనిచేయటానికి అలవాటు పడ్డాడనుకోండి సుత్తీ దాగరా ముందేసుకు కూర్చునేవాడు. తిరిగి మొన్న తిరగ బెట్టినప్పుడు కూడా అలానే సుత్తీదాగరా ముందేసుకు కూర్చున్నాడు; వాటిని యింకా ఎప్పుడూ తనగదిలో అట్టిపెట్టుకు కూర్చోవటం మంచిదిగాదేమో-'

డాక్టర్ అరచేత్తో నుదురు తడుముకుంటున్నాడు; పాదాలు భూమిమిద నిలవ్రతొక్కు కోవటానికి గట్టిగా అదిమి పట్టుకున్నాడు:

'ఆసామాన్లనుయెప్పుడూ తనతోనే వుంచుకున్నాడుగదా!'

'అదే పుంచుకుంటున్నాడు-ఇక వాటిని తీసి అవతల పారేస్తే పోదా అని-'

'దాన్లోవున్న బాధ మీకు అర్థంకాదు; పూర్వం ఆ రోగి అమితమైన మనోవేదన ననుభవించుతున్న రోజుల్లో, ఆ బాధను మరిచి పోవటానికి యీ వ్యావృత్తికి పూనుకున్నాడు. అందువల్ల అతనికి కొంత మనశ్శాంతి కలిగింది. అందుచేత వాటిని అవతల బెట్టటానికి అతని మనస్సు యెప్పుడూ యిష్టపడేదిగాదు. ఇప్పుడు కూడా అతని మనస్సు అలానే వుంటుంది. వాటిని గనక అవతల పారేస్తే లక్కపిడత పారేసుకున్న పసిబిడ్డలాగా ఆయన బాధపడవచ్చు'

'లాభం లేదు డాక్టరుగారూ వాటిని యెలాగైనా తీసివెయ్యదలిచాను-అవి అక్కడవున్నంతసేపూ ఆయన బుర్రలోనుంచి ఆ పాతజ్ఞాపకాలు పోయేట్టు లేవు- మీరు మరేం ప్రమాదం జరగదంటే ఆ పని చేసేస్తాను'

డాక్టర్ మెదడులో జరుగుతున్న సంఘర్షణంతా లారీకి అర్థమౌతూనే వుంది. ఆయన అభిప్రాయంకోసం యెదురుచూస్తున్నాడు.

'తీసివేస్తే తీసి వెయ్యవచ్చుగాని, ఆయన సమక్షంలో అలాంటిది జరగకూడదు. ఆయన యే వూళ్లో లేనప్పుడో, అజ లేకుండా వాటిన తొలగించి వేయడం మంచిది.

అంతటితో సంభాషణ ముగిసిపోయింది. ఆరోజంతా యిద్దరూకలిసి, పరిసరాల గ్రామీణప్రాంతాలలో షికారు తిరిగి రాత్రికియింటికి చేరుకున్నారు. ఆ తరువాత రెండు మూడురోజులూ కూడా డాక్టర్ యెంతో ఉల్లాసంగా వున్నాడు. పదునాల్గవ రోజు, కూతుర్నూ అల్లుణ్ణి కలుసుకోవటానికి ఊరికి వెళ్లిపోయాడు.

ఆ రాత్రే ఉలీ చేబాడితే పుచ్చుకుని, లారీ డాక్టర్‌గారి గదిలో ప్రవేశించాడు. దీపం చేత్తోబుచ్చుకు మిస్ ప్రాస్ కూడా ఆయనకు సహాయపడటానికి వచ్చింది. ఏదో ఒక పెద్ద హత్యాకాండ జరపబోతున్న వాళ్ళలాగు యిద్దరూ లోపలికి ప్రవేశించి తలుపులు మూసేశారు, లారీ, బాడిత తీసుకుని చెప్పులుకుట్టే సామానున్న ఆ పాత బెంచీని యింతింత ముక్కలుగా పేళ్లు చేశాడు. ఆ పేళ్ళు పోగుజేసుకుపోయి వంటయింట్లో మండుతున్న పొయ్యిలోపోసి శవదహనం పూర్తిచేసేశారు. తక్కిన పనిముట్లూ గత్రా పట్టుకెళ్ళి పెరటిదొడ్లో గొయ్యితీసి పూడ్చి పెట్టారు. అమాయిక హృదయాలకు, యేచిన్ని విధ్వంసక చర్యకు పూనుకోవలసివచ్చినా క్రూరత్వంగానే కనిపిస్తుంది. ఆ చర్య జరుపుతున్నంతసేపూ వాళ్ళ యిద్దరి మనస్సులకూ యేదో నేరం చేస్తున్నట్టుగానే వుంది.

28

నూతన వధూవరులు, హనీమూన్ నుంచి, యింటికి తిరిగి రాగానే వారిని చూచి అభినందించి పోవటానికి వచ్చిన మొట్టమొదటివ్యక్తి, సిడ్నీ కార్టన్; దంపతులు ఇంటికి తిరిగి వచ్చారని తెలిసిన ఒకటి రెండుగంటల్లోనే అతను చూడవచ్చాడు. అతని అలవాట్లలోగాని, వాలకంలోగాని, ధోరణిలోగాని యే విధమైన మార్పులేదు.

కొంచెంసేపు ఈ మాటా ఆ మాటామాట్లాడి, డార్నేను పక్కగదిలోకి తీసుకువచ్చాడు. ఇద్దరూ, కిటికీదగ్గిర నిల్చుని, యితరులు యెవ్వరూ వినకుండా, ఏకాంతంగా మాట్లడుకుంటున్నారు.

'డార్నీ! నేను నీస్నేహాన్ని వాంఛించుతున్నాను'-

'అదేవిటి? ఇప్పుడు మాత్రం మనం స్నేహితులంకామా?-

'ఏదో మామూలు మర్యాదకు ఆమాట అనేశావనుకో- కాని, నేను వాంఛించున్నది మామూలు మర్యాద పలుకులుగాదు'

'అంటే మీ అభిప్రాయమేమిటో నాకు తిన్నగా బోధపడటం లేదు'- అన్నాడు డార్నే.

'నామనస్సులో వున్న సంగతి నీకు యెలా చెప్పాలో నాకు తిన్నగా చేతగావటంలేదు, అయినా ప్రయత్నించుతాను- మనం ఒక నాటిరాత్రి కలుసుకున్నాం-ఆ వేళ నేను మామూలు, రోజూ మోస్తరుకంటే యెక్కువగా తప్పతాగి వున్నాను- ఆసంగతి నీకు జ్ఞాపకం వుందా?'-

'అవును-జ్ఞాపకం వుంది-ఆవేళ, మీరు తప్పతాగుతారని, నాచేత పట్టు బలంవంతంమీద ఒప్పించారు.'

'ఆ! అదే! ఆరోజు నాకూ జ్ఞాపకంవుంది; అలాంటి రోజులన్నీ నా జీవితాన్ని శాపాల్లా కూలదీసివేస్తూవుంటై. అందు చేత నాకుబాగా జ్ఞాపకంవుంటై.'

'నేను మరణించిన రోజున-నీకు ఆరోజు జ్ఞాపకం రావచ్చు- కంగారు పడకు!- నేనేమి వేదాంతాన బోధనకు పూనుకోవటం లేదు.'

'ఎబ్బే నేనేమి కంగారు పడటం లేదు-మీరు చెప్పబోతున్నదేవిటా అని సావధానంగా వింటున్నాను.'

'అయితే విను- ఆ వేళ నీమీద యెంతో అక్కసు వెళ్ళబోసి పురుగుక్రింద మాట్టాడాను- అదంతా నువ్వ మరిచిపోవాలి'-

'ఏనాడో మరిచిపోయాను-'

'అదుగో! మళ్ళా మామూలు మర్యాదల ధోరణిలో మాట్టాడుతున్నావ్!- నువ్వేదో తేలికగా మరిచేసినట్టు తేల్చేస్తున్నావుగాని- అలాంటి సంఘటనలను అంత తేలికగా మరిచి పోవటం నాకు మాత్రం వశంగాదు. ఆ సంఘటనను నేనుమాత్రం మరిచిపోలేదు. అందుచేత నా మనస్సులోవున్న వ్యథ తీరదు.'

'క్షమించండి! నేనేదో గాలిమాట క్రింద మాట్టాడటం లేదు- ఆత్మశుద్ధిగా చెబుతున్నాను. అసలు ఇలాంటి స్వల్ప విషయం యిన్నినాళ్లుగా మీ మనసును వేధించుతూ వుండట మేవిఁటా అని నాకు ఆశ్చర్యంగా వుంది. ప్రమాణంచేసి చెబుతున్నాను. నేను యీ విషయాన్ని యేనాడో మరిచిపోయాను. అయినా దీన్లో పెద్ద జ్ఞాపకం బెట్టుకోవలసినంత విశేష మేవుంది? మీరు ఆ వేళ నిజంగా నాకు ప్రాణదానం చేశారు! దానిముందు ఈ స్వల్పవిషయం యేపాటి?'-

'నేనేదో ప్రాణదానం చేశానంటున్నావే- ఆ విషయాన్ని గురించి నువ్వు పెద్దగా కృతజ్ఞత చూపవలసిందేమి లేదు; అది నా మామూలు వృత్తి ధర్మంలో జరిగిన

సంఘటనేగాని- అదేదో నిన్ను ఉద్ధరించాలనే సద్దుశంతో చేసిన పనిగాదు; ఆ వేళ నీకు యేవిఁ జరిగినా నేను పట్టించుకునేవాణ్ణేగాదు. అదంతా కేవలం పొట్టకూటికి చేసిన పనిగాని, ఉదార బుద్ధితో చేసిందేవీ లేదు.'

జీవితంలో యేనాటికీ మరచిపోలేని అలాంటి సహాయం చేసికూడా- 'మీరు చాలా తేల్చి పారేసి మాట్టాడుతున్నారనుకోండి! అయినా నేను మీరు చెబుతున్న దాన్ని కాదని వాదించదలచలేదు.'

'నిజం తమ్ముడూ! సత్యం చెపుతున్నాను నమ్ము!- ఇంతకీ నేనిప్పుడు నీకు చెబుదామనుకున్నది ఒకటీ చెబుతున్నదొకటీ! నేనిప్పుడు. చెపుతున్న దేవిఁటంటే, మన మిద్దరం స్నేహితులుగా మనగల సావకాశం యిప్పించమని అడుగుతున్నాను. నన్ను గురించి నీకు సర్వవిషయాలూ స్పష్టంగా తెలుసు; పెద్దమనిషనేవాడికి ఉండవలసిన లక్షణాలేవీ నాలోలేవని నీకు తెలుసు; ఇంకా ఆ విషయంలో నీకేమైనా అనుమానంవుంటే, నువ్వు స్ట్రయివర్ను గనక అడిగితే అతను స్పష్టంగా ఆ సంగతి రూఢిచేసి చెబుతాడు.'

'నా అభిప్రాయ మేవిఁటో నన్నే యేర్పరుచుకో నివ్వండి! మధ్య ఆయన సలహా దేనికి?'

'సరే-అయితేవిను-నేను వట్టి అప్రయోజకుణ్ణని నీకు తెలుసు-యే సత్కార్యమూ లోగడ చేసినవాణ్ణి గాదు-ముందు చెయ్యాలనే ఉద్దేశం వున్నవాణ్ణీ గాదు.'

'ఎవరి భవిస్యత్తు ఎలా వుంటుందో, ఎవరు చెప్పగలరు?'

'నా సంగతి మాత్రం నేను స్పష్టంగా చెప్పగలను. ఇంతకూ యిప్పుడు మిమ్మల్ని నేను అర్థించుతున్న దేవిటంటే- ఇలాంటి నస్మరంతి వెధవ మీయింటికివస్తూ పోతూవుండటం మీరు సహించగలిగినట్టయితే, అలాంటి అవకాశాన్ని యిప్పించ మంటున్నాను. చనువున్న మనిషిగా యిక్కడికివస్తూపోతూ వుండనివ్వండి! ఈ అవకాశాన్ని ఎక్కువగా వాడుకుంటానని కూడా మీరు అనుకోనక్కర్లేదు. నూటికి కోటికి యెప్పుడన్నా ఒకరోజువచ్చి చూసిపోతూవుంటాను, అలాంటి అవకాశంవుందనే సంతృప్తివుంటే నాకు చాలు!

'మీ ఇచ్ఛానుసారం యెప్పుడుబడితే అప్పుడు మీరు నాయింటికివచ్చి వెడుతూ వుండవచ్చు.

'కృతజ్ఞుణ్ణి'-

డార్నే, అమితాప్యాయంగా కార్టన్‌కు చెయ్యి అందించాడు. ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు. ఆ మరుక్షణంలోనే కార్టన్ మళ్లీ మామూలు వాలకంలోకి మారిపోయాడు; బయటికి వెళ్లిపోయాడు.

ఆ సాయంత్రం, లారీ, మిస్ ప్రాస్, డాక్టర్, డార్నే, లూసీ అయిదుగురూ కూర్చుని బాతాఖానీవేశారు. మాటల సందర్భంలో డార్నే తనకూ కార్టన్‌కూ ఆ ఉదయం జరిగిన సంభాషణ సంగతి చెప్పాడు: ఆ చెప్పటంలో కొంచెం డాబుసరి పోజుబెట్టి: "సిడ్నీ!చాలా అవ్యక్తం మనిషి"అన్నాడు.

ఆ ప్రసంగం విని లూసీ మనస్సుకు నొప్పి కలుగుతుందని డార్నే కలలోనైనా అనుకోలేదు. కాని ఆ రాత్రి పడక గదిలోకి వెళ్లేసరికి, లూసీ ముఖాన గంటుబెట్టుకు కూర్చుని.

యేదో తీవ్రంగా ఆలోచించుతున్నట్టు కనుపించింది. డార్నే లూసీ మెడను ఆలింగనం చేసుకుంటూ:

'లూసీ!-ఏదో ఆలోచిస్తున్నాట్టున్నావ్?'

'అవును చార్లెస్! ఆలోచిస్తూనే వున్నాను.'

'ఏవిఁటి లూసీ!'

'ఏదైన ఒక సంగతి నన్ను అడగొద్దని నిన్ను బ్రతిమాలుకుంటాననుకో-ఆ సంగతి చెప్పితీరాలని పట్టుబట్టకుండా వుంటానని మాట యివ్వగలవ్?'

'దీనికోమాట యివ్వాలా?- నీకు యిష్టంలేనిమాట చెప్పి తీరాలని బలవంతం చేస్తానా లూసీ!

చార్లెస్! పాపం కార్టన్ను గురించి యిందాక నలుగురిలోనూ, నువ్వంత చులకనగా మాట్టాడవలసిందిగాదు. అతను, మనం ఇంతకంటే కొంచెం గౌరవమర్యాదలతో చూడదగిన మనిషి'-

'ఏవిఁటి లూసీ?- ఏవిఁటి అతన్ని గౌరవంగా చూడదగిన మనిషి అన్నావూ?'-

'ఆ ప్రశ్న మాత్రం నన్ను నువ్వు అడుగవద్దు-కాని ఆది నా అభిప్రాయం-అతనికి కృతజ్ఞులమై వుండాలని నామనసుకు తోస్తోంది.'

'అవును లూసీ! ఆ మాట సరే! ఇప్పుడు నువ్వనే దేవిఁటి?

'నువ్వు అతని పట్ల ఉదారంగా ప్రవర్తించాలని నా కోరిక-అతను దగ్గిర లేనప్పుడు, అతన్ని గురించి మాట్టాడేటప్పుడు అతని లోపాలను ఉదారంగా సహించి మాట్లాడగలవని ఆశించుతున్నాను, అతని మనస్సు యేలాంటిదో నీకు తెలీదు- అతని హృదయం అవమాన పరంపరతోయెలా గాయాలైవున్నదో నేనెరుగుదును'

'అతని మనస్సును నొప్పి కలిగించాలనే ఉద్దేశం నాకు లేనే లేదు లూసీ-అయినా అతన్ని గురించి నేనెప్పుడూ యింత యిదిగా ఆలోచించనేలేదు.

'చార్లెస్! అతను దురదృష్టవంతుడు, పతితుడు; అతను పైకివచ్చేసావకాశాలు లేకపోవచ్చు; కాని అతనికి హృదయం వుంది డార్నీ-ఏమహత్కార్యాన్నయినా సాధించే ప్రతిభ వుంది.'

'ఆ సంగతి నేను బ్రతికివున్నతంవరకూ జ్ఞాపకం వుంచుకుంటాను లూసీ! జీవితంలో ఎన్నటికీ మరిచిపోను.'

లూసీ రెండుకళ్ల వెంటా రెండు కన్నీటి బిందువులు చెక్కుటద్దాలు లావున్న బుగ్గలమీదకి దిగజారినై. డార్నీ ఆ కరుణామయిని ఆలింగనంలోకి అలుముకుని అనునయించాడు.

29

డాక్టర్‌మానెట్ నివసించుతున్న ఆ వీధిమూలకు విచిత్రమైన ప్రతిధ్వనులు దూరాన్నుంచి వినిపించుతూవుంటై, లూసీ, అనురాగపాశాల బంగారు గొలుసులతో తండ్రిని, భర్తనూ, వృద్ధురాలైన తన దాది మిస్ ప్రాస్‌నూ తనచుట్టూ, అత్యంత సన్నిహితులుగా దగ్గర

దగ్గరకు లాక్కుంటూ, ప్రశాంతయుతమైన జీవితసౌధాన, బుగ్గను చేయివేసుకుని నిరామయంగా కూర్చుని, దూరాన్నుంచి వినుపించుతున్న పదధ్వనులను వింటున్నది; ఆ ప్రశాంత మౌనంలో రోజులూ, వారాలూ సంవత్సరాలూ తెలియకుండా గడిచిపోతున్నయ్.

సాంసారిక జీవితం ఎంత ఆనందభరితంగావున్నా, ఆదిలో దూరాన్నుంచి ఆ పదధ్వనులు వినిపించుతుంటే, లూసీకి మనసులో ఎందుకో అలజడిగా వుండేది. అనేక భావాలు మనసులో రెకెత్తేవి. ప్రణయజీవితంలో తాను పెట్టుకున్న ఆశలన్నీ ఏదో ప్రభంజనంవల్ల రెపరెపలాడిపోతున్నట్టనిపించేది. తన కడుపు పంటను పొత్తిళ్ళలో చూచుకుని ఆనందించే శుభదినం వచ్చే వరకూ, తాను ఈ గడ్డమీద మనగలుగుతానా లేదా అని అనుమానం వేసేది. తాను లేకపోతే, తన భర్త ఏకాకై తనకోసం ఎంత దిగులుపడిపోతాడోగదా! అనుకునేది. వెర్రి ఆలోచనలు అంతదాకాపోయి దుఃఖం ముంచుకొచ్చేది.

మనసు అలజడిగావుండే అలాంటి రోజులన్నీ గతించిపోయినై. తాను ఒక పసికందును కన్నది. ఆ ఆడశిశువును యెదమీద పరుండబెట్టుకుని ఆ సంతోషంలో, లోకం మరచిపోయేది, ఇప్పుడు దవారాన వినిపిస్తున్న ఆ పదధ్వనులలో తన కుమార్తె చిడిముడి పాదాల చిఱుసవ్వడులుకూడా వినిపించుతున్నయ్; వచ్చీరానిముద్దుమాటల అవ్యక్త నినాదాలు కూడా చిరుగజ్జల మ్రోతలుగా చెవులబడుతున్నయ్; ఆ ప్రతిధ్వనులలో కొన్ని, పెద్ద పెద్ద మోతలుగా గగనం ప్రతిధ్వనించిపోయేలా వినిపించుతున్నా, ఆ కల్లోల మధ్యంలోకూడా ఈ చిరుపాదాల సవ్వడులను స్పష్టంగా వినగలుగుతోంది. ఉయ్యాలతొట్లో బిడ్డను ఊపుతూ, భవిష్యత్తులో వినిపించుతున్న ఆ బాలికపాదాల సవ్వడులను పోల్చుకుని సంతోషతన్మయతలో ఒడలు పులకించుకుంటోంది.

ఆ ప్రతిధ్వనులలో, భర్తపాదాలు మరింత బలపడి అభివృద్ధి పథానికి ఎక్కుతున్నట్టూ, తండ్రిపాదాలు మరింత ప్రశాంత గంభీరతను అలవరచుకుంటున్నట్టూ, అర్థమౌతున్నయ్. పెరటి దొడ్లో తరుచ్ఛాయను గుండెలమీద చెయ్యి వేసుకొని హాయిగా నిద్రపోతున్న మిస్ ప్రాస్ గుఱకలో దారికివచ్చిన అడివిగుఱ్ఱపు సకిలింపులు వినిపిస్తున్నయ్.

కొన్ని దుఃఖ భరితాలైన సంఘటనలుకూడా తటస్థించినా, వాటిని లూసీ నిబ్బరంగా భరించింది. తనకుమల్లేనే బంగారు జుట్టువున్న కొడుకు దిండుమిద తలవేల వేసి: 'అమ్మా! నాన్నా! మిమ్మల్నిద్దర్నీ విడిచిపోవాలంటే నాకు చాలా విచారంగా వుంది. అక్కయ్యతో అడుకోవటానికీ వీలులేకుండా పోతున్నదని బెంగగా వుంది- కాని నాకు పిలుపువచ్చింది- వెడుతున్నాను.' అన్నాడు. తన ఆలింగనంలోనుంచి ఆ ప్రాణి లేచిపోతుంటే లూసీ కళ్ల వెంటకన్నీటి బొట్లు రాలిన మాట నిజమే. కాని ఆ సంఘటనను భగవదేచ్ఛగా భరించి తమాయించుకుంది. ఆబిడ్డను స్వర్గపథానికి చేకొనిపోవటానికి వచ్చిన దేవదూతల రెక్కల సవ్వడి లూసీ మనసుకు వినిసిస్తున్నట్టు తోచింది. తన పాదాల దగ్గిరకూర్చొని చందనపు బొమ్మకు గుడ్డలు కడుతూ, వసబోసిన పిట్టలాగు, రెండుమహానగరాల భాషలనూ కలగాపులగంగా కలిపి కబుర్లు చెబుతున్న కుమార్తె ముద్దుమాటల చెవులబడి హృదయం, తిరిగి ఆ వేపుకు లాగింది.

సిడ్నీ కార్టన్ పదధ్వనులు మాత్రం, యెప్పుడో గాని వినిపించేవి గావు; ఆహ్వానంతో నిమిత్తం లేకుండా, అతని యిష్టం వచ్చినప్పుడు తన యింటికి వచ్చిపోతూ వుండవచ్చునని డార్నీ తనకు అవకాశమిచ్చినా, సిడ్నీ ఆ అవకాశాన్ని సంవత్సరానికి యే అయిదారు తడవలో తప్ప యెక్కువగా వినియోగించుకో లేదు. ఆ రావటంకూడా తప్పదాగి ఉద్రేకంగావున్న సమయంలో వచ్చే వాడు గాదు. ఏ సాయంత్రమో వచ్చి నలుగురితో కలిసి యేదోకులాసాగా కబుర్లాడి వెళ్లిపోయేవాడు.

ఒక పురుషుడు ఒక స్త్రీని అమితగాఢంగా ప్రేమించటం, ఆ స్త్రీ తనకు కాకుండ యితరులకు దక్కటం, అయినా కూడా, ఆ పురుషునిలో ఆ స్త్రీపట్ల పూజ్యభావం మిగిలివుండటం ఊహించరాని సంఘటన. లూసీ బిడ్డలు మాత్రం సిడ్నీ అంటే యెంతో ఆప్తుడుగా చూచేవాళ్లు-అతన్ని చూస్తే ఆ పసిబిడ్డల కెందుకోజాలి కలిగేది. ఆ అమాయక హృదయాలను సిడ్నీలో దాగివున్న యే సున్నితమైన అంతస్థులు ఆకర్షించేవో!

స్ట్రయివర్ తన న్యాయవాదవృత్తిలో, నిరఘాటధాటీపాటవంగా, టాంకులాగా ముందుకు సాగిపోతున్నాడు. తనకు యెంతో ఉపయోగపడే మనిషి గనక సిడ్నీని కూడా వెనక పీటీని కట్టుకుని యీడ్చుకుపోతున్నాడు. సీడ్నీ, యెప్పటికప్పుడు జీవితంలో పల్టీలు తింటూ దుమ్ములో పొరలాడే మనిషి కావటంచేత ఆ బురదచిందులతో అప్పుడప్పుడు స్ట్రయివర్ కూడా వికారరూపం దాల్చవలసివచ్చేది. అయినా, స్వప్రయోజనాన్ని లెక్కచూసుకునేవాడే గాని, ఇలాంటి మానాభిమానాలకు వెరిచేరకం గాదు గనక లెక్క జెయ్యకుండా సర్దుకుపోతూ వుండేవాడు. స్ట్రయివర్ దగ్గిర, బాగా డబ్బుచేరి, పచ్చబడ్డాడు. పైపెచ్చు, బాగా ఆస్తిపాస్తులు, యిన్ని నగలూ నట్రా వున్న, యెర్రటి మట్టగిడిసలాంటి ఒక వితంతు శృంగారవతిని, ముగ్గురు బిడ్డల తల్లిని పెళ్ళిచేసుకున్నాడు. పూర్ణంబూరెల్లావున్న తలలమిద ఎర్రగానిక్కబొడుచుకు నిల్చున్న బిరుసు వెంట్రుకలు తప్ప, ఆ మగ్గురు కుర్రాళ్లలోనూ కూడా చెప్పుకోదగ్గ ప్రత్యేకత యేమి లేదు.

ఒకనాడు స్ట్రయివర్ తన సంరక్షకత్వపు దర్జాఅంతా మొహంమీద ఉట్టిపడుతూ, ఆ మూడుగొర్రెల్నీ సోహో స్క్వేర్‌కు తోలుకువచ్చాడు-లూసీ మొగుడికి శిష్యులుగా వప్పగింతచేసే ఉద్దేశంతో; తీరావచ్చి డార్నీతో, తన హోదా అంతా ఒలకబోస్తూ:

'ఏమోయ్! ఇటు చూడు! యీ వెధవలు ముగ్గురికీ ట్యూషన్ చెప్పుకో! నీకు పాపం కాస్త పొట్టగడుస్తుంది' అన్నాడు. 'క్షమించండి!' అంటూ డార్నీ అతి మర్యాదగా నిరాకరించాడు. ఆ దెబ్బతో స్ట్రయివరకు కలిగిన ఉడుకుమోతుతనం యింతా అంతా కాదు. ఆ అక్కసునంతా అనేక రకాలుగా అవకాశం వచ్చినప్పుడల్లా వెళ్ళగక్కుతూవుండేవాడు. ఆ కుర్రాళ్లకు ప్రపంచ విజ్ఞానాన్ని రంగరించిపోయటానికి కూర్చునప్పుడల్లా, 'ఒరేయ్! ముష్ఠి వెధవలను జాలి తలవకూడదు- వాళ్ళకి ఒక్కోడికి ఎంతెంత నీలుగుమోతుతనం వుంటుందో మీకేం తేలుసు?- ఆ ట్యూటరువెధవని చూళ్లేదుట్రా!' అనేవాడు. తప్పదాగి కైపెక్కినప్పుడు పెళ్లాన్ని దగ్గిర కూర్చోబెట్టుకుని, దాంతో లూసీని గురించి అడ్డమైన అవాకులూ చెవాకులూ వాగేవాడు: 'ఇదుగో! చూశావ్!- ఆ డార్నేగాడి పెళ్లాం వుందే, అది యెటువంటి యిటుకులాడి ఈరపాప అనుకున్నా వేంవిటి-బల్ చట్కారీ ముండలే-నన్ను వల్లోవేసుకోవటానికి అది పన్నిన పన్నాగాలు

యిన్నీ అన్నీగావనుకో!హా!దాని తల దన్నిన తెలివి తేటలున్న వాణ్ణిగనుక గాని, మరో వెఱ్ఱిముఖం యెవడేనా అయితే యిట్టే బొందలో బడే వాడనుకో-' ఇత్యాదయఃకోస్తూ వుండేవాడు. కోర్టులో అతనికి పరిచయమున్న పెద్దమనుషులు కొందరు అతనియింటికి వస్తూవుండేవాళ్లు! వాళ్ళకు సారాగ్లాసులతో పాటు ఈ పిచ్చివాగుడుకూడా అందిస్తూ వుండేవాడు. వాళ్ళు పెద్దమనుషులు కావటం చేత సారామాత్రం స్వీరించి ఈ వాగుడును ఉపేక్షించి మన్నించేవాళ్లు: ఈ వాగుడు అనేక పర్యాయములు అతనినోటివెంట వినిఉండటంచేత, వాళ్లు! "ఇతనికి యిదేదో పాతజబ్బు! పాపం అప్పుడప్పుడు ఇలా తిరగబెడుతూ వుంటుంది. గాబోలు." ననుకుని ఎవళ్ళత్రోవను వాళ్లు వెళ్ళేవాళ్లు. ఈరకం ప్రతిధ్వనులన్నీ లూసీ చెవులబడుతూవుండేవి; ఒకప్పుడు తనలో తను నవ్వుకునేది, ఒకప్పుడు విచారించేది; ఒకప్పుడు ఆనందంతో ఒళ్లు మరిచి నిద్రపోయేది. లూసీ కూతురుకు ఆరో సంవత్సరం వచ్చింది.

ఇక్కడ ఇలా వుండగా, అటు దూరాన ఫ్రాన్సులో అత్యంత బీభత్సకరములైన ప్రతిధ్వనులు వినిపించుతున్నై. ఆనాడు లూసీ కూతురుకు పుట్టినరోజు పండగ; నాటికి ఆ బీభత్సనినాదాల ప్రళయధ్వనులు పరిణామదశను అందుకుని గగనపథాన ప్రతిధ్వనించుతున్నయ్.

1789 సంవత్సరం జూలై నెలలో ఒక నాటిరాత్రి టెల్సన్సు బ్యాంకునుంచి బయటపడి లారీ సరాసరి డాక్టర్‌గారి యింటికి వచ్చాడు. లారీ, డార్నీ, లూసీ ముగ్గురూ, చీకటి మరుగుగావున్న ఒక కీటికీ ప్రక్కనే కూర్చుని మాట్లాడుకుంటున్నారు. లారీ చాలాగిజాటుగా వున్నాడు. నెత్తిమీది విగ్గు తీసి బల్లమీద పారేసి వేడెక్కిపోయిన బుర్ర తడువుఁకుంటూ:

'ఈవేళ రాత్రి, అసలు బ్యాంకులో నుంచి బయటపడే సావకాశం వుంటుందని అనుకోలేదు. పని ఊపిరి సలపకుండా వుంది. అక్కడ పారిస్‌లో యేదో కల్లోలంగా వుందిట. అక్కడున్న మా కాతాదార్లంతా తమకున్న డబ్బాదస్కం యావత్తూ, మా బ్యాంకులో తెచ్చిపారేస్తూన్నారు. అక్కడ ఫ్రాన్సులో వున్న డబ్బున్న ఆసాములు యావన్మందీ, పూచికపుల్ల దేఖీలూ ఇక్కడికి, ఇంగ్లండుకు పంపించిపానేస్తున్నారు' అన్నాడు,

'అలాగైతే, అక్కడేదో ముంచుకొచ్చిందన్న మాటే, అన్నాడు డార్నీ.

'ముంచుకు రావటమో అధ్వాన్నమో-ఇటు చూడు- మా బ్యాంకులోవున్న వాళ్లమంతా ముసలాళ్ళమయిపోయాం; ఆ పెద్ద మనుషులు మా కష్టసుఖాలు ఆలోచించకుండా, ఒక్కసారి, ఊపిరి సలపకుండా, మాకు యింత పని కల్పించటం ఏం మర్యాద; నిజానికి చాలా అక్రమమైన సంగతి.'

'అవుననుకోండి- మరి అక్కడ ముంచుకొచ్చిన పరిస్థితేవిఁటో, కాస్త మీరు కూడా సానుభూతితో ఆలోచించాలిగా'

'అవుననుకోయ్! ఆ సంగతి నాకు మాత్రం తెలీదా?- అయినా ఉదయంనుంచి రాత్రిదాకా ఊపిరి సలపకుండా కాయితాల్లో సదమదమయిన వాడికి ఇంతో అంతో చిరాకు పుడుతుందంటావా లేదా?-ఆ-యింతకీ డాక్టర్ భాయీఏరీ?'-

'ఇక్కడే వున్నానండీ,' అంటూ డాక్టర్ మానెట్ లోపలికి వచ్చాడు.

'మీరు యింట్లోనే వున్నారూ? సంతోషం!- ఇవ్వాళల్లా ఊపిరి సలపకుండా వుండటం, యేవో అవీ యివీ అన్నీ అశుభసూచకాలైన వార్తలు వినటం, నాకు మనస్సు కొంచెం కంగారుగావుంది లెండి!- బహుశా యీవేళ మీరు ఊళ్లోకి బయలుదేరటం మానుకోగలరనుకుంటాను'

'వెళ్ళనులెండి!- మీకు సర్దాగా వుందంటే, యిద్దరం కూర్చుని చదరంగం వేద్దాం.'

'మనసులో వున్నమాట చెప్పాలంటే అంత సర్దాగా లేదు. ఈ వేళ మీతో రణరంగానికి తలపడ గలిగినంత మనోబలంలో లేను-లూసీ! కాస్త టీ నీళ్ళేమయినా వున్నాయా తల్లీ!'

'ఉన్నాయండీ లేకపోవటం యేవిటి?'-

'ఆఁ!-చిట్టితల్లి క్షేమంగా వుందా?- పడుకుందా-

'క్షేమంగానే వున్నదండీ-వొళ్ళు తెలియకుండా నిద్దరోతోంది.'-

'సరే! బాగుంది! శుభం! అంతా క్షేమంగా వున్నారు! అయినా యేదో వెర్రికంగారుగాని, అంతా క్షేమంగావుండక యిక్కడ మరోలా యెందుకుంటుంది:? ప్రొద్దుటినుంచీ యేదో గిజాటుగా వున్నానుగాదూ అంచేత యేదో తమాషాగా వుంది. -ఊ-టీ తెచ్చావూ!-సరే ఇలాతే!-సరే వచ్చి అలా కుర్చీలో కూర్చో!- ఇదుగో ఏదో ప్రతిధ్వనులన్నావే- వాటిని గురించి నువ్వుయేదో క్రొత్తసిద్ధాంతం కూడా ఒకటి లేవదీసినట్టున్నావు- ఆ విషయమేమిటో కాస్త చెప్పు! నలుగురం కలిసి చర్చించుదాం'-

'ఎబ్బే! సిద్ధాంతం కాదండీ! ఏదో వెర్రి ఊహ! - లారీ పకపకా నవ్వాడు: 'మంచిది మంచిది!' - అని వెర్రి ఊహలకు వెర్రేవిటి?- ప్రతిధ్వనులసంగతి చాలా చిత్రంగా వుంటుందిలే! అసలు ఆ ధ్వనులు చాలా స్వల్పమైనవైనా- ఆ ప్రతిధ్వనులుమాత్రం బీభత్సంగానూ, కల్లోలంగానూ వినుపించుతూ వుంటూ- వింటూవుంటే సరి అంతా చిత్రంగా వుంటుంది.'

* * *

ఇంగ్లండులో డాక్టర్ ఇంట్లో ఈ నలుగురూ కూర్చుని ఇలా ప్రతిధ్వనులనుగురించి సిద్ధాంతీకరించుతున్నారు. అక్కడ దూరాన ఫ్రాన్సులో సెయింట్ ఆంటోనీ ప్రాంతమంతా బీభత్సనినాదాలతో ప్రతిధ్వనించి పోతోంది.

వెర్రెత్తిపోయిన, పదధ్వనులు, వెనకాలోచనలేని పదధ్వనులు, భయంకర పదాఘాతాలు- అవి యేవ్యక్తి జీవితాన్నయినా పడత్రొక్కుకుపోవచ్చు; ఆ పాదాలు ఒక్కసారి రక్తపంకిలమైనాయంటే వాటిని యిక శుభ్రపరచటం దుర్లభం.

ఆ ఉదయం, సెయింట్ ఆంటోనీప్రాంతం కిటికిటలాడిపోయింది. తుపాకి సన్నీలూ, పట్టాకత్తులూ తళతళలాడిపోతున్నాయ్: సెయింట్ ఆంటోనీ గొంతులో నుంచి ఒక విలయనాదం బయలుదేరింది. తుపానుగాలికి ఊగిసలాడిపోతున్న వెదురు పొదల అరణ్యంలా, కత్తులు, ఈటెలూ గాలిలో కదలిపోతున్నయ్. ఆవేశంతో మెలికలు దిరిగిపోతున్న వేళ్లతో, గాలిలో యెరిగివస్తున్న ఆయుధాలను, అందినవాడు అందినదాన్ని పట్టుకుంటున్నాడు.

ఆ ఆయుధాలనిస్తున్నది యెవరు? యెక్కడినుంచి యెగిరి వస్తున్నయ్! ఆ గుంపులో యెవ్వడికీ అర్థంకావటంలేదు. వందలు వేలూ ఆయుధాలు మెరుపులు మెరుపులుగా మనుషుల తలకాయల మీదనుంచి యెగిరివస్తున్నయ్! తుపాకులు, తూటాలూ, గుళ్ళూ, ఇనపపట్టాలూ, లాఠీలూ, కత్తులూ, బరిసెలూ, గొడ్డళ్ళూ, సుత్తులూ, సమ్మెటలూ ఎవడికి దొరికిన ఆయుధాన్ని వాడు అందుకున్నాడు. ఏదీ చేతికందని జనం, రక్తాలు కారుతున్న చేతులతో, గోడలయిటుకలను ఊడతీస్తున్నారు. సెయింట్ ఆంటోనీ ప్రాంతంలోని జీవకోటి యావత్తూ హాలాహల జ్వాలలు రేగిన ప్రళయ జలధిలా పొంగులు తేరుతోంది.

ప్రతి సుడిగుణ్ణానికీ ఒక కేంద్రం వుంటుంది. ఈ సుడిగుణ్ణానికి డిఫార్జ్ పానశాల సమ్యక్కేంద్రం. ఆ కేంద్రంలో, తుపాకి మందుతోనూ చెమటతోనూ, అప్పటికే దారుణరూపం దాల్చివున్న డిఫార్జ్ నిల్చుని, హడావిడిగా అధికారోత్తరువులూ, ఆయుధాలూ జనం మీదికి విసిరేస్తున్నాడు. ఆ జనంలోనుంచి ఒక మనిషిని ముందుకు లాగుతున్నాడు, ఒకణ్ణివెనక్కు నెట్టుతున్నాడు- దాన్ని మరొకడి చేతి కందించుతున్నాడు. ఆ మహాకల్లోలం మధ్య మహా మంథరంలా గిరికిళ్లు తిరుగుతున్నాడు.

'జాక్విస్ నెం.1 ఇలా నాదగ్గిరా నిల్చో! జాక్విస్ రెండూ, మూడూ-మీరిద్దరూ అలా వెళ్లి చెరోభక్తుల బృందానికీ నాయకత్వం వహించండి! ఇంతకీ మా ఆవిడ యెక్కడా కనుపించదేం!'-

'ఇదుగో! ఇక్కడే!' అన్నది మాడమ్ డిఫార్జ్ చేతిలో వున్న గొడ్డలి పైకెత్తి. మాడమ్ డిఫార్జ్ నడుమునున్న తోలు పటకాలో ఒక పిస్టలూ బాకూ కనుపించుతున్నయ్.

'నీ వెటు వెడుతావు మరీ!'-

'ప్రస్తుతం నీవెంటనే వస్తాను-ఆనక మహిళాదళాలకు నాయకత్వం వహిస్తాను.'

'సరే రా!- సోదరులారా! దేశభక్తులారా! మనమంతా సిద్ధంగావున్నాం! పదండి ముందుకు!- బాస్టిలీ!' అంటూ పెద్దపెట్టున అరిచాడు. ఆ ప్రళయగర్జనతో ఆ ప్రజావాహిని తరంగాలు ముందుకు పొర్లిపోయింది. ఘంటా నినాదాలు గగ్గోలుగా మోగిపోతున్నాయ్. ఢక్కా దెబ్బలు గగనపథంలో మార్మ్రోగుతున్నయ్. విప్లవ నినాదాలు దిగ్దిగంతాలు ప్రతిధ్వనించిపోతున్నయ్- సమరం ప్రారంభమైంది.

30

అఖాతాలలాంటి అగడ్తలు, వాటిమీద రెండు పెద్ద పెద్ద మడత వంతెనలు, చెక్కుడురాతితో నిర్మించిన అభేద్యమైన దుర్గం; తొమ్మిది కోటబురుజులు, బురుజుబురుజునా ఫిరంగులు, తుపాకులు-ధూమం, అగ్ని జ్వాలలు! ఆ పొగలలోనూ మంటలలోనూ, కోటకు యెదురుగా నిల్చుని, పానశాల యజమాని డిఫార్జ్ ఫిరంగి పేలుస్తున్నాడు. జీవితమంతా సైనికవృత్తిలో వున్న ఆరితేరిన యోధుడులా ఆవేశంతో పనిచేస్తున్నాడు. అప్పటికి రెండుగంటలనుంచీ పనిచేస్తూ వుండటంచేత, ఫిరంగీ అతనూ కూడా బాగా వేడెక్కిపోయివున్నారు.

రెండు మడత వంతెనలలోనూ, ఒకటి కూలిపోయింది. డిఫార్జ్ గర్జించుతున్నాడు: 'కామ్రేడ్స్-విజృంభించండి!'-

ఫిరంగి కాల్పులు, తుపాకి గుండ్లు, అగ్నిజ్వాలలు, పొగలు, సెగలు!- ఇంకా ఒక అఖాతం- ఒక మడతవంతెన- అభేద్యమైన దుర్గం అలాగే నిలచివుంది. కోటబురుజుల నుంచి మృత్యువు వర్షించుతోంది. కోటనుచుట్టేసిన ప్రజాసముద్రంలో సుడిగుణ్ణాలు- సుడిపాలబడి జనం చస్తున్నారు. కాగడాలు మండుతున్నయ్- కత్తులు మెరుస్తున్నయ్! బారికేడ్సు'గా వేసిన తడిగడ్డివాములు పొగలు గమ్ముతున్నయ్. నలుముఖాలా హాహాకారాలు, వీరాలాపాలు, బీభత్సనినాదాలు!- ఇంకా దుర్గం చెక్కుచెదరలేదు. నాలుగు గంటల బీభత్స సంగ్రామం; డిఫార్జ్ యింకా ఫిరంగి గొట్టంలో మందు దట్టించుతూనే వున్నాడు.

బురుజులమీదినుంచి పిరంగి కాల్పులు హఠాత్తుగా ఆగిపోయినై. కోటలోనుంచి తెల్లజెండా కనుపిస్తోంది. బాస్టిల్లీ దుర్గం పతనమైపోయింది; దుర్గపాలకులు లొంగిపోయారు!

విప్లవసైన్యం ఒక్క ఉదుటున ముందుకు ప్రవహించింది ఆ తోపిడీలో ఫిరంగి దగ్గిర వున్న డిఫార్జ్ మడతవంతెనమీదుగా కోట సింహద్వారంలో వచ్చిపడ్డాడు. కొంచెం ఊపిరి పీల్చుకుని తల పెకెత్తి చూచాడు. జాక్విస్ నెం. 3 అతని ప్రక్కనే నిల్చునున్నాడు. మాడం డిఫార్జ్ దూరాన కనుపించుతోంది. ఆవిడ చేతిలోవున్న కత్తి, కూసం విడిచిన త్రాచులా తళతళా మెరుస్తోంది. ఎక్కడబడితే అక్కడే గల్లంతు, పెడబొబ్బలు!

'ఖైదీలు!- జాపితాలు!- చీకటికొట్లు- రహస్యబిలాలు!- పదండి! ముందుకు -ఖైదీలు!'-అనేక రకాల కేకలు. ఈ కేకలన్నిటిలోనూ "ఖైదీలు!" అన్న కేక ప్రతినోటివెంటా వెలువడుతోందోంది. జనం లోపలికి జొరబడిపోయారు. జైలుఅధికారులనందర్నీ పీకలు బట్టుకున్నారు. ఏ ఖైదీ యెక్కడున్నదీ చెప్పకపోతే ప్రాణాలు తీసేస్తామంటున్నారు. డిఫార్ట్ వాళ్ళల్లో ఒకణ్ని గొంతుపట్టుకున్నాడు. వాణ్ణి బడబడా అవతలికి యీడ్చుకుపోయి ఒక గోడమూల నిలవేసి డొక్కలో కుమ్మాడు!

'చెప్పు!- నార్త్‌టవర్ ఎక్కడ?-ఊ! త్వరగా!'-

'చచ్చాను-చూపిస్తా బాబోయ్!- అందులో ఇప్పుడెవ్వరూ లేరు తండ్రోయ్!'-

'నూటఅయిదూ, నార్త్‌టవర్ అంటే అర్థమేవిటి?'- అది ఖైదీ నెంబరా, కొట్టునెంబరా-ఏవిటి?- ఊంపలుకు!'-

'నరుకు బద్మాష్‌ను!' జాక్విస్ నెం. 3 గర్జించాడు.

'అది గది నెంబరే. బాబోయ్!'-

'సరేపా!- చూపించు!'

ఆ జైలువార్డరును వెంటనే హతమార్చకుండా, డిఫార్జ్ అలా మెడబట్టుకు యీడ్చుకుపోవటం చూసి, జాక్విస్ నెం. 3 కు చాలా ఆశాభంగం కలిగింది. అతని రక్తదాహం కొంత చల్లారుతుందని ఆశించాడు. కాని లాభం లేకపోయింది. ముగ్గురూ కలిసి మెట్లెక్కి పైకిబోతున్నారు. జైలు వార్డరు చేతిలో పెద్ద తాళం చెవులగుత్తి వ్రేలాడుతోంది. వాళ్ళ ముగ్గురి తలకాయలూ ఒకదాని కొకటి అంత దగ్గిరగా వున్నా, ఒకరిమాట ఒకరికి

వినిపించటం లేదు. లోపలికి చొచ్చుకు వస్తున్న విప్లవకారుల అరుపులకు మెట్లూ, గోడలూ, తనాబీలూ, గోపురాలూ ప్రతి ధ్వనించి పోతున్నయ్.

ఎన్నడూ సూర్యరశ్మి ముఖం యెరగని చీకటి సొరంగాలు, అంధకారబిలాలు, పంజరాలు, గుహలు పాతాళబిలాలు, చీకట్లోతడుముకుంటూ, ఒకరిచేతులు ఒకరు పట్టుకుని ముగ్గురూ నడుస్తున్నారు. ఒకొక్కమలుపుదిరిగే చోటల్లా ఒకొక్క తుగిడీ జన ప్రవాహం వాళ్ళని అధిగమించి ముందుకు వెళ్లిపోతోంది. ఇలా కొంతదూరం వెళ్ళి తిరుగుడు మెట్లమిదనుంచి ఒక బురుజుమీదికి ఎక్కుతున్నారు. ఆ మెట్లమీద కన్ను పొడుచుకున్నా కనుపించకుండా అంధకారం బంధురంగా వుంది. పరంజా కన్నాలు కూడా లేవు. ఏదో దిగుడుబావిలో వున్నట్టుంది. చుట్టూ దుర్గంయావత్తూ విప్లవ కారుల కోలాహలంతో తుపానురేగిపోతున్నా, ఆ సవ్వడి ఆ తిరుగుడు మెట్లమీదికి, ఎక్కడో ఎంతో దూరంలో కాకులు అరుస్తున్నట్టనిపిస్తోంది.

వార్దరు, తలకుతాకేలా వున్న ఒక చిన్ని దరవాజా దగ్గిర ఆగాడు; తుప్పుబట్టి, కిరకిరారావం చేస్తూ, యెదురు తిరిగి మొరాయించుతున్న తాళంలోకి, తాళంచెవి పోనిచ్చి బలంకొద్దీ తిప్పాడు.

'నూట అయిదూ-నార్త్ టవర్'అంటూ, నెమ్మదిగా తలుపు వెనక్కు నెట్టాడు. ముగ్గురూ తలలు వంచుకుని లోపలికి నడిచారు.

ఆ గదికి, ఎక్కడో గోడకుపైభాగంలో ఒకే ఒక చిన్న కిటికీ వుంది; దానికికూడా, గాలీ వెలుతురూ ఎక్కువ లోపలికి చొచ్చుకు రాకుండా దగ్గరదగ్గిరగా ఇనపచువ్వలు అమర్చివున్నయ్. ఆ గదిలో ఒక మూలగా కొయ్యలు కాల్చిన బూడిదతో ఒక చిన్న పొయ్యి వుంది. మరోమూల ఒక బెంచీవుంది. గదికి మధ్యగా ఒక గడ్డిపరుపు పారేసివుంది; చుట్టూ నాలుగు గోడలూ పొగబారి నల్లబడి జీమూతాల్లా వున్నయ్. వాటిలో ఒకగోడ మధ్య తుప్పుబట్టిన ఒక పెద్ద ఇనపకడియం వ్రేలాడుతోంది.

'ఆ చేతిలోవున్న కాగడా ఇలా గోడవేపుగా తీసుకురా' అన్నాడు డిఫార్జ్.

వార్డర్ ఒణుక్కుంటూ చేతులోవున్న కాగడా గోడ పక్కగా చూపించాడు. డిఫార్జ్ గోడపొడుగునా జాగ్రత్తగా పరిశీలించుతున్నాడు.

'ఆగండి-ఇదేవిటో చూడు జాక్విస్!'-

“ఏ. యం.” అని జాక్విస్ గోడమీదవున్న అక్షరాలు చదివాడు.

'అలెగ్జాండర్ మానెట్'- డిఫార్జ్ జాక్విస్ చెవిలో మెల్లగా వూదాడు. ఆ అక్షరాల దగ్గిరినుంచి తుపాకిమందుతో నల్లబడి పోయిన చూపుడు వ్రేలు మరికొంచెం ముందుకు పోనిచ్చి: 'ఇదిగో! ఇక్కడ “డాక్టర్” అని వ్రాసివుంది-ఇదిగో ఈ రాతిమీది కాలెండరు గీసుకున్నదికూడా బహుశా ఆయనే అయివుంటాడు. నీ చేతిలో యేవిటది?-తవుగోలేనా?- ఇలాతే'

జాక్విస్ చేతిలోనుంచి తవుగోల తీసుకుని అక్కడున్న బెంచీని కచ్చ కొద్దీ నాలుగుపోట్లు పొడిచాడు.

అరేయ్! కాగడా యింకా కొంచెం పైకెత్తు-యీ కత్తి తీసుకుని ఆ గడ్డిపరుపు చీరండి-లోపల గడ్డిలో యేవన్నా వుందేమో వెతకండి!- కాగడా పైకెత్తమనలేదురా!'-

వార్డర్ వంక ఒక్క ఉరుమురిమి, పొయ్యిగడ్డలమీదికి ఎక్కి, తలపైకెత్తి పొగగూడు వైపు పరకాయించి చూచాడు. ఆ పొగ గూడుకు పక్కగా తవుగోలతో ఒక పోటు పొడిచాడు: ఇన్ని ఇటుక పెల్లలూ దుమ్మూ, మసి, గభాల్న రాలి క్రిందనున్న పొయిలోబడ్డయ్. అవి మొహంమీద పడకుండా తల పక్కకు తిప్పేసుకున్నాడు. ఆ మసికుప్పను ఇటూ అటూ తవుగోలతో కెలికి వెతికి చూచాడు. ఏవీఁ కనుపించలేదు.

'ఈ చెత్తలోనూ - కట్టెల మసిలోనూకూడా యేవీఁ వున్నట్టు లేదు జాక్విస్!'-

'ఏవీఁ లేదు'-

'సరే వాటినన్నిటినీ గదిమధ్య పోగేసి, కాగడా అంటించండి!'

గదిలో చెత్తగుట్ట మంటలు రేగుతోంది. దరవాజా తలకు తాకకుండా వంగి గదిలోనుంచి బయటికి వచ్చేశారు. వాళ్లు ఆ అహోబలబిలపు కక్ష్యాంతరాలన్నీ దాటి అవతలికి పడ్డారు.

కోట సింహద్వారం ముందు జనం గగ్గోలుగా అరుస్తూ, తమ నాయకుడైన సారా దుకాణం యజమాని డిఫార్జ్ కోసం వెతుకుతున్నారు. ఆ దుర్గరక్షకుడుగావుండి, జనంమీద ఫిరంగులు కాల్పించిన గవర్నర్ను పట్టుకున్నారు. అతణ్ని విచారణ నిమిత్తం 'హోటల్ డావిల్లా'కు తీసుకుపోవలసిన దళానికి డిఫార్జ్ నాయకత్వం వహిస్తేగాని కుదరదు. డిఫార్జ్ని చూడగానే, మాడమ్ డిఫార్జ్ కేకబెట్టింది: 'అదుగో! మా ఆయన!'

ఆ జనంమధ్య, గవర్నరు, మతిచెడి మొద్దుబారిపోయిన మొహంతో, అదో విచిత్రమైన బొమ్మలా వున్నాడు. ఊదారంగు అధికార దుస్తులమీద ఎర్రటి గౌరవచిహ్నాలు ఇంకా అలాగే వున్నయ్. అతని ప్రక్కనే మాడమ్ డిఫార్జ్ పట్టాకత్తి చేత్తో బుచ్చుకుని మరొక ఉక్కుబొమ్మలా నడుస్తోంది.

గవర్నర్ను వీధివెంట తన్నుకుంటూ తీసుకుపోతున్నారు. హోటలు చేరువకు రాగానే తన్నులు కత్తిపోట్లుగా మారినై. గవర్నర్ హోటలు మెట్లమీద కుదబడిపోయాడు. ప్రక్కనే నడుస్తున్న మాడమ్ డిఫార్జ్ ఆ పడ్డవాడి గుండెలమీద చెప్పు కాలువేసి అదిమి తొక్కింది. చేతిలోవున్న పట్టాకత్తితో చివాల్నవాడి తల నరికేసింది.

సెయింట్ ఆంటోనీ వీధిలో వీధిదీపాలకు మారు, మనుషుల శవాలు తీగలమీద వ్రేలాడే బీభత్స తరుణం ఆసన్నమైంది. సెయింట్ ఆంటోనీ రక్తం ఉడుకెత్తిపోయింది. అంతవరదాకా, ఉక్కు పాదాలక్రింద ప్రజల్ని నలిపివేస్తూ గంగ శివాలాడిన నిరంకుశత్వం హోటలు మెట్లమీద కుదబడి కూలిపోయింది. దాని గుండెలమీద మాడమ్ డిఫార్జ్ చెప్పుకాలు తాండవమాడుతోంది.

'అరేయ్! ఆ వీధిదీపం లాగెయ్యండిరా'- సెయింట్ ఆంటోనీ గర్జించాడు. దీపానికి మారుగా గవర్నర్ మొండెం తీగమధ్య వ్రేలాడుతోంది.

అంతూపంతూ లేని ఆ విలయసముద్రం భయంకరంగా ముందుకు పొర్లిపోతోంది. ఆ సముద్రంమధ్యను, అప్పుడే హఠాత్తుగా జైలునుంచి విడుదలచేయబడి, ఏది యేవిఁ

టైందీ తెలియక భుజాలమీద, మొండిగోడలమీద కొండముచ్చులులా యికిలిస్తూ ఎత్తుగా కూర్చుని, ఆ జనం పెడుతున్న వెర్రికేకలు వింటున్నయ్. మరోచోట, రక్తాలోడుతున్న మరోయేడు తలకాయలు ఈటెల చివరలకు గుచ్చి ఆకాశంలోకి యెత్తివున్నయ్.

1789 సంవత్సరం జూలై నెల మధ్యలో ఒకరోజున ఈ విలయోత్సవం పారిస్ నడివీధులగుండా ప్రవహించుతోంది.

31

పానశాలలో యోధానుయోధులంతా కిటకిటలాడుతున్నారు. ఒకరినొకరు మహోల్లాసంగా కావిలించుకు వీరాలాపాలలో మునిగితేలుతున్నారు. మాడమ్ డిఫార్జ్ మామూలుప్రకారం, అమ్మకం బల్లదగ్గిర కూర్చుని, ఆ సభకు అధ్యక్షత వహించివుంది. ఆవేళ ఆ వీరనారీమణి తలలో రక్తగులాబీ కనుపించటంలేదు. దాని అవసరం తీరిపోయింది. గూఢచారులంతా ఈ వారంరోజుల తాకిడితోనే హడలిపోయి, సెయింట్ ఆంటోనీపాదాలముందు దాసోహమై ఆ సౌభ్రాతృత్వంలో చేరిపోయారు.

మాడమ్ డిఫార్జ్ కుర్చీలో యాలిగిలబడి కూర్చుని, పానశాలలో వున్న జనాన్నీ, వీధిలో కనిపించుతున్న జనాన్నీ చూస్తోంది. వీధిలోనూ, లోపలాకూడా జనం గుంపులు గుంపులుగా నిల్చుని కబుర్లాడుకుంటున్నారు. చింపిరి జుట్లూ, చిరిగిపోయిన చొక్కాలూ, వాళ్లంతా, దరిద్రనారాయణావతారాలుగా వున్నా, వాళ్ళలో ఇప్పుడు అదో అధికారధీమా కనుపించుతోంది. ఆ విషయాన్ని అర్థం చేసుకుని మాడమ్ డిఫార్జ్ లోలోపల ఆనందపడుతోంది. ఆవిడ ప్రక్కనే మరో లావుపాటి పొట్టికురచ మహిళారత్నం నిల్చునుంది; పొట్ట జరక్క ఆకలికి నకనకలాడుతుండే ఒక చిల్లర దుకాణంవాడి భార్య; యిద్దరు బిడ్డలతల్లి; ఆ వీరనారి, బాస్టిల్లీ రక్షక్షేత్రంలోనే, తన వీరకృత్యాలకు ప్రతిఫలంగా 'ప్రతీకారిణి' అనే గౌరవ బిరుదాన్ని సంపాదించుకుంది.

'అఁ! - ఏవిఁటాగల్లంతూ! - ఎవరా వచ్చిందీ!' అన్నది ప్రతీకారిణి.

సెయింట్ ఆంటోనీ వీధి మొగిలోనుంచి పానశాల మెట్ల దగ్గిరికి యేదో మందుగని సురసురా కాలుకుంటూ వస్తున్నట్టు, వీధిపొడుగునా యేదో గుజగుజ రేగింది.

'అడుగో! ఆయనే వస్తున్నాడు - అన్నది మాడమ్. డిఫార్జ్ రోజుకుంటూ లోపలికి పరుగెత్తుకొచ్చాడు : అతన్ని చూడగానే అక్కడున్న జనం యావత్తూ చుట్టూ చుట్టేశారు.

'సోదరసోదరీమణులారా!' అన్నాడు.

'సైలెన్స్ - వినండి వినండి' అని కేకబెట్టింది మాడమ్ డిఫార్జ్, ఆవేశంగా లేచి నిల్చుంది:

'సోదరులారా! ఆకలితో అల్లాడుతున్న మన బీదప్రజల్ని గడ్డితిని బ్రతకమని కూసిన ఆ పరమనీచుడు, ప్రజాద్రోహీ అయిన ఫౌలన్ అనే కిరాతుడు మీకు తెలుసు!'

'చచ్చాడుగా!'-

'చావలేదు - అంతా వట్టిది. చచ్చిపోయినట్టు స్వయంగా పుకారువేయించి, అంత్యక్రియల నటనకూడా జరిపించాడు!'

'ఏవిటీ!-ఆరి బద్మాష్!'-

'ఆ పరమనీచుడు ఇప్పుడు మనచేతికి చిక్కాడు - హోటల్ డా విల్లాలో ఖైదీగా వుంచాం. సోదరులారా బయలు దేరండి, పగదీర్చుకోండి!'-

ప్రతీకారిణి దబదబా ఢంకా మోగించింది. బల్లమీద పట్టాకత్తి చివాల్న అందిపుచ్చుకుని మాడమ్ ఢిఫార్జ్ 'హోయ్!' అంటూ పెద్దపెట్టున ఒక వెర్రికేకబెట్టి బయలుదేరింది. వీరావేశంతో ఊగిపోతున్న ఆ జనప్రవాహం వీధివెంట సెలయేళ్ళ ముంపులా ప్రవహిస్తోంది. అందినవాడు అందిన ఆయుధం చేతబట్టి ఇళ్ళల్లోనుంచి బయటికి పరుగెత్తుకొచ్చి ప్రవాహంలో కలిసి కొట్టుకుపోతున్నారు. పాలుదాగని పసిగుడ్లనూ, తిండి తినని ముసలివాళ్లను మంచాలలో వదిలేసి ఎలావున్నవాళ్ళు అలా నిలుచున్న పళంగా బయటికి వచ్చేస్తున్నారు.

'నీచుడు!- కిరాతుడు! పంద! పశువు! - పడుకోబెట్టి చీల్చండి! ఫౌలన్ కిరాతుణ్ణి కడి కండలు రాల్చండి!'-

ఆ పెడబొబ్బలతో ఆకాశం ప్రతిధ్వనించిపోతోంది. 'గడ్డి తినమని కూశాడు - బిడ్డకు పాలులేవండి అంటే! - రొమ్ముల్లో పాలెండిపోతే - రొంపిగడ్డి చీకబెట్టమని తిట్టాడు నా పసి తండ్రిని - బిడ్డ చచ్చిపోతుంటే యేవీఁ చెయ్యలేక యేడ్చాను - ఈవేళ ఆ ఫౌలన్‌గాడి రక్తంతాగి నాకడుపుమంట తీర్చుకుంటాను' అని కచ్చగా అంటోంది ఒక యిల్లాలు.

ఫౌలన్ను కట్టేసివుంచిన హోటలు హాలు ఇసకవేస్తే రాలకుండా కిటకిటలాడి పోయింది. హాలేకాదు; చుట్టూవున్న ఆవరణ, రోడ్లు యావత్తూ తొలగదొయ్యటానికి సందులేదు.

డిఫార్జ్ దంపతులూ, ప్రతీకారిణి, జాక్విస్-3, ముందు పీటీని కనుపించుతున్నారు. మాడమ్‌డిఫార్జ్ కత్తిమొనతో ఫౌలిస్‌వంక చూపిస్తూ!

'అడుగో కిరాతకుడు! జనాన్ని గడ్డితిని బ్రతకమన్న పరమలుచ్చా! - వాడినోట్లో యింత గడ్డికూరండి! - తినమనండిప్పుడు! - హాఁ! హాఁ! బాగుంది! బలేపని చేశారు!' చేతిలోవున్న కత్తి చంకలో బెట్టుకుని ఉల్లాసంగా హాల్లోవున్న వాళ్ళే కాకుండా దొడ్లూ, దోవలూ, గోడలూ గొపికెలూ, గుమ్మాలూ వీధులూ యావత్తూ ప్రతిధ్వనించిపోయినై. ఒకొక్కవరస తిడుతూ వుండటం, ఒకొక్కవరస చప్పట్లు చరుస్తూవుండటం, ఆవిధంగా రెండుమూడు గంటలసేపు ఆనందకోలాహలం సాగిపోయింది.

ఉన్నట్టుండి డిఫార్జ్ సింహంలా ముందుకురికి ఫౌలన్ను మెడబట్టుకున్నాడు. మాడమ్ డిఫార్జ్ కూడా ముందుకు దూకి ఫౌలన్ను కట్టివేసిన త్రాడును పలుపులా లాగి పట్టుకుంది. ప్రతీకారిణీ, జాక్విస్ యింకా దూరంగానే వున్నారు. ఇంతలోనే జనంలోనుంచి వీరావేశంగా బీభత్సనినాదం వినిపించింది.

'పడలాక్కురండి బయటికి!!'

క్రిందామీదా, ఈడుస్తూ, పడులాగుతూ, తన్నుతూ గుద్దుతూ, వీధి మొగిలోకి వచ్చిన బర్రెదూడను యీడ్చుకువచ్చి పట్టు పడలాక్కొచ్చారు; రోడ్డుమీద యీడ్చుకు వస్తుంటే, ఫౌలన్ ఒళ్లంతా కొట్టుకుపోయి రక్తాలోడిపోతోంది. మరణవేదనలో యేడుస్తున్న అతని ఆక్రందనం అక్కడ యెవ్వరి చెవులకు వినిపించటంలేదు. వీధి మొగిలోకి వచ్చిన తరువాత, పిల్లి యెలుకను

విదిలించి పారేసినట్టు, మాడమ్ డిఫార్జ్ ఫౌలన్ను ఒక్క విదిలింపు విదలించి నేలబారేసింది. నలుగురూ మీదబడి అతని నోటినిండా చెత్తకూరి, మెడకు తాడు తగిలించి వీధిదీపానికి మారుగా తీగమధ్య వ్రేలాడదీశారు. తాడుతెగి రోడ్డుమీదపడి చితాచిత్తలైనాడు. మళ్లీ యెత్తి మళ్లా వ్రేలాడదీశారు. ఈతూరి ఆతాడు కాస్త దయదలచి మళ్ళా తెగిపోలేదు. మరుక్షణంలో అతని తలను బరిసెకు గుచ్చుకుని, ఆ జనమంతా దానిచుట్టూ తిరుగుతూ ఆనందనృత్యం చేశారు.

ఆనాటి అకృత్యాలు అంతటితో ఆగలేదు. సెయింట్ ఆంటోనీ రక్తనాడులన్నీ ఆవేళ తారాపథానికి ఉడుకెత్తిపోయి వున్నయ్. చచ్చిన ఫౌలన్ అల్లుడు మరో ప్రజావిరోధి పారిస్‌కు వచ్చినట్టు తెలిసింది. పోయిపడ్డారు. ముక్కలు ముక్కలుగా నరికారు. అతని తలకూడా మామ తలతోపాటు ఈటెకు గుచ్చుకుని ఈరుళ్ళకొలువుగా ఉత్సవం చేశారు.

ఈ ఆడవాళ్లూ, మగవాళ్లూ యిళ్లకు తిరిగివచ్చేసరికి, రాత్రి బాగా పొద్దుబోయింది. కూడూకుమ్మూలేని పసిబిడ్డలు కుయ్యో మొర్రో అని యిళ్లల్లోబడి యేడుస్తున్నారు. వాళ్లకి లోలోపల ఆకలి దహించుకుపోతూనే వుంది. కాని ఆనాడు జరిపిన వీర కృత్యాల సర్దాలో ఆకలి దప్పులు ఒక లెక్కగా కనుపించటం లేదు. ఏదో యింటోవున్నది కాస్తాకూస్తా నంజి సర్దాగా కబుర్లాడుకుంటున్నారు. తండ్రులూ, తల్లులూ నకనకలాడుతున్న బిడ్డల్ని ఆవేశంగా ముద్దులాడుతున్నారు. ప్రేమీ ప్రేమికులైన యువతీ యువకులు భవిష్యత్తును గురించి కలలుగంటూ ఆనందంగా నిద్రపోతున్నారు.

ఆరాత్రి తెల్లవార్లూ డిఫార్జ్ పానశాల, దేవేంద్ర సభలా కిటకిటలాడుతూనే వుంది. వున్న వాళ్లంతా సాంతం బయటికి వెళ్లిపోయేసరికి, కాకులు కూసి తెలతెరవార వస్తోంది.

పానశాల గేటు తాళం వేస్తూ డిఫార్జ్ భార్యవంక చూసి :

'అమ్మయ్యా! ఇప్పటికి వచ్చింది శుభదినం' అన్నాడు.

'ఆ ఇంచుమించు వచ్చేసినట్టే' అన్నది భార్య.

32

రోడ్డుకూలీ, మాడే డొక్కకు పట్టెడు కబళాన్ని సంపాదించటానికి పలుగూ పారా బుజాన పెట్టుకుని కొండమీదికి వెడుతూవుండే, ఆ కుగ్రామంలో కూడా కొంత మార్పువచ్చింది. జైలుకొండమీద మునపటంత హడావిడిలేదు. ఆ జైలును కాపలా గాయటానికి కొంతమంది సిపాయిలున్నారుగాని మునపటంతమంది లేరు. సిపాయిలను అజమాయిషీ కనుక్కోవటానికి కొంతమంది అధికారులుకూడా వున్నారు. కాని, ఆ అధికారులు కూడా, తమ క్రిందవున్న సిపాయీలు తమ ఉత్తరువులను అమలు జరుపుతారో లేదో తెలియని అజ్ఞానదశలో వున్నారు – తాము ఉత్తరువు చేసింది మినహా మరేమైనా చెయ్యవచ్చుననే విశ్వాసంకూడా క్రమేపీ యేర్పడుతోంది.

ఉండటానికి చుట్టూ విశాలమైన భూభాగమేవుంది : కాని అదంతా వట్టి శ్మశానవాటికగా వుందిగాని, చూపు మేరదూరం ఎక్కడా, పచ్చని పరక కనుపించదు.

అక్కడవుండే ప్రజల ఎంత దరిద్రపుగొట్టు పరిస్థితిలో వున్నారో, ఆ భూములుకూడా అలాంటి ఊసరక్షేత్రాలుగానే వున్నయ్. చెట్లూ, చేమలూ, కొంపలూ గోపికెలూ, పశువులూ, మనుషులూ కూడా యీసురోమని మెలికెలు దిరిగిపోయి వున్నారు.

జమిందారు బతికున్న రోజుల్లో, ఆ వాతావరణంలో తానొక నందనోద్యానంలా, అయినకాడికి దబ్బు తగలెట్టి వెలుగుతూవుండేవాడు. కాని ఆ జమీందారీ వెలుగే ఈ భూభాగాన్ని ఆ కాడికి తెచ్చింది. జమిందారు భోగవిలాసాలకోసం ప్రత్యేకంగా భగవంతుడిచేత సృష్టింపబడిన ఆ భూభాగం, ఆ కామధేనువు, అలా, అచిర కాలంలోనే, తరిపినబడి పాలెండిపోవటం, పొదుగు, ఎగబీక్కుని తొళ్లికైపోవటం విచిత్రమైన సంగతే. ఈ సంగతి ఆలోచించితే, సనాతనమైన జగస్సృష్టిలోనే, ఎక్కడో పొరపాటుందేమో ననిపిస్తోంది. ఆ భూభాగాన్ని ఆకాడికి తెచ్చిన అనంతరం, జమీందారు, ఎప్పుడూ పట్నవాసాలు పట్టుకుతిరిగి హోటళ్లలో కాలక్షేపం చెయ్యటమేతప్ప, ఇక ఆ ఛాయలకు రావటమే అరుదైంది. అథవా యెప్పుడేనా వస్తే, యే మృగాల వేటకో, మనుషులవేటకో వచ్చి, కొన్ని చిత్రహింసల అనంతరం తిరిగి పట్నవాసాలకు వెళ్లిపోతూ వుండేవాడు.

ఒకనాడు రోడ్డుకూలీ కొండగుట్టమీద నిల్చుని సమ్మెటతో పలుగురాళ్లు పగులగొడుతున్నాడు. అలా దుమ్ములో పొరలాడుతున్నాకూడా : 'మన్నులోనే బుట్టి, మన్నులోనే కలసె, ఏమీ జన్మంబేమి జీవనమూ? – ఓ మాయమనసా' – అనే వేదాంతం అతనిబుర్రకు తట్టడంలేదు. వాడి బుర్రలో అల్లాంటి గొప్ప గొప్ప వేదాంత సత్యాలు ప్రభవించటానికి తావెక్కడుంది. వాడిమనసు, ప్రొద్దస్తమానం, రాత్రికి తిండి గతేవిటా అని ఆలోచిస్తూవుంటుందాయిరి. అలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ, తల పైకెత్తి చూచాడు. దూరాన పెనుభూతంలాంటి ఒకమనిషి కంటబడ్డాడు.

జిర్రబొచ్చు తలతో ఒక కండెమున్నర పొడుగున, కొయ్య చెప్పులూ వాడు రాక్షసిలా వున్నాడు. అనేకమైళ్ళ తరబడి నడిచి వస్తూ వుండటంచేత ఒళ్లంతా దుమ్ము కొట్టుకునుంది.

ఆ మనిషి సరాసరి రోడ్డుకూలీ దగ్గిరకొచ్చి అతని ముఖంలోకి చూచాడు; అనంతరం, గ్రామంవేపూ, జైలుగుట్టవేపూ పరకాయించి చూచి : రోడ్డు కూలీకి చెయ్యి అందించాడు కరచాలనాల అనంతరం, అదో సాంకేతిక భాషలో సంభాషణ కుపక్రమించాడు:

'కబుర్లేవిటి జాక్విస్!'

'అంతా సరిగానేవుంది అన్నా!–

'తింటానికేవీ లేనట్టుంది'–

'లేదన్నా – ఎదన్నా దొరికితే మాపటేళకే' అన్నాడు అసలే ఆకలితో ముడుచుకుపోయిన మొహం దీనంగాబెట్టి.

అంతేలే – పగటేల భోజనం చెయ్యటానికి ఎవుడికిమాత్రం ఎక్కడేడిసింది.'

జేబులోనుంచి, మసితో నల్లబడిపోయిన, పొగాకు చిలుంబయటికి తీశాడు. దాన్లో యింత తుక్కుపొగాకు కూరి నిప్పంటించాడు; యెర్రనిప్పుపడేటట్టు బాగా దమ్ములాగి వదిలి పెట్టాడు. ఆ యెర్రనిప్పుమీద చిటికెడు పొడుమేదో వేశాడు, అది భగ్గున మండి, పెద్దపెట్టున పొగలేచింది. రోడ్డుకూలీకి వ్యవహారమంతా అర్థమైపోయింది.

'ఈ రాత్రిరేనా?' - అని ప్రశ్నించాడు, రోడ్డుకూలీ.

'ఆ ఈ రాత్రిరే'-

ఆ యిద్దరూ ఒకళ్ల కెదురుగా ఒకళ్లు రాళ్లగుట్టమీద కూర్చున్నారు.

'ఎటుగావుంది?-'

'చూపిస్తా లెగు' - రోడ్డుకూలీ, అతన్ని వెంటబెట్టుకుని కొండకొమ్ముమీదికి నడిచాడు:

'ఇదుగో ఇట్టుగా కొండమలుపు తిరిగెళ్లాలి. అదిగో గేమం మద్దెన యీధి గనుపిత్తావుండదే, ఆడ, నీటి కుళాయి గనుపిత్తావుండాది సూడు! - ఆ యీది మద్దెగుండాబడి యెల్లాలి.'

'ఏడిసినట్టే వుండాదిలే - ఈధుల్లో నుంచీ, నీటికుళాయి పక్కనుంచీ పోవడం యేడ గుదురుతదిగాని - సరే...'

'గామానికి ఆకాడేపున కొండ గనుపిత్తావుండలా - ఆ కొండయెనక ఒక అయిదారుమైళ్ళు పోవాల?'-

'సరేలే - నీపని యేయేల కొద్దీ?-

'చీకటిబడాల-'

'సరే నువ్వు బయలుదేరేటప్పుడు నన్ను లేపు - నేను శానాదూరం నడిసి అలిసిపోయుండాను. కూశంతసేపు కునుకుదీత్తేనేగాని పాణం జేరుకోదు.'

ఆ రాక్షసి కొయ్యచెప్పులు అలానే పక్కనే వదిలేసి, ఆ రాళ్లగుట్టమీద అలాగే పడుకున్నాడు. ఒకటి రెండు నిమిషాల్లో నిద్రబట్టిపోయింది; కుంభకర్ణుడులా గుర్రుగొట్టేస్తున్నాడు;

రోడ్డుకూలీ, యీమధ్య నీలిటోపీ తీసేసి యెర్రటోపీ ధరించటం మొదలుబెట్టాడు. ఆ యెర్రటోపీ వారగా వంచి నిద్రపోతున్న ఆ కొత్తమనిషివంక పరకాయించి చూస్తున్నాడు. ఆ కంచుమొహం, ఆ బిరుసుగడ్డం, ఆ జిర్రబొచ్చు, ఆ యెర్రటోపీ, నాటు గొంగడితో కుట్టిన ఆ ఉన్నికోటూ, కోటులోనుంచి, కండలు దిరిగి కనుపించుతున్న ఆ యెదుర్రొమ్ము,- మనిషిని జూసి గుండె కొట్టుకున్నాడు. నిద్రబోతున్న ఆ మనిషి మీదికి వంగి, అతని కోటుక్రింద ఆయుధాలు యేమేమి వున్నాయో పరిశీలించటానికి ప్రయత్నించాడు. కాని, అతను గుండెలమీద చేతులు అడ్డంగా వేసుకుని నిద్రపోతూ వుండటంచేత వీలుపడలేదు. 'ఈ ఉక్కు భీముడిముందు ఎలాంటి రాతికోటలైతే మాత్రం యేవిఁ ఆగుతాయనుకున్నాడు. ప్రొద్దు గూకిపోతోంది; పలుగూపారా సర్దుకుని, నిద్రపోతున్న వాణ్ణి లేవగొట్టాడు.

నిద్రపోతున్నవాడు బద్ధకంగా లేచి ఒళ్ళు విరుచుకున్నాడు :

'ఆ కొండకి ఆకాడ అయిదారుమైళ్ళు పోవాలన్నమాట?'

'అవును అంతే'-

రోడ్డుకూలీ కొండదిగి గ్రామంలోకి వెళ్లిపోయాడు; నీళ్లు దాగటానికి కుళాయిదగ్గిరికి తోలుకొచ్చిన బక్క పశువులను ఒత్తిగిలించుకుంటూ ప్రతిమనిషి చెవులోనూ యేదో గుసగసా రహస్యంగా చెబుతున్నాడు. అలా, ఆ రహస్యం గ్రామంలోవున్న ప్రతి ఒక్కడి చెవిలోనూ చెప్పాడు. రాత్రి భోజనాలైన అనంతరం గ్రామస్తులంతా, మామూలు ప్రకారం, యిళ్ళల్లో పడుకుని నిద్రపోలేదు. అంతా బయటికివచ్చి కబుర్లాడుకుంటూ వీధిలో కూర్చున్నారు. గుంపులు గుంపులుగా కూర్చుని గుసగుసలాడుకుంటున్నారు - ఆందోళనగా ఆకాశం వేపు చూస్తున్నారు. ఆ గందరగోళమంతా యేవిటో అర్థంకాక స్థానిక సర్వాధికారి మాన్సియర్ గాబెల్లీ నెమ్మదిగా, రహస్యంగా, యింటి పైకప్పుమీది కెక్కి, తానుకూడా అటువైపు ఆకాశంలోకి పరకాయించి చూచాడు. పొగగూటికి వెనగ్గా దాక్కుని వీధిలో కూర్చునున్న చీకటి ముఖాలవైపు తొంగిచూచాడు.

చీకటి దట్టంగా అలుముకుపోతోంది. పెద్దపెట్టున గాలి దుమారం రేగింది. జమిందారు కోటచుట్టూవున్న పెద్దపెద్ద చెట్లన్నీ ఆ గాలికి జీబూతాల్లా ఊగిపోతున్నయ్. ఆ చెట్ల మధ్యగా బడి, నాలుగుప్రక్కలనుంచీ నలుగురు వ్యక్తులు కోటముందు ఆవరణలో వచ్చి కలుసుకున్నారు. నాలుగు లైట్లూ ఒక్కసారి వెలిగినై. నాలుగు లైట్లూ నాలుగు మూలలకూ మళ్లీ విడిపోయినై; మళ్లీ అంధకారం ఆవరించుకుపోయింది.

ఆ అంధకారం కూడా ఎంతోసేపు లేదు; క్షణమాత్రం; ఆ కోట స్వయంప్రకాశంగల యేదో మాయామందిరంలా దానంతటికదే చీకట్లో కనుపించసాగింది. ఉన్నట్టుండి కిటికీలలోనుంచీ, దరవాజాలలోనుంచీ పెద్దపెట్టున జ్వాలలు రేగిపోయినై. ఆ మంటల్లో కోటబురుజులమీదవున్న రాతిముఖాలు నిద్ర మేల్కొని కంగారుగా గుడ్లురిమి చూస్తున్నయ్.

కోటలో చిక్కడి వున్న నలుగురు ముగ్గురు సేవకులూ ప్రాణాలు దక్కించుకుని బయటపడ్డారు. కోటముందు కట్టేసి వున్న గుర్రాలమీద యెక్కి తలోవైపుకూ పరారీ చిత్తగించారు. ఆ ఆశ్వికులలో ఒకడు యెకాయెకి గ్రామంలోకి పరుగెత్తుకొచ్చి గాబెల్లీ యింటిముందు ఆగాడు : 'స్వామీ! - అంటుకు మండిపోతోంది! ఏవిఁ జేద్దాం?'-

ఏం జేస్తారు! రోడ్డుకూలీ, అతనితోపాటు వీధిలో గుమిగూడివున్న రెండు మూడువందలమంది గ్రామస్థులు : చేతులు గట్టుకుని, నిమ్మకు నీరెత్తినట్టు నిల్చుని, ఆకాశంలోకి లేస్తున్న మంటలవైపు వినోదంగా చూస్తున్నారు. 'తస్సాదియ్యా బలేగా మండుతోంది' అంటున్నారు, పీడ విరగడైపోతోందన్న కచ్చతో, ఒక్కడైనా కదల్లేదు.

లాభం లేదనుకుని, కోటలోనుంచి వచ్చిన నౌకరు, అక్కడ నుంచి కదిలి, జైలుగుట్టవైపు గుర్రాన్ని పరుగెత్తించాడు. జైలు గేటుముందు కొంతమంది అధికారులూ, సిపాయిలూ నిల్చుని మంటలవంక చూస్తున్నారు. 'స్వామీ! రక్షించండి! కోట తగలబడి పోతోంది. దాల్లో ఎన్నో అమూల్యమైన వస్తువులున్నాయ్' అని గోలబెట్టాడు, ఆ నౌకరు. అధికారులు ఉత్తరువులిచ్చినవారూ లేరు; వాటిని అమలుపరచటానికి సిద్ధంగా వున్న వారూ లేరు.

'ప్చ్! లాభం లేదు! - తగలబడి పోయేదే?' - పెదవులు చప్పరించారు.

ఆ నౌకరు నిరాశ చేసుకుని మళ్ళా ఊళ్ళోకి పరుగెత్తుకు వచ్చాడు. ఊరంతా దేదీప్యమానంగా వుంది. అక్కడున్న స్త్రీ పురుషులందరికీ హఠాత్తుగా ఒక సర్దా పుట్టింది. ఇంటింటా జ్యోతులు వెలిగిస్తే బాగుంటుందనుకున్నారు. ఇంటింటా ఒక్కసారి మైనపువత్తులు

వెలిగినై. తమదగ్గిర మైనపువత్తులు లేనివాళ్ళు గాబెల్లీనే బదులడిగి పుచ్చుకుంటున్నారు. ఆ యివ్వటంలో కొంచెం వెనకా ముందూ ఆడుతున్న గాబెల్లీ వంక ఒక మందహాసం పారేసి, అదివరకల్లా కుక్కిన పేనులా పడుండే రోడ్డు కూలీ : 'కొవ్వొత్తులూ గొడవా లేకుండా, బళ్ళకు నిప్పెట్టేస్తే జల్సాగా వుంటుంది' అన్నాడు.

కోటకోటా దానంతటికదే మండిపోయింది. చుట్టూవున్న చెట్లన్నీ కూడా, ఆ మంటలకు మలమలా మాడి నల్లగా కమిలిపోయినై.

అంతవరదాకా ఉల్లాసంగా మునిగితేలుతున్న గ్రామస్థులంతా, ఒక్కసారి గాబెల్లీ యింటిని చుట్టేశారు. బయటికి రమ్మని కేకలు బెడుతున్నారు. గాబెల్లీకి గుండెలు జారిపోయినై. వీధితలుపుకు యింట్లోవున్న రోళ్ళూ కుందులూ అడ్డంతోసి వాటి మీద భైరాయించి కూర్చుని 'ముందుగతి యేవిటా' అని ఆలోచిస్తున్నాడు. ఉన్నట్టుండి అతనికి ఒక ఆలోచన తట్టింది. గబగబా ఇంటి పైకప్పుమీదికి యెక్కాడు; ఆ జనం గనక వీధి తలుపు పగలగొట్టేట్టుంటే, తాను యింటిమీదినుంచి తలక్రిందుగా వీధిలోకి పడిపోయి, వీధిలో మూగిన జనంలో ఒకణ్నో యిద్దర్నో చితగ్గొట్టెయ్యాలనుకున్నాడు. అదృష్టవశాత్తూ అలాంటి అఘాయిత్య మేమీ జరక్కుండానే - తూరుపురేఖలు పొడిచి తెల్లవారిపోయింది. తెల్లవారిపోవటంతోనే, ఆ ముట్టడి కార్యక్రమం విరమించి, యెక్కడివాళ్ళక్కడ తమతమ పల్లెల్లోకి వెళ్ళిపోయారు. సూర్యభగవానుడి దయవల్ల ఆనాటికి గాబెల్లీ ప్రాణాలుదక్కి బ్రతికి బయటపడ్డాడు.

33

ఆవిధమైన తుపానురేగటం ఆరంభమై అప్పటికి మూడు సంవత్సరాలైంది. ఈలోగా లూసీకూతురుకు మూడు పుట్టినరోజు పండుగలుగడిచినై. మూడు సంవత్సరాలనాడు అంటుకున్న ఆ అగ్ని జ్వాలలు యింకా అదే ప్రకారం భీభత్సంగా మండుతున్నయ్. మూడు సంవత్సరాలనాడు ఫ్రెంచి ప్రజాసముద్రంలో ప్రభవించిన ఆ పోటు, మళ్ళా ఆటు అంటూ ఎరగకుండా అదే ప్రకారం పొంగులు రేగిపోతోంది. దాని తాకిడికి పుడమి కంపించిపోతోంది. రక్తపతాక ఆధ్వర్యం క్రింద, మృగతుల్యులుగా మారిపోయిన ఆ ప్రజల పదధ్వనులు, దూరాన్నుంచి, లూసీ యింట్లో వున్నవారందరికీ కూడా విలయతాండవంగా వినిపిస్తున్నయ్.

నానా లుచ్ఛాపనులూ చేసి, ఆ మహాభూతం ఉద్భవించే వరకూ నిద్రపోయారుకారు. తీరా అది యెదురయ్యేసరికి దాని తాకిడికి తట్టుకోలేక, అక్కడ ఫ్రాన్సులో వుంటే మానప్రాణాలు దక్కవనే గాబరాతో దేశదేశాలకూ పరారీ చిత్తగించారు.

ఈ బాపతు జమిందారులందరికీ, లండన్ టెల్‌సన్సు బ్యాంకు అనాథ శరణాలయంగా వుంది. దయ్యాలు, పూర్వం తాము బ్రతికివున్నప్పుడు యేయే యిళ్ళల్లో వుండేవో, చచ్చిన తరువాతకూడా ఆయా యిళ్ళను ఆశ్రయించుకు తిరుగుతాయని చెబుతారు. అలాగే యీ పెద్దమనుషులుకూడా, తమకిప్పుడు చేతిలో యెర్రనియేగానీ లేకపోయినా, పూర్వం తాము రొక్కాలు దాచుకున్న స్థలం గనక, ఆ బ్యాంకును, విడవలేక దాన్ని ఆశ్రయించుకు తిరుగుతున్నారు. అంతేగాక, టెల్‌సన్సు బ్యాంకుకు, ఫ్రాన్సునుంచి యెప్పటికప్పుడు తాజావార్తలు వస్తూవుంటై. టెల్‌సన్సు బ్యాంకు కొంచెం ఉదారమైన సంస్థ కావటం చేత, పడిపోయిన తన పాత ఖాతాదారులంటే కొంత సానుభూతితో వ్యవహరించేది. ఇలాంటి తుపాను రేగబోతోందని ముందుగానే తెలుసుకోగలిగిన దూరదృష్టిగల జమీందారులు, పెద్ద పెద్ద మొత్తాలు ముందుగానే యింగ్లండులోని టెల్‌సన్సు బ్యాంకుకు పంపి, యిక్కడ దాచుకున్నారు. మరి వాళ్లంతా యిప్పుడు ఇంగ్లండుకు వచ్చేశారు. నిత్యకృత్యపు ఖర్చుకరామతులకు డబ్బు తీసుకోవటానికి బ్యాంకుకు వస్తూవుంటారు. వాళ్ళూ, యేరోజు కారోజు ఫ్రాన్సు నుంచి పరారీ అయి వచ్చినవాళ్లూకూడా, లండనులో కాలు మోపగానే, బ్యాంకుకువచ్చి, తాము మకాందిగిన సంగతి తెలియజేసుకుంటారు. ఈ ఖాతాదార్ల సౌకర్యార్థం, టెల్‌సన్సు అధికారులు ఫ్రాన్సు నుంచి వచ్చిన వార్తలను, తాజా తాజాగా పోస్టర్లుగావేసి, బ్యాంకుగోడలమీద అంటిస్తూవుండేవారు. ఆ వార్తలను చదవటానికి కూడా ప్రజలు తండోప తండాలుగా రావటంతో బ్యాంకు వరండాలన్నీ కిటకిట లాగుతూ వుండేవి.

అలా, జనకోలాహలంగావున్న ఒకరోజున, మామూలు ప్రకారం, లారీ బల్లదగ్గిర కూర్చుని పని చేసుకుంటున్నాడు. చార్లెస్ డార్నే మోచేతులు బల్లమీద మోపి ముందుకువంగి ఆయనతో నెమ్మదిగా మాట్లాడుతున్నాడు.

'మీలో ఇంకా యౌవ్వనపు జిగి సడలలేదని నాకు తెలుసు - అయినా ఒకమాట చెప్పవలసివుంది...' అంటూ నసిగాడు, డార్నే.

'నేను ముసలివాణ్ణయానన్నది నిజమే - అయితే'-

'అయితే యేవిటంట - రోజులా బాగుళ్ళేదు - దూర ప్రయాణం - బరితెగివున్న దేశం -పారిస్‌లో మాత్రం మీకు రక్షణ వుంటుందని యేవిటి నమ్మకం?'

'నాయనా చార్లెస్ - నువ్వు చెప్పిన కారణాలనుబట్టే, నేను బయలుదేరిపోవటం యుక్తమని తోస్తోంది. ఏమంటే, క్షేమం సంగతికివస్తే, నాకు మరేం ఫరవాలేదనుకుంటాను. అక్కడ హుమ్మస్సుతోవున్న పడుచువాళ్లు అంతమంది వుండగా, ఎనభయ్యోపడిలోబడ్డ ముసలివాణ్ణి నా జోలికి యెవరొస్తారు? పారిస్‌నగరం కల్లోలంగా వున్నదన్నావే, నిజంగా అలాంటి కల్లోలమే రాకపోతే, ఇక్కడనుంచి అక్కడికి మనిషి వెళ్లిరావలసినపనే తగిలేదిగాదు గదా! ఇక కష్టనిష్ఠురాలతో కూడిన దూర ప్రయాణమన్న మాటకూడా నిజమే. ఇన్నాళ్ళూ ఈబ్యాంకు ఉప్పూపులుసూ తిన్నాను; ఈ బ్యాంకుకు అవసరంవచ్చినప్పుడు, యేవో కష్టనిష్ఠురాలున్నాయని నేనే వెనకాడితే, మరొకరెవరు తెగించి బయలుదేరతారు'?

'అక్కడికి నేనూ వెళ్లాలనే అనుకుంటున్నాను' అన్నాడు డార్నే, అదో అందోళనలో వున్న మనిషిలా.

'బలేపని - మంచివాడివే' - ఓ చెంప నన్ను బయల్దేరవద్దని సలహా చెబుతూ- నువ్వు ప్రయాణమా! - ఫ్రెంచి పెద్దమనిషివీ, ఆ దేశంతో మంచీ చెడ్డా సంబంధ బాంధవ్యాలున్నవాడివీ, ఈ కల్లోలపరిస్థితిలో నీవక్కడికి వెళ్ళటమా? - నిరవాకమే!'-

'నేను ఫ్రెంచివాణ్ణి కావటంచేతనే, ఈ తరుణంలో అక్కడికి వెళ్ళాలని నామనసు తహతహ పడుతోంది. పాపం ఆ ప్రజలంతా యెన్నోబాధలనుభవించారు. వాళ్ళు తెలియని ఆవేశంలో పడిపోయారు. తగిన రీతిలో చెప్పిచూస్తే, కొంచెం తమాయించి ప్రవర్తించరా? అని ఆశగావుంది. గతరాత్రి లూసీతో మాట్లాడుతూ...'

‘ఆ దేశం యావత్తూ అంతకల్లోలంగా వుందని తెలిసికూడా, ఒక చెంప అక్కడికి వెడతానంటూ, ఇంకా లూసీ సంగతెందుకెత్తుతావ్ - ఏముఖంతో’.

‘ఇంతకీ నేను బయలుదేరటం లేదుగదండీ’ అన్నాడు, డార్నే చిరునవ్వు నవ్వుతూ: ‘మీరు వెడతానంటుంటేనే చెబుతున్నాను’-

‘నేను నిజం చెబుతున్నా విను తండ్రీ! - ఇందులోవున్న ఇబ్బంది సబ్బందు లేవిటో నాకు అర్థంకావు; ప్రస్తుతం బ్యాంకు వ్యాపారమంతా ఎంతో బాదరబందీలోవుంది. ఆ దేశంలోవున్న మా రికార్డు పుస్తకాలు, పత్రాలు బాండులు వగైరా యావత్తూ చాలా చిక్కుల్లో పడిపోయినై. వాటికి యేక్షణానికి యేగతి పడుతుందో యేవీఁ చెప్పలేము. ఆ కాయితాలూ గట్రా, యేవన్నా ఆ జనం చేతుల్లోబడి తగలబెట్టేశారంటే, హరోంహర!- యెన్ని కుటుంబాలు కూలిపోతాయో నీకేం తెలుసు? అలాటి సంఘటన యే క్షణానేనా జరగొచ్చు - రేపో మాపో పారిస్‌కు నిప్పుబెట్టెయ్యరని యేవిటి నమ్మకం? అందుకే దీపంవుండగానే యిల్లు చక్కబెట్టుకోవాలని యీ తొందర! పోయి, మరీ అవసరమన్న కాయితాలు నాలుగూ కట్టగట్టుకుని యివతలకి జారేసుకోవాలి. ఏది యేమైనా కష్టకాలం; బ్యాంకుకు యిబ్బందివచ్చి ఈ కార్యభారాన్ని నామీదవుంచి ఆదేశించినప్పుడు - నావంటివాడు - యేదో కాస్త మోకాళ్లు పట్టుకుంటున్నాయనే అనుకో - వెనుకంజవేయటం యెలా సాధ్యం? ఇక్కడికి అరవై సంవత్సరాల నుంచీ బ్యాంకు ఉప్పూ పులుసూ తింటున్నాను. నిజానికి, నేను ముసలాణ్ణని అనుకుంటున్నావుగాని, ఇక్కడున్న తక్కిన వాళ్ళతో పోల్చిచూస్తే నేను పదహారేళ్ల బాలాకుమారుణ్ణనుకో!’

‘మీ యువక హృదయాన్ని అభినందించుతున్నాను’ అన్నాడు డార్నే, చిరునవ్వు నవ్వుతూ.

‘టట్ - నాన్సెన్స్ - వేళాకోళం - ఆడుతున్నావ్? - ఏదియేమైనా ఒక్కటిమాత్రం నిజం; పారిస్‌నుంచి ఆ కాయితాలు యివతల పడటమంటే మజాకాపని కాదనుకో - సింహంతో చెలగాటం; అయినా ప్రయత్నించక తప్పదు : యశోవా మృత్యుర్వా’.

‘అయితే యీ రాత్రికి మీ ప్రయాణం ఖాయమే నన్నమాట’ -

‘ఆహా! బయలుదేరి తీరాలి - ఇప్పటికే చాలా ఆలస్యమై పోయింది’.

‘వెంట మరొకరెవర్నేనా తీసుకువెడుతున్నారా?’

‘వీలైతే జర్రీని తీసుకు వెడదా మనుకుంటున్నాను - వాణ్ణి చూస్తే యేదో ఇంగ్లీషు బుల్‌డాగ్ అనుకుంటారు గాని అంత కంటే మరేం ప్రమాదం వుండదు.

‘మళ్ళా మరొక పర్యాయం తమ యువకహృదయాన్ని అభినందించుతున్నాను.’

‘మళ్ళా అదే నాన్సెన్స్ వద్దంటున్నాను - ఈ పనేదో కాస్త పూర్తి చేసుకు యివతలికి వచ్చి మాట దక్కించుకున్నానంటే తక్షణం రిటైరై కులాసాగా కాలక్షేపం చెయ్యాలనే, ఆపేక్షతో వున్నాను. యువకహృదయం లేదు, బండలూ లేదు’.

లారీ బల్లదగ్గిర ఈ సంభాషణ జరుగుతున్నంతసేపూ, ప్రక్కవరండాలో బెంచీలమీద పడగాపులుపడున్న ఫ్రెంచి జమిందారులు కొంతమంది - తిరుగుబాటుచేసిన వెధవల నందర్నీ ఇట్టా చితగొట్టేస్తాం అట్టా చితగొట్టేసాం అంటూ డచ్చీలు కొడుతున్నారు.

వాళ్ళతోపాటు బాతాఖానీ వేస్తున్న కొంతమంది ఆంగ్లేయ సనాతనిస్టులు, నిష్కారణంగా అలాంటి బీభత్సవిప్లవం రేగటం కారణంలేని దురాగతమంటున్నారు.

వాళ్లల్లో స్ట్రయివర్ కూడా వున్నాడు. అక్కడ బల్లమీద కూర్చునున్న ఫ్రెంచి జమీందారుతో బిగ్గిరబిగ్గరగా మాట్లాడుతున్నాడు. ఆ జనాన్ని హతమార్చటానికే, భూగోళంమీదనుంచి ఆకాశానికి యెగరగొట్టెయ్యటానికి మార్గాలేమున్నాయో, ఆ లాపాయంట్లన్నీ జమీందారుకు సలహాయిస్తున్నాడు. ఈ పేచీలు గనక యిలా చెల్లాచెదరైపోతాయో, ఆ వెధవలుకూడా అదేవిధంగా చెల్లాచెదురై నాశనమై పోతారంటున్నాడు. లారీ బల్లప్రక్కన నిల్చుని యీ ధోరణంతావింటున్న డార్నీ లోలోపల కంటగించుకుంటున్నాడు.

ఇంతలోనే, బ్యాంకు గుమస్తాలలోని ఒక వృద్ధపితామహుడు లోపలినుంచి సీలువేసి వున్న ఒక కవరు తీసుకొచ్చి లారీ బల్లమీద వుంచాడు : ‘ఈ చిరునామాదారు ఎవరో యేవన్నా తేలిందా?’ అన్నాడు

ఆ కవరుమీదవున్న చిరునామా, ప్రక్కనే నిల్చునున్న డార్నే కంటబడ్డది. అది తన పేరే కావటంచేత వెంటనే చకితుడైనాడు.

‘సెయింట్ ఇవ్రేమూండ్ ప్రభువు సన్నిధికి; C/o టెల్‌సన్సు అండ్ కంపెనీ, లండన్’ అని వుంది.

వివాహం జరిగిననాటి ఉదయం, డాక్టర్ మానెట్ డార్నేచేత ఒక వాగ్దానం చేయించుకున్నాడు. ఆ వాగ్దానం ప్రకారం, డాక్టర్ గారు అనుమతించేవరకూ, డార్నే తన అసలుపేరును యెవ్వరికీ చెప్పరాదు. అందుచేత డార్నే అసలుపేరు యేవిటో లూసీకిగాని, లారీకిగాని మరెవ్వరికీ గాని రవ్వంతేనా తెలీదు.

ఆ వొచ్చిన వృద్ధపితామహునితో లారీ ‘ఇక్కడున్న వాళ్ళందర్నీ పేరు పేరు వరసనీ భోగట్టా చేశాను. ఈ చిరునామా దాఖలా వ్యక్తి యిక్కడ యెక్కడాలేడు’ అన్నాడు.

లారీగారు ఆ ఉత్తరాన్ని వరండాలో వున్న జమీందారులందరికీ చూపించాడు. బెంచీమీద పడిగాపులు కాస్తున్న ఒక జమిందారు : ‘వీడా వీడు తెలుసులే - పాపం ఆ మహరాజును ఖూనీచేశారు. గొప్ప ప్రభువు అటువంటి మహావంశంలో ఈ నస్మరంతిగాడు పుట్టాడు. ఆయన అన్నకొడుకు. వాడిబుర్రలో యేవో వెర్రి వెర్రి సిద్ధాంతాలన్నీ పుట్టి పుచ్చిపోయింది. ఉన్నదీ మన్నదీ అంతా ఆ వెధవ జనానికి వప్పగింతచేసి యెటో దేశాల మీద పోయాడు - వట్టి సన్యాసి - వాడు యెక్కడున్నాడో యెక్కడ చచ్చాడో యెవడికి తెలుస్తుంది?’ అన్నాడు.

‘ఏవిఁటీ,’ అంటూ ఎత్తుకున్నాడు స్ట్రయివర్ : ‘సిద్ధాంతాలకోసం చేతులోవున్న ఆస్తి వదులుకున్నాడంటే, నిజానికి వట్టి వాజమ్మన్నమాట.’

ఆ సంభాషణవిని, డార్నే భరించలేకపోయాడు. స్ట్రయివర్ భుజంమీద చెయ్యివేసి: ‘ఇదిగో స్ట్రయివర్ గారూ! అలా తొందరపడి మాట్లాడెయ్యకండి! ఆయన్ను నేనెరుగుదును’

‘ఏవిటీ! అలాగా? - చాలా విచారకరమైన సంగతి’-

‘ఏవిటీ అలా అన్నారూ?’

‘ఆయన చెప్పిన సంగతేవిటో విన్నారా? - ఈ రోజుల్లో ఏవిటీ గీవిటి అంటూ ప్రశ్నించకూడదు’

'ఎందుకు ప్రశ్నించకూడదు? అడుగుతున్నాను చెప్పండి'

'సరే చెబుతున్నాను వినండి - ఇప్పుడు మనం మాట్లాడుతున్న వ్యక్తివున్నాడు చూశారూ- ఆస్తియావత్తూ దోపిడిగాళ్ళకూ హంతకులకూ, నికృష్టపు వెధవలకూ వప్పగింతబెట్టి వచ్చిన ఆ వాజమ్మ, ఆదర్శాలనే అంటుడు వ్యాధితో బాధపడుతున్న రోగి; మీరు కుర్రాళ్లతో కలసి మెలసి తిరుగుతూ వాళ్లకు విద్యాబుద్ధులు చెప్పి పైకి తీసుకురావలసిన పెద్ద మనుషులు - మీకు అలాంటి వ్యక్తితో పరిచయం వుండటమంటే విచారకరమైన సంగతికాక మరేవిటీ? వాడు వట్టి లుచ్ఛామనిషనీ, అది, భయంకరమైన అంటువ్యాధి అనీ నాభయం - అందుకూ విచారం'

'మీరు ఆయన్ను అర్థంచేసుకోలేకపోవచ్చు' అన్నాడు డార్నే, హృదయంలో ఉబుకుతున్న ఆవేశాన్ని అణచుకుంటూ.

'నాకు అర్థంకాకపోవటంమేవిటి లెద్దురూ? పెద్దమనిషయినవాడు యింత తెలివితక్కువగా యెవడు ప్రవర్తించుతాడండీ! ఉన్న ఆస్తి జనానికి వప్పగింత చేసేశాడే అనుకోండి, చేసినవాడు ఆ ఊపుతీసుకుని ఆ జనాభాకు యావత్తూ నాయకుడై బైఠాయించి కూర్చోవాలిగాని దేశాలమీదపోవట మేవిటండీ వాజమ్మా? మరీనా?'

ఆ ఉపన్యాసం ముగించి స్ట్రయివర్ యింటికి బయలుదేరాడు. అక్కడున్న జమిందారులంతా ఆ గంభీరోపన్యాసం విని, చప్పట్లుచరిచి అభినందించారు. అనంతరం స్ట్రయివరుతోపాటు యెవరిదారిని వారు వెళ్లిపోయారు.

బ్యాంకుగదిలో లారీ డార్నే మాత్రమే మిగిలారు.

'డార్నే! ఆయనెవరో నీకు తెలుసునన్నావుగదా పోనీ యీ వుత్తరం నువ్వు తీసుకు కాస్త ఆయనకు అందజేస్తావా?' అన్నాడు లారీ.

'అలాగే; యిటు తెండి.'

డార్నే ఆ వుత్తరం తీసుకొని ప్రక్కనున్న టెంపుల్‌బార్ ఆవరణలోకి నడిచాడు. అక్కడ ఒకచోట యేకాంతంగా కూర్చుని, ఉత్తరం విప్పి యిలా చదువుకున్నాడు :

'ఎబేయీఖైదు, పారిస్'

జూన్ 21, 1792

'సెయింట్ ఎవర్ మూండ్ ప్రభువు సన్నిధికి, ఆర్యా!

'గ్రామస్థుల చేతుల్లోబడి యెప్పటికప్పుడు ప్రాణాపాయస్థితిలో వుంటూ చాలారోజులు గడిపాను; చివరకు నన్ను పట్టుకుని, నామీద నానా దౌర్జన్యాలూ చేశారు; అనేకవిధాల అవమానించారు; నన్ను కాలినడకను పారిస్‌కు పడలాక్కొచ్చారు. త్రోవపొడుగునా యెన్నో బాధలుపడ్డాను; అంతేకాదు; నాయిల్లూ వాకిలీ నేలమట్టం చేసేశారు.

'నేను దేశంవిడిచి పారిపోయిన జమిందారుతరపున వ్యవహరించుతూ, ప్రజల సార్వభౌమాధికారానికి వ్యతిరేకంగా ప్రవర్తించానని నామీద నేరం మోపారు. ఇందుకుగాను, ప్రజాన్యాయస్థానంలో విచారించి నన్ను ఉరిదీయటానికి సిద్ధంగావున్నారు. ఈ ఆస్తి యావత్తూ ప్రజలకు వప్పగింత చేసేముందే లోగడ ప్రజలనుంచి రావలసిన శిస్తులన్నీ రద్దుచేశానని చెప్పుకున్నాను. కవుళ్ల వసూలు మానివేసి చాలా కాలమైందని చెప్పుకున్నాను. కాని నా మొరాలకించిన వారెవరూ లేరు. వాళ్ళు యివన్నీ వినిపించుకోలేదు. వాళ్లు అనేది ఒక్కటేమాట- పారిపోయిన జమిందారు తరుఫున వ్యవహరించావు; ఆ జమిందారు ఎక్కడున్నాడో చెప్పమంటున్నారు.

'తమరు ఎక్కడున్నారో యేవిఁటో నాకేమి తెలుసు?- కడపటి ప్రయత్నంగా, టెల్‌సన్సు బ్యాంకు ద్వారా ప్రయత్నం చేస్తే ఏదైనా ఆచూకీ దొరుకుతుందేమోననే ఆశతో ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. దైవకటాక్షంవల్ల ఈ ఉత్తరం మీచేతి కందితే నన్ను ఈ మరణవేదనలో నుంచి బయటపడవేయించే ప్రయత్నం చేయగలరని ఆశించుతున్నాను. మీ ఆజ్ఞలను శిరసావహించి వ్యవహరించటం మినహా యిందులో నేను చేసిన తప్పిదం మరొకటేదిలేదు; అలానే, మీరుకూడా నాయందు ధర్మబుద్ధితో వ్యవహరించగలరని ఆశించుతున్నాను. ఇట్లు, దురదృష్టవంతుడు, మీ గాబెల్లీ'-

ఈ ఉత్తరం చదువుకోవటంతో డార్నే మనస్సంతా వ్యాకులమైపోయింది. తన మూలంగానూ, తన కుటుంబం మూలంగానూ, హతమారిపోతున్న గాబెల్లీ ముఖం, నిష్ఠురంగా జేవురించి అతని కట్టెదుట కనుపించుతున్నట్టనిపించుతోంది. ఏవిఁ చెయ్యటానికి తోచక గిజాటుగా లేచి నిల్చుని యిటూ అటూ తిరుగుతున్నాడు.

ఈ వ్యవహారంలో తాను చేసిన పొరపాటేవిఁటో డార్నేకు స్పష్టంగా అర్థమౌతోంది. తన వంశంవాళ్లు పారంపర్యంగా అనేక అకృత్యాలు చేశారు. తన పినతండ్రి చర్యలంటే తనకు అసహ్యం. తాను ఆ కుటుంబానికి చెందిన వాణ్ణనిగాని, ఆ యెస్టేటుకు వారసుణ్ణనిగాని చెప్పుకోవటం అతనికి కంటకమనిపించింది. ఆ ఆస్తి యావత్తూ ప్రజలకు వదిలేసి చేతులు కడిగేసుకుని యివతల బడాలనుకున్నాడు. కాని లూసీమీద వుండే మమకారంకొద్దీ, వెంటనే యింగ్లండు తిరిగిపోవాలనే తాపత్రయంలో, ఆ వ్యవహారాన్ని సీదాగా పరిష్కారం చేసుకోకుండా అర్థాంతరంగా వదిలిపెట్టి యివతలికొచ్చాడు. అతని అస్తవ్యస్త ప్రవర్తనకు ప్రతిఫలంగా యిప్పుడు అమాయకుడైన గాబెల్లీ బలికాబోతున్నాడు.

గాబెల్లీ, జీవన్మరణ సంధ్యలో నిల్చుని, డార్నే ధార్మిక గుణంమీదికి సవాలు విసిరాడు. ఆ సవాలు అందుకుని డార్నే పారిస్‌కు బయలుదేరటానికి నిర్ణయించుకున్నాడు. తాను వెళ్లిపోయేవరకూ, లూసీకి గాని, డాక్టర్ మానెట్‌కుగాని యీ విషయం తెలియనీయ గూడదనుకున్నాడు.

ఉత్తరం మడిచి జేబులో పెట్టుకుని బ్యాంకుదగ్గిరికి తిరిగొచ్చాడు. లారీ, జర్రీ ప్రయాణసన్నాహంలో వున్నారు. బ్యాంకు గేటు ముందు బండి నిలబెట్టివుంది.

'లారీగారూ! మీరు యిచ్చిన వుత్తరం ఆయనకు చూపించాను' అన్నాడు డార్నే. 'వ్రాతమూలకంగా సమాధానం యేమీ అక్కర్లేదుగాని, నోటిమాటగానే ఒకముక్క తెలియజేస్తే చాలు.'

'ప్రమాదమేమీ లేదంటే - వెళ్లి ఆ వర్తమానం చెబుతాను' - అన్నాడు లారీ.

'అవతల మనిషి ప్రస్తుతం ఎబేయీ జైల్లో వున్నాడనుకోండి - అయినా యిందులో పెద్ద, ప్రమాదమైన సంగతేమీ లేదు.'

'ఆ ఖైదీ పేరేవిటన్నావ్'-

'గాబెల్లీ'

'సరే! ఏం చెప్పమంటావ్'

'ఏవీ లేదండీ! - ఉత్తరం అందిందనీ, ఆయన వస్తానన్నారనీ చెబితే చాలు'-

'ఎప్పుడు బయలుదేరారో ఏవిటో - ఏవన్నా చెప్పాలా?'-

'రేపురాత్రి బయలుదేరివస్తారని చెప్పండి'-

ఈ సంభాషణ పూర్తికావటం తరువాయిగా, బండి కదిలి సాగిపోయింది. డార్నే నెమ్మదిగా కదిలి, లోలోపల ఆలోచించుకుంటూ సోహోస్క్వేర్ వైపు నడిచిపోతున్నాడు.

34

లండన్ నుంచి పారిస్‌కు బయలుదేరిన డార్నే, త్రోవపొడుగునా యెన్నో యిబ్బంది సబ్బందులు పడుతూనే వున్నాడు. కాని ఫ్రాన్సులో అడుగుబెట్టిన తదాదీ, ప్రయాణం మరింత దుర్ఘటంగా వుంది. ఫ్రెంచిరాజు యిప్పుడు పదభ్రష్టుడై వున్నాడనుకోండి; ఆయన సింహాసనంమీద వెలుగుతున్న రోజుల్లో కూడా, ఆ రోడ్లూ, ఆ ప్రయాణ సౌకర్యాలూ అంతకంటే, ఉద్ధరింపుగా వున్నది కూడా లేదు. కాకపోతే యిప్పుడు మరికొన్ని కొత్త చిక్కులు చుట్టుకున్నయ్. ప్రతి పట్నం మొగిలోనూ, పల్లెటూరి మొగిలోనూ కూడా, నాటు తుపాకులు భుజాన బెట్టుకుని, కొంతమంది దేశభక్తులు నిల్చునుంటారు. అలా నిల్చుని, వచ్చేపోయే బాటసారులనందర్నీ నిలవేసి వాళ్ల పుట్టు పూర్వోత్తరాలన్నీ భోగట్టా చేస్తారు. ప్యాసుపోర్టులు తనిఖీచేస్తారు. వాళ్ల చిత్తం వచ్చినట్టు వెనక్కు పంపేసే వాళ్ళను వెనక్కు పంపేస్తారు; ముందుకు పంపవలసిన వాళ్ళని ముందుకు పంపుతారు; అరెస్టు చేసేవాళ్లను అరెస్టు చేస్తారు- స్వాతంత్ర్య శాంతి సౌభ్రాతృత్వముల ప్రతిరూపమైన ప్రజాస్వామిక రిపబ్లిక్ పేరిట యిదంతా జరుగుతోంది.

ఫ్రెంచి తీరాన అడుగుబెట్టి నాలుగైదుమైళ్ళు ముందుకు సాగాడో లేదో, డార్నేకు ఓ అంశం తోచిపోయింది. పారిస్ నగరంలో నిజాయితీగల పౌరుడుగా యోగ్యతాపత్రం సంపాదించితేనే తప్ప, తిరిగి యీ కక్ష్యాంతరములు గడిచి వెనక్కు యింగ్లండుకు వెళ్లిపోయే ఆస్కారం లేదని తెలుసుకున్నాడు. ఏది యేమైనా, ఎన్ని యిడుములైనా పడి పారిస్‌కు జేరుకోవటం తక్షణ కర్తవ్యం. ఒకొక్క నగరం దాటటమంటే ఒకొక్క నరకద్వారాన్ని దాటటం. ఒకొకొక్క గ్రామాన్ని గడవడమంటే, ఒకొక్క కత్తుల బోనులోనుంచి బయటపడటం. ఇలా ఒక గ్రామంలోని సత్రంలో పడుకుని నిద్రపోతున్నాడు. అలసిపోయి, ఆనిద్రపోతున్న వాణ్ని, అర్ధరాత్రి సమయంలో నాటుతుపాకులు పుచ్చుకున్న ఒక ముగ్గురు దేశభక్తులూ, కటిక పిరికిజంతువైన ఒక స్థానికాధికారీ వచ్చి నిద్రలేపారు.

యెర్ర టోపీలు పెట్టుకున్న ఆ దేశభక్తులు ముగ్గురూ, చుట్టలు నోట్లో బెట్టుకుని కొలిమి తిత్తుల్లా పొగ వదులున్నారు. ఈనిద్ర లేపటాలూ, ఈ దేశభక్తుల తుపాకులూ, ఈ హంగామాలూ త్రోవపొడుగునా అనుభవిస్తూ వచ్చిన బాదరబందియే గనక, డార్నే వాళ్ళను చూసి పెద్దగాబరా పడ్డదేమీలేదు. కాకపోతే ఆ దేశభక్తులు ముగ్గురూ మొరటుతనంగా

తను నిద్రపోతున్న పక్కమీద కూర్చుని ధూమాలు వదులుతూవుండటం కొంచెం చికాకనిపించింది.

'ఏయ్! పరారీ! - నిన్ను పారిస్‌కు పంపటానికి యేర్పాటుచేశాను - సైనిక నిఘాలో' అన్నాడు అధికారి;

'కృతజ్ఞుణ్ని! పారిస్ పంపటంకంటే, నాకు మరో సహాయమేమీ అక్కర్లేదు - సైనిక నిఘా కూడా అక్కర్లేదు'- అన్నాడు డార్నే!

యెర్రటోపీ దేశభక్తుడు తుపాకి మడమతో ఆవేశంగా పక్కమీద ఒక మోదు మోది:

'నోరుముయ్ బూర్జువా!' అన్నాడు.

'సహృదయుడైన ఆ దేశభక్తుడు చెబుతున్న మాటనిజమే లెండి - మీరు పాలకవర్గానికి చెందిన గొప్పవారు గనక సైనిక నిఘా వుండితీరాలి - మీ వెంటపంపుతున్న ఆ సైనికులకు ఖర్చుకరామతులు యేమవుతాయో అవి మీరు ఇచ్చుకోవలసి వస్తుంది' అన్నాడు, స్థానికాధికారి.

'సరే! ఇందులో నా యిష్టానిష్టాలకు తావేముంది?'-

'ఇష్టం!- వింటున్నారుటోయ్! చింతచచ్చినా పులుపు చావదు! - లాంతరు స్తంభానికి వ్రేలాడగట్టి ఉరిదీయకుండా రక్షించాం - అక్కడికి సంతోషించడేం?'

'అవును దేశభక్తుడు చెప్పేమాట నిజమే! - లేచి గుడ్డా గుడుసూ సర్దుకుని బయలుదేరు.'

డార్నే లేచి బయలుదేరాడు. మొట్టమొదట అతన్ని ప్రజాసైనిక కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ యెర్రటోపీ దేశభక్తులు మరికొంతమంది కూర్చుని చుట్టలు గాలుస్తున్నారు. మరికొంతమంది తాగుతున్నారు. ఇంకా కొంతమంది గోడలకు చారబడి కునికిపాట్లు తీస్తున్నారు. డార్నే, తన వెంట పంపబడుతున్న సైనికుల ఖర్చులక్రింద ఒక పెద్దమొత్తాన్ని జమకట్టాడు. అక్కడి నుంచి, ఆ తెల్లవారిఝాము మూడుగంటలకే సైనిక నిఘాలో బయలుదేరాడు. మంచుతో తడిసినరోడ్డు. చలీ, యీదురు గాలి.

అతని వెంట యిద్దరు ప్రజాసైనికులను పంపారు. డార్నేను గుర్రంమీద యెక్కించారు. ఆ యిద్దరూ కూడా చెరో గుర్రమూ యెక్కి చెరోప్రక్కనూ స్వారీచేస్తున్నారు. డార్నే స్వారీ చేస్తున్న గుర్రం కళ్లెపు తాళ్లు వాళ్లలో ఒకడు తన నడుంచుట్టూ చుట్టుకున్నాడు. వాళ్లిద్దరిదగ్గిరా చెరో నాటు తుపాకీ, చెరో బాకూ వున్నయ్. సన్నగా తుంపర కూడా పట్టుకుంది. వాన చినుకులు గుండుసూదుల్లా మొహంలో గుచ్చుకుంటున్నయ్.

ఈ ప్రకారం, గతుకుల రోడ్ల వెంటబడి మైళ్ళ తరబడి ప్రయాణం చేస్తున్నారు. రాత్రి తెల్లవార్లూ ప్రయాణం చేయటం, ఉదయంపూట, ఒక అరగంటసేపుమాత్రం ఎక్కడో ఒక చెట్టు క్రింద మకాంచేసి విశ్రాంతి తీసుకోవటం, తిరిగి మళ్లీ బయలుదేరటం : ఆ యిద్దరు దేశభక్తులకూ ఒంటినిండా దుస్తులు కూడా లేవు; చలిబాధ భరించలేక పిక్కలకూ, పాదాలకూ ఎండుగడ్డి చుట్టుకున్నారు. వర్షానికి తడవకుండా వుండటానికి నెత్తిమీద నుంచి కూడా గడ్డిచూర్లుదించారు. ఆ రెండు అవతారాల మధ్యా అలా ప్రయాణం చెయ్యటం డార్నేకు యెంతో గిజాటుగా వుంది. ఈ గిజాటు ఇలా వుండగా ఆ దేశభక్తుల్లో ఒకడు విధీ విరామం లేకుండా తప్పదాగి ఒళ్లు తెలియకుండా వుంటున్నాడు. తన చేతిలోవున్న తుపాకిని

బేఫర్వాగా జారవేసి భుజానికి తగిలించాడు. దాని సన్నీమొన యేక్షణానికాక్షణం డార్నే కణత మీద పొడుచుకోవటానికి సిద్ధమౌతోంది. ఇలాంటి నిఘాలో వుంచినా, ఆదిలో డార్నే మరేమంత భయపడలేదు; ఇదంతా యేదో మామూలుగా జరుగుతున్న తతంగమే గాబోలుననుకున్నాడు.

కాని, బీవాయ్ నగరం చేరేసరికి తాను విషమ పరిస్థితులలో వున్నట్టు తెలుసుకున్నాడు. బీవాయ్‌లో అడుగు బెట్టేసరికి ప్రొద్దు పడమట దిరిగిపోయింది. సాయంత్రసమయం; వీధుల నిండా జనం తండోపతండాలుగా వున్నారు. అంతా అల్లకల్లోలంగా వుంది.

ఈ మూడు గుర్రాలూ ఆ నగరంలో వున్న సైనికకేంద్రం ముందు ఆగగానే 'పరారీదార్లు నశించాలి!' అని అరుచుకుంటూ జనం చుట్టేశారు. డార్నేను గుర్రంమీదనుంచి క్రిందికి పడలాగెయ్యటానికి సిద్ధమయ్యారు. కాని, డార్నే, కాళ్లు అంకాలలో గట్టిగా పంబదన్ని పడిపోకుండా నిభాయించుకున్నాడు.

కళవళపడుతున్న గొంతును కూడదీసుకుని :

'మీరు పొరపాటు పడుతున్నారు – నేను పరారీదారును కాదు – నా అంతట నేను యిక్కడికి వచ్చాను – ఈ విషయం ఆలోచించండి'–

'పరారీకుక్క!' అంటూ గావు కేకబెట్టి, చేతిలో వున్న సుత్తి ఆకాశంలోకి యెత్తి జనంలోనుంచి ముందుకు తోసుకొచ్చాడు, ఒక ప్రబుద్ధుడు : 'బూర్జువా లుచ్ఛావి!'

'సరే ఆగండి! – తొందరపడకండి!' అంటూ ఆ సైనిక కేంద్రానికి సంబంధించిన ఒక అధికారి ఆ మనిషిని అడ్డం తగిలాడు : 'పారిస్‌లో విచారిస్తారుగా' అన్నాడు.

'ప్రజాద్రోహి!' – అంటూ మరో కేక వినిపించింది.

'మీరు పొరబడుతున్నారు – నేను ప్రజాద్రోహిని కాను' అని నసిగాడు డార్నే :

'ద్రోహివా? – మరీనా? – కొత్త శాసనంమాట అబ్బాయికింకా తెలీదు గాబోలు:'

చుట్టూవున్న జనం కళ్ళలో తుపాను రేగటం సైనికాధికారి పసికట్టి, డార్నే కూర్చున్న గుర్రాన్ని కళ్ళాలు బుచ్చుకుని జరజరా ప్రక్కనున్న గుర్రాల దొడ్లోకి యీడ్చుకుపోయాడు. డార్నేతో వచ్చిన వచ్చిన సైనికులిద్దరూ కూడా గుర్రాల్ని లోపలికి పోనిచ్చారు. మూడు గుర్రాలుగా లోపలికి రాగానే, జనం లోపలికి తోసుకురాకుండా ఆ అధికారి గేటు మూసేశాడు.

చేతిలోవున్న సుత్తితో గేటుమీద కచ్చకొద్దీ ఒక దెబ్బ వేసి, ఆవ్యక్తి తక్కిన జనాన్నంతా తీసుకొని కేకలు బెట్టుకుంటూ అవతలికి వెళ్ళిపోయాడు.

ప్రాణాలు దక్కి దొడ్లోకి రాగానే, డార్నే గుర్రాన్ని దిగి ఆ అధికారికి కృతజ్ఞతను తెలియజేశాడు : 'ఆ కమ్మరిబత్తుడు చెబుతున్న క్రొత్తశాసనం యేవిటండీ?' అని అడిగాడు.

'పరారిదార్ల ఆస్తులు వేలం వెయ్యటానికి యీమధ్య ఒక శాసనం చేశారులెండి.'

'ఎప్పుడూ!'–

'మొన్న 14వ తారీఖున'–

'అయితే సరిగా నేను యింగ్లండులో బయలుదేరిన నాడే నన్నమాట!'–

'ఇలాంటి శాసనాలు యింకా చాలా చేశారని అంతా అంటున్నారు. ముందుముందు అవసరమైతే యింకా కొన్ని చేస్తారుటకూడా. దేశం విడిచి పారిపోయిన పరారీదార్లందరికీ దేశ బహిష్కరణశిక్ష విధించుతున్నారు. అథవా మళ్లీ యెవరేనా తిరిగొస్తే ఉరిశిక్ష వేస్తారు – అదీ ఆ కమ్మరి చెప్పిన కొత్తశాసనం.'

'అలా జరుగుతున్నాయా?'–

'జరుగుతున్నాయో లేవో – జరుగుతూనే వుండొచ్చు – యివాళ కాకపోతే రేపు జరగొచ్చు; ఏవిటి యిందులో పెద్ద? – సరే! మీరు యీ రాత్రికి యిక్కడ పడుకుని నిద్రపోండి' అని చెప్పి చక్కాబోయాడు.

డార్నే, అతని సహచరులు ఆ గడ్డిమేటాములమీద పక్కలుబరిచారు. బాగా ప్రయాణ బడలికతో వున్నారేమొ, అర్ధరాత్రి వరకూ గుర్రుగొట్టి నిద్రపోయారు. అనంతరం ఆ అర్ధరాత్రివేళే లేచి మళ్లా ప్రయాణం కట్టారు. వాళ్లు బయలుదేరింది లగాయతు కంటి నిండా నిద్రపోయింది ఆ కాసేపే. త్రోవ పొడుగునా డార్నేకు ఒక విపరీతమైన పరిస్థితి కనుపించింది. దేశానికి వచ్చిన అన్ని కొత్త మార్పుల సంగతి అలా వుండగా, జనానికి నిద్రకూడా లేకుండాపోయినట్టు తోచింది. పాపం వీళ్ళు ముగ్గురూ పగలల్లా చచ్చిచెడి ప్రయాణంచేసి సాయంత్రానికల్లా యే గ్రామానికో చేరుకుంటారు. ఆ అర్ధరాత్రి వేళకూడా, ఆ వూరిజనం నిద్రా నిప్పులూ లేకుండా కొరివిదయ్యాల్లా కాగడాలు ముట్టించుకుని మేలుకునే వుంటారు. ఒకళ్ళచేతులొకళ్లు పట్టుకుని యే చెట్టు చుట్టూనో తిరుగుతూ స్వాతంత్ర్యగీతాలు పాడుతూ వుంటారు. అదృష్టవశాత్తూ, ఈ ముగ్గురికీ, బీవాయ్‌లో మాత్రం కాసేపు కునుకు తీసే ఆస్కారం కలిగింది.

ఇలా ప్రయాణంచేసి ఒకనాటి ఉదయానికల్లా పారిస్ నగరం చేరుకున్నారు. పారిస్ నగరద్వారం దగ్గిర కట్టుదిట్టంగా కాపలా కాస్తున్నారు. ఈ ముగ్గురూ గేటుదగ్గిరికి రాగానే అక్కడున్న అధికారి : 'ఖైదీ తాలూకూ కాయితా లెక్కడ?' అని ఒక గర్జన చేశాడు.

"ఖైదీ" అన్నమాట చెవుల బడగానే, డార్నే కంగారు పడ్డాడు : 'నేను ఖైదీని కాదండీ, స్వతంత్రప్రజకు చెందినవాణ్ణే ఫ్రెంచి పౌరుణ్ని : దేశం కల్లోలంగా వున్న కారణంగా, ఎందుకైనా మంచిదని అక్కడి అధికారులు సైనికసహాయం యిచ్చి పంపారు' అన్నాడు.

ఆ ఉద్యోగి ఆ మాట వినిపించుకొనే లేదు : 'ఎక్కడ కాయితాలు!' అని మళ్లా అరిచాడు.

మన త్రాగుబోతు దేశభక్తుడు అకాయితాలను నెత్తిమీద టోపిలోనుంచి బయటికి తీశాడు. గాబెల్లీ ఉత్తరం చదువుకుని, ఆ ఉద్యోగి ఎందుకో ఆశ్చర్యంగా డార్నే ముగ్గుర్నీ చూశాడు.

మరుమాట చెప్పకుండా, వాళ్ల ముగ్గుర్నీ అలా గేటు దగ్గిరే వదిలేసి, ఆ కాయితం తీసుకుని లోపలున్న 'గార్డ్ ఆఫీసు'లోకి వెళ్ళాడు. గేటుయివతల గుర్రంమీద కూర్చుని డార్నే పరిస్థితులన్నీ అర్థం చేసుకుంటున్నాడు. గేటుదగ్గిర కాపలావున్న వాళ్ళల్లో కొంతమంది మామూలు పోలీసులూ, కొంతమంది దేశభక్తులూ కూడా వున్నారు. పోలీసులకంటే దేశభక్తులే యెక్కువ మందున్నారు. గేటులోపలనుంచి బయటికి రావాలన్నా, బయటి నుంచి లోపలికి

వెళ్ళాలన్నా దుర్ఘటమైన కార్యం. నగరంలోకి సరుకులు సరఫరాచేసే సామానుబళ్లు వగైరాలు పరాహత్‌గా వెడుతూ వస్తూవుంటై. వాటిని ఎవ్వరూ అటకాయించరు. మనుషుల్ని మాత్రం పోనీవ్వరు. తమ అవకాశం వచ్చేవరకూ నిరీక్షించుతూ యిటూ అటూ వేలాది ప్రజ పడగాపులు పడుతున్నారు.

ఆ పరిస్థితులన్నీ అర్థం చేసుకుంటూ, డార్నే ఆ గుర్రంమీద అలాగే దాదాపు అరగంటసేపు కూర్చున్నాడు. వెన్నెముక పట్లుకుపోయింది. అనంతరం ఆ వెళ్లిన అధికారి మీసాలు తడుముకుంటూ తాపీగా వచ్చి, గేటు తీయించి లోపలికి రమ్మన్నాడు. ముగ్గురి గుర్రాలూ లోపలికి రానిచ్చి, ఆ నిఘా సైనికులకు ఒక కాయితం యిచ్చాడు - డార్నేను వప్పగింత చేసినట్టు రశీదు. డార్నేను గుర్రం దిగమన్నాడు. అతను గుర్రంమీదినుంచి దిగగానే ఆ దేశభక్తులిద్దరూ, డార్నే స్వారీచేసివచ్చిన గుర్రాన్ని కూడా తీసుకుని తిరిగి వెళ్లిపోయారు.

డార్నే ఆ ఉద్యోగి వెంట 'గార్డ్ ఆఫీసు'లోకి నడిచాడు. ఆ గది యావత్తూ సారా కంపుతోనూ పొగాకు వాసనతోనూ ఊపిరి సలపకుండా వుంది. దాన్లోవున్న దేశభక్తులూ సైనికులూ, కొందరు నిద్రపోతున్నారు; కొందరు మేలుకునుండే కునికిపాటు పడుతున్నారు; కొందరు తప్పతాగి నిద్రా మెలుకువాగాని అయోమయావస్థలో వున్నారు. బల్లమీద కొన్ని రికార్డులు పారేసి వున్నయ్. ఆ బల్లదగ్గిర, ఒక జీబుతుల ఉద్యోగి కూర్చొని చుట్ట కాలుస్తున్నాడు. ఆ ఉద్యోగి డార్నేను లోపలికి తీసుకొచ్చిన రెండో ఉద్యోగి వంకజూచి:

'డిఫార్జ్ గారూ! - ఎవ్రీమూండ్ అనే పరారీదారు యితనేనా?' అన్నాడు, బల్లమీదవున్న పుస్తకంలో యేదో వ్రాసుకుంటూ.

'అవును - ఇతనే'-

'ఎవ్రీమూండ్! - నీ వయసు?'

'ముప్ఫయియేడు'-

'వివాహమైందా?'

'ఆ'

'వివాహం ఎక్కడ జరిగింది!'

'ఇంగ్లండులో'-

'ఇంగ్లండులో వివాహం జరిగిందనటంలో ఎలాంటి సందేహమూ లేదు?'-

'లేదు'-

'భార్య యెక్కడుంది?'

'ఇంగ్లండులో'

'నిస్సందేహంగా'-

'ఎవ్రీమూండ్! - నిన్ను "లాఫోర్స్" జైలుకు పంపించటానికి నిర్ణయించాం'-

'ఏవిటీ?' అన్నాడు, డార్నే తెల్లబోతూ - ఎందుకూ? ఏ శాసనం ప్రకారం?'-

ఆ అధికారి తల ఎత్తకుండానే, వ్రాసుకుంటూ:

'నువ్వు వెళ్లిన తరువాత - యిక్కడ కొత్తశాసనాలు, క్రొత్త నేరాలూ అమల్లోకి వచ్చాయి మహాత్మా' - అన్నాడు, అదో వెటకారంగా చిరునవ్వు నవ్వుతూ -

'నా అంతటికి నేను బుద్ధిపూర్వకంగా యిక్కడికి వచ్చాను; యీ విషయాన్ని అర్థం చేసుకోగలరని ఆశించుతున్నాను. సోదర దేశీయుడు ఒకరు ఆర్తిలోవుండి ఉత్తరం వ్రాస్తే, అతనికోసం వచ్చాను. వెంటనే ఆయన్ను కలుసుకోవాలి. ఆ మాత్రం అవకాశం యివ్వలేరా?'

'పరారీదార్లకు హక్కులూ, అవకాశాలూ యేవిఁటి?-' ఆ ఉద్యోగి తాను వ్రాయవలసిందంతా వ్రాసి, కవరులోబెట్టి, అంటించేశాడు. పైన 'రహస్యం' అని వ్రాశాడు. ఆ కవరు డిఫార్జ్ చేతికి అందించాడు.

35

డిఫార్జ్ కవరు తీసుకుని డార్నేను తనవెంట రమ్మని సంజ్ఞ చేశాడు. డార్నే అతన్ని అనుసరించి బయలుదేరాడు. వాళ్లిద్దరి వెంటా ఇంకో యిద్దరు సాయుధ దేశభక్తులు బయలుదేరారు.

ఆఫీసుమెట్లు దిగుతూ, డిఫార్జ్ డార్నేను మెల్లిగా ప్రశ్నించాడు : 'వెనక యిక్కడ బాస్టిల్లీ జైల్లో ఖైదీగా వుండేవాడే,- డాక్టర్ మానెట్ - ఆయన కూతుర్ని పెళ్ళి చేసుకుంది నువ్వేనా?'

డార్నే అతనివంక ఆశ్చర్యపడి చూస్తూ : 'అవును, నేనే,' అన్నాడు.

'నా పేరు డిఫార్జ్ - సెయింట్ ఆంటోనీ వీధిలోవున్న సారాదుకాణం యజమానిని; బహుశా నువ్వు నా సంగతి వినే వుంటావు.'

'అవును విన్నాను - తన తండ్రికోసం, నా భార్య మీయింటికి వచ్చింది.'

'పనీ పాటా లేక - ఇక్కడి కెందుకొచ్చావ్?'-

'ఎందుకొచ్చానో చెప్పానుగదూ - ఆమాట అబద్ధమనా మీరనుకోటం?'-

'అబద్ధంగాదు సత్యమేననుకో - ఎందుకొచ్చిన సత్యం, దరిద్రపుగొట్టు సత్యం' అన్నాడు- అతని కనుబొమలు రెండూ బాధగా ముడిబడ్డయ్.

'ఇదంతా ఏదో అయోమయంగానే వుంది - పరిస్థితి ఇలా మారిపోయిందని అనుకోలేదు - అంతా కంగారుగా వుంది - మీరు నాకో చిన్ని సహాయం చెయ్యగలరా?'-

'చెయ్యను-' అనేశాడు డిఫార్జ్; కందగడ్డయిపోయిన ముఖం డార్నేకు కనుపించకుండా, ఆకాశంలోకి చూస్తూ;

'పోనీ ఒకమాట అడుగుతాను సమాధానం చెబుతారా?-'

'చెప్పదగినదైతే-'

'ఖైదులో పెట్టబడుతున్నానుగదా - బయటివాళ్ళకెవళ్ళకైనా ఉత్తరం వ్రాసుకోవటానికేనా అవకాశమిస్తారా? అదీ లేదా?'

'చూస్తావుగా-'

'విచారణా గిచారణా లేకుండా నన్నా జైల్లో శాశ్వతంగా భూస్థాపన చెయ్యరుగదా?'-

'చూస్తావుగా - అయినా దానికో పెద్దయిదేవిటి?- లోగడ, అంతకంటే దరిద్రపు గొట్టుజైళ్ళలో యెంతమందిని భూస్థాపన చేశారుగాదు?'-

'కాని, డిఫార్జ్‌గారూ - నేనుమాత్రం అలాంటిపాపం యెప్పుడూ చేసిన వాణ్ని గాదండీ'

డిఫార్జ్ డార్నే ముఖంలోకి ఒక క్రోర చూపు చూసి ముఖం తిప్పేసుకున్నాడు. మరింత ఉధృతంగా నడిచి పోతున్నాడు. అతనితోపాటు గబగబా నడుస్తూ డార్నే వెర్రివాడులా బ్రతిమిలాడుతున్నాడు :

'పోనీ యీ ఒక్కసాయం చెయ్యండి డిఫార్జ్ గారూ!- చాలా ప్రాణావసరం - టెల్‌సన్సు బ్యాంకు గుమాస్తా, లారీగార్ని మీరు ఎరిగేవుంటారు - ఆయన ప్రస్తుతం పారిస్‌లోనే వున్నారు. నన్ను యిలా జైల్లో పెట్టినట్టు కాస్త, ఆయనకు కబురు పంపే యేర్పాటు చేయించి పెట్టండి-'

'మీకు నేను చచ్చినా రవ్వంత సహాయంచేసేది లేదు. మీకు వ్యతిరేకంగా నాదేశం పక్షానా, ప్రజల పక్షానా నిలబడి పోరాడటానికి ప్రతిజ్ఞ పట్టాను. మీకు నేను సహాయ పడటమనేది కల్లోవార్త.'

ఇక, అతన్ని బ్రతిమిలాడి లాభంలేదని, డార్నే నిరాశ చేసుకున్నాడు. అలా ప్రాధేయపడటంకూడా అతని మనస్సుకు కష్టంగానే వుంది. ఇద్దరూ మౌనంగా నడిచి పోతున్నారు. డార్నేతోపాటు అలా అనేకమందిని జైళ్ళకు తీసుకుపోతున్నారు. ఆ రోడ్లమీద వస్తూపోతున్న జనానికి అదేమంత విచిత్రమైన సంఘటనగా లేదు. అతని వంకచూసినవాడే లేడు; అథవా యెవడేనా కాస్త తలెత్తి చూసినా, 'బూర్జువా వెధవలు' అంటూ పళ్ళుకొరికేవాడే తప్ప, 'అయ్యో!' అనుకునేవాడు లేడు.

ఒక సందు మలుపుకు వచ్చేసరికి అక్కడ ఒక సభ జరుగుతోంది. ఆ వేదికమీద నిల్చుని ఒక దేశభక్తుడు ఉపన్యసించుతున్నాడు; రాజూ రాజకుటుంబం ప్రజలపట్ల జరిపిన ఘాతుక కృత్యాలను యేకరువు బెడుతున్నాడు.

ఆ కాసేపటిలోనూ, చెవులబడ్డ మాటలవల్ల, రాజుగారు జైల్లో వున్నట్టూ, విదేశ రాయబారులంతా ఎక్కడి వాళ్లక్కడ తమ తమ దేశాలకు వెళ్ళిపోయినట్టూ డార్నేకు అర్థమైంది. ఈ సంగతి తెలియగానే, తాను యెలాంటి పరిస్థితిలో చిక్కుబడ్డదీ పూర్తిగా అర్థమైపోయింది. తాను యింగ్లండునుంచి బయలుదేరే నాటికి పరిస్థితి యింత విషమించలేదు. లేకపోతే తాను బయలుదేరేవాడే కాదేమో. అయినా యేది యెలా జరుగుతుందో - ముందుగానే ప్రాణభీతి దేనికని ఇంకా కొంచెం ఆశతో వున్నాడు. 'గెలటైన్' అనే రక్కసి ఫ్రాన్స్ నడిగడ్డమీద జననమైన సంగతి పాపం అతనికింకా తెలీదు!

డిఫార్జ్ డార్నేను వెంటబెట్టుకుని "లాఫోర్స్" ఖైదుదగ్గరికి తీసుకువచ్చాడు. అక్కడున్న గాంద్రుపిల్లి మొహం అధికారి, "ఇంకా యీ జైలునిండా యెంతమందిని కుక్కమంటారు" అంటూ విసుక్కున్నాడు.

డిఫార్జ్ డార్నేను వప్పగింతచేసి రశీదుతీసుకుని వెళ్ళిపోయాడు, తనతో వచ్చిన మిగతా యిద్దరు దేశభక్తుల్నీ కూడా వెంట బెట్టుకుని.

డిఫార్జ్ వెళ్ళిపోయిన తరువాత కూడా, ఆ జైలు ఉద్యోగి, ప్రక్కన కూర్చున్న భార్యవంక చూసి : 'ఏవింటి నా మొహం!- ఇంకా యెంతమంది యీ తంబ!' - అని చిరాకు పడ్డాడు.

'మనిషికి నెమ్మదనేది వుండాలి - ఏవింటా చిరాకు' అని భర్తను మందలించింది ఆ యిల్లాలు.

ఆ అధికారి బల్లమీదవున్న గంట మోగించగానే, లోపల్నుంచి ముగ్గురు జైలువార్డర్లు చక్కావచ్చారు. వాళ్ళల్లో ఒకడి చేతికి ఒక చిన్ని కాయితం ముక్కను అందిస్తూ డార్నేను వప్పగింత చేశారు. కాయితంవంక చూస్తున్న వార్డరు - 'రహస్యఖైదీ కూడానా' అంటూ విసుక్కున్నాడు : 'సరే! రా!' అన్నాడు, డార్నేవంక చూసి.

ఆ ముగ్గురువార్డర్లూ, ఖైదీని వెంటబెట్టుకుని లోపలికి తీసుకు వెడుతున్నారు. ఆ జైలుయావత్తూ ముంజుకంపు కొడుతూ, నానా కచాటీగానూ వుంది. ఆ చీకటి కొట్లనిండా జనం కిటకిటలాడుతున్నారు. అలా కొంత దూరం లోపలికి పోగా పోగా చీకటి, చీకటిగా వున్న పెద్దహాలుఒకటి కనుపించింది. దాల్లో ఉన్న బల్లచుట్టూ చాలా మంది స్త్రీలు కూర్చున్నారు. వాళ్ళచుట్టూ చాలా మంది మగవాళ్లు నిల్చుని ఏవో కబుర్లాడుతున్నారు.

ఆ హాల్లో వున్న ఒక పెద్ద మనిషి డార్నే కటకటాల దగ్గిరికి రాగానే ఒక చిన్ని ఉపన్యాసం మొదలెట్టాడు.

'ఇక్కడవున్న మిత్రులందరి తరఫునా తమకు స్వాగతం చెబుతున్నాను. ఈ ప్రదేశానికి తమర్ని పడలాక్కువచ్చిన దురదృష్టానికి దురపిల్లుతూ, ఈ "లాఫోర్స్" జైలుకు తమర్ని ఆహ్వానించగలిగే సదవకాశం లభించినందుకు ఆనందించుతున్నాను. త్వరలో మనవాళ్ళందరికీ యీ దురదృష్టం తొలగిపోగలదనీ మంచిరోజులు రాగలవనీ ఆశించుతున్నాను. మరొక తావునైతే, అలాంటి భోగట్టాలు చెయ్యటం, అసభ్య చర్యగా కనుపించ వచ్చునుగాని, ఇది జైలు గనుక తెగించి అడుగుతున్నాను - తమ నామధేయాదికాలు తెలిపించితే కృతజ్ఞుణ్ణి' అన్నాడు.

డార్నే తనపేరూ, వూరూ అంతా తెలియజేశాడు.

'కొంపతవ్వి "రహస్యఖైదీ" గాదు గదా?'-

'ఆమాటకు అర్థమేమిటో తెలియలేదుగాని, అదే అంటున్నారు' అని డార్నే సమాధానం చెప్పాడు.

'అలానా - పాపం - చాలా విచారకరమైన సంగతి - మరేం ఫరవాలేదులే, అధైర్యపడకు, మనవాళ్ళలో చాలామందిని మొదట్లో ఇలాగే రహస్య ఖైదీలుగా వుంచి, అనంతరం మార్చారు' అన్నాడు.

'ఏయ్! అక్కడ నిల్చున్నావేం - త్వరగా రా' అంటూ కేకపెట్టాడు, వార్డరు. అతని హెచ్చరిక విని డార్నే కదిలిబయలు దేరాడు.

డార్నేను వెంటబెట్టుకుని వార్డర్ వలయాలు వలయాలుగా వున్న రాతిమెట్లమీద నుంచి ఒక బురుజుమీదికి ఎక్కించాడు. పైకి యెక్కిన తరువాత, ఒక చిన్ని దరవాజా తెరిచి, నిర్మానుష్యంగా వున్న ఒక కొట్లోకి తీసుకువెళ్లాడు. ఆ గది బాగా తేమగా వున్నా మరీ అంత చీకటిగా లేదు.

'నన్ను ఒంటరిగా ఎందుకు ఖైదుచేస్తున్నారు' - అని ప్రశ్నించాడు డార్నే.

'ఏమో ఆ సంగతి నాకేం తెలుసు' అని సమాధానం చెప్పాడు వార్డరు.

'నేను కాయితం కలం కొనుక్కుని, ఉత్తరాలూ అవీ వ్రాసుకోవచ్చునా.'

'నాకు అలాంటి ఉత్తరువు లేవీ యివ్వలేదు - అధికారులు వస్తారు - అడుగుదువుగానిలే'

వార్డర్ గది నాలుగుమూలలూ పరికించి తలుపుతాళంవేసి వెళ్ళిపోయాడు. డార్నే గదిలో అటునుంచి యిటూ ఇటునుంచి అటు తిరుగుతూ గదిపొడుగూ వెడల్పూ కొలుస్తున్నాడు- నాలుగు అంగలన్నర పొడుగు - నాలుగు అంగల వెడల్పూ - చతురస్రం!

36

సెయింట్ జర్ మెయిన్ ప్రాంతంలో ఒక విశాలమైన పెద్ద భవంతి; పారిస్‌లోవున్న టెల్‌సన్సు బ్యాంకు ప్రధాన కార్యాలయం, ఆ భవంతిలో ఒక మూలగా వుంది. అసలు ఆ భవంతి ఒక దొడ్డప్రభువుది. ఆ మహామహుడు తన స్వంత వంటవాడి దుస్తులు వేసుకొని దేశంనుంచి పరారీ చిత్తగించాడు. ఆయన అధికారం మండబెడుతున్న రోజుల్లో, కాస్త చాక్‌లెట్ పానీయం నోటిదగ్గిరికి అందాలంటే, ఆ వంటవాడు ఒక్కడూ చాలక మరో ముగ్గురి మనుషులు సాయం చేయవలసివచ్చేది. రోజులు మారినై; పరివారవిహీనులై ప్రభువువారు వేటగాళ్ళబారిబడ్డ అడవిమృగంలా ప్రాణభీతితో ఏకాకిగా పరాయిదేశాలకు పలాయనం చిత్తగించవలసివచ్చింది.

ప్రభువుగారు తప్పుకున్నారు; ఆయన తాలూకు సిబ్బందీ ఆఖరి క్షణాలలో, దేశభక్తి పేర ఆయన పీకను ఉత్తరించివేయటానికి సన్నద్ధులై, యిన్నినాళ్లుగా ఆయనదగ్గిర పెద్దపెద్ద జీతాలు పుచ్చుకున్న మహాపాపం నుంచి విముక్తులై బయటపడ్డారు. పవిత్ర ప్రజలో చేరిపోయారు. అనంతరం ప్రజా ప్రభుత్వం ఆ భవనాన్ని స్వాధీనం చేసుకుని, దఖలు పరుచుకుంది. దేశభక్తి దళాల అధికారులు ఆ భవనంమీద స్వాతంత్ర్యచిహ్నమైన త్రివర్ణ పతాకాన్ని ప్రతిష్ఠించి దాన్లో మకాం బెట్టారు. ఆ భవంతిచుట్టూ ఒక ఎత్తైన ప్రహారీగోడ, మధ్యలో, బందోబస్తయిన పెద్ద యినపగేటు వున్నయ్.

ఆ భవంతిచుట్టూ భోగలాలసత్వానికి అనువైన సొగసైన శృంగారవనం వుంది. మధ్యమధ్య ప్రణయాధిదేవత పాలరాతి శిలాప్రతిమలు కూడా నెలకొల్పివున్నయ్. టెల్ సన్సు బ్యాంకులాంటి వ్యాపారసంస్థ, అలాంటి విలాసమందిరంలో వున్నదంటే, ఏ ఇంగ్లండులోనో అయితే అల్లరిపడి పత్రికల్లోకి ఎక్కేది. పారిస్‌లో గనక సరిపోయింది.

ప్రస్తుతం టెల్ సన్సు బ్యాంకులోవున్న తమ ఆస్తిపాస్తులను తిరిగి తీసుకునేవారెవరో తీసుకోనివారెవరో ఎవ్వరూ చెప్పలేరు. బ్యాంకులో దాచుకున్న నగలూ, నాణాలూ, బ్యాంకులో వుండగానే వాటి కామందులు, ఏ చీకటి ఖైదులోనో మగ్గి మశానమైపోవచ్చు- చివరికి వాటిని తిరిగి యిమ్మని అడిగేదిక్కే వుండకపోవచ్చు. అలాంటి ఖాతాలను ఎన్నింటిని ముగింపు అంటూ లేకుండా, అనంతకాలం వరకూ బ్రాటోవరు ఖాతాలక్రింద వ్రాస్తూవుండాలో ఏ ఉద్యోగికీ అర్థంకావటంలేదు - చివరికి జర్విస్ లారీగారికి కూడా అర్థంకావటంలేదు. ఆ బాపతు ఖాతాలుకొన్ని ముందేసుకుని లారీగారు ఇటూ అటు పేజీలు తిరగేస్తున్నారు. అయోమయంగావున్న ఆయన ముఖంమీద బల్ల మీదవున్న దీపపుకాంతి పడి మరింత బీభత్సంగా వుంది.

ఏళ్లు గడచినకొద్దీ చెట్టు బాగా వేళ్లు పాతుకుంటుంది. లారీగారంటే, టెల్ సన్సు సంస్థలో అలా బాగా వేళ్ళు నాటుకుపోయిన మహావృక్షం. అందుచేత బయట యెన్ని ప్రభంజనాలు రేగుతున్నా, ఆయన నిబ్బరంగా కూర్చుని, తమాయించుకో గలుగుతున్నాడు. బ్యాంకు అద్దెకు తీసుకున్న భాగంలోనే, ఆయన ఒకటి రెండు గదులు ఆక్రమించి మకాం బెట్టాడు.

బ్యాంకు సింహద్వారానికి యెదురుగా, ముందున్న ఆవరణలో రెండు పెద్ద లాంతరు స్తంభాలున్నయ్. వాటి రెంటికీ మధ్య ఒక బ్రహ్మాండమైన సానరాయి అమర్చివుంది. ఆరాయి, నాటు కొయ్యలతో ఆదరాబాదరా తయారుచేసిన చట్రంలో అమర్చివుంది. దేశభక్తులు, ప్రక్కనున్న యే కమ్మరి కొలిమిలోనుంచో దొర్లించికొచ్చి, ఆ సానరాయిని అక్కడ నెలకొల్పారు. ఆ ఖాతా పుస్తకాల బాదరబందీతో బుర్రవేడెక్కిపోయి, లారీగారు, కాస్త ఊపిరి విడుచుకోవాలనే ఉద్దేశంతో బల్లదగ్గరనుంచి లేచొచ్చారు. ఇలా కిటికీ తెరిచి కాస్త తొంగి చూడంగానే, ఆ సానరాయీ ఆ చట్రం ఆయన కంటబడ్డది. ఆ జడపదార్థాన్ని చూస్తే, ఆయన యెందుకో గజగజావణికి, కిటికీ రెక్కలు మూసేశాడు. మళ్ళావచ్చి తన కుర్చీలో చతికిల బడ్డాడు.

ప్రహారీగోడకు అవతల వున్న రోడ్లమీదినుంచీ, వీధుల్లో నుంచి, రోజూ రాత్రిళ్ళు మామూలుగా వినిపించే మోస్తరుగానే యేదో రొదవినిపిస్తోంది. ఉండుండి, మధ్య మధ్య, గందరగోళంగా యేదో కల్లోలం వినిపిస్తూ వుంటుంది. అలాంటి కల్లోలం వినిపించినప్పుడల్లా లారీ భగవన్నామస్మరణ చేస్తున్నాడు.

'స్వామీ! తండ్రీ! - ఈబీభత్సంలో, ఈరాత్రి, నాకు ఆప్తుడైన ప్రాణి యెవ్వడూ ఈ నగరంలో లేకుండా రక్షించు! నీకు వేవేల నమస్కారాలు చేస్తాను. ప్రమాదంలో చిక్కుబడి వున్న వాళ్ళందరి మీదా నీ మహాదయను వర్షించు'-

ఇలా దణ్ణాలూ దస్కాలూ పెడుతూవుండగానే, వీధిగేటు దగ్గిర గంట మోగింది. 'వాళ్ళు మళ్ళా వచ్చారు' అని పిల్లి కూనలా దిగులుగా వింటూ కూర్చున్నాడు. కాని ఆయన అనుకున్నంత అలజడియేమీ కనుపించలేదు. బెల బెలా గల్లంతుగా జనం లోపలికి తోసుకొచ్చిన సవ్వడియేమీలేదు. గేటుదగ్గిరవాళ్లు బందోబస్తుగానే కాపలాకాస్తున్నారు. కాస్త అలా బయటికి వెళ్లి కాపలావాళ్ళతో పిచ్చాపాటీ యేదన్నా రెండుముక్కలు మాట్లాడివద్దామని బయలు దేరాడు. ఇలా తలుపు తెరిచి, గడపలో నిల్చునున్న యిద్దర్నీ చూసి విభ్రాంతుడయ్యాడు.

లూసీ, లూసీ తండ్రీ!

'ఆఁ! - ఏవిటి మీరా? - ఇక్కడికా? - ఎందుకూ? - ఏవైందీ?' మాటమీద మాట కంగారుగా అడిగాడు :

'బాబాయ్! ఆయన!...' లూసీ వలవలా యేడుస్తూ లారీ భుజంమీద వాలిపోయింది.

'ఏవిటి లూసీ - మీ ఆయన - చార్లెస్ సంగతేవిటి?'

'ఇక్కడికి...'

'ఇక్కడికా - ఎప్పుడొొచ్చాడు?'

'నాలుగైదురోజులైంది - జైల్లో పెట్టారుట'-

'ఆఁ! - ఏవిటీ? - ఎంతపని జరిగింది!' అంటూ లారీ గుండె బాదుకున్నాడు.

ఇంతలో గేటుదగ్గిర మళ్ళా గణగణా గంట వినిపించింది. గల్లంతుగా మాట్లాడుతో ఎవరో బెలబెలా లోపలికి వస్తున్నారు.

'ఏవిటాగోల? - అంటూ డాక్టర్‌మానెట్ కిటికీవేపు నడిచాడు.

'ఆగండాగండి! - అటు చూడకండి - కిటికీ తెరవకండి - కొంప మునుగుతుంది- అంటూ, లారీ ఆయనకు అడ్డం వచ్చాడు.

డాక్టర్ చిరునవ్వు నవ్వుతూ, వెనక్కితిరిగి లారీవంక చూశాడు:

'లారీగారూ! - మరేం భయపడకండి - నేనంటే ఈ పట్నానికి ఒక మోజుంది - నేను కొంతకాలం ఇక్కడ బాస్టిల్లీలో ఖైదీగావున్నాను - నేను బాస్టిల్లీ ఖైదీనని చెబితే నావంటి మీద అలా చెయ్యివేయరు సరేగదా - నన్ను ఆలింగనం చేసుకుని ఆప్యాయపడని దేశభక్తుడుండడు ఈ పారిస్‌లో - పారిస్‌లో యేవిఁటీ? - ఫ్రాన్సులో; నా విషాదచరిత్రను చెప్పుకునే పారిస్ నగరంలో ప్రవేశించటానికి అనుమతి సంపాదించింది. చార్లెస్ భోగట్టా సంపాదించగలిగింది కూడా అలానే - అలా జరుగుతుందని కూడా నాకు తెలుసు; ఆ సంగతి లూసీకి చెప్పాను కూడా - అసలు ఇంతకీ ఆ గల్లంతేవిఁటి?' అంటూ మళ్ళా కిటికీ రెక్కమీద చెయ్యివేశాడు.

'ఆఁ! ఆఁ! - ఆగండాగండి! - ఆ పనిమాత్రం చెయ్యొద్దు!' అంటూ లారీ మళ్ళా అడ్డం వచ్చాడు. 'లూసీ! అలా బెంబేలు పడకమ్మా! నిజానికి చార్లెస్ ప్రమాదంలో చిక్కడ్డసంగతి నాకు రవ్వంతేనా తెలీదు - అసలు ఇక్కడికొచ్చాడన్న మాటకూడా విన్లే - ఇంతకీ యే జైల్లో పెట్టారట'?-

'లాఫోర్స్'-

'లాఫోర్స్! - అహాఁ! - సరే! - ఇదుగో తల్లీ - నా మాట కొంచెం విను - నువ్వు తెలివిగల తల్లివి, చెప్పినమాట వినే తల్లివి, ధైర్యంగల తల్లివి. నువ్విగా బెంబేలుపడి కాళ్లు తొక్కుకుని చేయగలిగిందేవీఁ లేదు - మనసు స్థిమితపరుచుకో! - అదీ నువ్వు చెయ్యాల్సిన పని - పోయి నువ్వు నా గదిలో పడుకుని హాయిగా నిద్రపోవాలి - నన్నూ మీ నాన్ననీ యిక్కడ కూర్చుని కాస్త యేకాంతంగా మాట్లాడుకోనివ్వాలి - అదీ నువ్వు చెయ్యాల్సిన పని'

'మీరు ఏవిఁ చెయ్యమంటే అలా చేస్తాను - నేను చెయ్యగలిగిందేమీ లేదని నాకుతెలుస్తూనే వుంది'

లూసీని గబగబా తన పడకగదిలోకి లాక్కుపోయాడు. గదిలోపల వదిలిపెట్టి తలుపుమూసేసి, మళ్ళీ ఆదుర్దాగా డాక్టర్ మానెట్ దగ్గిరికి పరుగెత్తుకొచ్చాడు. డాక్టర్ భుజంమీద చెయ్యివేసి, రెండోచేత్తోకిటికీ తనే తెరిచాడు. ఇద్దరూ కలిసి కిటికీలో నుంచి బయటికి తొంగిచూచారు.

ఆ లోపలికొచ్చిన జనం, ఆవరణ యావత్తూ నిండిపోలేదు గాని, ఆడా, మగా అంతాకలిసి ఓ నలభైమందిదాకా వున్నారు. వాళ్ళు నలభైమందీ సరాసరి ఆ కత్తుల సానచుట్టూ జేరి తమపని తాము చూచుకుంటున్నారు.

సానరాతికి రెండువేపులా రెండు కొయ్యపిడులు అమర్చివున్నయ్ ఆ కొయ్యపిడులను చెరోవేపునా చెరోమనిషి పట్టి, మహావేశంతో గిరగిరా తిప్పేస్తూన్నారు. ఆ జీబు తలలూ వాళ్లూ, సాక్షాత్తూ యమభటుల్లా వున్నారు; ప్రక్కనున్న స్త్రీలువాళ్లకి అలసటరాకుండా, మధ్య మధ్య సారాగిన్నెలు నోటికి అందిస్తున్నారు. మిగతా జనం, ఆ తిరుగుతున్న సానరాతిమీద, ఒకరి తరువాత ఒకరు వచ్చి, కత్తులూ, యీటెలూ, బల్లాలూ, బరిసెలూ నానా రకాల ఆయుధాలూ పదును బెడుతున్నారు. సానరాతిలోనుంచి నిప్పురవ్వలు తూటాలోనుంచి లేచినట్లు లేచి చుట్టూవున్న వాళ్ళమీద అగ్నివర్షపు జల్లుల్లా కురుస్తున్నాయి. ఎవరి ఆయుధానికి వాళ్లు పదును బెట్టుకొని బయటికి వీధిలోకి వెళ్లిపోతున్నారు.

దీని అర్థమేమిటని ప్రశ్నిస్తూన్నట్టు డాక్టర్ లారీగారి ముఖంలోకి చూచాడు.

'వాళ్ళూ, ఖైదీలను నరికేస్తున్నారు' అన్నాడు లారీ, వినీ వినిపించని మంద్రస్థాయిలో.

'మీకు ఏదో పలుకుబడి వున్నదన్నారే - నిజంగా అలాంటి పలుకుబడి వున్నదని మీకు నమ్మకముంటే - పోయి మిమ్మల్ని తీసుకుపోగలరు. ఇప్పటికే ఆలస్యమైపోయిందేమో ననుకుంటాను - అయినా యేమో - ఇకమాత్రం ఒక్కక్షణం కూడా జాగు చెయ్యొద్దు వెళ్ళండి'-

ఆమాట చెవులబడగానే డాక్టర్ మానెట్, ఉన్నవాడు ఉన్నపళంగా, ఆదరాబాదరా బయటికి వెళ్లిపోయాడు.

డాక్టర్ వాళ్లంతా తనవాళ్ళే అయినట్టు సరాసరి, అమిత నిబ్బరంగా ఆ జనం మధ్యలోకి వెళ్ళిపోయాడు. తెల్లబడి పీచులు రేగి గాలిలో కదులుతున్న ఆయన జుట్టూ, అదో విచిత్రంగా కనుపించుతున్న ఆయన ముఖం, ఆయన చొరవా - క్షణంలో వాళ్ళలో యేకమైపోయాడు. ఒక రెండుమూడు నిమిషాలపాటు వాళ్ళతో యేదో మాట్లాడాడు. దాంతో వాళ్ళల్లో ఒక పెద్ద ఆనందకోలాహలం బయలుదేరింది. ఆయనను అమాంతం భుజాల మీదికి ఎత్తుకున్నారు :

'బాస్టిల్లీ ఖైదీకి జయ్! - డాక్టర్ మానెట్ జిందాబాద్! - లాఫోర్స్ జైలుకు పదండి!- డాక్టర్ బంధువును రక్షించండి! - డాక్టర్ మానెట్ జిందాబాద్!' అని కేకలు బెట్టుకుంటూ బయటికి వెళ్లిపోయారు.

లారీ, గబగబా కిటికీ మూసేసి, హడావుడిగా లూసీ వున్న గదిలోకి వచ్చేశాడు; గదిలోకి వచ్చీరావటమే లూసీతో జరిగిన వృత్తాంతమంతా చెప్పాడు. పసిపిల్లను ఒళ్ళో బెట్టుకుని మిస్ ప్రాస్ లూసీ దగ్గిరే కూర్చునుంది. ఈ మాటలు వినగానే, లూసీ ఏదో మూర్ఛవచ్చిన మనిషిలా అతని పాదాలదగ్గిర పడిపోయింది. ఆ మైకంలో మధ్యమధ్య యేదో బాధగా మూలుగుతోంది. మిస్ ప్రాస్ కూడా చేతిలోవున్న బిడ్డను పక్కమీద పడుకోబెట్టి తనుకూడా వాలిపోయింది. ఆ రాత్రి తెల్లవార్లూ అలాగే గడిచిపోయింది. పక్షుల కలకలారావం విని లారీ కిటికీ దగ్గిరికి వెళ్లి తులపు తెరిచి చూచాడు. రక్తపంకిలమైన సానరాయిలా, యెర్రగా, సూర్యబింబం తూర్పుదిశను పొటమరించుతోంది.

ఆ చీటీలో వున్నవి ఆ నాలుగు ముక్కలే; ఆ నాలుగు ముక్కలే లూసీకి ఎంతో ఆనందాన్ని యిచ్చాయి. డిఫార్జ్ చెయ్యి వదలి, కృతజ్ఞతాపూర్వకంగా మాడమ్ డిఫార్జ్ చేతిని అలుముకుని హృదయానికి హత్తుకుంది. కాని మాడమ్ డిఫార్జ్ చేతిలో ఎక్కడా మానవచైతన్యం స్పందించటం లేదు; చల్లటి ఉక్కు పిడికిలి.

ఆ స్పర్శతో లూసీ కంగారై మాడమ్ డిఫార్జ్ ముఖంలోకి బెదురుగా చూసింది. మాడమ్ డిఫార్జ్ కూడా లూసీ కళ్ళలోకి తీవ్రంగా చూస్తోంది. లూసీ కంగారు చూసి, లారీ, నెమ్మదిగా అందుకుని, భయం పోగొట్టటానికి ప్రయత్నించాడు:

'ఏమీ లేదు తల్లీ! వీధిలో అస్తమానం యేవో గందరగోళాలు చెలరేగుతూ వున్నయ్ గాదూ! - వాటివల్ల నీకేదో ప్రమాదం వస్తుందని కాదనుకో - అథవా అలాటివి ఏదైనా తటస్థించితే నీబోటివాళ్ళకు మాడమ్ డిఫార్జ్ రక్షణనిస్తూ వుంటుంది; అందుకోసం, నీ మొహం, పోలికా బాగా గుర్తుండటానికి, ఆవిడ నిన్ను చూట్టానికి వచ్చారు - అవునా డిఫార్జ్ గారూ?' అంటూ డిఫార్జ్ మొహంలోకి చూశాడు.

డిఫార్జ్ సమాధానం యేవీఁ చెప్పలేదు - ఏవిఁ చెప్పాలి అన్నట్టు ఒక పొడిదగ్గు దగ్గి భార్య ముఖంలోకి అదో వెఱ్ఱిచూపు చూశాడు.

ఆ సంఘటనను మార్దవ వాతావరణంలోకి తిప్పటానికి లారీ నానా తంటాలూ పడుతున్నాడు. 'అమ్మాయ్! లూసీ, పాపాయేదీ? - మనవాళ్ళకి చూపించ వేం? - ప్రాస్ ఎక్కడ - ఆహాఁ! - డిఫార్జ్ గారూ - మా ప్రాస్ చూశారూ! చాలా మంచిమనిషి లేండి! - ఆవిడకి ఫ్రెంచిభాష రాదు, అని నీళ్లు నమిలాడు.

ఆ సంభాషణ జరుగుతున్నంతసేపూ, మిస్ ప్రాస్, ఈ విదేశీయులు తనకు లెక్కేవిఁటన్నట్టు అసలు వాళ్ళ అజే లేకుండా అమిత ధీమాగా కూర్చుంది. తన ప్రసక్తి వచ్చేసరికి గబగబా లేచి దగ్గిరికి వచ్చింది. చేతులు కట్టుకుని ఆంగ్లేయపడుచు దర్జాలో అతి ఠీవిగా నిల్చుని ప్రతీకారిణి వంకచూసి, మెచ్చుకోలుగా : 'బాగున్నావ్! - మంచి ధైర్యంగల మొహం.' అన్నది. అలాగ మాడమ్ డిఫార్జ్ వంక జూసి కూడా, మెచ్చుకోలుగా ఒక చిన్ని యింగ్లీషు దగ్గు దగ్గింది? కాని వాళ్లెవళ్లూ ఆ పటాటోపాన్ని ఖాతరీ చెయ్యలేదు.

లతలు కుడుతున్న సూది, బిడ్డవైపు సూచిస్తూ మాడమ్ డిఫార్జ్ : 'ఆయన కూతురు ఆ బిడ్డేనా?' అన్నది.

'అవును తల్లీ - మన ఖైదీ తాలూకు ఏకైక సంతానం' అన్నాడు లారీ.

అంతవరదాకా, మాడమ్ డిఫార్జ్ ముఖాన్ని ఆవరించి వున్న కఠోరాంధ తమసచ్ఛాయలు బీభత్సంగా ఆ బిడ్డమీదికి దూకినట్లనిపించింది. లూసీ గుండె లెందుకో దబదబా కొట్టుకున్నయ్. గబగబా బిడ్డ దగ్గిరికిపోయి చేతుల్లోకి తీసుకుని హృదయానికి హత్తుకుంది.

మాడమ్ డిఫార్జ్ భర్త వంకతిరిగి - 'సరే - చూశాను - ఇక మనం వెళ్ళొచ్చు' అన్నది.

మాడమ్ ఢిఫార్జ్ మొహంమీద ఆ కఠోర మౌనంలో లూసీకి యేదో ప్రళయచ్ఛాయ గోచరించి గుండెలు దడదడ లాడిపోయినై. దిగులుగా, వేడి కోలుగా, మాడమ్ డిఫార్జ్ గౌను మునివ్రేళ్ళతో పట్టుకుని.

'నా పెనిమిటి అమాయకుడు - రక్షించండి - ఆయినకేమీ అపకారం చెయ్యకండి- ఆయన్ను ఒక్కసారి కంట జూచుకునే అవకాశం యిప్పించండి' అని అంగలార్చింది.

'నీ మొగుడు సంగతి నాకు అనవసరం - డాక్టర్ మానెట్ కుమార్తె క్షేమం నాకు కావాలసింది.' అన్నది మాడమ్ డిఫార్జ్.

'అలాగైతే - కనీసం నాకోసం నా భర్తమీద దయచూపండి - నాబిడ్డను చూచైనా ఆయన్ను కాపాడండి - ఈ బిడ్డ ఈ చిట్టిచేతులతో తన తండ్రికోసం మిమ్మల్ని వేడుకుంటోంది రక్షించండి - వీళ్ళందరి కంటే మీవంకచూస్తే మాకెందుకో ఎక్కువ భయంగావుంది.'

ఆ చివరి వాక్యాన్ని మాడమ్ డిఫార్జ్ అభినందన వాక్యం క్రిందే తీసుకుంది. చూశావా నా తడాఖా అన్నట్టు తన మొగుడి మొహంలోకి ఒక కోరచూపు చూసింది. అంతవరకూ అయోమయావస్థలో గోళ్లు కొరుక్కుంటూ నిల్చున్న డిఫార్జ్‌కి గతుకు తిన్నట్టయి స్పృహలో కొచ్చాడు.

ఒక చిన్నివిషపు నవ్వునవ్వుతూ మాడమ్ డిఫార్జ్ మళ్లా లూసీవంక తిరిగి : 'ఆ చీటీలో నీ మొగుడు రాసిందేవిటీ? - పలుకుబడి అంటాడేవిటి?'-

లూసీ, ఆ ప్రశ్నతో అలజడి పడిపోయింది - ఆదరా బాదరా హృదయందగ్గిర దాచుకున్న ఆ ఉత్తరాన్ని బయటికి తీసి : 'ఎబ్బే! ఏవీ లేదండీ? - మా నాన్న సంగతి వ్రాశారు - మా నాన్నకు పలుకుబడి వున్నదని'-

'ఆ పలుకుబడి తన్ను రక్షిస్తుందన్న మాట! - సరే చూద్దాం,' అన్నది డిఫార్జ్.

లూసీ కళవళపడ్డది : 'పసిబిడ్డ తల్లిని - బ్రతిమాలుకుటున్నాను - నా భర్తను కాపాడండి - ఆయనమీద కోపం బెట్టుకోకండి - మీరు నా తోడబుట్టువులాంటివారు - నామొహం చూసి కనికరించండి - బిడ్డతల్లిని అంగలార్చి అడుగుతున్నాను'-

మాడమ్ డిఫార్జ్ లూసీకి సమాధానం చెప్పకుండా ప్రతీకారిణి వైపు తిరిగి మొదలెట్టింది:

'మనం ఈ లోకంలో కన్ను తెరిచినప్పటినుంచీ, ఎంత మంది యిల్లాళ్లనూ, బిడ్డల తల్లుల్నీ చూళ్ళేదు? వాళ్ళందర్నీ కనికరించిందెవడు? వాళ్ళ భర్తల్నీ తండ్రుల్నీ దూరం చెయ్యటం కొత్తగనకనా? తోటి ఆడవాళ్లు బాధలు పడటం యింతప్పటినుంచీ యెంతో మందిని చూశాం - తమకూ బిడ్డలకూ కూడులేక ఏడ్చేవాళ్లు, గుడ్డలేక ఏడ్చేవాళ్లు, రోగాలతో తీసుకు చచ్చేవాళ్లు, దౌర్జన్యం క్రింద, దిక్కులేకుండా నలిబిలైపోతూ వుండేవాళ్లు- ఎంతమందిని చూళ్ళేదు.'

'అవును అంతకుమించి మన జీవితంలో అనుభవించిన సౌజన్యత ఎక్కడ' అంటూ వంత పలికింది, ప్రతీకారిణి.

మళ్ళా అందుకుంది మాడమ్ డిఫార్జ్ : 'ఇల్లాంటి వన్నీ ఎన్నో వోర్చాం - ఇప్పుడు ఒక యిల్లాలు కంట తడిబెడుతుందంటే - ఒక తల్లి అంగలారుస్తుందంటే మాకు కనికరమేవిఁటి?'

ఆ రెండు ముక్కలూ అనేసి మళ్లా లత కుట్టుకుంటూ బయటికి వెళ్లిపోయింది.

ఆవిడ ప్రతీకారిణీ, డిఫార్జ్ కూడా బయటికి నడిచారు.

కుప్పగా కూలిపోయిన లూసీని లారీ లేవదీస్తున్నాడు : ‘ధైర్యంగా వుండాలి తల్లీ!- మన విషయంలో ఇంతవరకు అంతా సవ్యంగా వుంది; మనకంటే ఘోరయాతనలు అనుభవించిన వారు ఇంకా ఎంతోమంది వున్నారు. ఇక్కడికి సంతోషించాల్సిన సంగతి’-

‘ఆవిడ ముఖంవంక చూస్తే నా కెందుకో భయంగా వుంది - నా ఆశలన్నీ కూలిపోయేలా వున్నయ్’-

‘చట్! ధైర్యంగల తల్లివి! - నీ గుండెల్లో ఈ పిరికితనం యేవిఁటి?’ అంటూ లూసీకి ధైర్యం చెబుతున్నాడే గాని, అసలు గుండె దిగజారిపోయింది ఆయనకే.

38

నాలుగో రోజు ఉదయంవరకూ, డాక్టర్ మానెట్ యింటికి తిరిగి రాలేదు. ఈ నాలుగు రోజుల్లోనూ పారిస్‌లో యెంత గందరగోళమో జరిగిపోయింది. మగా, ఆడా, మొత్తం పదకొండు వందలమంది ఖైదీలను జనం పడి హత్య చేశారు. ఆ కిరాతచర్య నాలుగు రాత్రులూ నాలుగు పగళ్ళూ నిర్విరామంగా సాగిపోయింది. కాని యీ సంగతులు లూసీకి రవ్వంతైనా తెలియకుండా లారీ, డాక్టరూ కలిసి మభ్యపెట్టారు. ఏదో గల్లంతు సాగిందనీ, జనం కొంతమంది రాజకీయ ఖైదీలను చంపారనీ చెప్పారే గాని, యింత ఘోరం జరిగిపోయిందని లూసీకి తెలీదు.

జరిగిన సంగతంతా డాక్టర్ లారీ గారి చెవిలో రహస్యంగా చెప్పాడు. మానవ పశువులను కబేళాపశువులను నరికినట్లు తలలు తెగగొడుతున్న రంగంమధ్య నుంచి డాక్టర్ మానెట్‌ను దేశ భక్తులు లాఫోర్స్ జైలుకు తీసుకువెళ్లారు. లాఫోర్సు జైల్లో తనంత తానుగా స్వంత బాధ్యతమీద యేర్పాటైన విచారణసంఘం ఒకటి వుంది.

ఆ కోర్టు నిమిషాలమీద ఖైదీలను విచారించి తీర్పులు చెప్పేస్తూవుంది. కొందరిని హత్య చేయబడవలసినవారుగా శిక్ష విధించి జనానికి ఒప్పగింత పెట్టేస్తుంది. కొద్దిమంది నెవర్నో విడుదల చేస్తుంది; తక్కినవాళ్ళని మళ్ళీ జైలు కొట్లల్లోకి తిప్పి పంపుతూ వుంటుంది. డాక్టర్ మానెట్‌ను వెంటబెట్టుకుని తీసుకువెళ్లిన దేశభక్తులు ఆయన్ను ఈ విచారణసంఘం వారికి పరిచయం చేశారు. డాక్టరుగారు తన పేరూ, ఊరూ, గతంలో తాను అనుభవించిన కష్టాలూ విచారణసంఘానికి స్వయంగా నివేదించుకున్నాడు. విచారణా బండలూ ఏమీ లేకుండా తనకు 18 సంవత్సరాలపాటు బాస్టిల్లీ ఖైదులో పారేసి హతమార్చారనీ మాజీ పరిపాలకుల చేతుల్లో అష్టకష్టాలూ పడ్డాననీ చెప్పుకున్నాడు. ఆ విచారణ సంఘంలో కూర్చున్న ఒక పెద్దమనిషి లేచి, తాను డాక్టర్ గారిని యెరుగుదుననీ, ఆయన చెప్పిందంతా నిజమేననీ రూఢిపరిచాడు. ఆ పెద్ద మనిషి డిఫార్జ్.

తరువాత డాక్టరుగారు మళ్ళీ మొరబెట్టుకున్నాడు తన అల్లుడు ఖైదీగా వున్నాడనీ తనమీద కనికరించి అతన్ని విడుదల చేయించమనీ; ఆ విచారణ సంఘంలోవున్న కొంతమంది సభ్యులు నిద్రపోతున్నారు; కొంతమంది మేలుకున్నారు; కొంతమంది మురికిగా వున్నారు; మరి కొంతమంది కులాసాగా వున్నారు.

కూలదోయబడిన మాజీ ప్రభుత్వం వల్ల బాధలుపడ్డ మహా దేశభక్తుడుగా డాక్టర్ గారిని అభినందించే వీరావేశపు మొదటి ఊపులో డార్నేను వెంటనే హాజరుపెట్టవలసిందిగా వార్డర్లకు హుటాహుటిని ఉత్తరవులు జారీచేయబడినై. అతన్ని వెంటనే విడుదల చేసేస్తారనిపించింది. కాని మరుక్షణంలోనే, ఆ ఆవేశ ప్రవాహం యెందుకో పెడదిరిగిపోయింది. సంఘసభ్యులలో ఏదో చిన్ని గుసగుస; ఆ సంగతేవిటో డాక్టరుకు అర్థంకాలేదు. ఖైదీ యింకా కొంతకాలం జైల్లోనే వుండాలనీ, అయితే అతనికి ప్రాణభయం లేకుండా, జాగ్రత్తగా చూస్తారనీ విచారణసంఘం అధ్యక్షులు డాక్టర్ గారికి తెలియజేశాడు. ఈమాట డాక్టర్ గారికి చెబుతూనే చేసన్న చేయటంతో, వార్డర్లు వెంటబెట్టుకొచ్చిన ఖైదీని మళ్ళా వెనక్కు తీసుకువెళ్ళిపోయారు. డాక్టర్ మళ్ళీ గోలబెట్టాడు. ఏ కారణంచేతగాని తన అల్లుణ్ణి బయట జరుగుతున్న హననకాండకు ఒప్పగింత చేయవద్దనీ, ఆ గందరగోళం ముగిసిపోయేవరకూ తాను కూడా అక్కడే ఉండిపోవటానికి అనుమతి యిప్పించమనీ. కోర్టువారు కరుణించి అలాంటి అనుమతి దయచెయ్యటంతో ఆ గందరగోళం ఉపశమించే వరకూ, ఆ నరపశువుల కబేళాలోనే ఉండిపోయారు.

ఆ కథ యావత్తూ లూసీకి చెప్పవద్దని డాక్టర్ లారీగారి దగ్గిర హామీ తీసుకున్నాడు. విడుదలైన దేశభక్తులయెడ చూపే ఆనందకోలాహలంకంటే చిత్రవధ చేయబడుతున్న ఖైదీలపట్ల జనం చూపుతున్న వీరావేశం చూసి డాక్టర్ చకితుడైనాడు. ఆయన లారీతో యింకా చాలా సంగతులు చెప్పాడు. ఒక ఖైదీని కోర్టువారు విచారించి నిర్దోషిగా తేల్చి విడుదల చేశారు. ఆ వ్యక్తి జైలుగేటు దాటి వీధిలోకి అడుగు బెట్టాడో లేదో, వీధిలో వీర విహారం చేస్తున్న కిరాతుడు, పొరపాటున అతనిమీద బల్లెం విసిరేశాడు. అతని గాయానికి కట్టుగట్టి చికిత్స చెయ్యటానికి డాక్టర్ మానెట్‌ను రమ్మన్నారు. డాక్టర్‌గారు వీధిగుమ్మంలోకి వెళ్లి చూసేసరికి, అక్కడున్న కరుణామయులు, తాము నరికి గుట్టబోసిన మానవ కళేబరాల గుట్టమీద ఈ క్షతగాత్రుణ్ణి ఒళ్లో బెట్టుకుని విచారంగా కూర్చున్నారు. బీభత్సకరమైన ఆ ఆభాసాప్రవర్తన యేవిఁటో డాక్టరుకు పాలుబోలేదు. డాక్టరు కట్టుగట్టటం పూర్తిగావటంతోటే, అతన్ని పల్లకి గట్టుకుని యింటికాడ దిగబెట్టి వచ్చారు; తిరిగి వచ్చీరావటమే మళ్ళీ కత్తులూ కటార్లూ బుచ్చుకుని యధాప్రకారం మానవ హననకాండకు తిరిగి యెగబడ్డారు. ఆ దృశ్యాన్ని చూడలేక డాక్టరు అరచేతులతో రెండు కళ్ళూ మూసేసుకుని ఆ జనం మధ్యలోనే మూర్ఛపోయాడు.

డాక్టర్ గారు యీ చిత్రగాథలు చెబుతున్నంతసేపూ, లారీ ఆయన ముఖంలోకి చాలా పరిశీలనగా చూస్తున్నాడు. ఇలాంటి భయంకరమైన అనుభూతులతో, మళ్లా డాక్టరుగారి పాతవ్యాధి తిరగబెడుతుందేమోనని అతని భయం. కాని ఆయనలో అలాంటి చిహ్నాలేమీ కనుపించటంలేదు. డాక్టర్ అంత ధీమాగా వుండటం, లారీ అతఃపూర్వం యెన్నడూ చూళ్లేదు. గతంలో తాను అనుభవించిన యమయాతనంతా తన కిప్పుడు ఆత్మబలంగా పరిణమించిందని డాక్టర్ గ్రహించాడు; ఆ బలంతో తాను జైలు కటకటాలను విరగదీసి పారేసి తన అల్లుణ్ణి బయటికి తెచ్చుకోగలననే ధీమాతో వున్నాడు :

‘లారీగారూ! చూశారూ! మానవుడు కష్టాలనుభవించాడంటే అదంతా ఊరికే పోదు;

అంతా మనమేలుకోసమే జరుగుతూ వుంటుంది. కష్టాలుపడ్డాను గనకనే ఇప్పుడు ఈ సదవకాశమంటూ లభించింది. చూడండి మరి నాదెబ్బ! నాతల్లి నన్ను యెలా ప్రజల్లో పడేసుకుందో, అలాగే భగవంతుడి దయవుంటే, దాని బహిఃప్రాణాన్ని దానికి తిరిగి వప్పగింతజేసి, దాని ఋణం తీర్చుకుంటాను' అన్నాడు. ఆ మాటలధోరణి, ఆయన ముఖంమీద ప్రజ్వరిల్లుతూన్న ఆ నూతనోత్సాహం ఆ మనోనిబ్బరం చూసి లారీ ఆశ్చర్యపడుతున్నాడు.

నిజానికి ఆ తరుణంలో డాక్టరు, ఒక్క డార్నేను బయట పడేసుకునే విషయమే గాదు- ఏ కార్యాన్నిబడితే ఆ కార్యాన్ని సాధించగల స్థితికి వచ్చాడు. జైల్లో వున్న నాలుగు రోజుల్లోనూ అక్కడ యావన్మందికీ చికిత్సచేసే పనికి పూనుకుని, తన పలుకుబడిని చాలా తెలివితేటలుగా ఉపయోగించుకున్నాడు. ప్రజా ప్రభుత్వాధికారులు ఆయనను లాఫోర్స్ ఖైదుతోకూడా కలుపుకుని మూడు జైళ్లకు సూపరింటెండెట్ వైద్యాధికారిగా నియమించారు. లూసీని పిల్చి ధీమాతో చెప్పాడు:

'ఇదుగో అమ్మాయి! ఇటు విను - నీ మొగుడు ఇక ఒంటరిగా ఖైదుకొట్లో వుండవలసిన పనిలేదు - పదిమంది ఖైదీలతోనూ కలిసి పెద్దహాల్లో కులాసాగా కాలక్షేపం చేసే యేర్పాటు చేశాను.' డాక్టర్‌గారు వారం వారం వెళ్లి అల్లుణ్ణి చూసి వస్తూవుండేవాడు. అల్లుడిదగ్గిరనుంచి కూతురుకు యేదో మధురమైన వర్తమానం ఒకటి తెచ్చి అందజేస్తూవుండేవాడు. ఒక్కొక్కప్పుడు డార్నే లూసీకి ఉత్తరాలుకూడా పంపుతూ వుండేవాడు. లూసీని మాత్రం సమాధానం వ్రాయనిచ్చేవారు కాదు. ఎంచేతనంటే, విదేశీయులతో సంబంధంవున్న పరారీదార్లంటే జైల్లో చాలా అనుమానంగా చూస్తున్నారు.

డాక్టర్‌గారి ఈ నూతన జీవితం ఆందోళనతో కూడుకున్నదనటంలో సందేహంలేదు. కాని దాల్లో వినూత్నమైన ఆత్మవిశ్వాసం కూడా వున్నట్లు లారీ అవగతం చేసుకోగలుగుతున్నాడు; డాక్టర్ ఆత్మవిశ్వాసానికి భంగం కలిగించే సంఘటనలు కూడా యేమీ తటస్థించటం లేదు. ఇతఃపూర్వం డాక్టర్ ధోరణికీ యిప్పటి ధోరణికీ చాలా తేడా వుంది. లోగడ ఆయన యెన్నో చిక్కులు బడ్డాడు. లూసీ, లారీ మొదలైన యితరులవల్ల ఆయన వాటిల్లోనుంచి బయటపడ్డాడు. వాళ్ళు తనకంటే సత్తాగలవాళ్లనే అభిప్రాయం ఆయన మనస్సులో వుండేది. ఇప్పుడు ఆ పరిస్థితి యావత్తూ మారిపోయింది. ఇప్పుడు తనకు అనంతమైన బల సంపన్నత కల్గింది. లూసీ మొదలైన యితరులు తన ప్రతిభా సంపత్తుల మీద ఆధారపడవలసిన వాళ్లుగా మారారు. ఇదీ ఆయనలో కలిగిన కొత్త ధీమా. అందుచేత ఆ బలహీనతలను సంరక్షించేటందుకు ధీమాగా ప్రయత్నించుతున్నాడు.

కాని, డాక్టర్ యెంత తీవ్రంగా కృషి చేస్తున్నా డార్నేను విడుదలచేయించ లేకపోతున్నాడు సరికదా, విచారణ జరిగే యేర్పాటుకూడా చేయించలేకపోతున్నాడు. బలీయమైన ప్రజావేశం ముందడుగు పడకుండా ఆయనకు అడ్డుతగులుతోంది. నూతనశకం ప్రారంభమైంది. రాజును విచారణచేసి తల నరికేశారు; యావత్తు ప్రపంచం సాయుధంగా యెత్తివచ్చినా విజయమో మరణమో తేలవలసిందేగాని మరో మార్గం లేదని స్వాతంత్ర్య రిపబ్లిక్ ప్రకటించింది. నాటర్

డేమ్ గోపురాలమీద పగలూ రాత్రీ కూడా నల్లజెండాలు ఎగురుతున్నయ్. జగత్కంటకుల నిరంకుశత్వాన్ని కూలదోయటానికి 3 లక్షల మంది ఫ్రెంచి ప్రజలు సాయుధపాణులై రణక్షేత్రంలోకి దూకేరు. ఫ్రాన్సు భూభాగమంతా విప్లవబీజాలు మొలకలెత్తిపోయినై. నిరంకుశత్వం ఫ్రాన్సు గడ్డమీద వెదబట్టిన విత్తనాలన్నీ బీరుపోకుండా మొలిచి అదే నిరంకుశ పంథాలో ప్రతిహింసకు ఉపక్రమించినై.

పారిస్ రాజధానిలో ఒక విచారణసంఘం. దీనికి అనుబంధ శాఖలు దేశం మూలమూలలా నలభై యాభైవేల ప్రజాకోర్టులు. ఫ్రాన్సులో **గెలాటైన్** అనే మారీపిశాచి ప్రభవించింది. నరజాతిని తలలు నరికి ఆహరించి పారేస్తోంది.

చుట్టూ ఇంత బీభత్సంగా వున్నా, వీటిమధ్య డాక్టర్ మానెట్ మొక్కవోని ఆత్మవిశ్వాసంతో తలెత్తుకు తిరుగుతున్నాడు ఎప్పటికైనా డార్నేను జైల్లోనుంచి బయటపడేసి తీరగలను అనుకుంటున్నాడు. ఇలా అనుకుంటూ వుండగానే పదిహేను నెలలు గడిచిపోయాయి. డార్నే యింకా జైల్లోనే వున్నాడు.

39

సంవత్సరం మూడు మాసాలు గడిచిపోయినై. నానాటికి లూసీ ఆత్మధైర్యం సడలిపోతోంది. ఆ సాయంత్రమో, ఆ మర్నాటి ఉదయమో తన భర్త తల గెలాటైన్‌లో తెగిపోవచ్చునని ఏ రోజు కారోజు, ఏ క్షణానికి ఆ క్షణం ఆందోళన పడుతోంది. మరణశిక్ష విధించబడ్డ వాళ్ళను తుగిడీలకు తుగిడీలు నాటు బళ్ళమీద వధ్యశిలలదగ్గిరికి తోలుకుపోతున్నారు. ఆ బళ్ళనిండా - సౌందర్యవతులైన కన్యలూ, మిసమిసలాడే స్త్రీలూ, వృద్ధమాతలు, బంగారు తలకట్లున్న అందగత్తెలూ, యవ్వన వయః పరిపాకంలో వున్న పడుచువాళ్ళూ, ఆడా, మగా, చిన్నా, పెద్దా, రకరకాలుగా వున్నారు. **గెలాటైన్** మహామారి రక్తదాహం తీర్చటానికి ఆ శకటాలు వందలూ వేలూ వీధులవెంట నిర్విరామంగా సాగిపోతున్నయ్.

తన భర్త హఠాత్తుగా ఇలాంటి ప్రమాదావస్థలో చిక్కుబడటం, తను ఏమీ చెయ్యలేని అసమర్థస్థితిలో అతని విముక్తి కోసం పరితపించుతూ అహోరాత్రాలూ ఆక్రోశించుతూ వుండటం, కాలచక్రాలు అత్యంత త్వరితగతిని రివ్వురివ్వున తిరిగిపోతూ వుండటం భరించరాని ఆవేదనగావున్నా, లూసీ దాన్నంతా బయటికి చూపటంలేదు.

సైయింట్ ఆంటోనీ వీధిలోని అటకమీది గదిలో తొలిసారిగా ఆ ముగ్గు బుట్టతలను హృదయానికి హత్తుకున్న తదాదీ, లూసీ, పితృసేవాదీక్షను ఏమరకుండా సాగించుకు వస్తోంది. ఇంత దీనావస్థలో వుండికూడా తన తండ్రి పట్లచూపే భక్తి తత్పరతలో ఎలాంటి లోటూ రాకుండా చూసుకుంటోంది.

పారిస్‌లోని ఆ కొత్త యింట్లోకి కాపురం మార్చి, యింటికి తిరిగివచ్చిన మరుక్షణంనుంచీ, ఆ ఇంటిని ఇంగ్లండులో తానూ భర్తా కలిసి జీవించే వాటిరోజుల్లో మోస్తరుగానే, చక్కదిద్ది వుంచుతోంది. తనతండ్రి తన కార్యకలాపాలలో నిర్విచారంగా

తిరగటానికి కావలసిన యేర్పాట్లన్నీ జాగ్రత్తగా చూస్తోంది. కూతురికి అక్షరాలు దిద్దబెట్టి చదువూ సంధ్యా చెబుతోంది. తన భర్త, త్వరలోనే, తిరిగి వస్తాడనే మనోధైర్యంతోనే వున్నట్టు నటించుతూ, అతను రాగానే చేయవలసిన యేర్పాట్లన్నీ ఇప్పటినుంచీ సరిదిద్దుతోంది. అతను చదువుకునే పుస్తకాలూ, అతను కూర్చునే కుర్చీ అన్నీ, గదిలో, కిటికీదగ్గిరగా యేర్పాటుచేసి దుమ్మూదుట్రా పడకుండా దులుపుతోంది.

మనిషికూడా, యేమంతలో చెడిపోలేదు. కాకపోతే ముఖం కొంచెం వివర్ణమైంది. ఎప్పుడైనా మనస్సు పట్టలేక కొంచెం కళవళపడి యేడిస్తే డాక్టరు ధైర్యం చెబుతున్నాడు: 'నువ్వు అనవసరంగా కంగారు పడుతున్నావ్! నాకు తెలియకుండా అతని వొంటిమీద ఈగ వాలదు. అతన్ని రక్షించి బయటపడేసే భారంనాది! - నువ్వు నిశ్చింతగా వుండు'- అంటున్నాడు.

ఒకనాటి సాయంత్రం డాక్టర్ యింటికి తిరిగొచ్చి కూతురుతో ఇల్లా అన్నాడు:

'అమ్మాయి ఇటు చూడు! అతనువుంటూన్న జైలుగదికి, పైవైపుగా ఒక కిటికీవుంది. అతను సాయంత్రం మూడుగంటలవేళ ఆ కిటికీ దగ్గిరికీ ఎక్కి నిల్చోటానికి కాసేపు అవకాశం వుంటుంది. రోజూ అలా అవకాశం వుంటుందనటానికి కూడా వీల్లేదులే; సాధారణంగా వుంటుంది. జైలుముందున్న వీధిలో నువ్వు గనక ఒకచోట నిల్చుంటే, నువ్వు అతనికి కనుపించే వీలుంది - ఆ ప్రదేశం నేను చూపిస్తాలే - నీకు మాత్రం అతను కనుపించే సావకాశంలేదు తల్లీ!'-

'చెప్పు నాన్నా చెప్పు! - ఆ ప్రదేశమెక్కడో చూపించు; నేను రోజూ వెళ్లి అక్కడ నిల్చుంటాను.'

ఆవేళనుంచీ, లూసీ ఆ వీధిలో దాదాపు రెండుగంటలసేపు పడివుంటోంది. వానయినా వంగుడయినా వెరవటం లేదు. సరీగా రెండుకొట్టే సరికల్లా ఆ ప్రదేశంలో నిల్చునుంటుంది; మళ్లా నాలుగింటికల్లా కాళ్లీడ్చుకుంటూ యింటికి తిరిగొస్తుంది. ఒకొకనాడు ఆటే చలీ యీదురూ లేకుండా వుంటే బిడ్డను కూడా చంకను ఎత్తుకు వెళ్లేది. ఏదీ యేమైనా తప్పకుండా రోజూ వెళ్లి తీరేది.

లూసీ నిల్చునే ప్రదేశం, వీధి మలుపుతిరిగేచోట చీకటిగా వుండే ఒక యిరుకుమూల వుంది. ఆ ప్రక్కనేవున్న చిన్ని పాకలో ఒకడు కట్టెలు కొడుతూ వుంటాడు.

లూసీ అక్కడ నిల్చోవటం మొదలుబెట్టిన మూడోనాడు, ఆ కట్టెలుగొట్టేవాడు - లూసీని పలకరించాడు.

'మళ్లా యీవేళ కూడా యిక్కడకొచ్చి నిల్చున్నావా?'-

'హాఁ.'

ఆ ముసలివాడు వ్రేళ్లు ముఖానికి అడ్డం పెట్టుకొని, జైలు పై అంతస్థు కిటికీవంక పరకాయించి చూశాడు.

'సరే యేదో గొడవ, నాకెందుకు' అనుకుని మళ్లా తనపని తను చూసుకుంటున్నాడు.

ఆ కట్టెలు కొట్టేవాడు, పూర్వం రోడ్లు మరమ్మత్తు చేసే కూలీగా పనిచేస్తూ వుండేవాడు.

ఆ మర్నాడు వాడు లూసీ వస్తుందని యెదురుచూస్తూనే వున్నాడు. లూసీ కంటబడగానే 'ఆ వచ్చావూ? - పాపాయి కూడా వచ్చిందే' - పాపాయిని పలకరించాడు: 'మీ అమ్మా పాపా!'-

బిడ్డ లూసీ మొహంలోకి చూసింది: 'అవునని చెప్పనా అమ్మా' అని రహస్యంగా తల్లిచెవులో నోరుబెట్టి అడిగింది.

'చెప్పమ్మా'-

'అవును మా అమ్మే'-

'ఆహా! సరే - అయినా నా కనవసరం - నా పనేమిటో నేను చూసుకోవాలి. గొడ్డలి మాంచి పదునుగా తెగుతోంది - గెలొటైన్‌తో తలగొట్టేసినట్టే - సఫా - సఫా - సఫా' - దెబ్బకొక ముక్కచొప్పున కొయ్యముక్కలు తెగి అవతల పడుతున్నయ్.

అలా కొయ్యముక్కలు సఫా - సఫా - నరికి బుట్టలో వేస్తుంటే లూసీకి ఎందుకో భయమేసింది. అతను ఎప్పుడూ అక్కడే వుంటాడు. రోజూ వచ్చి తను అక్కడ నిల్చోవాలి. అక్కడ నిల్చుని అతనికి కనుపించకుండా వుండటం అసంభవకార్యం. అందుచేత నెమ్మదిగా అతన్ని పలకరించి పరిచయం చేసుకుంది. అప్పుడప్పుడు అతనిచేతిలో చిల్లరడబ్బులు పడేసేది. వాడు ఆ డబ్బులు గుప్పెట్లో చూసుకుని ఆనందంతో పొంగిపోయేవాడు.

కాని వాడు సామాన్యం మనిషికాదు. ప్రతి విషయాన్నీ చాలా జాగ్రత్తగా పరిశీలించుతూ వుంటాడు. ఒకొకనాడు వొళ్ళు మరచిపోయి, లూసీ ఆ జైలు కిటికీవంక దిగాలుపడి చూస్తూ, తన హృదయంతో ఆ కిటికీ చువ్వలమీదపోయి వాలటానికి ప్రయత్నించుతో వుండే సమయంలో, వాడు, పసిగడుతున్నట్టు ఆవిడ వంకచూస్తూ వుండేవాడు. చేతిలోవున్న గొడ్డలి అలాగే కర్రలో దిగేసి పని ఆపివేసి చూస్తూ నిల్చునేవాడు. మళ్ళా లూసీ స్పృహలోకివచ్చి అతని వంకచూసేసరికి, ఏమీ తెలియనట్టు గబగబా సర్దుకుని తన పని తాను మొదలెట్టేవాడు! 'ఇవన్నీ నా కెందుకు?' అని గొణుక్కుంటూ.

ఇలా డిశంబరు నెల వచ్చేసింది. ఆవేళ కొద్దిగా మంచు కురుస్తోంది. త్రోవపొడుగునా ఇళ్లన్నీ త్రివర్ణపతాకాలతో అలంకరించి వున్నయ్. 'స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే అక్షరాలతో వీధి వీధినీ జండాలు ఎగురుతున్నయ్. మామూలు ప్రకారం లూసీవచ్చి ఆ సందు మొగిని నిల్చుని వుంది. వున్నట్టుండి లూసీకి యేదో పెద్ద అలజడి వినిపించింది. జైలు గోడ మలుపుతిరిగి ఒక పెద్ద జనప్రవాహం ఆ వీధిలోకి ప్రవహించింది. ఆడా, మగా, అంతా అయిదారువందల మంది దాకా వున్నారు. ఆ తండా మధ్యలో కట్టెలుకొట్టేవాడు ప్రతీకారిణితో చెట్టాపట్టాలు పట్టుకుని నాట్యం చేస్తున్నాడు.

ఆ అయిదారువందలమందీ కూడా అయిదువేల బ్రహ్మరాక్షసుల్లా ఒళ్లు తెలియని వీరావేశంతో తందనాలాడుతున్నారు. విప్లవగీతం పాడుతూ, ఆడా మగా కలిసి చిందులు త్రొక్కుతున్నారు అలా తందనాలాడుతూ వచ్చి లూసీచుట్టూ మూగారు. ఒకళ్ళ చేతులు ఒకళ్లు పట్టుకుని బీభత్సంగా విప్లవగీతాన్ని అరుస్తూ లూసీ చుట్టూ వలయాలు తిరుగుతున్నారు.

మానవజాతిలో వున్న మృగస్వభావం ఒక్కసారి విజృంభించి పోయినట్టనిపించింది లూసీకి. ఆ దృశ్యాన్ని చూసి కంగారెత్తిపోయి లూసీ రెండు చేతులతోనూ ముఖం కమ్మేసుకుంది. ఇలా ఒక అయిదారు నిమిషాలు గంగశివాలాడి, ఆ జనం లూసీని అక్కడ వదిలేసి ముందుకు తూగిపోయారు.

లూసీకి వొళ్లుతెలిసి కళ్ళువిప్పి చూసేసరికి తండ్రి కట్టెదుట కనిపించాడు.

'నాన్నా!' - అని కంగారుగా కేకబెట్టింది - 'బీభత్సం' అన్నది.

'అవునమ్మా! - మరేం ఫరవాలేదు - భయపడకు - వాళ్లు నీకేమీ హాని చెయ్యరు' అంటూ, ఆయన కూతుర్ని అనునయించాడు.

'నాకు భయమేస్తున్నది నాకోసం కాదు నాన్నా! - ఈ వొళ్లు తెలియని పైశాచికావేశంలో, వీళ్లు నాభర్తని యేవి చేస్తారో!'-

మరేం ఫరవాలేదు తల్లీ! - అతన్ని వాళ్ళ వీరావేశాలకు అందేస్థితిలో వుంచాననుకున్నావా? - డార్నేను ఆ కిటికీ దగ్గిరికి ఎక్కి నిల్చోమని చెప్పివచ్చాను. అతను యిప్పుడు నీవంక చూస్తున్నాడు. అరచెయ్యి ముద్దు బెట్టుకుని కిటికీవైపు చూడు. అతనికి నువ్వు ముద్దు బెట్టుకున్న ఆనందం కలిసి మనసు బెంగ తీరుతుంది.'

'కళ్ళనీళ్ళు కారుస్తూ లూసీ తన అరచేతిని ముద్దుబెట్టుకొని ఆ ముద్దును జైలు కిటికీవేపు విసిరేంది.

ఇంతలో అడుగుల చప్పుడు వినిపించింది. మాడెమ్ ఢిఫార్జ్ ఆ దారి నటువచ్చింది. డాక్టర్ మానెట్ పలకరించాడు. డాక్టర్‌కు ప్రత్యభివాదం చేస్తూనే మాడమ్ డిఫార్జ్ క్రీనీడలా మలుపుతిరిగి అదృశ్యమైపోయింది.

'ఇక పోదాంరా తల్లీ - సంతోషంగా వుండు - అల్లుణ్ని రేపు విచారించి విడుదల చేస్తారు'-

'ఆఁ! రేపు విచారించుతారా?'-

'అవును - ఇప్పుడు కాలయాపన చెయ్యటానికి వీల్లేదు - అన్నీ సిద్ధపడే వున్నానుకో- అయినా మరికొన్ని విషయాలు జాగ్రత్తపడాల్సివుంది. చార్లెస్‌కు యింకా సమన్లు అందలేదు. నాకు కొంచెం ముందుగా తెలిసిందిలే. మరేం భయపడకు నేనున్నాగా'-

లూసీకి నోటివెంట మాట పెగల్దేదు - 'ఆఁ! - అంతా నువ్వే!' అని గొణిగింది.

'ఇక నీ కష్టాలు తీరిపోయినట్టే తల్లీ! - కొద్ది గంటల్లో అంతా తేలిపోతుంది. అతన్ని విడుదల చేసేస్తారు. కావలసిన వ్యవహారమంతా సక్రమంగా యేర్పాటు చేశాను. నేనిప్పుడు లారీగారిని కలుసుకోవాలి.'

లారీగారు యింకా ఆ ఖాతాపుస్తకాల్లో సదమదమౌతూనే వున్నాడు. బ్యాంకు ఖాతాదారుల ఆస్తిపాస్తులు జాతీయంచేసి పారేసినవాటిని దుద్దుబెడుతూ, మిగతావాటిని తిరిగి తమ ఖాతాదారులకు వప్పగింత బెట్టే మార్గాలేవిఁటా అని తల పగుల గొట్టుకుంటున్నాడు.

లూసీని వెంటబెట్టుకుని డాక్టర్ టెల్‌సన్సు బ్యాంకువున్న మేడమీదికి వచ్చేసరికి కప్పెదు

కప్పెదు చీకటిపడ్డది. వీళ్ళిద్దరూ మేడమీది ముందుహాలులోకి అడుగుబెట్టగానే, లారీ లోపలి గది లోనుంచి హడావిడిగా బయటికి వచ్చాడు. అంతవరకూ, ఆయన ఆ గదిలో యెవరితోనో మాట్లాడుతున్నాడు. లారీని చూడగానే లూసీ: 'ఆయన్ను రేపు విచారించుతారుట!' అన్నది. ఆమాటలను లోపలున్న మనిషికి చెబుతున్నట్టు లారీ గదిద్వారం వంక చూస్తూ: 'రేపు విచారిస్తారు' అన్నాడు. నల్లటి బారాటికోటు తొడుక్కుని ఆ వ్యక్తి లోపలే కుర్చీలో కూర్చున్నాడు; బయటికి రాలేదు. ఎవరో ఆవ్యక్తి? - ఆ బయటపడగూడని వ్యక్తి?

40

అయిదుగురు జడ్జీలూ, యితర ప్రజా ప్రతినిధులూ కూర్చుని, దినదినం, నిర్విరామంగా విచారణలు జరిపి జనాన్ని మృత్యు ముఖంలోకి పంపించి వేస్తున్నారు. మర్నాటికి విచారణ జరుగవలసిన నేరస్థుల జాబితాలు ఈ సాయంత్రానికే సిద్ధమవుతాయి; జైలువార్డర్లు సాయంత్రం ఈ జాబితాలు తీసుకువెళ్లి పేరు పేరు వరసనీ ఖైదీలను పిలుస్తారు. ఈ జాబితాలలో పేరున్న ఖైదీలంతా విడిగా వచ్చి నిల్చోవాలి. ఆనాటి జాబితాలో చార్లెస్ డార్నే పేరుకూడా పిల్చారు.

ఆ జాబితాలో వున్న ఖైదీలనందర్నీ కోర్టు జైలుకు తీసుకువెళ్ళారు. ఆ రాత్రి తెల్లవార్లూ ఆ క్రొత్తజైల్లో అట్టే పెట్టారు. మర్నాడు ఉదయంనుంచీ ఒకరొకర్నే విచారణకు పంపిస్తున్నారు. డార్నే కంటి ముందు ఆనాడు మొత్తం పదిహేనుమందిని విచారించారు. వాళ్ళవిచారణ యావత్తూ గంటంబావులో ముగిసిపోయింది. వాళ్ళందరికీ మరణశిక్ష విధించారు.

అనంతరం డార్నేను కోర్టువారి యెదుటికి తీసుకువెళ్లారు. కోర్టు హాలు లుగాడీ జనంతో క్రిక్కిరిసి కోలాహలంగా వుంది. రాబందుల్లా కనిపెట్టుకు కూర్చున్నారు. ఆ గుంపులో దూరంగా ఒకచోట డిఫార్జీ, అతని భార్యా కనుపించుతున్నారు. కాని వాళ్ళు డార్నే వంకే చూడ్డంలేదు. తమ మనసులో అదివరకే యేదో నిర్ణయం చేసుకుని మొండి చరిచి కూర్చున్న బాపతుగా కనుపించుతున్నారు. మధ్య మధ్య ఒకరి చెవులో ఒకరు యేదో గుసగుసా చెప్పుకుంటున్నారు.

జడ్జీలు కూర్చున్న పీఠానికి దగ్గిరగా డాక్టర్ నిల్చున్నారు. ఆయన ప్రక్కనే లారీకూడా కనుపించుతున్నారు.

డార్నే అని పిలవబడుతున్న చార్లెస్ ఎవ్రీమూండ్ మీద కోర్టువారి యెదుట పబ్లిక్ ప్రాసిక్యూటర్ నేరారోపణ చేశారు. పరారీదార్లను బహిష్కరించుతూ రిపబ్లిక్ ప్రభుత్వం అనుగ్రహించిన క్రొత్త శాసనం ప్రకారం, డార్నేను తల ఉత్తరించవలసి వున్నదని ఆయన ప్రతిపాదించారు. డార్నే ఫ్రాన్సుకు తిరిగి వచ్చిన తరువాత ఆ శాసనం ఉద్భవించిందనే వాదాన్ని అంగీకరించవలసిన పనిలేదని ఆయన ఉద్ఘాటించారు. శాసనం వుంది - డార్నే దొరికాడు. అతని తల కొట్టెయ్యడమొక్కటే యిప్పుడు ఫ్రాన్సుకు కావలసిందల్లా.

'ప్రజా ద్రోహులు నశించాలి! - తల గొట్టెయ్యండి!'- జనం బీభత్సంగా అరిచారు.

ప్రధాన న్యాయమూర్తి 'సైలెన్స్' అంటూ గంట వాయించి మొత్తుకున్నా ఆ గందరగోళం కొంతసేపటికిగాని తగ్గలేదు. జడ్జీ ముద్దాయిని ప్రశ్నించాడు.

'నువ్వు చాలారోజులు యింగ్లండులో వున్నమాట నిజమేనా?'

'నిజమే.'

'అయితే నిన్ను పరారీదారుక్రింద యెందుకు విచారించకూడదు?'–

'చట్టంయొక్క ఉద్దేశం ప్రకారంగాని, చట్టంలో నిర్వచించబడిన అక్షర సమామ్నాయం ప్రకారంగాని నేను పరారీదారును కాదు.'

'ఎంచేత?'

'ఎందుచేతనంటే, నా అంతటికి నేను యెస్టేటు మీదవున్న హక్కులన్నీ యేనాడో వదలుకున్నాను. – ఈ 'పరారీదారు' అనే పదంతో ఒక శాసనం ఫ్రాన్సు నడిగడ్డమీద పుట్టక పూర్వమే – నాకు గల సర్వహక్కులూ ప్రజలకు వదలి వేసేశాను. ఫ్రాన్సు ప్రజల కష్టంమీదా చెమటమీదా ఆధారపడి బ్రతకటం యిష్టంలేక, ఇంగ్లండుకు వెళ్లి స్వయంకృషివల్ల పొట్టబోసుకుంటున్నాను.'

'ఇందుకు ఋజూ యేమిటీ?'

'తగిన సాక్షులున్నారు; గాబెల్లిగారినీ, డాక్టర్ మానెట్‌నూ విచారణ చేయించండి.'

'కాని నువ్వు ఇంగ్లండులో వివాహం చేసుకున్నట్టు చెబుతున్నారే!–

'అవును – కాని ఆ పెళ్లి చేసుకుంది ఆంగ్లేయ యువతిని కాదు. ఫ్రెంచి స్త్రీనే పెళ్లిచేసుకున్నాను'

'ఆవిడ పుట్టింది ఇక్కడేనా?'

'ఆ' –

'ఆవిడపేరు? – తండ్రిపేరూ?'–

'లూసీమానెట్ – డాక్టర్ మానెట్ గారి కుమార్తె'–

ఈ మాట చుట్టూవున్న జనంమీద యింద్రజాలంలా పని చేసింది. డాక్టర్ మానెట్ అంటే వాళ్లందరికీ ఎంతో ఆప్యాయత. ఆ ఆప్యాయత ఆయన ఆత్మబంధువైన అల్లుడిమీద కూడా ప్రసరించారు. అంతవరదాకా డార్నేను చీల్చి చెండాడే అవకాశం యెప్పుడా అని రౌద్రాకారంగా మండిపడుతున్న ఆ ముఖాలన్నీ కరుణావిలాలుగా మారిపోయినై. జాలిగా కన్నీరు విడుస్తున్నారు.

'నువ్వు అతఃపూర్వమే ఫ్రాన్సుకు తిరిగాక – ఇటీవలనే రావటానికి గల కారణమేవిటి?' అని జడ్జీ మళ్ళీ ప్రశ్నించారు.

'ఫ్రాన్సులో యిక్కడ నాకు పనిపాటలు చేసుకు బ్రదకటానికి తగిన వృత్తేమీ లేకపోయింది. ఇక్కడవుంటే, నేను ప్రజలకు వదిలేసిన యెస్టేటుమీదవచ్చే ఆదాయంమీద బ్రతుకవలసిందే గాని మరో వృత్తేమీ కనుపించలేదు; అందుచేత ఇంగ్లండులోనే వుండిపోయాను. ఇంగ్లండులో ఫ్రెంచిభాషను కొందరు ఇంగ్లీషువాళ్ళకు ట్యూషన్లుచెప్పి పొట్టబోసుకుంటున్నాను. ఇక నేను యిటీవలగా యిక్కడికి రావటానికి కారణంవుంది; ఇక్కడి ఒక ఫ్రెంచిపౌరుడు నేను గనక వెంటనే యిక్కడికి రాకపోతే తనకు ప్రాణాపాయం జరిగే అవకాశంవుందని నాకు వ్రాశాడు; నాకు యెలాంటి ప్రమాదం సంభవించినా ఆయన ప్రాణానికి అపాయం రాకుండా కాపాడటం నా విధ్యుక్తధర్మమని యిలా బయలుదేరి వచ్చాను. ఇది రిపబ్లిక్ ప్రభుత్వం దృష్టిలో నేరమా?'

'కాదూ! – ముమ్మాటికీ కాదూ' – జనం పెంకు లెగిరి పోయేట్టు బొబ్బలు పెట్టారు.

'ఆ పెద్దమనిషి పేరు గాబెల్లీ; ఆయన నా తరఫున విచారింపబడవలసిన మొదటిసాక్షి: ఆయన నాకు వ్రాసిన ఉత్తరం కోర్టువారి సముఖాన దాఖలయ్యేవుంది.

గాబెల్లీని బోనెక్కించారు: ఆయన యీవిధంగా సాక్ష్యం యిచ్చారు:

'రిపబ్లిక్ ప్రభుత్వానికి అనేకమంది శత్రువులు వున్న కారణంగా వాళ్ళనందర్నీ విచారించవలసి రావటంతో, కోర్టువారికి నన్ను వెంటనే విచారించి విడుదలచేసే తీరిక లేకపోయింది. అందుచేత నిన్న మొన్నటివరకూ నేను అబేయీ ఖైదులో విస్మృతుడుగా వుండిపోవలసి వచ్చింది. ఇప్పటికి మూడు రోజులక్రితమే, కోర్టువారికి నాయందు కనికరంకలిగి విచారణ చేసి విడుదల చేయించారు. ఎవ్రీమూండ్ అనే ఫ్రెంచి పెద్ద మనిషిని ప్రభుత్వంవారి ముందు హాజరు పరుచుకున్న కారణంగా కోర్టువారు నన్ను నిర్దోషిగా తీర్పుయిచ్చి విడుదల చేయించారు.'

రెండవసాక్షి డాక్టర్ మానెట్ బోనెక్కారు.

'నేను అనేక సంవత్సరాలు మాజీ ప్రభుత్వం చేతుల్లో జైలుశిక్ష ననుభవించిన సంగతి యిక్కడవున్న దేశభక్తులందరికీ తెలుసు; నేను జైల్లోనుంచి బయటపడగానే, నాకు లభించిన మొట్టమొదటి ఆప్తుడు ఈ ముద్దాయి ఒక్కడే; ఈయన యింగ్లండులో వుంటూవుండేవారు. దేశ బహిష్కృతుడనై ఇంగ్లండులో తలదాచుకుంటున్న, నన్నూ నా కుమార్తెనూ యెంతో ఆదరంగా చూచాడు. అక్కడ ఇంగ్లండులోవున్న నిరంకుశ ప్రభుత్వంతో డార్నేకు ఎలాంటి సంబంధమూ లేదు సరేగదా, డార్నేమీద దేశద్రోహనేరం మోపి ఆ ప్రభుత్వం అతన్ని తలదీయించటానికికూడా ప్రయత్నించింది; ఇంగ్లండులో జరిగిన ఆ విచారణ కాండనంతా స్వయంగా ఆ నాడు కోర్టులోవుండి చూసిన లారీ అనే ఒక ఇంగ్లీషు పెద్దమనిషి యిప్పుడు యిక్కడ కోర్టులో వున్నారు. అవసరమనితోస్తే ఆయన్నుకూడా కోర్టువారు విచారించవచ్చు.'

అప్పటికి చాలాసేపు విని విని విసిగెత్తి వుండటం చేత కోర్టు వారికీ, జూరీ పెద్ద మనుషులకూ కూడా, లారీగారిని విచారించవలసిన అవసరంలేదని తోచింది. నిర్దోషిగా తీర్పు చెప్పి డార్నేను విడుదల చేయించారు.

వెంటనే కోర్టుహాల్ యావత్తూ ఆనంద కోలాహలంతో హోరెత్తిపోయింది. కోర్టులో వున్న దేశభక్తులంతా ఆడా మగా విక్షణలేకుండా డార్నేను చుట్టేసి, ఒకరి తరువాత ఒకరు ఊపిరి సలపకుండా కావిలించుకుని ఉల్లాసంగా గంతులు బెడుతున్నారు. అంత వరదాకా ఒంటరిగా జైల్లోవుండి బయటపడిన ఆ వ్యక్తి చుట్టూ ఒక్కసారి యింత ప్రజావాత్సల్యం చెలరేగటంతో అతనికి ఊపిరాడని పరిస్థితి యేర్పడి మూర్ఛపడిపోయేట్టు కనుపిస్తున్నాడు. మిగతా ఖైదీలను విచారించే నిమిత్తం కోర్టువారు బలవంతాన అతన్ని బయటికి పంపించి వేయటంతో ఆ బాదరబందీలో నుంచి ప్రాణాలుదక్కి గాలిలో పడ్డాడు.

అభినందన నినాదాలు చేస్తూ తన్ను చుట్టవేస్తున్న జనాన్ని తొలగదోసుకుంటూ డాక్టర్ మానెట్ కోర్టు హాలుగేటు దగ్గిరకొచ్చి డార్నేకోసం, లారీకోసం జనసమూహంలో

పరకాయించుతున్నాడు. ఇంతలోనే కోర్టు హాలుముందు ఆయనకోసం కనిపెట్టుకున్న జనం: 'హిప్! హెప్! హుర్రే' అని కొండ కేకలెట్టి ఆయన్ను భుజాలమీదకు ఎత్తేసుకున్నారు. కోర్టులోనుంచి ఒక కుర్చీ లాక్కొచారు; దానిమీద ఒక యెర్రగుడ్డ పరిచి డాక్టర్ గారిని దానిమీద కూలేశారు. ఆ కుర్చీని భుజాలమీద మోస్తూ, డాక్టర్ గారి యింటివైపు ఉత్సవం బయలుదేరింది. అవి వీరాలాపాలుగాదు, అవి ఆనందనృత్యాలు గాదు, అవి విప్లవ నినాదాలుగాదు - ఓహ్! - కొట్టి కోలాహలమై పోయింది.

డార్నే కంటే ముందుగానే డాక్టర్‌గారు ఇల్లు చేరుకుని సంగతంతా కూతురుకు చెప్పాడు; డార్నే కట్టెదుట కనిపించగానే లూసీపట్టరాని ఆనందంతో నోటమాట రాక అతని చేతుల్లో స్పృహలేకుండా వాలిపోయింది. ఆ యిద్దరిచుట్టూ పెద్ద పెట్టున విప్లవగీతాన్ని ఆలపించుతూ జనం తాండవ కోలాహలంలో మునిగి తేలుతున్నారు. ఆ భవనం ముందున్న ఆవరణయావత్తూ కూడా ఆనందనృత్యాల కోలాహలంతో హోరెత్తిపోతోంది. అలా కొంతసేపు తాండవమాడి ఆడి, అక్కడజనంలోవున్న ఒక పడుచుపిల్లను స్వాతంత్ర్యదేవత క్రింద కుర్చీమీద ఎక్కించుకుని, 'జావ్‌'మని మళ్లా వీరగీతం ఎత్తుకుని తందనాలు తొక్కుతూ బయటికివెళ్లిపోయారు.

'క్షేమంగా బయపడ్డాను లూసీ' అన్నాడు డార్నే.

'డార్నే! భగవంతుడిదయ!' - అన్నది లూసీ.

డాక్టర్ మానెట్ మీసాలు మెలిపెట్టుకుంటూ అదో ధీమాగా కూతురువంకా అల్లుడివంకా చూస్తున్నాడు.

'మీ నాన్నకు నమస్కరించు లూసీ' - ఆయన గనక నా ప్రాణం రక్షించగలిగాడు గాని, ఈ ఫ్రాన్సులో మరొకరెవరూ ఈ కార్యం సాధించగలిగేవారు కారు' అన్నాడు డార్నే.

లూసీ పసిపిల్లలా డాక్టర్ హృదయంమీద తల ఆనించి: 'నాన్నా!' అన్నది. తన పితృత్వ పటాటోపాన్నంతా చూపిస్తూ డాక్టర్ కూతుర్ని మందలించాడు: 'ఎందుకే పిచ్చితల్లీ అట్టా వణుకుతావ్! - ఏవిటంత బలహీనతా?- అతన్ని రక్షించాను గదా!'

41

“అతన్ని రక్షించాను”

ఆమాట డాక్టర్ రోజూ అంటూన్న పగటికలల పలవరింత మాటలు కావు. డార్నేను రక్షించాను; అతను ప్రక్కనే నిల్చునున్నాడు కూడా: కాని లూసీకి మాత్రం, యింకా, యెందుకో గాబరాగానే వుంది. మనసులో అర్థంలేని యేదో భయం.

చుట్టూవున్న పరిస్థితులు చూస్తే మహాబీభత్సంగా వుంది. జనం మతిచెడిన వీరావేశంలో వున్నారు. అనందంగా హత్యలు సాగిపోతున్నాయ్; అర్థంలేని అనుమనాలు, అనవసరమైన క్రోధాలు; వేలాది అమాయకులను హత్యచేసిపారేస్తున్నారు. తన భర్తకోసం తను యెంత తాపత్రయపడుతోందో, ఆ నశించిపోతున్న భర్తలకోసం వాళ్ల భార్యలూ అలానే యేడుస్తూ వుంటారు. తనభర్త యెలాగో యివతలపడ్డా, లూసీ మనస్సులో యింకా యేదో గుంజాటనగానే వుంది. ఏమో, మళ్ళా యేక్షణాన యేమిజరుగుతుందో. శీతాకాలపు సంధ్య చీకట్లు యిప్పుడిప్పుడే కొంచెం కొంచెంగా కనుతెరిపోతున్నయ్. కాని హతభాగ్యులను వధ్యశిలల దగ్గిరికి జారవేస్తున్న శకటాలు ఇంకా వీధులవెంట సాగిపోతూనే వున్నయ్. ఆ బల్లవంక చూస్తోంది; కంగారెత్తిపోయి, ప్రక్కను నిలచివున్న భర్తను అలుముకుని గట్టిగా కావిలించుకుని గజగజా వణుకుతోంది. తన భర్త ఆ బళ్ళల్లోకి ఎగిరిపోతాడేమోననే భయంతో అతని చుట్టూతీగెలా పెనవేసుకుపోతోంది. డాక్టర్ మానెట్ కుమార్తె భయాన్ని పోగొట్టటానికి ప్రయత్నించుతున్నాడు. స్త్రీహృదయాన్ని ఆవేశంచివున్న ఆ బలహీనతను చూసి జాలిపడుతున్నాడు. ఆయన యిప్పుడు అనంతమైన ఆత్మవిశ్వాసంతో వున్నాడు; చీకటికొట్టూ, చెప్పులు కుట్టడం, 105 నార్త్‌టవర్ - ఇత్యాదయః రోజులన్నీ నశించి పోయాయ్; తాను అనుకున్న పని సాధించి తీరాడు; ఇచ్చిన వాగ్దానాన్ని చెల్లించి తీరాడు; చార్లెస్‌ను ఉద్ధరించాడు; తను గొప్పవాడు; తక్కిన ఆ బలహీనులంతా, తనమీద ఆధారపడి హాయిగా యిక బ్రతకొచ్చు!

వాళ్లు కుటుంబ ఖర్చులుకూడా చాలా తగ్గించి వేసుకున్నారు. చాలా నిరాడంబర జీవితం; డబ్బు ఖర్చయిపోతుందని కూడా కాదు. అలా నిరాడంబరంగా బ్రతకటం క్షేమకరం; ప్రజలకు ఆగ్రహం కలుగకుండా ఉంటుంది; ఖర్చు బెడదామన్నా వాళ్ళ దగ్గర యెక్కువ డబ్బుకూడా లేదు; జైల్లో వున్నన్ని రోజులూ, డార్నే యెన్నో ముడుపులు చెల్లించుకోవలసి వచ్చేది. తిండి క్రిందా, దిబ్బలుక్రిందా యెంతో కట్టుకోవలసి వచ్చింది. ఆ విధంగా చాలా డబ్బు ఖర్చయిపోయింది; చేతిలో ఆటే డబ్బు లేకుండా పోయింది. ఆయీ కారణాలచేతనూ, యింట్లోకి గూఢచారి రొమ్ముల కుంపటిని తెచ్చుకోవటం యిష్టంలేకనూ, వేరే నౌకర్నుకూడా యేర్పాటు చేసుకోకుండా కాలక్షేపం చేస్తున్నారు. ఏదైనా, మరీ అంత అవసరమైన పని తగిలితే బ్యాంకు భవనం గేటుముందు కాపలాకాస్తున్న నౌకర్లకు యేదో పడేసి ఆపని చేయించుకుంటూ వుండేవారు. జర్రీక్రంచర్ యెప్పుడూ వీళ్ళ కుటుంబంతోనే వుండిపోతున్నాడు; లారీగారు అతన్ని పూర్తిగా వీళ్ళ పనులు చూట్టానికి వదిలేశారు. క్రంచర్ ఇక్కడే తిని యిక్కడే పడుకుంటున్నాడు.

ప్రజా ప్రభుత్వం ఒక శాసనాన్ని అమలు జరిపింది. ప్రతి యింటి వీధి తలుపుమీదా, ఆ యింట్లోవుండే యావన్మందిపేరులూ వివరంగా పెద్దపెద్ద అక్షరాలలో వ్రాసివుంచాలి; క్రంచర్ పేరుకూడా ఆ తలుపుమీది పేర్ల జాబితాలోకి యెక్కింది. ఆవేళ ప్రొద్దు పడమట తిరుగుతోందనగా క్రంచర్ లోపలికి వచ్చాడు; అతను వీధి గుమ్మంలోకి అడుగు బెట్టేసరికి తలుపు మీద చార్లెస్ డార్నే పేరుకూడా వ్రాస్తూ ఒక ముచ్చివాడు కనిపించాడు. డాక్టర్ మానెట్ ఆ ముచ్చివాణ్ణి తీసుకొచ్చి అల్లుడి పేరుకూడా తలుపుమీద వ్రాయిస్తున్నాడు. ఆ ముచ్చివాణ్ణి ఖాతరీ చెయ్యకుండానే క్రంచర్ లోపలికి నడిచాడు.

ఇంట్లోకి కావలసిన సరుకులన్నీ, మామూలుగా, క్రంచర్‌ను వెంటబెట్టుకు వెళ్ళి, మిస్ ప్రాస్ కొనుక్కొస్తూ వుంటుంది. క్రంచర్ తట్ట నెత్తిన బెట్టుకుని ఆవిడ వెంట వెడుతూ వుంటాడు. కప్పెడు కప్పెడు చీకటిపడి దీపాలు వెలిగించే సమయంలో యిద్దరూ బయటికి బయలుదేరుతూ వుంటారు. కొనే సరుకులు కూడా అన్నీ ఒక దుకాణంలోకొనరు; యెవళ్లకీ

అనుమానం తగలకుండా దుకాణానికి ఒక సరుకు చొప్పున కొంటారు.

క్రంచర్ తట్ట నెత్తిన బెట్టుకుని ప్రాస్ వెంట బయలుదేరాడు.

'ఈవేళ అడ్డమైన సరుకులూ అనేకం కొనాలి - చాలాసేపు పట్టేట్టుంది: ఇంత వైన్‌కూడా కొనాలి, అది కొనడానికి యెక్కడికి పోయినా యీ ఎఱ్ఱతలలవాళ్లు తప్పదాగుతూ వుంటారు' అన్నది ప్రాస్.

మరేం ఫరవాలేదన్నాడు క్రంచర్.

'ఏం ఫరవాలేదు - హత్యలూ హంగామాలూ - తట్టుపర్ల వెధవలు!'

'ఇష్! - అలా అనకూడదు - కొంచెం జాగ్రత్తగా మాటాడుతూ వుండు' అని మందలించింది. లూసీ.

'అవునవును! మరిచేపోయాను - జాగ్రత్తగా మాట్టాడాలిసిందే - నేను మళ్ళీ ఇంటికి తిరిగొచ్చేదాకా నువ్వుమాత్రం గుమ్మందాటి కదలకు; మీ ఆయన్ను కూడా గుమ్మం దాటనివ్వకు - అతని భుజంమీదనుంచి తల యివతలికి తియ్యొద్దు - అంతే! అయితే డాక్టర్ గారూ మిమ్మల్ని ఒకమాట అడగొచ్చా?'

'మీరు స్వాతంత్ర్యం సంగతి మాత్రం ఇంకెప్పుడూ ఎత్తొద్దు - ఇప్పటికే ఆ దౌర్భాగ్యం చాలా అనుభవించాం' -

'ఇష్ - మళ్ళీ అదే ధోరణా' - లూసీ మరొకసారి తిరిగి మందలించింది!

'లేదులేతల్లీ - ఇంతకీ చెప్పొచ్చిం దేమిటంటే - నేను మహాఘనత వహించిన జార్జిరాజుల దేశంలో పుట్టడం పూర్వపుణ్యం - 'గాడ్ సేవ్ దికింగ్!' (భగవంతుడు మహారాజును రక్షించుగాక!)-

ఆ జోహారును అందిపుచ్చుకుని క్రంచర్ కూడా తన ప్రభుభక్తి తత్పరతను వెల్లడించుకున్నాడు.

'నీలో ఆమాత్రం ఆంగ్లేయతత్వం వుంటం మెచ్చదగిన సంగతే - కాని, ఆ వెధవ బొంగురుగొంతేమిటి?' అన్నది ప్రాస్ - 'ఇంతకీ, డాక్టర్‌గారూ! మనకి యమపట్నం చెరవొదిలేది వుందా లేదా?'-

'ఇప్పుడప్పుడే వీల్లేదు - చార్లెస్ యోగక్షేమాలదృష్ట్యా యిప్పుడప్పుడే బయలుదేరడం మంచిదిగాదు.

'ఊహూ! సరే! - అదా? - అవును తొందరపడటం మంచిది గాదు - మాతమ్ముడు సాల్‌మన్ అంటూవుండేవాడు - అలవిగాని వేళ అధికుల మనరాదు, తలవంచుకు తిరగాలి అని - ఆఁ! - ఏవిరా అబ్బీ! ఇక బయల్దేరదామా? - రా నాయనా రా!- అమ్మాయ్ వెళ్లిరామా?'

ఇద్దరూ బయటికి వెళ్లిపోయారు. లూసీ, డార్నే, డాక్టరూ, లూసీ కూతురూ గదిలో కూర్చుని యేవో కబుర్లు చెప్పుకుంటున్నారు. బ్యాంకునుంచి లారీ వస్తాడని యెదురు చూస్తున్నారు. పసిబిడ్డ లూసీ తాతగారి పక్కనే కూర్చుని బాతాఖానీ వేస్తోంది; డాక్టర్ గారు మనుమరాలికి కథ చెబుతున్నాడు: ఆ కథలో, ఒక దేవకన్య వుండేదనీ, అది జైలుతలుపులు పగల గొట్టేసి లోపలున్న ఖైదీని ఒకణ్ణి బయటికి తీసుకొచ్చి కాపాడిందనీ, యిత్యాదయః చెప్పుకుపోతున్నాడు.

ఉన్నట్టుండి : ఆఁ! - ఏమిటది-' అంటూ కంగారు పడ్డది లూసీ.

చెబుతూ చెబుతున్న కథ చివాల్న ఆపేసి, డాక్టర్:

'ఏవిటి తల్లీ కంగారూ? నే నిక్కడవుండగానే?' అంటూ భుజంమీద చెయ్యివేసి బుజ్జగించాడు.

'అదికాదు నాన్నా; మెట్లమీద ఎవరో కొత్తమనుషులు నడుస్తున్నట్లు అడుగులు చప్పుడు వినిపిస్తోంది.

'మెట్లమీద చప్పుడేవిటి తల్లీ - ఎవీఁలేందే' డాక్టర్ యీ మాట అంటూండగానే ఎవరో గబగబా తలుపు కొడుతున్నట్టు చప్పుడు వినిపించింది.

'నాన్నా! నాన్నా! - ఎవరో! ఏవిఁటో! - ఆయన్ని దాచెయ్ - నా భర్తను రక్షించు'- అంటూ, వెర్రిదానిలాగు బెంబేలుపడి యేడ్చింది.

'వెర్రి తల్లీ! యేవిటంత పిరికితనం; అతన్ని రక్షించి తెచ్చుకుని యెన్నాళ్ళయింది; ఇంత పేద గుండెలేవిఁటి తల్లీ?- అసలు యేవిఁటో తలుపు దగ్గిరికి వెళ్లి చూణ్ణీ'-

లాంతరు చేత్తో బుచ్చుకుని ముందున్న రెండు గదులూ దాటి బయటి తలుపు తెరిచాడు. కత్తులూ తుపాకులూ బుచ్చుకు నలుగురు యెఱ్ఱటోపీ గుండాలు బెలబెలా లోపలికి వచ్చారు.

'డార్నే అనే ఎవ్రీ మూండ్ యెక్కడ?' అన్నాడు అందులో ఒక్కడు.

'నాకోసమా? ఎవరు?' అంటూడార్నే దగ్గిరికొచ్చాడు.

'నేనూ! - మేవూఁ - నిన్ను మళ్లీ ఖైదు - చేస్తున్నాం' అంటూనే నలుగురూ అతన్ని చుట్టేశారు. లూసీ లూసీబిడ్డా, కంగారుగా యేడుస్తూ అతన్ని పెనవేసుకున్నారు'

'నన్ను ఎందుకు అరెస్టు చేస్తున్నారో - ఏమిటోచెబుతారా?'

'ముందు జైలుకు దయచేస్తే : రేపు ఉదయం విచారణ సంఘం వారినడిగి అవన్నీ తెలుసుకోవచ్చు' అన్నాడు. వాళ్ళలో ఒకడు.

వాళ్ళు హఠాత్తుగా అలా రావటం చూసి, దిగ్భ్రాంతుడై స్తంభించి నిల్చునిపోయిన డాక్టర్ అప్పటికి కాస్త స్పృహలో కొచ్చాడు. లాంతరు నెమ్మదిగా క్రిందబెట్టి:

'అబ్బాయ్! నే నెవరో తెలుసా? అమ్మా' అంటూ ముందు కొచ్చాడు.

మిమ్మల్ని యెరక్కపోడం యేమిటండీ డాక్టర్ గారూ?' అన్నాడు, ముందుపీటీలో తుపాకి బుచ్చుకు నిల్చునున్న ఆ కుఱ్ఱాడు.

'మిమ్మల్ని అంతా యెరుగుదురండీ' అన్నారు ఆ ముగ్గురూ కూడా.

'అయితే అబ్బాయీ? - ఇదంతా ఇలా ఎందుకు జరిగిందో కాస్త చెబుతారా?' అన్నాడు డాక్టరు.

'సెయింట్ ఆంటోనీ ప్రజలు ఈయనమీద నేరారోపణ చేశారు'

'ఎవరా నేరారోపణ చేసినవారు? - పేరు చెబుతారా?-

'అల్లా చెప్పటం తప్పేననుకోండి - అయినా మీరు తెలుసుకోవాలంటే చెబుతాం- ఆ నేరారోపణ చేసినవారిలో ఒకరు డిఫార్జ్ - మరొకరు?'

'ఆఁ! - మరొకరు?'-

'అంతే లేండి - ఆ రెండో మనిషెవరో రేపు కోర్టులో తెలుసుకుందురు గాని - ఇక ఇప్పుడు చెప్పేదిలేదు.

42

డార్నేను తిరిగి అరెస్టుచేసి తీసుకుపోయిన సంగతి మిస్ ప్రాస్‌కు తెలియదు; హడావిడిగా వీధివెంట నడిచి వెడుతోంది; తట్ట నెత్తిన బెట్టుకుని క్రంచర్ ఆవిడప్రక్కనే నడుస్తున్నాడు. పాంట్-న్యూ వంతెనమీదనుంచి నది దాటి అవతలి వేపుకు వెళ్ళారు. వీధిని నడుస్తున్నంతసేపూ ఇద్దరూ, అమిత జాగ్రత్తగా ఇటూ అటూ పరకాయించి చూస్తూనే వున్నారు. దుకాణాలముందు జనం ముఠాలు ముఠాలుగా మూగి, వొళ్ళు తెలియని వీరాలాపాలతో పేట్రేగిపోయి వున్నారు. అలాంటి దుకాణాలదగ్గిరికి పోకుండా, తప్పించుకుని ముందుకు నడుస్తున్నారు. ఆనాటి సాయంకాలం మంచు దట్టంగా పట్టి బాగా మసకచీకటిగా వుంది. వీధి దీపాలు మాత్రం మినుకుమినుకుమంటూ వెలుగుతున్నయ్. ఇక, ఆ మసకచీకట్లలో, కొరివి దయ్యాల్లా అక్కడక్కడ కమ్మరకొలుములు మాత్రం బీభత్సంగా మండుతున్నయ్. విప్లవసైన్యానికి కావలసిన నాటు తుపాకులూ, కత్తులూ, ఆ కొలుముల దగ్గిర తయారవుతున్నయ్.

మిస్ ప్రాస్ కావలసిన చిల్లర సామాన్లు కొన్ని కొన్నది. దీపానికి కిరసనాయిలు కూడా కొన్నది. ఇక కావలసిందల్లా వైన్. వైన్ కొనటానికి ప్రతి సారాదుకాణంలోకి తొంగి చూస్తుంది. అక్కడ జనం గందరగోళంగా వుండటం చూసి మళ్లీ ముందుకు సాగుతుంది. ఇలా వచ్చివచ్చి ఒక పానశాలదగ్గిర నిలబడ్డది. తక్కిన సారాదుకాణాల దగ్గిరకంటే, ఇక్కడ కొంచెం ప్రశాంతంగా వుంది. ఇక్కడా కొన్ని యెర్రటోపీలున్నాయిగాని మరీ అంత రక్తోన్మాదంలో లేవు; ఫరవాలేదనుకుంది మిస్ ప్రాస్; క్రంచర్ ముఖంలోకి చూచింది; క్రంచర్ కూడా అదే అభిప్రాయంలో వున్నట్టు కనుపించాడు. దాంతో ధైర్యంచేసి లోపలికి అడుగుబెట్టింది.

ఆ పానశాలలోవున్న దీపాలన్నీ కావురేసి మినుకు మినుకు మంటున్నయ్; కొంతమంది సోదరులు పొగచుట్టలు పీలుస్తూ చీట్ల పేకవేస్తున్నారు; చొక్కాగిక్కా లేకుండా మసిపులుముకున్న చిన్నిమట్ట లాగుమాత్రం తొడుక్కున్న ఒక కార్మిక సోదరుడు పత్రికోటి చేతబట్టుకుని కొంచెం గొళగాత్రంతో చదువుతున్నాడు. మరో కొంతమంది అతనిచుట్టూ కూర్చుని వింటున్నారు. కొన్ని తుపాకులూ, కత్తులూ బల్లలమీద చెల్లాచెదురుగా పారేసున్నయ్; మరోకొంతమంది సోదరులు ముందున్న బల్లమీదికి వొరిగి ఎలుగ్గొడ్డుల్లా గుర్రుగొట్టి నిద్రబోతున్నారు.

మిస్ ప్రాస్ అమ్మకం బల్ల ముందుకుపోయి, తనకు ద్రాక్ష సారాకావాలని చెప్పింది. అమ్మకందారు ద్రాక్షసారా కొలిచి పోస్తున్నాడు. ఇంతలో పానశాలలో ఒకమూలనుంచి ఒక వ్యక్తి లేచి బయటికి వచ్చేస్తున్నాడు. ఆ రావటంలో, అతను మిస్ ప్రాస్‌కు ముఖాముఖి

తారసిల్లాడు. అతను కంటబడగానే, మిస్ ప్రాస్, 'ఓరెయ్!' - అంటూ ఒక గావు కేకబెట్టి, అమాంతం కావిలించుకోబోయింది:

ఆ గావుకేకవిని అక్కడున్న వాళ్లంతా ఒకసారి బెలబెలా లేచి నిల్చుని నిర్ఘాంతపడి చూస్తున్నారు. ఎవణ్ణో నరికెయ్యడమో, అలాంటిదేదో జరిగుంటుందనుకున్నారు. కాని యెవ్వరూ నేల వొరిగిపోయినట్టు కనుపించలేదు; ఫ్రెంచి విప్లవవీరుడులా కనుపించుతున్న ఒక మొగవాడూ, అతనికి యెదురుగా యీ ఆంగ్లేయవృద్ధ కన్యామాత్రం కనుపించుతున్నారు.

బీభత్సకరమైన సంఘటన యేదీ జరగకపోవటంతో సోదరులందరికీ చాలా ఆశాభంగం కలిగింది. ఫ్రెంచిభాషలో ఏదో గొణగొణ లాడుకున్నారు. ఆ గొణగొణ యేవిఁటో ప్రాస్‌కు రవ్వంతేనా బోధపడలేదు. భాష అర్థం కాకపోవటమేగాదు; మాటలు కూడా వినబడే స్థితిలోలేదు. ఆ వ్యక్తి కంటబడగానే ఆవిడా, వెంటవున్న క్రంచరూ కూడా ఆశ్చర్యచకితులై చిత్రితప్రతిమల్లా స్తంభించిపోయారు.

ఆ వ్యక్తి కొంచెం విసుక్కుంటూ, 'ఏవిటి గొడవ' అన్నాడు మెల్లిగా, ఆంగ్లభాషలో.

మిస్ ప్రాస్ వసబోసిన పిట్టలా అందుకుంది;

'ఒరే నాయినా! సాల్మన్, తమ్ముడూ! - ఒరే అబ్బీ అబ్బా! ఎన్నాళ్ళయిందిరా తండ్రీ కంటబడి - కళ్ళు కాయలుగాచి పోయాయి గదరా!'-

'ఇష్! సాల్మన్ గీల్మన్ అంటూ దెయ్యపు గొంతెట్టుకు అరవకు - నా ప్రాణం తీయిస్తావా యేవిటి?'

మిస్ ప్రాస్ వలవలా యేడిచేస్తోంది: 'అదేవిట్రా తమ్ముడూ? అలాంటి వోగాయిత్యం మాటలూ నువ్వానూ?'-

'వోగాయిత్యం లేదు నా శ్రాద్ధంలేదు - నేను బ్రతకాలనుంటే కాసేపు నోరుకట్టుకో- అంతగా మాట్టాడాలనుంటే, అలా బయటికి తగులడు - ఈ మనిషెవడు? - దయ్యాన్ని చూసినట్టు ఎందుకు నావంక అలా తెల్లపోయి చూస్తాడు?'

'మనవాడేరా తండ్రీ! క్రంచర్?'

'సరే అతన్ని కూడా బయటికి రమ్మను - ఏవిటా వెర్రి చూపు?-'

ఈ మాటలు ఇంగ్లీషులో వీళ్ళతో అని - మిగతా సోదరులతో, ఈ వ్యవహారమంతా సర్దేస్తూ యేదో ఫ్రెంచిలో ఒకటి రెండు వాక్యాలు చెప్పేసి, బయటికి నడిచాడు.

అమ్మకం బల్లదగ్గిర యివ్వాలిసిన డబ్బు లెక్కజూసి యిచ్చేసి, ఆవిడా, క్రంచరూ కూడా. సాల్మన్‌తోపాటు వీధిలోకి నడిచారు.

వీధిమలుపు దిరిగి ఒక చీకటి గొందిలోకి వచ్చింతరువాత సాల్మన్ అక్కడ నిలబడ్డాడు.

'ఆఁ! - ఇప్పుడు చెప్పి తగులడు! - ఏవిఁటి అంటావ్?'

'అయ్యో నా తండ్రీ! అంత కోపమేవిఁట్రా! - ఇన్నాళ్లకి కంటబడి యిదేట్రా నన్ను పలకరించాల్సిన వరసా? - నా మీద నీకు రవ్వంతేనా ప్రేమలేదుట్రా?-'

'ప్రేమగాదు నా బొంద' అంటూ, అమిత విసుగ్గా అక్కగారిని ముద్దుబెట్టుకున్నాడు- 'ఊఁ' అక్కడికి తృప్తితీరిందా?-'

సంతృప్తేనని సూచిస్తూ తలవూపింది మిస్ ప్రాస్. సంతోషం పట్టలేక ఉత్కంఠతో సన్నగా ఏడ్చింది.

'నువ్వు హఠాత్తుగా కనుపిస్తే నేను ఆశ్చర్యపడి చావలేదూ అని అనుకుంటున్నావల్లే వుంది, - నువ్వు ఇక్కడ వుంటున్నావన్న సంగతి నాకు చాలా రోజులనుంచీ తెలుసు; నిజంగా నేను నాశనమై పోకుండా వుండాలని నీకుంటే, కిక్కురు మనకుండా నీ దారిని నువ్వుపో! - నా దారిన నన్నుపోనీ - నాకు పనుంది. నే నిక్కడ ఉద్యోగం చేస్తున్నాను'- అన్నాడు సాల్మన్.

'అయ్యో నీయిల్లంతా బంగారంగానూ! నీకేం కర్మ మొచ్చిందిరా నా తండ్రీ? - మాణిక్యంలాంటి ఇంగ్లీషు బిడ్డకి నీ కిదేం గతిరా? - యీ తిక్కదేశంలో యీ తిక్కముండావాళ్ళ దగ్గిర నౌకరీయేవిఁట్రా నాతండ్రీ! - ఇంతకన్నా నువ్వు గోతిపాలు....'

'ఆఁ! - నన్నెలాగూ గోతిలో పెట్టించడానికే నువ్వివ్వాళ సైతాన్‌లా నాకు దాపరించావు - ఎవడేనా వింటే పీక తెగిపోతుందే నీ గొంతుకొయ్యా!-

'అట్టాగా తండ్రీ! - అదా - సరే సరే, నోరుమూసుకుని వెళ్లిపోతా!- నామీద యేవీఁ కోపం లేదని నవ్వుతూ ఒక ముచ్చటైన మాట చెప్పు! - వెళ్ళిపోదాం మరి'-

'కోపం లేదు గీపం లేదు - వెళ్ళవే బాబూ!'-

సాల్మన్ విసుక్కుంటూ ఈ మాట అంటూండగానే క్రంచర్ ముందుకు అడుగేసి కొంచెం మొరటుగా సాల్మన్ భుజం మీద చెయ్యేసి: 'ఇదుగో తమ్ముడూ! - ఇటు చూడు!' అన్నాడు.

'ఏవిఁటి?'-

'నిన్ను ఒకమాటడగాలిలే! - ఇంతకీ నీ పేరు జాన్ సాల్మనా? - లేకపోతే సాల్మన్ జానా? - ఏది ముందు ఏది వెనక?'-

ఆ వ్యక్తి తెల్లబోయి క్రంచర్ వంక చూస్తున్నాడు.

'చెప్పులే - ఇంతలోకే యేంపోయింది - మీ అక్క నిన్ను సాల్మన్ అంటోందా - నువ్వు జాన్ అయినట్టు నాకు తెలుసు. అసలు మీ అక్క పిలుస్తున్నట్టు సాల్మన్ గాక అక్కడ ఇంగ్లండులో నీకు అదో వేరేపేరేదో వుండేది. ఏవిఁటదీ - జ్ఞాపకం రాకుండా వుందీ?'

'వేరే పేరేవిఁటీ?-'

'అదే జ్ఞాపకం లేకనేగాదూ అడగటం?'-అన్నాడు క్రంచర్.

'ఛాఛా! - ఇంకో పేరేవిఁటి?'-

'ఛాఛా లేదు గీచా లేదు - చెబుదూ -ఓల్డుబెయిలీ గూఢచారివి, తప్పుడు సాక్ష్యాల నాయాలవు, నిన్ను నేను యెరగనంటగానీ - చెప్పు చెప్పు ఆ పేరేందో!'

'బర్సాద్ - అని మరో కొత్త గొంతు వినిపించింది పక్కనుంచి; సిడ్నీ కార్టన్ అక్కడ ప్రత్యమయ్యాడు.

'ఆఁ!-అదే అదే' అంటూ క్రంచర్ కేకబెట్టాడు.

నల్లటి బారాటికోటు తొడుక్కుని చేతులు రెండూ వెనక్కు ముడుచుకుని సిడ్నీ కార్టర్ క్రంచర్ పక్కనే చిరునవ్వు నవ్వుతూ నిల్చున్నాడు. అతనివంక తెల్లపోయి చూస్తున్న మిస్ ప్రాస్‌తో:

"కంగారుపడకు ప్రాస్ - నేను నిన్న సాయంత్రమే వచ్చాను - లారీగారిని ఆయన మకాంలో కలుసుకున్నాను. ఇక్కడి వ్యవహారాలన్నీ ఒక ముఖానికి వస్తేనేగాని, నేను వచ్చినట్టు యెవ్వరికీ తెలియనియ్యగూడదని అనుకున్నాంలే; ఇంతకీ ఇప్పుడు నీముందు యెందుకు ప్రత్యక్షం కావలసివచ్చిందంటే కొంచెం మీ తమ్ముడితో మాట్లాడవలసిన పని తగిలింది. నీ తమ్ముడికి యింతకంటే మంచివృత్తేదేనా దొరికితే బాగుండేది. - ఈ జైళ్లగొర్రెగా బ్రతికేకంటే' అన్నాడు.

ఆ రోజుల్లో గొర్రె అనే శబ్దాన్ని గూఢచారి అనే శబ్దానికి పర్యాయపదంగా వాడుతూ వుండేవాళ్లు. ఈమాట విని సాల్మన్ ముఖం ఒక్కసారి మతాబైపోయింది. అదో మేకపోతుధైర్యం తెచ్చుకుని సిడ్నీవంక చూస్తూ: 'ఏవిఁటీ?' అన్నాడు.

'ఏవిఁటా - చెబుతాను - తొందరపడతావేం? - ఇప్పటికి ఒకగంటక్రితం నేను కాన్‌సేర్ జరీ కోర్టు జైలుగోడలచుట్టూ తారట్లాడుతూ, తమరు జైల్లోనుంచి బయటికి దయచేస్తూ వుండటం చూశాను. మీ ముఖంలో అదేదో, ఒక ప్రత్యేకత వుంది; మనిషిని ఒకసారి చూశానంటే ఆ ముఖం నాకు యెన్నాళ్లకయినా జ్ఞాపకం వుంటుంది లేండి - ప్రత్యేకం మీ ముఖం యింత జ్ఞాపకం వుంటుంది: ఒకానొకప్పుడు ఒక మిత్రునికి సంభవించిన బాధలకూ ఈ ముఖానికీ కొంత సంబధం వుండటంచేత నాకు బాగా జ్ఞాపకం వుంది. ఇప్పుడు ఆ మిత్రుడు అంతకంటే ఎక్కువ కష్టాల్లో చిక్కుబడి వున్నాడులే- తమరు ఇక్కడ వుండటానికి కారణమేవిఁటా? అని అనుకూలంగా మీవెంటనే అనుసరించి నడిచాను. తమరు సారా దుకాణంలో కూర్చున్నప్పుడు తమపక్కనే కూర్చున్నాను. తమ మిత్రబృందంలో కూర్చుని తాము కోస్తున్న దచ్చీలన్నీ విని, తమరు చేస్తున్న ఉద్యోగ సద్యోగాల సంగతంతా తెలుసుకోగలిగాను - అసలు మీవెంట అనుసరించి రావటంలో మొదట యే వుద్దేశమూలేకపోయినా, తమసంగతి సందర్భాలన్నీ తెలుసుకున్న అనంతరం, వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టనిపించింది.' తమతో ఒక వ్యవహారకాండలోకి దిగే సావకాశం కనిపించింది' అన్నాడు కార్టన్.

'నాతో వ్యవహార మేమిటి?' అన్నాడు గూఢచారి బర్సాద్.

'ఇదిగో చూశారూ? మనం నడివీధిలో నిల్చునున్నాం; ఇలాంటి విషయాలు మనం బజార్లో చర్చించుకోటం, నామాట అలా వుంచండి, మీకంత క్షేమకరమైన సంగతి కాదు. ఒక అయిదారు నిమిషాలపాటు, తమరు గనక నాకు ఏకాంత మిప్పిస్తే రహస్యంగా మనవి చేసుకుంటాను. తమరు నాతో టెల్‌సన్సు బ్యాంకుదాకా దయచేయవలసి వుంటుంది!

'దబాయిస్తున్నారే!-'

'ఛాఛా! ఆ మాటన్నావా?'

'కాకపోతే, అక్కడికి రావలసినంత గరుజు నా కేమిఁటి?'

'రాలేకపోతే ఇక్కడా సంగతి చెప్పేది లేదు-'

'అయితే చెప్పనంటారు'

'ససేమీ చెప్పను - చెప్పవలసిన గరుజు నాకూ యేమంత లేదు-'

ఆ రకం మనిషితో యెలా వ్యవహరించాలో కార్టన్‌కు బాగా తెలుసు. ఆ దబాయింపుతో ఆ గొర్రె యిట్టే లొంగిపోయింది.

బర్సాద్ ప్రక్కన నిల్చునున్న అప్పగారివంక కంటకంగా చూశాను: 'నేను చెప్పినంతా జరిగింది చూశావా? - ఈ వ్యవహారంలో నాకేమైనా ప్రమాదం సంభవించిందంటే అదంతా నీమూలంగానే' అన్నాడు.

'తొందరపడకురా బాబూ!' అన్నాడు కార్టన్. 'పెద్ద వాళ్ళను అలా అగౌరవంగా మాట్లాడటం మంచిదిగాదు. మీ అక్కగారిమీద వుండే గౌరవంచేత యింతదూరం నీతో వ్యవహారానికి దిగవలసివచ్చింది గాని, లేకపోతే తుండూ తుపాకీ నీతో సంప్రదింపనేది లేకుండా నేనే స్వయంగా తేల్చేసేవాణ్ణి; మన కిద్దరికీవీలుగావుండే పద్ధతి ఒక వ్యవహారం చెబుతాను - బ్యాంకుకు పోదాం బయలుదేరు.'

'సరే పదండి' అన్నాడు బర్సాద్.

'ముందు మీ అక్కయ్యని, వాళ్లయింటి సందుమలుపు దాకా దిగవిడిచి మరీ వెడదాం; అక్కా! ఇలా నాచెయ్యిపట్టుకో, ఇది మంచిపట్నంగాదు - నువ్వు ఇలా వీధులవెంట తిరగటం క్షేమంగాదు' - సిడ్నీ తన తమ్ముణ్ణి యే అఖాతంలోకి దింపబోతున్నాడో అనే ఆందోళనతో గజగజలాడుతున్న మిస్ ప్రాస్ పిల్లికూనలా అతనికి చెయ్యి అందించింది.

43

అప్పుడే భోజనం ముగించి, లారీగారు, నిప్పుదగ్గర కుర్చీ వేసుకుని అరికాళ్లు వెచ్చబెట్టుకుంటున్నాడు. ఆయన మనస్సులో తన యౌవ్వనదశనాటి రోజులు తియ్యగా మెసులుతున్నయ్. బర్సాద్‌ను వెంటబెట్టుకుని కార్టన్ లోపలికి అడుగుబెట్టగానే, వాళ్ళ అడుగుల చప్పుడు చెవులబడి చివాల్న వెనక్కు తిరిగి చూచాడు. కార్టన్ వెంటవచ్చిన ఆ కొత్తమనిషి యెవరా అని ఆయనకు ఆశ్చర్యమేసింది. సిడ్నీ కార్టన్ ఆ విషయం గ్రహించి 'మన ప్రాస్ తమ్ముడు - బర్సాద్' అన్నాడు.

'బర్సాద్! - అరే - ఈ పేరెక్కడో విన్నట్టుందే! - ముఖంకూడా యెక్కడో చూసినట్టే అనిపిస్తోంది.'

'నీ మొహంలో అదో తరహా వుందని చెప్పలేదుటోయ్ తమ్ముడూ! - అలా కూర్చో' అన్నాడు కార్టన్, బర్సాద్‌కు కుర్చీ చూపిస్తూ.

తను కూడా మరో కుర్చీలో కూర్చుంటూ, లారీగారికి కావలసిన భోగట్టా యిచ్చాడు: 'సాక్షి - డార్నే విచారణ నాటి సాక్షి' అన్నాడు.

లారీగారికి గుప్పున జ్ఞాపకమొచ్చింది వెంటనే వాడిమీద ఎక్కడలేని అసహ్యం కలిగి, మొహం అదోలా పెట్టేసి పెడగా తిరిగాడు.

'లారీగారూ!-మిస్ ప్రాస్, బర్సాద్‌ను, త్రోవనుపోతుంటే గుర్తుపట్టింది' అన్నాడు కార్టన్- 'మరో చెడువార్త-డార్నేను మళ్లీ అరెస్టుచేశారు'.

ముసలాయన కళవళపడిపోయాడు : 'ఆఁ! - ఏవిఁటీ - అరే ఇందాకేగా - రెండు గంటలసేపన్నా కాలేదే - నేను అక్కడి నుంచి తిరిగొచ్చి.'

'అరెస్టు చేసిన సంగతి నిజమేలెండి - ఎంతసేపయింది బర్సాద్ అరెస్టుచేసీ?'-

'ఇప్పుడే' అన్నాడు బర్సాద్.

'మనవాడు బర్సాద్‌కు అంతా తెలుసులెండి - యితగాడు మరో జైలుగొర్రెతో కూర్చుని తప్పదాగుతూ ఆ విషయం చెబుతుంటేనే నేను విన్నది. మనవాడు డార్నేను జైల్లో పెట్టించే వచ్చాడు; అందులో సందేహమేమీ లేదు.

ఆ మాట్టాడుతున్న కార్టన్ ముఖంలోకి చూస్తే లారీ గారికి విషయమంతా అర్థమైపోయింది. కార్టన్ యేదో కథాక్రమంలోకి దిగటానికి ఉద్యుక్తుడై వున్నట్టుకూడా గమనించాడు. అందుచేత ఆ విషయంపై చర్చపెంచటం మంచిదిగాదని విరమించుకున్నాడు.

'డాక్టర్‌గారి పలుకుబడి రేపుకూడా కొంత అడ్డుపడొచ్చునేమో. బర్సాద్! రేపే గాదూ తిరిగి విచారణ చేస్తారన్నావ్?'

'ఆఁ - రేపే జరుగుతుందనుకుంటాను.'

'రేపుమాత్రం డాక్టర్‌గారి పలుకుబడి యెంతవరకు ఉపకరిస్తుందో - ఈవేళ యేవిఁ ఉపకరించింది? డాక్టర్‌గారు దగ్గిర వుండి కూడా అరెస్టు జరక్కుండా ఆపలేకపోయారు.'

'బహుశా, ఈ సంగతి ఆయనకు ముందుగా తెలియదేమో' అన్నాడు లారీ.

'తెలిసినా తెలియకపోయినా అలా జరగటంమాత్రం ఏదో బీభత్సానికి దారి తీస్తున్నటే కనుపించుతోంది.

'నిజమే' అన్నాడు లారీ, కళవళంగా గడ్డం తడుముకుంటూ.

'ఎలాగైనా ఏదోరకమైన తెగింపుకు దిగాల్సిన సమయంగాని నిద్రపోవలసిన తరుణం గాదు. తెంపుగా పందెంవొడ్డి, తెంపుగా ఏదో ఆటకు దిగితేగాని లాభం లేదు; ఇంతకూ నేను ఇప్పుడు మొదలెట్టదలచిన ఆట యెవరితోనంటే - మన మిత్రుడు బర్సాద్‌తో' అన్నాడు.

'ఎవరితో ఏ ఆటకు దిగినా చేతిలో మంచి పేకముక్కలుండాలి' అన్నాడు బర్సాద్ అదోధీమాగా.

'ఓస్! - వెధవ పేకముక్కల కేవిఁటి? - ఆ మాత్రం సిద్ధపడకుండా వున్నానూ- ఏవంటారు లారీగారూ? - నేను వట్టిలత్తుకోరువెధవనని మీకు తెలీదూ?- కొంచెం బ్రాందీ యేమన్నావుంటే ఇట్టా నా మొహాన పోయించుదురూ!' అన్నాడు కార్టన్.

గ్లాసుమీద గ్లాసు రెండు గ్లాసులు ఒకదానిమీద ఒకటి ఎక్కించి, సాలోచనగా సీసా ముందుకు తోస్తూ ఉపక్రమించాడు, తనలో తను ఆలోచించుకుంటున్న వాడిలాగు:

'ఊహూ! బర్సాద్ - ఒకటి జైలుగొర్రె - రెండు రిపబ్లికన్ ఉద్యోగి - ఒకప్పుడు ఖైదీ - ఇప్పుడు జైలువార్డర్ - జీవితం పొడుగునా గూఢచారిత్వ జీవనం - సరే ఆంగ్లేయుడై వుండటం మరీ బాగుంది - ఇక్కడి ఫ్రెంచి అధికారులదగ్గిర తప్పుడు పేరుజెప్పుకు బ్రతుకుతూవుండడం మరో మాంచి తురుపుముక్క. ఈ బర్సాద్ ఫ్రెంచి ప్రజల స్వాతంత్ర్యాన్ని నాశనం చెయ్యటానికి కంకణం కట్టుకుకూర్చున్న ఆంగ్లేయ ప్రభుత్వం క్రింద వెనక ఉద్యోగం చేసివుండటం అన్నిటికంటె పకడ్‌బందైన అరఖు జాకీ - ఈ బర్సాద్ యిప్పుడు కూడా ఆంగ్లేయ ప్రభుత్వందగ్గిర డబ్బు తీసుకుని ఫిట్ మంత్రిత్వానికి గూఢచారిగా పనిచేస్తూ

వుండవచ్చునని అనుమానించటానికి ఎంతైనా సావకాశం వుంది. ఇంతకంటే జోకరుముక్క యింకేవిఁ కావాలీ! - నాచేతిలో వున్న ముక్క లేవిఁటో తెలిశాయా బర్సాద్.'

'తెలిశాయి గాని మీరు ఆడబోతున్న ఆట యేవిఁటో మాత్రం అర్థం కాలేదు.'

'సరే – ఆసుముక్కను ఆడేస్తున్నాను - దగ్గిరలో వున్న ప్రజాసంఘం ఆఫీసుకుపోయి, బర్సాద్ సంగతి రిపోర్టు చేస్తాం - చూడు తమ్ముడూ ఆ దెబ్బ తట్టుకోడానికి నీదగ్గిర ఏదైనా ముక్కవుందేమో నీ చేతిలోవున్న ముక్క లొకసారి చూసుకో - తొందరలేదు, జాగ్రత్తగా ఆలోచించుకోలే.'

అంటూనే బ్రాంది బాటిల్ అందుకుని మళ్ళీ పెగ్ మీద పెగ్ బిగించుతున్నాడు. ఆ తాగటం చూసి ఆ గూఢచారి గాడు మరింత హడిలి చస్తున్నాడు; ఆ తప్పదాగిన శివంలో వెంటనే పోయి రిపోర్టు చేసేస్తాడేమోనని భయం. వాడు హడలటం గమనించి అదనంగా మరో పెగ్ అందుకుని మరింత మతిపోగొట్టాడు.

'ఏం తమ్ముడూ! - ఏవన్నా తేలిందా?'

నిజానికి కార్టన్‌కు యింకా చాలా విషయాలు తెలియవుగాని, కార్టన్ అంచనా వేసిన దానికంటే బర్సాద్ చెయ్యి యింకా అధ్వాన్నమైన చెయ్యి; ఆటలోకి దిగితే మొత్తం కరారావుడైపోటానికి తగిన దరిద్రపుగొట్టు ముక్కలు బర్సాద్ చేతికి యింకా చాలా వున్నయ్. మితిమీరిన ధోరణిలో అబద్ధాలు చెప్పటంతో, అక్కడ ఇంగ్లండులో ఉద్యోగం వూడింది. అనంతరం ఫ్రాన్సు చేరుకుని మాజీప్రభుత్వం హయాములో గూఢచారిగా చేరి, ఫ్రాన్సులోవున్న ఆంగ్లేయులలో తిరుగుతూ తంపులు రేపుతూ వుండేవాడు. ఆ దశలో సెయింట్ ఆంటోనీ పానశాలమీద గూఢచారిగా నియమించబడి, మాడమ్ డిఫార్జ్ దృష్టిలో పడ్డాడు. మాడమ్ డిఫార్జ్ జాపితాల్లో అతని పేరు కూడా వుంది. అనంతరం లూయీ ప్రభుత్వం కూలిపోవటంతో పేరు మార్చేసుకుని ఫ్రెంచి జాతీయుడుగా చెలామణి అవుతూ మళ్ళీ క్రొత్త ప్రభుత్వంలో కూడా మామూలు జైలుగొర్రె ఉద్యోగాన్ని సంపాదించి వెలుగుతున్నాడు. ఈ గ్రంథం యావత్తూ బయటికి రావటం జరిగితే, అతని తల ఏ గొడ్డలితో ఎరగాక తప్పదని అతనికి స్పష్టంగా తెలుసు. అందుచేత కార్టన్‌తో తటపటాయింపుకు దిగటం ప్రమాదకరమని తెలుసుకుని తెల్లమొహం వేశాడు.

వాడు బిక్కమొహం వేయటం గమనించి కార్టన్: 'ఏం తమ్ముడూ! చేతిలో ముక్కలేవీ ససిగా వున్నట్టు లేవే!'-

బర్సాద్ కార్టన్‌తో మాట్లాడి లాభం లేదని వార్థక్యంతో తల నెరిసి కొంచెం జాలిపేగులమనిషిలా కనుపిస్తున్న లారీగారి వంక తిరిగి బ్రతిమిలాట ప్రారంభించాడు :

'అన్నీ తెలిసిన పెద్దలు మీరు చెప్పండి - నేను గూడఛారి సన్నాసినేననుకోండి - ఆ ఉద్యోగంలో నేను గాకపోతే మరోడైనా వుండేవాడే - యీ తంర్డీ నాకుమల్లే అట్లాంటి గూఢచారి గాడుకదా - నావంటి వెధవల వ్యవహారంలో జోక్యం గల్గించుకోటం ఆయనకు యేవంత మర్యాదగా ఉంటుంది.? కాస్త మీరు ఆయనకి చెప్పండి బాబూ! - నామీద ఆసును వాడతానంటాడు చూడండి ఎంత అన్యాయం'-

'లాభం లేదు బర్సాద్ - అయిదారు నిమిషాల్లో ఆసునువాడి తీరతాను' అన్నాడు కార్టన్, లారీని సమాధానం చెప్పనియ్యకుండా.

'నా అక్క మొహమన్నా చూడరా బాబూ!'

'ఆవిడకి నీ పీడ విరగడచేసి పారెయ్యటంకంటే, ఆవిడకు నేను చూడగల మరో ఆధారం వేరే యేముంటుంది?'

'తమరు అట్టా చేసే మహరాజు కారు లేండి బాబూ!'

'ముమ్మాటికీ చేసి తీరతాను - ఆఁఅన్నట్టు మరోసంగతి - మరో తురుపు ముక్క చేతి కందినట్టుంది - ఇందాక నీతో మాట్టాడుతున్నాడే ఆ రెండో గొర్రె యెవడూ?'

'ఫ్రెంచివాడే - మీరు ఎరుగరు లెండి.'

'ఫ్రెంచివాడేం? - సరే'

'నిజం బాబూ! - ఫ్రెంచివాడే.'

'నీ వన్నట్టు బాగా ఫ్రెంచిభాష మాట్టాడగలడుగాని, ఏలాగైనా కొంచెం యాసవుంది.'

'నాటుపురంనుంచి వొచ్చినవాడు లేండి.'

'తీసెయ్యావోయ్! - తప్పకుండా విదేశీయుడు; ఓల్డు బెయిలీ గూఢచారి, క్లై.'

'మీరు యీ వరసలో తప్పకుండా ఓడిపోయారు - వాడు క్లై మాత్రం కాడు. క్లై ఏనాడో చచ్చాడు. లండన్‌లో పాన్‌క్రాస్ చర్చిలోవాణ్ణి పాతేసి ఏనాడో అయింది. వాణ్ణి స్వయంగా శవపేటికలో వుంచింది యీ చేతులతో. వాడి శవాన్ని శ్మశానానికి తీసికెళ్ళేనాడు ఎంత గందరగోళం జరిగింది? - మీకు తెలీదూ?'

ఇంతలోనే, ఎదురుగావున్న గోడమీద ఒక పెద్ద క్రీనీడ పడ్డది. ఎవరో మనిషి లేచి నిల్చున్నట్టు తోచింది. ఎవరా అని లారీ వెనక్కు తిరిగిచూచాడు. ఈత ముళ్ళు పాతినట్టు నిటారుగా నిక్కబొడిచి నిల్చున్న జిర్రబొచ్చుతో క్రంచర్ కంటబడ్డాడు.

బుకాయించటానికి ఒక అవకాశం చిక్కనే చిక్కిందని బర్సాద్, అదే ధోరణిలో ఉద్ఘాటిస్తున్నాడు:

'మనం యే సంగతేనా సజావుగా మాట్టాడుకోవాలి; చూడండి యింకా కావలస్తే; ఇదుగో! క్లైని భూస్థాపన చేసినట్టు గవర్నమెంటు వారిచ్చిన సర్టిఫికెట్టు - ఆ నాటినుంచి నా నోటు పుస్తకంలోనే దాచివుంచాను - చూడండి యింకా కావలిస్తే అది మజాకా ఫోర్జరీ కాయితం గాదు; గవర్నమెంటిచ్చిన సిసలైన సర్టిఫికెట్టు' - అంటూ జేబులోనుంచి చిన్న కాయితం ముక్క ఒకటి తీసి కార్టన్‌కు అందించాడు.

గోడమీద వున్న క్రీనీడ మరింత బారై లేచి నిల్చుని ముందుకు సాగటం లారీగారు గమనించుతూనే వున్నాడు. క్రంచర్ గదిలోకి అడుగుబెట్టాడు. అతని జుట్టు ఏదుబంది ముళ్ళులా నిక్కబొడుచుకుని వుంది. గూఢచారి అతని రాకను గమనించలేదు. క్రంచర్ నెమ్మదిగా వచ్చి అతని అతని భుజంమీద చెయ్యి వేశాడు.

'ఏంటండీ - ఇంతకీ ఆ ఆ క్లై గాణ్ణి ఆ పెట్టెలో పెట్టామంటారా?'

'ఔను పెట్టాను'

'అయితే యెవురు తీసేశారు?'

బర్సాద్ తెల్లబోయి కుర్చీలో యాలిగిలబడ్డాడ - 'ఇంతకీ నువ్వనే దేవిఁటీ?'

'నేను అనేదేవిటంటే ఆడు అందులో లేడూ అని'-

గూఢచారి తక్కిన యిద్దరి పెద్దమనుషుల ముఖాల్లోకీ తెల్లబోయి చూశాడు; వాళ్లిద్దరూ క్రంచర్ ముఖంలోకి తెల్లబోయి చూస్తున్నారు.

'నే జెబుతాను - నువ్వు ఆణ్ణి పెట్టిలో బెట్టి పాతేశావన్నమాట శుద్ధ అబద్ధం - ఆ పెట్టెనిండా కంకరరాళ్లు తప్ప ఆడెక్కడుండాడు? - ఈ సంగతి నా కొక్కడికేగాదు - మరో యిద్దరు పెద్దమనుసులుకి కూడా తెల్సు - ఈ తట్టుపర్ల మాటలన్నీ నాముంగల చెప్పమాక'-

'నీ కెట్టా దెలుసు?'-

'ఎట్టా దెలిస్తే నీకేం - తెలుసని చెబుతావుంటే; నాబోటి యాపారస్థుల్నీ పెద్దమదుసుల్నీ దగాజేసినందుకు, నిన్నసలు పీకనులిమి చావ నూకాల్చింది.'

ఈ వ్యవహారం, యిలా అద్భుతంగా రక్తిగట్టటంతో లారీతోపాటు ఆశ్చర్యచకితుడై, తెల్లబోయి చూస్తున్న కార్టన్ కొంచెం తెప్పరిలి, క్రంచర్‌ను బ్రతిమలాడాడు - కొంచెం తమాయించుకుని శాంతించమనీ, అసలువున్న సంగతేవిటో తెలిసేటట్టు చెప్పమనీ.

'అదంతా యిప్పుడు చెప్పటానికి యీల్లేదులెండి సావీః! - ఆ పెట్టెలో క్లైగాడి శవంలేదూ అని నేను చెబుతావుండాను - వుండాడని యీణ్ణి గుండెలమీన చెయ్యేసి చెప్పమనండి - ఆమయిన పీకె బిసికి చావనూకుతనో లేదో.' ఆ సవాలు అందుకోటానికి బర్సాద్‌కు దమ్ములు లేకపోయినై. డిక్కముఖం వేశాడు.

కార్టన్ మళ్లీ అందుకున్నాడు: 'అయితే మరో మజా అయిన మణేలా దొరికింది- ఏం తమ్ముడూ ఏవిటి మరి మన ఆట సంగతి?'

'ఓడిపోయాను - మీరేంజెయ్యిమంటే అట్టా నడుచుకుంటాను.'

'ఎబ్బే! నిన్ను ఎక్కువ బాధల్లోకి దించే దేవీఁలేదు - నువ్వు జైలు వార్డరుగా వుంటున్నావు గాదూ.'

'లాభం లేదండీ. జైల్లోనుంచి ఖైదీలను తప్పించగలగటమనేది, అది వీలయ్యే మాట గాదు'-

'ఛాఛా! నేను అడగని మాట నువ్వెందుకు చెబుతున్నావ్?- నువ్వు వార్డరు'

'అవును'

'ఎప్పుడుబడితే అప్పుడు జైల్లోకివెడుతూ వస్తూ వుండొచ్చు?'

'వుండొచ్చు'-

కార్టన్ మరో గ్లాసునిండా సారా నింపి దాన్ని ధారగా ముందున్న నిప్పులో పోస్తున్నాడు. సొంతం ఆఖరైపోయిన తరువాత కుర్చీలోనుంచి లేచాడు.

'ఇప్పటివరకూ మనం యీ యిద్దరి పెద్దమనుషుల ముందూ మాట్లాడుకున్నాం- మరో చివరిముక్క నీతో ఏకాంతంగా మాట్లాడవలసివుంది. అలా ఆ చీకటి కొట్లోకి వెడదాంరా?'

44

సిడ్నీ కార్టన్, ఆ జైలుగొర్రెను వెంటబెట్టుకుని ప్రక్కనున్న చీకటికొట్లోకి తీసుకువెళ్ళాడు. ఆ చీకటికొట్లో కూర్చోబెట్టి ఏదో అతి రహస్యంగా మాట్లాడుతున్నాడు. ఆ మాట్లాడుతున్నదేవిటో యివతలిగదిలో కూర్చునున్న లారీగారికి ఒక్కముక్కైనా వినిపించటంలేదు. ఆయన కట్టెదుటనే గోడకు అనుకుని జర్రీ క్రంచర్, ఏదో దొంగపని చేసినవాడిలాగు గోళ్ళు కొరుక్కుంటూ గిజాటుగా నిల్చునున్నాడు. అతని మనసు మనసులోలేదు. లారీ అతని ముఖంలోకి అదో అనుమానంగా చూస్తున్నాడు. ఆయన అలా చూస్తున్నకొద్దీ, క్రంచర్ మరింత గాబరాగా కాళ్ళు తొక్కుకుంటున్నాడు. మధ్యమధ్య, మనస్సులో వున్నదాన్ని దేన్నో బయటికి వెలిగక్కటానికి తాపత్రయపడుతున్నవాడిలాగు పొడిదగ్గు దగ్గుతున్నాడు.

'జర్రీ! - ఇలా దగ్గిరికిరా!' అని పిల్చాడు లారీ.

క్రంచర్ జంకుజంకుగా దగ్గిరికి వచ్చాడు.

'బ్యాంకు ఉద్యోగంగాక ఇంకేం వృత్తి చేస్తూవుండేవాడి వేవిఁటి?'

క్రంచర్ యజమాని ముఖంలోకి భయం భయంగా చూస్తూ, ఏ సమాధానం చెప్పటానికి తోచక కొంచెంసేపు నీళ్లు నమిఁలాడు- అనంతరం అతనికి ఒక ఉజ్జ్వలమైన ఊహ తట్టింది:

'వ్యవసాయం మోస్తరు పనేదో చేస్తూవుండేవాణ్ణి' అన్నాడు.

'ఆఁ! - ఇదేదో చాలా అనుమానంగానే వుంది. టెల్‌సన్సు బ్యాంకు గౌరవ మర్యాదలు అడ్డంబెట్టుకుని నువ్వేదో తప్పుడుపన్లు చేస్తూ వుండేవాడివల్లే వుంది. నిజంగా అలాంటిదేదైనా వుంటే నిన్ను నేను సహించుతాననుకోకు. ఇంగ్లండుకు తిరిగి వెళ్ళగానే ఆ సంగతేదో తేల్చేస్తాను. టెల్‌సన్సు సంస్థపట్ల మోసం జరగటం మాత్రం నేను ఎన్నడూ సహించను' అన్నాడు లారీ, కోపంగా.

'ఏలినోరు చిత్తగించాలి!-ఒకేళ నేనేదన్నా యెదవపని చేశానే అనుకోండి, చేస్తేమాత్రం తమంటి పెద్దమదుసులు ఒకటికి రెండుసార్లు ఆలోచించకుండా నాబోటోళ్ళ పొట్టమీద గొట్టెయ్యడమేనా బాబూ?- యెదవపని చేశాననిగాదు నేననేది; ఒకేళ చేశానే అనుకోండి మరిపొట్టమీద కొట్టెయ్యడమేనా అని? అయినా ఒకటి చెబుతా యినండి బాబూ! యే చెడ్డపనేనా ఒక్కడే జేసేడిసే దేవుంది - చేయించే వోరు వోరుంటేగెందా చేసేవోడుండేది? మీరెరగందే వుండది బాబూ! డాక్టర్లుండారనుకోండి - ఆళ్లు దోసిళ్లకు దోసిళ్లు డబ్బు దిమ్మరించుకుంటావుండారు - వుట్టిపుణ్యానికి; నాబోటి మర్యాదస్తుడైన యాపారస్తులు దమ్మిడీ సంపాయించాలంటే చావుతెంపులొద్దిమరి - దమ్మిడీ యేటుండీ, టోలీపుట్టడం గగనం. అట్టాంటి వోళ్లంతా బళ్లుగట్టుకుని బ్యాంకుకువస్తా పోతావుండేది, ఆడ నాబోటి, నిజాయితీగల యాపారస్తుడెవుడేనావుంటే కన్నుగొట్టి బండిదగ్గిరికి బిల్చి గుసగుసలాడేదీ- అట్టాంటి వోళ్ళందర్నీ వొగ్గేసి నాబోటోళ్ళని నలిపెయ్యడం అదేవంత ధర్మం బాబూ? బ్యాంకుపనిమీద వొచ్చినట్టు నటించి అట్టాటిపనులు జెయ్యటం అదిమాత్రం బ్యాంకుని మోసం జెయ్యటంగాక మరేంది? నా ఆడది వుండదనుకోండి, వొట్టిసన్నాసి - అసలు యేదో పూర్వపు అగ్గేనకాలంలో బుట్టాల్చిన మడిసిగాని ఈ రోజుల్లో బుట్టాల్సిందిగా దనుకోండి; నాశనమైపోయే పాడుపనులన్నీ జేత్తావుంటది. డాక్టర్ల ఆడోళ్లూ పాడుపనులు జేత్తారనుకోండి - యేపాడుపనులు జేసినా, ఆళ్ళమొగాళ్ళకి పదిమంది రోగులు దొరికి పదిడబ్బులురాలే పనులు జేత్తారు; ఈళ్లే ననుకుండారా యేంటి? - ఇంకా యెంత మందుండారు. ఈ యాపారంలో దిరిగే దళారీలూ,

చర్చి గుమాస్తాలూ, చర్చి కావలావోళ్లూ ఎంతమంది - ఇంతమంది నోళ్లూ గొట్టాల్చివొచ్చేతలికి - నిజాయితీగల నాబోటి అసలు యాపారస్తుడికి మిగిలేదేందీ అని? - లేదు సావీఁ అట్టాంటి యాపారఁలో దిరిగే వోడికి మిగిలిచచ్చేది వుండదు - ఆగుబాగుపడి చచ్చేదీ వుండదు. లేకపోతే ఆ యాపారంలోనుంచి బయటపడలేక, తన్నుకు చావటంగాని-

'చచ్చా! అరి దుర్మార్గుడా - నువ్వు ఎదట కనుపిస్తుండే నాకు యెంత కంపరంగా వుందీ?' అన్నాడు లారీ.

'ఇంతకీ నేను మనవిజేసుకుంటా వుండాదేవిటంటే - నేను జేసింది యెదవపనే అవుతదనుకోండి - అది యెదవపని అనిగాదు నేననేది-'

'పూసిపెట్టాలని చూడకు'

'పూసిపెట్టడం దేనికి లేండి బాబూ! - ఇంతకీ నామనివోటి చిత్తగించాల బాబూ!- యెదవ పనిగాదూ అంటావుండానూ - తవుర్లాటోరు యెదవపనేనంటారనుకోండి - నా వుద్దేగం ఊడ బీకించుతారే అనుకోండి - నన్ను దీసేస్తే దీసేసేరుగాక - ఆ వుద్దేగం మళ్లా నాకుర్రోడి కిప్పించండి - కుర్రోడనుకునేరు; పెద్దోడయ్యాడు. ఏ పనిజెపితే ఆ పని చటకాలమీన జేసి పారనూకేలా, తరిబీతు జేసిన్ను బాబూ! - ఆ ఉద్దోగం మాత్రం ఆడికిప్పించండి - తండ్రి ఉద్దోగం కొడుక్కిచ్చినట్టొద్ది. ఆడైనా ఆడితల్లి కింత కూడుబడేత్తుడు. నా దోవేదో నే జూసుకుని ఆ తొవ్వాటం యాపారంలోనే దిరుగుతాను- అదీ నేను యేలినోరికి మనివిజేసుకుంటా వుండది'-

'సరేలే - తరువాత ఆలోచిద్దాం - ఇప్పటికి ఆపెయ్' అన్నాడు లారీ.

ఈలోగా కార్టన్ గూఢచారిని వెంటబెట్టుకుని చీకటి గదిలోనుంచి బయటికొచ్చాడు:

'వ్యవహారం అంతా పరిష్కారం చేసుకున్నాం గనుక, ఇక నన్నుగురించి నీవు భయపడాల్సింది యేమీలేదు - వెళ్ళిరా బర్సాద్!' అన్నాడు కార్టన్.

వాడిని బయటికి పంపేసి, కార్టన్ కుర్చీ లారీగారికి దగ్గిరగా లాక్కుని నెగడుముందు కూర్చున్నాడు. క్రంచర్ కూడా బయటికి తప్పుకున్నాడు.

'ఇంతకీ యేవిఁయేర్పాటు చేసినట్టు?' అని ప్రశ్నించాడు, లారీ.

'ఏం చెయ్యగలం - డార్నే వ్యవహారం ప్రమాదకరంగా పరిణమించే పక్షంలో, అతనితో కలసి మాట్లాడటానికి అవకాశం మాత్రం సంపాదించాను - అంతే' -

లారీ ముఖ కవళికలన్నీ నిరాశతో మాడిపోయినై.

'అంతే - అంతకంటే యేవీఁ సాధించలేకపోయాను. మరీ వొత్తిడిచేస్తే అసలు మొదటికి చెడుతుంది. పీకె తెగుతుందని వాడే అంటున్నాడు గదా - మనం వీడి సంగతి బయటబెట్టినా పీకె తెగటంకంటె వాడికివొచ్చే పెద్దప్రమాదం యేఁవుంటుంది? అందుచేత అంతకంటే వాణ్ణి త్యాగం చెయ్యమని వత్తిడిచేసే అవకాశం లేకపోయింది. ఇంతకీ ఉన్న పరిస్థితి అల్లాంటి గడ్డు వ్యవహారం - ఇంతకంటే చేయగలిగిందేవీ కనుపించలేదు.'

'లారీ దిగులు దిగులుగా దించుకుపోయిన కళ్ళతో నిస్పృహగా నిప్పులోకి చూస్తున్నాడు. లూసీమీద ఆయనకు మితిలేని అనురాగం వుంది. ఆ బిడ్డకు సంభవించిన ఆపదలు

తలుచుకుంటే, ఆయన నరాలన్నీ కుదబడి పోతున్నయ్. డార్నేను మళ్లా అరెస్టు చెయ్యటంతో ఆయన మరింత నిరాశగా దిగజారిపోయాడు. ఆయనలో దాగివున్న ముసలితనమంతా ఆ హతాశలో బయటపడిపోయింది. హృదయంలో రేగుతున్న ఆందోళనను కమ్ముకోవటానికి శరీరమంతా ముడుచుకుని చుట్టలుజుట్టుకుపోయి కుర్చీలో కుదపడి కూర్చున్నాడు. ఆయన కనుకొలకుల వెంట కన్నీరు దిగజారుతోంది.

'లారీగారూ! మీరు ఉదారహృదయులు - మీరు మనసులో పడుతున్న బాధంతా నాకు తెలుసు. తండ్రికన్నీరు కారుస్తుంటే, నాకేమీ పట్టన్నట్టు, నిర్లక్ష్యంగా ప్రక్కను కూర్చునుండగల తాహతు నాలోలేదు - నావంటి దుస్సంతానాన్ని కనేదౌర్భాగ్యం మీకు పట్టలేదనుకోండి - అయినా మీరు నాతండ్రిలాంటివారు - మీరు కన్నీరు విడుస్తుంటే నేను చూళ్లేను'

కార్టన్‌కు అలాంటి మెత్తని మనస్సు ఉన్నట్టు లారీగారు అతఃపూర్వం యెన్నడూ అర్థం చేసుకోలేకపోయాడు. కొనగోట కన్నీరు తుడుచుకుంటూ, అతనికి చెయ్యి అందించాడు.

'ఇలాంటి యేర్పాటు జరిగినట్టు లూసీతో అనబోకండి' అన్నాడు కార్టన్. 'ఇందువల్ల పాపం లూసీ డార్నేను చూసే ముందుగా అతనికి తెలియపరిచి మరింత వ్యథను కల్పించటం మినహా, దానివల్ల మరో ప్రయోజనమేమీలేదని ఆవిడ మరింత పరివేదన పడవచ్చు - అంతేగాదు యింకా పరిపరివిధాల యోజించి మరింత బాధపడొచ్చు. వట్టినే మనస్సులో చిచ్చు పెట్టినవాళ్ళమవుతాం. ఆవిడ యెదటబడటం నాకు ఇష్టంలేదు. ఆ సంగతి నేను వచ్చినవెంటనే తమతో మనవిచేశాను. చాటున వుండే, నేను చేయగలిగిన సహాయ మేదైనావుంటే ప్రయత్నించాను - ఈ సంగతిమాత్రం లూసీతో అనకండి - బహుశా మీరిప్పుడు లూసీని చూడ్డానికి వెడుతున్నారనుకుంటాను. పాపం ఈ రాత్రంతా చాలా ఆందోళన పడుతూవుంటుంది'-

'అవును - ఇప్పుడే బయలుదేరి వెడుతున్నాను.'

'సంతోషం - మీరు దగ్గిరుంటే ఆవిడకు పంచప్రాణాలూ లేచివస్తయ్. ఇప్పుడు ఎలా వుందో.'

'దుఃఖంలో మునిగివుంది - కాని ఎంత దుఃఖంలోవున్నా ఆ తల్లి సౌందర్యం యెక్కడ దాగుతుంది' అన్నాడు లారీ.

'హూఁ-' బాధగా ఒక పెద్ద నిట్టూర్పు విడిచాడు కార్టన్.

లారీ అతని ముఖంలోకి తెల్లపోయి చూశాడు. ఆ నుదురు మీదయేదో ఒక భావరేఖ, జిగేల్‌మని మెరుపులా మెరిసి మళ్ళీ యిట్టే అదృశ్యమైపోవటం లారీ గమనించాడు. కార్టన్ నెమ్మదిగా కుర్చీలోనుంచిలేచి: 'బయలుదేరతారామరి' అన్నాడు.

'నీవుకూడా బయలుదేరబోతున్నావా యేమిటి?'-

'మీతోపాటువచ్చి అందాకా గేటుదాకా పంపిస్తాను. అక్కడినుంచి అలా కాస్త ఆ వీధివెంటా. ఆ వీధివెంటా తిరుగుతాను - దేశ దిమ్మరివాణ్ణి మీకు తెలియందేవుంది - కాళ్లు ముడుచుకుని స్థిమితంగా ఒకచోట కూర్చోలేను. తెల్లవారే దాకా మళ్లా యిల్లు

జేరుకోలేకపోయినా ఉదయమన్నా వచ్చి దర్శనం చేసుకుంటాను; మరేం అనుకోబోకండి. రేపు మీరు కోర్టుకు వెడతారు గాదూ?’

‘వెడతాను’

‘నేనుకూడా వచ్చి జనంలో నుంచుంటాలెండి. గూఢచారి నాకు జాగా చూపిస్తానన్నాడు. పెద్దలు ఇలా నాచెయ్యిబట్టుకోండి’

లారీ అతనిభుజంమీద చెయ్యివేసి నెమ్మదిగా - బయలుదేరాడు. ఇద్దరూ కలిసి మెట్లు దిగి వీధిలోకి వెళ్లారు అయిదారు నిమిషాల్లో లూసీవాళ్ళూ వుంటూన్న యింటిదగ్గిరికి చేరుకున్నారు. కార్టన్ ఆయన్ను లోపలికి పంపించి పది అడుగులు యివతలికివచ్చి, మళ్లా వెనక్కు తిరిగి చూచాడు: ‘లూసీ, రోజూ జైలుదగ్గరికివెళ్లి అతన్ని చూచి వచ్చేదట. ఈ గేటులోనుంచి యిలాగే బయటికివచ్చేది. ఇలాగే యీసందు మలుపు దిరిగేది. రోడ్డుమీదవున్న ఈ శిలలన్నీ లూసి పాదాలను స్పృశించివుంటై. సరే! లూసీ అడుగుజాడలను అనుసరించే నేనూ బయలుదేరిపోతాను.

కార్టన్ లాఫోర్స్ జైలుముందుకు జేరేసరికి దాదాపు రాత్రి పదిగంటలు కావచ్చింది. మామూలుగా లూసీ నిల్చునే చోటికేపోయి నిల్చున్నాడు. అక్కడ కట్టెలు గొడుతూవుండే ముసలాడు కనుపించాడు. వాడు పని ముగించుకుని, పాక గేటుముందు స్థిమితంగా కూర్చుని చుట్టగాల్చుకుంటున్నాడు. వాడుతనవంక పసిగట్టినట్టు చూస్తూండటం గమనించి కార్టన్, కొంచెం దగ్గిరగా వెళ్ళి.

‘నమస్తే తాతా’ అన్నాడు.

‘నమస్తే’

‘ప్రజాప్రభుత్వం ఎలా నడుస్తోంది’-

‘**గెలటైన్** సంగతేనా - దానికేం బలేగా నరికేస్తా వుండది - ఇయ్యాల అరవైముగ్గురు. రేపట్నుంచి వందదాకా కూడా తెగొచ్చు. ఆడు శామ్‌సన్ వొట్టి చచ్చుయెదవ. చేతులు నొప్పెడతావుండా యంటాడు. నీకట్టూ జుట్టూ అంతా ఇంగిలీ సోడికి మల్లే వుండావుగాని నిజానికి యింగిలీసోడివి గాదల్లేవుందే?’

‘అవును’

‘ఫ్రెంచి భాష ఫసందుగా మాటాడుతుండావులే - అందుకూ’

‘చిన్నప్పుడు ఇక్కడ ఫ్రాన్సులో చదువుకున్నాను.’

‘అచ్చు, యీదేశపోడివి మల్లేనే మట్టాడుతుండావ్ - యెల్లొచ్చేదా?’

ముసలాడు అవతలికి వెళ్లిపోయిన అనంతరం, కార్టన్‌కూడా అక్కడినుంచి బయలుదేరాడు. వీధి వెంట కొంతదూరం పైకి నడిచి అక్కడున్న లాంతరు స్తంభందగ్గిర ఆగాడు. జేబులోనుంచి చిన్ని కాయితం ముక్క బయటికిదీసి, దీపం వెలుగులో ఆ చీటీ మీద యేవోరెండు ముక్కలు రాసి మళ్ళా జేబులో బెట్టుకున్నాడు. సందులూ గొందులూ దాటి గబగబా ఎక్కడికో నడిచిపోతున్నాడు. అలాపోయి పోయి ఒక మారుమూల చీకటి సందులోవున్న చిన్ని మందుల దుకాణం ముందు ఆగాడు. ఆ దుకాణంలో, ఆ రాత్రివేళ చిన్ని దీపం వొకటి మినుకు మినుకుమంటూ వెలుగుతోంది. అమిత వికృతంగావున్న ఆ దుకాణదారు, గోళ్లు గిల్లుకుంటూ ఒక్కడే కూర్చున్నాడు.

సిడ్నీ కార్టన్ సరాసరి లోపలికివెళ్లి జేబులో వున్న కాయితం ముక్కతీసి దుకాణదారుకు అందించాడు. ఆ గుడ్డిదీపం వెలుగులో కళ్లు చికిలించి ఆ చీటిచదువుకుని దుకాణదారు ఏదో గతుకుతున్నవాడులాగు: ‘అయ్యో బాబోయ్!’ అని గుండె బాదుకున్నాడు.’

ఆ ఆశ్చర్యార్థకాన్ని కార్టన్ లక్షించకపోవటం గమనించి మళ్లాతగ్గి: ‘చిత్తం - తమకేనా అండి?’ అన్నాడు.

‘అవును నాకే-’

‘వీటిని మాత్రం ఒక దాంతో ఒకటి కలపబోకండి - కలిపితే ప్రమాదం సంభవిస్తుందని తమకి తెలుసుననికుంటాను’

‘తెలుసు తెలుసు - ఫరవాలేదు యివ్వు’

దుకాణదారు యేవో చిన్ని చిన్ని పొట్లాలు విడివిడిగా కట్టి కార్టన్‌కు అందించాడు. కార్టన్ వాటిని, కోటులోపలి జేబుల్లో భద్రపరుచుకుని వాటి మింజువలే యివ్వవలసిన డబ్బు లెక్కజూసి యిచ్చేసి బయటికివచ్చేశాడు. ‘ఈవేళకు చేయవలసిన పనులన్నీ పూర్తి అయినట్టే; నిద్రమాత్రం పట్టేట్టులేదు’ అనుకుంటూ వీధులవెంట బయలుదేరాడు.

రాత్రిచాలా నిరామయంగావుంది. చంద్రుడు జేగీయమానంగా వెలుగుతున్నాడ; మబ్బులు గగనపథాన పరుగులు బెడుతున్నయ్. కిటికీలలోనుంచి దీపాలు మినుకు మినుకుమంటూ కనుపించుతున్నయ్. ఆ గదులనిండా జనంపడుకుని వొళ్లుమరిచి నిద్రపోతున్నారు. మానవలోకపు సంక్షోభాన్నంతా మరిచేసి ఆ నాలుగు మూడు గంటలూ ఊపిరి విడుచుకుంటున్నారు.

ఆ విధంగా కార్టన్ తెల్లవార్లూ పారిస్ నగరవీధులన్నీ పిచ్చివాడులా తిరిగేశాడు; తెలతెలవారిపోతున్న సమయంలో సైయినీ నది గట్టునే పడి కొంతదూరం నిర్జన ప్రదేశానికి నడిచాడు; కొంతదూరం పోయి, అక్కడ నదిగట్టుమీద బోర్లగా పడుకుని నిద్రపోయాడు.

అతనికి మళ్లా నిద్ర మెలుకువచ్చేసరికి, బాగా బారెడు ప్రొద్దెక్కింది. సరాసరి బయలుదేరి లారీగారిమకాముకు వచ్చేశాడు. అతను వచ్చేసరికే లారీ బయటికివెళ్ళిపోయాడు. కార్టన్ కొంచెం కాఫీ గొంతులో పోసుకుని తానుకూడా కోర్టుకు బయలుదేరాడు.

కోర్టుహాలు జనంతో కిటకిట లాడిపోతోంది. మన గూఢచారి కార్టన్ను తీసుకువచ్చి జనంలో ఒకమూలగా నిల్చోబెట్టాడు. కోర్టులో లారీ, డాక్టర్ మానెట్, ఆయన ప్రక్కగా లూసీ, అంతా కనుపిస్తున్నారు.

చార్లెస్ డార్నేను తీసుకువచ్చి విచారణసంఘం వారి ముందు నిల్చోబెట్టారు. అతను కట్టెదుట కనుపించగానే, అతనికి ధైర్యోత్సాహాలు కలిగేలాగు, లూసీ అతని ముఖంలోకి మిసమిసా చూచింది. డార్నే ముఖం సంతోషంగా విప్పారుతోంది. ఆ విషయాన్ని కార్టన్ దూరాన్నుంచే అవగతం చేసుకుంటున్నాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ లేచి, ముద్దాయిమీద యీ విధంగా నేరారోపణ చేశాడు:

‘డార్నే అని పిలవబడుతున్న చార్లెస్ ఎవ్రీమాండ్ అనే యీముద్దాయి,

ప్రజావిద్రోహులూ, ప్రజలమీద అనేక ఘాతుక చర్యలు జరిపినవారూ అయిన ఒక జమీందారీ కుటుంబానికి చెందివున్నాడు. ఆ జమీందారీ కుటుంబాన్ని ప్రజావిద్రోహులుగా నిర్ణయించి నిర్మూలింపబడవలసిన వాళ్ళుగా రిపబ్లిక్ ప్రభుత్వం ప్రకటించివుంది. ఆ శాసనం ప్రకారం ముద్దాయికి కోర్టువారు మరణశిక్ష విధించవలసివుంది.'

'ముద్దాయిమీద బహిరంగంగా నేరారోపణచేస్తున్న దేశభక్తులు యెవరేనావున్నారా?' అని విచారణ సంఘం అధ్యక్షులు ప్రశ్నించారు.

'ఉన్నారు'-

'ఎవరు?'-

'ముగ్గురూ - మొదటివారు సెయింట్ ఆంటోనీ వీధిలోని పానశాల యజమాని ఎరనెస్టు డిఫార్జ్'

'బాగుంది'

'రెండవవారు, ఆయన భార్య మాడమ్ డిఫార్జ్'

'సరే మూడోవారూ?'

'మూడోవారు - డాక్టర్ ఎలెగ్జాండర్ మానెట్!'-

'ఆఁ యేమిటీ! నేనా!!' అంటూ డాక్టర్ మానెట్ కంగారుగా లేచి నిల్చున్నాడు.

'అయ్యా! యిదంతా వట్టిమోసం!- దగా! శుద్ధదగా- ముద్దాయి నాకూతురుకు భర్త అనే సంగతి కోర్టువారికి తెలుసు - నాబిడ్డ భర్తను నా ప్రాణానికంటే ప్రియతముడుగా భావిస్తున్నాను. నా అల్లుడిమీద నేను నేరారోపణ చేస్తున్నాని యిప్పుడు యిక్కడ చెప్పిన మనిషి యెవడు? వాడు వట్టి దగుల్బాజీ మనిషి! వట్టి దగాకోరు' అంటూ గోలబెట్టాడు.

'డాక్టర్ గారూ! మీరు కొంచెం శాంతించండి; కోర్టువారి అధికారాన్ని శిరసావహించ లేకపోతే, మీరుకూడా ప్రభుత్వశాసనాన్ని ధిక్కరించిన వారు కావటం మినహా మరో ప్రయోజనం వుండదు. ముద్దాయి తమకు ప్రియతముడేకావచ్చు; కాని రిపబ్లిక్ పౌరుడైన ప్రతి పెద్దమనిషికీ రిపబ్లిక్ ప్రభుత్వం అత్యంత ప్రియతమమైనది.' అన్నాడు, ప్రభుత్వన్యాయవాది.

'రిపబ్లిక్ ప్రభుత్వం, ఒకవేళ, మీబిడ్డనే త్యాగం చెయ్యమన్నా మీరు అలాంటి త్యాగం చెయ్యటానికి సిద్ధపడి వుండవలసివుంటుంది: స్థిమితంగా కూర్చుని మిగతా సంగతులు కూడా వినండి! అందాకా నిశ్శబ్దంగా కూర్చోండి' అని ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ గారిని మందలించారు.

ఏమిచెయ్యటానికీ తోచక, వెర్రివాడులా కోర్టు హాలు యావత్తూ కలియజూస్తూ డాక్టర్ మానెట్ కూర్చుని పోయాడు.

ఇంతలో ఫిర్యాది డిఫార్జ్ జరిగిన కథనంతా వరసని చెప్పుకొస్తున్నాడు, తాను డాక్టర్‌గారి దగ్గిర నౌకరీచేసిన నాటినుంచీ; డాక్టర్ గారు బాస్టిల్లీ జైలునుంచి విడుదలకావటం, తనకు వప్పగింత చెయ్యబడటం, అనంతరం, తిరుగుబాటు సమయంలో తాను, తన ప్రజాసముదాయంతో వెళ్లి బాస్టిల్లీ జైలును ముట్టడించటం - ఇంతవరకూ చెప్పాడు.

బాస్టిల్లీ సంగతిరాగానే - 'బాస్టిల్లీ విప్లవీరుడికీ జై!' అని జనంలోనుంచి ఒక గావుకేక వినిపించింది. తల విరబోసుకుని వాళ్లు తెలియని వీరావేశంతో, ప్రతీకారిణి గుంపులోనుంచి కోర్టు వారి ముందుకు తోసుకొచ్చింది.

డిఫార్జ్ బావా! నువ్వు వీరాధివీరుడివి, పరమ దేశభక్తుడివి. ఫిరంగిగుళ్లు పేల్చి బాస్టిల్లీని విధ్వంసంచేసిన విజయవీరుడువి. చెప్పు!- ఆనాటి నీ వీరగాధంతా కోర్టువారికి తెలిసేలా చెప్పు'

'సైలెన్స్'! - అంటూ విచారణసంఘం అధ్యక్షుడు గంట మోగించాడు.

'ఛట్! వెధవగంట! ఆ వెధవమోతకు ధిక్కారం చెబుతున్నాను' అనేసింది ప్రతీకారిణి; 'చెప్పుబావా చెప్పు! ఆ వేళ బాస్టిల్లీలో నువ్వు, చూసిందంతా చెప్పు.'

డిఫార్జ్ కొంచెం విజయసూచకంగా మీసం మెలిపెట్టి చేరువలో నిల్చునున్న భార్యవంక అదో రీవిగా చూసి మళ్ళా మొదలుబెట్టాడు:

'బాస్టిల్లీ ఖైదులో డాక్టర్ మానెట్‌ను ఖైదుచేసి వుంచినగది నార్త్‌టవర్‌లోని నూటా అయిదోగది; డాక్టర్ గారువిడుదలైనప్పుడు ఆయన పేరే ఆయనకు స్మృతి తప్పినస్థితిలో వున్నాడు. నీపేరేవిటంటే నూట అయిదూ నార్త్‌టవర్ అంటూ వుండేవాడు. బాస్టిల్లీమీద దాడి జరుగుతున్న సందర్భంలో ఆ దుర్గం పతనం కాగానే, ఆ గదిని పరిశోధించి చూడాలని నాకు అభిలాష కలిగింది. దుర్గం పతనమైపోయింది. నేనూ, ప్రస్తుతం జూరిపెద్దలలో కూర్చునివున్న మరోమిత్రులూ వెళ్ళి ఆగదిని పరీక్షించాం. గదికి పైవేపుగావున్న పొగ గూటిలోని ఒక తొర్రలో ఈ కాయితం ముక్క కనుపించింది. 'ఇది డాక్టర్ గారి స్వదస్తూరిలోవున్న కాయితం. దాన్ని కోర్టువారి సముఖాన దాఖలు చేసుకుంటున్నాను.'

45

ఆ లేఖను పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇలా చదివి వినిపించాడు:

'బీవాయ్ వాస్తవ్యుడు, అనంతరం పారిస్ నివాసి, అయిన, దురదృష్టవంతుడు డాక్టర్ అలెగ్జాండర్ మానెట్ అనే నేను, 1767 సంవత్సరం డిశంబరుమాసంలో, బాస్టిల్లీ ఖైదులోని ఈ చీకటికొట్లోవుండి, అవకాశందొరికిన సమయాల్లో ఈ విషాదగాథను వ్రాస్తున్నాను. ఈ లేఖను పూర్తిచేసి పైనున్న పొగగూటిలో, నేను యిందుకుగాను ప్రత్యేకం తయారుచేసిన కన్నంలో దీన్ని భద్రపరచాలని యత్నించుతున్నాను. అలా చేయటంవల్ల, నేనూ నా కష్టాలూ మట్టిలోకలసి నశించిపోయిన అనంతరం, యెప్పుడైనా ఒకప్పుడు, యీ కాయితం యే సహృదయునిచేతిలోనైనా పడవచ్చుననే ఆశాలేశంతో ఈ పని చేస్తున్నాను.

'ఇప్పటికి నన్ను ఈ ఖైదులో బెట్టి పది సంవత్సరాలైంది. ఈ పదో సంవత్సరం చివరిమాసంలో, పైనున్న పొగగూడునుంచి రాలిన మసిని రక్తంలో రంగరించి తుప్పుపట్టిపోయిన ఈ ఇనపములికి సహాయంతో ఈ అక్షరాలు ఏదోవిధంగా గిలుకుతున్నాను. మనస్సులోనూ కనుపించుతున్న సూచనలనుబట్టి, యిక యెక్కువ కాలం నా మెదడు పనిచేయదని నాకు తెలిసిపోతోంది. కాని యిప్పుడుమాత్రం నేను సరియైన వ్యక్తతలోవుండి భగవంతుని ముఖంచూసి, సత్యప్రమాణమైన ఈ విషయాన్ని అక్షరరూపంలో వెలిబుచ్చుతున్నాను.

* * *

ఆవేళ మబ్బుపట్టి కొంచెం మసక వెన్నెలగా వుంది 1757వ సంవత్సరం డిశంబర్ 22వ తేదీ అని జ్ఞాపకం. నేను సైనీ నదితీరానికి షికారువెళ్ళి ఒంటరిగా వస్తున్నాను. అప్పట్లో నేను వైద్యకళాశాల వీధిలో వుంటూవుండేవాణ్ణి. మా యింటికి నేను షికారు వచ్చిన స్థలానికి దాదాపు మూడు నాలుగు మైళ్ళ దూరం వుంటుంది. నేను వస్తూవుండగా ఆ గుడ్డి వెన్నెలలో, నా వెనకనుంచి యేదో ఒక బండి వస్తున్నట్టు గమనించాను. బండివాడు గుర్రాల్ని అదలించుతూ బండిని ఆఘమేఘాలమీద తోలు కొస్తున్నాడు. ఆ బండి నా మీదగా పోతుందేమోననే భయంతో పక్కకు తప్పుకున్నాను. బండి నా సమీపానికి రావటంతోటే ఎవరో ఒకాయన బండిలోనుంచి తల బయటబెట్టి నావంకచూసి, బండి ఆపమని బండివాణ్ణి కేకబెట్టాడు.

'బండి పది గజాలు ముందుకుపోయి ఆగింది. బండిలోవున్న పెద్దమనిషి నన్ను పేరుబెట్టి కేకవేశాడు. నేను బండిదగ్గిరికి చేరుకునేలోగానే, బండి తలుపు తెరుచుకుని యిద్దరు పెద్దమనుషులు క్రిందికి దిగారు. ఆ యిద్దరూ ఆపాదమస్తకం పెద్దకోట్లు తొడుక్కుని, గుర్తు తెలియకుండా వుండటానికి ప్రయత్నించుతున్న వాళ్లులా కనుపించారు. వాళ్లు యిద్దరూ షుమారు నా వయస్సులోనే వున్నారు. ఇద్దరూ ఒకే పోలికలో వున్నారు.

"డాక్టర్ మానెట్ మీరేనా?" అని యిద్దరిలో ఒకరు ప్రశ్నించారు.

"అవును."

"బీవాయ్ డాక్టరనీ శస్త్రచికిత్సలో అఖండులనీ పారిసంతా చెప్పుకుంటున్న డాక్టరు మీరేనా?" అని రెండోవాడు ప్రశ్నించాడు.

'మీరు నా సహాయం కోరివచ్చారు గనుక మీరెవరో తెలిసికోవటంలో తప్పులేదనుకుంటాను - ఇంతకూ నేను చికిత్స చేయవలసిన వ్యాధివిషయం కూడా యేమీ చెప్పారు కారు'-

'ఏదో యింత గౌరవమర్యాదలున్న కుటుంబంలో వాళ్ళమే లెండి - వ్యాధి సంగతేవిటో మేము చెప్పేదానికంటే మీరే స్వయంగా పరీక్షించితే బాగుంటుంది. దయవుంచి బండిలోకి యెక్కుతారా?"-

వాళ్లు చెప్పినట్టు చెయ్యటం మినహా నాకు మరోమార్గమేమీ తోచలేదు. కిక్కురుమనకుండా లోపలికి యెక్కి కూర్చున్నాను. బండితిరిగి ఆఘమేఘాలమీద వెళ్ళిపోతోంది.

'బండి పారిస్ వీధులన్నీ అతిక్రమించి పోతోంది; నార్త్ బారియర్ దాటి పొలాలగుండా వెడుతున్నాం. అలా యెంత దూరం ప్రయాణం చేశామో చెప్పలేను. బండి యెకాయెకి వెళ్ళి, నిర్జనప్రదేశంలో యేకాంతంగావున్న ఒక భవంతిముందు ఆగింది. ముగ్గురం బండిదిగి ఉద్యానవనానికి మధ్యగా బడి, మంచుకు దమ్ముకునివున్న కాలిబాటవెంట ఆయింటిగుమ్మంలోకి జేరుకున్నాం. ఆ తోటలో వున్న జలయంత్రం చూసేదిక్కులేక నీళ్లు పొర్లిపోతోంది.

'ఆ యిద్దరిలో ముందు నడుస్తున్న వ్యక్తి గబగబా తలుపు కొట్టాడు. కాని వెంటనే యెవరూ వచ్చి తలుపుతీశారుగారు. కొంచెం ఆలస్యమైంది. ఒకటిరెండు క్షణాలలో వచ్చి తలుపు తీసిన ఆ నౌకరును, ఆ పెద్దమనిషి మొహానికడ్డంగా చూసి ఒక పెద్ద దెబ్బకొట్టాడు.

'ఇది నాకు పెద్దవింతగా తోచలేదు. ఎంచేతనంటే యజమానులు నౌకర్లను కుక్కల్ను బాదినట్లు బాదడం నేను చాలాసార్లు చూశాను. కాకపోతే చిత్రమేమిటంటే, మొదటివ్యక్తి కొట్టిన అనంతరం, అదే మోస్తరు కోపంవచ్చివున్న కారణంగా ఆ రెండో పెద్దమనిషికూడా అదేవిధంగా ముఖంమీద కొట్టాడు. ఆ సమయంలో ఆ యిద్దరి ముఖాలు నిజంగా ఒకే కరువున పోతబోసినట్టున్నాయి. ఒకవేళ వాళ్లిద్దరూ కవలసోదరులేమోననే అనుమానం కలిగింది.

'మేము ఆ భవంతి ఆవరణగేటు ముందు బండిదిగిన మరుక్షణంనుంచి, లోపలున్న మేడమీదనుంచి యేదో యేడుపు వినిపిస్తూనేవుంది. ఆ యిద్దరి సోదరులలో ఒకడు తన దగ్గరున్న తాళం చెవితో ముందుగేటు తాళంతీసి మళ్లా మేము లోపలికి రావటంతోటే గేటు మూసేసి లోపన్నుంచి తాళంవేసేశాడు. ఇంట్లో కొంతమంది మనుషులు వుండగా యజమాని వీధిగేటు తాళంవేసి ఆ తాళంచెవి అస్తమానం మొల్లోగట్టుకు తిరుగుతూవుండటం చిత్రమైన సంగతే.

'మేము ఇంట్లో ప్రవేశించి, మేడపైకి మెట్లెక్కుతున్న కొద్దీ ఆ ఏడుపు మరింతబిగ్గరగా వినిపిస్తోంది. నన్ను సరాసరి ఆ గదిలోకే తీసుకువెళ్లారు. కొండలపెట్టున జ్వరంతో మతిచెడి, ఒక స్త్రీ పక్కమీద పడుండి యేడుస్తోంది.

'అంతజ్వర తీవ్రతలో వుండికూడా ఆ స్త్రీ యెంతో అందంగా వుంది. ఇరవైయేళ్లకు మించివుండదు. జుట్టంతా చీకిరి బాకిరిగా రేగిపోయివుంది. చేతులురెండూ తాళ్లతోనూ, చిరిగిపోయిన కోటుపీలికలతోనూ కట్టేసివున్నయ్. ఆ కోటు పీలికల మీద ప్రభువులు ధరించే అధికారచిహ్నాలున్నయ్. "*E*" అనే అక్షరం పట్టుతో కుట్టివుంది.

'రోగిని చూసిన మొదటి క్షణంలోనే ఇంతవరకు గమనించాను. ఇంత పరీక్షగా యెందుకు చూడవలసి వచ్చిందంటే, ఆ స్త్రీ కల్లోలంగా యేడుస్తూ నోటితో ఆ కట్టు పీకెయ్యటానికి ప్రయత్నించబోతోంది. పక్కమీద నెలికిళ్ల పాములాగు మెలికలు తిరిగిపోయి ఊపిరాడకుండా పోయింది. నేను ఆవిడకు ఊపిరాడేలా చెయ్యడానికి ముందు ఆ గుడ్డపీలికలు నోట్లోనుంచి యివతలికి లాగటంతో ఆ చిహ్నాలన్నీ కంటబడ్డయ్.

'నెమ్మదిగా రెండుచేతులా మనిషిని పట్టుకుని వెల్లకిలగా పడుకోబెట్టి, నెమ్మదిగా గుండెలమీద చెయ్యివేసి రాస్తూ, కొంచెం శాంతి పరచటానికి ప్రయత్నించాను. ఆవిడ కనుగ్రుడ్లు తిరిగిపోయి, అయోమయంగా వుంది. ఊపిరి సలపకుండా కేకలుబెట్టి యేడుస్తోంది. ఆ కేకలు, పిచ్చెత్తిపోయిన మనిషిలా ఒకే వెర్రిధోరణి:

'నాభర్త! - నాతండ్రి! - తమ్ముడు! - అమ్మయ్యో! - ఒకటి, రెండు, మూడు, నాలుగు' ఇలా పన్నెండుదాకా అరుస్తుంది. ఇలా అరిచి ఒక క్షణం ఆగి మళ్లా అదేప్రకారంగా ఏడ్చి పన్నెండు అంకెలూ లెక్కబెడుతుంది.

"ఈ స్థితి యెప్పటినుంచీ అని అడిగాను"

ఆ యిద్దరు సోదరులలోనూ, పెద్దవాడుగా అధికార కంఠంతో' మాట్లాడుతున్న ఆ పెద్దమనిషి: "నిన్న రాత్రి యీ వేళనుంచీ" అన్నాడు.

"ఈవిడకు భర్త, తండ్రీ, తమ్ముడూ వున్నారా?"

"తమ్ముడున్నాడు" అన్నాడు ఆ రెండో పెద్దమనిషి.

"మీరేనా?"

"ఛీ!"–

"పన్నెండేవిటి?"

"అదోటుంది లెండి – పన్నెండుగంటలన్న మాట."

"రోగిస్థితి యిలా వుందని అక్కడే చెపితే నేను కావలసిన మందులూ మాకులూ తెచ్చుకునేవాణ్ణి; యిప్పుడు నేను యిక్కడికి వచ్చీ ప్రయోజనం లేకుండావుంది. ఈ నిర్మానుష్య ప్రదేశంలో మందులు ఎక్కడ దొరుకుతై?"

'ఈమాట అనేసరికి పెద్దవాడు తమ్ముడివంక చూశాడు ఆ చూపుతో తమ్ముడు – "మందులున్నయ్‌లే" అంటూ నాతో అతి బేమర్యాదాగా అని లోపలికిపోయి మందులపెట్టె ఒకటి తెచ్చి అక్కడున్న బల్లమీద పడేశాడు.

'అందులోవున్న సీసాలు ఒకటొకటే బయటికితీసి, బిరడాలు తీసి వాసన చూస్తున్నాను. పరమవిషాలైన మత్తుమందులు మినహా మరోటి ఆ దశలో వాడి ప్రయోజనం కనుపించలేదు గనక వాటిని వాడగలిగాను గాని లేకుంటే వాటిని ముట్టుకునేవాణ్ణే గాదు.'

"ఏవిటి అనుమానించుతున్నారు?" అన్నాడు చిన్నవాడు.

"ఏవీఁలేదు – వాడుతున్నానుగా"–

'అంటూ, మరుమాట లేకుండా, ఒక మందు తీసి గ్లాసులో పోశాను. ఆ అమ్మాయిచేత ఆ డోసు త్రాగించేటప్పటికి నాకు తలప్రాణం తోకకొచ్చింది. ఆ డోసు యెలా పనిచేస్తుందో చూసుకునీ, మళ్ళా అదే మందు మరోడోసు యివ్వాలనే ఆలోచనతో ఆ పక్కకు దగ్గరగా కూర్చుని పరిశీలించుతున్నాను. పిరికిపందలా తయారై బిక్క చచ్చివున్న మరోస్త్రీ అక్కడ వుండి కావలసిన ఉపచారాలు చేస్తోంది. నేను అక్కడ స్థిమితంగా కూర్చోవటం చూసి ఆ మనిషి అవతలికి వెళ్లిపోయింది. ఆ గది యావత్తూ తేమగా ముంజుకంపు గొడుతోంది. చాలారోజులుగా పాడుబెట్టి, యిటీవలనే ఒకటి రెండు రోజులుగా ఉపయోగించుకుంటున్న గదిలా తోచింది. సామాను చెల్లాచెదురుగా పారేసివుంది. ఆ రోగి అరుస్తున్న కేకలు బయటికి చాలా వినిపించకుండా వుండటానికి కిటికీలకు మందపాటి పట్టాగుడ్డలు వ్రేలాడదీసి మేకులు పాతారు. ఆవిడ అలా కేకలు బెడుతూనే వుంది: "నా భర్త! – నాన్న! – తమ్ముడు! – ఒకటి, రెండు, మూడు.... పన్నెండు." ఆ స్త్రీ యించుమించు ఉన్మాదావస్థలో వుండటంచేత గొంతు నులిమేసుకుంటుందేమోననే భయంతో, చేతికట్లు విప్పకుండా అలానే వుంచేశాను. కాకపోతే వున్న సుగుణమల్లా యేమిటంటే గుండెలమీద చెయ్యివేసి రాస్తే, కాస్త ఉపశమనంగా కనుపిస్తోంది. శరీర చలనంలో కొంత తమాయింపు కనుపిస్తోంది గాని అరుపులు మాత్రం యథాప్రకారంగానే వున్నయ్.

'ఇలా దాదాపు, ఒక అరగంటసేపు అక్కడ కూర్చున్నాను. ఇంతసేపూ ఆ యిద్దరు సోదరులూ అక్కడ కూర్చుని నావంక చూస్తూనే వున్నారు. తరువాత పెద్దవాడు "డాక్టర్! మరో రోగిని చూడాలి" అన్నాడు.

'నాకు ఆశ్చర్యం కలిగింది: "అదికూడా అర్జెంటు కేసేనా?" అని అడిగాను.

"వచ్చి చూడండి!" – అంటూ అతి బేఫర్వాగా సమాధానం చెప్పాడు. లాంతరు తీసుకు బైలుదేరాడు.

* * *

'ఆ రెండోరోగి భవనానికి వెనకతట్టు వున్న మరోపాడుబడ్డ గదిలో పడున్నాడు; గుర్రపుశాలలో పైన కట్టే అటకలా వుంది ఆ గది. దానినిండా యెండుగడ్డి పడేసివుంది. ఆరిపోయిన కాగడాలు మూలబారేసివున్నయ్. మరికొంతభాగంలో సీమరేగిపళ్లు యిసకలో కావేసి గుట్టలు పోసివున్నయ్, ఇంటి పైకప్పూ తనాబీలూ నెత్తికి తాకుతున్నయ్. ఆ చెత్తాచెదారం మధ్యగా బడి గది అవతలి గోడమూలకు నడిచాం. ఆ మూల, ఒక రైతుకుర్రాడు గడ్డి మీద పడుకున్నాడు. అతడు పదహారు పదిహేడేళ్ల వయసులో వున్నాడు. అతను వెల్లకిలగా పడుకుని పైకప్పువంక చూస్తున్నాడు; పళ్లు కచ్చగా కదనొక్కుకునున్నయ్; అరచేతితో గుండెలదగ్గిర కందరాన్ని గట్టిగాపట్టుకుని బాధపడుతున్నాడు. అతని గాయమెక్కడో నేను వెంటనే తెలుసుకోలేకపోయాను. నెమ్మదిగా దగ్గిర కూర్చుని పరిశీలించాను. గాయమెక్కడో తెలియలేదుగాని, ఆ ముఖకవళికలను బట్టి అతను యేదో ప్రమాదకరమైన గాయంతగిలి మరణావస్థలో వున్నాడని గ్రహించగలిగాను.

'నేను డాక్టర్ను నాయనా! – నీ గాయాన్ని పరీక్షించనియ్యి' – అన్నాను.

'అనవసరం – పరీక్షా గిరిక్షా అనవసరం – అలా వుండనీ'–

'అతను అలా అంటున్నా, నెమ్మదిగా అనునయించి చెయ్యి పక్కకు తొలగించి చూచాను. చేతికి క్రిందుగా డొక్కలో పెద్ద కత్తిపోటు. అప్పటికప్పుడు చికిత్సచేసినా అతను బ్రతికే సావకాశంలేని గాయం; పైగా ఆగాయం తగిలి యిప్పటికి దాదాపు యిరవై నాలుగుగంటలదాకా గడిచిపోయింది. అతనిప్పుడు కేవలం మృత్యుముఖంలో వున్నాడు. నేను, ప్రక్కనే నిల్చున్న సోదరుల వంకచూచాను. వాళ్లిద్దరూ ఆ కుర్రాడివంక, వేటాడి క్రిందపారేసిన పక్షిని చూసినట్టు చూస్తున్నారు.

"పాపం ఇలాంటి గాయం యెలా తగిలిందో" అన్నాను.

సోదరులలో పెద్దవాడన్నాడు: "వాడు వట్టి బజారుకుక్క – మా చేలల్లో పనిచేసే బానిస తొత్తుకొడుకు – కత్తిదూసి నా తమ్ముణ్ణి రెచ్చగొట్టాడు – తమ్ముడి కత్తి పొడుచుకుంది"–

ఆ మాటలు చెవులబడి కుర్రాడు కళ్లువిప్పి అతనివంక తీవ్రంగా చూశాడు. తరువాత నా వంకకు తిరిగాడు:

"డాక్టర్! వాళ్లు జమీందార్లు – అదీ వీళ్ల అహంకారం; మేము బజారుకుక్కలం– మాలోకూడా ఆత్మాభిమానం అప్పుడప్పుడు పొటమరించుతూ వుంటుంది. వాళ్లు మమ్మల్ని దోపిడీ చేస్తారు. మా ఆడవాళ్లని చెరుస్తారు – మమ్మల్ని కొరడాలతో కొడతారు – నరికి

చంపుతారు; కాని అప్పుడప్పుడు మాలోకూడా అభిమానం రేగుతుంది. – డాక్టర్ మా అక్క!– ఆవిణ్ణి చూశారా?"

ఆ స్త్రీ ఆక్రోశం ఆ మారుమూలగదిలోకి కూడా వినిపిస్తూనే వుంది.

"చూచాను" అన్నాను.

"ఆవిడ మా అక్కగారు – ఈ జమీందార్లకి కొన్ని హక్కులున్నయ్ – తరతరాలనుంచీ వస్తున్న దురాగతమైన హక్కులు; మా అక్కచెల్లెళ్ల మాన సౌశీల్యాలను వీళ్లయిష్టం వచ్చినట్లు ఉపయోగించుకోవచ్చు; కాని, మాలో కూడా మానాభిమానాలు గల ఆడపిల్లలు పుడుతున్నారు. పవిత్రంగా బ్రతకటానికి ప్రాణాలు అర్పించే ఆడవాళ్లు మాలో కొందరున్నారు. ఈ సంగతి నిజం – నాకు తెలుసు – నాతండ్రి కూడా నాతో చాలాసార్లు ఈ సంగతి చెప్పేరు. ఇప్పుడు మీరు చూసిన ఆ అమ్మాయి, మా అక్క ఆ కోవలో మనిషి – మీ బావకూడా ఈ జమీందార్రైతే – మేమంతా వీళ్ల రైతులమే. అదుగో ఆ నిల్చున్న ఆ పెద్దాయన జమీందారు – ఆ రెండో ఆయన ఆయన తమ్ముడు; ఈ కిరాతవంశానికీ కట్టకడపటి వారసుడు"

ఈ మాటలు పెగుల్చుకోవటానికి, పాపం ఆ కుర్రాడు వొంట్లోవున్న జవసత్వాలన్నిటినీ బలవంతాన కూడదీసుకోవలసి వస్తోంది; కాని ప్రతి మాటనూ తుపాకిగుండ్లులా బలంగా విసురుతున్నాడు.

"ఈ దేశంలో ఈ జమీందారులు మాబోటి బజారుకుక్కల్ని నిలువుదోపు చేస్తూవుంటారు - అలాగే ఆ నిల్చున్నాయన మా సర్వస్వాన్నీ దోచుకున్నాడు; మేము చెల్లించే పన్నులు యిన్నిన్ని కావు; కూలీనాలీ లేకుండా వాళ్ళ పొలాల్లో వెట్టి చాకిరీచెయ్యాలి; వాళ్ల మరలోనే మేము ధాన్యం విసురుకోవాలి; వీళ్లు పెంచుతూవుండే వేలాదిపక్షులూ మా చేలమీదపడి తినిపోతూ వుంటై. వాటిని మేము అదిలించకూడదు. మేము యే చిన్ని పిట్టనీ పెంచుకోగూడదు - ఇంతెందుకు, మేము రవ్వంత మాంసం ముక్క నోట్లో వేసుకోవాలంటే తలుపు బిగించుకుని దొంగతనంగా తినాలి – వాళ్ల నౌకర్ల కంటబడితే పీకెమీదికి వస్తుంది. వాళ్లు మమ్మల్ని దోపిడీ చేసింది ఒకవిధంగా గాదు. జంతువుల క్రింద వేటాడారు. వాళ్ళ దోపిడీతో మేము గర్భదరిద్రులమై నాశనమై పోయాం. బిడ్డల్ని కని ఈ కిరాత ప్రపంచంలో పారేసేకంటే మా ఆడవాళ్ళంతా గొడ్రాళ్ళయి, ఈ నికృష్టజాతి యింతటితో నశించిపోవాలని, పెద్దలంతా దేవతలకు మొక్కుకుంటూ వుంటారు"

'పీడిత ప్రజానీకం నుంచి జ్వాలలు రేగుతాయని వినటమే గాని, అదేవింటో ప్రత్యక్షానుభవ మేవీ లేదు – ఆ కుర్రవాడు మాట్లాడుతుంటే ఆ సత్య మేవింటో బోధపడ్డది.'

అతను మళ్ళీ మొదలెట్టాడు:

"డాక్టర్! మా అక్కగారు పెళ్లి చేసుకుంది. ఆవిడ అతన్ని చిన్నప్పటినుంచీ యెంతో ప్రేమించుతూ వుండేది. అప్పట్లో అతను జబ్బుస్థితిలో వున్నాడు. పెళ్లి చేసుకుంటే అతనికి పరిచర్య చేసే అవకాశం కలుగుతుందని, ఆ జబ్బుస్థితిలో వున్నవాణ్ణే పెళ్లి చేసుకుంది. అతన్ని ఆ గుడిసెలోకే తెచ్చుకుని ఉపచారం చేస్తోంది – గుడిసేవింటిలెండి – ఈయన అన్నట్టు కుక్కలగూడే; అప్పటికి పెళ్ళి అయి ఎన్నో రోజులు కూడా కాలేదు – కొద్ది వారాలు గడిచినై – ఈయన తమ్ముడు మాఅక్కని చూచాడు – మా అక్క అందంగా వుందనుకున్నాడు– ఆ స్త్రీని తనకు వప్పజెప్పమని మా బావకే కబురు చేశాడు – మాలో మొగుడంటే యేవింటి బాబూ! అతను అందుకు యిష్టపడ్డాడు కూడా; కాని మా అక్కకు మాత్రం పరమ అసహ్యం వేసింది – ఇతనంటే మా అక్కకు చాలా అసహ్యం లెండి – నాకూ అంతే – వీళ్ళిద్దరూ, మా అక్కను ఎల్లాగైనా ఒప్పించమని మా బావను నానా యిబ్బందులూ పెట్టారు.

"డాక్టర్! మీకు తెలియదేమో – వాళ్ళకు అనేక హక్కులున్నయ్; మా బజారుకుక్కల్ని వాళ్లు బళ్ళకు కట్టి జంతువుల్ని తోలినట్లు తోలొచ్చు. మా బావను అలా తోలారు. రాత్రిళ్లు, కప్పలు అరిచి మహాఘనత వహించిన వాళ్ళ నిద్రలకు భంగం రాకుండా ఉండాలని మమ్మల్ని రాత్రి తెల్లవార్లూ కప్పల్ని అదుపు చెయ్యటానికి వాళ్ళ చేలమీద మంచులో అట్టే పెట్టెయ్యొచ్చు; మా బావను అలా రోజుల తరబడి అట్టే పెట్టారు. పగలల్లా బండిలాగే వాడు. రాత్రి తెల్లవార్లూ మంచులో వుండేవాడు. అయినా అతను లొంగలేదు. అతని పని సొంతం అయిపోయింది. కొన్ని వారాల తరబడి ఇలా యమయాతన లనుభవించారు. ఒకనాడు కనికరించి కాబోలు, తిండి తినిరమ్మని యింటికి పంపివేశారు. అతను ఇంటికి వచ్చాడు – ఇంటికి జేర్చారు. అతను మా అక్క భుజంమీద పడుకుని యేడ్చాడు – చర్చిలో గంటలు గొట్టినప్పుడల్లా గుబులు గుబులుగా యేడ్చాడు – మధ్యాహ్నం ఒంటి గంటనుంచీ రాత్రి పన్నెండింటిదాకా అలా పన్నెండుసార్లు ఏడ్చాడు. పన్నెండో గంటకు మా అక్క భుజంమీద అలాగే ప్రాణం విడిచేశాడు.

"అనంతరం, ఈయన తన అన్నగారి అనుమతితోనూ, మద్దతుతోనూ మా అక్కను మాగుడిశలోనుంచి తన భవనానికి యీడ్పించుకుపోయాడు; ఎంత మొత్తుకున్నా దానిగోల వినే వాళ్లెవరూలేరు; అల్లా యీడ్చుకుపోతుండగా నేను రోడ్డుమీద చూశాను. తలవంచుకుని యింటికి వెళ్లిపోయాను. ఇంటిదగ్గిర మా నాన్న గుండె బాదుకుని యేడుస్తున్నాడు. నాకు మరో చెల్లెలుంది. దాన్ని వీళ్ల బారి పడకుండా కాపాడాలనుకున్నాను. దాన్ని వెంటబెట్టుకుని వీళ్ల యేలుబడిలోది కాని మరోగ్రామానికి చేర్చి తిరిగివచ్చాను; వీళ్ళసంగతీ నా సంగతీ తేల్చుకోవాలనుకున్నాను – నేను బజారుకుక్కనే – కాని కత్తి చేత్తోబుచ్చుకొని నిన్నటి అర్ధరాత్రి ఈ మేడమీదికి ఎగబాకాను. అదుగో ఆ కిటికీలోనుంచే లోపలికి దిగాను.

"నేను లోపలికి రావటం పసిగట్టి మా అక్క ఏడుస్తూ నా దగ్గిరికి పరుగెత్తుకొచ్చింది. అతని అంతం చూసేవరకూ నువ్వు నా దగ్గిరికి రావద్దని మా అక్కను మందలించాను. అతనుకూడా లోపలికొచ్చాడు. మొదట నా మీదికి డబ్బులు విసిరాడు; తరువాత కొరడా విసిరాడు; కత్తిదూసి కలబడ్డాను – ఆత్మరక్షణ చేసుకోవటానికి అతను కత్తిదూశాడు. నేను బజారుకుక్కను – నారక్తంతో పంకిలమైనదన్నకోపంతో తన కత్తిని ముక్కలుముక్కలుగా విరగగొట్టి యిక్కడే పారేశాడు. ఇవిగో ముక్కలు – అదుగో అక్కడపడున్నది, అది నా కత్తి – రైతుబిడ్డ చేతికత్తి – డాక్టర్! వాడిముఖమేదీ! నన్ను చూడనీ–"

"ఆయన యిక్కడలేరు వెళ్లిపోయారు."

“డాక్టర్! వీళ్లు జమీందార్లమంటారుగాని, వట్టి పిరికి పందలు, నా ముఖంలోకి చూడలేక దాక్కుంటున్నాడు. ఆ మనిషేడి - నాకు చూపించు - నా ముఖం అటు తిప్పు” - అంటూనే తన శరీరంలో మిగిలిన ఆవేశాన్నంతా ఒక్కసారి కూడదీసుకుని అమాంతం లేచి నిల్చున్నాడు; ఆ జమీందారువంక చూసి.

‘అరే జమీందార్! వీటి అన్నింటికీ మీరు సమాధానం చెప్పుకోవలసినరోజు వస్తుంది. ఇదుగో నీ ముఖాన ఈ రక్తపు శిలువను గుర్తుగా గీస్తున్నాను - ఇదుగో నీ తమ్ముడి మొహాన రక్తపు శిలువ గుర్తు - వంశం వాళ్ళందరి ముఖానా మూడోగుర్తు” అంటూ రక్తంతో తడిసివున్న మునివ్రేళ్లతో మూడుసార్లు గాలిలో శిలువ గీశాడు. వెంటనే నేలమీద విరుచుకుపడి ప్రాణం విడిచేశాడు...’

నేను మళ్లా ఆ యువతి పక్కదగ్గిరికి తిరిగివచ్చాను. ఆవిడ ఇంకా వాపోతూనే వుంది. ఆ ఆక్రోశం యిక మరణంతో గాని సమసిపోదని గ్రహించాను. ‘ఆ మందునే మరో డోసు యిచ్చాను. ఆ పక్కదగ్గిర అలానే కనిపెట్టుకు కూర్చున్నాను. పాపం అలా ఆక్రోశిస్తూనే వుంది: ‘నా భర్త! నా తండ్రి! తమ్ముడు! - ఒకటి, రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు, పన్నెండు అమ్మయ్యో!’- అలా నేను ఆమెను చూచిన క్షణంనుంచీ యిరవై ఆరు గంటలసేపు తల్లడిలిపోయింది. అనంతరం మగత కమ్మేసింది. పెద్దతుపాను చెలరేగి సమసిపోయినట్టనిపించింది. పరిచర్య చేస్తున్న ఆ దాసీ దాని సహాయంతో ఒత్తిగిలించి పడుకోబెట్టాను. పడుకోబెట్టడంలో ఆ అభాగ్యురాలు గర్భిణితో వున్నట్టు తెలుసుకున్నాను. దాంతో ఆవిడ జీవించుతుందనే ఆశాలేశం, నాలో నశించిపోయింది.

‘ఇంతలో, జమీందారు అప్పుడే గుర్రం దిగి ఆ బూట్లకాళ్లతోనే గదిలోకి వచ్చాడు: “చచ్చిందా?” అన్నాడు. “లేదు - కాని త్వరలో చనిపోతుంది”-

“ఈ బజారురకం వాళ్ళ శరీరాల్లో ఎంతోబలం వుంటుంది” - అన్నాడు ఆ స్త్రీ శరీరంవంక అదోవిచిత్రంగా చూస్తూ;

“కష్టాలనూ సుఖాలనూ భరించటానికి భగవంతుడు వాళ్లకు అలాంటి బలాన్ని యిస్తాడు” అన్నాను. ‘నా మాటలు విని ఆయన ముందు నవ్వాడు - తరువాత ఉరిమిచూచాడు కోపంగా, అక్కడున్న కుర్చీ నొకదాన్ని నాకు దగ్గిరగా తోసి దాంటో కూర్చున్నాడు. దాసీదాన్ని అవతలికి వెళ్ళిపొమ్మన్నాడు.

“డాక్టర్” అంటూ ఎత్తుకున్నాడు: “నాతమ్ముడు, ఈ నాటు రకం మనుషులతో ఇలా చిక్కుల్లో యిరుక్కోవటం గమనించి, ఈ విషయంలో నీ సహాయం తీసుకుంటే బాగుంటుందనుకున్నాను. నువ్వు బాగా పేరు ప్రతిష్ఠలున్నవాడివి. పిన్న వయసులో వున్న వాడివి; ఇంతడబ్బూ దస్కం గడించుకొని అభివృద్ధిలోకి రావలసిన యోగ్యుడివి; నీ మంచి చెడ్డ లేవో నువ్వుచూసుకునే బుద్ధిమంతుడవనుకుంటున్నాడు. ఇక్కడ నువ్వుచూస్తున్న విషయాలన్నీ యిక్కడికిక్కడ మరిచిపోవలసినవేగానీ - వీటిగురించి యెక్కడా పన్ను కదపటం యోగ్యంగా వుండదు”-

‘అతనికి సమాధానం చెప్పకుండా వుండటానికి, రోగి ఉచ్ఛ్వాసనిశ్వాసాలు పరీక్షించుతున్నట్టు నటించాను. అతను అధికారకంఠంతో మళ్లా హెచ్చరించాడు:

“డాక్టర్! నేను చెబుతున్న మాటేవిఁటో కొంచెం శ్రద్ధగా వినిపించుకుంటావా?”

“ఇక్కడ చూచిన విషయాలూ, విన్న విషయాలూ నన్ను మనసులో చాలా వ్యాకుల పెడుతున్నయ్: “రోగులు చెప్పుకునే మాటలు ఆంతర్య విషయాలుగానే అట్టిపెట్టుకుంటాను- ఇది నా వృత్తి ధర్మం” అని అతి జాగ్రత్తగా సమాధానం చెప్పాను. మళ్లా రోగి శ్వాసపరీక్ష చేస్తున్నాను. ఇద్దరు అన్నదమ్ములూ నన్ను కాట్ల కుక్కల్లా పసిగట్టి చూస్తున్నారు.

‘ఆ మైకంలో అలా వారంరోజులు బ్రతికి వుంది. ఆవారం రోజులూ ఆ అన్నదమ్ముల్లో ఎవరో ఒకరు నా మీద నిఘావేసి కనిపెడుతూనే వున్నారు. చివరి రోజుమాత్రం “ఇక ఒక్కరోజుకంటే యెక్కువకాలం జీవించదని చెప్పేశాను. ఆ వేళ మాత్రం వాళ్లిద్దరూ నన్ను పరాహత్‌గా వదిలేశారు. రోగితో నేనేం మాట్లాడితే మాత్రం లెక్కేమిటన్నట్టు - దాంతో, నేను కూడా ‘మరణించబోతున్నానా ఏమిటని అనుమానమేసింది.

‘అంత్య ఘడియల్లో పాపం, ఆ తల్లి యేవిఁటో పెదిమెలు కదిలిస్తోంది; ఆ మాట లేవిటో స్ఫుటంగా వినిపించక చెవి బాగా నోటిదగ్గరగా పెట్టాను. “నే నెక్కడున్నాను” అని అడిగింది; చెప్పాను. “మీ రెవరు” అంది; చెప్పాను. మీ యింటి పేరేవిటని అడిగాను. ఆవిడ సమాధానం చెప్పలేదు. తల పంకించి, కన్నీరు విడిచి, ముఖం దిండుమీదికి వేలవేసింది. ఆ రహస్యాన్ని హృదయంలోనే దాచేసుకుంది. తన తమ్ముడు మోస్తరుగానే.

‘ఆ అభాగ్యజీవి నడిరేయికి ప్రాణం విడిచేసింది. ఆ స్త్రీ జగత్తులో అనుభవించిన అవమానాలూ, హింసా అంతటితో అంతరించిపోయినై.

‘మేడక్రింద మెట్లదగ్గిర గదిలో యిద్దరు సోదరులూ నా కోసం కనిపెట్టుకున్నారు. తొందరగా యెక్కడికో ప్రయాణమైపోవటానికి చెప్పుల్లో కాళ్లు బెట్టుకు నిల్చునున్నారు. ఇద్దరూ చెరో గుర్రపుకొరడా చేత్తో బుచ్చుకునున్నారు.

‘నేను లోపలికి అడుగుబెట్టగానే పెద్దవాడు: “అమ్మయ్యా! ఇప్పటికి చచ్చిందన్నమాట” అన్నాడు; ఈమాట నాతో అని తమ్ముడివంక తిరిగి, “ఒరే తమ్ముడూ నీ పీడా విరగడయింది” అన్నాడు.

ఆయన అతఃపూర్వమే కొంతపైకం నా చేతిలో బెట్టవచ్చాడు; తరువాత తీసుకుంటానని చెప్పి, అప్పటికి వాయిదా వేశాను. యిప్పుడు బంగారునాణాలున్న ఒక డబ్బుసంచీ నా చేతికివ్వొచ్చాడు. ఆయన చేతిలోనుంచి ఆ సంచి తీసుకుని అక్కడే బల్లమీద ఉంచేశాను. ఆ విషయం నాలోనేను బాగా ఆలోచించుకున్నాను. ఒక దమ్మిడీకూడా ముట్టగూడదని నిర్ణయించుకున్నాను:

“క్షమించండి - ఈ పరిస్థితిలో నేనేమీ తీసుకోదలచలేదు” అన్నాను. అన్నదమ్ములిద్దరూ ఒకరిమొహంవంక ఒకరు అదో విధంగా చూసుకున్నారు. ఇద్దరూ నా వంక చూశారు. మారుమాట లేకుండా యెవరిత్రోవను వారు యివతలికి వచ్చేశాం.

ఆ మర్నాటి ఉదయం నేను నిద్రలేచేసరికి, ఆ డబ్బుసంచీ నా గదిగుమ్మంలో పడేసివుంది. దానికి నాపేరుతో ఒకచీటీ కట్టి వుంది.

ఈవిషయంలో యేవిధంగా వ్యవహారించాలో నేను మొదటి నుంచీ ఆలోచించుకుంటూనే వున్నాను. ఈ విషయమంతా విస్పష్టంగా వ్రాసి, మంత్రిగారికి రహస్యంగా తెలియజెయ్యాలనుకున్నాను. ఈ జమీందారులకు ప్రభుత్వంలోవున్న పలుకుబడి నాకు తెలియక గాదు; ప్రభుత్వం వీళ్లని యేమీ చెయ్యదనికూడా నాకు స్పష్టంగా తెలుసు. అయినా నా బాధ్యత నేను నిర్వహించి నా మనస్సులోవున్న వేదననుంచి విముక్తి పొందాలని అనుకున్నాను. ఈ విషయాన్ని నా భార్యకు కూడా చెప్పకుండా రహస్యంగా అట్టి పెట్టాను. నాకు వచ్చే ప్రమాదాన్ని గురించి నేను యెక్కువగా ఆలోచించలేదు; కాని యీ విషయాన్ని ఇతరులు యెవరు తెలుసుకునివున్నా వారికి కొన్ని బాధలు చుట్టుకోవటం తప్పదని ఊహించగలిగాను.

ఆ వేళంతా నాకు ఊపిరి సలపకుండా పని వుండటంచేత ఆ రాత్రి ఆ ఉత్తరం ముగించలేకపోయాను. తెల్లవారుఝామునే లేచి పూర్తి చేశాను. ఆవేళ డిశంబరు 31వ తేదీ. సంవత్సరాంతం. ఉత్తరం అప్పుడే పూర్తిచేసి ముందు బెట్టుకుని బల్లదగ్గిర కూర్చునున్నాను. ఇంతలోనే నౌకరు లోపలికి వచ్చి యెవరో ఒక స్త్రీ నాతో మాట్లాడటానికి వచ్చినట్టు చెప్పాడు.

‘ఆ స్త్రీ పడుచు వయసులోనే వుంది; అందంగా కూడా వుంది; మంచి సహృదయంగల స్త్రీగా కూడా కనుపించుతోంది; కాని ఆవిడలో యెక్కువకాలం జీవించే లక్షణాలు లేవు. చాలా ఆందోళనగా కనుపించుతోంది; తాను సెయింట్ ఎవ్రీమూండ్ అనే జమీందారు భార్యనని స్వయంగా చెప్పింది.

‘జమీందారు భవనంలో జరిగిన ఆ సంఘటనను గురించి, ఆవిడ కొన్ని విషయాలు కర్ణాకర్ణిగా తెలుసుకుంది. మరికొన్నిటిని ఊహించుకుంది. ఈ వ్యవహారంలో తనభర్త చర్య, నన్ను పిలిపించటం యిదంతా ఆవిడకు తెలుసు; కాని, పాపం ఆ అమ్మాయి యింకా జీవించి వున్నదనే ఈవిడ అనుకుంటోంది. ఆడదానికి ఆడదానిపట్ల వుండే సానుభూతిని ఆ అమ్మాయికి తెల్పుకోవాలని పాపం ఈవిడ తాపత్రయం. అలా తాను ఏదైనా చెయ్యగలిగితే లోకకంటకంగా తయారైన ఆ కుటుంబంమీద భగవంతుని క్రోధం ఉపశమించుతుందేమోనని ఈవిడ ఆశ.

‘తన భర్త దుష్కృత్యానికి గురియైన ఆ స్త్రీకి ఒక చెల్లెలు వున్నట్టు ఆవిడకు యెలాగో తెలిసింది. ఆ అమ్మాయికన్నా సాయపడాలని పాపం యీవిడ అభిలాష. చెల్లెలు వుందన్న సంగతి వొక్కటే నాకు తెలిసింది – అంతకంటే నాకు మాత్రం యేమి తెలుసు? ఆ జమీందారిణికి అంతకంటే నేనూ యేమీ చెప్పలేకపోయాను. ఆ పిల్లపేరూ, ఆ పిల్ల యెక్కడ వున్నదీ తెలుపగలనేమోననే ఆశతో పాపం ఆవిడ యింతదూరం పనిగట్టుకుని నాకోసం వచ్చింది.

‘ఆవిడ చాలా దయాస్వభావంగల స్త్రీ; ఆవిడ వివాహ జీవితం యేమంత శాంతియుతమైనది కాదని ఆవిడ ముఖకవళికలను బట్టే గ్రహించగలిగాను. అవును ఆవిడకు శాంతిసౌఖ్యాలు లభించటమెలా?, బావగారికి ఆవిడ అంటే చాలా అసహ్యం, ఆవిడంటే ఏకోశానా నమ్మకం లేదు. ఆవిణ్ణు అణచివేయటానికి బావగారు తన తమ్ముడిమీద తనకున్న

పెద్దరికాన్నంతా వినియోగించుతూ వుంటాడు. అందుచేత యీవిడ బావగారన్నా మొగుడన్నా అనుక్షణం భీతితో బ్రతుకుతూవుంటుంది. నేను ఆవిణ్ణి పంపించటానికి వీధిలోకి వచ్చాను. వీధివాకిట్లో నిలిపివున్న బండిలో, రెండు మూడు సంవత్సరాల వయసులోవున్న చక్కని కుర్రవాడొకడు కూర్చునున్నాడు.

“ఇదుగో డాక్టరుగారూ! నేను పడుతున్న తాపత్రయమంతా ఈపాపడి కోసం; ఈ వంశానికి చుట్టుకొన్నశాపం, వీణ్ణికూడా కొట్టేస్తుందేమోనని నా భయం. ఇందుకు నేను చేయదగిన ప్రతిక్రియ యేమన్నావున్నదేమోనని చూస్తున్నాను. ఏవో కొన్ని నగలు మినహా నా దగ్గిర ఇతర ఆస్తి యేమీలేదు. ఆ పిల్లసంగతి తెలిస్తే ఆ నగలను ఆ పిల్లకు పంపించి నా చేతనైన ప్రతికృతి చేసుకుందామని ఆందోళనపడుతున్నాను” అన్నదావిడ.

‘ఆ పిల్లణ్ణి ముద్దెట్టుకుంది – “నీకోసమే నాయనా నా ఆందోళనా – నువ్వు యిలాంటి దుర్నడతలు నడవకు తండ్రీ!” అన్నది. ఆ కుర్రవాడు, అతి ధీమాగా: “అలాగేనమ్మా” అంటూ తల్లిని ముద్దుబెట్టుకున్నాడు. ఆవిడ బండిలోకి ఎక్కి బిడ్డని ఒళ్లోకి తీసుకుంది. బండి కదిలిపోయింది.

అనంతరం ఆ వుత్తరాన్ని యితరత్రా పంపటానికి యిష్టంలేక నేనే స్వయంగా తీసుకుపోయి మంత్రిగారి కార్యాలయంలో అందజేశాను.

‘నాటి అర్ధరాత్రి సమయంలో, నల్లటిదుస్తులు వేసుకున్న ఒకమనిషివచ్చి వీధితలుపు కొట్టాడు. నౌకరుకుర్రాడు డిఫార్జ్ అతన్ని వెంటబెట్టుకుని లోపలికి తీసుకువచ్చాడు.’

“కొంచెం అర్జంటుకేసండీ! కాస్త సెయింటు ఆనరీ వీధి దాకా దయచెయ్యాలి” అన్నాడు. “గుర్రపు బగ్గీ సిద్ధంగా వుంది లెండి, వెంటనే వచ్చేద్దురుగాని”.

‘ఆ బగ్గీయే నన్ను ఇక్కడికి (ఖైదుకు) చేర్చింది. ఆ బగ్గీయే నన్నీ జీవసమాధి దగ్గిరికి చేర్చింది.’

‘బగ్గీ మాయింటి ముందునుంచి కొంచెందూరం సాగగానే, వెనకనుంచి ఒకరు నా నోటిమీదికి నల్లటి మష్లరు విసిరేసి పెదవులు ఆడకుండా కట్టేశారు. చేతులు రెండూ వెనక్కు విరిచికట్టారు. ఆ జమీందారీ సోదరులిద్దరూ చీకటిలోనుంచి రోడ్డుకు అడ్డంగా నడిచి బండిదగ్గిరి కొచ్చి నన్ను గుర్తించి తలపంకించారు. పెద్దవాడు నేను మంత్రికి వ్రాసిన ఉత్తరం జేబులోనుంచి బయటికి తీసి, నా కళ్ల ఎదుట లాంతరుకు ముట్టించి తగలబెట్టాడు. కాలినమసిని నేలమీదపారేసి కచ్చకొద్దీ కాలితో నలిపేశాడు. ఎవ్వరూ ఏమీ మాట్టాడలేదు. నన్ను ఈజైల్లోకి తీసుకువచ్చి పారేశారు. ఈగదిలో జీవసమాధి చేశారు.

‘అలెగ్జాండర్ మానెట్ అనే నేను, ఈ ఖైదులో జీవన మరణవేదనలోవుండి, 1767 డిశంబర్ 31వ తేదీరాత్రితో ఈ లేఖ ముగించుతున్నాను. ఆ జమీందారీ సోదరులమీదా ఆ వంశం వారిమీదా, అత్యంత క్రూరకర్ములుగా భగవంతుని ముందూ, మానవజాతి ముందూ నేరారోపణ చేస్తున్నాను.’

ఆ ఉత్తరం చదవటం పూర్తికాగానే కోర్టుహాల్లో తుపాను చెలరేగిపోయింది. ఆ లేఖలోని విషయాలు వినటంతో అక్కడ వున్న యావన్మందికీ వెర్రెత్తిపోయింది. ఆ వంశాన్ని

నిర్మూలించి పగ సాధించాలని బొబ్బలు పెట్టేస్తున్నారు. ప్రముఖ దేశ భక్తుడూ, రిపబ్లిక్ ప్రభుత్వ ప్రధాన పౌరుడూ అయిన డాక్టర్ గారి మీద అలాంటి అఘాయిత్యం జరిపిన కిరాతుల వంశాన్ని ఏమైనా సరే నామరూపాలు లేకుండా చేయవలసిందే - డాక్టర్ గారి ఏకైక పుత్రిక ముండమోసిపోయినా సరే!

మాడమ్ డిఫార్జ్ - ప్రతీకారిణి వంక చూసి చిరునవ్వు నవ్వింది: "డాక్టర్ గారికి చాలా పలుకుబడి వుంది - డాక్టర్ గారూ! ఏదీ ఇప్పుడతన్ని రక్షించండి!"

ప్రజాపీడకులూ, రిపబ్లిక్ ప్రభుత్వ శత్రువులూ, అయిన జమీందారీ వంశానికి చెందిన చార్లెస్ డార్నే అని పిలవబడుతూన్న చార్లెస్ ఎవ్రీమూండ్‌ను యిరవైనాలుగు గంటల్లో తలగొట్టి వేయవలసిందిగా శిక్ష విధించారు. కాన్‌సెర్‌జరీ జైలుకు పంపివేశారు.

46

భర్తకు మరణశిక్ష అన్నమాటలు చెవులబడగానే లూసీ మొదలు నరికిన చెట్టులా తండ్రి పాదాలముందు కూలబడిపోయింది. ఆయన మతిచెడి జుట్టులోకి వ్రేళ్ళుపోనిచ్చి చిరాగ్గా పీకేసుకుంటున్నాడు. లారీ ప్రక్కనే నిల్చున్నాడు గాని యే ప్రపంచంలో వున్నదీ తెలియని అయోమయావస్థలో వున్నాడు.

వీధిలో జరుగుతున్న ప్రదర్శనాలలో పాల్గొనవలసివున్న తొందరలో కోర్టువారు అప్పటితో విచారణలు ముగించి బయటికి వెళ్లిపోయారు. వారితోపాటు కోర్టు హాలులోవున్న జనమంతా కూడా బెలబెలా బయటికి వెళ్లిపోయారు.

అంతవరదాకా కోర్టుహాలు చివరలో చిత్రిత ప్రతిమలా నిలిచివున్న సిడ్నీ కార్టన్ గబగబా కదిలి లూసీ పడివున్న స్థలానికి వచ్చాడు. క్రిందపడివున్న లూసీని పసిబిడ్డను ఎత్తుకున్నట్టు చేతులలోకి యెత్తుకుని హృదయానికి హత్తుకున్నాడు; అతని ముఖంలో దైన్యమూ, జాలీకంటె, అదొక విధమైన ఆత్మవిశ్వాసం కలువల కెంపులుగా వికసించుతోంది. "బండి దగ్గిరికి తీసుకువస్తాను రండి" అంటూ ముందుకు నడిచాడు.

కోర్టు గుమ్మంలో నిలబెట్టివున్న గుర్రపు బగ్గీలో లూసీని తీసుకుపోయి పడుకోబెట్టాడు. డాక్టర్ మానెట్, లారీ యిద్దరూ కూడా బండిలోకి యెక్కి లూసీకి చెరోవైపులా కూర్చున్నారు. కార్టన్ ముందు సీటులోకి పోయి బండితోలేవాడి పక్కనే కూర్చున్నాడు.

ఇంటిగేటుముందుకు చేరినవెంటనే తానే ముందుగా బండిదిగి లూసీని మళ్ళీ ఎత్తుకొని మేడమీదిగదిలోకి తీసుకుపోయి పడుకోబెట్టాడు. తల్లిని చూడగానే లూసీబిడ్డా, మిస్ ప్రాస్ యిద్దరూ ఆవిడమీద పడి గగ్గోలుగా యేడిచారు.

కార్టన్ వాళ్ళిద్దర్నీ మందలించాడు: 'ఏడవకండి; ఆవిడ వెంటనే స్మృహలోకి రావటం మంచిదిగాదు. కొంతసేపు అలాగే వుండనివ్వండి.'

'కార్టన్ బాబాయ్!' - అంటూ చిట్టి తల్లి కార్టన్ మెడకు పెనవేసుకుని పేగులు తరుక్కుపోయేట్టు యేడ్చింది:

'ఫరవాలేదు తల్లీ! నేనున్నాగా - అమ్మకేమీ ఫరవాలేదు' ఏడవకు అని బుజ్జగించి బుగ్గ ముద్దెట్టుకున్నాడు. నెమ్మదిగా లాలించి క్రింద దింపి, అవతలి గదిలోకి నడిచాడు.

డాక్టరూ, లారీ, ఇద్దరూ కూడా ఆయన్ను అనుసరించి లోపలికి నడిచారు. గదిలోకి ప్రవేశించీ ప్రవేశించటమే కార్టన్ గిరుక్కున వెనక్కుతిరిగి:

'డాక్టర్ గారూ! నిన్న సాయంత్రంవరకూ మీకు యెంతో బలమైన పలుకుబడి వుంది. మళ్ళా ఒకసారి యెందుకు ప్రయత్నించకూడదూ? ఈ న్యాయాధిపతులూ, ఈ దేశభక్తులూ, వీళ్ళందరూ మీపట్ల యెంతో సానుభూతి వున్నవాళ్లే గదా?'

'చార్లెస్ విషయంలో వాళ్లు నాదగ్గిరేమీ మరుగుపర్చలేదు - అతనికేమీ ప్రమాదం రాదని వాళ్ళంతా నాకు హామీ లిచ్చిన వాళ్లే - అలా జరిగిందికూడా - కాని మళ్ళా...'

'అవును - మళ్లా యెందుకు ప్రయత్నించకూడదు. రేపు మధ్యాహ్నం దాకా వ్యవధి వున్నదిగదా?'-

'తప్పకుండా ప్రయత్నించుతాను - ఒక్క క్షణం కూడా వ్యర్థం కాకుండా సకల శక్తులా ప్రయత్నించితీరుతాను - ఇప్పుడే బయలుదేరి పబ్లిక్ ప్రాసిక్యూటర్ను చూస్తాను; ప్రధాన న్యాయమూర్తిని కూడా చూస్తాను - ఇంకా చూడవలసినవాళ్లు కొందరున్నారులే-యిప్పుడు వాళ్ళ పేర్లన్నీ యెందుకు? అందర్నీ కలుసుకుని మాట్లాడతాను - ఆహాః! - ఆగండి - అయితే ఒక చిక్కు - ఈవేళ ఊరంతా ఉత్సవాలు జరుగుతున్నయ్. చీకటిబడితేనే గాని యే వొక్కరూ దొరకరు - ఎలా?'-

'అవును మీరన్న మాటా నిజమే - ఏదో ఆశాలేశంతో చేసే ప్రయత్నం తప్ప ఇందువల్ల పెద్ద ప్రయోజనం వుంటుందని అనుకోటానికికూడా యెలానూ వీల్లేదు - పోనీ చీకటిబడ్డ తరువాతే ప్రయత్నించండి. ఇవాళ మసుకుగా కూడా వుందిలెండి - నాలుగుగంటలకే అంతా యిళ్ళకి జేరుకోవచ్చు - నేను రాత్రి తొమ్మిదయ్యేసరికి లారీగారి యింటికి తిరిగొస్తాను. అప్పటికి యేం జరిగిందీ నాకు తెలిసేలా చెయ్యండి.'

'సరే'-

'నేను వెళ్ళొస్తాను' అని సిడ్నీ బయలుదేరాడు. లారీ అతన్ని బయటిగేటుదాకా పంపించిరావటానికి బయలుదేరాడు. గేటుదగ్గిరికి వెళ్లినతరువాత లారీ నెమ్మదిగా సిడ్నీ భుజంమీద చెయ్యివేసి దిగులుగా:

'ఇదిగో - ఇటుచూడు! - నాకేమీ ఆశలేదు' అన్నాడు.

'నాకూలేదు - కాని అలా మరోసారి ప్రయత్నం చెయ్యటం మంచిది. తన భర్తను రక్షించటానికి చెయ్యవలసిన ప్రయత్నమంతా చేశామని లూసీకి కొంత ఉపశమనంగా వుంటుంది. లేకపోతే, తనభర్తను హత్యచేస్తుంటే మనకేమీ పట్టనట్టు చేతులు ముందు బెట్టుకుచూస్తూ కూర్చున్నామని మరింత యిదిగా కుములుతుంది.'

'అవునవును - ఆమాటా నిజమే' అన్నాడు లారీ, కళ్ళనీళ్లు తుడుచుకుంటూ - 'ఏది యేమైనా అతను నశించిపోవలసిన గతే - నాకు రవ్వంతైనా ఆశ కనుపించటంలేదు.

'అవును - ఏ ఆశా కనుపించటం లేదు.' అంటూ బయటికి వెళ్లిపోయాడు.

బయటికి వచ్చాడన్న మాటేగాని, యెటు బోవటానికీ అతనికేమీ పాలుబోవటంలేదు. వెర్రివాడులా, ఆ వీధివెంటా ఈ వీధివెంటా, తిరుగుతున్నాడు. ఉన్నట్టుండి అతనికి మెరుపులా

ఒక ఆలోచన తట్టింది. తనవంటి మనిషి ఒకడు ఆ ప్రాంతాల్లో తిరుగాడుతున్నట్టు ఆయా విప్లవకారుల బృందాలకు తెలియటం మంచిదనుకున్నాడు. అయితే ఇది అతి తెలివిగా నిర్వహించవలసిన వ్యవహారం: అందుకే పూర్వాపరాలన్నీ అతి జాగ్రత్తగా యోజించుకున్నాడు. 'అవును నావంటివాడొకడు ఈ ప్రాంతాలలో వున్నాడని వాళ్ళకు తెలిసివుండి తీరాలి; లేకపోతే కొన్ని చిక్కులు రావచ్చు' ననుకున్నాడు. వెంటనే సెయింట్ ఆంటోనీ వీధివేపు బయలుదేరాడు.

తాను సెయింట్ ఆంటోనీవీధిలో పానశాలను నిర్వహించుతూ వుంటానని డిఫార్జ్ అన్నమాటలు అతనికి జ్ఞాపకం వచ్చినయ్. పారిస్ నగరం బాగా యెరిగున్నవాడికి, యెవర్నీ విచారించకపోయినా, డిఫార్జ్ పానశాల యెక్కడున్నదో కనుక్కోవటం అదేమంత కష్టమైన పనిగాదు. సెయింట్ ఆంటోనీ పానశాలకు వెళ్ళటానికి నిర్ణయం చేసుకుని, మధ్య త్రోవలో ఒక హోటల్లోకి వెళ్ళి భోజనం చేశాడు. భోజనం చేసిన అనంతరం పడుకుని గాఢంగా నిద్రపోయాడు.

అతనికి తిరిగి మెలకువ వచ్చేసరికి దాదాపు రాత్రి ఏడు గంటలు కావచ్చింది. అలా కొంచెంసేపు సేద తీర్చుకుని తిరిగి బయలుదేరాడు. పోతూపోతూ మధ్య త్రోవలో ఒక దుకాణం ముందు అమర్చివున్న అద్దం కిటికీ ముందు నిల్చుని, మరీ అడివి మనిషిలా కనుపించకుండా, జుట్టూ గిట్టూ కొంచెం సరిదిద్దుకున్నాడు. అక్కడ నుంచి బయలుదేరి సరాసరి, డిఫార్జ్ పానశాలకు పోయి లోపలికి అడుగుబెట్టాడు.

అప్పటికి, జాక్విస్ నెం.3 తప్ప యితర పెద్దమనుషులెవరూ అక్కడ కనుపించలేదు. జాక్విస్ నెం.3 విచారణ సంఘంలో ఒక సభ్యుడుగా వుండి నిన్నటిదినం వెర్రికేకలెడుతూ వుండటం సిడ్నీకి జ్ఞాపకం వచ్చింది. అతను పానీయం సేకరించుతూ అమ్మకం బల్ల దగ్గిరే డిఫార్జ్ దంపతులతో బాతాఖానీ వేస్తున్నాడు. ప్రతీకారిణి కూడా వాళ్ళదగ్గిరే నిల్చుని ఏవో అవీ ఇవీ వీరాలాపాలాడుతోంది.

సిడ్నీ కార్టన్ వెళ్ళి ఒంటరిగా ఒక బల్లదగ్గిర కూర్చున్నాడు. ఫ్రెంచిభాషలో ఒక పెగ్ వైన్ కావాలని అన్నాడు. ఆ మాట విని మాడెమ్ డిఫార్జ్ అతనివంక చూచింది. అతని ముఖం చూడగానే ఆవిడకు యేదో ఆశ్చర్యం కలిగి, మరింత పరిశీలనగా చూసింది; బల్లదిగి దగ్గిరగా వచ్చి, 'ఏవిఁ కావాలండీ?' అని అడిగింది. 'వైన్ కావాలి' అని తిరిగి మరో పర్యాయం చెప్పాడు.

'ఆంగ్లేయులా?' అని తిరిగి భోగట్టాచేసింది.

'అవును'.

మాడెమ్ డిఫార్జ్ తిరిగి అమ్మకం బల్లదగ్గిరికి వెళ్ళిపోయింది. కార్టన్, పత్రిక ఒకటి తీసుకుని పేజీలు తిరగేస్తున్నాడు. మాడెమ్ డిఫార్జ్ అంటున్న మాటలు అతని చెవుల బడ్డయ్: 'అచ్చు! ఎవ్రీమూండ్‌లానే వున్నాడు'.

డిఫార్జ్ సారాగ్లాసు తీసుకొచ్చి సిడ్నీ బల్లమీద పెట్టి, 'నమస్తే' అని పలకరించాడు.

'నమస్తే' - వైన్ చాలా బాగుంది' - అన్నాడు సిడ్నీ, కొంచెం మెచ్చుకోలుగా.

డిఫార్జ్ అమ్మకం బల్లదగ్గిరికి తిరిగివెళ్ళి : 'అవును కొంచెం ఆ పోలికలున్నయ్' అన్నాడు. 'కొంతేమిటి గింత - అచ్చు అదే మోహం' అన్నది మాడమ్ డిఫార్జ్. జాక్విస్ నెం.3 అందుకున్నాడు: 'మాడమ్! నువ్వు అతని సంగతే ఆలోచిస్తూ వుండటంచేత, ఇతనిలో ఆ పోలికలు మరింత విస్పష్టంగా కనుపించుతున్నయ్'.

'అవునవును! **గెలొటైన్** దగ్గిర మళ్లీ రేపు అతన్ని చూడాలని ఉవ్విళ్ళూరు తున్నావుగాదూ అందుచేత అలా కనుపిస్తున్నాడు' అన్నది ప్రతీకారిణి.

కార్టన్ ఈ సంభాషణేమీ విననట్టు నటించుతూ పత్రికలోని పేరాలను పంక్తి తరువాత పంక్తి అతిజాగ్రత్తగా పరిశీలించుతున్నాడు. అమ్మకం బల్లదగ్గిరున్న ఆ నలుగురూ, బల్లమీద మోచేతులానించి గుసగుసా మాట్టాడుకుంటున్నారు:

'అవును మాడెమ్ చెప్పింది నిజమే - ఎందు కాగాలి - ఆ మాటలో చాలా అర్థం వుంది' అన్నాడు జాక్విస్ నెం.3.

'అదెల్లా?' - డిఫార్జ్ వాదన మొదలుపెట్టాడు: 'ప్రతీ దానికీ, ఎక్కడో ఒకచోట ఆగటమనేది వుండాలి; ఆ ఆగటం ఎక్కడా? అన్నదే యిప్పుడు ఆలోచించవలసిన సంగతి'

'సర్వనాశనం అనంతరం ఆగటం' - అన్నది మాడెమ్ డిఫార్జ్.

'సర్వనాశనం - గొప్ప సిద్ధాంతమే - నేను కాదనటం లేదు' అంటూ డిఫార్జ్ యిదౌతున్నాడు: 'కాని యీ డాక్టర్ ఉన్నాడు చూశావ్! - ఇవ్వాళ ఆయన ముఖం వంక చూశావా? ఆ ఉత్తరం చదువుతున్నప్పుడు ఆయన ముఖంవంక చూశావా? పాపం'-

'చూడకేం చూశాను - జాగ్రత్తగా పరిశీలించాను. ప్రజా ప్రభుత్వానికి నిజమైన మిత్రుడు కాదని ఆ ముఖం అద్దంలా చెబుతోంది; ఆ ముఖకవళికలు మార్చుకోలేక పోయాడంటే తను కూడా దెబ్బ తింటాడు.'

'పాపం - కూతురు అలా యిదైపోతుంటే ఆయన భరించలేక కుమిలిపోయాడు.'

'అయ్యో! ఆయన కూతురు సంగతి చూడకేం - ఇవ్వాళ చూడటమే యేవిఁటి - రోజూ చూస్తూనే వున్నాను. కోర్టులో చూశాను - జైలుగోడక్రింద వీధిలో చూశాను - అమితజాగ్రత్తగా పరిశీలించుతున్నాను' - భర్తవంక అదో కంటకంగా చూస్తూ, మళ్ళీ అందుకుంది: 'ఇదుగో! నీకోటి చెబుతున్నా విను! - ఇదంతా కేవలం నీ ఒక్కడి చేతిలోనే వుంటే - అతన్ని ఈ తరుణంలోకూడా ఒడ్డున వెయ్యటానికి ప్రయత్నించేవాడివే - నాకు తెలుసు - అదృష్టవశాత్తూ అదంతా నీ వొక్కడి చేతిలో లేదు గనక గాని' -

'చాఛా! - అదిగాదు నేనంటున్నది - ఈ వ్యవహారం యిక యిక్కడితో ఆపెయ్యటం బాగుంటుందంటున్నాను.'

మాడమ్ డిఫార్జ్‌కి వళ్లు మండిపోయింది. 'ఇదిగో! జాక్విస్, ఇటు చూడు! చెల్లీ నువ్వుకూడా విను - ఈ వంశం వాళ్లున్నారే - వీళ్లు చేసిన కిరాతాలు ఇన్నిన్నికావు - వీళ్ళ దౌర్జన్యాలు ఇన్ని కావు - ప్రజల్ని ఎంత క్రూరంగా నాశనం చేశారో మీరు ఊహించలేరు- నిర్మూలించి పారవేయవలసిన వంశంగా వీళ్లని నా జాపితాలో ఎక్కించి యేనాడైందో కావలిస్తే యీ పెద్ద మనిషినే కనుక్కోండి!'-

'అవును - ఆమాట కాదన్నానా?'-

'డాక్టర్ మానెట్ ఉత్తరం మీరంతా విన్నారు. ఆ ఉత్తరంలో ఎవ్రీమూండ్ సోదరులు నాశనరిచేసిన రైతుకుటుంబం యెవరోకాదు - మా కుటుంబమే. మానభంగంచేసి హత్యచేసింది మా అక్కను - కత్తితోపొడిచి చంపింది మా అన్నయ్యను - అలా హింసబెట్టి చంపింది మా బావను - గుండెపగిలి చచ్చిపోయిన ఆ వృద్ధుడు మానాన్న - ఆ చచ్చినవాళ్ళంతా నా వాళ్లు - దీనికంతకీ ప్రతీకారం చెయ్యటానికి మిగిలివున్నది నే నొక్కదాన్నే - ఇదంతా నిజమో అబద్ధమో ఈ పెద్దమనిషినే కనుక్కోండి!'-

'అదంతా కాదన్నానా?'

'కాదనకపోతే - ఆ ఆగటాలూ గీగటాలూ నాతోమాత్రం చెప్పకు.'

ఆ సంభాషణ విని జాక్విస్‌కూ, ప్రతీకారిణికీ మంచి హుషారొచ్చింది. మాడెమ్ డిఫార్జ్‌ని ఉవ్వెత్తుగా అభినందించుతున్నారు. అల్పసంఖ్యాకవర్గంగా తయారైన డిఫార్జ్, జమిందారు భార్య సంగతీ అదీ చెప్పి యేదోకొంత మెత్తబడెయ్యాలని చూశాడు గాని లాభంలేకపోయింది. 'ఆగటాలూ గీగటాలూ ఈ అసందర్భపు మాటలన్నీ నాతోమాత్రం చెప్పకు' అనేసింది మాడెమ్ డిఫార్జ్.

మరికొంతమంది అతిథులు బెలబెలా లోపలికి రావటంతో, ఆ సంభాషణా అంతటితో ముగిసిపోయింది. కార్టన్ అమ్మకం బల్లదగ్గిరకొచ్చి తాను చెల్లించవలసిన డబ్బులు లెక్కజూచి యిచ్చాడు. 'నేషనల్ పాలెస్‌కు ఎటు వెళ్ళాలి' అని మాడమ్ డిఫార్జ్‌ని అడిగాడు. మాడమ్ డిఫార్జ్ అతనితోపాటు వాకిట్లోకి లేచొచ్చి అతని భుజంమీద చెయ్యివేసి, అదో ధీమాగా నిల్చుని మార్గం చెప్పింది. ఆ చెయ్యి అలాగే పుచ్చుకొని, ఆ ఆడపులిని అమాంతం నేలకుబెట్టి బాదెయ్యాలని కార్టన్‌కు లోపల కొండంత ఆవేశం కలిగింది; కాని తమాయించుకుని తన త్రోవను తాను బయలుదేరాడు. ఆ బయలుదేరటం జైలు దగ్గిరికొచ్చి, ఆ జైలుగోడల నీడల్లో లీనమైపోయాడు. సరీగా తొమ్మిది కొట్టేసరికి అక్కడనుంచి బయటపడి సరాసరి లారీగారి మకాముకు వచ్చేశాడు. అమిత ఆందోళనగా లారీ గదిలో యిటునుంచి అటూ, అటునుంచి యిటూ పచారుచేస్తున్నాడు. తాను అప్పటి వరకూ లూసీదగ్గిరే వుండొచ్చాననీ, డాక్టర్ గారు యింకా యింటికి తిరిగిరాలేదని కార్టన్‌తో చెప్పాడు. డాక్టర్ బయలుదేరి వెళ్లి దాదాపు అయిదుగంటల వరకూ అయింది. ఇంతసేపూ యెక్కడున్నాడో?

కార్టన్‌తో ఈమాట చెప్పిపోవటానికే లారీ యింటికి తిరిగి వచ్చాడు. లూసీదగ్గిరికి మళ్ళీ తిరిగివెళ్ళాలని తొందరపాటులో వున్నాడు. అర్ధరాత్రి సమయానికి తిరిగి వస్తాననీ, డాక్టర్ వచ్చే వరకూ అక్కడే వుండమనీ కార్టన్‌కు చెప్పి, తను మళ్ళీ వెళ్ళిపోయాడు.

కార్టన్ ఎంతసేపో కనిపెట్టుకు కూర్చున్నాడు; డాక్టర్ రానేలేదు. లారీ మళ్ళీ తిరిగొచ్చాడు కూడా - డాక్టర్ సంగతి యేమయిందీ యేమీ తెలియలేదు.

ఆయన సంగతే ఆలోచిస్తూ యిద్దరూ నిమిషాలు లెక్కబెడుతూ కూర్చున్నారు. ఇంతసేపు ఆలస్యమైంది. గనుక ఆయన యేదో కొంత సాధించుతూ వుండవచ్చునని యిద్దరికీ రేఖగా ఆశ కలుగుతోంది. ఇంతలో మెట్లమీద అడుగుల చప్పుడు వినిపించింది; డాక్టర్ గదిలోకి అడుగుబెట్టాడు. ఆయన వాలకం చూడగానే, సర్వం వ్యర్థమైపోయినట్టు యిద్దరూ గమనించారు.

ఆయన అసలు యెవర్నేనా కలుసుకున్నాడో, లేక యింతసేపూ వట్టినే వీధులవెంట తిరుగుతున్నాడో, యిద్దరికీ అర్థంకాలేదు. డాక్టర్ వాళ్లిద్దరివంకా వెర్రిచూపులు చూస్తూ నిల్చున్నాడు. వాళ్లూ ఆయన్ను యేమీ ప్రశ్నించలేదు. వేరే ప్రశ్న దేనికి? ఆయన వాలకం చూడగానే వాళ్ళకు సర్వం అర్థమైపోయింది.

'ఎక్కడుంది? - కనిపించలేదు - నా బెంచీ యెక్కడుంది - ఆ చెప్పులు ఇవ్వాళ పూర్తి చేసెయ్యాలి - ఎక్కడున్నయ్' అంటూ బెంగగా జుట్టు పీకేసుకుంటున్నాడు. కార్టన్, లారీ యిద్దరూ ఒకరివంక ఒకరు చూసుకున్నారు. ఇద్దరి జీవాలూ క్రుంగిపోయినై.

'నేను అభాగ్యుణ్ణి! నన్నెందుకు యేడిపిస్తారు - నాసామాను నాకు యిచ్చెయ్యండి'-

'సొంతం మతిపోయింది'-

ఇక ఆ దశలో ఆయనతో ఎక్కువగా మాట్లాడి ప్రయోజనం లేదు. ఆయన్ను త్రోవకు తేవటానికి ప్రయత్నించి కూడా ప్రయోజనం లేదు. ఇద్దరూ చెరోవేపునా ఆయన భుజాలమీద చెయ్యివేసి నెమ్మదిగా కుర్చీదగ్గిరికి చేర్చి కూర్చోబెట్టారు. చెప్పులుకుట్టే సామాను వుందనీ, వెంటనే తెప్పించి యిస్తామనీ నచ్చజెప్పి కొంచెం శాంతిపరిచారు. ఆయన దిగాలుపడి కుర్చీలో కూర్చుని మండుతున్న నిప్పుల్లోకి చూస్తున్నాడు. కనుకొలకుల వెంట కన్నీరు దిగజారుతోంది.

'చివరిప్రయత్నం కూడా భగ్నమైపోయింది' అన్నాడు కార్టన్: 'సరే, అనుకున్నదే; ఈయన్ను కూతురు దగ్గిరికి తీసుకువెళ్ళండి; వెళ్లేముందు మీరు నాతో కొంచెం సావధానంగా రెండు నిమిషాలు మాట్లాడివెళ్లండి. - ఏవిఁటీ? ఎందుకూ? అని ప్రశ్నించకండి- నేను చెప్పినట్టు చెయ్యండి - బలమైన కారణంవుండే చెబుతున్నానుకోండి'-

'సరే చెప్పు-నీమాట నేనెప్పుడు శంకించాను?' అన్నాడు లారీ.

కార్టన్ క్రిందికి వంగి, డాక్టర్ లోపలికి వస్తూనే చికాగ్గా విప్పేసి క్రింద బారేసుకున్న కోటుతీశాడు. ఆతియ్యటంలో ఆ కోటుజేబులోనుంచి ఒక చిన్ని తోలుసంచీ క్రిందపడ్డది. దాంట్లో చిన్ని కాయితాలు దాచుకునే అలవాటు. కార్టన్ ఆ తోలు సంచీలోనుంచి మడిచివున్న ఒక కాయితంముక్క బయటికి తీశాడు.

ఆ కాయితం విప్పి చూసి, కార్టన్ 'అమ్మయ్యా!' - అనుకొన్నాడు.

'ఏమిటీ?-'

ఆ మాటకు సమాధానం చెప్పకుండానే కార్టన్ తనకోటు జేబులోనుంచి మరో కాయితంముక్క బయటికితీసి లారీగారికి అందించాడు: 'ఇది చూశారూ! నాప్యాసుపోర్టు- సిడ్నీ కార్టన్ అనే వ్యక్తి ఈ నగరంలోనుంచి బయటపడటానికి కావలసిన ప్యాసుపోర్టు. ఇది మీదగ్గిర వుంచండి చెబుతాను. నేను అతన్ని చూట్టానికి వెడదామనుకుంటున్నాను గదూ- దాన్ని జైల్లోకి నాతో తీసుకుపోవటం మంచిదిగాదు లెండి.

'ఏం?'

'ఏమీలేదు లెండి - వెంట దేనికీ అని - సరే యీ కాయితం తీసుకోండి'- డాక్టర్ జేబులోనుంచి తీసిన కాయితం కూడా అందించాడు: 'ఇది డాక్టరుగారూ, ఆయన కుమార్తె, మనమరాలూ నగరం విడిచివెళ్ళటానికి కావలసిన ప్యాసుపోర్టు.'

'సరే.'-

'ఎటుపోయి ఎటొచ్చినా మంచిదని డాక్టర్‌గారు యీ ప్యాసుపోర్టు నిన్ననే సంపాదించివుంటారు. ఈ రెండు కాయితాలూ మీదగ్గిర భద్రంగా వుంచండి. ఇలాంటి ప్యాసుపోర్టు ఆయన సంపాదించుకుని వుంటాడని నేను యిదివరకే అనుకున్నాను. అయితే ఒకటే - దీన్ని వాళ్ళు రద్దుచేసి పారెయ్యకుండా వుండాలి - వెంటనే రద్దుచేసేస్తారేమోననే నా భయం - అలా అనుకోవటానికి కారణాలు వున్నయ్‌లెండి.'-

'వాళ్లు మరేం ప్రమాదావస్థలో లేరు గద'-

'ప్రమాదావస్థ అని నెమ్మదిగా అంటారేవిఁటి? ప్రాణాపాయస్థితిలో వున్నారు. మాడమ్ డిఫార్జ్ - తండ్రీ కూతుళ్లిద్దరి మీదా స్వయంగా నేరారోపణ చేయబోతోంది. ఈ మాట ఆ ఆడపులి అరుస్తుంటే స్వయంగా విన్నాను. అది ఇంకా చాలా సంగతులు మాట్లాడింది; వాళ్ళకు ప్రమాదస్థితి కలగబోతున్నదన్నమాట మాత్రం నిజం. అప్పటినుంచీ నేను క్షణమైనా వ్యర్థం చెయ్యలేదు. గూఢచారిని కూడా కలుసుకుని భోగట్టా తీశాను. అతనుకూడా యీ సంగతి నిజమే నన్నాడు. జైలుగోడ ప్రక్కనున్న కట్టెలడితీలో కట్టెలు గొట్టేవాడొకడున్నాట్ట; వాడిచేత మాడమ్ డిఫార్జ్ రీహార్సల్ చేయిస్తోందిట. లూసీ జైలుగోడ క్రింద నిల్చుని పైనున్న కిటికీవంక చూసి సంజ్ఞ చేస్తుండగా తాను చూసినట్టు వాడిచేత సాక్ష్యం చెప్పించబోతున్నారు. జైల్లో వున్న ఖైదీలతో కలిసి కుట్రబన్నుతున్నట్టు నేరారోపణ చెయ్యబోతున్నారన్నమాట. లూసీతోపాటు లూసీ బిడ్డా, తండ్రీ కూడా వుండటం వాడు చూశాట్ట - అంటే యిది ముగ్గుర్నీ మెడ తుంచుకు పోబోతోందన్నమాట - అలా కంగారు పడకండి - మీరు వాళ్ళ ప్రాణాలు కాపాడాలి'-

'భగవంతుడు నాకు అలాంటి అవకాశాన్ని ప్రసాదించటం కంటే యింకేం కావాలి- కాని ఎలా?'

'నేను చెబుతున్నాగా - ఇప్పుడు యిదంతా మీ ఒక్కడి మీద ఆధారపడివుంది. ఈ నేరారోపణ చెయ్యటానికి యింకా రెండుమూడు రోజులు అవధి వుండి తీరుతుంది. ఎందుకంటే ఇది ప్రభుత్వ విద్రోహ నేరంచూడండి! - ప్రభుత్వం తలగొట్టించిన నేరస్థుడి కోసం దుఃఖించటంకూడా ఒకనేరం. డార్నే కోసం లూసీ, డాక్టరూ యేడవటం ఎలాగో సహజం - ఆ యేడవటం మాడమ్ డిఫార్జ్ మోపబోతున్న అభియోగానికి మరింత బలం; అందుచేత ఆ సంఘటనకూడా పూర్తి అయేవరకూ వ్యవధి తీసుకుంటుంది - సరీగా వింటున్నారా? ఇదంతా మీకు బాగా అర్థమౌతోందా?

'చాలా జాగ్రత్తగా వింటున్నాను'

'మీదగ్గర డబ్బుందిగదూ - ఓడరేవుకు వెళ్ళిపోవటానికి వెంటనే ప్రయాణపు టేర్పాట్లు చెయ్యండి. రేపు ఉదయానికే గుర్రపు బగ్గీ సిద్ధం చెయ్యండి; ఏదిఏమైనాసరే రేపు మధ్యాహ్నం రెండుగంటలయేసరికి టంచన్‌గా బయలుదేరి వెళ్లిపోయే సన్నాహమంతా సిద్ధం కావాలి.'

'ఓ తప్పకుండా చేస్తాను.'-

'ఈ రాత్రే లూసీకి చెప్పండి - తనకే కాకుండా తన తండ్రికీ బిడ్డకీ కూడా పీకెలమీదికి వస్తుందని చెప్పండి; ఆసంగతి ఎలా నచ్చచెప్పి ఒప్పిస్తారో! ఇది తన భర్తచేసిన తుది యేర్పాటుగా ఆవిడతో చెప్పండి. తాను ఊహించగలిగిన దానికంటే - తాను ఆశించినదానికంటే మరింత ప్రయోజనం సాధించటానికి యిందువల్ల అవకాశం కలుగుతుందని చెప్పండి.' ఈ స్థితిలో కూడా, డాక్టర్, కుమార్తె ఎలా చెపితే అలా వింటాడనుకుంటాను.'

'ఓ! తప్పకుండా వింటాడు.'

'సన్నాహమంతా ఈ ప్రహరీ గోడలోపలే చేసెయ్యండి - అంతా బండిలోఎక్కి కూర్చోవటందాకా - నేను రాగానే తక్షణం నన్నుకూడా ఎక్కించుకుని బండి తోలించెయ్యండి.'

'అంటే పరిస్థితులు ఎలావున్నా నువ్వు తిరిగివచ్చేవరకూ నిరీక్షించుతూ వుండమనేగా నువ్వు చెబుతున్నదీ'-

'అందరి ప్యాసుపోర్టులతోపాటు నా ప్యాసుపోర్టు కూడా మీదగ్గిర వుంటుందిగా- అంటే నాకోసం సీటు ఉంచుతారన్న మాట; ఆ సీటులోకి మనిషి భర్తీకాగానే బండి బయలదేరదీస్తారూ ఇందులో ఏముందీ'-

లారీ అమితోత్సాహంగా కార్టన్ చెయ్యిబట్టుకున్నాడు: 'ఇదంతా ముసలివాణ్ణి నాఒక్కడివల్లా ఏమౌతుంది - చురుకైన యువకుడెవడేనా ప్రక్కను లేకపోతే'

'భగవంతుడి కృపవల్ల మీకు అలాంటిది లభించి తీరుతుంది - మీరుమటుకు ఒకటి వాగ్దానం చెయ్యాలి - ఆరు నూరైనా సరే, నూరు ఆరైనాసరే మనమనుకున్న పద్ధతిలో అణుమాత్రంకూడా వ్యత్యాసం రాకుండా మీరు నిర్వహించాలి.'

'అణుమాత్రం కూడా వ్యత్యాసం రాదు కార్టన్! భగవంతుడి ముఖంచూసి వాగ్దానం చేస్తున్నాను'

'సరే మీబాధ్యత మీరు నిర్వహించండి - నేను చెయ్యగలిగిందేమిటో నేను చేస్తాను- నమస్తే! వెళ్ళొస్తాను.'

47

ఆరోజు తల తెగిపోవలసివున్న హతభాగ్యులు, కాన్‌సెర్ జరీ చీకటికొట్లలో తమ అంతిమ ఘడియలు లెక్కబెట్టుకుంటూ కూర్చున్నారు; మొత్తం ఏభైయిద్దరు; ఆ యేభైయిద్దరూ ఆనాటి బలిమేకలు.

చార్లెస్ డార్నే తన చీకటికొట్లో, ఒంటరిగా, కుదబడి కూర్చునున్నాడు. అతనికి మృత్యువు తప్పదనీ, ఎలాంటి పలుకుబడి వున్నవారైనా, తనను యిక రక్షించలేరని, క్రితంరోజున జరిగిన విచారణ సమయంలోనే అతను విస్పష్టంగా గ్రహించాడు. మనస్సును కూడదీసుకుని ప్రశాంతంగా మృత్యువును ఎదుర్కోవటానికి ప్రయత్నించుతున్నాడు. కాని అమాయికలైన

తన భార్య, కుమార్తెల దీనవదనాలు అతని మనోవీధిని గోచరించి: "మాగతి యేవిఁటి?" అని వాపోతున్నయ్. అతని మనస్సు కల్లోలమై పోతోంది.

క్రితం రాత్రి తెల్లవార్లూ అతను నిద్రపోలేదు. జైలు అధికారులకు లంచమిచ్చి సంపాదించుకున్న క్రొవ్వువత్తి దీపంముందు కూర్చుని, లూసీ పేర ఒక పెద్ద ఉత్తరం వ్రాశాడు. ఆ లేఖలో ఇలా వ్రాశాడు:

'మీ తండ్రిని మావాళ్ళు జైళ్లోపెట్టిన సంగతి నాకు రవ్వంతకూడా తెలీదు. ఆ విషయంలో నేను పూర్తిగా నిర్దోషిని; నిన్నటి విచారణలో మీ నాన్నగారి లేఖ బయటికి వచ్చే వరకూ నాకు ఈ షణ్మాత్రంకూడా తెలీదు. కేవలం, మీ నాన్నగారికి యిచ్చిన వాగ్దానం నిలుపుకోటానికి, నా అసలుపేరు నీకు తెలియకుండా దాచివుంచాననే సంగతి నీకు తెలుసు. మన వివాహం జరిగిననాటి ఉదయం నాచేత ఆయన తాను బాస్టిల్లీ చీకటిఖైదులో దాచివుంచిన ఈ చీటీ సంగతి మరచిపోయి అయినా వుంటారు; లేదా, బాస్టిల్లీ పతనమైపోయినప్పుడు ఆ శిధిలాలలో అదికూడా నాశనమైపోతుంది లెమ్మని అనుకునైనా వుండవచ్చు. ఇదంతా గతచరిత్ర; ఈ విషయమై జ్ఞాపకంచేసి ఆయనమనస్సుకు వేదనకల్పించవద్దు; ఈ వ్యవహారంలో ఆయన చేసింది యేమీలేదని ఆయనకు నచ్చచెప్పి, ఆయన్ను ఓదార్చుకునే బాధ్యత అంతా నీమీదవున్నది. బిడ్డకోసం నీవు నీదుఃఖాన్నంతా మరచిపోగలవని ఆశించుతున్నాను.'

అదే ధోరణిలో మామగారికికూడా మరో ఉత్తరం వ్రాశాడు. దాన్లో 'నాభార్యనూ బిడ్డనూ మీకు ఒప్పగింత చేస్తున్నాను' అని వ్రాశాడు.

లారీగారికి కూడా ఒక ఉత్తరం వ్రాశాడు: 'దాన్లో తన లౌకిక వ్యవహారాల విషయమంతా వ్రాశాడు. ఆయన తన కుటుంబంపట్ల చూపుతున్న సానుభూతికి కృతజ్ఞత తెలియజేశాడు. ఇందరికీ వ్రాశాడేగాని, కార్టన్ విషయం అతనికి జ్ఞాపకమే రాలేదు.

ఈ ఉత్తరాలు పూర్తిచేసి, అతను ఆగదిలో పడేసి వున్న గడ్డిపరుపుమీద నడుం వాల్చాడు. తనకు యీ ప్రపంచంతోగల సర్వవ్యవహారాలూ ముగిసిపోయినై అనుకున్నాడు.

కాని, కాస్త, అలా, మగతగా నిద్రపట్టేటప్పటికి జీవితం తనను మళ్ళా వెనక్కు పిలుస్తున్నట్టనిపించింది. ఒక విచిత్రమైన కలగన్నాడు. తాను సర్వస్వతంత్రుడుగా హాయిగా, సాహోస్క్వేర్ భవనంలో లూసీతో సుఖంగా కాపురచేస్తున్నట్టు జరిగినదంతా కేవలం తనకువచ్చిన ఒక పీడకల అని లూసీతో చెబుతున్నట్టూ కలగంటున్నాడు. ఇంతలో తెల్లవారిపోయి నిద్ర మెలుకువ వచ్చేసింది. చుట్టూవున్న పరిసరాలన్నీ కలియజూచుకున్నాడు. 'ఈవేళ నన్ను తల నరికేరోజు' అని అతనికి జ్ఞాపకమొచ్చింది.

ఆందోళనపడుతున్న హృదయంతో అతను గదిలో ఇటూ అటూ వెర్రివాడులా పచారుచేస్తున్నాడు. గంటలు నిమిషాల్లా గడిచిపోతున్నయ్. పన్నెండుకూడా దాటిపోయింది.

శిరచ్ఛేదాలు జరిగేది 3 గంటలకని అతనికి తెలుసు; అందుచేత రెండు గంటలకే బయటికి తీసుకువెడతారు. ఈ రెండు గంటలలోనూ మనస్సును కూడదీసుకుని ధైర్యం తెచ్చుకోవాలనుకున్నాడు.

అతనికి క్రమేపి కొంచెం మనోదార్ఢ్యం కలుగుతోంది; తనకు అలాంటిశక్తిని ప్రసాదించుతున్నందుకు భగవంతుడికి నమస్కారం చేశాడు. ఒంటిగంట కూడా వినిపించింది. 'ఇక ఒక్కగంట' అనుకుంటూ మళ్లా అటూ యిటూ పచారు చేస్తున్నాడు.

గది కట కటాలకు ప్రక్కగావున్న రాతి మెట్లమీద అడుగుల చప్పుడు వినిపించింది. అతను చకితుడై నిలబడి ఆలకించాడు. ఎవరో తానున్న గది తాళం తెరుస్తున్నట్టు కిరకిరగా ధ్వని వినిపించింది.

'నేను ఆయన కెప్పుడూ యిక్కడ కంటబడలేదు – మీరు ఒక్కరే లోపలికి వెళ్ళండి' అనే మాటలుకూడా, కొంచెం అస్పష్టంగా చెవులబడ్డయ్.

ఈలోగానే తలుపు తెరుచుకుంది; చిరునవ్వు నవ్వుతూ సిడ్నీ కార్టన్ కట్టెదుట కనిపించాడు. పెదవులమీద వ్రేలు వేసుకుని బిగ్గరగా మాట్లాడవద్దని సంజ్ఞ చేస్తున్నాడు. కార్టన్ మొహం మీద అదో విచిత్రమైన మహోత్సాహం, డార్నేకు గోచరించుతోంది. కార్టన్ అలా వుండటం అతనెప్పుడూ చూళ్ళేదు. ఒకవేళ అసలు అక్కడవున్నది కార్టన్ కాదేమో? తన మనస్సు కల్పించుకుంటున్న భ్రమరూపమేమో అని అనుమానపడుతున్నాడు.

ఇంతలోనే కార్టన్ అతనితో కరచాలనం చేసి పలకరించటంతో అతనికి ఆ అనుమానం తొలగిపోయింది.

'బహుశా నేను యిక్కడికి వస్తానని నువ్వు అనుకుని వుండవు.'

'అసలు నీ ముఖం చూసి కూడా నమ్మలేకపోయాను – నిన్ను కూడా ఖైదుచేశారా?'

'ఎబ్బే! అలాంటి దేవీఁలేదు. ఏదోవిధంగా, ఇక్కడ వుండే జైలుగొర్రెల్లో వొకణ్ణి నేను స్వాధీనం చేసుకోగలిగాను; వాడిద్వారా యిక్కడికి రాగలిగాను – నన్ను నీ భార్యే పంపింది డార్నే!'–

'ఆఁ! – ఏవిఁటి?'–

'నాద్వారా నీకు ఒక విజ్ఞప్తి పంపుకుంది – అలా నువ్వు నడుచుకోగలవని ఆశించుతూ, నీకు అత్యంత ప్రియతమమైన తియ్యని గొంతుతో అతి దీనంగా వేడుకుంది'–

డార్నే కంట తడిబెట్టాడు:

'అది యేవిటనిగాని, ఆ సందేశాన్ని నేనెందుకు తీసుకువచ్చాననిగాని నీవు అడక్కు; అదంతా చెప్పటానికి యిప్పుడు వ్యవధిలేదు నువ్వు తొడుకున్న బూట్లు, చరచరా విప్పేసి, నా బూట్లు వేసుకో'– అంటూనే మెరుపుతీగలా విజృంభించి సిడ్నీని వెనకనున్న వోటికుర్చీమీద కూలేసి బూట్లు చరచరా తొడిగేస్తున్నాడు:

'ఊఁ! – వ్యవధిలేదు – త్వరగా తగిలించేసుకో'–

'కార్టన్! వెర్రిప్రయత్నం చెయ్యకు – ఇక్కడనుంచి తప్పించుకోవటం అసంభవ కార్యం– నాతోపాటు నువ్వు కూడా హతమారిపోవటం తప్ప మరో ప్రయోజనం వుండదు'

'తప్పించుకోమని నేనంటే పోనీ నీవా మాట అనొచ్చు – ఆ మాటంటున్నానా? నేను యీగడపదాటి నిన్ను అవతలికి పొమ్మన్నప్పుడు – "అది పిచ్చి" అని నువ్వు అప్పుడను.

నీమెడలోవున్న పుష్లరు ఇలా పారేసి ఇది తీసుకో, ఆకోటు కూడా ఇలాతే; జుట్టులోవున్న ఆ రిబ్బన్ ఊడదీసి ఇలా నాకు మల్లే జిర్రబొచ్చులా చీకిరిబాకిరి చేసుకో!'- ఢార్నే కార్టన్ ముందు పసిబిడ్డలా అయిపోయాడు. కార్టన్ రెండునిమిషాల్లో అతన్ని మార్చిపారేశాడు.

'కార్టన్! - అసంభవం - పిచ్చి! - నాకు నీ దుఃఖం కూడా తెచ్చిపెట్టకు' డార్నే కళవళంగా గోలబెడుతున్నాడు.

'ఇష్! - గడప దాటమన్నప్పుడుగా? - కలం కాయితం తీసుకో; నేను చెబుతున్న ఈ రెండుముక్కలూ వ్రాయి - చెయ్యి వొణికించకు' - డార్నే చెయ్యి ఒణుకుతూనే వుంది:

'ఎవరిపేర?'-

'ఎవరిపేరూ అక్కర్లేదు - చెప్పింది వ్రాయి'

'తారీఖు?'-

'అక్కర్లేదు'-

ప్రశ్న ప్రశ్నకూ డార్నే కార్టన్ ముఖంలోకి చూస్తున్నాడు. కార్టన్ చొక్కాలోపలి జేబులోకి చెయ్యిదోపుకుని, డార్నే మీదవంగి, చెబుతున్నాడు:

'నీకు జ్ఞాపకమున్న దనుకుంటాను - నీవు అలాంటిమాటలు మరచిపోవు - ఈ ఉత్తరం చూస్తే ఆనాడు నేను అన్నమాటలు నీకు జ్ఞాపకం వచ్చి తీరతై-'

డార్నే తల పైకెత్తిచూచాడు - 'ఆఁ! - ఏవిఁటది? ఆయుధమా?'

'ఎబ్బే ఆయుధమేంటీ?'-

'మరి నీచేతిలో అదేవిటి?'

'చెబుతాగా - ఈరెండు ముక్కలూ కూడా వ్రాయి'.

'ఆడినమాట నిలబెట్టుకోవటానికి యిప్పుడు అవకాశం లభించినందుకు ఎంతో ఆనందించుతున్నాను. ఇందులో ఎవ్వరూ ఏవిధంగా విచారపడవలసింది, అణుమాత్రం కూడా లేదు' - ఈ మాటలు చెబుతూనే తనచేతిని నెమ్మదిగా డార్నే ముఖంమీదికి పోనిచ్చాడు. డార్నే చేతిలోనుంచి కలం జారిపోయింది.

'ఆఁ! - ఆ పొగేవిటి?'

'పొగెక్కడా'-

'ఇప్పుడు కనిపించిందే'-

'ఎబ్బే పొగేవిటీ - ఈ రెండుముక్కలూ కూడా వ్రాయి!'

డార్నే వ్రాయటానికి ప్రయత్నించాడుగాని అతని మెదడు పనిచెయ్యలేదు - కళ్ళకు యేదో మైకం కమ్మేసింది. కలం దానంతటి కది యేదో పిచ్చిగీతలు గీసేస్తోంది. 'సరే వ్రాయి!' అంటూ మళ్ళా చెయ్యి ఒకసారి డార్నే ముక్కుదగ్గిరికి పోనిచ్చాడు. డార్నే కలవరంగా లేచి కార్టన్‌మీద కలబడబోయాడు. కాని యీలోగానే కార్టన్ అతన్ని వాటేసుకుని తన వ్రేళ్ళను అతని ముక్కు దగ్గిరబెట్టి గట్టిగా అదిమి పట్టుకున్నాడు. ఒకటి రెండు క్షణాలు ఇటూ అటూ గింజుకొని డార్నే స్పృహలేకుండా క్రిందికి వాలిపోయాడు. డార్నేవిడిచిన దుస్తులు, కార్టన్ చకచకా తొడిగేసుకున్నాడు. జుట్టు కొనగోట దువ్వుకొని రిబ్బన్ ముక్కతో ముడేసుకున్నాడు. 'ఇదిగో - రా లోపలికి'- నెమ్మదిగా పిలిచాడు. జైలుగొర్రె బర్సాద్ లోపలికొచ్చాడు.

'ఇదిగో - ఇప్పుడు చూసుకో - నీకు ప్రమాదమేమీ రాదని ధైర్యమేనా?'

'నాకు యిందువల్ల వచ్చే ప్రమాద మేమీలేదు - మీరు మనం అనుకున్న ప్రకారం చివరిదాకా నిలబడాలి.'

'భయపడకు - ఆమరణాంతం మాట చెల్లించుకుంటాను.'

'యీ యాభైరెండు సంఖ్యకు తరుగు కనుపించిందంటే నేను హతమారిపోతాను'-

'మరేం భయపడకు - యివ్వాళతో నీకు నా భయం శాశ్వతంగా తీరిపోతుంది - ఊ! - ఇక త్వరగా నన్ను బయటికి తీసుకువెళ్ళిపో'- 'మిమ్మల్నా!'-

'నేనంటె అతనోయ్ వెర్రి మొహమా! - అతను నేనుగా మారిపోలేదూ? సహాయం తెచ్చుకున్నావుగా - నన్ను లోపలికి తీసుకొచ్చిన ద్వారం వెంటే బయటికి తీసుకుపోండి'

'అవును అలాగే చేస్తాంలెండి'-

'నేను లోపలికివచ్చేటప్పుడు చాలా బలహీనంగా వున్నాగాదూ - ఇక్కడ మరణించబోతున్న మిత్రుడితో మాట్లాడటంతో మరింత తల్లడిల్లి మూర్ఛవచ్చేసిందన్నమాట. ఊఁ! త్వరగా పనిచూడు!-

'మీరు నా పీకె మీదికి తేరుగదా'-

'ఓరి వెర్రి మనిషీ! ఇంకా అనుమానమేనా? - త్వరగా బయలుదేరు - నువ్వే స్వయంగా బండిదగ్గిరికి చేర్చి, లోపల కూర్చోబెట్టు: రాత్రి నేను చెప్పినసంగతి లారీగారికి జ్ఞాపకం చెయ్ - జాగ్రత్త అని హెచ్చరించు - వెంటనే బండి తోలించెయ్యమను'- గూఢచారి బయటికి వెళ్ళి యిద్దరు మనుషుల్ని వెంటబెట్టుకుని రెండు సెకండ్లలో లోపలికి తిరిగివచ్చాడు. ఈలోగా కార్టన్ ముఖం చేతుల్లో కమ్మేసుకుని, అమితదుఃఖంలో వున్న వాడులా నటించుతూ ఓటి కుర్చీమీద కూర్చున్నాడు.

'స్నేహితుడికి **గెలటైన్** లాటరీలో టిక్కెట్టొచ్చిందని మనవాడికి గుండెలు ఆగిపోయాయేవిటి?' అంటూ, పడివున్న దేహాన్ని చూసి పరాచికమాడాడు, ఆ వచ్చినవారిలో ఒకడు. స్పృహతప్పి పడివున్న ఆ దేహాన్ని డోలీలోకి యెత్తుకుని ముగ్గురూ కలిసి బయటికి మోసుకుపోయారు. ఆ గదికి మళ్ళీ తాళం పడిపోయింది. కార్టన్ ఒంటరిగా లోపల కూర్చున్నాడు. జీవితంలో ఒక మహావిజయాన్ని సాధించినవాడి ధీమాతో అతని హృదయం విప్పారుతోంది. నిమిషాలు లెక్కబెట్టుకుంటూ కూర్చున్నాడు.

జైలు జేగంట భాంకరించింది. రెండుగంటలు! - అతను చలించలేదు; జైలుగదులు ఒకటొకటే తెరుచుకుంటున్నట్టు 'కిరకిరా', శబ్దాలు వినిపించుతున్నయ్. చివరికి తనువున్న గది తలుపుకూడా తెరుచుకుంది. చేతిలో ఒక జాబితా పుచ్చుకుని జైలు వార్డర్ లోపలికొచ్చాడు: 'ఎవ్రీమూండ్! లేచిరా?' అని కేకబెట్టి బయటికి నడిచాడు. అతన్ని ఒక పెద్దహాల్లోకి తీసుకువెళ్లారు. ఆ హాలుకూడా కన్ను పొడుచుకున్నా కనుపించకుండా చీకటిగా వుంది. ఆ హాల్లో ఇంకా చాలామందివున్నట్టు కార్టన్ గ్రహించాడు. అందరూ క్రీనీడలుగా కనుపిస్తున్నారు. కొంత మంది కూర్చున్నారు - కొంత మంది చతికిలబడిపోయున్నారు. కొందరు ఇటూఅటూ గిజాటుగా తిరుగుతున్నారు; కొందరు ఏడుస్తున్నారు. కొందరు అతిమౌనంగా కూర్చున్నారు. అందరి చేతులకు సంకెళ్ళు వేస్తున్నారు.

కార్టన్ అక్కడ నిల్చునుండగా, ఆ ప్రక్కనుంచి వెడుతున్న ఒక ఖైదీ అతన్ని యెరిగున్నవాడల్లే అతి ఆప్యాయంగా కావలించుకున్నాడు. ఆ సంగతి బయట బడిపోతుందేమోనని కంగారు పడ్డాడు. కాని అదృష్టవశాత్తూ అతను అవతలికి వెళ్లి పోయాడు. మరికొంచెం సేపటికి, హాల్లో మరో మూలనుంచి, చాలా చిన్న వయసులోవున్న ఒక స్త్రీ అతని దగ్గిరికిలేచి వచ్చింది; ఆ స్త్రీ దూరంగా వున్న ఒక కుర్చీమీద కూర్చుని అతని వంక చూస్తూవుండటం అతను చాలాసేపటినుంచీ గమనించుతూనే వున్నాడు. సన్నగా బక్కపరచగా వుంది. అతి నాజూకుగా వున్న చక్కని ముఖం; కాని ఆముఖంలో యెక్కడా రక్తమనేది లేక తెల్లగా పాలిపోయివుంది.

'ఎవ్రీమూండ్! జ్ఞాపకమున్నానా? - నీతోపాటు లాఫోర్స్ జైల్లో వుండేదాన్ని - కుట్టుపని చేసుకు బ్రతికే బీదదాన్ని' అని పలకరించింది.

'జ్ఞాపకం వుందిగాని' అని నసికాడు కార్టన్ : 'నిజానికి నీమీద మోపిన నేరమేవిఁటో మరిచిపోయాను' అన్నాడు.

'ఏముందీ - రాజకీయ కుట్ర చేశానన్నారు - భగవంతుడి ముఖంచూసి చెబుతున్నాను - అలాంటి దేవీఁ నేనెరగను - అయినా వాళ్ళ వెర్రిగాని, నావంటి బీదదానితో ఎవడేనా రాజకీయాలసంగతి ఆలోచించుతాడా? - పైగా కుట్రచేశానంటారు.'

ఆమాట విని పాపం అతనికి జాలివేసింది - రిపబ్లిక్ ప్రభుత్వం బీదవాళ్ళకి యెంతో మేలుచేస్తోంది. అలాంటి ప్రభుత్వానికి ఏదేనా ప్రయోజనం కలుగుతుందంటే ప్రాణాలు ఆర్పించటానికి నేను విచారించను. నావంటి బీదవాణ్ణి హత్యచేయటం వల్లయేవిఁ జరుగుతుందనేదే నాకు అర్థం కావటంలేదు.'

ఆ అమాయకురాల్ని చూస్తే కార్టన్‌కు కడుపు తరుక్కుపోయింది.

'ఎవ్రీమూండ్! - నిన్ను విడుదల చేశారన్నారే - వట్టిదేనా?'-

'విడుదల చేశారు - కాని మళ్ళీ అరెస్టు చేశారు.'

'ఎవ్రీమూండ్! - నన్ను నీతోపాటు తీసుకువెడితే, కాస్త నీచెయ్యి పట్టుకుని కూర్చోనిస్తావా? - నాకు భయం కాదు - చాలా బలహీనంగా వున్నాను కాదూ, కాస్త ధైర్యంగా వుంటుంది.

ఈ మాటలంటూ అతని ముఖంలోకి పరిశీలనగా చూసి విభ్రాంతి పడ్డది. పనితోనూ, అన్నంలేకనూ వూచలు తేలిపోయివున్న ఆ స్త్రీ మునివ్రేళ్లు అందుకుని సకరుణంగా పెదవులకు హత్తుకున్నాడు.

'అతనికోసం నువ్వు చచ్చిపోబోతున్నావా?' అంది రహస్యంగా.

'అతని భార్యకోసం, బిడ్డకోసం - హష్! - బిగ్గరగా మాట్లాడకు'-

'నువ్వు యెవరో మహాపురుషుడివిలా వున్నావు - ధైర్యసాహసాలు తొణికిస లాడుతున్న నీచేతిని నన్ను బలంగా పట్టుకోనీ'-

'అలాగే చెల్లీ! - చివరి ఘడియవరకు నీచెయ్యి వొదిలిపెట్టను - భయపడకు - ఇలారా?'

48

ఇలా యిక్కడవుండగా, అక్కడ పారిస్ నగరంలోనుంచి బయటికి వెళ్ళిపోతున్న గుర్రపుబగ్గీని ఉత్తరద్వారం దగ్గిర ప్రజాప్రభుత్వ పోలీసులు అటకాయించి సోదా చేస్తున్నారు.

'బండిలోవుంది ఎవరు? ఎక్కడికి వెడుతున్నారు -ప్యాసుపోర్టు లెక్కడ.'

ప్యాసుపోర్టులు తీసుకుని ఒకటొకటే చదువుతున్నారు.

'అలెగ్జాండర్ మానెట్ - వైద్యవృత్తి - ఫ్రెంచి జాతీయుడు - ఎవరాయన?'-

'ఇదిగో యీ మతిలేని ముసలాయినే నండి.'

'ఆయన కుమార్తె లూసీ - ఎవరు?'-

'ఇదిగో యీవిడ'-

'మనుమరాలు - ఎవరు?'

'ఈ చిన్నపిల్ల'-

'సిడ్నీ కార్టన్ - ఆంగ్లేయుడు - ప్లీడరీవృత్తి - ఎవరు?'

'ఇదిగో ఈయనేనండీ - ఈ మూర్ఛపోయివున్న మనిషి - రిపబ్లిక్ ప్రభుత్వ ఆగ్రహానికి పాత్రుడైన ఒక మిత్రుణ్ణి కోల్పోయి విచారంలో వున్నాడు లెండి - నగరందాటి కొంచెం పొలాలమీది ఆరోగ్యకరమైనగాలి సోకితే తేరుకుంటాడు.'

'సరే!' - రిపబ్లిక్ ప్రభుత్వం ఆగ్రహానికి పాత్రుడైన వాళ్లు ఎందరులేరు - ఈయన స్నేహితుడు ఒక్కడే దిగొచ్చాడా యేవిఁటి? - గాలి బాగా తగిలేట్టు అలా కిటికీదగ్గిరగా కూర్చోబెట్టండి, తేరుకుంటాడు - సరే! జర్విస్ లారీ, ఆంగ్లేయుడు - బ్యాంకీ గుమాస్తా- ఎవరు?'

'నేనేనండి'-

సోదా పూర్తీ అయింది. లారీ పోలీసు ఉద్యోగుల కాయితాలమీద ప్రతి వ్రాలు చేసి యిచ్చాడు. సరే యిక పోవచ్చునన్నారు.

బండి మళ్ళీ ఆఘమేఘాలమీద బయలుదేరింది; 'అమ్మయ్యా! ఒక ప్రమాదం గడిచింది' అనుకున్నాడు లారీ.

'ఇంతకంటే కొంచెం తొందరగా గుర్రాల్ని తోలగూడదా' అన్నది లూసీ కొంచెం ఆందోళనగా.

'వద్దు తల్లీ నీకు తెలీదు - పారిపోతున్నామనే అనుమానం కలుగుతుంది'-

'ఎవరేనా వెనక తరుము కొస్తున్నారేమో కాస్త చూడండి'

'లేదు తల్లీ గాబరాపడకు.'

బగ్గీ, చెట్లూచేమా పొలాలూ బట్టాగడిచి రివ్వున వెళ్లిపోతోంది. బండి తోలుతున్న కోచ్‌వాళ్లు యిద్దరు ఒకరితోఒకరు ఏదో మాటాడుకుని ఒకరి ముఖం వంక ఒకరు తీవ్రంగా చూసుకున్నారు. చక్న గుర్రాల కళ్లాలు బిగబట్టారు. గుర్రాలు నిలిచిపోయినై. బండిని ఎవరో వెంబడిస్తున్నారు కాబోలు.

'ఇదిగో ఏవండోయ్!' అంటూ బండిలోకి వెనక్కు తొంగి చూసి కేకబెట్టాడు, వాళ్ళల్లో ఒకడు.

'ఏవిఁటీ?' అన్నాడు లారీ, కంగారుగా కిటికీలోనుంచి బయటికి తొంగిచూస్తూ.

'ఎంతమందండీ.'

'ఎవరూ?'

'అదిగాదండీ - ఇయ్యాల **గెలటైన్** నరికేది ఎంతమందినీ?'

'అదా, ఏవిటోననుకున్నాను - ఏభైయిద్దరు.'

'సెభాస్ - బేసుగ్గావుండది - ఇంకా మరోపదిమందిని నరికేస్తే మరీ బాగుంటది- మావోడు అంతమంది లేరంటావుండాడులెండి - **గైలటైన్‌లో** ముడుసులు తెగుతావుంటే బలే ఉశారుగా వుంటది - 'చల్' కొరడాతో గుర్రాల్ని అదిలించాడు. బండి మళ్లీ రివ్వున సాగిపోతోంది. రోడ్డుకు యిరువైపులా వున్న చెట్లు రివ్వురివ్వున వెనకకు పరుగెత్తుకు పోతున్నయ్.

49

మేడమ్ డిఫార్జ్ ఒక చిన్ని ఆత్యవసర సమావేశం యేర్పాటుచేసింది; సెయింట్ ఆంటోనీ పానశాలలో కాదు; కట్టెలు కొట్టేవాడి అడితీలో. ఆ సమావేశంలో ప్రతీకారిణీ, జాక్వీస్ నెం. 3 కూడా పాల్గొంటున్నారు. కట్టెలు కొట్టే వాణ్ణిమటుకు కాస్తదూరంగా అట్టే పెట్టి, తమలో తాము, ముందు కొంత రహస్య ప్రసంగం జరుపుతున్నారు.

'మన డిఫార్జ్ బాబు దేశభక్తుడు కాదంటే మటుకు నేని ఒప్పుకునేది లేదు' అన్నాడు జాక్విస్.

'అంతకంటే వీరాధివీరుడైన దేశభక్తుడు మరొక డెవడూలేడని కూడా నేను ఢంకామీద దెబ్బకొట్టి చెబుతాను' అన్నది, ప్రతీకారిణి.

'ఇష్!-ఇలా వినండి' అన్నది మేడమ్ డిఫార్జ్: 'మా ఆయన దేశభక్తుడు కాదనీ, వీరుడు కాదని నేనటం లేదు. కాని ఆయనలో ఒక బలహీనత వుంది; ఈ డాక్టరంటే మాత్రం ఆయన మెత్తబడిపోతాడు.'

'చాలా విచారకరమైన సంగతి' అన్నాడు జాక్విస్; 'అలాంటి దేశభక్తుడికి వుండాల్సిన లక్షణం గాదు - చాలా విచారకరమైన సంగతి.'

'అసలు ఈ డాక్టర్ అంటే నేను యెక్కువగా పట్టించుకోను-ఆయన బ్రతికినా చచ్చినా నాకొకటే-కాని ఆ ఎవ్రీమూండ్ కుటుంబం మాత్రం నాశనమైపోకుండా వుంటానికి వీల్లేదు. అతనూ, అతని భార్యా, బిడ్డా-ముగ్గుర్నీ హతమార్చెయ్యాల్సిందే.'

'అవును ఆ నీలికళ్లూ, ఆ బంగారుజుట్టూ ఎంతో అందంగా వుంటుంది-ఆ తల **గెలటైన్** లో తెగి అవతల పడుతుంటే ఎంతో వినోదంగా వుంటుంది' అన్నాడు జాక్విస్.

మేడమ్ డిఫార్జ్ ఒక్క క్షణం కళ్ళు మూసుకుని కొంచెం ఆలోచనలో పడ్డది.

జాక్విస్ మళ్ళీ అందుకున్నాడు: 'ఆ చిన్న పిల్లకూడా!- భేష్! బాగుంటుంది- దానిక్కూడా నీలికళ్ళూ బంగారు జుట్టూ వున్నయ్-నిజానికి మనకు చిన్నపిల్లలు దొరకటంలేదు- పసితల కసాల్న తెగిపడటం, బలే తమాషాగా వుంటుంది.'

ఆ క్షణిక మౌనంనుంచి బయటపడి, మేడమ్ డిఫార్జ్ 'ఇంతకీ నేను చెబుతున్న దేవిటంటే, యీ విషయంలో మా ఆయన్ని నమ్మటానికి వీల్లేదు. అందుకే మనం అనుకుంటున్న కార్యక్రమ వివరాలన్నీ ఆయనతో చెప్పకుండా వుంచాను. ఇంకా ఆలస్యమైతే-ఈయన వాళ్లకి నెమ్మదిగా యీ సంగతి చెప్పి పరారీ చేయించుతాడేమోనని కూడా నా అనుమానం.'

'అదిమటుకు జరగటానికి వీల్లేదు-ఒక్కరుకూడా తప్పించుకు పారిపోవటం కుదరదు' అన్నాడు జాక్విస్: 'మనకు రోజుకు, కనీసం ఒక శతమానం బుర్రలన్నా వుండాలి.'

'భాయీ! ఇలారా!'-మేడమ్ డిఫార్జ్ దూరంగా కూర్చునున్న కట్టెలుకొట్టే ఆసామిని దగ్గరికి బిల్చింది. ఇదిగో! ఇలాచూడు-నేను ఇలా కన్నుకొట్టగానే నువ్వు బోనెక్కి సాక్ష్యం చెప్పెయ్యాలి:

'ఓ!-ఎందుకు చెప్పనండి!' అని రిహార్సల్ ప్రారంభించడానికి కట్టెల ఆసామి: 'ప్రతీరోజూ, ఎండగానీ, వానగాని, వొంగిడిగాని, నిత్యం సరిగా రెండు కొట్టేసరికలా బిడ్డనెత్తుకొని జైలుగోడ మూలవచ్చి నిలబడేది. పైనున్న కిటికీవంక చూసి యేవో సౌరజ్ఞలు చేస్తూవుండేది. అలా నాలుగుగంటల దాకా అక్కడే వుండి వెళ్ళిపోయేది. ఇదంతా ప్రత్యక్షంగా నా కళ్ళతో చూసిన సంగతి'-

'నిజంగా యేదో కుట్ర జరిగేవుంటుంది' అన్నాడు జాక్విస్.

'అవును అదే చెప్పేది-ఇదంతా మీ జూరీ పెద్దమనుషుల మీద ఆధారపడి వుంది'

'ఓస్!- జూరీ విషయంలో మాత్రం యెలాంటి సందేహమూ అక్కర్లేదు. ఆ సంగతి నేను చూసుకుంటానుగా'

'సరే అనంతరం, రెండో సాక్ష్యం నేను' అన్నది మాడమ్ డిఫార్జ్-'నేను చూసిన్నాడు, డాక్టర్ మానెట్ కూడా చేస్తున్నారు.'

'భేష్!-మజా అయిన సాక్ష్యం!- ఇంతకంటే యేం కావాలి!-హిప్! హిప్! హుర్రే!'-

'అబ్బాయ్! ఈ మూడు గంటలకు నీకు పనుంది గాదూ- **గెలటైన్** వినోదం చూట్టానికి వెడతావనుకుంటాను-సరే వెళ్ళిరా-మూడింటికి నేనూ అక్కడికి వస్తాలే-రాత్రి ఎనిమిదింటికి మా యింటికి వచ్చి కలుసుకో; మిగతా సంగతులన్నీ చెబుతాను' అని కట్టెలకూలీకి హుకుంచేసి, మాడెమ్ డిఫార్జ్ మిగతా అనుచరుల నిద్దర్నీ వెంటబెట్టుకుని బయలుదేరింది. గేటుదాకా వెళ్లిం తరవాత చివాల్న వెనక్కు తిరిగి: 'ఇదిగో చూశారూ!- నేను యిప్పుడు డాక్టర్ యింటికి వెడుతున్నాను. అది ఇప్పుడు ఇంటికాడే వుంటుంది; మొగుణ్ణి చంపబోయే వేళైందని ఏడుస్తూ వుంటుంది. రిపబ్లిక్ శత్రువులపట్ల సానుభూతి చూపుతూ ఏడుస్తూ వుంటుంది!-నేనిప్పుడు సరాసరి దానిదగ్గిరికి వెడుతున్నాను.'

'ఆహాహా!-ఏమి మహిళారత్నమండీ!' అని అభినందించాడు జాక్విస్; 'తెలివితేటలంటే అదిగో అలా 'వుండాలి?' అని ప్రతీకారిణి ఆప్యాయంగా మాడెమ్ డిఫార్జ్‌ని కావిలించుకుంది.

ఈ మాటలు చెప్పేసి మాడమ్ డిఫార్జ్, కూసం విడిచినత్రాచులా రివ్వున బయలుదేరి జైలుగోడ మలుపుదిరిగి వెళిపోయింది.

మాడమ్ డిఫార్జ్‌లో కనికరమనేది అణుమాత్రం కూడా లేదు: తనకూ, తన కుటుంబానికి, తన వర్గానికి ఘోరమైన అన్యాయం జరిగిందనే అభిప్రాయం, పసితనంనుంచీ, ఆ స్త్రీ రక్తంతోపాటు పెంపొంది నాళనాళాల్లో సంక్షోభంగా ప్రవహించుతూ, ఆ స్త్రీని ఒక ఆడపులినిగా మార్చివేసింది. కనికరమనే దానికి ఆ ఆడపులి గుండెకాయలో యెక్కడా చోటు లేదు.

ఎవరో వాళ్ళ పెద్దవాళ్ళుచేసిన ఘోరకృత్యాలకు ఈ అమాయకుల్ని నాశనం చెయ్యటం దేనికీ - అనే అభిప్రాయం ఆ స్త్రీ తలకెక్కదు. పైవాళ్ళనుంచి విడదీసి ప్రత్యేకంగా చూడలేదు-అదంతా-ఒకేజాతి-ఒకేవర్గం హతమార్చి వెయ్యవలసిన విషవృక్షం. బొడ్లో ఒకవైపున పిస్టలూ, రెండోవైపున బాకూ అమర్చుకొని, ఆ పులిగుండెల ఆడది వీధినబడి చక చకా నడిపోతోంది.

50

ఇప్పుడు డాక్టర్ మానెట్ మకాములో మిగిలివుందల్లా క్రంచరూ, మిస్ ప్రాస్-వీళ్లిద్దరే. ఈ యిద్దరూకూడా బయలుదేరి పోవటానికి హడావిడిగా సామానూ గత్రా సర్దేసుకుంటున్నారు. తమతోపాటే మిస్ ప్రాస్‌నుకూడా తీసుకుపోవటానికి లారీ ప్రయత్నించాడు; కాని గుర్రపుబగ్గీలో చోటుచాలక సాధ్యంకాకపోయింది. అంతేకాక లారీ మరోటికూడా ఆలోచించాడు. ఎక్కువమంది బండిలోవుంటే పహరా పహరా దగ్గిరా వీళ్లందర్నీ పరిశీలించటం ఆలస్యమౌతుంది గనుక వీలైనంత తక్కువమంది వుండటం శ్రేయస్కరమనుకున్నాడు. అందుచేత ఆవిణ్ణు క్రంచర్‌కు వప్పజెప్పి వేరే బండి కుదిర్చి తీసుకువచ్చెయ్యమని యేర్పాటు చేసిపోయాడు. మిగతా చిన్నంచితకా సామాను సర్దేసుకుని తాముకూడా వేరే బండి కుదుర్చుకుని బయలుదేరి పోవటానికి క్రంచరూ, మిస్ ప్రాస్ సన్నాహాలు చేసుకుంటున్నారు-ఉన్నట్టుండి మిస్ ప్రాస్‌కు ఒక విచిత్రమైన అభిప్రాయం తట్టింది: 'ఒరే అబ్బీ!-యీ కంగారులో నా బుర్ర సరీగా పనిచెయ్యటం లేదుగాని, నువ్వు ఆలోచించు-ఈవేళే, యీ ఆవరణలోనుంచి ఒక బండి బయలుదేరి వెళ్ళింది గనుక, మరో బండి యిప్పుడే యిక్కడినుంచి బయలుదేరటం మంచిది గాదనుకుంటాను- ఏమంటావ్?'-

'అంటాని కేవుండదండీ!-మీరు యేదన్నా నేను కాదనేది లేదనుకోండి-మెదడు పనిజెయ్యటం మాట కొస్తే నాది అసలే పనిజెయ్యదు-వట్టి మట్టిమెదడోడి నని మా వోళ్ళంతా అంటారు- ఆ ఆలోచించేదేందో మీరే ఆలోచించి జెప్పండి-

'బండీ మాట్టాడి నాకోసం అక్కడెక్కడేనా రోడ్డుమీద వుంచితే బాగుండదూ? నేను వచ్చిఎక్కుతానూ?'-

'ఓ బాగుండకేం-మరీ బేసుగ్గా వుంటది.'

'ఎక్కుడుంచుతావ్?'-

ఎక్కుడుంచితే బాగుంటుందో తెలీక క్రంచర్ బుర్రగోక్కుంటున్నాడు.

'ఇదిగో ఇటు చూడు! పెద్దదాన్ని గనక చర్చిగేటు ముందు బండి యెక్కటం బాగుంటుంది. అక్కడ నిల్పోబెట్టు.'

'బాగానే వుంటది గాని మిమ్మల్ని ఒంటరిగా విడిచిపెట్టి యెల్లట మెట్టాగా అనే ఆలోచిస్తా వుండాను.'

'మరేం ఫరవాలేదు లేరా తండ్రీ!-నాకు మరేం ఫరవాలేదు. ముసలిదాన్ని, నా ప్రాణం సంగతి ఆలోచించబోకు; ఆ పసికూనల సంగతి ఆలోచించు. మూడు గంటలకి బండి చర్చి గేటు ముందు వుండేట్టు చూడు; నేను వచ్చేస్తాను.'

ఈ మాటలు యెంతో ఆందోళనగా బ్రతిమిలాడుతూ చెప్పేసరికి, క్రంచర్ ఇక మాట్టాడలేక పోయాడు. ఆ ప్రకారం ఏర్పాట్లు చెయ్యటానికి బయలుదేరి వెళ్లాడు. అతన్ని బయటికి పంపించి మిస్ ప్రాస్ గడియారం చూపుకుంది: ఇక మరో ఇరవై నిమిషాల టైముంది. సరే! ఇక ఎంతో టైము లేదు, అన్ని పనులూ చక్క బెట్టేసుకోవాలి. అన్నిటికంటే కష్టమైన పని, తన ఆందోళనను బయటివాళ్లు గుర్తించకుండా, తన్ను తాను చక్కదిద్దుకోవటం. ఒక దబరాతో యిన్ని చన్నీళ్ళు తెచ్చుకుని, ముక్కూ, మొహం కళ్ళూ కడుక్కుంటోంది. ఇంతలోనే ఏదో అలికిడై తల పైకెత్తి చూసి నిర్ఘాంత పడిపోయింది.

చేతిలోవున్న నీళ్లదబరా నేలబడి భొళ్లుమంది; మాడమ్ డిఫార్జ్ పాదాలదాకా నీళ్లు జలజలా ప్రవహించినై.

మేడమ్ డిఫార్జ్ మిస్ ప్రాస్‌వంక ఒక యినపచూపు చూసి 'ఎవ్రీమూండ్ భార్య ఎక్కడ?'-అని గద్దింపుగా అడిగింది.

ఆ సమయానికి ఎక్కడి తలుపులక్కడ బార్లగా తెరిచి వున్నయ్. పరారి అయినట్టు తెలుస్తుందేమోననే అభిప్రాయంతో, గబగబా పోయి ప్రాస్ తలుపులు నాలుగూ మూసేసి వచ్చి, లూసీ వుంటూవుండే గుమ్మానికి అడ్డంగా నిల్చుంది. మాడమ్ డిఫార్జ్ మిస్ ప్రాస్‌వంక అదో పులిచూపు చూచింది. వయసు మళ్లితే మాత్రం ప్రాస్ మటుకు తక్కువతిన్న ఘటమా! అదే మొరాయింపుగా మాడమ్ డిఫార్జ్ వంక చూసింది.

మిస్ ప్రాస్ ప్రతిఘటించటానికి సన్నద్ధురాలు కావటం మాడమ్ డిఫార్జ్ వెంటనే అర్థం చేసుకుంది.

'నేను అలా **గెలటైన్** దగ్గిరికి పోతూపోతూ ఆవిణ్ణు పరామర్శించి పోదామని ఇట్టా వచ్చాను. ఆవిణ్ణు చూడాలి!' అంది.

'నీ బుద్ధి నాకు తెలుసు-వీల్లేదు'-

ఇద్దరూ ఎవరిభాషలో వాళ్లు మాట్టాడారు. ఒకరిమాట ఒకరికి అర్థం కాలేదు: మాటలు అర్థం కాకపోయినా ఒకరిభావం ఒకరికి అర్థమౌతూనే వుంది. ఇద్దరూ ద్వంద్వయుద్ధానికి తయారవుతూనే వున్నారు.

'నాకు కనిపించకుండా దాచినంత మాత్రంచేత ఆవిడకు కలిగేదేమీ లేదు. దీని అర్థమేమిటో అందరికీ తెలుస్తూనే వుంది. ముందు లోపలికి పోయి, నేను చూడవచ్చానని ఆవిడతో చెప్పు-వినిపిస్తోందా? ఏయ్! నిన్నే'-

'ఏడిశావ్‌లే- నీ సంగతీ చూస్తాను'-

ఆ మాట లేవిఁటో మాడమ్ డిఫార్జ్‌కి అర్థం కాలేదు; అర్థం చేసుకోవటానికి ప్రయత్నించనూ లేదు:

'ఏయ్! పందీ!- చెప్పేది నీక్కాదూ!-ఏవిటా వెధవగొణుగుడూ?- లోపలికిపోయి చెబుతావా? మెడబట్టి గెంటి, నన్నే లోపలికి పొమ్మన్నావా?' అంటూ ధీమాగా ముందుకు అడుగేసింది. అది చూసి మిస్ ప్రాస్ కూడా ముందుకు అడుగేసి మొహాన్ని మోదెయ్యటానికి సిద్ధమయింది.

మాడమ్ డిఫార్జ్‌కి నవ్వొచ్చింది. 'ఆసి వెఱ్ఱిముండా!-పిచ్చిముండవా యేవిఁటి!-నీతో ఏవిఁట్లే' డాక్టర్‌నే పిలుస్తాను: 'ఏవండోయ్ డాక్టర్‌గారూ!-ఏవమ్మోలూసీ!'- అని కేకలు బెట్టింది.

సమాధానం రాలేదు. మాడమ్ డిఫార్జ్‌కి అనుమానమేసింది. గబగబా పోయి మిగతా మూడు తలుపులూ తెరిచి చూచింది. గదులన్నీ ఖాళీగా పాడుబెట్టి లేచిపోయినట్టున్నయ్. 'సరే! వీటిల్లో యెవ్వరూ లేరు. ఇప్పుడో యిందాకో మూటా ముల్లే గట్టుకు లేచి పోయినట్టున్నారు. ఏదీ ఆ గది కూడా చూణ్ణీ'-

'ఏడిశావులే'-

'ఆగదిలో కూడా లేకపోతే పారిపోయినట్టే-వెంటనే వెంబడించితే తిరిగి పట్టుకురావొచ్చు' అనుకుంది డిఫార్జ్.

'చట్! తొలుగు!- అంటూ మాడమ్ డిఫార్జ్ రౌద్రంగా ముందుకు ఉరికింది. మిస్ ప్రాస్ గభాల్న ఆ ఆడపులిని నడుం కావిటేసుకుని భల్లూకంలా పట్టుకుంది. ఇద్దరూ పెనగులాడుతున్నారు. మాడమ్‌డిఫార్జ్ పిడికిళ్లు బిగించి మిస్ ప్రాస్‌ను దబా దబా మొహంమీద బాదుతోంది. మిస్ ప్రాస్ ముఖం వంచి తల, మాడమ్ డిఫార్జ్ పొత్తికడుపులోకి దోపి కుమ్మేస్తోంది.

మాడమ్ డిఫార్జ్ అలా అలా, బొడ్డుదగ్గిరికి చెయ్యి పొనిచ్చి యేదో బయటికి తియ్యటానికి ప్రయత్నించుతోంది. అది గమనించి మిస్ ప్రాస్ దానిమిద గభీమని ఒక గుద్దు గుద్దింది. మాడమ్ డిఫార్జ్ పులిగుండె ఫెటేల్‌మని పేలిపోయినట్టు మేడ మేడా ప్రతిధ్వనించిపోయింది; గది యావత్తూ పొగకమ్మేసింది. మిస్ ప్రాస్ చేతుల్లోనుంచి మాడమ్ డిఫార్జ్ కళేబరం జారి క్రింద బడిపోయింది.

మిస్ ప్రాస్‌కు కంగారెత్తిపోయింది. ఎవరినేనా కేకేద్దామని గదిలోనుంచి బయటికి పరుగెత్తింది; తీరా మెట్లమీదికొచ్చేసరికి ఒక ఆలోచన తట్టి నిలబడిపోయింది. ఒక్క క్షణం ఆలోచించి: 'అవును బాగా జరిగింది' అని తల పంకించుకుంది. నిమ్మకు నీరెత్తినట్టు అతి ప్రశాంతంగా మళ్ళీ తిరిగి గదిలోకొచ్చి తన టోపీ, తాళం, తాళంచెవి తీసుకు బయటికి వచ్చేసింది. గది తలుపులు దగ్గిరికి లాగి గొణ్ణెం పెట్టేసింది. తాళంవేసి తాళంచెవి చేత్తో బుచ్చుకుని మెట్లు దిగి వీధిలోకి వచ్చేసింది.

ఏమి అలజడి లేకుండా, అతి ప్రశాంతంగా చర్చివేపు బయలుదేరిపోతోంది. త్రోవలో వంతెన దాటుతూ, ఆ తాళం చెవి వంతెనమీదనుంచి కాలవలోకి గిరాటు వేసేసింది.

ఆవిడ చర్చిదగ్గిరికి వచ్చేసరికి క్రంచర్ ఇంకా రాలేదు. చర్చి మెట్లమీద జరిగిన సంఘటనంతా ఆలోచిస్తూ బిక్కుబిక్కు మంటూ నిల్చుంది.

ఒకటి రెండు నిమిషాల్లో క్రంచర్ బండి తీసుకొచ్చి ఆవిణ్ణి యెక్కించాడు; బండి బయలుదేరిపోతోంది.

'క్రంచర్! వీధిలో గల్లంతుగా వుందా!'

ఆ ప్రశ్నేవిఁటో క్రంచర్‌కు అర్థంకాలేదు- 'గల్లంతులకేం వుండదీ-మామూలు గల్లంతులే' అన్నాడు.

'నువ్వు చెబుతున్న దేవిటో నా కేమీ వినిపించటం లేదు-వీధిలో ఏవన్నా వినిపిస్తోందా.'

క్రంచర్ తెల్లపోయి చూశాడు- 'వినిపించకపోవటమేవిఁటి?-చెముడొచ్చిందా?-ఈ కాసేపట్లోనే యింత చెవుడేవిటి?-ఏవి జరిగిందబ్బా!'

'ఏదో పెద్దమంట మండింది-పెద్దమోత మోగింది-దాంతో సరి-ఇక నాకేమి వినిపించటంలేదు' అన్నది.

'**గెలొటైన్** దగ్గిరికి పోతున్న ఆ బళ్ళు చూశారా?- బళ్లల్లో జనం ఘోష వినిపిస్తోందా?

'చెప్పటంలేదూ ఓ పెద్దమోత-అంతే ఒకే శాశ్వత నిశ్శబ్దం-నిరామయం-ఇకేమీ వినిపించటంలేదు.'

'నిజంగా ఈ ఘోషే వినిపించటంలేదంటే- ఈ భూ ప్రపంచంలో ఇక ఎప్పుడూ ఏవీ యినిపించదన్నమాటే-ఆరి బల్లే!-' అనుకున్నాడు క్రంచర్.

మృత్యుశకటాలు కిరకిరారావంతో పారిస్ నడివీధులుగుండా సాగిపోతున్నయ్. ఆనాడు ఆరు శకటాలు, గెలటైన్‌పిశాచి రక్తదాహం తీర్చటానికి నరబలులను మోసుకుపోతున్నయ్. మానవునకు ఊహాజ్ఞానం కలిగిన నాటినుంచి అనేక పిశాచరూపాల్ని ఊహించాడు. ఆ మహా పిశాచాల రూపాలనన్నిటినీ సంకలనంచేసి **గెలటైన్** అనే యీ బీభత్సపిశాచాన్ని సృష్టించాడు. ఫ్రాన్సుయెంతో సారవంతమైన గడ్డ; అయినా, అక్కడ ఒక గడ్డిపోచగాని, ఒక చిన్ని మొక్కగాని పొటమరించి పెంపొందటానికి తగిన వాతావరణ మేమీ కనుపించలేదు గాని, ఈ **గెలటైన్** మహమ్మారి పుట్టుకురావటానికి తగిన వాతావరణం పుష్కలంగా లభించింది. అప్పుడేగాదు ఎప్పుడైనాసరే, మానవజాతిని ఆ రకం సమ్మెటలు బెట్టి సాగగొడితే, తప్పనిసరిగా అలాంటి వికృతరూపాలు దాల్చితీరుతుంది. హింసాబీజాలు నాటుకుంటే అహింసాఫలాలు కాస్తాయా?

పోనీ, కాలం ఇంద్రజాలంచేసి ఈ మృత్యుశకటాలను మళ్లీ వింతగామార్చి వేసిందనుకోండి-మారినా ఏవిఁగా మారుతై-నిరంకుశులైన చక్రవర్తుల ఉక్కు రథాలుగా మారుతై; భూస్వామిక వర్గాల విలాసకూటాలుగా మారుతై; కులటల క్రీడామందిరాలుగా మారుతై; పవిత్రులైన మతాధికారులకు మారుగా దొంగలకు తాగుమోతులకు ఆకరములైన దేవతారాధనా మందిరాలుగా మారుతై, అన్నానికి ఆపన్నులై అటమటించే లక్షోపలక్షల పేదరైతుల పూరిగుడిసెలుగా మారుతై.

ఆ మృత్యుశకటాలు అలా రోజూ వెడుతూనే వున్నయ్; రోజూ చూస్తున్న దృశ్యమేగనుక యెవ్వరూ వాటిని లక్షించటంలే. ఏ ఒక్క తలా, ఏ కిటికీలోనుంచీ తొంగిచూడటం లేదు.

ఆ బళ్ళలో వెడుతున్న వాళ్ళలో కొంతమంది మానవ జీవితవైచిత్రిని తలపోసుకుని విభ్రాంతిపడుతున్నారు. కొంతమంది హతాశులై తలలు వంచుకు కూర్చునున్నారు. కొంతమంది కళ్లు మూసుకుని కూర్చుని వ్యాకులమైపోతున్న మనస్సును కూడదీసుకోవటానికి ప్రయత్నించుతున్నారు. అందులో ఒకడు పిచ్చెత్తిపోయి పాటలు బాడుతూ బండిమీదే లేచి నిల్చుని నాట్యం చెయ్యటానికి ప్రయత్నించుతున్నాడు.

ఈ బళ్ళకుముందుగా ఒక చిన్న ఆశ్వికదళం నడుస్తోంది. వాళ్ళను జనం ఆనాడు ఒకే ప్రశ్న అడుగుతున్నారు. ఆ ప్రశ్నకు ఆ సిపాయిలు మూడవబండి చివర్లో కూర్చునున్న ఒక మనిషివంక చూపిస్తున్నారు. ఆ వ్యక్తి నాశనమైపోవాలని, అతని పేరెట్టి పెడబొబ్బలు బెడుతున్నారు. అతను ఈ వెర్రికేకల్ను పట్టించుకుంటున్నట్టు లేదు; అథవా ఎప్పుడన్నా వినిపించుకున్నా, ఒక చిన్ని చిరునవ్వు నవ్వటం మినహా, అతనిలో పెద్ద మార్పేమీ కనుపించటంలేదు. బండిలో అతనిప్రక్కనే, అతని చెయ్యి గట్టిగా పట్టుకుని ఒక అమ్మాయి కూర్చునుంది; ఆ అమ్మాయితో యేదో మాట్టాడుతూ ప్రశాంతంగా కూర్చునున్నాడు.

ఆ మృత్యుశకటాలకోసం యెదురుచూస్తూ, ఆ గూఢచారి జైలుగొర్రె చర్చిమెట్ల మీద నిల్చునున్నాడు; తొంగిచూచాడు. 'అమ్మయ్యో! దీన్లో లేదు.' రెండో బండిలోకి తొంగిచూచాడు 'చచ్చాం! దీన్లోలేదు- నా ప్రాణాలమీదికి తెచ్చాడల్లేవుంది.' మూడోబండిలోకి తొంగిచూచిన తరవాత అతని ప్రాణాలు ఒడ్డున బడ్డయ్; 'అమ్మయ్యా! బ్రతికాం' అనుకున్నాడు. "ఎవ్రీమూండ్ ఇందులో ఎవరు!" అని అతని ప్రక్కనున్న మనిషి ప్రశ్నించాడు. 'అడుగో ఆ బండి చివర కూర్చున్న మనిషి' అని గూఢచారి సమాధానం చెప్పాడు.

'అ అమ్మాయి చెయ్యిబట్టుకునున్న మనిషేనా?"

'మరే'-

'ఎవ్రీమూండ్ నశించాలి!-బూర్జువాలు నశించాలి! ఎవ్రీమూండ్ నశించాలి!' అని ఆ వ్యక్తి గావు గావుకేకలు బెట్టాడు.

'హుష్!- ఊరుకో! ఎందుకొచ్చినగొడవ?' గూఢచారి ఆ వ్యక్తిని నెమ్మదిగా బ్రతిమిలాడాడు.

'ఏంభాయీ-ఏవిఁటీ?'

'ఏవీఁలేదు-అయిదారు నిమిషాల్లో ఎలానూ చావబోతున్నాడుగా- కాస్త ప్రశాంతంగా చావనీ'

కానీ యీ సమాధానం ఆ వ్యక్తికి నచ్చలేదు: 'ఎవ్రీమూండ్ నశించాలి!'- అంటూ కేకమీద కేక పెడబొబ్బలెట్టేస్తున్నాడు. ఈ కేకలు చెవులబడి, మూడవబండి చివర కూర్చునున్న ఆ వ్యక్తి తల పైకెత్తి అతనివంక చూచాడు. అతని ప్రక్కనే గూఢచారి కనుపించాడు. ఎవ్రీమూండ్ అతనివంక చూస్తున్నట్టు గమనించగానే, గూఢచారి, నెమ్మదిగ ముఖం చాటేసి జనంలోకి తప్పుకున్నాడు.

సరీగా మూడుగంటలు కొట్టేసరికి మృత్యుశకటాలు **గెలటైన్**దగ్గిరికి వచ్చి ఆగినై. దానిముందు వేసివున్న కుర్చీలమీద ఉద్యానవనంలో కూర్చున్నట్టు కులాసాగా కూర్చుని, ఆడవాళ్లు లతలు కుట్టుకుంటున్నారు. ముందువరుసలో వున్న ఒక కుర్చీ మీద యెక్కి నిల్చుని ప్రతీకారిణి, మాడమ్ డిఫార్జ్ రాకకోసం వెయ్యికళ్లతో వెదుకుతోంది.

'ఏయ్! మాడమ్ డిఫార్జ్ ఎక్కడేనా కనుపించిందా?"- ఎవరికన్నా కనుపించిందా?' అని పెద్ద పెట్టున కేక లేస్తోంది.

'రోజూ తప్పకుండా వచ్చేదే?' అన్నది, ప్రక్కనున్న కుర్చీలో కూర్చుని లతలు కుడుతున్న మరో స్త్రీ.

'రోజూ మాటేవిఁటి, ఈ వేళా వచ్చి తీరుతుంది-తప్పకుండా వచ్చి తీరుతుంది'-

'సరే!-మరికొంచెం బిగ్గరగా కేకబెట్టు ఎక్కడేనా జనంలో నిల్చునుందేమో?' అని మరో స్త్రీ సలహాయిచ్చింది.

ఎంత కేకలు బెట్టినా యేవీఁ లాభంలేకపోయింది-వాలంటీర్ యువతులను వీధి వీధికీ ఉరుకులు బెట్టించింది. ఎక్కడా పత్తాలేదు.

'ఛీ ఛీ!-ఎంత దురదృష్టం-అప్పుడే బళ్లు రానే వచ్చాయ్-ఎవ్రీమూండ్‌ను మరోక్షణంలో తలగొట్టేస్తారు. మాడమ్ చూడకుండానే-ఏవిఁటి చెయ్యాలి?

ఆ హతభాగ్యుల్ని బళ్ళల్లోనుంచి క్రిందికి దింపుతున్నారు. **గెలటైన్** నిర్వాహకులు యెర్ర చొక్కాలు తొడుక్కుని సిద్ధమయ్యారు.

కసాల్న ఒకతల తెగి క్రిందబడ్డది; లతలు కుట్టుకుంటూ కూర్చున్న భాగ్యశాలినులు తలలు పైకెత్తకుండానే 'ఒకటీ' అని లెక్కవేశారు. రెండోతల తెగిపడ్డది, మూడోబండిలో నుంచి సిడ్నీ కార్టన్, అతని చెయ్యిపట్టుకుని ఉన్న అమ్మాయీ బండిదిగారు.

బీభత్సంగా పైకిలేచి క్రిందికిపడుతూ మానవశీర్షాలను నరికి కుప్పలుబోస్తున్న **గెలటైన్** యంత్రం ఆ అబలకు కనిపించకుండా, ఎవ్రీమూండ్ ఆమెను తనవైపు తిప్పి నిల్చోబెట్టు కున్నాడు. ఆ స్త్రీ దీనవదనంతో అతని ముఖంలోకి చూస్తూ అంత్యఘడియల్లో తనకు ఆసరా అయినందుకు అతనికి వందనాలర్పించుకుంటోంది.

'నీవు నాకు యింత ఆసరా యివ్వకపోతే నేను యింత ధైర్యంగా వుండగలిగేదాన్ని గాదు. నేనసలే కంగారు మనిషిని. ఈ అంత్యఘడియల్లో భగవంతుడు నిన్ను నాకు సహాయం పంపించాడు నిజంగా'-

'అలా కాదు చెల్లీ! నిన్నే నాకోసం పంపించాడు. చిట్టితల్లీ! ఇలా నా ముఖంలోకి చూస్తూ అన్నీ మరిచిపో

'నువ్వు నా చెయ్యిపట్టుకు నిల్చున్నంతసేపూ, నేను మరో విషయమేదీ ఆలోచించను- వాళ్లు నన్ను త్వరగా అంతం చేస్తే అంతేచాలు'-

'క్షణంలో తేల్చేస్తారు-ఆ భయం అక్కర్లేదు'

చుట్టూ జనంలో వుండి కూడా వాళ్లిద్దరూ ఒంటరిగా వున్నట్టు బిగ్గిరగానే మాట్టాడుకుంటున్నారు. వైవిధ్య వాతావరణాలలో పెరిగి చివరికి అంత్యఘడియులు వచ్చేసరికి యిరువురూ సన్నిహితులై చెట్టాపట్టాలు పట్టుకు మాతృహృదయంలో లయించబోతున్న విశ్వమాత కూర్మిసంతానం.

'నువ్వు మహా పురుషుడివి-పరమాత్ముడివి-కడసారి ఒక్కమాట అడగాలని వుంది-ఏమీ తెలియని అజ్ఞానురాలిని లోపల సందేహంగా వుండి అడుగుతున్నాను.'

'అడుగు తల్లీ!- సందేహ మెందుకు?'-

'నాకు ఒక పినతండ్రి కూతురుంది: నాకుమల్లేనే అదీ తల్లీ తండ్రీ లేని బిడ్డ; నాకంటే ఒక అయిదేళ్లు చిన్న. దక్షిణ ప్రాంతపు ఒక పల్లెటూళ్లో ఒక పేద రైతుయింట్లో వుంటంది. దారిద్ర్యం మాకిద్దరికీ యెడబందాలు చేసింది. నాకు యిలాంటి గతి పట్టిందని పాపం దానికి తెలీదు- నాకు ఉత్తరం వ్రాయటం చేతగాదుగా-చేతనైనా ఈ సంగతి దానికి యేమని వ్రాయను- దానికి తెలియకుండా వుంటమే మంచిదంటారా?'

'అవును- తెలియకపోటమే మంచిది.'

'నేను అనుకుంటున్న దేవిటంటే- ఈ రిపబ్లిక్ ప్రభుత్వానికి యీ రక్తదాహం కొంచెం ఉపశమించి, ఈ బీదజనానికి యేదైనా కొంచెం మేలు చెయ్యగలిగితే, అది కూడా సుఖంగా వర్ధిల్లి చిరకాలం బ్రతుకుతుందనుకుంటాను-బాగా ముసలిదై పోయేదాకా.'

'అయితే యేవిఁటి తల్లీ?'-

'నేను దాన్ని చూడాలంటే దేవలోకంలో ఎంతో కాలం బెంగబెట్టుకుని ఎదురుచూస్తూ కూర్చోవాలనుకుంటాను.'

'అక్కర్లేదు పిచ్చితల్లీ- అక్కడ-కాలవ్యవధులూ కష్టాలూ యివన్నీ వుండవు'-

'అబ్బా ఎంత చల్లనిమాట చెప్పావు-అజ్ఞానురాలిని తెలియక యేదుస్తున్నాను-నిన్ను ఒక్కసారి ముద్దు బెట్టుకోనా-నా వంతు వచ్చేసిందా?'-

'ఆఁ!'-

'ఆ దీనురాలు అతని పెదవులు ముద్దుబెట్టుకుంది; అతను ఆ చిన్నదాని పెదవులు స్పృశించాడు. ఇద్దరూ పరస్పరం దీవించుకున్నారు. చిరునవ్వునవ్వుతూ అతని చెయ్యివదిలేసింది- గెలటైన్‌లో తల తెగిపోయింది-లతలు కుట్టుకుంటున్న అమ్మలక్కలు- 'యిరవైరెండు' అని లెక్కవేశారు.

'నేను ఉత్థానకారకుణ్ణి-నన్నునమ్మిన జీవి నశించదు' అన్న భగవద్వాక్యాన్ని స్మరించుకుంటూ కార్టన్ ముందుకు నడిచాడు.

'ఇరవైమూడు'

(సమాప్తం)

తెన్నేటి సూరి రచనలు - వివరాలు ఇలా ఉన్నాయి

చంఘిజ్‌ఖాన్ - నవల*

రెండు మహానగరాలు - అనువాద నవల*

విప్లవ రేఖలు 5 కథలు - 1946 *

వీణ, సుడిగాలి, అసలువేనరాజు, భూకంపం, మనుష్యులు

సుబ్బలక్ష్మి కథలు - 1948

బూరెముక్కలు, తెలుగు వాళ్ళమే, తుదిఘడియలు, నీలిగంటలు

నాటకాలు

ద్రవిడ సామ్రాట్, నవ్యప్రభాతం, నారాణి

ఖండకావ్యాలు

అరుణ రేఖలు 1946 , మహోదయం

సాహిత్య సమవాకారం*

వ్యాసం చంఘిజ్‌ఖాన్ నవలకు పరిచయం వాక్యాలు*

టాకీ టెక్నిక్ - సాంకేతిక గ్రంథం

కథలు :

సంధిలేదు : అభ్యుదయ 4-1948
దెయ్యాల వేదఘోష : ఆంధ్రపత్రిక, వారపత్రిక 19-11-1947
రాజామణి : ఆంధ్రపత్రిక, వారపత్రిక 28-1-1948
భారతి : ఒక దశాబ్ది తెలుగు కథ

- సూరి గారి రచనలు * ఈ గుర్తు ఉన్నవి లభించాయి. ఇంకా చాలా ఉండి ఉండవచ్చు. సాహితీమిత్రులు వీటి వివరాలను కానీ - రచనలను కానీ, విశాలాంధ్ర ప్రచురణాలయం, హైదరాబాద్. చిరునామాకు పంపమని ప్రార్థన.

సూరి రచనలనన్నిటినీ ప్రచురించి **"సూరి శతజయంతి"** కానుకగా పాఠకుల కందించే మా ప్రయత్నంలో పాలుపంచుకోమని విజ్ఞప్తి.

మేనేజర్
విశాలాంధ్ర ప్రచురణాలయం
నవంబర్ , 2011 ఆబిడ్స్, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001.

చదవండి! చదివించండి!!

మా ప్రచురణలో వెలువడిన కొన్ని అనువాద నవలలు

నేరము - శిక్ష :
మూలం : డొస్తోయ్‌వ్‌స్కీ, తెలుగు : శివం

సుక్షేత్రం :
మూలం : పెరల్‌బక్, తెలుగు : పి.వి. రామారావు

చిరస్మరణ :
మూలం : నిరంజన, తెలుగు : తిరుమల రామచంద్ర

తమస్ :
మూలం : డా॥ భీష్మ సహానీ, తెలుగు : యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

అన్నా కరేనినా :
మూలం : లియో టాల్‌స్టాయ్, తెలుగు : తాపీ ధర్మారావు

లజ్జ :
మూలం : తస్లీమా నస్రిన్, తెలుగు : వల్లంపాటి వెంకటసుబ్బయ్య

అమ్మ :
మూలం : మాక్సీమ్ గోర్కీ, తెలుగు : క్రొవ్విడి లింగరాజు

ఓల్గా నుంచి గంగకు :
మూలం : రాహుల్ సాంకృత్యాయన్, తెలుగు : చాగంటి తులసి

ఋగ్వేద ఆర్యులు :
మూలం : రాహుల్ సాంకృత్యాయన్, తెలుగు :మిక్కిలినేని సుబ్బారావు

శరత్ సాహిత్యం : (1-10 సంపుటాలు)
మూలం : శరత్‌చంద్ర చటర్జీ, తెలుగు : బొందలపాటి శివరామకృష్ణ

రెండు మహా నగరాలు :
మూలం : చార్లెస్ డికెన్స్, తెలుగు : తెన్నేటి సూరి

ఒకానొక గాడిద ఆత్మకథ, నేఫాలో గాడిద, తిరిగివచ్చిన గాడిద:
మూలం : కిషన్ చందర్, తెలుగు : నీరుకొండ హనుమంతరావు

త్వరలో వెలువడనున్నమరికొన్ని అనువాద రచనలు

ప్రేమ్‌చంద్ రచనలు: తెలుగు : సుంకర, ఆలూరి, కౌముది

ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్‌లు
మరియు ప్రముఖ పుస్తక విక్రేతలు

Charles Dickens
1812-02-07 ★ 1870-06-09

'తెన్నేటి సూరి' పరిచయం



"తెన్నేటి సూరి అభ్యుదయ రచయితల సంఘంలో సభ్యుడవునో కాదో నాకైతే తెలియదు కాని, అభ్యుదయ కవితా సంకలనాలు అచ్చుకావడానికి పూర్వమే అంటే 1946 లోనే అతని గేయ కవితా సంకలనం అరుణరేఖలు అచ్చు పడింది.... సూరి అభ్యుదయ రచయితల సంఘం సభ్యుడైనా కాక పోయినా "అరుణరేఖలు" కవితా సంకలనం సంఘం దృక్పథం కవిగా గుర్తించేటట్లు చేసింది. అభ్యుదయ రచయితల సంఘం దృక్పథం ఆ కవితా సంకలనంలో కవిత్వ కళగా రూపు కట్టింది." అని "ఆంధ్రపత్రిక" (26-10-85)లో టి.యల్. కాంతారావుగారు ఒక సందేహం వెలిబుచ్చారు. ఈ సందేహ నివృత్తికి ఆయనే కొంత పరిశ్రమిస్తే బాగుండేది, మరొకరు సంజాయిషీ చెప్పకుండానే.

తెన్నేటి సూరి అభ్యుదయ కవి. అభ్యుదయ రచయితల సంఘం సభ్యుడు. అభ్యుదయ రచయితల సంఘం రెండవ, మూడవ, నాల్గవ మహాసభల్లో (1944-48) ఆయన కార్యవర్గ సభ్యుడు, రాజమండ్రి మహాసభలో స్వయంగా పాల్గొన్నాడు కూడా.

రచయితను ఆయన హోదానుబట్టి గాక ఆయన సృజనాత్మక కృషిని బట్టీ, తన రచనలలో తన సంఘం దృక్ప ాన్ని బట్టీ గౌరవిస్తాం.

TELUGU

తెన్నేటి సూరి కవి. ర్త, నవలా రచయిత తెలుగు సినిమా ప్రారంభమైన తొలి దినాల్లోనే "టాకి టెక్నిక్" లాంటి సా ు గ్రంథాన్ని రాసినవాడు. పైగా బహుకాలం పాత్రికేయుడు.

B0690272

తెన్నేటి సూరికి అభ్యుదయ దృక్పథం, నిబద్ధతేగాక, తన అభిప్రాయాలను శషబిషలు లేకుండా నిర్మొహమాటంగా వెల్లడించే సాహసి. క్షేత్రయ్య కృష్ణశాస్త్రిలపై ఆయన సాగించిన విమర్శలు స ారి నిజాయితీకి అవి గీటు రాళ్ళు.

979110036624-Y

- తుమ్మల వెంకటరామయ్య
ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, అధ్యక్షవర్గ సభ్యులు

1985, విజయవాడ.

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్, అబిడ్స్ - హైదరాబాద్ - 500 001.